# daḷita sāhitya vimarśa samakālīna dhōraṇula pariśīlana

A Thesis submitted to the University of Hyderabad in Partial Fulfillment of the requirement for the award of

Doctor of Philosophy

In

Telugu

Researcher

SIDDARDHA MADDIRALA

(Reg No: 09HTPH05)

Department of Telugu,

School of Humanities,

University of Hyderabad,

Gachibowli,Hyderabad- 500046

December - 2018

# దళిత సాహిత్య విమర్శ - సమకాలీన ధోరణుల పరిశీలన

(పిహెచ్.డి పట్టా కొరకు హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం)


పరిశోధన

**సిద్దార్ధ మద్దిరాల**

**09HTPH05**

పర్యవేక్షణ

**ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు**

**తెలుగు శాఖ, మానవీయశాస్త్రాల విభాగం**

**హైదరాబాద్ విశ్వవిద్యాలయం,**

**హైదరాబాద్-500046**


**డిసెంబర్ – 2018**

# DECLARATION

I, **SIDDARDHA MADDIRALA** Register No:**09HTPH05** hereby declare that this thesis entitled "***DALITA SAHITYA VIMARSHA SAMAKALEEANA DHORANULA PARISEELANA***" submitted by me under the guidance and supervision of **Prof.DARLA VENKATESWARA RAO** is a bonafide research work. I also declare that this had not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree / diploma. I hereby agree that my thesis can be deposited in Shodhganga /INFLIBNET.

Signature of the student
Date :
Place :

**SIDDARDHA MADDIRALA**
Reg.No. **09HTPH05**

# CERTIFICATE

This is to certify that the Thesis entitled "***DALITA SAHITYA VIMARSHA-SAMAKALEEANADHORANULA PARISEELANA*"** submitted by **SIDDARDHA MADDIRALA** bearing Regd. No. **09HTPHO5** in partial fulfillment of the requirement for the award of Doctor of Philosophy in Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The thesis has not been submitted previously in part or in fill to this or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications:**

1.'***Dalita Udyama Sahityam–Vargikarana Vadam'*** (ISSN No:2456-4702) published in BHAVAVEENA (International Journal of Telegu Literary, Culture & Language Study) Monthly Magazine, October, 2018**. (Page No:68-71)**(chapter-3)

2.'***Dalitaudyamasahityam -ekikarana vadam'*** (ISSN No:2456 4702) published in BHAVAVEENA (International Journal of Telegu literary, Culture& Language Study) Monthly Magazine, November, 2018. **(Page No:63-66)** (chapter-4)

**B. Presented in the following conference:** (Issues presented in the following papers have been discussed elaborately in the chapter 1st and 2nd of the thesis).

1. **Dalita Padyakavitvam**, National Seminar held on 17-18 September, 2009 in Department of Telugu, University of Hyderabad. (chapter-1)

2. **Dalita Sahitya Vimarsha Samakaleenata**, National Seminar held on 22nd Noveber, 2010 in Department of Telugu, Sri Potti Sreeramulu Telugu University, Hyderabad. (chapter-2)

Further, the student has passed the following courses towards fulfillment of course work requirement for the M.Phil. Programme as Detailed below.

| S.N | Course Code | Name | Credits | Pass/fail |
|---|---|---|---|---|
| 1 | HT600 | Research Methodology and Basics in Logics | 5.00 | Pass |
| 2 | HT601 | History of Telegu Research | 4.00 | Pass |
| 3 | HT602 | studies in specialized Area | 3.00 | Pass |
| 4 | HT603 | Broad Field | 4.00 | Pass |

**(Prof. DARLA VENKATESWRA RAO)**
**Research Supervisor**

**(Prof. G.ARUNAKUMARI)**
**Head, Department of Telugu**

**(Prof. S. SARAT JYOTSNA RANI)**
**Dean, School of Humanities**

# పరిశోధన శీర్షిక

# దళిత సాహిత్య విమర్శ సమకాలీన ధోరణుల పరిశీలన

## విషయసూచిక (i – xxiii)


అంకితం

కృతజ్ఞతలు

ప్రస్తావన (Preface)

1.ఉపోద్ఘాతం(Introduction)

2. పరిశోధన పరిధి (Scope of the Research)

3. పరిశోధన విధానం/పద్ధతి ( Research Methodology)

4. పూర్వపరిశోధనల పరామర్శ (Review of literature)

5.పరిశోధన లక్ష్యం (Objectives of the Study)

6. పరిశోధన ప్రణాళిక (Research Design)

7. ముగింపు(Conclusion)

## మొదటి అధ్యాయం

## దళితసాహిత్యం-చారిత్రక నేపథ్యం (1-50)

1.1.పరిచయం

1.2.దళిత పదం అర్థ వివరణ

1.3.దళితులు – నిర్వచనాలు

1.4.దళిత సాహిత్యం నిర్వచనాలు

1.4.1.దళిత సాహిత్యం – తెలుగు రచయితల అభిప్రాయం

1.4.2. దళిత సాహిత్యం – ఆంగ్ల రచయితల అభిప్రాయం

1.5. దళితసాహిత్యం – మౌలిక లక్షణాలు

1.6. దళిత సాహిత్యం – లక్షణాలు

1.7. దళిత ఉద్యమం

1.8. దళితఉద్యమం – లక్ష్యాలు

1.9. దళిత ఉద్యమం–లక్షణాలు

1.10. దళిత ఉద్యమం, సాహిత్యం అభివృద్ధికి ఆటంకాలు

1.11. దళిత సాహిత్యం చారిత్రక తాత్త్విక నేపథ్యం

1.11.1.బౌద్ధమత పాత్ర

1.11.2.జైనం మత ప్రభావం

1.11.3.చార్వాక మత ప్రభావం

1.11.4.వీరశైవ మత ప్రభావం

1.11.5.భక్తి ఉద్యమ ప్రభావం

1.12.తెలుగులో దళిత సాహిత్య ప్రస్థావన

1.13.దళిత సాహిత్యం ప్రారంభపరిణామాలు

1.14.దళిత సాహిత్యం ప్రక్రియావైవిధ్యం

1.15.వివిధ భాషల్లో దళిత సాహిత్యం

1.16.దళిత పత్రికల పాత్ర

1.17.దళిత ఉద్యమం – యన్.జి.ఓ ల పాత్ర

## రెండవ అధ్యాయం

## తెలుగు సాహిత్యవిమర్శ ప్రారంభపరిణామాలు (51-90)

2.1. పరిచయం

2.2.విమర్శ – పద వివరణ

2.3. సాహిత్య విమర్శ – విమర్శకుడు నిర్వచనాలు

2.4.సాహిత్య విమర్శకుడు – అర్హతలు

2.5. విమర్శకుని లక్షణాలు

2.6.సాహిత్య విమర్శ ధర్మాలు

2.7.తెలుగు సాహిత్య విమర్శ ప్రారంభ పరిణామాలు

2.8.విమర్శ లక్షణాలు

2.9.తెలుగు సాహిత్య విమర్శ రకాలు

2.9.1.వ్యాఖ్యానాత్మక విమర్శ

2.9.2.కవిజీవిత విమర్శ

2.9.3.చారిత్రక విమర్శ

2.9.4.ప్రక్రియాపర విమర్శ

2.9.5.తులనాత్మక విమర్శ

2.9.6.శిల్ప విమర్శ

2.9.7.శిల్ప విమర్శ

2.9.8.శైలీశాస్త్ర విమర్శ

2.9.9.మార్క్సిస్టు విమర్శ

2.9.10.స్త్రీవాద సాహిత్య విమర్శ

2.9.11.దళితవాద సాహిత్య విమర్శ.

2.10.తెలుగు సాహిత్య విమర్శ – దళిత సాహిత్య విమర్శ స్థానం

2.11.దళిత సాహిత్య విమర్శ – నిర్వచనం

2.12.దళితులు – దళిత సాహిత్య  విమర్శ

2.13.దళిత సాహిత్యం – విమర్శ ధోరణులు

2.13.1. దళిత సాహిత్యం – సంప్రదాయ ధోరణి

2.13.2. దళిత సాహిత్యం – మార్క్సిస్టు ధోరణి

2.13.3. దళిత సాహిత్యం – అంబేద్కర్ ఆలోచనా ధోరణి

2.13.4. దళిత సాహిత్యం – స్త్రీవాద ధోరణి

2.13.5. దళిత సాహిత్యం – వర్గీకరణ దృక్పథం

2.13.6. దళిత సాహిత్యం – ఏకీకరణ దృక్పథం

2.13.7. దళిత సాహిత్యం – ప్రాంతీయవాదం

2.13.8. దళిత సాహిత్యం – బహుజనవాదం /సమన్వయ వాదం

# మూడవ అధ్యాయం

## వర్గీకరణ సాహిత్యం — విమర్శనాత్మక అధ్యయనం (91-176)


3.0.ఉపోద్ఘాతం

3.1.భారత రాజ్యాంగం – షెడ్యూల్డ్ కులాలు

3.2.షెడ్యూల్డ్ కులాలు – ఉప వర్గీకరణ

3.2.1.ఎ గ్రూపు – పూటకు భోజనం లేని, నీడలేని నిరుపేద కులాలు

3.2.2. బి గ్రూపు – ఒక్క పూటకు భోజనం ఉన్నవారు

3.2.3. సి గ్రూపు – రెండు పూటలకు భోజనం ఉన్నవారు

3.2.4. డి గ్రూపు – మూడు పూటలు ఉన్నవారు

3.3.మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి – ప్రారంభపరిణామాలు

3.3.1.మాదిగ పదం – అర్థ వివరణ

3.3.2.మాదిగలు నిర్వచనం

3.3.3.మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి ఆవిర్భావ వికాసం

3.3.4. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి లక్ష్యాలు

3.4.రిజర్వేషన్లు – అంబేద్కర్ దృక్పథం

3.5.ఉషా మెహ్రా కమీషన్ – అభిప్రాయాలు, సూచనలు

3.6.వర్గీకరణ వాదం – సామాజిక, రాజకీయ విశ్లేషకుల అభిప్రాయాలు

3.7.దళిత సాహిత్యం – వర్గీకరణ దృక్పథం

3.8.తెలుగు సాహిత్యం మాదిగల ప్రస్తావన

3.8.1. మాదిగలు ప్రధాన లక్షణాలు

3.9.దండోరా ఉద్యమం, సాహిత్యం – విమర్శకుల అభిప్రాయాలు

3.10.దండోరా సాహిత్యం – ప్రసిద్ధ రచనలు

3.11.దండోరా సాహిత్యం – విమర్శనాత్మక అధ్యయనం

3.12.దండోరా సాహిత్యం – దశలు
3.12.1.దండోరా సాహిత్యం – మొదటి దశ
3.12.2. దండోరా సాహిత్యం – రెండవ దశ
3.12.3. దండోరా సాహిత్యం – మూడవ దశ
3.12.4.దండోరా సాహిత్యం – నాల్గవ దశ
3.12.5.దండోరా సాహిత్యం – ఐదవ దశ
3.13.దండోరా సాహిత్యం – ప్రతిపాదనలు

## నాల్గవ అధ్యాయం

## ఏకీకరణ సాహిత్యం-విమర్శనాత్మక పరిశీలన (177-223)

4.1.పరిచయం

4.2. మాల శబ్ధం నిఘంటువు అర్థాలు

4.3. మాలలు నిర్వచనాలు

4.4. మాల– అనుబంధకులాల జాబితా

4.5..మాల మహానాడు పోరాటం – ప్రారంభపరిణామాలు

4.5.1.చారిత్రక కారణాలు

4.5.2.భౌగోళిక వైవిధ్యం

4.5.3.సాంస్కృతిక కారణాలు

4.5.4.ఆర్థిక కారణాలు

4.5.5.రాజకీయ కారణాలు

4.5.6.మాలమహానాడు ప్రధాన లక్ష్యాలు

4.5.7. మాలమాహానాడు వాదనలు

4.5.8.మాలలు ప్రధాన లక్షణాలు

4.6. మాలలచరిత్ర – సంస్కృతీ, సంప్రదాయ సాహిత్యాల ప్రస్తావన

4.7.రిజర్వేషన్లు మాలల ధృక్పథం

4.8.ఏకీకరణవాదం – విమర్శనాత్మక అధ్యయనం

4.8.1.ఏకీకరణ వాదం వివిధ రాజకీయ పార్టీల వ్యతిరేక భావనలు

4.8.2.రిజర్వేషన్లు – ప్రముఖుల అభిప్రాయాలు

4.8.3.రిజర్వేషన్ల వర్గీకరణ విధానం – ఏకీకరణ వాదులు లేవనెత్తిన అంశాలు

4.9.ఏకీకరణ సాహిత్యం – విమర్శనాత్మక అధ్యయనం

**సింహావలోకనం** **(224-234)**

**ఉపయుక్తగ్రంథ సూచిక** **(235-242)**

I. గ్రంథాలు(Books)

II. వ్యాసాలు (Aiticles)

III. అంతర్జాల ఆకరాలు (webliography)

**అనుబంధం — 1** **( 243-254)**

పరిశోధన వ్యాసాలు మరియు జాతీయసదస్సుల సర్టిఫికేట్స్

**అనుబంధం — 2** **(255-256)**

వర్గీకరకరణ సాహిత్యం – పుస్తకాల పట్టిక

**అనుబంధం — 3** **(257)**

ఏకీకరణ సాహిత్యం– పుస్తకాల పట్టిక

**అనుబంధం — 4** **(258-261)**

దళిత సాహిత్య విమర్శ మరికొన్ని వ్యాసాలు

## ❧❧❧ అంకితం ❧❧❧❧

కాలే కడుపుకు

కాస్త అన్నం పెట్టి

చదువే ఆయుధంగా

బతుకు బాటను చూపిన

నవభారత నిర్మాత అంబేద్కర్ కి..,

వారి కష్టాలనే నా కోరికలుగా

వారి చెమట చుక్కలే నాపెన్ను సిరా చుక్కలుగా

నా బతుకుకు బాటలు వేసిన

నిరంతర కష్టజీవులు, అలుపెరగని శ్రమజీవులు

నా తల్లిదండ్రులు మద్దిరాల చినబ్రహ్మయ్య,చిన్న జాలమ్మ గార్లకు..,

అవమానాలే జీవిత గుణపాఠాలుగా

తన ఓపికే మా సంపదగా

మా బ్రతుకుకు దిశానిర్దేశం చేస్తూ

తన కష్టాన్ని మా సుఖాలకు అండగా నిలిపి

కుటుంబ సంక్షేమాన్ని నిరంతరం ఆలోచించి

నా అభివృద్దే తన అభివృద్ధిగా నిరంతరం భావించే

సహృదయిని, స్నేహశీలి, నా జీవిత భాగస్వామి

అంజలి దేవి(బుజ్జి)కి ..........,

**ప్రేమపూర్వకమైన కృతజ్ఞతలతో అంకితం.....!**

# కృతజ్ఞతలు

దళితజాతి జీవనపరిణామ క్రమానికి ప్రత్యేక స్థితిగతులను కల్పించి, దళితులు మనుషులే అన్న నూతనభావాన్ని సభ్యసమాజంలో రేకెత్తించి వారికి అన్ని రంగాల్లో ప్రత్యేక రాయితీలు కల్పించడమే కాకుండా విద్యా రంగంలో కూడా ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించి గ్రామీణ ప్రాంతాల్లో మోడుబారి పోతున్న దళిత యువతను విశ్వవిద్యాలయాల వైపు నడిపించి, వారికి అభివృద్ధికి తోడ్పడిన భారతరాజ్యాంగ నిర్మాత, దళితజాతిపిత భారత రత్న డా.బి.ఆర్. అంబేద్కర్ గారికి సామాజిక విప్లవాభివందనాలు.

నాకు జన్మనిచ్చి, విద్యాబుద్ధులు నేర్పించి వారి చెమట చుక్కలే నాకు సిరా చుక్కలుగా మలచి, నా విద్యా సౌఫల్యానికి సర్వత్ర కృషి చేసి, నేను ఈ స్థాయికి రావటానికి కారకులైన నా తల్లిదండ్రులు మద్దిరాల చిన్నబ్రహ్మయ్య, మద్దిరాల చిన్నజాలమ్మ గార్లకు ప్రేమపూర్వక పాదాభివందనాలు.

మారుతున్న శాస్త్ర సాంకేతికరంగాలకు అనుగుణంగా, తెలుగుసాహిత్యాన్ని ఎలా అధ్యయనం చేయాలో బోధిస్తూ, విమర్శ రంగంలో వస్తున్న నూతన ధోరణులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేయటమే కాకుండా వాటిని మాకు తెలియజెప్తూ, దళిత సాహిత్య చరిత్రలో నూతన ఒరవడిని సృష్టిస్తూ తెలుగు సాహిత్యంలో అందులోనూ దళితసాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న నిత్యనూతన పరిశోధకుడు, ఎప్పుడూ విద్యార్థుల క్షేమం కోరుకునే విద్యార్థి శ్రేయోభిలాషి మా గురువులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికి ప్రేమపూర్వక కృతజ్ఞతలు.

నాకు M.A., M.Phil లో పాఠాలు బోధించి, తెలుగు సాహిత్య అధ్యయనం వైపు అభిరుచిని, అసక్తిని రేకెత్తించి నా విద్యాభ్యాసాన్ని పరిశోధన వైపు నడిపించిన మా గురువులు ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారికి, ఆచార్య నడుపల్లి శ్రీరామరాజు గారికి, ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి గారికి, ఆచార్య తుమ్మల రామకృష్ణగారికి, ఆచార్య రేమిల్ల వెంకట రామకృష్ణ శాస్త్రిగారికి, ఆచార్య జి.అరుణ కుమారిగారికి, డా.దార్ల వెంకటేశ్వరరావుగారికి, డా.పి.రాములు గారికి, డా.పమ్మి పవన్ కుమార్ గారికి, ,డా.డి.విజయలక్ష్మీ గారికి మరియు డా.బాణాల భుజంగరెడ్డి గారికి మరియు డా.విజయ లక్ష్మీ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈ పరిశోధన కాలంలో డాక్టరల్ కమిటీ మెంబర్లుగా వ్యవహరించి ఈ పరిశోధనకు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చిన ఆచార్య జి.అరుణకుమారి గారికి, డా, పిల్లమర్రి రాములుగారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

నా జీవిత గమనానికి, నా జీవిత లక్ష్యానికి చేదోడు వాదోడుగా ఉంటూ నన్ను నిరంతరం ప్రోత్సహిస్తూ నా అభివృద్ధిని నిరంతరం కాంక్షించే స్నేహశీలి, సహృదయశీలి, నా జీవిత భాగస్వామి బుజ్జి(అంజిలి దేవి)కి, చిట్టి పొట్టి నడకలతో వచ్చి రానీ ముద్దుమాటలతో మా కష్టాన్ని అంతా చిరునవ్వులతో చెరిపేసే నా ముద్దుల తల్లి చిరంజీవి లహరి(చిన్నుకి) కి శుభాకాంక్షలు.

నా విద్యాభ్యాసానికి చిన్నప్పటి నుండి ఆర్థికంగా, హార్ధికంగా తోడ్పడిన నా తమ్ముళ్ళు వీరాస్వామి, శివరామయ్య మరియు ఈశ్వర్లకు శుభాకాంక్షలు మరియు నా మరదళ్ళు ప్రియాంక, నీలిమలకు, చిన్నారులు సాహితీ, సమత, సంగీత,ఉదయ్ కుమార్ మరియు లడ్డులకు నా శుభాకాంక్షలు.

ఎప్పుడూ నా ఆనందాన్నే తమ ఆనందంగా భావించే మామలు హనుమంతురావు, ఆనందరావులకు, ఎప్పుడు ఇంటికి పోయినా కడుపు నిండా అన్నం పెట్టి నా సంతోషాన్నే తన సంతోషంగా భావించే నా అక్కలు కోటేశ్వరమ్మ, కోమలి, బాలకోటమ్మలకు మరియు చిన్నారులు పవన్,గీత, నాగార్జున, సుస్మిత,అమర్,అమ్ములుకు ఆశీస్సులు.

నన్ను నన్నుగా అభిమానించే మా మామయ్య కీర్తి శేషులు శ్యామ సుందరావుగారికి మరియు అత్తమ్మ వెంకటసుబ్బలక్ష్మీదేవీలకు, మరియు వెంకోజీరావులకు ప్రత్యేక కృతజ్ఞతలు. నేను ఎప్పుడూ ఇంటికి వెళ్ళిన ఆప్యాయంగా పలకరించి అభిమానించే అన్న, వదినలు సీతారామరావు(చిన్న), ఉమాదేవీలకు కృతజ్ఞతలు మరియు చిరంజీవులు చింటు,సన్ని,బన్నిలకు శుభాకాంక్షలు.

నా జీవిత ద్వితీయార్థంలో నా కుటుంబానికి అండగా నిలిచి అన్ని విధాలుగా ధైర్యం చెప్పిన సిద్ధయ్య అంకుల్ కి, ఫాతిమా ఆంటికి, చెల్లెలు బాల సిద్దమ్మ, చిన్న సిద్దమ్మలకు చిరంజీవులు సన్ని, మేఘనలకు మరియు వీరితో పాటుగా దస్తగిరి అంకుల్ కి, హనీఫాకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు.

నేను హైదరాబాదు విశ్వవిద్యాలయం అడుగుపెట్టినప్పటి నుండి అన్ని విధాలుగా నాకు అండగా నిలిచిన అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ సీనియర్ విద్యార్థి మిత్రులు

డా.వెంకట్రావు, డా.మాణిక్యం, డా.గౌరీశ్వర్, డా.ధనరాజ్, ప్రభాకర్, డా.రాజీవ్, డా.త్రినాథ్, డా.మాధవ్,డా.ఉమేష్, డా.మల్లి అన్నకు, ప్రవీణ్ నప్పారికి అన్నకు, తమ్ముళ్ళు రమణ, అశోక్, విజయ్, మురళి, శివన్నారాయణ, శేషు,రవిబాబు,బాలకృష్ణ,అంజిలకు నా ఎం.ఎ, ఎం.ఫిల్, పిహెచ్.డి విద్యార్థి మిత్రులకు రాజ్ కిషోర్, సుమన్, అంజిలకు, నాసహ పరిశోధకలు ఆదినారాయణ, శ్రీదేవి, ఉమేష్ లకు స్నేహాభివందనాలు.నా చిన్ననాటి మిత్రులు చిరంజీవి, శివలకు ప్రత్యేక కృతజ్ఞతలు.

పరిశోధన జరుగుతున్న క్రమంలో నాకు సమాచార సామాగ్రిని చేకూర్చి, నా ఈ పరిశోధన విజయవంతముగా పూర్తి చేయటానికి సంపూర్ణ సహాయాలు అందించిన గ్రంథాలయాలు ఇందిరాగాంధీ మెమోరియల్ లైబ్రరరీకి, తెలుగు విశ్వవిద్యాలయం గ్రంథాలయానికి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ గ్రంథాలయానికి, శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయ గ్రంథాలయానికి, సి.పి.బ్రౌన్ గ్రంథాలయానికి మరియు ఆయా సిబ్బంది వర్గానికి ప్రత్యేక కృతజ్ఞతలు.

తెలుగు శాఖలో బోధనేతర సిబ్బంది భవానీ శంకర్, రాంబాబులకు,బాలాజీ గార్లకు నా ఈ పరిశోధనకు రాజీవ్ గాంధీ నేషనల్ ఫెలోషిప్ ను మంజూరు చేసిన యూనివర్శిటి గ్రాంట్స్ కమీషన్(UGC)కు ప్రత్యేక కృతజ్ఞతలు.వీరు మాత్రమే కాకుండా నా ఈ పరిశోధనకి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయసహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు.

సిద్దార్థ మద్దిరాల

# ప్రస్తావన (Preface)

## 1.0. పరిచయం (Introduction) :

సాహిత్యం అంటే హితం చేకూర్చేదనే భావనతో సాహిత్య అధ్యయనం వైపు అడుగులు వేశాను. తెలుగు సాహిత్యం అంటే కేవలం రామాయణం, మహాభారతం, భాగవతాల గ్రంథాలు మాత్రమే అనుకున్నాను. అవి తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబింప చేస్తాయని డిగ్రీ స్థాయిలో అధ్యయనం చేసాను. హైదరాబాదు విశ్వవిద్యాలయంలో ఎం.ఏలో చేరిన తర్వాత సాహిత్యం అంటే కేవలం ఇవి మాత్రమే కాదు కొన్ని వందల కొద్ది గ్రంథాలు ఉన్నాయనీ, వాటిని అవి వచ్చిన కాలాన్ని బట్టి కొన్ని ఉద్యమాలుగా, కొన్ని వాదాలుగా, మరికొన్ని ప్రక్రియలుగా ఉన్నాయని ప్రాథమికంగా తెలుసుకున్నాను. సాహిత్య పరిధి, ప్రాధాన్యత పెరిగిన కొద్ది కొంతభాగాన్ని ప్రాచీన సాహిత్యంగానూ, మరికొంత భాగాన్ని ఆధునిక సాహిత్యంగానూ సాహిత్య విమర్శకులు విభజించినట్లు వీటి పూర్తి అధ్యయనం కొరకు సాహిత్య చరిత్రలు ఎన్నో వచ్చాయని మా గురువులు బోధనల ద్వారా తెలుసుకున్నాను. ఆయా సాహిత్య గ్రంథాలను విద్యాభ్యాసంలో భాగంగా అధ్యయనం చేసినప్పుడు ఆధునిక సాహిత్య చరిత్రలో దళిత సాహిత్యం ఒకటి ఉందని తెలుసుకున్నాను. ఈ దళిత సాహిత్యం భారత రాజ్యాంగంలో షెడ్యూల్డ్ కులాల,తెగల, వెనుకబడిన తరగతులకు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలుసుకున్నాను. ఈ క్రమంలో నాకు ఎం.ఏలో దళితసాహిత్యం ఒక ప్రత్యేక ఐచ్ఛికాంశంగా ఉండటం, ఆ అంశానికి సంబంధించి కొంత సూక్ష్మంగా అధ్యయనం చేయటం జరిగింది. అప్పుడే దళిత సాహిత్యం పట్ల అభిరుచి, ఆసక్తి ఏర్పడింది. నేను స్వయంగా దళితుడను కావటం వలన నా జాతి మూలాలను, జాతి నిర్మాణం కొరకు జరిగిన ఉద్యమాలను, తద్వారా వచ్చిన సాహిత్యాన్ని స్థూలంగా అధ్యయనం చేయాలనిపించింది. ఆ

ఉద్దేశ్యంతోనే మా గురువుగారి సలహా మరియు నా అభీష్టం మేరకు తెలుగు సాహిత్యానికి ప్రధాన సంప్రదాయసంపదగా భావించే పద్యకవిత్వాన్ని అధ్యయనం చేయాలనిపించింది. అందులో దళిత సమస్యలను పద్యరూపంలో ఏయే విధంగా చెప్పారో తెలుసుకోవాలని ఎం.ఫిల్ లో ***"దళిత పద్యకవిత్వం వస్తువైవిధ్యం"*** అనే అంశాన్ని నా పరిశోధనకు ఎంచుకున్నాను. ఈ పరిశోధనలో ఎంతో సమాచారాన్ని తెలుసుకున్నాను. పద్యం అంటే కేవలం కొంతమందే రాయగలరని, అది పూర్వజన్మ సుకృతం అని బోధించే సాంప్రదాయిక పండితులకు ధీటుగా ఏ విధంగా తీసిపోకుండా ఎంతో మంది మొదటి తరం దళిత పద్యకవులు ఎన్నో వైవిధ్యభరితమైన రచనలు చేసినట్లు నా పరిశోధనల ఫలితంగా తెలియజేశాను. జ్ఞానం చాలా విలువైనదని అది కేవలం ప్రతిభతోనే సాధించవచ్చునని ఈ పరిశోధనలో నిరూపించాను. దీనికి కొనసాగింపుగా దళిత సాహిత్యాన్ని అంటే కవిత్వం, కథ, నవల, నాటకం...., ఇలా ఎన్నో ప్రక్రియలను అధ్యయనం చేయాలనిపించి, అందులో భాగంగా నా పిహెచ్.డి పరిశోధనలో ***"దళిత సాహిత్య విమర్శ - సమకాలీన ధోరణుల పరిశీలన"*** అనే అంశాన్ని నా పరిశోధన శీర్షికగా నిర్ణయించుకోవటం జరిగింది.

### 1.1. పరిశోధన పరిధి (Scope of the Research) :

దళిత సాహిత్యం తెలుగు సాహిత్యం ప్రారంభం నుండే ప్రారంభమైందని చెప్పుకోవచ్చు. కాకపోతే స్పష్టమైన లక్ష్యంతో అది వెలువడలేదు. కేవలం నీచపాత్రలను రచనా ప్రస్థానంలో చర్చించ వలసినప్పుడే మాత్రమే దళిత సాహిత్య ఛాయలు తెలుగు సాహిత్యంలో కనిపిస్తున్నాయి. అంతేకాకుండా అప్పటి పరిస్థితుల దృష్ట్యా జాతీయ ఉద్యమం, సంఘ సంస్కరణ ఉద్యమం దిశగా ఉద్యమాలు జరుగుతున్న తరుణంలో అస్పృశ్యత నివారణ, హరిజనోద్ధరణ వంటి విషయాలలో దళితసాహిత్యం వచ్చినట్లు సాహిత్య గ్రంథాల ఆధారంగా తెలుస్తుంది. ఆధునికకాలంలో 19వ శతాబ్ధం ఉత్తరార్ధంలో సాహిత్యంలో

అస్తిత్వ ఉద్యమయుగం మొదలైంది. ఈ అస్తిత్వఉద్యమాలకు దళిత ఉద్యమ, సాహిత్యాలు బీజం వేశాయనే చెప్పాలి. దళిత సాహిత్యం ఆరంభమైన మొదట్లో చాలా ఉధృతంగానే వచ్చింది. అది వచ్చిన తీరుని బట్టి దళితుల ఆశాలు, ఆశయాలు నెరవేరబోతున్నాయన్న ఆశాభావం అందరిలోని వచ్చింది. ఈ క్రమంలోనే దళితుల మధ్య రిజర్వేషన్ల పంపిణీపై అంతర్యుద్ధాలు మొదలైనాయి. ఈ క్రమంలోనే దళితసాహిత్యం వర్గీకరణ సాహిత్యంగా, ఏకీకరణ సాహిత్యంగా విడిపోయి అటు మేధావులు, కవులు, కళాకారులు దాదాపు దళిత సమాజం అంతా బహిర్గతంగా సభల్లో, సమావేశాల్లో దళితులంతా ఒక్కటే అని ప్రసంగాలు ఇచ్చుకున్న, అంతర్గతంగా మాత్రం వీరి మధ్య సామాజిక, ఆర్థిక, ఉపాధి హోదా కోసం, సాహిత్య స్థానాల కోసం యుద్ధం జరుగుతూనే ఉంది. ఆధునిక సాహిత్యం మొదలైన తర్వాత వచ్చిన జాతీయ, సంస్కరణ, భావ, అభ్యుదయ, విప్లవసాహిత్యాలలో దళితుల గురించి చర్చ జరుగుతూనే ఉంది. కాకపోతే ఇది దళితులకు ప్రత్యేక హోదా ఇవ్వకుండా ఆయా పరిస్థితులకనుగుణంగా దళితుల గురించి సాహిత్య రచనలు వారి వారి భావజాల దృష్ట్యా చేయడం జరిగింది. సాహిత్య నియమాలను, నిబంధనలను ధిక్కరిస్తూ సాహిత్య సృజనలో దళితుల స్థానాన్ని ప్రశ్నిస్తూ దళిత సాహిత్యం ఎలా వచ్చిందో చెబుతూనే, దాని పరిణామ క్రమాన్ని పరిచయం చేస్తూ, తెలుగు సాహిత్య విమర్శలో దళిత సాహిత్య విమర్శ స్థానాన్ని ప్రస్తావిస్తూ, దళిత సాహిత్యంలో విభేధాలు ఎలా జరిగాయో చెబుతూ, దాని నేపథ్యంగా దళిత సాహిత్య విమర్శలో సమకాలంలో వచ్చిన వర్గీకకరణ, ఏకీకరణ ఉద్యమ సాహిత్యాన్ని, సాహిత్య విమర్శని పరిశీలించటం ఈ పరిశోధన పరిధి.

### 1.2.పరిశోధన విధానం/పద్ధతి ( Research Methodology) :

***" దళిత సాహిత్య విమర్శ, సమాకాలీన ధోరణుల పరిశీలన"*** అనే ఈ పరిశోధనలో విషయ సేకరణ ప్రధానంగా రెండు రకాలుగా చేయటం జరిగింది.

మొదటిది వివిధ గ్రంథాలయాల్లో ఈ అంశానికి సంబంధించిన పుస్తకాలను సేకరించి ఆయా పుస్తకాల్లో ఉన్న సాహిత్య విమర్శాంశాలను సమీక్షించటం, ఆ విమర్శలు ఆయా రచయితలు ఏ కోణం నుండి విమర్శించారో పరిశీలించటం జరిగింది. రెండవది దళిత సాహిత్యానికి ప్రధాన భూమిక దళిత ఉద్యమమే. కనుక ఆయా ఉద్యమకారులను, కొన్ని ఉద్యమ పత్రికలను, సభలు, సమావేశాల్లో కవులు, కళాకారులు, మేధావులు తీర్మానించిన అంశాలను, సాహిత్య పత్రికలలో వెలువడే ఆయా విమర్శ వ్యాసాలను సేకరించటం. వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధన గ్రంథాల సహకారంతోనూ, ఈ వర్గీకకరణ, ఏకీకరణ గురించి దళితులు (మాలలు, మాదిగలు), దళితేతరుల అభిప్రాయాలు ఎలా ఉన్నాయో ఆయా సాహిత్య గ్రంథాల ముందుమాటల ఆధారంగా సేకరించటం జరిగింది. ఇవే కాకుండా అంతర్జాలంలో కనిపించే బ్లాగులు, మాలమహానాడు, మాదిగరిజర్వేషన్ పోరాట సమితి వెబ్ సైట్ల ఆధారంగా కూడా కొంత సమాచారం సేకరించటం జరిగింది. వీటితో పాటు అదనపు సమాచారం అంటే కవుల, కళాకారుల అభిప్రాయాల వంటి ఆకరాలు, సాహిత్యసాధనాలు ఉపయోగించుకుని ఈ పరిశోధన పూర్తి చేయటం జరిగింది. ఈ పరిశోధన ప్రధానంగా విశ్లేషణాత్మక/వివరాణాత్మకపద్ధతిలోనూ, వాఙ్మయ సేకరణ, విశ్లేషణ పద్ధతిలోనూ కొనసాగించటం జరిగింది.

### 1.3. పూర్వపరిశోధనల పరామర్శ (Review of literature) :

తెలుగు సాహిత్యం ప్రారంభమైనప్పటి నుండి ఆధునిక సాహిత్యం అందులో దళిత సాహిత్యంపై ఎన్నో పరిశోధనలు విరివిగా వచ్చాయి. కాకపోతే అవి దళిత ఉద్యమం గురించి, దళిత సాహిత్య చరిత్ర గురించి, దళిత సాహిత్య వస్తువు, రూపం, శిల్పం గురించి వచ్చాయి. అంతేగాకుండా దళిత సాహిత్య రచయితల గురించి, వారి రచనలపై ప్రత్యేక అధ్యయనాలు జరిగాయి. కానీ దళిత సాహిత్య విమర్శ దళిత కవిత్వం ఎదిగినంతగా ఎదగలేదనే చెప్పాలి. దళిత

సాహిత్య విమర్శ ప్రారంభమైనప్పటి నుండి నేటి వరకు పరిశోధనలు పరిమితంగానే జరిగాయనే చెప్పాలి. అందులోనూ దళిత సాహిత్యంలో సమకాలంలో అంటే వర్గీకరణ, ఏకీకరణ అంశాలపై పెద్దగా పరిశోధన జరగలేదని నా అభిప్రాయం. ఒకవేళ జరిగిన అవి ఆయా రచయితల కావ్యాలపైన, వ్యక్తిగత రచనలపై యూనివర్సిటిల్లో పరిశోధనలు జరిగాయి తప్ప ప్రత్యేకించి వర్గీకరణ, ఏకీకరణ సాహిత్య విమర్శ జరగలేదు కనుక నేను ఈ పరిశోధన అంశాన్ని మా గురువుగారి సలహాల మేరకు మరియు నా అభీష్టం మేరకు ఎంచుకోవటం జరిగింది. తెలుగు సాహిత్యంలో దళిత సాహిత్యం పై జరిగిన పరిశోధనలు కొన్ని ఈ కింద పేర్కొంటున్నాను.

1. ఆనందరావు,కొల్లూరి.**హరిజనాభ్యుదయం ఆధునికాంధ్రకవిత్వం:** 1994; విశాఖ జిల్లా, చైతన్య సాహితీ స్రవంతి.
2. మల్లికార్జున,పి.***తెలుగులో దళిత కవిత్వరూపం - వస్తువు;(అముద్రిత సిద్ధాంతవ్యాసం):*** హైదరాబాదు విశ్వవిద్యాలయం,హైదరాబాదు,1997.
3. విజయానందరాజు,వై.**తెలుగుసాహిత్యం హరిజనుల సేవ:** హైదరాబాదు విశ్వవిద్యాలయం;1998.
4. సుధాకర్,కాకాని.**దండోరాచైతన్యం**:హైదరాబాదువిశ్వవిద్యాలయం;1998.
5. శ్యామసుందరరావు,అంబటి.***దళిత సాహిత్యం భాషా దృక్పథం(అముద్రిత సిద్ధాంత వ్యాసం);*** హైదరాబాదు విశ్వవిద్యాలయం:2000.
6. రవికుమార్,పొనుగోటి.***దళిత కవిత్వంలో పురాణ ప్రతీకలు (అముద్రిత సిద్ధాంత వ్యాసం);***హైదరాబాదు విశ్వవిద్యాలయం:హైదరాబాదు,2003.
7. గౌరీశ్వరరావు,కొంకే.**దళితపత్రికలు** హైదరాబాదు విశ్వవిద్యాలయం,2007.
8. మాధవరావు,గుర్రం.**దళిత సాహిత్య విమర్శ వాదోపవాదాలు:** హైదరాబాదు విశ్వవిద్యాలయం; జూన్ 2010.
9. సిద్దార్థ,మద్దిరాల.**దళిత పద్యకవులు వస్తు వైవిధ్యం**: హైదరాబాదు

విశ్వవిద్యాలయం; జూన్. 2009.

10. అంజలిదేవి,సింధే.**రాయలసీమ దళితకథలుభాషావిశ్లేషణ:** పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం; హైదరాబాదు, 2010.

## 1.4.పరిశోధన లక్ష్యం (Objectives of the Study) :

మనిషిని మనిషిగా చూడలేని ఈ అమానవీయ హిందూ సమాజంలో తమ కంటూ సొంత జీవన విధానం, సొంత గొంతుక అవసరమని భావించిన దళితులు పూలే, అంబేద్కర్ ఆలోచన విధానాలతో ప్రేరేపితులై దళితులపై జరుగుతున్న వివక్షతను, దాడులను వ్యతిరేకిస్తూ దళిత ఉద్యమాన్ని ఆరంభించారు. దళిత ఉద్యమానికి ఆధారభూతంగా ఏర్పాటు అయిందే దళిత సాహిత్యం. దళిత సాహిత్యంలో దళితుల సంస్కృతీ, సంప్రదాయాలు, దళితులపై జరిగిన వివక్షతలే వీరి కవితా వస్తువులు. మొదటగా తెలుగు సాహిత్యంలో అస్పృశ్య నివారణోద్యమంలో భాగంగా ప్రారంభమై, అభ్యుదయ, విప్లవ సాహిత్యాలలో కొంత అనుభవాన్ని గడించి 1980 తర్వాత నిర్ధిష్టమైన లక్ష్యంతో దళిత సాహిత్యం ఏర్పాటు అయింది. దళితసాహిత్యం ఏర్పాటు అయిన దశాబ్ధ కాలంలో తెలుగు సాహిత్యానికే ధీటుగా మారింది. దాదాపు అన్ని ప్రక్రియల్లో దళిత సాహిత్య ఛాయలు కనిపించాయి. 1990 తర్వాత దళిత ఉద్యమ, సాహిత్య పరిస్థితి ఊహించని మలుపు తిరిగింది. భారత రాజ్యాంగంలో దళితులకు కల్పించిన రిజర్వేషన్ల పంపిణీలో మాల దాని అనుబంధకులాలకు, మాదిగ దాని అనుబంధ కులాల వారికి అంతర్యుద్ధం మొదలైంది. అంతవరకు దళితుల ఐక్యత వర్ధిల్లాలి అనే నినాదం మాదిగల ఐక్యత వర్ధిల్లాలి, మాలల ఐక్యత వర్ధిల్లాలి అనే స్థాయికి చేరుకొని వేర్వేరు శిబిరాలు ఏర్పాటు చేసుకున్నారు. ఫలితంగా సాహిత్యంలో కూడా ఇదే ధోరణి వెలువడింది. ఫలితం మాలలపై మాదిగలు, మాదిగలపై మాలలు విమర్శించుకోవటం ప్రారంభమైంది. ఫలితం దళిత ఉద్యమం, సాహిత్యం యొక్క అంతిమ లక్ష్యానికి కుంటుపడింది. ఇలా ఎందుకు

జరిగిందో చెబుతూ ఆయా కాలాల్లో వచ్చిన సామాజిక, రాజకీయ విశ్లేషణను, సాహిత్య విమర్శను పరిశీలించటం, ఏకీకరణ, వర్గీకరణ సాహిత్య వాదాలు దళిత సాహిత్యంలో ఆవిర్భవించటం దళిత సాహిత్య వికాసమా? వినాశనమా? నిజంగా రిజర్వేషన్ల పంపిణిలో ఏమైనా లోటుపాట్లు ఉన్నాయా? వాటిని ఎలా అధిగమించాలి, వీటికి సంబంధించి వివిధ ప్రముఖుల సూచనలు ఏవిధంగా ఉన్నాయో, వీటి ఆధారంగా వచ్చన సాహిత్య సృజన ఎలా జరిగింది? సాహిత్య విమర్శ ఎలా జరిగింది? సాహిత్య విమర్శలో దళిత సాహిత్య స్థానం ఎంత? దళిత సాహిత్యంలో ఏకీకరణ, వర్గీకరణ ప్రభావం ఎలా ఉంది?...తదితర అంశాలన్నింటిని శాస్త్రీయంగా పరిశీలించటమే ప్రధాన లక్ష్యంగా ఈ పరిశోధన కొనసాగింది.

**1.5.పరిశోధన ప్రణాళిక :**

దళిత సాహిత్య విమర్శను అధ్యయనం చేసే ముందు దళిత సాహిత్యం వచ్చిన తీరుని, అది ఎదుర్కొన్న ఒడిదుడుకులను అధ్యయనం చేసాను. అందులో భాగంగానే ***"దళిత సాహిత్యం చారిత్రక నేపథ్యం"*** అనే శీర్షికను మొదటి అధ్యాయంగా ఎంచుకున్నాను. ఇందులో ప్రధానంగా దళితులంటే ఎవరు? దళిత అనే పదానికి అర్థాలు, నిర్వచనాలు, దళితఉద్యమ చరిత్రను, దళిత సాహిత్య చరిత్రను రేఖామాత్రంగా పరిచయం చేస్తూ, దళిత సాహిత్య ప్రారంభపరిణామాలను విశదీకరించే ప్రయత్నం చేసాను.

రెండవ అధ్యాయంగా దళిత సాహిత్య విమర్శను అధ్యయనం చేయాలంటే తెలుగు సాహిత్య విమర్శ తీరుతెన్నులను అధ్యయనం చేసి తెలుగుసాహిత్య విమర్శలో దళిత సాహిత్య విమర్శ స్థానం ఏమిటో నిరూపించాలి కనుక ***" తెలుగు సాహిత్య విమర్శ – దళిత సాహిత్య ప్రస్థానం"*** అనే శీర్షికతో ఈ పరిశోధన రెండవ అధ్యాయంగా పేర్కొనడం జరిగింది. ఈ అధ్యాయంలో ప్రధానంగా విమర్శ అంటే ఏమిటి? విమర్శ నిర్వచనాలు? ప్రముఖుల అభిప్రాలు తెలుగుసాహిత్య విమర్శలో

దళితసాహిత్య విమర్శ స్థానాన్ని పరిశీలించిన తర్వాత దళిత సాహిత్య విమర్శ వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు ఏయే వాదాలకు, ఏయే కాలాల్లో వచ్చిందో తెలియజెప్పే ప్రయత్నం చేసాను. ఈ పరిశీలనలో భాగంగా దళిత సాహిత్యం ఆయా ఉద్యమాలకు అనుగుణంగా ఆయా కాలాల్లో వచ్చిన సమకాలంలో అంటే ఏకకాలంలో వచ్చిన వాదాలు ప్రధానంగా రెండుగా గుర్తించాను.అవి వర్గీకరణవాదం(మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి), ఏకీకరణవాదం (మాలమహానాడు).

దళితఉద్యమం, దళిత సాహిత్యంలో అంబేద్కర్ కల్పించిన హక్కుల సాధనకై పోరాడిన దళితులు ఇప్పుడు రిజర్వేషన్ల పంపిణీలో కొంత అవకతవకలు ఉన్నాయనీ, రిజర్వేషన్ల పంపిణీ సరిగా జరగలేదని ఒక వర్గం(మాలలు)వారే మొత్తం రిజర్వేషన్లు అనుభవిస్తున్నారని కాబట్టి అంబేద్కర్ అంతిమ లక్ష్యం నెరవేరాలంటే రిజర్వేషన్ల వర్గీకరణ జరగాలని ఒక వర్గం అనగా మాదిగ, దాని అనుబంధ కులాలు 1994 నుండి ఒక ప్రత్యేక వాదంగా ఉద్యమం, సాహిత్యం ప్రారంభించారు. దీనినే దండోరా ఉద్యమం గానూ, దండోరా సాహిత్యంగాను చెప్పుకుంటున్నాం. దీనిలో వర్గీకరణ ప్రధాన అంశం కనుక వర్గీకరణ పేరుతో మాదిగ లేదా దండోరాసాహిత్యం వచ్చింది. కనుక ***"వర్గీకరణ సాహిత్యం-విమర్శనాత్మక పరిశీలన"*** అనే అంశాన్ని నా పరిశోధనలో మూడవ అధ్యాయంగా విశ్లేషించుకున్నాను.

ఈ వర్గీకరణ వాదానికి ప్రతికూలంగా మాలలు, దాని అనుబంధ కులాలు దళిత రిజర్వేషన్లు విభజించడం అంటే దళితులను విభజించడమే అని, ఉమ్మడిగా ఉంటేనే ఏదైనా సాధించగలమని కాబట్టి రిజర్వేషన్లు వర్గీకరించకూడదని మాల దాని అనుబంధ కులాలు మరో ఉద్యమాన్ని చేపట్టారు. దీనినే *మాలమహానాడు* లేదా *ఏకీకరణ ఉద్యమం*గా పిలుచుకుంటున్నాం. కనుక ***"ఏకీకరణ సాహిత్యం-***

***విమర్శనాత్మక పరిశీలన"*** అనే అంశాన్ని ఈ పరిశోధనలో నాల్గవఅధ్యాయంగా విభజించుకున్నాను.

ఈ వర్గీకరణ, ఏకీకరణ ఉద్యమాల సారాంశాన్ని, వారు ప్రతిపాదించిన సిద్ధాంతాలను, అందులో భాగంగా వచ్చిన సాహిత్య గ్రంథాలను, గ్రంథ విమర్శలను పరిశీలించి, అవి వచ్చిన తీరుని, వాటి అవసరాన్ని ముగింపుగా తెలియజెప్పాను. అంటే ఈ పరిశోధన ఫలితాంశాలను సింహావలోకనంగా వివరణాత్మకమైన విశ్లేషణ చేసే ప్రయత్నం చేసాను. తర్వాత వీటి వాదోపవాదాలకు, సాహిత్యాంశాలకు సంబంధించిన ఆధారగ్రంథాలను, మరియు మరికొన్ని ప్రామాణిక సాహిత్య గ్రంథాలను ఆకారాది క్రమంలో పొందుపరచి ఈ పరిశోధనను ముగించడం జరిగింది.

**1.6. ముక్తాయింపు (Conclusion) :**

దళిత సాహిత్యం అంటే ఒకప్పుడు విస్తృతార్థంలోఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, స్త్రీలు ఇంకా చెప్పాలంటే అణగదొక్కబడిన వర్గం అంతా దళితులే అన్న భావన సాహిత్యం లోకంలో ఉండేది. అదే నేపథ్యంలో దళిత సాహిత్యం ప్రారంభమైన దశలో రచనలు వచ్చినప్పటికీ కాలానుక్రమగా కులఅస్తిత్వం, కులచైతన్యం సమాజంలో రోజురోజుకి పెరుగుతున్న నేపథ్యంలో ఏ కోవకు చెందిన వారు ఆ కోవలో సాహిత్యాన్ని, ఉద్యమాలను నిర్మించుకునే దశకు అణగారిన కులాలు చేరినాయి అనటంలో ఎటువంటి సందేహం లేదు. కనుక ఈ పరిశోధనలో దళితులు అంటే షెడ్యుల్డ్ కులాలకు చెందినవారుగా తీసుకోవటం జరిగింది. ఇంతటి గొప్ప చైతన్యానికి ప్రేరణకి, స్ఫూర్తికి దళిత ఉద్యమం కారణం అయినప్పటికీ రానున్న రోజుల్లో ఆ ఉద్యమ, సాహిత్య మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఎవరు ఉహించలేదు. దీనికి కారణం అనేకం వాటిని నిరూపించే దిశగా ఈ పరిశోధన సాగింది. కనుక దళితఉద్యమం, సాహిత్యం యొక్క గత చరిత్రను స్మరించుకుంటూ, వర్తమానాన్ని విశ్లేషిస్తూ, భవిష్యత్ కార్యాచరణను

ఏవిధముగా దళితఉద్యమం, సాహిత్యం నిర్మించుకుంటుదో, దాని విధివిదానాలాను ఏమిటోతెలియజేస్తూ ఈ పరిశోధన కొనసాగించటం జరిగింది.



## మొదటి అధ్యాయం

# దళిత సాహిత్యం - చారిత్రకనేపథ్యం

# మొదటి అధ్యాయం


# దళితసాహిత్యం - చారిత్రక నేపథ్యం

## 1.1. పరిచయం :

ఎప్పుడైతే మానవుడు ఈ భూమి మీద తన బ్రతుకుదెరువును తానే స్వయంగా నిర్మించుకోగలిగాడో, ఆనాడే ఆ మానవుడు తన జీవితం, ఈ జీవనవిధానం పట్ల స్వయంప్రతిపత్తి కలిగి, నిర్మాణాత్మకమైన జీవన నమూనాను ఏర్పరచుకోగలిగాడు. ఆ జీవననిర్మాణ నమూనాయే కాలపరిణామ క్రమంలో కొంత ఆధునీకరించబడుతూ వస్తుంది. ఈ ఆధునీకరణ జరిగే క్రమంలో మానవజీవితాన్ని అందులో గల భిన్నదృక్పథాలను , వారి జీవితంతో ముడిపడి ఉన్న సాంఘిక, సాంస్కృతిక సమకాలీన సమాజ నిర్మాణాన్ని ఆనాటి రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక విషయాలను రచనల ద్వారా తెలియజేస్తూ సృజనాత్మకంగా చెప్పే ప్రయత్నం చేయగలిగాడు. ఈ సృజనాత్మక రచనలనే మనం సాహిత్యంగా చెప్పుకుంటున్నాం. ఈ సాహిత్యం కేవలం పైన తెలిపిన విషయాలు మాత్రమే కాకుండా ఈ సృష్టిలో జరిగే సకల విషయాలను తెలియపరుస్తూనే, వాటి ద్వారా భూతకాల అనుభవాలను వర్తమానానికి జోడించి భవిష్యత్తు నిర్మాణాన్ని ప్రభోధిస్తుంది. అందుకే సాహితీవేత్తలు ***"సహితస్య స్వభావ సాహిత్యః, హితేన సహితం సాహిత్యం"*** అనే సూక్తులను బోధించారు. అంటే హితంతో కూడినది, మంచిని ప్రబోధించేది అది ఏదైనా సాహిత్యంగానే మనం పరిగణించాలి అని దీని అంతస్సూత్రం. అందుకే ఈ సాహిత్యం, సమాజం అవినాభావ సంబంధంతో కూడికొని ఉండి ***'మంచి సమాజం కోసం సాహిత్యం, మంచి సాహిత్యం కోసం సమాజం'*** నిరంతరం పాటుపడుతూనే ఉంటాయి.

తెలుగులో లిఖిత సాహిత్య అధ్యయన కాలం 11వ శతాబ్ధంలో మొదలైంది అనుకుంటే ఆనాటి నుండి ఈనాటి వరకు కొన్ని యుగాలుగానూ, ఎన్నో వాదాలుగాను, ఇంకొన్ని ప్రక్రియలుగాను, మరికొన్ని అస్తిత్వ కవితా ఉద్యమాలు, ధోరణులుగానూ సాహిత్యం పరిణామం చెందింది, నేటికి పరిణామం చెందుతూనే ఉంది. సాహిత్య పరిణామక్రమం జరుగుతున్న తరుణంలో స్వాతంత్ర్య పోరాట కాలంలో హరిజనోద్ధరణ, అస్పృశ్యత నివారణ తదితర రూపాల్లో చాలా మంది దళిత, దళితేతర రచయితలు జాతీయ ఉద్యమంలో భాగంగా సంస్కరణ సాహిత్యం రాశారు. 19వ శతాబ్ధపు ఉత్తరార్ధంలో మాత్రమే సొంతగొంతుకతో మనుషులను మనుషులుగా గుర్తించని ఈ అమానవీయ సంస్కృతిని, సనాతన సంప్రదాయాలను వ్యతిరేకిస్తూ ఈ ప్రపంచ చరిత్ర మూలాలను తవ్వుకుంటూ ఒక ప్రత్యామ్నాయ సంస్కృతిని, నవ సమాజాన్ని ఏర్పాటు చేసుకునే దశలో దళిత ఉద్యమం వచ్చింది. దళిత ఉద్యమ తాత్త్విక నేపథ్యంలో దళిత సాహిత్యం ఒక అస్తిత్వ కవితా ఉద్యమంగా వచ్చింది. దీనినే ఆత్మాభిమాన లేదా ఆత్మగౌరవ సాహిత్యం అనవచ్చు. దళితసాహిత్యం స్వాతంత్ర్య పోరాట కాలంలో, స్వాతంత్ర్య అనంతరం కాలంలో రెండు విధాలుగా వచ్చింది.

**దళిత ఉద్యమ సాహిత్యం**



**సానుభూతి సాహిత్యం** **ఆత్మాభిమాన సాహిత్యం**

స్వాతంత్ర్య అనంతరం అంటే 19వ శతాబ్ధంలో వచ్చిన దళిత సాహిత్యం ఆత్మగౌరవ పోరాటంతో తెలుగు సాహిత్యంలో, అందులోనూ ఆధునిక సాహిత్యంలో అంతర్భాగంగానే అవతరించి నేడు తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకుంటుంది. దాదాపు తెలుగులో వచ్చిన అన్ని ప్రక్రియల్లో తన ఉనికిని

నిలదొక్కుకుంటూ అటు సాహిత్య పరిధిని, ఇటు తన ఆత్మగౌరవ పోరాట సూత్రాన్ని, దాని నిర్మాణ లక్ష్యాన్ని, ఆవశ్యకతను, దళిత ప్రజల ఆకాంక్షల నినాదాన్ని సమతుల్యంగా సాధింగలుగుతున్న ఏకైక అస్తిత్వ, ఆత్మగౌరవ సాహిత్య ఉద్యమం ఈ దళిత సాహిత్యోద్యమం.

ప్రపంచదేశాలలో అతి పెద్ద ప్రజాస్వామ్యదేశంగా పిలువబడుతున్న భారతదేశంలో ఈనాటికి వర్ణం, కులం, వర్గం పేరిట అవమానాలు, అత్యాచారాలు, అమానవీయమైన దాడులు జరుగుతున్నాయంటే చాలా మందికి నమ్మశక్యం కాకపోవచ్చు కానీ ఇదే సత్యం. ఈ సంఘటనలకు, దుశ్చర్యలకు ఆధారభూతంగా ఉంటూ, మానవ జీవనవిధానాన్ని తన శాసనాల ద్వారా, హిందూ ధర్మ సూత్రాల ద్వారా శాసించే మనుధర్మం కొత్త కొత్త రూపాల్లో కాలానుక్రమంగా నేటికి అమలవుతూనే ఉంది. దళితులతో పాటు ఇంకా ఎంతో మంది తమ అస్తిత్వం కోసం, సామాజికన్యాయం కోసం ఎన్నో యేళ్ళుగా ఉద్యమాలు చేస్తున్నారు. కానీ పరిస్థితి మాత్రం యధాతదంగానే ఉంది. దళిత ప్రజల ఆంకాక్షలను, ఆశయాలను ఉద్యమాల రూపంలో వ్యక్తపరచిన కొంతవరకు మేలు చేకూరిందే కానీ పూర్తిస్థాయిలో ఫలితాలు నెరవేరటం లేదు. 1969 లో మహారాష్ట్రలో ప్రారంభమైన దళిత ఉద్యమం, దళిత సాహిత్యం ఆవిర్భవించి నేటికి సుమారు 30 సంవత్సరాల పైనే అవుతుంది. ఈ కాల పరిధిలో ఎంతో మంది దళిత అమరవీరులు జాతి కోసం తమ ప్రాణాలు కోల్పోయారే తప్ప వారి ఆశయాలు ఇప్పటికి నేరవేరలేదు. అవి కేవలం చరిత్రపుటల్లో స్మరించుకోవటానికి మాత్రమే ఉన్నాయి. ఈ దళితవీరుల పోరాటాలు, ఈ పోరాటాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన దళిత రచయితల ఆత్మగౌరవ నినాదాలు అధ్యయనం చేయకపోతే దళిత సాహిత్య చారిత్రక, తాత్త్విక నేపథ్యం మనకు అవగతం కాదు. కనుక మొదటగా దళిత పద విస్తృతిని, దళిత నిర్వచనాలను, దళిత సాహిత్య పరిణామ క్రమాన్ని పరిశీలిద్దాం.

## 1.2. దళిత పదం అర్థ వివరణ :

సాధారణంగా 'దళిత', 'దళితము' అనే పదాలకు ఖండించబడిన, విడగొట్టబడిన, చీల్చబడిన అనే సామాన్య అర్థాలు ఉన్నాయి. తెలుగుసాహిత్య చరిత్రలోనూ, అందులో ప్రధానంగా ప్రాచీన కావ్యాల్లో నీచ భావనలకు, నీచ పాత్రల ప్రస్తావనకు దళిత పదాన్ని రచయితలు ప్రయోగించారు. దళిత అనే పదానికి ప్రాచీనకావ్యాల్లోనూ,పురాణాల్లోనూ,పవిత్రగ్రంథాల్లోనూ, స్మృతుల్లోనూ, ఉపనిషత్తుల్లోనూ, నిఘంటువుల్లోనూ అనేక అర్థాలు, వివరణలు ఉన్నాయి. మొదటగా ఆంగ్ల నిఘంటువుల అర్థాలను పరిశీలిద్దాం.

దళితము: (Spilt, Broken, Exponded, Dlown) (**శంకరనారాయణ. తెలుగు ఇంగ్లీష్ నిఘంటువు, పుట: 276; 2006**).

దళితము:(Blown, Expanded, Spilt, Divided), (**బ్రౌణ్య తెలుగు - ఇంగ్లీషు నిఘంటువు, పుట : 431; 2007**).

'దళితము, దళము–దళవాయి అనే పదాలకు ఖండింపబడినది, భేధించబడినది, వికసించినది,ఆధిక్యము,సేనాధిపతి,సుంకరిసహాయుడైనఉద్యోగస్తుడు'

(**సీతారామాచార్యులు, బహుజనపల్లి. పుట:540, 1885**).

**దళితము :** చీల్చబడినది, విసిరినది, అర్థీకృతము, సగముగా చేయబడినది, నిక్షిప్తము, ఇటునటు చిమ్మబడినది(**శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు. 1979: పుట; 1482**). ఖండితము అనే పదానికి పర్యాయపదంగా దళితము అనే పదాన్ని సేనానాయకుడు అనే పదానికి పర్యాయపదంగా దళవాయి, ఆకు, సమూహము, సమృద్ధి, సాంద్రము, దళసరి అనే పదాలకు పర్యాయపదంగా దళము అనే పదం ఉపయోగించబడెను(**జి.యన్,రెడ్డి. 1990: పుట;118,136**).

పైన తెల్పినటువంటి నైఘంటిక అర్థాలు పరిశీలించినట్లైతే దళిత, దళించు, దళవాయి అనే పదాల అర్థాల సారాంశం మాత్రం దళిత అనే అర్థంలో వాడారు. దళిత, లేదా దళితుడు అంటే అస్పృశ్యుడు, అంటరానివాడు అనే అర్థంలో

వాడారు. ఎప్పుడైతే అంటరానివారికి ఆ పదం ప్రయోగించారో అప్పటి నుండి వీరంతా ఒకటిగా ఏకీకృతం అయ్యి దళిత అనే పదాన్ని సంఘటిత శక్తికి, ఆత్మవిశ్వాసానికి ధైర్యానికి ప్రతీకగా నిలుపుకున్నారు. దళిత పదాన్ని గురించి నిఘంటువుల అధారంగా చాలా దళిత, దళితేతర మేధావులు వారి వారి అభిప్రాయాలని ఈ విధంగా వ్యక్త పరచారు.

దళిత శబ్దం విశాలమైన భావాన్ని, విశాల దృక్పథాన్ని ఇచ్చే అర్థం కలది. స్వేచ్ఛకి, సమానత్వానికి, గుర్తింపుకి దూరమై, సమాజంలో ఎటువంటి గౌరవాలకు నోచుకోని అసంఖ్యాక ప్రజలకు దళిత శబ్దం ప్రతీకగా ఉండి ప్రాతినిథ్యం వహిస్తుంది. ఈ దళిత శబ్దం గురించి అనేక మంది మేధావులు అనేక రకాలుగా వారి వారి అభిప్రాయాలు తెలిపారు. అభిప్రాయాలు వేరైనా దాని అంతరార్థం మాత్రం దళిత అంటే అస్పృశ్యతకు గురైన అంటరాని ప్రజలు అనే అర్థాన్ని స్ఫురింపజేస్తుంది. దళిత అనే పదం మొదట వాడుకలో లేదు. హరిజన అనే పదం జాతీయ ఉద్యమ కాలంలో బాగా ప్రాచుర్యంలో ఉంది. హరిజనులు అంటే దేవుని బిడ్డలని, మరొక అర్థంలో అనాథలు అనే అర్థంలో వాడినట్లు ఆ తరువాతి కాలంలో మహారాష్ట్రలో మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజల్లో సామాజిక చైతన్యం తీసుకువచ్చే క్రమంలో దళిత అనే పదాన్ని ఆత్మగౌరవ సూచికగా, అంటరాని ప్రజలకు ప్రతీకగా మొదట ఉపయోగించినట్లు దళిత ఉద్యమ, సాహిత్య చరిత్రల ఆధారంగా తెలుసుస్తుంది. తరువాత దీనిని బాబాసాహెబ్ అంబేద్కర్ దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తెచ్చాడు. దళిత అనే పదాన్ని మొదటగా జాతి వాచకంగా ఉపయోగించినవాడు జ్యోతిరావుపూలే. దళిత అనేది హిందీ పదం. తరువాతి కాలంలో దళిత అనే పదమే స్థిరపడింది. ప్రస్తుతం దళిత అంటే మార్పునకు, సామాజిక విప్లవానికి ప్రతీక. దళితుడు అంటే మానవత్వం మీద విశ్వాసం ఉన్నవాడు అనే విస్తృతార్థంలో ఉపయోగిస్తున్నారు. దళిత పదం గురించి '*ఆంధ్రప్రదేశ్ దళితులు*' గ్రంథంలో కలేకూరి ప్రసాద్ తన అభిప్రాయాన్ని

వ్యక్తపరచారు. దళిత పదం ప్రాచీన మరాఠీ భాష నుండి తీసుకోబడింది. ఈ పదానికి నేలముక్కలుగా పగిలిపోయిన అని అర్థం. అయితే ఆధునికకాలంలో దళితశబ్దాన్ని మొదటగా ప్రయోగించి జాతివాచకంగా విస్తృత ప్రచారంలోకి తీసుకువచ్చింది మాత్రం జోతీరావు పూలే కానీ 1970 సంవత్సరంలో దళిత పాంథర్స్ ఉద్యమం వెలుగులోకి వచ్చేంతవరకు ఈ పదం విస్తృత ప్రాచుర్యానికి నోచుకోలేదని చెప్పుకోవాలి. (**ప్రసాద్**, **కలేకూరి. పుట: 15; 2002**).

ఇంతటి ప్రాచుర్యం గల దళిత పదం గురించి అనేక మంది దళిత, దళితేతర రచయితలు తమ అభిప్రాయాలను వ్యక్తపరచారు. వాటిని ఈ కింది విధంగా చెప్పుకోవచ్చు.

"*Dalit is the only name wich the the black untouchables of India have given them selves. its root word is Dalit which in heberw means broken, crushed "* **(V.T.Rajasekhar: 1979, page:43)**

దళిత అనే పదం కులం గురించిన వివరాలను వ్యక్తపరచేది కాదని అర్జున్ డాంగ్లే స్పష్టంగా వ్యక్తం చేశారు. దళితశబ్దం విశ్వజనీనతను, విప్లవాత్మకతను, విస్తృతమైన పరిధిని వివరించారు.

*"Dalit is not caste but a realization and is related to the experiences, joys and sarrows; and struggles of those in the lowest stratum of society. it matures with the sociological point of view and is related to the principles of negativity, rebeltion and loyalty to science, thus finally ending as revolutionary* ***(Arjun Dangle; page: 1264-265;1994).***

తెలుగులో దళిత అనే పదానికి, ఎవరు దళితులు అనే విషయాన్ని గురించి ప్రముఖ కవి,విమర్శకుడు కె.కె.రంగనాథాచార్యులు క్రింది విధంగా తెలిపారు. *"తరతరాలుగా అస్పృశ్యతకు గురై మతం పేరిట సాంస్కృతికంగా హీనంగా చూడబడి విద్యా సౌకర్యాలు కరువై సమాజంలో ఉంటూ కూడా ప్రధాన జీవన స్రవంతికి దూరమై ఆర్థికమైన అణచివేతకు శ్రమదోపిడికీ గురైన వాళ్ళు"* అనే అర్థంలో దళితులని, దళిత శబ్దం గురించి చెప్పారు. (**రంగనాథాచార్యులు**, **కె.కె. పుట; 12: 1994 ;**).

*"సాంఘిక దోపిడికి గురవుతున్నవారు, అస్పృశ్యులుగా పరిగణింపబడుతున్న వారు నీచవృత్తులుగా భావింపబడుతున్న వృత్తులు చేసుకుంటున్న వారు శారీరక శ్రమపై ఆధారపడి బతుకులు గడుపుతున్న వారు"*(**సత్యనారాయణ, యస్వీ. పుట;25: 1994**).


దళితఫాంథర్స్ ప్రణాళికలో దళితులంటే అణగదొక్కబడిన వాళ్ళు*"అస్పృశ్యులు అని ప్రకటించగా ఇటీవల భోపాల్ డిక్లరేషన్ చర్చల్లో దళిత పదం ఎస్సీ, ఎస్టీలు"* అనే అర్థంలో వాడబడింది. (**హైదరాబాదు డిక్లరేషన్:పుట;16;2002**).

*"మతం కులం దైవత్వం ప్రాతిపదికన శతాబ్దాల పాటు రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అణచివేతలకు గురై ప్రధాన జీవన స్రవంతికి దూరమై తద్వారా స్వేచ్ఛ గుర్తింపులను కోల్పోయిన సామాజిక విభాగం దళితులు"* .(**మల్లికార్జున రావు. పుట: 16**).

1973 లో మహారాష్ట్ర, బొంబాయిలో వెలువడిన దళిత ఫాంథర్ల మానిఫెస్టో దళిత శబ్ధానికి విస్తృతమైన అర్థాన్ని ఇచ్చింది.

***Who is dalit?***

*"members of sheduled castes and tribes,Neo- buddists, the working people, the landless and poor peasents,women and all those who are being exploited politically,economically and in the name of religion"-:* ***dali manifesto:1973;Bombay****...* దళితులు అంటే ఈ విధమైన నిర్వచనాలు,అభిప్రాయాలు కలవు.వాటిని ఈ కింది విధంగా చెప్పుకోవచ్చు.




పైన తెలిపిన అభిప్రాయాలను పరిశీలించినట్లయితే దళిత అనే శబ్దానికి అంతస్సూత్రం మాత్రం దళితుడు అంటే అంటరానివాడు, వెలివేయబడినవాడు అనే అర్థాలు ఉన్నాయి. దళిత పదం పట్ల స్పష్టమైన అవగాహన ఏర్పాటు చేసుకున్న తర్వాత ఎవరు దళితులు? ఏది దళిత సాహిత్యం అనే విషయంపై వాదోపవాదాలతో కూడిన అభిప్రాయాలు వచ్చాయి. దళితసాహిత్యం వచ్చిన తరువాత దళితులంటే ఎవరనే ప్రశ్న తలెత్తింది. కేవలం మాల, మాదిగలే దళితులు అన్న భావంతో మొదటి దళితసాహిత్యం వచ్చింది. ఆ తరువాత సమాజంలో వచ్చే మార్పులకి అనుగుణంగా అంటరానివారు, నిమ్నజాతులు, హరిజనులు అనే పదాల వాడకం అంతరిస్తూ తాడిత, పీడితులందరికి ప్రతీకగా దళితపదం నిలచిందని చెప్పవచ్చు. దళిత అనే పదం ఆత్మన్యూనతాభావాన్ని సూచించేదని కొందరి భావన. పూర్వం దళితులను అస్పృశ్యులు, పంచములు, ఛండాలురని పిలిచేవారు. మనం ముందే చెప్పుకున్నట్లు దళితులందరికి జాతీయోద్యమ కాలంలో గాంధీజి హరిజనులు అని పేరుపెట్టి విస్తృత ప్రచారం కల్పించారు. కానీ హరిజన అనే పదం అంబేద్కర్ దళిత ఉద్యమంలోకి వచ్చిన తర్వాత ఎక్కువ కాలం వాడుకలేదు. దళిత అనే పదం బాగా ప్రాచుర్యంలోకి

వచ్చింది. అంబేద్కర్ ఏ అర్థంలో అంటరాని వారందరికి దళిత శబ్దం ఆపాదించాడో అదే అర్థాన్ని సాహితీ విమర్శకులు తమ రచనల్లో వివిధ కోణాల్లో తెలియపరచారు.

**1.3.దళితులు – నిర్వచనాలు :**

మతం/కులం ప్రాతిపదికగా శతాబ్ధాల పాటు రాజకీయ, ఆర్థిక, సాంఘీక, సాంస్కృతిక అణచివేతలకు గురై, ప్రధాన జీవన స్రవంతికి దూరమై, తద్వారా స్వేచ్ఛ, గుర్తింపు కోల్పోయిన వారిని దళితులుగా చెప్పుకోవచ్చు.

*"భారతావనిలో సాంఘీకంగా, ఆర్ధికంగా, అణగద్రొక్కబడిన వారంతా దళితులే. ప్రధానంగా యస్సీలు,యస్టీలు, బి.సి లు మైనార్టీలు ఈ కోవకు వస్తారు* **"(పద్మారావు, కత్తి.దళిత సాహిత్యం జాషువా దృక్పథం: పుట:7)**

ఎవరు దళితులు అనే విషయాన్ని సవేరా వివరిస్తూ.....,

*"ధర్మసందేహమ్ము వలదు*

*నేటి ఎనుబది ఐదుగాగల*


*యస్.సి లు . యస్టీలు, బి.సి*

*మైనార్టీ స్త్రీలు వీరే దళితులు"* అని చెప్పారు.**(సవేరా, దళితుల ధర్మయుద్ధం)**

ప్రధానంగా సాహితీ విమర్శకుల మధ్య దళితులంటే ఈ క్రింది అభిప్రాయాలు ఉన్నాయి.

1. అస్పృశ్య కులాలు మాత్రమే దళితులు.
2. హరిజన, గిరిజన వర్గాలు మాత్రమే దళితులు.
3. హరిజన, గిరిజన, వెనుకబడిన తరగతులవారు దళితులు.
4. హరిజన, గిరిజన, వెనుకబడిన తరగతులు మరియు మైనార్టీ వర్గమంతా దళితులే.
5. యస్సీ, యస్టీ, బి. సి, మైనార్టీ వర్గాలతో పాటు స్త్రీలు కూడా దళితులే.

సాహిత్య రచనలకు పూర్వమే దళితులకు ప్రాచీన గ్రంథాల్లోను, పురాణ కావ్యాల్లోనూ అనేక పేర్లతో సంబోధించటం జరిగింది.వాటిని ఈ పట్టిక ద్వారా గమనించవచ్చు.




**అవర్ణులు:**

వర్ణం అంటే రంగు అనేది నిఘంటు అర్థం. అవర్ణం అంటే దీనికి వ్యతిరేక భావాన్ని కలిగించేది. భారతదేశంలో చాతుర్వర్ణ సిద్ధాంతం ప్రకారం బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనేవి ఉన్నాయి. వీటిలో ఏదో ఒక వర్ణానికి చెందిన వారిని సవర్ణులుగా నామకరణం చేశారు. చాతుర్వర్ణం లోపల లేని దళితులను మాత్రం అవర్ణులుగా పేర్కొన్నారు.

**అతి శూద్రులు:**

చాతుర్వర్ణ సిద్ధాంతం ప్రకారం శూద్రులు, అతి శూద్రులు అనే భావన ఒకటి వచ్చింది. వీరిలో శూద్రులు అనగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కులాలు. మిగతా దళిత కులాలను అతిశూద్రులుగా హిందూమతోన్మాదులు ముద్రించారు.

**అనార్యులు :**

భారతదేశం పైకి దాడికి వచ్చిన ఒక జాతి క్రమంగా వారి వారి సంస్కృతీ, సంప్రదాయాలను పాలితులపై బలవంతంగా రుద్దసాగారు. ఆ నేపథ్యంలో ఎవరైతే అప్పటికే స్థిరపడి ఉన్నారో వారిని అనార్యులుగా ముద్రించి దేశ మూలవాసులను వలసవాదులుగానూ, వలసవాదులను మూలవాసులుగానూ చిత్రీకరించారు.

**దస్యులు :**

సృష్టి కర్త బ్రహ్మ అని, బ్రహ్మ శరీర అవయవాల నుండి మానవులు పుట్టారనీ, వారికి కొన్ని స్థానాలు కేటాయించారు. బ్రహ్మ శరీరం నుండి జన్మించని వారు మ్లేచ్ఛ భాష మాట్లాడినా, ఆర్య భాష మాట్లాడినా సరే వారిని దస్యులు అని పిలవాలని మనువాదులు చెప్పారు.

**ప్రతిలోములు :**

మను ధర్మశాస్త్రం ప్రకారం మిశ్రమ వివాహాల వలన కలిగిన అంటే సంతానాన్ని అనులోమ, ప్రతిలోమాలుగా విభజించారు. తండ్రి లేదా తల్లి ఉత్తమ కులానికి చెందిన వారైన పక్షంలో వారి సంతతిని ప్రతిలోములు అన్నారు. మనువు ప్రతిలోములను అథమాథములుగా పరిగణించాడు.

**ఛండాలురు:** శూద్రుడైన తండ్రికి, బ్రాహ్మణ తల్లికి పుట్టిన సంతతిని చండాలురుగా పేర్కొన్నారు. మనువు వీరిని తీవ్రంగా ఖండించారు. వీరిని ఊరి వెలుపల మాత్రమే నివశించాలి అని ఒక శాసనం చేశారు.

**అంత్యజులు :**

వేద వ్యాసస్మృతి ప్రకారం చర్మకారులు, భటులు, భిల్లులు, రజకులు, పుస్కరులు, నటులు, వ్రతులు, మేదలు, ఛండాలురు, దాసులు, శ్వపాకులు, కొలికులు మొదలైన వారిని అంత్యజులు అంటారు.

**అంత్యవాసులు :**

అంత్య అనే పదానికి చివర అనే అర్థం కలదు. ఈ సందర్భంలో ఊరి చివర అనే అర్థం వాడారు. గ్రామాల చివర నివసించే వారిని అంత్యవాసులుగా పిలవటం మొదలుపెట్టారు.

**మ్లేచ్ఛులు :**

అర్థం లేని భాషలో మాట్లాడేవారిని మ్లేచ్ఛులుగా శతపథబ్రాహ్మణం పేర్కొంది. దీనిని బట్టి భాషాపరంగా వచ్చిన పేరుగా దీనిని గుర్తించవచ్చు. మనువు కాలంలో ఆర్య, మ్లేచ్ఛ భాషలు వాడుకలో ఉన్నట్లు తెలుస్తుంది.

**బాహ్యులు :**

తండ్రి ఉన్నత వర్ణానికి చెందిన వాడై తల్లి తక్కువ వర్ణంకు చెందినదై ఉంటే వారి సంతతిని అనులోములుగా పేర్కొంటూ ఆ సంతతిని బాహ్యులు లేదా వర్ణ బాహ్యులుగా చెప్పారు.

**హీనులు :**

ప్రతిలోములుగా పేర్కొన్న సంతతినే మనువు హీనులు అన్నాడు. వీరు బాహ్యులు కంటే తక్కువ స్థాయివారిగా గుర్తింపు పొందారు.

ఇలా చరిత్ర పరిణామ క్రమంలో వేరు వేరు రూపాలలో అసమానతలకు గురైన దళితులకు స్పృశ్య, అస్పృశ్య భావనలను జోడించి వారిని ఊరికి దూరంగా నెట్టివేయబడి అంటరానివారిగా, అస్పృశ్యులుగా చిత్రీకరించింది ఈ భారతీయ సమాజం. అంబేద్కర్ అస్పృశ్యత గురించి ఈ కింది అభిప్రాయాన్ని ఇలా వ్యక్తం చేశారు.

*"అస్పృశ్యత అనేది క్రీ.శ. 400 సంవత్సరంలో పుట్టిందని నమ్మకంగా చెప్పవచ్చు. ఆధిపత్యం కోసం బౌద్ధులకు, బ్రాహ్మణులకు మధ్య జరిగిన పెనుగులాటలో అస్పృశ్యత పుట్టింది".*(**అంబేద్కర్ రచనలు ప్రసంగాలు**, **సంపుటం;7**,**1994**,**పుట; 352**).

అంబేద్కర్ పేర్కొన్నట్లుగా సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా క్రీ.శ.4 వ శతాబ్దం నుండి జీవన స్రవంతికి దూరంగా బ్రతుకుతున్న వారికి పంచములు, హరిజనులు అని కూడా పిలిచారు.

**పంచములు :**

హిందూ మతంలోని వివిధ అణచివేత స్వభావాన్ని కొంత మార్పు చేసి వారి సేవలను వినియోగించుకోవటానికి అస్పృశ్యులను తిరిగి పంచమ వర్ణంగా చిత్రించారు.

**హరిజనులు :**

పంచములకు అపవిత్రత, అంటు అనే భావాలను ఆపాదించి, వీరు జన్మ ఎవరి ద్వారా జరిగిందో తెలియదు కాబట్టి వీరిని దేవుని బిడ్డలు అని పిలవటం మొదలుపెట్టారు. హరిజన అనే పదాన్ని మొదటగా నర్సీమొహత అనే బెంగాలీ రచయిత అనాథలకు సమానార్థకంగా ఈ పదాన్ని వాడినట్లు తెలుస్తుంది.

**అస్పృశ్యులు :**

వైదికమతానికి, బౌద్ధమతానికి మధ్య జరిగిన పోరు కారణంగానే ఈ అస్పృశ్యత అనేది చోటుచేసుకున్నట్లు చరిత్రకారులు భావిస్తున్నారు. వైదిక మతంలో ఉన్న జంతుబలులు బౌద్ధం వ్యతిరేకించింది. ఫలితంగా బౌద్ధమతానికి ఆనాటి ప్రజలు ఆకర్షితులు కావటం మొదలు పెట్టారు.దీనిని నివారించుటకే వైదిక మతస్థులు గోమాంస భక్షణ విడిచి శాఖాహారులుగా మారి వారి ప్రాధాన్యతను కాపాడుకోవటం ప్రారంభించారు. దీనిలో అంతర్భాగంగా పవిత్ర జంతువుగా ఆవుని పూజించడం ప్రారంభించారు. అప్పటికే గోమాంసం తింటున్న దళితులను

అస్పృశ్యులుగా ముద్రించి వారిపై ఆంక్షలు విధించినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తున్నది. **(తెలుగులో దళిత కవిత్వం రూపం-వస్తువు:పుట సంఖ్య: 4&5)**

పై అర్థాలను పరిశీలించినట్లయితే *" ప్రజాస్వామిక భారతావనిలో నేటికి అస్పృశ్యులుగా, దస్యులుగా,అవరర్ణులుగా ఈ సమాజంలో వివిధ పేర్లతో పిలవబడుతూ కులం,మతం ఆధారంగా ప్రధాన జీవన సంస్కృతికి దూరంగా కొన్ని వృత్తులు మాత్రమే చేసుకుంటూ ఎటువంటి సామాజిక,ఆర్థిక,రాజకీయ హోదా లేకుండా జీవన పోరాటం చేస్తున్న వాళ్ళు దళితులుగా "* చెప్పవచ్చు.

ఇంతకు ముందు చెప్పుకున్న దళిత శబ్ధ అర్థాలను, నిర్వచనాలను సూక్ష్మంగా పరిశీలించినట్లయితే దళిత అనేది విస్తృతమైన అర్థాన్ని,భావాన్ని కలిగి ఏ భావనల పట్ల దళితులు ఆకర్షితులు అయ్యారో, ఏ భావనల పట్ల దళితులు నిరసనలు తెలిపారో, దళిత అనే అంశంలో ఏయే భావజాలాలు అంతర్గతం అవుతాయో ఈ కింది విధంగా తెలపవచ్చు.

| దళిత వ్యతిరేక భావనలు | దళిత అనుకూల భావనలు |
|---|---|
| దేవుడు/విధి | సాంఘిక /ఆర్థిక అణచివేత |
| స్వర్గం | నాస్తికత్వం/హేతువాద దృక్పథం |
| కులం | మానవతా వాదం |
| కర్మ/పునర్జన్మ | విప్లవాత్మకమార్పు |
| ఆత్మ/పరమాత్మ | సమసమాజ స్థాపన |

### 1.4.దళిత సాహిత్యం నిర్వచనాలు :

దళితులు అనే పదానికి అర్థాన్ని ఏర్పరచుకోగలిగన తర్వాత దళిత సాహిత్యం ఏది అనే ప్రశ్న దళిత, దళితేతర రచయితల్లో మొదలైంది. దళిత

సాహిత్యాన్ని గురించి దళిత పదానికి అర్థాన్ని ఇచ్చినట్లుగానే అనేక మంది అనేక అభిప్రాయాలను వెల్లడించారు.

### 1.4.1.దళిత సాహిత్యం - తెలుగు రచయితల అభిప్రాయం :

*"దళిత సాహిత్యం అంటే స్పష్టంగా అంటరానివారుగా భావింపబడే సాహిత్యం"***(సాహిత్య సందర్శనం, ఇనాక్ , కొలకలూరి.పుట :88)**

*"అంబేద్కర్ సిద్ధాంతాలను తన గుండెకాయగా చేసుకొని నడుస్తున్న ఉద్యమమే నేటి దళితసాహిత్యమని చెప్పుకోవాలి"**(లక్ష్మీ నరసయ్య.జి.1999:పుట :2)***

*"దళిత జీవితాలను చిత్రించేది దళితుల ఆర్తిని, ఆవేదనను ఆవేశాన్ని, ఆగ్రహాన్ని, ప్రతిఘటనను ప్రతిబింబించేది దళితులకు మెరుగైన సుఖమైన అందరితో సమానమైన జీవిత గమనాన్ని నిర్దేశించేది దళిత చైతన్యాన్ని వ్యక్తీకరించేది దళిత సాహిత్యం"***(సత్యనారాయణ,యస్వీ.దళితసాహిత్య పరిణామంలో జాషువా, జాషువా సాహితీ ప్రస్థానం, 1995;105)**.

*"సాహిత్యంలో అగ్రకుల స్వభావం లేకుండా అడుగు వర్గాల వారికి ఆలోచనలను ప్రతిబింబింపచేసేదే దళిత సాహిత్యం"***(తిరుమలరావు, జయధీర్, దళిత గీతాలు; 1993: ముందుమాట)**.

" పశువుల మూగతనంలోంచి ఊరి బయట మూలుగుల్లోంచి దూడచర్మం, ఎద్దుకొమ్ము, సంస్కృతిలోంచి అక్షరాలు వెచ్చగా బయటకు వస్తూ కేవలం ఆర్థిక వాద సంకెళ్ళను చీల్చుకుంటూ దళితుల సొంతనెత్తురుగుండా ఒలుకుతున్న పలుకుల సముదాయమే దళితకవిత్వం" **(చిక్కనవుతున్నపాటః ముందుమాట)**.

దళిత సాహిత్యానికి ఈ దేశంలో కులనిర్మూలన స్పృహ ప్రధాన అంశం అని అద్దేపల్లి రామమోహనరావు తెలిపారు.

*“ నా కులమే గొప్పది అనుకోవటం, తన కులం వాళ్లతోనే ఎక్కువగా కలిసి పోవటం, ఎవరి గురించైనా మాట్లాడేటప్పుడు ముందు కులాన్ని చెప్పటం, ఎవరికైనా చెడుగానీ మంచిగానీ చెయ్యాలంటే తన కులంతో గుంపుకట్టడం, తాము పైకి రావాలంటే కులాన్ని నమ్ముకోవటం. తన కులంలోని వాడి గొప్పతనాన్ని మాత్రమే మనస్ఫూర్తిగా అంగీకరించటం కుల విభజనే మంచిదని ఈ రోజుల్లో కూడా నమ్మడం ఒకణ్ణి చూడగానే వీడు ఫలానా కులం వాడని మనసులోకి రావడం–ఇలాంటి సమీక్ష అంశాలు కులస్పృహ లో ఉన్నాయి. వీటన్నంటినీ నాశనం చెయ్యడమే కులనిర్మూలన స్పృహ. అయితే మనందరిలో ఈ విషయంలో కొంచమైనా బలహీనతలు ఉండవచ్చు కూడా. అయితే ఇది వర్గ నిర్మూలనా స్పృహ కంటే ఎక్కువ బలంగా అడుగడుగునా కనిపించే సత్యం. ఇది విస్మరించటమే దళితవాదం పుట్టడానికి పునాదిరాయి. ఉన్నతవర్గాల వలన పీడింపబడే  అట్టగడుగునా వర్గానికి చెందినవారు వర్గాల్ని తొలగించినట్లే అన్ని వర్ణాల చేత పీడింపబడే అవర్ణులై దళితులు మాత్రమే కులనిర్మూలన పోరాటాన్ని ముందుకు తీసుకుపోగలరు. ఈ పోరాటానికి తాత్త్విక భావాధారను ఇచ్చిన అంబేద్కర్ స్ఫూర్తి దళితసాహిత్యానికి వెన్నెముకగా నిలించింది”* **(రామోహనరావు, అద్దేపల్లి.1995; దళితసాహిత్యానికి నేపథ్యం ఏమిటి? ఆంధ్రప్రభ డైలీ సాహితీగవాక్షం).**

## 1.4.2. దళిత సాహిత్యం - ఆంగ్ల రచయితల అభిప్రాయం :

ఏది దళిత సాహిత్యం అన్న విషయాన్ని ప్రముఖ గుజరాతీ రచయిత సాహిత్యకారుడు హరీశ్ మంగళం ఈ విధంగా చెప్పాడు.

*“ Any works of literature which seeks to express in words the pulses of those sections of humaity which are oppressed and which are engaged in struggles for their Existence deserves to be called in the broadest sense Dalit literature”* **(Harish mangalam;1994,page**

***no.70.Dalita literature has been sectarion, indian literature, sahitya Akadami's by monthly journal jan-feb).***

*" దళిత సాహిత్యం మౌలికంగా ప్రజాసాహిత్యం ఒకవిప్లవాత్మక సంఘటన ఫలితంగా జనించిన తీవ్రమైన తిరుగుబాటు యొక్క వ్యక్తీకరణ రూపమే దళితసాహిత్యం" **(M.N. Warkhade friends the day of irresponsible writers is over poisoned Bread 1994; 31)***

"ప్రాథమికంగా దళితుల కోసం దళితులు రాసిన సాహిత్యం ***'kamalakar ganga-wane Social awareness in Dalit lterature, FAIDWC, 1994;19).***


"దేశంలో సామాజిక మార్పును సహజంగానే వేగవంతం చేసే నూతనవిలువలు, నూతన ఆలోచనలు నిండిన సాహిత్యమే దళిత సాహిత్యం " ***(kshirasagar, Dalit litearature the proceses of social change FAIDWC; 1994, 70).***

ఇదే విధంగా దళితసాహిత్యానికి, దళితేతర సాహిత్యానికి వ్యత్యాసాన్ని చెప్తూ బి.యస్ రాములు కింది విధంగా వ్యాఖ్యానించాడు.

*"దళితులే దళిత కవిత్వం రాయడం పురిటినొప్పులు పడుతున్న తల్లే తన బాధలు తను చెపుకున్నట్లు ఉంటే దళితేతరులు రాసే దళితకవిత్వం భార్య లోపల పురిటినొప్పులు పడుతుంటే బయట భర్తపడే బాధలాంటిది"* అంటాడు.

పై నిర్వచనాలను సూక్ష్మముగా పరిశీలించి చూస్తే *"అస్తిత్వ కోసం,ఆత్మగౌరవం కోసం చేసిన, చేస్తున్న పోరాటాన్ని అక్షర రూపంలో చిత్రిస్తూ దళిత ప్రజలను మేల్కొలిపే రచనా విధానాన్నే దళిత సాహిత్యం"* గా అభివర్ణించవచ్చు.

దళిత రచయితలు, దళితేతర రచయితలు సృజనీకరించిన సాహిత్యాన్ని , వారి రచన విదానాన్ని, రచనల్లో ఉన్న వస్తు,రూప,శిల్ప వైవిధ్యాన్ని మరియు రచనా నిర్మాణంలో గల బేధాన్ని ఈ కింది విధంగా చెప్పవచ్చు.




శతాబ్దాలుగా విద్యకు, విజ్ఞానికి, వికాసానికి దూరం చేయబడి దళితులు నేడు విద్యావంతులౌతున్నారు, ఆలోచిస్తున్నారు. సంఘటితులౌతున్నారు, చైతన్యవంతులు అవుతున్నారు,ఉద్యమిస్తున్నారు. సాటి దళిత సోదరులను చైతన్యపరచటానికి సాహిత్యాన్ని ఆయుధంగా ఉపయోగిస్తున్నారు. వీరి ఉద్యమాన్ని దళిత సాహిత్యంగా పరిగణిస్తున్నాం.

**1.5.దళిత సాహిత్యం - మౌలిక లక్షణాలు :**

సాహిత్యానికి కొన్ని లక్షణాలు ఉన్నట్లుగానే సూక్ష్మంగా పరిశీలిస్తే దళిత సాహిత్యానికి కొన్ని మౌలిక లక్షణాలు ఉంటాయని, దళిత సాహిత్యాన్ని ప్రస్తావిస్తూఆచార్య దార్ల వెంకటేశ్వరరావు దళిత సాహిత్యాన్ని ఎవరు రాసినా దాని మౌలిక స్వభావం పీడనంతవరకు దాన్ని దళిత సాహిత్యంగానే భావించాలని దళిత సాహిత్యానికి కొన్ని మౌలిక లక్షణాలు తెలియజెప్పారు.

1) ప్రాచీన సాంప్రదాయిక స్వభావం కలిగిన సామాజిక నిర్మాణాన్ని, కుల వ్యవస్థని తిరస్కరించటం.
2) స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం ఆశించే మానవతా దృక్పథాన్ని ఆశించటం.
3) హేతువుకు అందని అతీంద్రియ భావాలను తిరస్కరించటం.
4) వాస్తవికతకు ప్రాధాన్యమిచ్చి జీవితానుభవాలను సృజనీకరించటం.
5) వస్తువుకి రూపం, సహకారి కావటం, సాహిత్యం సామాజిక చైతన్యాన్ని ఆకాంక్షించేట్లు రూపొందటం. కళ సమాజం కోసమే అన్న దృక్పథానికి కట్టుబడటం.
6) సత్యం, శివం, సుందరం అనే భావాలను తిరస్కరించటం.
7) అణిచివేత దోపిడికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి సామాజిక, ఆర్థిక న్యాయం కోసం పోరాడటం.
8) కర్మ, పునర్జన్మ పరమాత్మ వంటి భావాలను నిరసించడం.
9) దళితుల భాషను, ఆచార వ్యవహారాలను గౌరవించి ఆత్మ గౌరవాన్ని పెంపొందించటం.
10) హిందూ మూఢత్వాన్ని ప్రభోధించే మత భావాలను తిరస్కరించి ప్రత్యామ్నాయ సంస్కృతిని రూపొందించటం.

11) అస్పృశ్యత కారణంగా దూరంగా విసిరేయబడిన వారిని ప్రధానజీవన స్రవంతిలో కలపటం, కులాన్ని నిర్మూలించటం ప్రధాన లక్ష్యాలుగా గ్రహించటం.

12) దళిత సాహిత్యం రాయడం వినోదం కోసం కాదనీ, సామాజిక చైతన్యం, సామాజిక పరివర్తనకు భాధ్యతాయుతమైన పనిగా గుర్తించటం, దళితులు రాజ్యాధికారం చేపట్టే విధంగా సాహిత్యం ప్రేరణ ఇవ్వడం. **(వెంకటేశ్వరరావు, దార్ల, వీచిక (సాహిత్య విమర్శవ్యాసాలు), పుట: 61,62).**

### 1.6.దళిత సాహిత్యం – లక్షణాలు :

1. హేతువాద దృక్పథం కలది
2. అంబేద్కర్ ఆలోచనలకు లోబడింది
3. అస్పృశ్యత నివారణ
4. అనుభవం ప్రధానంగా కలది
5. మానవతావాదాన్ని బలపర్చేది
6.శాస్త్రీయ దృక్పథాన్ని బలపర్చేది
7. ఆత్మగౌరవ ప్రధానం
8. కుల చైతన్యంతో కూడిన కుల నిర్మూలన
9.కళ కళ కోసం కాదు కళ సమాజం కోసం అన్న భావన కలిగింది
10. సంప్రదాయ భాషను ధిక్కరించటం

### 1.7.దళిత ఉద్యమం :

జాతీయోద్యమకాలంలో అస్పృశ్యత వ్యతిరేకంగా విస్తృత ప్రచారం జరిగింది. వామపక్ష ఉద్యమంలో భాగంగా కూడా కులతత్త్వంపై పోరాటం జరిగింది. వర్ణ దురహంకారాన్ని తీవ్రంగా ప్రతిఘటించడం కొనసాగింది. ఈ ఉద్యమాలు అన్నీ కూడా వర్ణవ్యవస్థపై ప్రత్యక్ష్యంగా తిరుగుబాటుకు పిలుపునివ్వలేదు. పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా వామపక్షాలు ప్రజా

ఉద్యమాలు చేపడుతున్నాయి. వీటికి భిన్నంగా డా.బి.ఆర్. అంబేద్కర్ సమానత్వం, సుఖమయ జీవితం, మానవవిలువల పరిరక్షణ అనే సూత్రాలను సామాజికన్యాయం సూత్రం ద్వారా త్రిముఖ పోరాటాన్నినిర్దేశించారు. ఈ మహనీయుని సిద్ధాంతాల ప్రాతిపదికపైన నడిచిన ఉద్యమాన్ని దళిత ఉద్యమం అంటున్నాం.

డా.బి.ఆర్. అంబేద్కర్ ముందే చాలా మంది సాంఘీక విప్లవకారులు సాగించిన వివిధ పోరాటాలు ఈ ఉద్యమానికి కావలిసిన తాత్విక, చారిత్రక, సామాజిక పోరాట నేపథ్యాన్ని సమకూర్చిపెట్టాయి. వీరిలో మొదటగా చెప్పదగినవారు నిమ్నవర్గాల ఉద్ధరణ కోసం మహారాష్ట్రలో మొదటిసారిగా జోతిరావుపూలే(1827-1890) తిరుగుబాటుకు పిలుపునిచ్చారు. 1874లో సత్యశోధక్ సమాజంను స్థాపించి, దళితులను జాగృతపరచడానికి విశేషమైన కృషి చేశారు. వీరితో పాటుగా పూలే సతీమణి సావిత్రిబాయి పూలే కూడా సనాతన సంప్రదాయాలపై అలుపెరగని పోరాటం చేసి, ముఖ్యంగా స్త్రీలలో చైతన్యం రావటానికి ఎంతో కృషి చేశారు. 1910 నాటికి దళితుల సమస్య ఒక ఆందోళన రూపం దాల్చింది. శివరామ్ కాంబ్లే నిమ్న జాతుల వారి మహాసభ ఏర్పాటు చేశారు. సోమవంశీయ మిత్ర అనే మాస పత్రికను వెలువరించాడు. అదే కాలంలో కర్మవీర్ షీండే దేశం నలుమూలలా వ్యాపించి నారాయణ గణేశ్ చందావర్కర్ సహకారంతో దళిత జాతుల సేవాసంస్థ స్థాపించాడు. 1918లో మార్చి 23,24 తేదీల్లో బొంబాయి మొదటిసారిగా అఖిల భారత దళితజాతుల సమావేశాలు జరిగాయి. ఇదే సమయంలో 1924 మార్చిలో డా.బి.ఆర్ అంబేద్కర్ అస్పృశ్యతా నివారణోద్యమాన్ని మొదలుపెట్టారు.అస్పృశ్యత అనేది క్రీ.శ.400 సంవత్సరంలో పుట్టిందని నమ్మకంగా చెప్పవచ్చు. ఆధిపత్యం కోసం బౌద్ధులకు, బ్రాహ్మణులకు మధ్య జరిగిన పెనుగులాటలో అస్పృశ్యత పుట్టిందని అంబేద్కర్ భావించాడు. అస్పృశ్యత అనుభవిస్తున్న వాళ్లు మేము మనుషులమే

అనే గుర్తింపు మేము బాధను అనుభవిస్తున్నాం అనే స్పందన ఇలా ఎన్నాళ్ళు బాధలు పడాలి అనే నిరసన, మమ్మల్ని ప్రేమించండి అనే అభ్యర్ధన, ఘటన, సంఘటన ప్రతి ఘటన ఎదిగి అస్పృశ్యులు ఘర్షణ పడ్డారు. ఆ ఘర్షణే దళిత ఉద్యమం అయ్యింది. ఆ దళిత ఉద్యమ చైతన్యాలనుండే దళితసాహిత్యం వెలువడింది. మార్చి 9న బొంబాయిలోని దామోదర్ హాల్ లో దళితుల సమావేశం జరిగింది. అక్కడే బహిష్కృత హితకారిణి సభ రూపొందింది. అంతేకాకుండా డా.బి.ఆర్.అంబేద్కర్ శూద్రులెవరు? కులనిర్మూలన, అస్పృశ్యులెవరు? భారతదేశంలో కులాలు, రాముడు ఆదర్శపురుషుడా? మొదలైన పుస్తకాలు ఈ ఉద్యమానికి ప్రోత్సాహం కలిగించాయి. దళిత సమస్య అనేది ఒక పాత ప్రశ్న ఒక కొత్త సవాలు. మొత్తం దళిత ఉద్యమాన్ని రెండు రకాలుగా చూడవచ్చు అని చిన్నారావు యాగాటి తెలియజెప్పారు.

1) సామాజిక, ఆర్థిక, అసమానతలను, అంటరానితనాన్ని అశాస్త్రీయ హేతు విరుద్ధ మత విశ్వాసాల్ని బానిసత్వాన్ని, అనుమతించిన హిందూ సామాజిక వ్యవస్థను నెలకొల్పేందుకు పూనుకోవడం.
2) దళితేతరులు తమ మీద వేసిన ముద్రను చెరిపేసుకొని దళితులు తమ సొంత గుర్తింపు కోసం పోరాడటం ***(చిన్నారావు, యాగాటి. దళిత ఉద్యమ చరిత్ర:, పుట:1).***

వీరితో పాటుగా దళిత ఉద్యమానికి భారతదేశంలో వచ్చినటువంటి అనేక సామాజిక ఉద్యమాల స్ఫూర్తి కూడా ఉంది. అందులో ప్రధానంగా చెప్పుకోదగినది భక్తి ఉద్యమం.అదేవిధంగా 11 వశతాబ్దంలో కర్ణాటకలో వచ్చిన సంప్రదాయ వ్యతిరేక లింగాయత్ ఉద్యమం, 13 వశతాబ్దంలో మహారాష్ట్రలో వచ్చిన సనాతన కాని మహానుభవ ఉద్యమం, 15వశతాబ్దంలో వచ్చిన సిక్కు ఉద్యమం, వీరితో పాటుగా కుల నిర్మూలనకు వ్యతిరేకంగా బెంగాలీలో చండీదాస్, హిందీలో కబీర్ దాస్, పంజాబ్ లో గురునానక్, కన్నడంలో సర్వజ్ఞ, తెలుగులో పోతులూరి

వీరబ్రహ్మం, వేమన ప్రవచనాలు కులనిర్మూలనకు ఆసరగా నిలిచాయి. దళిత ఉద్యమం రావటానికి గల ప్రధాన కారణం దళితులపై జరుగుతున్న దాడులు, వారిపై అగ్రవర్ణాల వారు చూపే వివక్షతే. దళితులపై జరుగుతున్న హింసను ప్రధానంగా నాలుగు రకాలుగా దళితరాజకీయాలు అనే పుస్తకంలో వివరించారు.

1) దళితులు హింసాదౌర్జన్యాలకు గురవుతున్న సంఘటనల్లో అత్యధికశాతం భూమి సమస్యకు సంబంధించినవే ఉన్నాయి. బీహార్, ఉత్తరప్రదేశ్ , తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ లో యిటువంటి దౌర్జన్యాలు ఎక్కువగా జరిగాయి.

2) భూమి సమస్య తర్వాత దళితులు అత్యధికంగా దాడులు గురవుతున్నది అగ్రవర్ణాల పరువు ప్రతిష్టలకు భంగం కలిగించారన్న నెపంతోనే.

3) దళితుల మీద అగ్రవర్ణాల ఆగ్రహం కలిగితే దాన్ని తీర్చుకునేందుకు దళిత స్త్రీల మీద దాడులకు, లైంగిక అత్యాచారాలకు పాల్పడటం తరతరాలుగా సాగుతూవస్తున్నది. దళిత కులంలో పుట్టినందుకు అందులోనూ స్త్రీలుగా పుట్టినందుకూ దళిత స్త్రీలు దారుణమైన హింసనూ, అవమానాలనూ ఎదుర్కోవాల్సి వస్తుంది.

4. దళితుల మీద మరొక రకమైన దౌర్జన్యాలను పోలీసుల నుండి ఎదురవుతున్నాయి. దళితులు తమ సమస్యల మీద ఆందోళనలకు దిగినప్పుడల్లా శాంతి భద్రతలు కాపాడే నెపంతో పోలీసులు ఆయుధాలు దళితులనే బలి తీసుకుంటున్నాయి. (**దళితరాజకీయాలు**, **రామ్ పునియానీ. తెలుగు కాత్యాయని; హైదరాబాదు బుక్ ట్రస్ట్**, **జూన్**, **2004.పుట:6,7,8,9**). దళిత ఉద్యమం దీని నేపథ్యంగా వచ్చిన దళితసాహిత్యం రావటానికి గల ప్రధాన హేతువు దళిత బహుజనుల పట్ల అగ్రవర్ణాల ప్రజలు చూపించే అంటరానితనం. అంటరానితనం వలనే దళిత ప్రజలపై దాడులు ఇవి అనేక రూపాల్లో అనేక విధాలుగా ఆయా స్థాయిలను బట్టి

జరుగుతున్నాయి. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ లో దళితులపై అగ్రవర్ణాల ప్రజలు చూపించే అంటారానితన రూపాలను ప్రముఖ దళిత ఉద్యమ రచయిత కలేకూరి ప్రసాదు '***ఆంధ్రప్రదేశ్ దళితులు***' అనే పుస్తకంలో కింది విధంగా పేర్కొన్నారు.


1. ఉమ్మడి మంచి నీటి వనరుల్లోకి దళితులను అడ్డుకోవడం.
2. అగ్రకులాల వారు నీళ్ళుతోడుకునే వరకు దళితులను ఆగమనటం.
3. దళిత వాడకు మంచి నీటి సరఫరా నిలిపివేయటం
4. దళితవాడకు కరెంట్ సరఫరా నిలిపివేయటం.
5. హోటల్లో దళితులకు ప్రత్యేకంగా గ్లాసులుండటం.
6. బహిరంగ ప్రదేశాల్లో అగ్రకులాలతో సమానంగా కూర్చోనివ్వకపోవటం.
7. ఉమ్మడి బంతుల్లో దళితులకు చివర వడ్డించటం.
8. దళితులు తిన్న పళ్ళాలను వారితోనే శుభ్రం చేయించటం.
9. దేవాలయ ప్రవేశాన్ని నిషేధించటం.
10. అగ్రకులాల వారు నివశించే ప్రదేశాల్లో దళితులను చెప్పులు వేసుకొని నడవనీయక పోవడం.
11. అగ్రవర్ణాల వారి ముందు గొడుగు వేసుకోకపోనీయడం.
12. మంచి బట్టలు వేసుకోకపోనీయడం.
13. అగ్రకులాలవారు వచ్చినప్పుడు కూర్చొన్న దళితులు లేవాల్సి రావడం.
14. బస్సుల్లో అగ్రకులాల వారు వస్తే సీట్లు ఖాళీ చేయటం
15. బస్సుల్లో దళితుల్ని ప్రత్యేకంగా కూర్చోబెట్టడం.
16. రచ్చబండ మీద దళితుల్ని కూర్చోనివ్వక పోవటం
17. అగ్రకులాల వారి ఇళ్ల సమీపంలో దళితులు ఇళ్ళు కొనుక్కోవడానికి, అద్దెకు తీసుకోవడాన్ని నిషేధించటం.
18. కులం పేరుతో దూషించటం, అవమానించటం.

19. అగ్రకులాలవారి అంత్యక్రియలకీ, ఉత్సవాలకీ దళితుల చేత బలవంతంగా డప్పు కొట్టించటం.
20. ఓటు హక్కును వినియోగించుకోకపోనివ్వడం.
21. ఓటర్ల లిస్టు నుండి పేర్లు తొలగించటం
22. ఎన్నికల్లో దళితుల ఓట్లు తామే వేసుకోవడం
23. బలవంతపు వెట్టి చాకిరీ
24. దళితులు జీవన భృతిని పొందే హక్కును తిరస్కరించడం
25. చట్ట ప్రకారం కనీస వేతనాన్ని చెల్లించలేకపోవడం
26. దళితుల మతపరమైన ఊరేగింపులను ఊళ్ళో అనుమతించకపోవటం
27. దళితులకు సాగునీటిని అందుబాటులో లేకుండా చేయడం
28. దళితులకు భూమిపైన హక్కుల్ని నిరాకరించటం, సాగు హక్కుల్ని నిరాకరించటం
29. ఎన్నికైన దళిత ప్రజా ప్రతినిధులను తమ అధికారాలను వినియోగించుకోకుండా అడ్డుకోవడం.
30. వాగుల్లో వంకల్లో ఎగువ భాగానికి దళితులను వెళ్ళనివ్వకుండా దిగువ భాగాన్నే వినియోగించుకోమనడం.
31. ఒకే నీటి వనరుల్లో వేరు వేరు స్నాన ఘాట్టాలుండటం.
32. దళితులకు క్షవరం చేయకపోవడం.
33. విద్యావంతులైన దళితులు మంచి బట్టలు వేసుకుంటే సహించకపోవటం
34. చచ్చిన పశు కళేభరాలను, శవాలను ఎత్తివేయించటం
35. అగ్రవర్ణాల వారి ఉత్సవాలలో సంప్రదాయక సేవలను ఉచితంగా చేయించడం.***(ప్రసాదు, కలేకూరి. ఆంధ్రప్రదేశ్ దళితులు;పుట:41,42).***

పైన పేర్కొన్న ఇన్ని రూపాల వివక్షత జరుగుతున్న నేపథ్యాన్ని, ఒక్కొక్క సంఘటన పూర్వోత్తరాలని పరిశీలిస్తే ఈ అంటరానితనం నెపంతో దాడులు, సాంఘీక

బహిష్కరణల వెనుక ఒక అంతిమ లక్ష్యం కనిపిస్తుంది అది ఏమిటంటే ఆధిపత్య వర్గం అనాధిపత్య వర్గాన్ని దోచుకోవడానికి చేసే సామూహిక కుట్ర అని మనకు స్పష్టమవుతుంది. కనుక దళితులు ఈ సంకెళ్ళ నుండి విముక్తి పొందాలనీ, సాంస్కృతికంగా,సాంఘీకంగా, ఆర్థికంగా తమ హక్కుల్ని పొందాలని పోరాడుతున్నారు.

డా.బి.ఆర్.అంబేద్కర్ రాజ్యంగ రచనలో కల్పించిన కొన్ని ప్రత్యేక హక్కుల వలన కొంత వరకు చట్టాలు, శాసనాల రూపంలో అంటరానితనం తగ్గినప్పటికీ పూర్థిస్థాయిలో తగ్గకుండా అదే వేరువేరు రూపాల్లో అమలవుతూనే ఉంది.ఆధునిక కాలంలో అంటరానితనం పట్ల మూడు దృక్పథాలు ఉన్నట్లు డా.యాగాటి చిన్నారావు తెలిపారు. (**చిన్నారావు యగాటి**, **పుట:17**)




అంటరానితనం అనేది పట్టణీకరణ పెరగడం వలన ఏర్పడిందనీ, అశుభ్రత సాంప్రదాయికంగా అపవిత్రంగా భావింపబడే వృత్తుల ఫలితమే అంటరానితనం – ప్యూరర్ హైమన్ డార్స్(**చిన్నారావు**, **యాగాటి.పుట :21**) ఈ అంటరానితనానికి మూలం చరిత్రలో కోకొల్లుగా ఉన్నాయి. చరిత్రలో యుద్దంలో ఓడించి బానిసలుగా చెయ్యడం, పాలకులు పాలితులపై తమ సంస్కృతిని రుద్దటం వంటి కార్యకలాపాలే తర్వాతి కాలంలో అంటరానితనానికి నాంది అయ్యాయి. అయితే ఇప్పుడు కొంతవరకు దళిత ప్రజలు ఆంగ్లవిద్యాభ్యాసం,

శాస్త్రసాంకేతిక రంగాల పరిజ్ఞానం వలన అన్ని రంగాల్లో తమదైన ముద్ర వేసుకొని, అదే ప్రధాన జీవన స్రవంతిగా నిరూపించుకొని. విద్య సామాజికరణకు, చైతన్యానికి ప్రతీకగా, సామాజిక, సాంస్కృతిక మార్పునకు ప్రతీకగా తీసుకోవడం జరిగింది. తరువాత వచ్చినటువంటి మానవతావాదం, ఉదారవాదం, హేతువాద భావాజాల పరంగా కొంత చైతన్యం పొందారు.

నేడు దళిత ఉద్యమం అంబేద్కర్ ఆలోచనల్నీ మరింత పదును పెట్టి బ్రాహ్మణీయ ఆధిపత్యాన్ని అంతంచేసే దిశగా కులసమాజం కూలిపోయే దిశగా ఒక మంచి మానవీయ సమాజాన్ని పున:నిర్మించే దిశగా పోరాటం చేయాల్సి ఉంది.ఈ పోరాటల ద్వారా ప్రత్యామ్నాయ చరిత్ర, సంస్కృతి, తత్త్వ శాస్త్రాలు పున:నిర్మించుకోగలుగుతాము. దళిత ఉద్యమం అనేది అణచివేతకు గురవుతున్న కులాలు సంఘటితమై స్వేచ్చ, సమానత్వము, సౌభ్రాతృత్త్వం సహజీవనముతో కూడిన సామాజిక న్యాయం కోసం జరుగుతున్న రాజకీయాధికార దిశగా సాగుతున్న సామాజికపోరాటం. దళిత ఉద్యమం ప్రధానంగా మూడు లక్ష్యాలతో సాగింది.

1. బ్రాహ్మణీయ హిందుత్వ భావజాలాన్ని చీల్చి చెండాడటం
2. ప్రత్యామ్నాయాల ద్వారా అగ్రవర్ణ సాంస్కృతిక ఆధిపత్య విధానాలను ఎదిరించటం.
3. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వ సాధనకోసం దళిత ప్రజలను సంఘటిత పరచటం

దళిత ఉద్యమానికి ఆసరాగా అనేక చోట్ల దళిత ప్రజల్లో చైతన్యం వచ్చి ఆయా ప్రాంతాల వారిగా కులనిర్మూలన ఉద్యమాలు కొనసాగించారు.

ఆంధ్రదేశంలో జాతీయోద్యమం బలపడుతున్న దశలో కాంగ్రెస్, జస్టీస్ పార్టీ ఆధ్వర్యంలో సుమారు 1910 సంవత్సరం నుండి బ్రాహ్మణేతర కుల మహాసభలు జరిగాయి.

అవి,

1. 1910లో కృష్ణా జిల్లా కవుతపురంలో ప్రప్రథమ కమ్మజన మహాసభ జరిగింది.
2. 1913లో కాపుజన సాహిత్య మహాసభ జరిగింది.
3. 1917లో కాంగ్రెస్ జరిపిన సభకు పోటీగా జస్టీస్ పార్టీ షన్మండల జిల్లాల బ్రాహ్మణేతర మహాసభ జరిపించింది. దీనికి చల్లాపల్లి జమిందారు నాయకత్వం వహించారు.
4. 1917 సెప్టెంబరులో కాంగ్రెస్ నాయకత్వంలో త్రిపురనేని రామస్వామి అధ్యక్షులుగా బెజవాడలో జాతీయ బ్రాహ్మణేతర మహాసభ జరిగింది.
5. 1917లో రెడ్డి జన మహాసభ నెల్లూరులో జరిగింది. ఈ సభలో కట్టమంచి రామలింగారెడ్డి బెజవాడ గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.
6. 1929లో జూన్ 10వ కమ్మ మహాజనసభ కృష్ణా జిల్లా అంగలూరులో జరిగింది.(**సి.వి.2000:పుట:25-26**).

అదే *విధంగా హరిజన మహాసభలు కూడా జరిగాయి.*

1. 1908 ఏప్రియల్ 20న కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఆంధ్ర సంస్కరణవాదుల మహాసభ జరిగింది. దీనికి సభాధ్యక్షుడు భోగరాజు పట్టాభిసీతారామయ్య, కార్యదర్శి ముట్నూరి కృష్ణారావు .ఈ సభలో హరిజనుల అభివృద్ధి పాఠశాలలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు.
2. 1917 సెప్టెంబరులో విజయవాడ నందు మొట్టమొదటి ఆంధ్రదేశ ఆది ఆంధ్రుల మహాసభ అయ్యదేవరకాళేశ్వరరావు నిర్వహించారు. భాగ్యరెడ్డి ఈ సభలకు అధ్యక్షత వహించారు.
3. 1921లో మార్చి 18న ఆదిఆంధ్ర అంటునివారణ సభ ఏలూరులో జరిగింది. ఈ సభకు గూడూరి రామచంద్రరావు అధ్యక్షత వహించారు.

4. 1922లో రెండవ ఆంధ్రప్రదేశ్ ఆది ఆంధ్రుల మహాసభ గుడివాడలో జరిగింది.
5. 1922లో మూడవ ఆంధ్రప్రదేశ్ ఆది ఆంధ్రుల మహాసభ ఏలూరులో జరిగింది.
6. 1924లో నాల్గవ ఆంధ్రప్రదేశ్ ఆది ఆంధ్రుల మహాసభ ఏలూరులో జరిగింది.
7. తెలంగాణ ప్రాంతంలో 1921, 1922, 1923, 1924, 1931 లో హరిజన మహాసభలు జరిగాయి. ఇవన్నీ హైదరాబాదులో జరిగాయి.
8. 1925లో డిసెంబరు 27 తేదీన ప్రథమ ఆంధ్రప్రదేశ్ ఆదిఆంధ్రుల మహాజనసభ ఏలూరులో జరిగింది. ఈ సభకు కుసుమ ధర్మన్న అధ్యక్షత వహించారు.
9. 1932లో డిసెంబరులో 25న విశాఖపట్నంలో దశమ హరిజన మహాసభ జరిగింది. ఈ సభకు కుసుమ ధర్మన్న అధ్యక్షత వహించారు.
10. 1936 అక్టోబరు 21న ఆంధ్రప్రథమ ఆదిజన సంపూర్ణ స్వాతంత్ర మహాసభ విజయనగరంలో జరిగింది. ఈ సభకు కుసుమ ధర్మన్న అధ్యక్షత వహించారు.
11. 1942లో జూలై 1న ఆదిఆంధ్రమహాసభ తెనాలిలో జరిగింది. ఈ సభకు గోవిందదాస్ అధ్యక్షత వహించారు.**(సి.వి.2000:42)**.

ఇదే విధంగా తెలంగాణా ప్రాంతం హైదరాబాదులో కూడా దళిత ఉద్యమం జరిగింది.1906లో భాగ్యరెడ్డి వర్మ జగన్ మిత్ర మండలి ఏర్పాటు చేసి యువతను ఉద్యమం వైపు నడిపించడం, 1911లో మన్య సంఘంను స్థాపించడం, అరిగె రామస్వామి సునీత బాల సమాజం (1885– 1973), 1922 లో ఆది హిందూ జాతీయోన్నతి సభ ఏర్పాటు. భాగ్యరెడ్డి వర్మ 1932లో

35 మంది దళిత కార్యకర్తలతో ఒక స్వస్తిక్ దళ్ ను ఏర్పాటు చేయడం వంటి కార్యకలాపాలు దళిత ఉద్యమానికి మరింత స్ఫూర్తినిచ్చాయి.

దళిత ఉద్యమంలో భాగంగానే 1920–1930 ఆది ఆంధ్ర ఉద్యమం మొదలైంది. ఆదిఆంధ్ర అన్న పదం 1917కు ముందే వాడుకలోకి వచ్చింది. భారతదేశంలో వచ్చినటువంటి ద్రావిడోద్యమం,అర్యేతర ఉద్యమాల ప్రభావంతో దళితులు తమని తాము ఆదిఆంధ్ర, ఆదిద్రావిడ, ఆదికర్ణాటక అని పరిగణించుకుంటూ ఈ ప్రాంతపు మూలవాసులుగా చాటుకోవటం ప్రారంభించారు.

ఇంతటి పెద్ద ఎత్తున ఉద్యమం జరుగుతున్నప్పటికీ దళిత ప్రజల్లో చైతన్యం పూర్తి స్థాయిలో రాలేకపోయింది. అందువలన కూడా దళిత ప్రజల ఆకాంక్షలు పూర్తి స్థాయిలో నెరవేరక ఇప్పటికీ అలాగే ఉన్నాయి. దీనికి ప్రధానంగా ఈ కింది కారణాలు చెప్పవచ్చు.

1. కోస్తాంధ్ర ప్రాంతంలో క్రైస్తవ మత ప్రభావం
2. రాయలసీమలో ముఠా తగాదాల ప్రభావం
3. తెలంగాణాలో కమ్యూనిజం ప్రభావం.


మా పోరాటం సంపద కోసం స్వాతంత్ర్యం కోసం అనే అంబేద్కర్ నినాదంతో దేశవ్యాప్తంగా దళిత ఉద్యమం నడించింది. 1920లో దశాబ్దిలో దళిత ఉద్యమం రెండు పంథాలుగా కొనసాగింది. మొదటి పంథా హిందూయిజం నుంచి దళితులు స్వయంప్రతిపత్తిని సాధించాలనే పంథా ఒకటి. ఇది అగ్రకుల హిందువులకా? సామాజిక రాజకీయ నిర్మాణం నుంచి దళితులు వైదొలగాలనే నిర్ణయం. రెండవ పంథా హిందూయిజంతో దళితులు సంలీనం కావాలనే పంథా. దీనిని భాగ్యరెడ్డి వర్మ ఆంధ్రలోని ఆది అంధ్ర సంఘాలు బలపరిచాయి. సంలీన పంథాను హైదరాబాదు అరిగె రామస్వామి చౌదరి నాగపూర్ లో కిసాన్ ఫగూ, డాన్ సోగే ఇ.ఎ గవాయి, మైసూర్ లో దరిదాపు మొత్తం దళిత నాయకులు

ఆదరించారు. నేటి కులవ్యవస్థ కింద భారతజాతి కుదించుకుపోతుంది. గిడసబారి పోతుంది. ఎదగలేకపోతుంది. దేనికైనా నైతిక హాని చాలా చెడ్డది అని అంబేద్కర్. కాంగ్రెస్ పార్టీ బ్రాహ్మణీయ పెట్టుబడిదారీ పార్టీ అనీ, గాంధీ యుగం అంధకార యుగం అని అంబేద్కర్ అభిప్రాయం. ఇన్ని ఒడిదుడుకుల మధ్య దళిత ఉద్యమ ప్రయాణం కొనసాగింది.

దళిత ఉద్యమం అస్పృశ్యత అనుభవిస్తున్న వాళ్ళు మేము మనుషలమే అనే గుర్తింపు, మేము భాధను అనుభవిస్తున్నాం అనే స్పందన ఇలా ఎన్నాళ్ళు బాధలు పడాలి అనే నిరసన, మమ్మల్ని ప్రేమించండి అనే అభ్యర్ధన, ఘటన,సంఘటన, ప్రతిఘటన ఎదిగి అస్పృశ్యులు సంఘర్షణ పడ్డారు.ఆ ఘర్షణే దళిత ఉద్యమయ్యింది. దళిత ఉద్యమ చైతన్య స్ఫూర్తి నుండే దళిత సాహిత్యం ఆవిర్భవించింది. దళితసాహిత్యం పుట్టుకపైన అనేక అభిప్రాయాలు ఉన్నాయి. దళితసాహిత్యం క్రీ.పూ.6 0వ శతాబ్ధంలో బుద్ధుడుతో మొదలైందని, క్రీ.శ. 14వ శతాబ్ధంలో చోఖిమేలుడితో మొదలైందని, తర్వాత కాలంలో మహాత్మ జోతిబాపులే(1828-1890)తో మొదలైందని, అంబేద్కర్ తో ఆరంభమైందని భిన్న వాదనలు ఉన్నాయి.

బుద్ధుని బోధనలు అన్ని సమాజాన్ని కేంద్రంగా చేసుకొని అన్ని వర్గాల ప్రజలకు ఆదర్శంగా ఉంటాయి. అంతేకాకుండా హిందూ ధర్మసూత్రాలకు వ్యతిరేకంగా ఉంటాయి. ఏయే హిందూ ధర్మసూత్రాలు అస్పృశ్యులని దళితులను ముద్ర వేసిందో ఆ దళితులు బుద్ధుని బోధనల పట్ల ఆకర్షితులయ్యారు తద్వారా దళిత ఉద్యమానికి బుద్ధుని బోధనలను ఆదర్శంగా తీసుకున్నారు. తర్వాత మహాత్మ జ్యోతి బాపూలే తమ రచనల ద్వారా దళితుల్లో నూతన ఉత్తేజాన్ని ఏర్పరచారు. సావిత్రిబాయి పూలే తమ రచనల ద్వారా స్త్రీల విద్యాభివృద్ధికి పాటుపడింది. ఈ దశలో కేవలం దళితుల్లో నిరసనతో కూడిన స్పందన మాత్రమే ఉంది. డా.బి.ఆర్.అంబేద్కర్ దళిత ఉద్యమాల్లోకి రాకముందు కేవలం నిరసన,

స్పందన, వ్యతిరేక భావనలు మాత్రమే అంటే దళితుల్లో కేవలం సంఘర్షణలు ఉండేవి. అంబేద్కర్ వచ్చిన తర్వాత దళితుల యొక్క ఆలోచనలు మారాయి, ఆశయాలు మారాయి ఇన్నాళ్ళు మమ్మల్ని గుర్తించండి, మేము మనుషులమే అనే అభ్యర్ధనలు పోయి తిరుగుబాటు వచ్చింది. ఇంతకు ముందు ఉన్న నిరసన,ఘటన, స్పందనలు పోయి ప్రతిఘటన, ప్రతిస్పందనలు దళితుల్లో వచ్చాయి. అంబేద్కర్ రాకముందు ఒక తాత్విక దృక్పథం లేదు. గత ఉద్యమ స్ఫూర్తిని అంతా స్వీకరించి, దళితులను విద్యావంతులుగా చేసి దళితుల ఆత్మగౌరవం కోసం సామాజిక, సాంస్కృతిక, ఆర్ధిక విముక్తి కోసం పోరాడాల్సిన ఆవశ్యకతను దళితుల్లో రేకెత్తించి దళిత ఉద్యమ చైతన్యానికి ఒక సమగ్రమైన భూమికను అందించిన వాడు డా.బి.ఆర్.అంబేద్కర్. అంబేద్కర్ అందించిన తాత్విక నేపథ్యాన్ని ఆధారంగా చేసుకొని దళిత ఉద్యమాన్ని మరికొంత ముందు చూపుతో రాజ్యాధికార దిశగా పయనింప చేసినవాడు మాన్యశ్రీ కాన్షీరాం. కాన్షీరాం తర్వాత దళిత ఉద్యమం అంతర్గత బేధాలతో నడుస్తున్న దళిత ఉద్యమం ప్రస్తుత దశ. అంటే దళిత ఉద్యమం మొన్న నిన్న ఆవిర్భవించింది కాదు క్రీ.పూ.నుండే ఉంది. కాకపోతే అది క్రమక్రమంగా ఘటన, స్పందన ద్వారా వ్యక్తమవుతూ వచ్చింది. దళిత ఉద్యమం బుద్ధుని కాలంలో ప్రారంభమై, జ్యోతిబాపులే కాలం నాటికి వికసించి, అంబేద్కర్ కాలం నాటికి పూర్తి పరిణితి చెంది, కాన్షీరాం కాలానికి ప్రతి దళితుడిలో చైతన్యం రేకెత్తించి. ప్రస్తుత కాలంలో అంతర్గత విబేధాలతో ముందుకు ఒక అడుగు, వెనుకకు రెండు అడుగులు వేస్తూ దళిత ఉద్యమం పయనిస్తుంది. అంటే దళిత ఉద్యమాన్ని మొత్తం ఐదు దశలుగా అధ్యయనం చేయవచ్చు. 1.బుద్ధుని కాలం 2. జోతిరావుపూలే కాలం 3. అంబేద్కర్ కాలం 4. కాన్షీరాం కాలం 5. ప్రస్తుత దళిత ఉద్యమం




ఈ ఉద్యమం జరుగుతున్న క్రమంలో ఇన్నాళ్ళు శ్రమదోపిడి, రాజకీయ దోపిడి, ఆర్థిక దోపిడితో పాటు సామాజిక, సాంస్కృతిక, సృజనాత్మక దోపిడికీ గురవుతున్న దళిత రచయితలు తమదైన రీతిలో ఉద్యమానికి ఊపందిస్తూ, పాటలు, కవిత్వం, పద్యాలు మొదలైన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చే ప్రయత్నంచేశారు. ఆ ప్రజల్లో చైతన్యం తెచ్చిన సృజనాత్మక రచనలనే మనం ఈనాడు దళిత సాహిత్యంగా చెప్పుకుంటున్నాం.

దళిత ఉద్యమాన్ని అది వచ్చిన తీరుని క్షుణ్ణంగా పరిశీలిస్తే దళిత ఉద్యమానికి కొన్ని లక్ష్యాలు, మరికొన్ని లక్షణాలు ఉన్నాయని వాటి ప్రాదిపదికనే దళిత ఉద్యమం నడుస్తుందని అర్థమవుతుంది.

### 1.8.దళితఉద్యమం – లక్ష్యాలు :

1. దేవుడు, విధి, కర్మ, పునర్జన్మ, ఆత్మ, స్వర్గం, నరకం వంటి అతీంద్రీయ భావనలను తిరస్కరించటం/వ్యతిరేకించడం
2. నాస్తికత్వాన్ని, హేతువాద దృక్పథాన్ని పెంపొందించడం
3. శాస్త్రీయ దృష్టిని అలవరచడం
4. తిరుగుబాటు తత్వాన్ని పెంపొందించడం
5. అణగారిన ప్రజలను చైతన్యపరచడం

6. సామాజిక అవగాహన దళితుల్లో కల్పించడం
7. సాంఘీక, రాజకీయ. సాంస్కృతిక, ఆర్థిక, విద్య తదితర రంగాలలో సమానత్వాన్ని పెంపొందించడం
8. ఆత్మగౌరవ పునరుద్ధరణ
9. కులనిర్మూలన సాధించడం
10. సమసమాజ స్థాపన సాధించడం

**1.9.దళిత ఉద్యమం-లక్షణాలు :**

1. ఆత్మన్యూనతను పోగొట్టి, ఆత్మగౌరవాన్ని పెంపొందించడం
2. శాస్త్రీయతకు కట్టుబడి ఉండడం
3. సామాజిక అవమానాన్ని వ్యతిరేకించడం
4. నిరూపణకు దగ్గరగా ఉండే అంశాలకు ప్రాధాన్యం
5. సామాజిక సాంస్కృతిక మార్పును కోరుకోవడం
6. హిందూమత సూత్రాలను తిరస్కరించడం
7. అతీంద్రీయ భావాల పట్ల నిరసన
8. మానవతా వాదాన్ని ప్రేరేపించడం
9. భౌతిక అంశాలకు ప్రాధాన్యతను ఇవ్వడం
10. పూలే, అంబేద్కర్, కాన్షీరాం ఆలోచనా విధానాలను కొనసాగించడం

**1.10.దళిత ఉద్యమం, సాహిత్యం అభివృద్ధికి ఆటంకాలు :**

1. దళిత సమస్యలు సామాజిక అవమానవీయతను వ్యక్తపరచటానికి ధిక్కార భాష వాడటం
2. వ్యక్తిగత అభివృద్ధే సామాజిక అభివృద్ధి అనుకోవటం
3. సాహిత్యం, ఉద్యమం పరస్పర సంబంధాన్ని విస్మరించటం
4. అనుభవాల వ్యక్తీకరణ పునరుక్తి కావటం
5. నిరాశవాదం, ఆత్మన్యూనత భావాలు ప్రధాన ఇతివృత్తాలు

6. అంతర్గత సమస్యల పట్ల స్పష్టమైన ధోరణి లేకపోవటం
7. భిన్న ప్రక్రియల్లో సమాన ప్రాతినిథ్యం లేకపోవటం
8. ఉద్యమానికి, సాహిత్యానికి నూతన కార్యవర్గం ముందుకు రాకపోవటం
9. ఇప్పుడు ఉన్న జనరేషన్ లో సాహిత్యం, ఉద్యమాల వైపు యువత ఆసక్తి చూపక పోవటం
10. దళిత ఉద్యమ, సాహిత్యాలలో స్త్రీ ప్రాతినిథ్యం తక్కువగా ఉండటం

దళిత ఉద్యమ ఆవిర్భవాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే సాంప్రదాయ వాదులు చెప్పే అర్థానికి, దళిత ఉద్యమకారులు, మేధావులు అర్థానికి ఈ కింది విధమైన తేడాను మనం గమనించవచ్చు.

దళిత ఉద్యమం

| సంప్రదాయ వాదులు | దళితులు |
| --- | --- |
| దౌర్భాగ్యం | ఆర్థిక అణచివేత |
| పేదరికం | సామాజిక అణచివేత |
| అవమానం | సాంస్కృతిక అణచివేత |

### 1.11.దళిత సాహిత్యం - చారిత్రక తాత్త్విక నేపథ్యం :

భారతదేశంలో దళిత, సాంఘీక, సామాజిక ఉద్యమాలకు తాత్త్విక పునాది బహు పురాతనమైంది. మిక్కిలి పుష్టికరమైంది. అది సుధీర్ఘమైన చరిత్ర కలిగి ఉంది. దళిత సాహిత్య పుట్టుక మీద చాలా అభిప్రాయాలు ఉన్నాయి. దళిత సాహిత్యం క్రీ.పూ. ఆరవ శతాబ్ధంలో బుద్ధుడుతో మొదలైందని, క్రీ.శ.పద్నాల్గవ శతాబ్దంలో చొక్కమేళుడితో ప్రారంభమైనదని, మహాత్మ జోతిరావుపూలే (1886-90) తో మొదలైందని భిన్న అభిప్రాయాలున్నాయి. కానీ అందరు ఆమోదించింది మాత్రం దళితఉద్యమం,సాహిత్య పుట్టుక మాత్రం మహారాష్ట్రలోనే

జరిగింది. మహాత్మ జ్యోతిరావుపూలే బ్రాహ్మణవాదాన్ని, సంస్కృతిని, కౌటిల్యాన్ని విమర్శిస్తూ ఉద్యమం తెస్తాడు. గత ఉద్యమ స్ఫూర్తినంతా స్వీకరించి దళితుల ఆత్మగౌరవం కోసం సామాజిక సాంస్కృతిక ఆర్థిక విముక్తి కోసం పోరాడే శాస్త్రీయమైన దళిత చైతన్యాన్ని దళిత వాదానికి ఒక భూమికను అమర్చి ఒక సమగ్రమైన తాత్త్విక దృక్పథాన్ని కలిగించినవాడు డా.బి.ఆర్. అంబేద్కర్ అనే చెప్పుకోవాలి. హిందూ మతవాదతత్త్వం మీద దాన్ని అనుసరించి వచ్చిన సాంఘీక అసమానతల మీద దాడి చేయడం, క్రీస్తు పూర్వం నుంచే ప్రారంభమైంది. ఈ తరహాలో దాడిచేసిన ప్రధాన ఉద్యమాలు బౌద్ధం, జైనం, చార్వాకం, వీరశైవం, భక్తి ఉద్యమాలు చెప్పుకోదగినవి.

ఇక ఆధునికకాలంలో జోతిరావుపూలే, నారయణగురు, సాహుమహారాజ్, పెరియార్ ఇ.వి, రామస్వామి నాయంకర్ ఆలోచన విధానాలు చేసిన పోరాటాలు దళిత ఉద్యమాలకు తాత్త్విక పునాదిగా నిలిచాయి. తర్వాత డా.బి.ఆర్. అంబేద్కర్ క్రీస్తు పూర్వం నుండి తన వరకు బ్రాహ్మణిజానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్ని ఆకలింపు చేసుకున్నారు. అంతేకాకుండా ప్రపంచంలోని ఆయా జాతుల చరిత్రల్ని లోతుగా పఠించారు. అందువలనే ఆయన దళిత ఉద్యమాలకు తాత్త్విక పునాదిగానే కాకుండా సహేతుకమైన ఉద్యమ వ్యూహరచనకు శ్రీకారం చుట్టాడు. దళిత ఉద్యమానికి, దళిత సాహిత్యానికి కొన్ని మత సిద్ధాంతాల ప్రభావం, కొన్ని మత సిద్ధాంతాలపై తిరుగుబాటు వంటి తాత్విక నేపథ్యం ఉంది. జీవితంలోని అన్ని రంగాలతో పాటు సాహిత్య రంగంలో కూడా దళితులకు అన్యాయం జరిగింది. గత వేలాది సంవత్సరాలుగా వెలువడుతున్న సాహిత్యంలో దళితుల్ని బానిసలుగా, బెస్తవాళ్ళుగా, ఉరితీసే తలారులుగా, నీచులుగా, చిత్రించడం జరిగింది. దళిత వనితలను దాసీలుగా, భోగించుటకు పనికివచ్చే విలాసవస్తువుగా వర్ణించడం జరిగింది. వీళ్ళను మనుషులుగా పరిగణించలేదు.

వ్యక్తిత్వం ఉన్న వాళ్ళుగా చిత్రించలేదు. దళితేతరులను మాత్రమే శక్తివంతంగా చిత్రించడం జరిగింది.

ఈ వివక్షతను ప్రతిఘటిస్తూ దళితుల సంవేదనలను, బాధలను, అనుభవాలను, అనుభూతులను, చిత్రించడంతో పాటు దళితులపై జరుగుతున్న అత్యాచారాలను శక్తివంతంగా అభివ్యక్తం చేయడానికి దళిత సాహిత్యం ప్రారంభమైంది. ఏది దళిత సాహిత్యం అనే ప్రశ్న వచ్చినపుడు హరిజన, గిరిజన, వెనుకబడిన, మైనార్టీ వర్గాలకు సంబంధించిన జీవిత విధానానికి సంబంధించిన సాహిత్యం దళిత సాహిత్యమవుతుంది. దళిత వర్గాలు సృష్టించేదే దళితసాహిత్యం అనే భావన సమంజసమైంది కాదు. దళిత వర్గాలు అభ్యున్నతికోసం అగ్రవర్ణాల వారు సృష్టించిన సాహిత్యం కూడా దళిత సాహిత్యమే అవుతుంది. దళిత సాహిత్య సమాజంలోనూ, సాహిత్యంలోనూ కొన్ని కొత్త సిద్దాంతాలను ప్రవేశపెట్టి అంతకు ముందు ఉన్న సాహిత్య విలువల్ని వ్యక్తుల ప్రవర్తనల్ని ప్రశ్నించి పాత సిద్దాంతాలను ప్రశ్నించే క్రమంలో ప్రస్తుతం ఉంది. దళిత సాహిత్యంపై వివిధ మతాల ప్రభావం ఉంది.

### 1.11.1.బౌద్ధమత పాత్ర :

బౌద్ధ మత స్థాపకుడు గౌతమబుద్ధుడు. ఈయన కాలం నాటికే సమాజంలో వర్ణవ్యవస్థ, బానిస వ్యవస్థ ఉందని తెలుస్తుంది. ఈ అసాంఘీక కార్యకలాపాలను తీవ్రంగా ఖండించి సమాజ శ్రేయస్సును ఆకాంక్షిస్తూ, సమతానురాగాలను ప్రతిష్టించినవాడు గౌతమబుద్ధుడు. బానిసల్ని గౌరవించడమే కాకుండా బ్రాహ్మణ వ్యవస్థను, యజ్ఞయాగాదులను వ్యతిరేకించింది బౌద్ధమతం. అందుకే డా.బి.ఆర్.అంబేద్కర్ బౌద్ధమతాభ్యుదయం ఫ్రెంచ్ విప్లవం అంత భావగర్భితమైంది అనీ, బౌద్ధం కమ్యూనిజానికి ఏమాత్రం తీసిపోదు అని అన్నారు. హైందవ సంస్కృతికి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ సంస్కృతిని దళితులు నిర్మించుకోవాల్సిన అవసరాన్ని గుర్తించి బౌద్ధంలోని సమతాభావాల్ని

స్వీకరించాడు డా.బి.ఆర్. అంబేద్కర్. ఈ కారణంగానే ప్రపంచ చరిత్రలో మరెక్కడారాని విధంగా ఒకేసారి ఏడులక్షల మంది హిందూమతాన్ని విడనాడి డా.బి.ఆర్.అంబేద్కర్ నాయకత్వాన బౌద్ధంలోకి వెళ్ళారు. ఇన్ని రకాల ప్రత్యేకతలతో దళిత సాహిత్యం దళితులకు బౌద్ధం దగ్గరైంది. అందుకే దళితులు వారి సాహిత్యానికి బౌద్ధం తాత్త్వికపునాదిగా నిలుస్తుంది.

### 1.11.2.జైనమత ప్రభావం :

జైనుల్లో గొప్ప తార్కికులున్నారు. కులతత్త్వాన్ని నిర్ద్వంద్వంగా వీరు ఖండించారు. జైనం కుల వ్యవస్థకు కారణమైన హైందవ మతాన్ని , మత నమ్మకాల్ని వ్యతిరేకించింది. పూజారి వ్యవస్థను, ఆధిపత్యభావజాలాన్ని జైనులు వ్యతిరేకించారు. హిందూమత భావాలపై తిరుగులేని పోరాటం చేసింది జైనం. అందుకే నేటి దళిత ఉద్యమాలకు జైనంలోని కొంత భావజాలం తాత్త్విక పునాదిగా ఉపకరిస్తుంది.

### 1.11.3.చార్వాక మత ప్రభావం :

దీన్ని అభౌతిక వాదంగా పేర్కొనవచ్చు. ఇది కూడా కర్మ, పునర్జన్మల్ని వర్ణాశ్రమ ధర్మాల్ని యజ్ఞయాగాదులను నిశితంగా విమర్శించింది. ఈ జన్మలో చేసుకున్న పాపపుణ్యాల ఫలితంగా మరో జన్మలో హీన వర్ణంలోనో, ఉన్నత వర్ణంలోనో జన్మిస్తారనే మోసపూరితవిధానాన్ని చార్వాకులు ఖండించారు. భారతీయ మతవాదులుకు రెండుకళ్ళు, కాళ్ళు అయిన కర్మ సిద్ధాంతాన్ని వర్ణాశ్రమ ధర్మాల్ని నడ్డివిరగగొట్టి మనుషుల్ని విముక్తి చేయడానికి చార్వాకం ఎంతగానో తోడ్పడింది. అందరూసమానులే అన్న భావజాలాన్ని వ్యాప్తి చేయడంలో చార్వాకం ప్రధాన పాత్ర పోషించింది. అందుకే దళితసాహిత్య చరిత్రకారులు చార్వాకాన్ని తమ వాదానికి తాత్త్విక నేపథ్యంగా తీసుకున్నారు.

### 1.11.4.వీరశైవ మత ప్రభావం :

శివుడి పట్ల అమితమైన భక్తి భావం కలిగి, సంఘ సంస్కరణాభిలాష మెండుగా ఉన్నవారు వీరశైవులు. వారి విధానాలు, భావాలు సామాన్యులకు కూడా అందుబాటులో ఉండటానికి జైనం, బౌద్ధంల్లాగా ప్రజల భాషను వాడారు. సంఘంలో మంచి సంస్కరణ భావాల్ని వ్యాప్తి చేయడానికి వీరు ప్రయత్నించారు. కవిత్వంలో బ్రాహ్మణ, క్షత్రియులే నాయకులుగా ఉండాలనే సంప్రదాయానికి విరుద్ధంగా వీరు సాహిత్య సృష్టి చేశారు. బ్రాహ్మణులకేగాక చాకలి, మంగలి, మాల, మాదిగ లాంటి అన్ని కులాలకి సత్ర భోజనాలు వస్త్రదానాలు ఏర్పాటు చేశారు. బ్రాహ్మణవాదాన్ని వ్యతిరేకించి శూద్రులకు ఛండాలురకు సముచిత స్థానం ఇవ్వడం కారణంగా వీరశైవం దళిత సాహిత్య ఉద్యమానికి తాత్త్వికనేపథ్యంగా నిలుస్తుంది.

### 1.11.5.భక్తి ఉద్యమ ప్రభావం :

13వ శతాబ్దంలో ప్రారంభమైన భక్తిఉద్యమంపై భిన్న అభిప్రాయాలున్నాయి. కక్కయ్య, సిద్దప్ప, కబీర్, గురునానక్, పోతులూరి వీరబ్రహ్మం, మొదలైనవారు ఉన్నారు.

దళితాభ్యున్నతికి ప్రత్యేకించి అస్పృశ్యుల సమస్యలపై సహేతుక అవగాహనతో జ్యోతిరావుపూలే సత్యశోధక ఉద్యమాన్ని, ఆయన అనుచరుడైన ఎస్.ఎం.లోఖండే బ్రాహ్మణేతర కార్మికోద్యమాన్ని నడిపాడు. శివరాజుకాంబ్లే నిమ్నజాతుల మహాసభను నడిపి, వారి సమస్యలకు వేదికగా" సోమవంశీమిత్ర' అనే మాసపత్రికను సమర్ధవంతంగా నడిపారు. అలాగే కర్మవీర్ షిండే ఆయా ప్రాంతాల్లోని సమస్యలని అవగాహన చేసుకొని నారాయణ్ గణేష్ చందా వర్కర్ మొదలైనవారి ప్రోత్సాహంతో దళితజాతుల సేవాసంఘం అనే సంస్థను స్థాపించాడు.

తమిళనాడులో బ్రాహ్మణ ఆధిపత్యానికి వ్యతిరేకంగా " దక్షణ భారత విముక్తి సమాఖ్య' అనే సంస్థ 1916లో ఏర్పడింది. ఇదే భావజాలంతో జస్టీస్ పార్టీ ఏర్పడింది. వర్ణాశ్రమ ధర్మాలకు పురోహిత వర్గ ప్రాధాన్యాన్ని తగ్గించడానికి ఇ.వి.రామస్వామి నాయంకర్ కాంగ్రెస్ తో తెగతెంపులు చేసుకొని ఆత్మగౌరవ ఉద్యమం అనే పేరుతో ఉద్యమాన్ని లేవదీశాడు. కర్ణాటకలో బ్రాహ్మణేతరులు ప్రజామిత్ర మండలి అనే సంస్థను స్థాపించారు. విదేశీయాత్రికులైన పాహిమాన్, హుమాన్ త్యాగ్, మార్కోపోలో, ఆల్ బెరూని, పమెస్, న్యూనిజ్ వంటి వారు భారతసమాజంలో అంటరానివారు ఊరికి దూరంగా నివశిస్తున్న వారి గురించి తమ యాత్రా రచనలలో ప్రస్తావించారు.

భారతదేశంలో దళితుల చరిత్రను చరిత్రకారులెవ్వరూ పట్టించుకోలేదు. ఆరోజుల్లో ఆంత్రోపాలజిస్టులు, ఎత్నోగ్రాఫర్లు, క్రైస్తవ మిషనరీలు దళితుల చరిత్రను అధ్యయనం చేశాయి. వీరిలో విదేశీయు లు అత్యధికులుగా ఉండటం విశేషం. రిప్లే, కేట్కర్, థర్స్టల్, సేనార్ట్, నెస్ ఫీల్డ్ , హట్సన్, గుర్రే, బ్రిగ్స్, ఆండ్రీ, బేట్ల్,లించ్ వంటి సామాజిక శాస్త్రవేత్తలు. కనుక బ్రిటీష్ వారి రాకతో భారతదేశంలో దళితుల చరిత్ర రచన అనేది ప్రారంభమైందని చెప్పవచ్చు. మార్క్ జుర్గన్స్ మేయర్ ఆది ధర్మయుద్ధంపై రాసిన పుస్తకం దళితుల చరిత్ర పరంగా మొదటిది అని పరిశీలకులు భావిస్తున్నారు.బ్రాహ్మణీయ వ్యవస్థలో కడజాతివారిగా, అంటరానివారిగా పరిగణింపబడుతున్న దళితులు వలసవాద కాలంలో ఇంగ్లీషు విద్య వలన చైతన్యవంతులై దేశవ్యాప్తంగా ఆత్మగౌరవ ఉద్యమాన్ని ప్రారంభించిన క్రమాన్ని ఈ పుస్తకం వివరిస్తుంది. దళితులు తాము నేలబిడ్డలమని ఈ దేశానికి మూలవాసులమని, బయటి నుంచి వలస వచ్చిన ఆర్యులు తమపై కులాన్ని రుద్దారని పేర్కొంటూ ఉత్తరాదిన ఆది హిందూ, ఆది ద్రావిడ, దక్షణాదిన ఆది

ద్రావిడ, ఆది ఆంధ్ర, ఆది కర్ణాటక ఉద్యమాలను ప్రారంభించడాన్ని జుర్గన్స్ మేయర్ వివరించినట్లు కొన్ని చారిత్రిక గ్రంథాల ఆధారంగా తెలుస్తుంది.

దళితులచే వేయించబడిన శిలాశాసనం అమరావతి బౌద్ధ స్థూపం వద్ద లభ్యమయింది. విధికుడనే చర్మకారుడు తన కుటుంబంతో అమరావతి బౌద్ధరామాన్ని సందర్శించి అక్కడ పూర్ణకుంభాన్ని దానం చేసినట్లు, ఈ విధికుడు తండ్రి ఒక ఆచార్యుడన్నట్లు ఈ శాసనంలో పేర్కొనడం జరిగింది. విధికుడు దానంగా ఇచ్చిన పూర్ణకుంభమే నేటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చిహ్నం. దీనిని బట్టి దళితుల సాంస్కృతిక మూలాలు బౌద్ధంలో ఉన్నాయని తెలుస్తుంది. ***(స్వరూపరాణి,చల్లపల్లి. pranahita.org).***

## 1.12.తెలుగులో దళిత సాహిత్య ప్రస్థావన :

సాధారణంగా ప్రాచీన కాలంలోనూ, ప్రాచీన సాహిత్యంలోనూ దళిత పదం ప్రయోగించకపోయినా ఆయా సంధర్భానుసారంగా ఆయా కవులు కొన్ని అనివార్య పరిస్థితుల మధ్య ఈ పదాన్ని సాహిత్యంలో ప్రయోగించక తప్పలేదు. కాకపోతే కొన్ని చోట్ల ఈ ప్రాచీన సాహిత్యంలో అణచివేత, అస్పృశ్యత, వెలివేత, చంఢాలురు, అణగారినవారు వంటి పదాల రూపంలో ఈ దళిత పదాన్ని ప్రయోగించారు. జనబలం కలిగి సామాజిక కలిమి లేని దళితుల సేవలు అందరికి అవసరమే. దళిత అనే పదానికి పర్యాయపదాలుగా వాడారు. ప్రాచీన కాలంలో దళిత సాహిత్య ప్రస్తావన అనేది కేవలం నీచపరిస్థితులను, మైల, శుభ్రత మొదలైన అంశాల దృష్ట్యా ఈ దళిత పదాన్ని ఆయా రచయితలు ప్రయోగించారు.

దళిత శబ్దం ఇటీవల కాలంలో పరిగణలోకి వచ్చినా దీని ఛాయలు మాత్రం ప్రాచీన కాలం నుండి ఉన్నాయి. తెలుగు సాహిత్యంలో 19వ శతాబ్దం తొలి దశకంలో బలిజేపల్లి లక్ష్మీకాంతం 1912లో సత్యహరిచంద్రీయం అను నాటకంలో తొలిసారిగా దళిత పదం ప్రయోగించాడు.

" కాటిసుంకంబు చెల్లింపకయో శవాల

మనమున గాల్చక కద మనుజులార
కాపులేదను కొంటిరేమో పదండు
దళితఘోరారి యీ వీరదాసుగలదు ***(షష్ఠాంకము, పుటః86)***

దళిత శబ్దం ఇటీవల కాలంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. కానీ 14వ శతాబ్దంలో బమ్మెర పోతన రచించిన శ్రీ మహాభాగవతం అష్టమ స్కందమైన గజేంద్రమోక్షంలో దళిత అనే పదం ప్రయోగించబడింది.

" దళిత పాపుడగుచు దనలోకమున కేగి
నపుడు శౌరికేలనంటి తడవ
హస్తి లోకనాథుడు డజ్ఞాన రహితుడై
విష్ణురూపుడగుచువెలుగుచుండె'(**పోతనబమ్మెర.1987:పుట:100**).

ప్రథమాంధ్ర దళిత పద్య కావ్యమైన నిరుద్ధ భారతం (1915) రచించిన మంగిపూడి వేంకటశర్మ ఇలా పలికాడు.

" చేయుచున్నారు చేయరు చేయరారు
తీసివేయరు కటకటా తెలిసి తెలిసి
అంతరాత్మకు వ్యతిరేక మాచరింత్రు
దళిత ధృతులార ఆచార దాసులారా(**నిరుద్ధ భారతం**, **ప్రార్ధన శీర్షిక పుట 147**).

ఆది సమాజం మొట్టమొదట మతపరంగా, వృత్తి పరంగా విభజింపబడింది. కాలక్రమంలో ఆ వృత్తులే సమాజంలో కులం పుట్టుకకు పునాది అయ్యాయి. ఈ కుల వృత్తిని బట్టి కులాన్ని నిర్ణయిస్తే తరువాత పుట్టుకను బట్టి కులాన్ని స్థిరపరిచారు. కులం,వర్ణం ఈ రెండింటికి మూలసూత్రం ఒక్కటి కాదు. వాటి మధ్య ప్రాథమికమైన భేదం ఉంది. కేవలం భేదం మాత్రమేకాదు. ఆ రెండు ఒకదానికొకటి పరస్పర విరుద్ధమైనట్టివి. ఇందులో కులం పుట్టుకమీద ఆధారపడినది. వర్ణం అర్హత మీద ఆధారపడినది. పుట్టుకను బట్టి ఉన్నత స్థానం

అంటే అర్హతను బట్టి వచ్చిన స్థానం కాదు. కేవలం ఉన్నత కులంలో పుట్టుట ద్వారా మాత్రమే వంశపారంపర్యంగా ఆ వృత్తి సంక్రమిస్తుందని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. (**భీమన్న, బోయి. 1994: 41**). కింది కులాలు శారీరక శ్రమను నమ్ముకుంటే సాంస్కృతిక కులాలైన అగ్రవర్ణాలు ముఖ్యంగా బ్రాహ్మణులు మానసిక శ్రమను నమ్ముకున్నారు. ప్రధానంగా తెలుగు దళిత సాహిత్య ప్రస్థావన ఈ కింది విధంగా కనిపిస్తుంది.

1) హరిజన అనే పదాన్ని వ్యతిరేకించి దళితులుగా ప్రకటించుకుంటూ, మేమే ఈ మూలవాసులం అని తేల్చి చెప్పే సాహిత్యం
2) పురాణాల పేర్లతో అడుగడుగునా అవమానాలకు గురవుతూ అణచివేతకు , అస్పృశ్యతకు కారణాలను వెతికేది
3) చాతుర్వర్ణాన్ని,అస్పృశ్యతను, అణచివేతను సామాజిక బహిష్కరణను , దోపిడినీ నిలదీసేది

**1.13.దళిత సాహిత్యం ప్రారంభ పరిణామాలు :**

దళిత సాహిత్యాన్ని అధ్యయనం చేసేటప్పుడు ప్రధానంగా దళితసాహిత్యం యొక్క మౌలికత, ప్రామాణికత ఏమిటి? వాటిని ఏవిధంగా గుర్తించారు? వాటి నేపథ్యం ఏమిటి అనే విషయాన్ని తెలియజెప్పాల్సిన అవసరం ఉంది. దళిత సాహిత్యం సాహిత్యమా? ఉద్యమమా? లేక అస్థిత్వ పోరాటమా? లేక ప్రతిఘటనాచైతన్యమా? దళిత అనే పదం ఎప్పటి నుండి అమలులోకి వచ్చింది. దాని కంటే ముందు దీనికి గల మరో రూపం ఏమిటి? దాని పరిణామ క్రమానికి గల కారణాలు ఏమిటి? అనే విషయాలను స్పష్టంగా చెప్పగలిగామంటే దళిత ఉద్యమసాహిత్యం యొక్క మౌలికతను చెప్పగలిగినట్లే. వీటిని ఏమి చర్చించకుండా దళిత ఉద్యమాన్ని, సాహిత్యాన్ని తద్వారా ప్రయోజనం చేకూర్చాలని దళిత ప్రజల ఆకాంక్షలను చెప్పలేము.

సమాజంలో సంస్కరణ భావాలు రేకెత్తించేందుకు సాహిత్యం ఒక సాధనంగా ఉపయోగపడాలని దళిత సాహిత్యం భావిస్తుంది. సాహిత్యం కేవలం వినోదం కోసం కాదనీ, సామాజిక చైతన్యం కలిగించాలని భావిస్తుంది. అందుకే కళ కళ కోసమే అన్న నినాదాన్ని నిర్ద్వంద్వంగా ఖండిస్తూ కళ సమాజం కోసమే అన్న భావాన్ని మాత్రమే  సాహిత్య సమాలోచనం చేసింది దళిత సాహిత్యం.

ప్రపంచవ్యాప్తంగా వచ్చిన అనేక విప్లవాల నేపథ్యంతో సమాజంలో అనేక మార్పులు వచ్చాయి. తద్వారా దళిత ప్రజల్లో కూడా మాకు స్వంత గొంతు ఒకటి ఉండాలనీ, మా జీవితగాథలను మేమే సృజనీకరించుకుంటామనే సంకల్పంతో దళిత సాహిత్యం మొదలైంది.1960 ప్రాంతంలో అరాకొరా దళిత సాహిత్యం వస్తున్న, 1970 ప్రాంతంలో మహారాష్ట్రలో దళిత ఫాంథర్స్ ఉద్యమంతో దళితసాహిత్యానికి స్వతంత్రమైన వేదిక ఏర్పాటు అయింది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ లో 1980 ప్రాంతం నుండి మొదలైంది. అంతకు ముందు ఉన్న భావ, అభ్యుదయ, దిగంబర, విప్లవ కవితా ఉద్యమాల్లో దళితుల ప్రస్తావన కనిపిస్తున్న అది కేవలం వారి వారి స్వలాభాల కోసం వచ్చే సానుభూతి సాహిత్యంగా ఉంటుందే తప్ప వాస్తవిక దళిత జీవితాలను చిత్రించలేకపోయింది. అందువలన దళిత మేధావులు అంతా సంఘటిత శక్తిగా ఆవిర్భవించి ఈ తెలుగు సాహిత్యంలో వచ్చినటువంటి దాదాపు అన్ని ప్రక్రియల్లో తమ గోడుని వినిపిస్తూ తెలుగు సాహిత్య చరిత్ర అంత విస్తృతిని ఏర్పాటు చేసుకోగలిగింది ఈ దళిత సాహిత్యం.

ఈనాటి దళితసాహిత్యానికి,దళిత కవులకు ప్రేరణ మరియు వారి ప్రధాన కవితా వస్తువులు ఆనాడు దళితులపై జరిగిన మానసిక, శారీరక దాడులే వాటిలో ముఖ్యంగా చెప్పుకోదగినవి 1968 కంచికచర్ల కోటేశు సజీవ దహనం , కారంచేడు(జూలై,17,1985), పదిరికుప్పం (5-8-1983), నీరుకొండ(15-7-1987), చుండూరు (6-8-1991) మొదలైనవి. ఈ నేపథ్యంలో త్రిపురనేని

శ్రీనివాస్, జి,లక్ష్మీనర్సయ్య " చిక్కనవుతున్నపాట' అనే కవితా సంకలనం దళిత సాహిత్యానికి భూమికగా నిలిచింది. అప్పటి నుండి ఇప్పటి దళిత సాహిత్యం ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ అలుపెరగని కవితా ఉద్యమాన్ని కొనసాగిస్తుంది.

దళిత సాహిత్యం మరి కొంత ముందు చూపుతో ఉపకులాల విభజన నేపథ్యంలో మాదిగ సాహిత్యం లేదా వర్గీకరణ సాహిత్యం పేరుతో దళిత సాహిత్యంలో చీలిక వచ్చింది. ఈ చీలికలు వచ్చినప్పటికి దళిత రచయితల లక్ష్యం డా.బి.ఆర్.అంబేద్కర్ చెప్పినట్లు దళితులకే రాజ్యాధికారం అనే నినాదంతో నడుస్తున్నారు. దళిత అనే పదం 19వ శతాబ్దం ఉత్తరార్థంలో భారతదేశంలో మొదటగా జ్యోతిరావుఫూలే తర్వాత అంబేద్కర్ ప్రాచుర్యంలోకి తెచ్చారు. అంతకు ముందు వరకు దీనిని కేవలం గాంధీ నాయకత్వాన స్వాతంత్ర్య ఉద్యమకాలంలో హరిజన, అస్పృశ్యత, అంటరాని అనే పేర్లతో మాత్రమే వీరిని పిలుస్తూ, స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో అంతర్భాగంగా, కులవ్యవస్థలో అంతర్భాగంగా హరిజనుల విముక్తి జరగాలనీ చాలా దళిత, దళితేతర రచయితలు సాహిత్య సృష్టి చేశారు. ఆ తరువాత వచ్చిన సంఘసంస్కరణలో అంతర్భాగంగా కూడా కొంత సాహిత్యం దళితుల పట్ల సానుభూతి సాహిత్యం వచ్చింది. ఈ నేపథ్యంలో మాత్రం సంఘం సంస్కరించబడాలి అన్నారు కానీ దళితులు మాత్రం దళితులుగా ఉండాలి. వర్ణాశ్రమ ధర్మాలను కాపాడుతూనే వారి అభివృద్ధి జరగాలి అన్న ద్వంద్వవైఖరి అవలంభించారు. తదనంతరం వచ్చిన భావకవిత్వం మాత్రం మనిషి కంటే ప్రకృతికే పెద్ద పీట వేసి ఉహాగానాల్లో సాహిత్యాన్ని ఉర్రూతలూగించారు. మానవజీవన విధానం కంటే ప్రకృతిలో పరవశించడమే ప్రధాన ధ్యేయంగా సాహిత్య రచన జరిగింది. కనుక వారు మానవజీవితాలనే ఆలోచించే క్రమాన్ని విస్మరించినప్పుడు మానవుల్లో అథములుగా భావింపబడిన దళితుల గురించి చర్చిస్తారనుకోవడం వారు సృష్టించిన ఊహాసాహిత్య

ప్రపంచంలా ఉంటుంది. ఆ తరువాత వచ్చిన అభ్యుదయ కవితా ఉద్యమం మాత్రం ప్రగతీశీలభావాలతో కూడిన సాహిత్యాన్ని సమాజం కేంద్రబిందువుగా చేసుకోని శ్రామిక, కార్మికచైతన్యాన్ని సమీకృతపరచే దిశగా సాగింది. కానీ ఆచరణలో కొంతవరకు విఫలమైందని చెప్పవచ్చు. దీనిని వ్యతిరేకిస్తూ అభిప్రాయాలు వ్యక్తపరచటం కంటే వాటిని ఆచరణలో పెట్టడం అనివార్యం అని భావించి తుపాకీ గొట్టం ద్వారా సమసమాజ స్థాపన జరుగుతుందని భావించి ఆ దిశగా సాహిత్యం కొనసాగింది. ఈ మధ్యకాలంలోనే సమాజంపై తిరుగుబాటు తత్వాన్ని పెంచుకున్న కొంత మంది యువకులు దిగంబర కవిత్వాన్ని ప్రచురించారు ఇది ఎక్కువ కాలం తన ఉనికిని కాపాడుకోలేకపోయింది. ఈ కవితా ఉద్యమాలన్నింటిలో కూడా దళిత ప్రజల ప్రస్థావన అక్కడక్కడ వచ్చినా అది దాని ప్రాధాన్యతను బట్టి వచ్చిందే కానీ స్పష్టమైన లక్ష్యంతో రాలేదు. అందుకే కాబోలు 1980 తర్వాత దళిత రచయితలందరూ ఒకే తాటిపై ఆలోచించి తమ సొంతుగొంతును వినిపించేందుకు సాహిత్య ప్రవేశం చేశారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ఎన్నో ఒడిదుడుకులతో ఆటుపోటులతో దళిత సాహిత్యం ఒక బలమైన అస్థిత్వ వాదంగా తన ప్రయాణాన్ని సాహిత్య రంగంలో కొనసాగిస్తుంది. దళితసాహిత్యాన్ని ప్రధానంగా మూడు విభాగాలుగా అధ్యయనం చేయాలి.

1. దళిత సాహిత్యం పూర్వదశ
2. దళితసాహిత్యం రెండవ దశ
3. దళితసాహిత్యం మూడవ దశ లేదా ప్రస్తుత దశ

దీనితోపాటు దళిత సాహిత్యం మొత్తాన్ని సూక్ష్మదృష్టితో అధ్యయనం చేస్తే దళిత రచయితల్లో రెండు విభన్నమైన ధోరణులను గమనించవచ్చు.

1. అతివాద ధోరణి
2. మితవాదధోరణి

అతివాదధోరణిలో మాత్రం వ్యవస్థపై తిరుగుబాటు, హిందూ మతతత్త్వం విధించిన పరిమితులను ధిక్కరించే ధోరణి స్పష్టంగా గోచరిస్తుంది. హిందూమతం మౌలికతత్త్వాన్ని, అది ప్రచారం చేసే కర్మ, పరమాత్మ. జన్మ, పునర్జన్మ వంటి భావనలను ధోరణి తీవ్రంగా నిరసిస్తుంది. ఈ తరహా కవులు తమ కవిత్వంలో ఉపయోగించే ప్రతీకలు, అలంకారాలలో సమాజ స్వభావం పట్ల వ్యక్తంచేసే అసహనం, నిరసన స్పష్టంగా కనిపిస్తుంది.

దళితఅనుభవాల వ్యక్తీకరణతో పాటుగా కులవ్యవస్థలోని అమానవీయత, దురభిమానాలను వర్ణిస్తూ నూతన సామాజిక, సాంస్కృతిక చైతన్యాన్ని ఆశించటం మితవాదధోరణిలో కనిపిస్తుంది. దళితుల కష్టాలు, కన్నీళ్ళు వర్ణించటం దీనిలో ప్రధాన అంశం. కానీ ఈ తరహాలో తిరుగుబాటు ధోరణి కనిపించదు.

దళితసాహిత్యం ప్రారంభమైన మొదట్లో కేవలం కవిత్వ రూపంలో మాత్రమే వచ్చింది. సంస్కరణ పేరుతో కొంత సాహిత్యం వచ్చినా దానిని సంప్రదాయ దళిత సాహిత్యంగానే పిలుచుకోవాలి. 19వ శతాబ్దం ఆరంభంలో దళిత సాహిత్యం హేతువాద దృక్పథంలో తెలుగులో వచ్చిన అన్ని ప్రక్రియల్లో రావటం మొదలైంది వాటిని కొంతవరకు పరిశీలించి కొన్ని ముఖ్యమైన గ్రంథాలను పేర్కొని ఆ తర్వాతి అధ్యాయంలో ఒక్కొక్క ప్రక్రియ ప్రాధాన్యాన్ని ఆయా అధ్యాయాల్లో చర్చికుందాం.

### 1.14.దళిత సాహిత్యం ప్రక్రియా వైవిధ్యం:

తెలుగుసాహిత్యంలో దళితసాహిత్యం ఒక కవితాఉద్యమంగా లేదా వాదంగా మొదలైనప్పటికీ ఈనాడు తెలుగుసాహిత్యం అంత పరిధిని ఏర్పరచుకోగలిగిన తెలుగుసాహిత్యానికి ఉంత ప్రాధాన్యాన్ని ఏర్పరచుకోగలిగింది. దాదాపు తెలుగు వచ్చిన అన్ని ప్రక్రియల్లో దళిత సాహిత్యం వచ్చింది, నేటికీ వస్తూనే ఉంది కాకపోతే కొన్ని ప్రక్రియల్లో ఎక్కువ సాహిత్యం,

కొన్ని ప్రక్రియల్లో తక్కువ సాహిత్యం వచ్చింది. ప్రధానంగా దళిత సాహిత్యంలో వచన కవిత్వం ఎక్కువగా వచ్చింది. వచన సాహిత్యంలో చెప్పుకోదగినవి“చిక్కనవుతున్నపాట,దళితమానిఫెస్టో,గుండెడప్పు,బహువచనం, వెలివాడ, జైలుగంటలు, నల్లకలువ, నల్లద్రాక్షపందిరి, అల్పపీడనం, నిప్పుకణిక, చండాలచాటింపు,మట్టిపలక, దళిత తాత్వికుడు, మంకెనపువ్వు, దళితకవిత్వం–1,దళితకవిత్వం–2 వంటి ఎన్నో కవితా సంకలనాలు వచ్చాయి.

ఇకపోతే సంస్కరణ పేరుతో దళితకవులు ఎన్నో పద్య కావ్యాలు కూడా రాశారు. వాటిలో ప్రధానమైనవి గబ్బిలం, నిరుద్ధ భారతం, హరిజన శతకం, అస్పృశ్యుల విజ్ఞప్తి, అతుకుల బ్రతుకులు, పాంచజన్యం వంటి ఎన్నో చంధోబద్ధ కావ్యాలువచ్చాయి.ఇదే కోవలోనే దళిత గేయాలు కూడా వచ్చాయి. వాటిలో జయధీర్ తిరుమల రావు దళితగీతాలు, గద్దర్ దళిత పులులమ్మా, కలేకూరి ప్రసాదు కర్మభూమిలో పూసిన ఓపువ్వా అనే గేయాలు ప్రసిద్ధమైనవి ఇవే గాక ఎన్నో దళిత గేయాలు వచ్చాయి.

దళిత కథా సాహిత్యానికి వస్తే కథా సాహిత్యంలో చెప్పుకోదగిన సాహిత్యమే వచ్చింది, కొలకలూరి ఇనాక్ దళిత కథాసాహిత్యంలో తనదైన రీతిలో వినూత్న కథా వస్తువులును స్వీకరించి దళితకథాసాహిత్యానికి మరింత బలం చేకూర్చారు. వీటిలో ఊరబావి, ఇంకానా ఇకపై సాగవు అనే కథాసంకలనం,. దళిత కథలు అనే సంకలనం, రేగడిసాల్లు అనే సంకలనం ముఖ్యంగా చెప్పుకోవచ్చు.

దళిత నాటకాన్ని గమనిస్తే బోయి భీమన్న గారి రాగవాశిష్టం, పాలేరు, ఇనాక్ గారి మునివాహనుడు చెప్పుకోవచ్చు. అదేవిధంగా నవలా సాహిత్యం కూడా బాగానే వచ్చింది. వాటిలో ఉన్నవ మాలపల్లి, దేవపుత్ర పంచమం, కళ్యాణరావు అంటరానివసంతం,వేముల ఎల్లయ్య కక్క,సిద్ధి మొదలైనవి చెప్పుకోవచ్చు. అదే కోవలోనే దళిత ధీర్ఘకావ్యాలు చాలా వరకు వచ్చాయి వాటిలో

ఎండ్లూరి సుధాకర్ వర్గీకరణీయం, జి.వి. రత్నాకర్ అట్లేటి అల మొదలైన రచనలు వచ్చాయి.

దళిత స్వీయ, జీవిత చరిత్రల విషయంలో దళిత సాహిత్య పరిధి కొంత వరకు తక్కువే అని చెప్పుకోవాలి వాటిలో జాషువా నా కథ, డా.దార్ల వెంకటేశ్వరరావు రచించిన నాగప్పగారి సుందర్రాజు మాదిగ స్మృతి కావ్యం ఇంకా కొన్ని వచ్చాయి.

దళిత సాహిత్య విమర్శను గమనిస్తే చాలా తక్కువగానే వచ్చింది. ఈ మధ్యకాలంలో దళిత సాహిత్య విమర్శ రావటం మొదలైంది. దళిత కవులు ఆయా సమయానుకూల దృష్ట్యా దళిత సాహిత్య విమర్శ రాస్తున్నారే గానీ సమగ్రంగా రాలేదనే చెప్పుకోవాలి.

### 1.15.వివిధ భాషల్లో దళిత సాహిత్యం :

మరాఠీ దళిత సాహిత్య మూలాలను అనుసరించి పరిశోధకులు విభిన్నమైన అభిప్రాయాలు వ్యక్తపరచారు. కొందరు బుద్ధుడు కాలం నుండి సాహిత్యంలో దళిత సాహిత్య మూలాలు ఉన్నాయనీ భావించారు. మరికొందరు భక్తి ఉద్యమకాలం నుండి సాహిత్యంలో దళిత సాహిత్య పుట్టుక ఉన్నదని అభిప్రాయపడ్డారు. భక్తి ఉద్యమం మహారాష్ట్రలో 13 వ శతాబ్దంలో ప్రారంభమైంది. ధ్యానేశ్వర్ తో మొదలైన ఈ ఉద్యమంలో చొఖమేలా, నామ్ దేవ్, తుకారామ్ వంటి ప్రముఖులున్నారు.

### 1.16.దళిత పత్రికల పాత్ర :

1967 దాకా దళిత సాహిత్యం తన సైద్ధాంతిక పునాదిని పటిష్టపరచుకుంటూ వచ్చింది. జ్యోతిబాపులే, సాహుమహరాజ్, అంబేద్కర్, నీగ్రోసాహిత్యంలోని తిరుగుబాటు తత్వాన్ని తన తాత్త్విక పునాదిగా స్వీకరించింది. ఔరంగాబాదులోని మిళింద సాహిత్య పరిషత్, అస్మిత లేదా అస్మితాదర్శ అనే పత్రిక ద్వారా దళిత పదం ప్రాచుర్యంలోకి వచ్చింది.1920 లోనే

బెంగాలీ భాషలో పత్రిక వెలువడింది.ఆ తరువాత వివిధ భాషల్లో ప్రబుద్ధభారత్, అస్మిత, అస్మిత దర్శ, మూక్ నాయక్, భీం, జనతా, ప్రమేయ, నికాయ, బాయజా, సింహగర్జన, శ్రమిక్ నివార్ సింహ గర్జన, దర్పణం మొదలైనవి. వీటితో పాటుగా తెలుగులో బహుజన కెరటాలు, మాదిగ, నీలిజెండా, మల్లెమాల మొదలైన పత్రికలు ఎన్నో సిద్ధాంతపరంగా దళిత ఉద్యమానికి, సాహిత్యానికి అభివృద్ధికి దోహదం చేస్తున్నాయి.

### 1.17.దళిత ఉద్యమం - యన్.జి.ఓ ల పాత్ర :

దళిత ఉద్యమ ప్రారంభం నుండి యన్.జి.ఓ ల పాత్ర చాలా కీలకమైంది. గ్రామీణ ప్రాంతాల్లోని దళిత ప్రజలను సమావేశాల ద్వారా సమీకరించి వారిపై జరిగే దాడులను అరికడుతూ వారిలో చైతన్యం పెంపొందించటంలో వీటి పాత్ర చాలా కీలకమైంది. వీటిలో ముఖ్యంగా డి.యస్.యస్ (దళిత స్త్రీ శక్తి), అన్వేషి,… తదితర సంఘాలు చాలా ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి.

దళిత ఉద్యమం, దాని నేపథ్యంగా వచ్చిన దళిత సాహిత్యం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని తనకంటూ ఒక నిర్ధిష్టమైన మార్గాన్ని, లక్ష్యాన్ని ఏర్పాటుచేసుకోవటంలో చాలా వరకు సఫలీకృతం అయ్యిందనే చెప్పాలి. ఇలా చిన్న తిరుగుబాటుతో ప్రారంభమైన ఉద్యమం ఎన్నో అస్తిత్వ ఉద్యమాలకు ఆదర్శంగా నిలిచి, బహుజన కులాల్లో చైతన్యం నింపి కులచైతన్యం ద్వారానే కుల నిర్మూలన జరుగుతుందని చాటిచెప్పింది. ఈ ఉద్యమ, సాహిత్య పరిణామ క్రమంలో ఎంతో మంది మేధావులు, సాహిత్యకారులు, కళాకారులు, అన్ని దళిత వర్గాల పాత్ర చాలా కీలకమైందనే చెప్పుకోవాలి.

ఈ నేపథ్యంలో తెలుగు సాహిత్యం, దానిపై వచ్చిన విమర్శ, వివిధ ధోరణులు, వాదాలు, ఉద్యమాల పరిణామంలో దళిత సాహిత్యంపై వచ్చిన విమర్శ తీరుతెన్నుల్ని తరువాతి అధ్యాయాల్లో వివరించే ప్రయత్నం చేస్తాను.



## రెండవ అధ్యాయం

# తెలుగు సాహిత్య విమర్శ - దళిత సాహిత్య ప్రస్థానం

# రెండవ అధ్యాయం

# తెలుగు సాహిత్య విమర్శ – దళిత సాహిత్య ప్రస్థానం

## 2.1. పరిచయం :

తెలుగుసాహిత్య అధ్యయనం ఎప్పటి నుండి ఆరంభమైందో ఆనాటి నుండే తెలుగుసాహిత్య విమర్శ కూడా సూచనాప్రాయంగా మొదలైందని చెప్పవచ్చు. కాకపోతే ఇది ఒక నిర్మాణాత్మకమైన లక్షణాలు, నియమాలతో కూడిన నిర్దిష్ఠమైన ప్రక్రియగా మాత్రం ఆవిర్భవించలేదు. సాహిత్య పరిణామక్రమం జరుగుతున్న కొలది కొంత ఆంగ్ల విద్యా ప్రభావం వలన మరియు పాశ్చాత్య నూతన సాహిత్య పోకడల ప్రభావంతో ఆధునిక కాలంలో అంటే 19 వ శతాబ్దపు ఉత్తరార్ధం నుండి  సాహిత్య విమర్శ ఆధునిక సాహిత్య ప్రక్రియగా తెలుగులోకి వచ్చిందని సాహిత్య చరిత్రల ఆధారంగా తెలుస్తుంది. ప్రాచీన సాహిత్యంలో గ్రంథపరిష్కార రూపాల్లో, కావ్య వ్యాఖ్యానాల రూపంలో, పీఠిక రూపాల్లో, టీకా, తాత్పార్యాల రూపాల్లో, సమీక్ష రూపాల్లో సాహిత్య పునర్మూల్యాంకన జరుగుతుండేది. దీని అర్థ విస్తృతిని బట్టి సాహిత్య విమర్శగా చెప్పుకోవచ్చు.

ప్రారంభమైన మొదట్లో విమర్శ పరిధి పరిమితంగానే ఉంది. తర్వాతి కాలంలో పరిధిని పెంచుకుంటూ కొన్ని నిర్వచనాలకు, కొన్ని నియమాలకు, ఇంకొన్ని లక్షణాలకు కట్టుబడి విమర్శ తన ఉనికిని కాపాడుకుంటూ ఆధునిక సాహిత్యంలో ఒక నిర్ధిష్టమైన ప్రక్రియగా స్థానం సంపాదించుకుంది. కాలక్రమేణ విమర్శ అనేక రకాలుగా, అన్ని సాహిత్యఉద్యమాల్లో విస్తరిస్తూ విశిష్ట ప్రాధన్యతను సంతరించుకుంటుంది.

**2.2.విమర్శ - పద వివరణ :**

విమర్శ అనే పదానికి ఆంగ్లంలో *criticism* అనే పదాన్ని సమానంగా వాడుతున్నారు. దీనికి నిఘంటువుల్లో పర్యాలోచనం, సమీక్షణం, పరిశోధించు, పరిశీలనం, అవలోకనం, ఆలోచనచేయు, వివేచించు, అరయు అని నానార్థాలు ఉన్నాయి. "క్రిటిసిజమ్ అన్న ఇంగ్లీషు పదం *Kritikos* అన్న గ్రీకు పదంలోంచి వచ్చింది. *Kritikos* అంటే విలువకట్టుట, గుణదోష వివేచన చేయు అని అర్థం. సంస్కృత పదమైన విమర్శ మృశ్ అన్న బంధం ద్వారా ఏర్పడుతుంది. విమర్శ అన్న పదానికి బాగా పరిశీలించటం, లోతుగా చూడటం లాంటి అర్థాలున్నాయి. తెలుగులో విమర్శ అన్న పదానికి పరిశీలించు అన్న అర్థంతో పాటు తప్పులు వెదుకు, వ్యతిరేకించు అన్న అర్థాలు కూడా ఉన్నాయి. కానీ సాహిత్య విమర్శ అన్న పదబంధానికి ఉన్న ప్రధానమైన అర్థం "గుణ దోష విచారణ చేయు అన్నది" (**వెంకట సుబ్బయ్య,వల్లంపాటి.విమర్శ శిల్పం: పుట : 14; జూన్ 2002**).

విమర్శ అంటే ఒక రచనను సమగ్రంగా అధ్యయనం చేయటం, విశ్లేషించటం, దానిలోని బాగోగులను చర్చించటం, సౌందర్యాంశాలను, రచయిత దృక్పథాన్ని వివరించటం, రచన విలువలను, దాని ప్రభావాన్ని అంచనా వేయటం వంటి అంశాలన్నింటిని కలిపి సాహిత్య విమర్శ అనవచ్చు. ఒక రచనను సమగ్రంగా శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించి, గుణగణాలను వివేచించి సాహిత్యతత్త్వాన్ని నిరూపించటం విమర్శలో ప్రధాన అంశం. తనకు లక్ష్యమైన సాహిత్యాన్ని లోతులు వెదకి పరిశీలిస్తుందనీ, పరిశోధిస్తుందనీ, అందులోని అంశాల్ని మళ్ళీ మళ్ళీ ఆలోచనలకు పెట్టి నిగ్గు తేల్చి క్రమబద్ధంగా వివేచించి చూపేదనీ, సాహిత్యతత్త్వాన్ని సమీక్షించేది విమర్శ అని ఏ సాహిత్య పాఠకుడికైనా అవగతమవుతుంది.

## 2.3. సాహిత్య విమర్శ - విమర్శకుడు నిర్వచనాలు :

సాహిత్య విమర్శ అనగా ఒక రచనను తీసుకొని ఆ రచన ఏ సూత్రాల మీద నిర్మించబడిందో పరిశీలించి అవగాహన చేసుకొన్న విషయాన్ని సాధారణీకరించి చెప్పటం. సాహిత్య విమర్శ సూటిగానూ, ఖచ్చితంగానూ,నిష్పక్షపాతంగానూ ఉండి పాఠకలోకంలో ఎటువంటి సందేహాలకు, అనుమానాలకు ఆస్కారమివ్వని రీతిలో ఉండాలి. ఒక రచనను ఇది మంచిదనో లేక చెడ్డదనో తీర్మానించేటప్పుడు ఆ రచన ఎందుకు మంచిదయిందో లేదా ఆ రచన ఎందుకు చెడ్డదయిందో సహేతుకంగా నిరూపించి చూపాలి. అన్ని పక్షాలు విచారించి సరైన న్యాయం వ్యక్తీకరించే న్యాయాధిపతి వంటివాడు కావాలి విమర్శకుడు. తన కేసు ఎలాగయినా గెలవాలని వాదించే న్యాయవాది వంటి వాడు కాకూడదు.గుణగ్రాహి కావాలి. మచ్చరి గొట్టు కాకూడదు (**సారస్వత వ్యాసములు. నాల్గవ పీఠిక; పుట : 7 రోమన్**) ఎన్ని మంచి గుణాలు ఉన్నా పక్షపాతం వదలని విమర్శ దుర్విమర్శ అవుతుంది. అలాంటి విమర్శ ఒక్కొక్క సారి దారుణ పరిణామాలకు దారి తీస్తుంది. విమర్శ అనేది నిష్పక్షపాతంగా, నిస్వార్థంగా ఎటువంటి ప్రాంత, లింగ,కుల,మత బేధాలకు అతీతంగా ఉండకుండా, స్వార్థపూరితంగా, పక్షపాత ధోరణిలో కొనసాగాలి. అప్పుడే విలువలతో కూడిన సాహిత్యం, సాహిత్య విమర్శ వెలువడుతుంది.

విమర్శ అనేది కేవలం నిష్పక్షపాతంగా ఉండటమే కాకుండా సృజనాత్మకంగా పురోగమన శీలంగా ఉండాలి. సాహిత్యం సముద్రమైతే అందులో మునిగి ముత్యాలు తీసే జాలరివంటి వాడు విమర్శకుడు. సాహిత్య స్రష్ట అనేవాడు అడవిని శుభ్రపరచి బాటవేస్తాడు. దాన్ని పరిరక్షించే నిరీక్షకుడి లాంటి వాడు విమర్శకుడు. విమర్శకుడు పరిశీలకుడిగా, పరిశోధకుడిగా, అభ్యుదయ ప్రవక్తగాఎదిగినప్పుడు మాత్రమే అతని విమర్శ సృజనాత్మక విమర్శగా సార్థకము అవుతుంది.(**సుబ్రహ్మణ్యం. జి.వి.పుట :6**)

వస్తుతత్వ పరిశీలనము విమర్శగుటచే, సాహిత్య తత్త్వ వివేచనము సాహిత్యవిమర్శ అగుచున్నది. " ఒక వస్తువు యొక్క స్వరూప, స్వభావాలను బాగుగా పరిశీలించి, దాని మంచి చెడులను వివరించుటయే విమర్శనము'' (**రామారావు,యస్వీ.పుట:1:2007**).

" విమర్శ సంపూర్ణమైన కళకాదు, శాస్త్రం కాదు. కళగా ప్రారంభమై శాస్త్రలక్షణాలను సంతరించుకుంటూ ఉన్న సాహిత్య ప్రక్రియ'' (**వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. పుట : 21; జూన్, 2002**).

" విమర్శ మానవజీవితాన్ని తీర్చిదిద్ది ముందుకు నడుపుతుంది. విమర్శ అంటే సద్వివేకం, విచక్షణాజ్ఞానం. విమర్శ మానవజాతి అభ్యుదయానికి తోడ్పడినట్లేసాహిత్య విమర్శ సాహిత్య వికాసానికి, విస్తృతికి దోహదం చేస్తుంది'' (**రామారావు,యస్వీ.సాహిత్య విమర్శ రీతులు. విమర్శాభినందన: అక్టోబరు, 2004**).
"సాహిత్య శరీర సౌష్టవాన్ని తెలిపేది భాష, హృదయ స్పందనను తెలిపేదికవిత్వం, మానసిక వికాసాన్ని తెలిపేది విమర్శ''(**సుబ్రహ్మణ్యం.జి.వి. ఆధునిక సాహిత్య విమర్శ రీతులు. తెలుగులో సాహిత్య విమర్శ తీరుతెన్నులు (వ్యాసం): పుట : అక్టోబరు, 2004**).

సాహిత్య విమర్శ జ్ఞాన విశ్లేషణ చేసే ప్రక్రియ. రచనల్లో రచయితలు నిక్షేపించినజ్ఞానాన్ని విడదీసి అందులోని మంచి చెడులను సమాజానికి అందించడమే సాహిత్యవిమర్శ. (**చంద్రశేఖరరెడ్డి, రాచపాలెం. చర్చ. తెలుగు సాహిత్య విమర్శ పరిశోధనల మీద వ్యాసాలు. పుట: 133. మార్చి 2010**) పై నిర్వచనాలను పరిశీలిస్తే ఏదైనా ఒక గ్రంథాన్ని తీసుకుని అందులోని గుణాలను, లోపాలను, భావగాంభీర్యాన్ని, అలంకార కూర్పులను, శయ్య, సౌభాగ్యాలను, కథా,కథన విధానాన్ని, పాత్ర పోషణను, సన్నివేశకల్పనను, సొగసును, రసపోషణను, శబ్ద సౌందర్యాన్ని మొదలైన వాటిని కూలంకుషంగా చర్చించి ఆ కవి అనుకరించిన కవుల గురించి, ఆ కవిని అనుకరించిన తర్వాత కవుల

గురించి, ఆ కావ్యం సమాజంపై ప్రభావితం  గురించి చెప్పి వాఙ్మయంలో ఆ గ్రంథ స్థానాన్ని నిరూపించటయే విమర్శగా చెప్పుకోవచ్చు.

ఏ సాహిత్య విమర్శకైనా రచన,రచయిత,పాఠకుడు అనేవి మూడు ప్రధానాంశాలు ఆలంబనగా కొనసాగుతాయి. రచనలోని గుణదోషాలని విశ్లేషించి అది వ్రాయబడిన భాషాసాహిత్య చరిత్రలోస్థానాన్ని మదింపు చేస్తుంది విమర్శ. విమర్శ అంటే తప్పులెంచటం అనే అర్థం కాదు. మొదట ఈ పదం తీర్పునివ్వటం (జడ్జ్ మెంట్) అనే అర్థంలో ప్రయోగింపబడింది. విమర్శకుల ప్రయోగంలో క్రమంగా ఇది అవగాహన, విశ్లేషణ, విశదీకరణ, వ్యాఖ్యానం, అన్వయించటం, ఆనందించటం, అంచనా(వెల)కట్టడంవంటి అంశాలను తనలో ఇమడ్చుకుంటూ అర్థబాహుళ్యాన్ని సంతరించుకొంటూ వచ్చింది **(పేర్వారం, జగన్నాథం. పుట: 256; 1997).**

సాహిత్య విమర్శ చేసేటప్పుడు సాహిత్య విమర్శకుడుకి కొన్ని అర్హతలు ఉంటాయని వల్లంపాటి వెంకట సుబ్బయ్య తన *విమర్శ శిల్పం*లో కిందివిధంగా తెలియజెప్పాడు.

## 2.4.సాహిత్య విమర్శకుడు - అర్హతలు :

1.ఉత్తమపాఠకుడిగా ఉండాలి.

2.సహృదయత ఉండాలి.

3.ఉత్తమ విద్వాంసుడిగా ఉండాలి.

4.అర్హత ఆరోగ్యకరమైన మనస్సు ఉండాలి.

5. తప్పకుండా రచయితగా ఉండాలి అనేది ఒక వాదన?**(వెంకట సుబ్బయ్య,వల్లంపాటి. పుట: 10,11,12. జూన్;2002).**

విమర్శకుని దృక్పథం ఏదైనా ఒక రచనలోని వస్తువుని, పాత్రల స్వరూప స్వభావాలని, సామాజిక భూమికని, నిర్మాణశిల్పాన్ని, ప్రతిపాదిత తత్త్వాన్ని అనుశీలించాలి. చారిత్రక పరిణామ క్రమంలో ఆ రచన స్థానాన్ని అంచనా

వేయాలి. అనుశీలన అన్న గ్రంథంలో వడలి మందేశ్వరరావు విమర్శకుని లక్షణాలని ఈ విధంగా వివరించారు.

**2.5. విమర్శకుని లక్షణాలు :**

1. విమర్శకుని ప్రధాన లక్షణం భావుకత. కవి ప్రయాణం చేసిన మార్గాన్నే విమర్శకుడు పయనాన్ని సాగించాలి.?**(పుట :33)**
2. కావ్యాన్ని చూడగానే తొలుత కనబడేది శబ్దం.ఆ శబ్దం యొక్క లక్షణం విమర్శకునికి తెలియాలి. శబ్దౌచిత్యాన్ని విచారించటమే కాక, అది సహృదయునిలో కలిగించే హృదయ స్పందనని కూడా అతడు వినగల్గాలి. **(పుట:33)**
3. సాహిత్యంలో విశిష్ట స్థానమున్న కవి ఏ రెండు యుగాలకు ఒకే విధంగా కనబడక పోవచ్చును. అందుకే ఏ యుగానికి ఆ యుగం, ఏ తరానికి ఆ తరం కవిని పరిశీలించుకొని అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. విమర్శకునిలో భావుకుడు దీన్ని బాగా ఆకళింపు చేసుకోవాలి. **(పుట: 39)**
4. సాహిత్యాన్ని పరీక్ష చేయటానికి విమర్శకునికి ప్రధానంగా అలవడవలసిన, అలవరచుకోదగిన లక్షణం నిర్మమత.**(పుట: 40)**
5. విమర్శకుని మూర్తిమత్వం విమర్శలో ప్రతిఫలించడం మంచిదికాదు. విమర్శకుని స్వాతంత్ర్యం, అతని ప్రతిభ విమర్శలో ప్రతిఫలిస్తే ప్రమాదం లేదు కానీ అతని ఇష్టాయిష్టాలన్నీ విమర్శలో ప్రతిఫలిస్తే అది విమర్శకాక రచయిత యొక్క అభిరుచులను బట్టి ఇచ్చే వ్యాసమవుతుంది. **(పుట:40)**
6. విమర్శకుడు కవివంటివాడే తన అభిమానాలకు పూర్తిగా వ్యతిరేకమైన దృక్పథాన్ని కూడ సౌమనస్యంతో, కవి ఏ దృక్పథంతో చూశాడో ఆ దృష్టితో చూడడం ఎంత కష్టమైనా విమర్శకునికి అవసరం. **(పుట: 42)**

7. సాహిత్య సిద్ధాంతాలకు లోబడి జరిగే విమర్శలు కొన్ని ఉన్నాయి.. ఇటువంటి సందర్భాలలో మమకారాదులకు అసలే అవకాశం లేదు. ఉన్న కావ్యాలను నిర్ణీతమైన సూత్రాలతో శాస్త్రీయమైన పద్ధతులతో పరిశీలించడమే ఇక్కడ విమర్శకుని పని **(పుట : 42)**

8. కవి సమకాలిక జగత్తు స్పందనలను తన కావ్యంలో వినిపింపజేస్తాడు. విమర్శకుడు సమకాలీన సహృదయులలో ఆ కావ్యం కలిగించే స్పందనలను తన విమర్శలో వినిపింపజేస్తాడు. **(పుట: 43)**

9. నిరంతర కావ్యపఠనం వల్ల పదును తేలిన హృదయంతో సాహిత్య సిద్ధాంతాలను మధించాలి. వాటి విలువలను మదింపు కట్టాలి. విమర్శకు అలంకార శాస్త్రంలోని పారిభాషిక పదాలు తూకపురాళ్ళలా ఉండకూడదు.**(పుట:52)**

10. విమర్శకునికి చారిత్రక దృక్పథం కూడ చాలా అవసరం. కవి దేశకాలాలలో ఆరంభమై, కవిగా అతడు పోషించిన విలువలతో, సాధించిన సాహిత్య గుణాలతో సాగిపోయి, సమస్త సాహిత్యంలోనూ అతని స్థానాన్ని నిర్ణయించడానికి తోడ్పడేటట్లుగా ఉండాలి. **(పుట:53)**

11. విమర్శకునికి ప్రధానంగా కావలసినవి కేవలం రచయిత జీవితంలోని జాబితాలు కావు. విమర్శకుడతని భావుకతలోని వైవిధ్యాన్ని, మేధలోని నైశిత్యాన్ని పరిశీలించాలి. ఇవి రచనల్లో సహస్రముఖాలుగా ఎలా విస్తరిల్లి, రచయిత ఎలా ద్రష్ట కాగల్గాడో కూడ విమర్శ నిరూపించాలి.**(పుట:13)** **(మందేశ్వరరావు, వడలి. అనుశీలన)**

సాహిత్య విమర్శకుడు సాహిత్య జ్ఞాన వ్యాఖ్యాతే కాదు జ్ఞాన ప్రదాత కూడాను. సాహిత్య విమర్శకులకు మూడు రకాలైన జ్ఞానం ఉండవల్సి ఉంటుంది.

1. దృక్పథ జ్ఞానం
2. శాస్త్ర జ్ఞానం

3. కళాసాహిత్య జ్ఞానం. (**చంద్రశేఖరరెడ్డి, రాచపాలెం.చర్చ .తెలుగు సాహిత్య విమర్శ పరిశోధనల మీద వ్యాసాలు. పుట:132,133. మార్చి 2010**)

సాహిత్యం పట్ల ఆసక్తిని కలిగించి తద్వారా మనిషి సంస్కారాన్ని ఉన్నతీకరించి జీవితాన్ని ప్రేమించగలిగేట్లు చెయ్యడం సాహిత్య విమర్శ కర్తవ్యం. (**చంద్రశేఖరరెడ్డి, రాచపాలెం. చర్చ .తెలుగు సాహిత్య విమర్శ పరిశోధనల మీద వ్యాసాలు. పుట:128.. మార్చి 2010**).

సాహిత్య విమర్శలో మూడు ధోరణులు గుర్తించవచ్చు.

1. ఎప్పటిసాహిత్యాన్నైనా ఒకనాటి ప్రమాణాలతో విమర్శించడం
2. ఎప్పటి సాహిత్యాన్ని అప్పటి ప్రమాణాలతో విమర్శించడం
3. ఎప్పటి సాహిత్యాన్నైనా వర్తమాన ప్రఐమాణాలతో విమర్శించడం. ఇందులో మొదటిది అసంబద్ధం, రెండవది అవకాశవాదం, మూడవది అవసరం, శాస్త్రీయం. (**చంద్రశేఖరరెడ్డి,రాచపాలెం.చర్చ.తెలుగు సాహిత్య విమర్శ పరిశోధనల మీద వ్యాసాలు. పుట :130. మార్చి 2010**)

అదే విధంగా సాహిత్య విమర్శకుడి మాదిరిగానే, సాహిత్య విమర్శకి కూడా కొన్ని ధర్మాలు ఉండాలని జి.వి.యస్ కింది విధంగా చెప్పారు.

## 2.6.సాహిత్య విమర్శ ధర్మాలు :

1. వర్ణనం లేదా వివరణ *(Description)*
2. విశ్లేషణ *(Analysis)*
3. వివేచన *(Discrimination)*
4. సమన్వయం *(interpetion)*
5. అనుశీలన *(Evalution)*
6. సిద్ధాంత దర్శనం *(Theory of literature)*(**సుబ్రహ్మణ్యం.జి.వి.ఆధునిక సాహిత్య విమర్శ రీతులు. పుట:1.అక్టోబరు,2004**).

కావ్య పరిశ్రమను గురించి సంపూర్ణమైన అవగాహనను విమర్శకుడు కల్గి ఉండాలి. అప్పుడే అతను చేసిన విమర్శ ఉత్తమ విమర్శగా తయారవుతుంది. సాహిత్యం వజ్రమైతే సానపట్టి ఒక రూపానికి తెచ్చేది విమర్శ. అందుకే మంచి కవికి, మంచి విమర్శకుడికి ముఖ్యమైన మూడు గుణాలు ఉండాలంటాడు రిచర్డ్స్. " *The Qualifiacations of a good critic are three he must be an adept at experiencing without exentricities the state of mind relavent to the work of art he is judging, secondly he must be able to distiguish experiences from one another as regards their less superficial features thirdly he must be a sound judge of values* )***principles of literary criticism*** 14***th impression,*** 1995***, page no :*** 60).

విమర్శకుడు కృతి విలువను కట్టే షరాబు అనీ, విమర్శకుడు వైద్యుడిలాంటి వాడు అని అంటూ వైద్యుడు దేహారోగ్యానికి బాధ్యత వహించే వాడైతే విమర్శకుడు మానసిక ఆరోగ్యానికి బాధ్యుడవుతాడని పేర్కొన్నాడు.

విమర్శకుడు రచయిత కంటే తప్పనిసరిగా ఎక్కువ పాండిత్యాన్ని కలిగి ఉండాలి. అప్పుడే విమర్శకుడు సాహిత్య రచనను అందులోని మంచిచెడ్డలను బాగా విశ్లేషించి చూడగలడు. జీవితాన్ని, సమాజాన్ని అర్థం చేసుకోవడంలో రచయిత అవగాహన లోపాలేవైనా ఉంటే వాటిని పేర్కొని సరిదిద్దుకోవలసిందిగా విమర్శకుడు హెచ్చరిస్తాడు. ఆ అవగాహనలో పడి తప్పుడు జ్ఞానాన్ని పొందవద్దని సాహిత్యలోకాన్ని కూడా విమర్శకుడు హెచ్చరిస్తాడు. విమర్శ వల్ల సాహిత్యంలో అసలైన సృజన రూపాన్ని కేవలం అనుభూతిలో కాక ఆలోచనల వెలుగులో అవగాహన చేసుకోవడానికి వీలవుతుంది. అంతేగాక సమాజాన్ని, జీవితాన్ని సరైన మార్గంలో ఆలోచించి అవగాహన చేసుకోవడానికి పాఠకుడికి సాహిత్య విమర్శ తోడ్పడుతుంది. ఇదే సాహిత్య విమర్శ వల్ల పాఠకుడికి సంక్రమించే ప్రయోజనం.

## 2.7.తెలుగు సాహిత్య విమర్శ ప్రారంభ పరిణామాలు :

తెలుగు సాహిత్య విమర్శకు ఆద్యుడని చెప్పబడుతున్న కట్టమంచి రామలింగారెడ్డి గారి *'కవితత్త్వవిచారము'* అనే గ్రంథం ఆధునిక తెలుగుసాహిత్య విమర్శను ప్రారంభించింది. నాటి నుండి నేటి వరకు విమర్శ కొత్త కొత్త పుంతలను తొక్కుతూ విస్తరిస్తూ వస్తుంది. కట్టమంచి రామలింగారెడ్డి గారు పాశ్చాత్య విమర్శ ప్రభావంతో తెలుగుసాహిత్యాన్ని విమర్శించడానికి ప్రయత్నం చేయగా భారతీయ సంస్కారబలంతో కావ్యాత్మ వివేచన చేయ ప్రయత్నించిన విమర్శకుడు "*విశ్వనాథ సత్యనారాయణ గారు. నన్నయ ప్రసన్న కథాకలితార్థయుక్తి, అల్లసాని అల్లిక జిగి బిగి, నాచన సంవిధాన శిల్పము, శాకుంతలయొక్క అభిజ్ఞానత*" ను అనితర సాధ్యమైన ప్రతిభతో ప్రదర్శించారు. కావ్యానికి ఆయువు పట్టు అయిన ఏకవాక్యతను ఆయనవలె దర్శించిన విమర్శకులు చాలా అరుదు. ప్రాచ్య పాశ్చాత్య లక్షణ సమన్వయంతో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, పింగళి లక్ష్మీకాంతంగార్లు  తెలుగుసాహిత్యంలో విశిష్టమైన విమర్శలు చేశారు. శ్రీశ్రీ, రమణారెడ్డి, ఆర్. యస్. సుదర్శనం గార్లు తెలుగు సాహిత్య విమర్శ రంగంలో ఆధునిక ధోరణులకు ప్రాతిపదిక వేశారు.

ఆధునిక యుగంలో విమర్శ వ్యాసాలు, పీఠికలు, వ్యాఖ్యానాలు, ఉపన్యాసాలు, సమీక్షలు మొదలగు శాఖలుగా విస్తరిల్లింది. శ్రీ శ్రీ ఈ శాఖల ద్వారా సాహిత్య విమర్శ చేశాడు. ఇలా విమర్శ వివిధ స్వరూపాల్ని ధరించి తెలుగుసాహిత్యంలో కనబడుతుంది. కనుక విమర్శ అనేది ఒక స్వతంత్ర రచనా ప్రక్రియ మాత్రం కాదు. ఏదైనా ఒక సాహిత్య రచనను ఆశ్రయించి ఆధారం చేసుకోకపోతే విమర్శకు అస్తిత్వం లేదనేది సత్యం.  అలాగని ఇతర ఏ సాహిత్య రచనా ప్రక్రియ కంటే ఏ మాత్రం తక్కువ రకపు రచనా ప్రక్రియ మాత్రం కాదు. విమర్శ అనేది సృజనాత్మక సాహిత్యంలోని విలువల్ని వెలుగులోకి తెచ్చి

నిలబెడుతుంది. సాహిత్యంలో విమర్శ, విమర్శలో సాహిత్యం పరస్పర సంబంధాన్ని కల్గి ఉంటాయి.

ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ రంగంలో ఆద్యుడిగా చెప్పబడుతున్నవారు కట్టమంచి రామలింగారెడ్డిగారు. విమర్శనము చేయుటలో కథ, పాత్రములు, ప్రకృతి విశేషములు వర్ణనములు ఇవన్నియు పరస్పర మైత్రి కలిగి విరుపులు లేని ఏకాకృతిగా నున్నవా యను విచారణ ప్రధానతమము'(**అభ్యుదయ విమర్శ విశేష సంచిక; ఆధునిక సాహిత్య విమర్శ (వ్యాసం) పుట: 30**). అని గుర్తించినవాడు కట్టమంచి రామలింగారెడ్డిగారు. దేశ చరిత్రకు, సాహిత్యనికి గల పరస్పర సంబంధాన్ని విశదీకరించి ఆధునికమైన సాంఘీక విమర్శనా పద్ధతికి ఆయన మార్గదర్శకుడైనాడు. ఇతడు ప్రతిపాదించిన విమర్శనా సూత్రం భావనాశక్తి అంతవరకు వచ్చిన విమర్శ సూత్రాలకంటే ఇది అధునాతమైంది. కట్టమంచి రామలింగారెడ్డి గారి 'కవిత్వతత్త్వ విచారం'లో తెలుగుసాహిత్య విమర్శ రంగంలోనే నూతన విమర్శ ఆరంభమైంది. ఇది ఆధునిక విమర్శకు ఆవిర్భావ దిశగా చెప్పవచ్చు.

ఆలాగే దువ్వూరి రామిరెడ్డి, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మలు ఆధునిక విమర్శలో సౌందర్య దృష్టిని ప్రతిష్టించారు. విశ్వనాథ సత్యనారాయణగారి విమర్శల్లో శిల్పదృష్టి ప్రబలంగా ఉంది. జి.వి. కృష్ణారావు , పింగళి లక్ష్మీకాంతం గార్లు విమర్శ ధోరణుల్లో సమన్వయ దృక్పథాన్ని పెంచారు.

మంచిని చూపించి అది ఎందుకు మంచిదో చెప్పటం, చెడ్డను బయటపెట్టి అది ఎందుకు చెడ్డదో సహేతుకంగా నిరూపించటం విమర్శలో ప్రధానమైంది. (**శ్రీశ్రీ సాహిత్యం. ఒకటి వచన విభాగం . పుట:222; 1938**).

"మనం ఎవరినైనా విమర్శించటానికి ముందు విమర్శించగల అర్హత సంపాదించుకోవాలి. సాహిత్య విమర్శ అంటే సినిమాల కూటాన్ని, రాజకీయాల

మందల్ని విమర్శించటం కాదు.(**శ్రీశ్రీ సాహిత్యం. ఒకటి వచన విభాగం. పుట:373: 1938**) అని శ్రీ శ్రీ అంటాడు.

తెలుగు విమర్శకుడికి తిట్టడంలో ఉన్న ప్రజ్ఞ మెచ్చుకోవడంలో లేదు అని చెబుతూ తెలుగు వాడికి సరియైన విమర్శ ప్రామాణ్యాలు లేకపోవడమే ఇందుకు కారణమనుకుంటాడు. (**శ్రీశ్రీ సాహిత్యం. ఒకటి వచన విభాగం . పుట: 410, 1938**) శ్రీశ్రీ అభిప్రాయం.

"గొప్ప కవులందరూ సహజంగానూ తప్పనిసరిగా విమర్శకులవుతారు. సహజ ప్రేరణ చేత మాత్రమే నడుపబడే కవులు అసమగ్ర కవులు. ఒక విమర్శకుడు కవి అయితే ఆశ్చర్యపడాలి. కానీ ఒక కవి తనలో ఒక విమర్శకుడ్ని కలిగి ఉండకపోవడం అసాధ్యం. కాబట్టి కవే విమర్శకులందరిలో కన్నా విమర్శకుడు అని నేనంటే పాఠకులు ఆశ్చర్యపడరు అని బోదలైర్ అభిప్రాయం. (**సేకరణ: డా. ముదిగొండి వీరభద్రయ్య:కవి మాత్రమే విమర్శకుడు కావాలా (వ్యాసం): ఉదయం దినపత్రిక. తేదీ:14-9-1989**)

ప్రతి కవి తనలో ఒక విమర్శకుడ్ని కలిగి ఉంటాడనే బోదలైర్ గారి అభిప్రాయమని తెలుస్తుంది. ఇది అక్షరాల నిజం. ప్రతికవి 'డయలిక్టికల్ థీరీ' ప్రకారంగానే కవిత్వాన్ని రాస్తాడు. రచనకు ముందు ఏ విషయాన్ని అయితే కవి దృష్టిలో పెట్టుకొనిరాయదల్చుకుంటాడో ఆ విషయంపై మొట్టమొదట కవి మనస్సులో ఒక భావం మొదలవుతుంది.తర్వాత దానికి పూర్తికి విరుద్ధమైన మరో భావాన్ని సృష్టింపజేసి ఆ రెండు భావాలకూ పోరాటం పెట్టి, సంఘర్షింపజేసి ఆ రెండు చివరకు ఒక సమన్వయ భావ సమన్వితంగా కవిత్వమల్లుతాడు.

ఒక కవి ఒక గ్రంథాన్ని విమర్శ చేసేటప్పుడు సాధారణంగా తన రచనకు అనుగుణంగా ఉండే, అనుకూలంగా ఉండే విమర్శనా విధానాన్నే అనువర్తిస్తాడు. కవి తన రచనల్లో వ్యక్తం చేసిన ఆశయాలకు వ్యతిరేకంగా ఆ రచయిత విమర్శనా పద్ధతి ఉండదు. అలాగే ఒక రచయిత ఏ ప్రక్రియలో ప్రధానంగా రచన చేసాడో

అతని విమర్శ కూడా సాధారణంగా ఆ ప్రక్రియకే పరిమితమై ఉంటుంది. అతడు ఇతర రచయితల్ని, రచనల్ని విమర్శించేటప్పుడు కూడా తన సాహిత్యాన్ని దానికి అనుగుణంగా రూపొందిన విమర్శనాపద్ధతి వెలుగులోనే చేస్తాడు. ఎలాంటి రచయితలయినా, రచనలయినా విమర్శించేటప్పుడు కవులైన విమర్శకులు ఈ సూత్రాలనే పాటిస్తారు.

సాహిత్యానికి, విమర్శకి పరస్పర సంబంధం ఉంటుంది. అందువల్ల అసలే రచయిత కానీ విమర్శకులు, అసలే విమర్శకులు కానీ రచయితలు సాహిత్యరంగంలో ఉండటం చాలా అరుదు. ఒకవేళ ఉన్నా అలాంటి వారు చేసిన రచన అయినా, విమర్శ అయినా సాహిత్యలోకంలో రాణించదు. సాహిత్యం నుంచి సాహిత్య విమర్శ, సాహిత్య విమర్శ నుంచి సాహిత్యం అభివృద్ధి పొందుతూ ఉంటాయి. విమర్శ నుంచి సాహిత్యం పుట్టి విమర్శలో తన పాత్రని నిర్దేశించుకొని సాహిత్య విమర్శకుడు కారణం అవుతుంది. " ఒక కాలంలో ఆమోదాన్ని పొందిన సాహిత్య సిద్ధాంతలకి ఆ కాలంలో వచ్చే కవిత్వానికి పరస్పరం జన్యజనక బాంధవ్యం ఉంటుంది. అంటే కావ్యాల వల్ల విమర్శ సిద్ధాంతం రూపొందగా మళ్ళా విమర్శ సిద్ధాంతం వల్ల కావ్యాలు రూపొందుతాయి'(**నారాయణరావు, వెల్చేరు. పుట:114**) అని వేల్చేరు నారాయణరావు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

సమీక్షా సౌకర్యార్థం? విమర్శ వికాస ప్రగతిని ఈ కింది యుగాలుగా విభజించుకోవచ్చునని జి.వి.సుబ్రహ్మణ్యం గారు తెలిపారు.

1. గ్రంథ పరిష్కార విమర్శ యుగం (క్రీ.శ.1829 – 1874 దాదాపు 45 సంవతత్సరాలు)
2. వికాస యుగం (1874 – 1913 దాదాపు 40 సంవత్సరాలు)
3. కావ్యానుశీలన యుగం ( 1914 – 1948 దాదాపు 35 సంవత్సరాలు)
4. శిల్పానుశీలన యుగం (1948 – 1963 దాదాపు 15 సంవత్సరాలు)

5. సమన్వయ యుగం (1963 – 1970 దాదాపు 8 సంవత్సరాలు)

6. పరిశోధన యుగం (1970 – 1980 దాదాపు 10 సంవత్సరాలు)

7. సమీక్షాయుగం (1980 – 1990 దాదాపు10 సంవత్సరాలు)

8. ఉద్యమ విమర్శయుగం(1991 – 2000 దాదాపు 10 సంవత్సరాలు)

**(సుబ్రహ్మణ్యం. జి.వి. ఆధునిక సాహిత్యవిమర్శ రీతులు. తెలుగులో సాహిత్య విమర్శ తీరుతెన్నులు (వ్యాసం) పుట: 2. అక్టోబరు, 2004).**

పైన చెప్పిన యుగ విభజనలతో పాటు సాహిత్య పరిధి, ప్రాధాన్యతలు నియమ, నిబంధనల సంకెళ్ళను తెంచుకుని భాష, యాస, లింగ, కుల, మత, ప్రాంతాలలో ఉన్న జీవనవిధానం, వారి హృదయ స్పందనలే ఈ రోజు సాహిత్యంగా చెలామణి అవుతున్నాయి కనుక అధ్యయన సౌలభ్యం కొరకు ఇప్పుడు సాహిత్యాన్ని ఈ కింది విధమైన విభజనను జి.వి.యస్ గారి విభజనకు అదనంగా చేర్చుకోవచ్చునని నా అభిప్రాయం.

9. ప్రాంతీయ సాహిత్య విమర్శ యుగం

10. బహుజన సాహిత్య విమర్శ యుగం

11. మైనార్టీ సాహిత్య విమర్శ యుగం

12.గిరిజన సాహిత్య విమర్శ యుగం

13.దళిత సాహిత్య విమర్శ యుగం

14.మాదిగ సాహిత్య విమర్శ యుగం .... అని మరికొంత విస్తృతంగా అధ్యయనం చేయవచ్చు.

తెలుగులో వచ్చిన సాహిత్య విమర్శ వికాస దశావలోకనాన్ని కొల్లూరి వెంకటేశ్వరరావు ఈ విధంగా విమర్శ దశలను సూచించాడు.

1. ఆధునికత ప్రారంభదశ

2. పునరుజ్జీవనోద్యమ సాహిత్య విమర్శ

3. కాల్పనికోద్యమ సాహిత్య విమర్శ

4. హేతువాద సాహిత్య విమర్శ
5. అభ్యుదయోద్యమ సాహిత్య విమర్శ
6. విప్లవ సాహిత్య విమర్శ
7. నవ్యసంప్రదాయ సాహిత్య విమర్శ
8. స్త్రీవాద సాహిత్య విమర్శ
9. దళితవాద సాహిత్య విమర్శ
10. ఆధునికోత్తర సాహిత్య విమర్శ **(వెంకటేశ్వరరావు, కొల్లూరి. విమర్శకుడిగా కె.వి. రమణారెడ్డి, పుట:6,జూన్ 2004)**

అదే విధంగా తెలుగు సాహిత్య విమర్శ వికాసాన్ని స్థూలంగా నాలుగు దశలుగా వింగడించవచ్చు.

1. ఆధునిక తొలి దశలో జరిగిన విమర్శ అంతా కవి జీవితం, కావ్యభాష, ఛందస్సు, అలంకారాలకు సంబంధించింది. విమర్శ అంటే ఈ దశలో రచనా గుణదోష పరిశీలనగా భావించారు.
2. రెండవ దశలో కవిత్వతత్త్వ వివేచన మొదలైంది. పాశ్చాత్య సాహిత్య విమర్శ ప్రభావంతో తెలుగు సాహిత్యవిమర్శలో కొత్త దృక్పథాలు చోటు చేసుకున్నాయి. భావనాశక్తి ప్రాముఖ్యాన్ని విమర్శకులు గుర్తించారు. ఈ దశలో తెలుగు సాహిత్య విమర్శ ఆధునికతను సంతరించుకొంది.
3. మూడవ దశలో నవ్యసాహిత్య విమర్శ వెలువడింది. భారతీయ ఆలంకారిక సిద్ధాంతాలను, పాశ్చాత్య సాహిత్య కళా సిద్ధాంతాలను మేళవిస్తూ సమన్వయ దృష్టితో విమర్శలు వెలయించారు.
4. నాల్గవ దశలో మార్క్సిస్టు దృక్పథం ప్రభావంతో విమర్శ రచనలు వెలువడ్డాయి. సాహిత్యానికొక సామాజిక ప్రయోజనం ఉంటుందని స్పష్టంగా గుర్తించిన దశ. దానికి అనుగుణంగానే రచన చేయాలని మార్క్సిస్టు విమర్శకులు చెప్తారు. ఒక రచనను సామాజిక, ఆర్థిక,

చారిత్రక, సాంస్కృతిక నేపథ్యాన్ని బట్టి పరిశీలించటం ఈ దశలోనే మొదలైంది. మనోవైజ్ఞానిక దృక్పథ విమర్శ కూడా ఈ దశలోనే.(**వెంకటేశ్వరరావు**, **కొల్లూరి**. **విమర్శకుడిగా కె.వి.రమణారెడ్డి: పుట:11**, **జూన్ 2004**).

ఇక్కడ పరిశోధకుడు విభజనలో స్థూల దృష్టితో చేసిందని చెప్పుకున్నాడు. ఈ గ్రంథం వెలువడిన సంవత్సరం 2004 కనుక అప్పటికే మార్క్స్ ప్రభావం చాలా వరకు తగ్గి అంబేద్కర్ ప్రభావం సమాజ, సాహిత్యంలో చోటుచేసుకుంది. రచయిత ఈ విషయాన్ని విస్మరించి కేవలం మార్క్స్ వరకే విమర్శ రంగాన్ని విభజించే ప్రయత్నం చేశాడు. అప్పటికే అతివేగంతో ముందుకు పోతున్న అస్తిత్వ ఉద్యమ సాహిత్యాన్ని ఈ యుగ విభజనలో చేర్చకపోవటంలో రచయిత విఫలం అయ్యాడనే చెప్పాలి.

## 2.8.విమర్శ లక్షణాలు :

1. కావ్యమును విశ్లేషణ పూర్వకముగా, తారతమ్య నిర్ధారణాత్మకంగా వ్యాఖ్యానము కావించు విమర్శ శాస్త్రం.
2. కవిత్వము హృదయానికి సంబంధించింది. విమర్శనము మేధాశక్తి సంబంధించింది.
3. కవి భావనాశక్తి వలన లోకంలో ఉన్న విషయాలను గమనించి కావ్యాన్ని రాస్తాడు.అలాగే విమర్శకుడు కూడా లోకంలో ఉన్న విషయాలను(కవిలా గమనించి)తన మేధాశక్తి ద్వారా గమనించి విమర్శ చేస్తాడు. అందువలన విమర్శ ఒక కళ.
4. కావ్య వ్యాఖ్యానమైన విమర్శ భావుకుడైన కవికి, సహృదయుడైన పాఠకునికి మధ్య వారధిగా చెప్పవచ్చు.
5. విమర్శ ప్రధానంగా బుద్ధి వ్యాపారము (**తెలుగు సాహిత్య విమర్శ అవతరణ వికాసాలు**, **రామారావు**, **యస్వీ**, **పుట:1**)

## 2.9.తెలుగు సాహిత్య విమర్శ రకాలు :

తెలుగు అధ్యయనం ఆరంభం అయినప్పటి నుండి ఇప్పటి వరకు వచ్చిన విమర్శను దాని స్వభావ రీత్యా,స్వరూప రీత్యా అది వచ్చిన కాలాన్ని బట్టి ఈ కింది విధమగా విభజన చేసుకోవచ్చు.

అవి,

- ❖ వ్యాఖ్యానాత్మక విమర్శ
- ❖ కవిజీవిత విమర్శ
- ❖ చారిత్రక విమర్శ
- ❖ ప్రక్రియాపర విమర్శ
- ❖ తులనాత్మక విమర్శ
- ❖ శిల్ప విమర్శ
- ❖ మనోవిజ్ఞానిక విమర్శ
- ❖ శైలీశాస్త్ర విమర్శ
- ❖ మార్క్సిస్టు విమర్శ
- ❖ స్త్రీవాద సాహిత్య విమర్శ
- ❖ దళితవాద సాహిత్య విమర్శ

### 2.9.1.వ్యాఖ్యానాత్మక విమర్శ :

విమర్శ ప్రారంభమైన మొదట్లో శబ్దార్థాలకు, ఛందోవ్యాకరణాలకు వ్యాఖ్యలు వచ్చాయి. దీనినే మనం వ్యాఖ్యాన విమర్శగా చెప్పుకోవచ్చు. వీటిలో ప్రధానంగా చెప్పదగినవి వేదం వెంకటరాయశాస్త్రి గారు శృంగార నైషధానికి రాసిన సర్వంకషవ్యాఖ్య. ఆముక్తమాల్యదకు రాసిన సంజీవని వ్యాఖ్య,

చేమకూరివెంకట కవి విజయవిలాస కావ్యానికి రాసిన తాపీధర్మారావు హృదయోల్లాసవ్యాఖ్య ప్రసిద్ధమైనవి.

### 2.9.2.కవిజీవిత విమర్శ :

కవిజీవితానికి, కావ్య రచనకు ఉన్న సంబంధాన్ని పరిశీలిస్తూ సమన్వయిస్తూ చేసే విమర్శ కవిజీవిత విమర్శ. కావ్యంలో ప్రతిఫలించే కవి ఆత్మీయత, కవి భౌతిక, మానసిక విశేషాలు కావ్యరచనకు దోహదం చేసిన తీరు విశ్లేషించటం జరుగుతుంది. ఆంగ్లంలో డ్రైడన్, జాన్సన్, ఆర్నాల్డ్ మొదలగువారు ఇటువంటి విమర్శకు మార్గదర్శకులు. తెలుగులో అనంత కృష్ణశర్మ(వేమన), కె.వి.రమణారెడ్డి (గురజాడ, కవికోకిల) మార్గదర్శకులు. ఈ పద్ధతిలో వచ్చిన విమర్శ గ్రంథాలకు ఉదాహరణ, కందుకూరి వీరేశలింగం–సమగ్రపరిశీలన. – డా. అక్కిరాజు రమాపతిరావు, తాపీధర్మారావు జీవితం – సాహిత్యం. – డా. ఏటుకూరి ప్రసాదు మొదలైన సాహిత్య విమర్శ గ్రంథాలు.

### 2.9.3.చారిత్రక విమర్శ :

కావ్యం రచింపబడిన కాలానికి సంబంధించిన మత, రాజకీయ, సాంఘీక, చారిత్రక అంశాలకు ప్రాముఖ్యతనిస్తూ వాటికి కావ్యానికి గల సంబంధాన్ని పరిశీలించటమే చారిత్రక విమర్శ. ఈ విమర్శకు ప్రారంభకుడు వికో అనే తత్త్వవేత్త. తెలుగులో ఇటువంటి విమర్శకు ఉదాహరణ. డా.సురవరం ప్రతాపరెడ్డి – ఆంధ్రుల సాంఘిక చరిత్ర. రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ రాయలనాటిరసికత, రాచమల్లు రామచంద్రారెడ్డిగారు మహీధర మోహన్ రావు గారి కొల్లాయిగట్టితేనేమి నవలపై విమర్శ మొదలైనవి.

### 2.9.4.ప్రక్రియాపర విమర్శ :

పురాణాలు, ప్రబంధాలు, కథలు, ఖండకావ్యాలు, గేయ, వచన రచనలు మొదలైన సాహిత్య ప్రక్రియలను దృష్టిలో పెట్టుకొని చేసే విమర్శ. ఉదాహరణ:

ఆధునికాంధ్ర గేయకవిత్వం–డా.చెన్నకేశవరెడ్డి, –డా.దివాకర్ల వేంకటావధాని, జానపద గేయ సాహిత్యము – డా.బి.రామరాజు.. మొదలైనవి.

### 2.9.5.తులనాత్మక విమర్శ :

రచనల మధ్య, రచయితలు మధ్య గల వస్తు సంబంధమైన , ప్రక్రియ పరమైన, శైలీ పరమైన పోలికలను తేడాలను గుర్తించటమే తులనాత్మక పరిశీలన జర్మన్ సాహిత్యంలో గేథే, ఫ్రెంచ్ లో వెల్ తులనాత్మక పరిశీలనకు ప్రారంభకులు.

తెలుగులో తులనాత్మక పరిశీలనకు ఉదాహరణ: మను,వసు చరిత్ర రచనా విమర్శనము – పెన్నేటి రామచంద్రరావు, కాళిదాసభవభూతులు, మహాభారత, రామాయణములు – విశ్వనాథసత్యనారాయణ తదితరమైనవి.

### 2.9.6.శిల్ప విమర్శ :

శిల్పం అంటే కావ్య నిర్మాణకౌశలం. కవి ప్రదర్శించిన ఆ నేర్పును వివరించేది శిల్పవిమర్శ. కావ్య సౌందర్యం, కథాకథనం, పాత్ర చిత్రణ మొదలైన అంశాలన్ని ఇందులో ఉంటాయి. వీటన్నింటిని కవి ఏకవాక్యతను అంటే సమన్వయాన్ని కలిగించాడా అని వివరించటమే శిల్పవిమర్శ. ఆంగ్లంలో టి.యస్.ఇలియట్,ఇ.ఎ.రిచర్డ్స్ మొదలైనవారు ఈ విమర్శను కొనసాగించారు. తెలుగులో నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తి, అల్లిసానివారి జిగిబిగి, ఒకడు నాచనసోమన, శాకుంతల యొక్క అభిజ్ఞత మొదలైనవి శిల్ప విమర్శకు ఉదాహరణలు. ఈ విమర్శలో విశ్వనాథ సత్యనారాయణ ప్రసిద్ధులు.

### 2.9.7.మనోవిజ్ఞానిక విమర్శ :

సిగ్మండ్ ఫ్రాయిడ్, ఆడ్లర్ యూండ్ మానసికతత్త్వ విశ్లేషణ సిద్ధాంతాలను సాహిత్యానికి అన్వయించి చేసే అనుశీలనమే మనోవైజ్ఞానిక విమర్శ. సామాన్యమానవుని ప్రవర్తనకు భిన్నంగా విపరీతంగా ఆలోచించి, ప్రవర్తించే వారి చర్యలు, వ్యక్తి అచేతన స్థితిలోని సంఘర్షణలు, ప్రవర్తనపై వాటి ప్రభావం

మొదలైన అంశాలు సాహిత్యానికి అన్వయించే విమర్శ ఇది. ఇటువంటి విమర్శను ఆర్.యస్. సుదర్శనం తెలుగులో తీసుకువచ్చారు. ఉదాహరణకు, అల్పజీవి పాత్ర విశ్లేషణ–మాదిరాజు రంగారావు, తెలుగు నవలలో అసమర్థనాయకుడు – పణతుల రామచంద్రయ్య మొదలైన విమర్శలు వచ్చాయి.

**2.9.8.శైలీశాస్త్ర విమర్శ :**

కవి భావాభివ్యక్తికి కావ్యంలోని భాష ఏ విధంగా ఉపయోగపడుతుంది అనే దృష్టితో ఈ విమర్శ సాగుతుంది.సాహిత్య రచనలోని కళాత్మకమైన భాషా ప్రయోగాన్ని వివరించే పద్దతి ఇది. ఉదాహరణకు, ఆంధ్రమహాభారతం శైలీ విమర్శనం – పరిమి రామనరసింహం.

**2.9.9.మార్క్సిస్టు విమర్శ :**

సాహిత్యాన్ని గతితార్కిక భౌతికవాద దృష్టితో సమన్వయపరచేది మార్క్సిస్టు విమర్శ. సామాజిక వ్యవస్థకు ఆర్థిక శక్తి పునాది. దీనిపైనే మానవసంబంధాలు ఆధారపడి ఉంటాయి. విరుద్ధ వర్గాల మధ్య సంఘర్షణ తప్పదు, కనుక వర్గపోరాటం ద్వారానే సమాజ సంక్షేమం వెలువడుతుంది అనే అంశాలను సాహిత్యంలో ప్రతిఫలింపజేస్తూ తెలియజెప్పే విమర్శే మార్క్సిస్టు సాహిత్య విమర్శ. తెలుగులో శ్రీ శ్రీ, కొడవటిగంటి కుటుంబారావు, కుందుర్తి ఆంజనేయులు, కె.వి.రమణారెడ్డి, చేకూరి రామారావు, వి.చెంచయ్య ప్రసిద్ధులు. తెలుగులో ఈ కోవలో వచ్చిన గ్రంథాలు సాహిత్య ప్రయోజనం– కొడవటిగంటి కుటుంబరావు, సారస్వత ప్రయోజనం–రాచమల్లు రామచంద్రారెడ్డి,శ్రీశ్రీ మహాప్రస్థానం ఒక పరిశీలన – అద్దేపల్లి రామమోహనరావు

**2.9.10.స్త్రీవాద సాహిత్య విమర్శ :**

స్త్రీల అణచివేతకు వ్యతిరేకంగా వచ్చిన కవితా ఉద్యమమే స్త్రీవాదం. పురుషాధిక్యత, స్త్రీల హక్కుల సంరక్షణ మొదలైన వాటితో వచ్చిన సాహిత్యాన్ని సమీక్షించేదే స్త్రీవాద సాహిత్య విమర్శ. వీరిలో జయప్రభ, రంగనాయకమ్మ, ఓల్గా,

కుప్పిలి పద్మ మొదలైన వారు విమర్శ వ్యాసాలు రాస్తున్నారు. ఉదా: భావకవిత్వంలో స్త్రీ – జయప్రభ సంప్రదాయ సాహిత్యం – స్త్రీవాద దృక్పథం – కాత్యాయనీ విద్మహే,స్త్రీవాద వివాదాలు – యస్వీ.సత్యానారాయణ మొదలైనవి చాలా స్త్రీవాద సాహిత్య విమర్శలో వచ్చాయి.

**2.9.11.దళితవాద సాహిత్య విమర్శ :**

అంటరానివారిగా బడికి, గుడికి, ఊరికి, వాడకి దూరంగా బ్రతుకుతున్న జీవితాల అనుభవ సారమే దళితసాహిత్యం. ఈ కోణం నుండి వారి సమస్యలను, వారి లక్ష్యాలను సమన్వయపరిచేదే దళితసాహిత్య విమర్శ. దీనికి మహారాష్ట్ర దళిత ఫాంథర్స్ సాహిత్యం ప్రధాన భూమికగా నిలిచింది. దళిత సాహిత్యానికి , దళిత సాహిత్య విమర్శకు బుద్ధుడు, పూలే, అంబేద్కర్ ఆలోచనల విధానమే కేంద్రబిందువు అయ్యాయి.

పైన తెల్పినట్లు తెలుగు సాహిత్య విమర్శ ఎన్నో బేధాలతో , ఎన్నో ప్రమాణాలతో, ఎంతో వైవిధ్యంతో కొనసాగింది. ఈ మధ్యకాలంలో అస్తిత్వ సాహిత్య విమర్శ, బహుజన విమర్శ అనీ, మైనార్టీ సాహిత్య విమర్శ అనీ, బి.సి ల సాహిత్య విమర్శ అనీ తరచుగా మనకు వినిపిస్తున్న ధోరణులు. ప్రస్తుతం అంశం దళిత సాహిత్య విమర్శ అంటే ఏమిటి ? దాని నిర్మాణం ఎలా జరిగింది? దానికి ఉన్న ప్రమాణాలు ఏమిటి? తెలుగు సాహిత్యంలో దీని ఉనికి ఎలా ఉంది అనే విషయాలను శాస్త్రీయబద్ధంగా చర్చించుకుందాం.

**2.10.తెలుగు సాహిత్య విమర్శ - దళిత సాహిత్య విమర్శ :**

తెలుగు సాహిత్య విమర్శ ప్రారంభమైన కొత్తలో కొన్ని కొన్ని సాహిత్య వాదాలకు పరిమితమైన సాహిత్య ప్రక్రియ కాలక్రమంలో దళిత, దళితేతర రచయితలో వచ్చిన చైతన్యం కారణంగానూ, కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావాల వల్ల దళితసాహిత్యంలో పుస్తకాల సమీక్ష, కావ్యాల ముందుమాటల రూపంలో, కవిత

సంకలనాలకు సంబంధించిన విశ్లేషణ దళితసాహిత్యంలో ప్రారంభమైంది. దీనినే దళిత సాహిత్య విమర్శగా చెప్పుకోవచ్చు.

### 2.11.దళిత సాహిత్య విమర్శ – నిర్వచనం :

ప్రస్తుత కాలంలో దళిత సాహిత్యం, దళిత సాహిత్య విమర్శ 1980 నుండి అద్వితీయంగా ఎదుగుతూ వస్తున్నది. *"ఈ ప్రపంచాన్ని సామాజిక, రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక పరిణామాన్ని దళితుల దృష్టికోణంలో, దళితుల అలంకారశాస్త్రాల కోణంలో, దళితుల అభ్యున్నతి కోణంలో పరిశీలించటం, విశ్లేషించటం, వ్యాఖ్యానించటం దళిత సాహిత్య విమర్శ"* అవుతుంది. (**ఆధునిక సాహిత్య విమర్శ రీతులు – దళిత దృక్పథం:పుట సంఖ్య:274**)


### 2.12.దళితులు - దళిత సాహిత్య విమర్శ :

దళితులు అంటే నిర్దిష్ట అర్థంలో షెడ్యూల్డ్ కులాలు, అంటరాని కులాలను షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చారు. అందువల్ల దళిత సాహిత్యం అంటే వేల సంవత్సరాలుగా అణగారిన, అంటరాని కులాల జీవితం,సంస్కృతి, సమాజంలో వారి ఎదుగుదల, సమానత్వం, స్వేచ్ఛ, ఆత్మగౌరవం, సోదరత్వం గురించి నొక్కిచెప్పేది. అందుకు అడ్డంకిగా ఉన్న విభిన్న పాతభావాలు, సంస్కృతి, జీవన విధానాలు కొన్ని కులాల ఆధిక్యత, వివక్షత, అసమానత అన్ని రంగాలలో ప్రశ్నించడం, ఖండించడం, దళితుల జీవితం, సంస్కృతి చిత్రిస్తున్న తీరుతెన్నులు వారి పట్ల గల వివక్షతను ఖండించి, సమానత్వాన్ని నెలకొల్పి, సమాజం దళితుల అభ్యున్నతికి అనువుగా మారేట్లు కృషి చేయడం దళిత సాహిత్య లక్షణం. దీని క్రమపద్ధతిన సాహిత్యదృక్పథాన్ని విశ్లేషించేది దళిత సాహిత్య విమర్శ.(**తెలుగులో సాహిత్య విమర్శరీతులు. పుట: 275**).

దళిత సాహిత్య విమర్శ సాహిత్యం ఆరంభమైన నుండి వచ్చింది. సంస్కరణోద్యమంలో అంతర్భాగంగా చాలా మంది దళిత రచయితలు సంప్రదాయ ధోరణిలో కొంత పద్యకవిత్వాన్ని అస్పృశ్యనివారణోద్యమంలో

సృజనీకరించారు. ఆయా కావ్యాలకు ముందు మాటలు, వ్యాఖ్యాలు రావటం జరిగింది. తర్వాతి కాలంలో జాతీయోద్యమంలో కూడా కొంత సాహిత్యం రావటం జరిగింది. తదనంతరం వచ్చిన భావ, అభ్యుదయ, విప్లవకవితా ఉద్యమాల్లో రేఖామాత్రంగా దళితకవిత్వాన్ని దళిత, దళితేతర రచయితలు కొంత సాహిత్యాన్ని సృష్టించారు. ఆ తర్వాత కాలంలో తమకంటూ సొంత వేదిక కావాలనీ, తమ బాధలు, గాథలు తామే స్వయంగా వినిపించాలని 1980 ప్రాంతంలో బుద్ధుడు, పూలే, కబీర్, అంబేద్కర్ ఆలోచనా విధానాలను నేపథ్యంగా దళిత సాహిత్యం ఏర్పడింది. అంతకు ముందు కూడా దళిత సాహిత్యం ఉంది కానీ అది కమ్యూనిస్టు గొడుగు కింద వర్గ దృక్పథంతో కొనసాగింది. దీనిని విమర్శిస్తూ ముందు కులనిర్మూలన పోరాటాలు ముఖ్యమని భావించి చాలా దళిత మేధావులు దళితసాహిత్యాన్ని వాస్తవిక ధోరణితో సృష్టించారు.

ఇలా వచ్చిన దళిత సాహిత్యాన్ని, సాహిత్య విమర్శను ప్రధానంగా మూడు తరాలుగా విభజించుకోవచ్చు. అవి,




మొదటి తరం ఇది సంప్రదాయ/ సంస్కరణ ధోరణి. మొదటి తరంలో సాహిత్య రచన , సాహిత్య విమర్శ చేసిన వారు గుర్రం జాషువా, కుసుమ ధర్మన్న, జ్ఞానానందకవి, బోయి భీమన్న మొదలైనవారు ప్రసిద్ధులు.

రెండవతరం – ఇది కమ్యూనిస్టు ధోరణి/వర్గ పోరాట ధోరణి. దీనిలో జి. కళ్యాణరావు,కె.జి,సత్యమూర్తి,యస్వీ.సత్యనారాయణ,రంగనాయకమ్మ,కె.కె.ఆర్. మొదలైనవారు ప్రముఖులు.

మూడవతరం – ఇది అంబేద్కర్ ఆలోచనా ధోరణి. ఈరోజు సాహిత్యం రాస్తున్న యువరచతయిలంతా దాదాపు అంబేద్కర్ ఆలోచనలతో సాహిత్యం రాస్తున్నవారే. వారిలో బొజ్జా తారకం, కొలకలూరి ఇనాక్, గుజ్జర్లమూడి కృపాచారి, కత్తి పద్మారావు, కొండపల్లి సుదర్శనరాజు, ఎండ్లూరి సుధాకర్, శిఖామణి, సతీష్ చందర్, కోయికోటేశ్వరావు, దార్ల వెంకటేశ్వరరావు, మేడిపల్లి రవికుమార్. కొలకలూరి మధుజ్యోతి, కొలకలూరి ఆశాజ్యోతి, చల్లపల్లి స్వరూపరాణి, వినోదిని, జూపాక సుభద్ర, గోగుశ్యామల మొదలైన వారు చాలా మంది దళితసాహిత్యాన్ని, దళిత సాహిత్య విమర్శను రాస్తున్నారు.

ఈ మధ్యకాలంలో దళిత స్త్రీలు మరికొంత ముందు చూపుతో దళిత స్త్రీల సాహిత్యాన్ని రాస్తున్నారు. అదే కోవలోనే ప్రాంతాల వారీగా తెలంగాణా దళిత సాహిత్యం, ఆంధ్ర దళిత సాహిత్యం అని వస్తున్న క్రమంలో సాహిత్య విమర్శ కూడా వస్తుంది. ఈ పరిస్థితులన్నింటిని అధ్యయనం చేసిన దళితబహుజన మేధావి బి. యస్. రాములు దళిత సాహిత్యాన్ని , విమర్శను, పరిణామాలను, దృక్పథాలను ఇలా క్రోఢీకరించాడు.

1. షెడ్యూల్డ్ కులాలకు పరిమితమైన అంబేద్కరిస్టు దృక్పథం.
2. మాదిగ దండోరా తర్వాత షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ వారిగా కొనసాగుతున్న అంబేద్కరిస్టు మాదిగ, మాల సాహిత్య దృక్పథం.
3. అంబేద్కరిస్టు దృక్పథం స్థానంలో దళిత క్రైస్తవ దృక్పథం.
4. గాంధేయవాద దళిత దృక్పథం.
5. అరసం పరిమితులకు లోనైన మార్క్సవాదం – దళిత దృక్పథం.
6. విరసం పరిమితులకు లోనైన మార్క్స మావో వాద దళిత దృక్పథం.

7. ఫెమినిస్టు పరిమితులకు లోనైన దళితవాద సాహిత్యవిమర్శ.
8. దళిత స్త్రీవాద సాహిత్య దృక్పథం.
9. తెలంగాణా ప్రాంతీయ వాద దళిత సాహిత్య విమర్శ దృక్పథం.
10. బి.సీ.ఎస్సీ, ఎస్టీలు అందరిని తన పరిధిలోకి తీసుకునే సాధారణ దళిత సాహిత్య విమర్శ దృక్పథం.
11. 1996 నుండి అంబేద్కరిస్టు దృక్పథంతో ప్రత్యేక శాఖగా రూపుదిద్దుకున్న బిసి వాద, దళిత సాహిత్య విమర్శా దృక్పథం.
12. వర్ణ వాద, హిందూ వాద దళిత సాహిత్య విమర్శ దృక్పథం.
13. మానవతావాద దృష్టిలో భాగంగా దళిత సాహిత్య విమర్శ దృక్పథం.
14. 1993 నుండి దళిత వాద మధ్యతరగతి పరిమితులకు లోనైన దళిత సాహిత్య విమర్శ దృక్పథం.
15. 1993 నుండి వచన కవితకు పరిమితమైన మధ్య తరగతి దళిత సాహిత్య విమర్శ దృక్పథం.
16. దళిత నాటక సాహిత్య విమర్శ దృక్పథం.
17. బుద్ధిస్టు దళిత సాహిత్య విమర్శ దృక్పథం.
18. అంబేద్కరిస్టు గిరిజన వాద దళిత సాహిత్య విమర్శ దృక్పథం.
19. అంబేద్కరిస్టు ముస్లింవాద దళితసాహిత్య విమర్శ దృక్పథం.
20. నక్సలిస్టు, మావోయిస్టు దళిత వాద సాహిత్య విమర్శ దృక్పథం.

**(పుట :291)** ఇదే విధంగా దళిత సాహిత్య విమర్శ యొక్క ధోరణులను, దాని పరిణామాలను అవి వస్తున్న తీరుని శాస్త్రీయబద్ధంగా ఆచార్య దార్ల వెంకటేశ్వరావు కింది విధంగా వివరించాడు.

1. ప్రాచీన కావ్యాలలో సామాన్య పాత్రలకు కనీస అవకాశం కల్పించలేదు. సమాజంలో కేవలం కొన్ని వర్ణాల వారి ఆలోచనలతో కూడిన సాహిత్యంగా ప్రచారం పొందింది.

2. అలంకార శాస్త్రాలు, లక్షణ గ్రంథాలు చాలా వరకు నిమ్న వర్ణాల గురించి రాయటాన్ని అంగీకరించలేదు. తప్పనిసరి పరిస్థితులలో కొన్ని పాత్రలను ప్రవేశపెట్టినా వాటిని నీచ పాత్రలుగానే చిత్రించాయి. సమాజంలో కొన్ని వర్ణాల వారే సుగుణ స్వభావం కలిగి ఉంటారనే దృక్పథం వాస్తవానికి దూరంగా ఉంది.

3. కొన్ని వందల యేండ్ల సాహిత్యం అంతా అసత్యాలతో నిండి పాలక వర్గాల ఆధిపత్యంలో కొనసాగింది. దళితులను అణచివేసే దిశగా ప్రజల భాషకే మాత్రం సంబంధంలేని సంస్కృత భాషలో, ఆ భాషానువాదాలతో దాని మనుగడ కొనసాగింది.

4. ఆధ్యాత్మిక భావాల పేరుతో భావవాదాన్ని ప్రచారం చేసి సాహిత్యం ద్వారా శాస్త్రీయమైన ఆలోచనకు అవకాశం కలగనివ్వలేదు. విదేశీపాలకుల ప్రవేశంతో హిందూ మత పరిరక్షణకు వివిధ పేర్లతో సంస్కరణ విధానాలను పాటించినా, దళిత సాహితీ వేత్తలు ఆ నేపథ్యాన్ని గుర్తెరిగి సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం జరగాలి. మౌఖిక సాహిత్యంలో ఉన్న దళితులు మూలాలు బహిర్గతమనే ప్రయత్నం జరగాలి.

5. దళితులను అణచివేసిన భావజాలమే బ్రాహ్మణవాదం. బ్రాహ్మణులను లేదా ప్రత్యేకంగా కొన్ని కులాలను నిందించటం దళిత సాహిత్య విమర్శ ధోరణి కాదు.

6. తెలుగులో దళిత సాహిత్యాన్ని తెలంగాణ ప్రాంతపరంగానూ, ఆంధ్ర ప్రాంతపరంగానూ ప్రత్యేక పరిశీలనలు అవసరం. కారంచేడు సంఘటనతోనే తెలుగు దళిత సాహిత్య చరిత్ర అంబేద్కర్ దృక్పథంతో ప్రారంభమైంది అనటంలో ఆంధ్రప్రాంత దళిత రచయితల ఆధిపత్యం కనిపిస్తుంది. ఆంధ్ర ప్రాంత రచయితల రచనలలో క్రైస్తవ మతం,

తెలంగాణ ప్రాంత రచయితల రచనలలో హిందూ, ముస్లిం మత విప్లవ సాహిత్య భావాలలో స్పష్టమైన విభజన రేఖను విస్మరిస్తున్నారు.

7. ఎవరి కులం గురించి వాళ్ళు మాత్రమే కుల సంఘాలకు పరిమితమైన దృష్టితో పరిమిత ప్రయోజనంతో సాహిత్యం కుదించుకుపోతుంది. అందువల్ల దళిత సాహిత్య చరిత్ర పునర్మూల్యాంకనం చేసేటప్పుడు ఏ కులంలో పుట్టారనే దానితో పాటు ఆ రచయితలు దళితుల గురించి రాశారో లేదో పరిగణలోకి తీసుకోవాలి.

8. దళిత సాహిత్య చరిత్రను అంటరానితనం, కులవ్యవస్థ మొదలైనప్పటి నుండి పరిశీలించాలి. దీనిలో భాగంగానే చిందు భాగవతం, జాంబ పురాణం చూడాలి.

9. దళిత సాహిత్యంలో విడదీయరాని బంధాన్ని పెనవేసుకున్న క్రైస్తవ సాహిత్యాన్ని అధ్యయనం చేసేటప్పుడు మత దృక్పథం పట్ల ప్రత్యేక సూత్రాలతో విశ్లేషించాలి.

10. కుల నిర్మూలనతోనే దళితుల విముక్తి సాధ్యమవుతుందా? వర్గ దృక్పథం కూడా అవసరమా? అయితే అది ఎంతవరకు అవసరమనేది స్పష్టం చేయవలసిన అవసరముంది. దేశీయ మార్క్సిజం పేరుతో జరిగిన చర్చ కొంతవరకు ఈ విషయాన్ని ముందుకు తీసుకెళ్ళింది.

11. దళితసాహిత్యం ఏర్పరచుకొనే పరిధి వల్ల దళితులంటే ఎవరనేది స్పష్టమవుతుంది. షెడ్యూల్డు తెగలు,వెనకబడిన తరగతులు,ముస్లింలు దళితులవుతారా? ఈ విషయంలో ఇంకా స్పష్టత అవసరం. దళితులు,దళిత బహుజనులు వంటి పారిభాషిక పదాలను దళిత సాహిత్యం రాజకీయపదంగా కాకుండా సాంఘీక పీడన,కుల ప్రభావాన్ని అనుసరించి అన్ని వేళలా ఒకే అవగాహనతో ప్రయోగించవలసి ఉంది.

12. సాహిత్యంలో నాయకత్వ పాత్రలను సృజించేటప్పుడు అధికారం, భూమి సమస్య సాంఘీక హోదాల విషయంలోదళిత రచయితలకు స్పష్టత అవసరం.
13. దళితులలో ప్రధానంగా మాల, మాదిగల మధ్య రిజర్వేషన్ల కోసం జరుగుతున్న అంతః సంఘర్షణల వల్ల వస్తున్న సాహిత్యం దళిత సాహిత్య వికాసమా? వైఫల్యమా?
14. స్త్రీవాద సాహిత్యంలో దళిత స్త్రీ సమస్యలను సమర్థవంతంగా చిత్రణ జరగకపోవడానికి ఆ జీవితం తెలియక పోవడామా ? విస్మరించడమా ?
15. దళిత సాహిత్యాభివ్యక్తిని శక్తివంతంగా వ్యక్తీకరించడానికి ప్రత్యేక భాషను ప్రయోగించడం,అశ్లీలపదాలను గ్రహించటం, భారతీయ ఆలంకారిక శాస్త్రాంశాలను నిరసించటం, పాశ్చాత్య సాహిత్య సంప్రదాయాలను పాటించటంలో గల పరిధులను స్పష్టంగా గుర్తించాలి.
16. దళిత సాహిత్యాన్ని ప్రక్రియా పరంగా గేయం(పాట), పద్యం,కథ, నవల,నాటకం, వ్యాసం వంటి వాటిలో దళితులను దగ్గరవైనవేమిటో అవసరమైనవేమిటో,ఇంకా రావలిసినవేమిటో గమనిస్తుండాలి. **(వెంకటేశ్వరరావు, దార్ల.పుట ; 77.మార్చి 2009).**

పైన తెల్పిన ఇద్దరి అభిప్రాయాలను కూలకుషంగా పరిశీలిస్తే దళిత సాహిత్యం,దళిత సాహిత్య విమర్శకానీ ఇప్పటికిప్పుడు ఆవిర్భించింది కాదనీ, అది ఆధునిక సాహిత్య ఆరంభం నుండి కొనసాగుతూ వస్తున్నదనీ కాకపోతే వివిధ కవితా ఉద్యమాల కొలువుల్లో నలిగి వారి వారి భావజాలాలతో ఇమడలేక, ఇమడకుండా ఉండలేక 1980 ప్రాంతంలో స్వతంత్ర కవితాఉద్యమంగా ఆవిర్భవించిందని తెలుస్తుంది. దళిత సాహిత్యం, దళిత ఉద్యమం పట్ల దళితులు ఆయా భావాజాలాల పట్ల ఎందుకు ఆకర్షితులైనారో,ఆ భావాజాలాలతో ఎందుకు సాహిత్యం సృష్టించారో? మొదలైన అంశాలను సాహిత్యం ఆధారంగా

విమర్శనాత్మకంగా శాస్త్రీయబద్ధంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. దీనితో పాటు సాహిత్యాన్ని అధ్యయనం చేసే ముందు కులం, ప్రాంతం, మతం దృష్ట్యా కూడా ఈ భావాలకి ప్రభావితులై ఉండే అవకాశం ఉంది. ఎందుకంటే దళితులు ఆ ప్రాంతాన్ని, ఆ మతాన్ని, కులాన్ని ఆయాపరిస్థితుల దృష్ట్యా దళితులు ఆయా ధోరణులకు భావాజాలాలకు ప్రభావితమై అవకాశం ఉంది. కనుక పరిశోధనలో ఈ అంశాలన్ని పరిగణలోకి తీసుకోవడం జరుగుతుంది. దళిత సాహిత్యంలో ఏకకాలంలో అంటే సమకాంలో వాదప్రతివాద విమర్శలు వచ్చాయి. అదేవిధంగా కాలానుగుణంగా, కవిత్వధోరణుల ఆధారంగా సాహిత్యవిమర్శ వచ్చింది. ప్రతి కవితా ఉద్యమ ధోరణిలో దళితుల గురించి, దళిత సాహిత్యం గురించి చర్చ జరుగుతూనే ఉంది. ఈ చర్చనే సాహిత్య పరిభాషలో విమర్శగా చెప్పుకోవచ్చు. దళిత సాహిత్యంలో ఆయా కాలాల్లో వచ్చిన సాహిత్య విమర్శను స్థూలంగా చర్చిస్తూ, సమకాలంలో వచ్చిన సాహిత్యాని అధ్యయనం చేయాల్సిన ఆవసరం ఎంతైనా ఉంది.

సమకాలీన అనే పదానికి ప్రస్తుతం, ఆధునికత, జరుగుతున్న కాలం, వర్తమానకాలం అనే అర్థాలను చెప్పవచ్చు. సమాజంలో జరిగే మంచి,చెడులను ప్రతీకాత్మకంగా తెలియజెప్పేది సాహిత్యం అయితే, వర్తమాన కాలంలో సమాజంలో జరిగే సమస్యల భావవ్యక్తీకరణే  వర్తమాన సాహిత్యంగానూ లేదా సమకాలీన సాహిత్యంగా చెప్పుకోవచ్చు.సమాజంలో ఎప్పుడో జరిగిన, గతించిన చారిత్రక విషయాల ఆధారంగా విశ్వమానవాళికి హితాన్ని బోధించటం సాహిత్యంలో ఒక ఎత్తు అయితే, సమాజంలో ఎప్పటికప్పుడు జరిగే వర్తమాన విషయాలను,మారుతున్న మానవసంబంధాలను సమాజంలోకి వస్తున్న నూతన ప్రజాస్వామ్య విలువలను వాటి విధివిధానాలను అవి ప్రజలపై చూపుతున్న ప్రభావాన్ని వ్యక్తీకరింపచేది సమకాలీన సాహిత్యం లేదా వర్తమాన సాహిత్యంగా సాహిత్య విమర్శకులు సంభోధిస్తున్నారు.

తెలుగులో ప్రాచీన సాహిత్యం ఇతిహాస, పురాణ, ప్రౌఢ, కవితా పటిమల ప్రదర్శనకు ఒక ఆయుధంగా ఉండి సమాజాన్ని ఆనాటి ప్రజల జీవనవిధానాలను, రాజరిక, నియంతృత్వ విధానాలను సాహిత్యం ద్వారా తెలియజెప్పింది.సాహిత్య పరిణామ క్రమంలో 19వ శతాబ్దం ఆధునిక సాహిత్యంగా అవతరించింది. 19వ శతాబ్దానికి పూర్వం కళ్ళకు కనిపించని కల్పిత పాత్రలతో, జరగని దైవ సంభూత అభూత కల్పనలతో,కర్మ, పునర్జన్మ సిద్ధాంతాల సౌలభ్యం కోసం సాహిత్యం వస్తే ఆధునికంలో మాత్రం సమాజ అభివృద్ధి క్రమంలో మొదటి మెట్టు అయిన సామాన్య మానవున్ని కేంద్రంగా చేసుకొని సాహిత్యం వచ్చింది. ఇది కేవలం ఇతివృత్త నిర్మాణంలోనే కాకుండా భాష, భావ, శిల్ప, శైలీ విషయాలలో నూతన విధానాలను అమలుపరిచింది. ఈ సాహిత్య పరిణామ క్రమమే పద్యం ప్రాచీనకాలమైతే వచనం ఆధునికం అనే నానుడి ఏర్పడింది. పద్యం పండితునికి అంటే ఒక వర్గానికి మాత్రమే అర్థమయ్యే రీతిలో ఉండేది. వచనం సామాన్య మానవునికి సైతం అర్థమయ్యే రీతిలో ఉండేది. ఎందుకంటే ఆధునిక సాహిత్యానికి వస్తువు ఈ సామాన్య మానవుడే కాబట్టి. ఈ పరిణామ క్రమం అంతా కూడా ఆధునిక కాలంలోనే జరిగింది. ఈ ఆధునికతనే సాహిత్య పరిభాషలో సమకాలీనతగా చెప్పుకోవచ్చు.

ఆధునిక కాలంలో వచ్చిన సాహిత్యం మొదట్లో జాతీయ భావాలతో మొదలై జతీయత, స్వేచ్ఛ, సమానత్వం, స్వాతంత్ర్యం తదితర అంశాల పట్ల విశిష్ట రచనలు వెలువరించింది. జాతీయోద్యమకాలంలో జాతీయోద్యమం పూర్తి అయి భారతదేశం స్వతంత్ర్య గణతంత్ర సర్వసత్తాక దేశంగా ఏర్పాటు అయిన తర్వాత సంఘంలో ఉండే మూఢాచారాలను, కట్టుబాట్లు సంస్కరించబడాలనే ప్రగాఢ విశ్వాసంతో ఎంతో మంది రచయితలు కవిత్వ, కథ, నవల, నాటక, వ్యాసం మొదలైన అన్ని ప్రక్రియల్లో సంఘసంస్కరణ వైపు సాహిత్యాన్ని సాధనంగా మల్చారు. సంఘం పూర్తిగా సంస్కరింపబడకపోయినా కొద్దో గొప్పో ఆనాటి

ప్రధాన సమాజ విరోధక ఆచారాలైన బాల్యవివాహాలు, సతీసహగమనం మొదలైన విషయాల పట్ల రచయితలు కొంత విజయం సాధించాలనే చెప్పాలి. సాధారణంగా కొన్ని సమస్యలు, కోరికలు, ఆశయాలు తీరిన తర్వాత విలాసవంతమైన జీవితం దిశగా మనిషి జీవించాలనుకుంటాడు. అదే పరిణామక్రమం సాహిత్యంలో నెలకొన్నది. ఆ క్రమంలో వచ్చిందే భావకవిత్వం. వివిధ పాశ్చాత్య ధోరణులు ఆధారంగా భావకవిత్వం తెలుగులోకి వ్యాపించింది. వీరు కేవలం ప్రకృతి ఆరాధకులుగా ఉండి కవిత్వ స్థాయిని, కావ్య కీర్తిని పెంచగలిగి మానవ మానసిక ఆనందానికి పాటుపడ్డారేమో గానీ సమాజ శ్రేయస్సుకు పాటుపడటంలో కొంత లోపం జరిగిందనే చెప్పాలి. తద్వారా సాహిత్యంలోనూ, సమాజంలోనూ కొంత స్తబ్దత ఏర్పడింది. ఈ స్తబ్దతను పునర్మించటానికి మరికొంతమంది రచయితలు అభ్యుదయం పేరుతో 1930-40 ప్రాంతంలో సాహిత్యంలో నూతన ఒరవడి సృష్టించారు. శ్రామిక, కార్మిక, పీడిత, తాడిత ప్రజల జీవనవిధానాలను సాహిత్యంలో ప్రవేశపెట్టారు. తర్వాత 1960లో అభ్యుదయభావాలనే స్వీకరించి కొంత ఉద్రేకంతో సాహిత్య సూత్రాలకు విరుద్ధంగానూ, సాహిత్య పదజాలాన్ని బూతు పదాలతో ప్రతీకలుగా స్వీకరించి దిక్కులనే వస్త్రాలుగా ఆరుగురు యువకులు కుల, మత,ప్రాంతాలతో సంబంధం లేకుండా వారికి తోచిన రీతిలో నన్నయ మొదలు నేటి వరకు అందరిని వ్యతిరేకిస్తూ సాహిత్యం సృష్టించారు. దీనినే వీరు దిగంబరం సాహిత్యంగా చెప్పుకున్నారు. వీరు సాహిత్యాన్ని కొత్త కోణంలో ఆవిష్కరించారు. కానీ ఇది ఎక్కువ కాలం నిల్వలేకపోయింది. దీనికి కారణం వీరు ఉపయోగించిన భాష సభ్య సమాజంలో చోటు సంపాదించలేకపోవటం మరియు వీరిపై ఎన్నో వాద, ప్రతివాద విమర్శలు వచ్చాయి. తర్వాత 1970లో అభ్యుదయ, దిగంబర రచనల్లో ఆశయాలు తప్ప ఆచరణ లేదు అని అభ్యుదయ సాహిత్యంలో కొంత మంది, దిగంబర సాహిత్యంలో మరి కొంతమంది విప్లవసాహిత్యంలో వారి ఉనికిని

చాటుకున్నారు. సమాజ శ్రేయస్సుని ఆశించే సాహిత్యంలో అచరణలేని ఆశయాలు ఎందుకు? అనే దృక్పథంతో మాటా, తూటా రెండు సమపాళ్ళల్లో ఉన్నప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమని భావించి విప్లవ సాహిత్యం సృష్టించారు. తర్వాత 1980-90 లో పైన పేర్కొన్న వాదాలన్నింటిలో స్త్రీ, దళిత, మైనార్టీల పాత్ర ఉన్న సొంత గొంతుకతో స్త్రీలు తమ జీవనవిధానాలను, స్త్రీల సమస్యలను, జండర్ విధానాలను స్త్రీవాద సాహిత్యంలోనూ, అదే విధంగా దళితులు వారి వారి దైనందిన జీవితాలను, వారి చారిత్రక విషయాలను, వారి పట్ల జరిగే వివక్షను దళిత వాద సాహిత్యంలోనూ చెప్పటం మొదలు పెట్టారు.

ఇన్నాళ్ళు సాహిత్యం అంతా వ్యవస్థ కోసం, వ్యవస్థలో విభిన్న సమస్యల పరిష్కారం కోసం వస్తే దళిత, స్త్రీవాదాలు మాత్రం వ్యవస్థ సక్రమంగా నడవాలంటే వ్యవస్థలో ఉన్న అసమానతలు లింగ, కుల, మత, ప్రాంత వైరుధ్యాలు ముందు నశించాలని కుల దృక్పథంతో, ప్రాంతీయ చైతన్యంతో, జండర్ చైతన్యంతో సాహిత్యం వచ్చింది. ఇప్పుడు మరికొంత ముందుచూపుతో బిసి వాదాలు, గిరిజన వాదాలు, ప్రాంతీయ వాదాలు 20, 21 శతాబ్దంలో రావటం వలన సాహిత్యం అంతా అస్తిత్వాలపైనే నడవటం మొదలైంది.

సమకాలీన యుగంలో దళిత సాహిత్యంలోనే అంతర్భాగంగా వర్గీకరణ సాహిత్యం *(మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి / దండోరా ఉద్యమ సాహిత్యం)*, *ఏకీకరణ సాహిత్యం(మాల మహానాడు)* చాలా విస్తృతంగా వస్తున్నాయి. దళిత ప్రజల మధ్య నడుస్తున్న ఈ అంత:సంఘర్షణలను సమన్వయ పరుస్తూ దళితులు, బహుజనులు అంతా ఏకమై బహుజనవాదాన్ని బలపరచాలని వస్తున్న మరొక వాదం బహుజన వాదం. దీనినే మనం దళిత సాహిత్యంలో సమన్వయ వాదంగా చెప్పుకోవచ్చు.

ఈ సమకాలీన సాహిత్య చారిత్రక పరిణామక్రమం అంతా పరిశీలిస్తే సమాజ శ్రేయస్సు కోసం ఏర్పాటు అయిన సాహిత్యం కాలక్రమంలో సమాజంలో

అవంతారాలను పరిశీలించి సమాజ అసమానతలకు మనుషుల మధ్య వైరుధ్యాలే ప్రధాన కారణమని దానికి మూలం ఆర్థిక పరిస్థితులు అని ఒకరు, దానికంటే ముందు సామాజిక అవాంతరాలు వీటికి మూలం కులం, మతం అని మరొకరు ప్రపంచ చరిత్రలను స్థూలంగా అధ్యయనం చేసి కొన్ని వాదాలను బలపరచారు. ఆ వాదాలే నేటి సాహిత్యంలో ప్రధాన సాహిత్య మార్గాలు. ప్రధానంగా వాటిలో సంప్రదాయంరీతి కొనసాగాలని సంప్రదాయావాదులు, వర్గపోరాటం చేయాలని మార్క్సిస్టులు, కులనిర్మూలన పోరాటం చేయాలని అంబేద్కరిస్టులు సాహిత్యాన్ని విరివిగా రాస్తున్నారు. సాహిత్య చరిత్ర నిర్మాణంలో ప్రాచీన సాహిత్యం మొదలు ఆధునిక సాహిత్యం దాకా దాదాపుగా జాతీయోద్యమంలోగానీ, సంఘసంస్కరణ ఉద్యమంలో గానీ, భావ, అభ్యుదయ, దిగంగర, విప్లవ, దళిత, స్త్రీ, ప్రాంతీయ వాదాల వరకు దళితుల ప్రస్తావన, వారు సృజనీకరించిన, సృజనీకరిస్తున్న సాహిత్యం చాలా గొప్పది. ప్రతి వాదంలోనూ వీరి పాత్ర ఉంది. ఈ వాదాల్లో సాహిత్య రచన చేయడమే కాకుండా అందుకు సరిపడ విమర్శలు రాశారు. 1980 దశకం తర్వాత స్వతంత్ర్య వాదంగా సాహిత్య కచ్చడాల నుండి బయటకు వచ్చి వారికి వారే సొంత వేదికను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సాహిత్య వాదాల పరిణామ క్రమంలో దళిత రచయితలపై వచ్చిన విమర్శ ఎలా ఉంది ? దళిత రచయితలు ఆ విమర్శలను ఏవిధంగా స్వీకరించారు మొదలైన విషయాలను సాహిత్య వాదాల వారీగా పరిశీలించి దళిత సాహిత్య విమర్శకున్న స్థానాన్ని రేఖామాత్రంగా నిరూపించడమే ఈ అధ్యాయం యొక్క ప్రధాన ఉద్దేశ్యం.

ప్రధానంగా 19శతాబ్దంలో జాతీయోద్యకాలంలో అస్పృశ్యత పేరుతో వచ్చిన సాహిత్యం కానీ, తర్వాతి కాలంలో వచ్చిన వర్గపోరులో వచ్చిన సాహిత్యం కానీ, సొంత గొంతుతో ప్రారంభమైన దళిత సాహిత్యాన్ని భాష, భావ, శిల్ప,రూప, కాల పరిమితుల దృష్ట్యా పరిశీలిస్తే దళిత సాహిత్యంలో ప్రధానంగా కన్పించే ధోరణులు ఈ విధంగా చెప్పుకోవచ్చు.

## 2.13.దళిత సాహిత్యం – విమర్శ ధోరణులు :

- ❖ దళిత సాహిత్యం – సంప్రదాయ ధోరణి
- ❖ దళిత సాహిత్యం – మార్క్సిస్టు ధోరణి
- ❖ దళిత సాహిత్యం – అంబేద్కర్ ధోరణి
- ❖ దళిత సాహిత్యం – స్త్రీవాద ధోరణి
- ❖ దళిత సాహిత్యం – వర్గీకరణ దృక్పథం
- ❖ దళిత సాహిత్యం – ఏకీకరణ దృక్పథం
- ❖ దళిత సాహిత్యం – ప్రాంతీయవాదం
- ❖ దళిత సాహిత్యం – బహుజనవాదం/సమన్వయ వాదం

### 2.13.1. దళిత సాహిత్యం - సంప్రదాయ ధోరణి :

ఇక్కడ సంప్రదాయం అంటే పద్య ప్రక్రియ. ఎందుకంటే తెలుగువారి సంప్రదాయ సంపద పద్యం అంటున్నాం కాబట్టి. దళిత సాహిత్యం ఆవిర్భవించక ముందు దళిత సాహిత్య ఛాయలు తెలుగు సాహిత్యంలో కన్పిస్తూనే ఉన్నాయి. కాకపోతే దళిత అనే పదాన్ని మహాత్మ జ్యోతి బా పూలే ప్రయోగించక ముందు అస్పృశ్యత, హరిజన, అణగారిన అనే పదాలతో అంటరానివారి సాహిత్యాన్ని తెలుగుసాహిత్యంలో ప్రయోగించారు. జాతీయోద్యమంలో భాగం మరియు సంఘసంస్కరణోద్యమంలో భాగంగా గాంధీ ప్రభావంతో హరిజనోద్ధరణ ఉద్యమాన్ని సాహిత్యకారులు అవలంభించారు. వీరు అప్పటి ప్రతిభకు, పాండిత్యానికి ప్రామాణికమైన పద్యాన్నే కవిత్వానికి సాధనంగా ఎంచుకున్నారు. దీనినే సంప్రదాయ సాహిత్యంగా చెప్పుకుంటున్నాం. సంప్రదాయ సాహిత్యంలో దళిత, దళితేతర రచయితలు కూడా దళితుల గురించి చర్చించటం జరిగింది. అయితే దళిత రచయితలు మాత్రం సానుకూలంగా మౌనపోరాట రూపంలో రచనలు చేస్తూ వారి అభిప్రాయాలు సంప్రదాయవాదులు నొచ్చుకోకుండా వ్యక్తపరచేవారు. దళితేతర రచయితలు మాత్రం ఆయా కావ్యాల్లో నీచ పాత్రలకు,

అస్పృశ్య సంఘటనలకు దళితుల ప్రస్తావనను క్రోడీకరించారు. తెలుగు సాహిత్యంలో దళితేతర రచయితల్లో స్వతంత్రంగా దళితుల పక్షాన నిలబడి రచనల రూపంలో పోరాటం చేసిన వ్యక్తులు లేకపోలేదు. వీరి కావ్యాల్లో ముందుమాటల్లో,సమీక్షల్లో, కవితాగోష్టుల్లో, పరిశోధకుల పరిశోధకులు వ్యక్తపరచిన అభిప్రాయాలనే విమర్శగా చెప్పుకోవచ్చు.

### 2.13.2. దళిత సాహిత్యం - మార్క్సిస్టు ధోరణి :

భావ, అభ్యుదయ కవిత్వాల నూతన పోకడలను పరిశీలించిన తర్వాత పాశ్చాత్య ప్రభావంతో తెలుగుసమాజంలో విప్లవోద్యమాలు మొదలయ్యాయి. వాటిలో శ్రీకాకుళం సాయుధపోరాటం, తెలంగాణ రైతాంగ పోరాటం ప్రధానమైనవి. ఎప్పుడైతే ఉద్యమాలు మొదలయ్యాయో సర్వసాధారణంగా సాహిత్యం ఆ దిశగా పయనించటం మొదలుపెట్టింది. 1970లో విప్లవ సాహిత్యం మొదలైంది. శ్రీశ్రీ, పాణిగ్రాహి, ఆరుద్ర, అనిశెట్టి, నారాయణ బాబు విప్లవ భావాలతో సాహిత్యం రాయటం మొదలు పెట్టారు. విప్లవసాహిత్యంలో సామాన్య మానవుడే వారి కేంద్ర స్థానం కాబట్టి సామాన్యమానవుడే అంటే దారిద్ర్యరేఖకు దిగువన బ్రతికేవాడు వాడే దళితుడు. విప్లవకవులు మార్క్స సిద్ధాంతాలను ఆధారంగా కుల, సిద్ధాంతాలతో సంబంధం లేకుండా వర్గపోరు కొనసాగించారు.

ఈ వర్గ పోరులో ఎంతో మంది దళిత రచయితలు కూడా వర్గపోరాట దృక్పథంతో దళితసాహిత్యాన్ని సృష్టించారు. వీరిలో ప్రధానంగా చెప్పుకోదగినవారు జి, కళ్యాణరావు, కె. సత్యమూర్తి, గద్దర్ మొదలైనవారు. దళిత సమస్యలు వర్గ కుల దృష్టిలో చూడాలనీ, కులాన్ని కూడా వర్గపోరులో పరిగణలోకి తీసుకోవాలనీ మారోజు వీరన్న వంటి వారు ఇండియాలో ఏం చేయాలి ? అనే గ్రంథం రాశారు. దళిత సమస్యపరిష్కారానికి బుద్ధుడు చాలడు? అంబేద్కర్ చాలడు ? మార్క్స కావాలి అని రంగనాయకమ్మ రాస్తే దానికి ప్రతివాదంగా కె.జి.

సత్యమూర్తి అంబేద్కర్ సూర్యుడు విమర్శనా గ్రంథం రచించాడు. అంతేకాకుండా కుల సమస్య అవగాహన –– విశ్లేషణ అనే గ్రంథం, వివిధ పత్రికల్లో దళిత, దళితేతర రచయితలు వర్గదృక్పథం దృష్ట్యా దళితుల గురించి వాద, ప్రతివాద విమర్శలు చేశారు.

### 2.13.3. దళిత సాహిత్యం - అంబేద్కర్ ఆలోచనా ధోరణి:

భారతదేశంలో వచ్చిన ఇజాలు, వచ్చిన సామాజిక, రాజకీయ, సాంస్కృతిక ఉద్యమాలు అన్ని ఒక ఎత్తు అయితే దళితులకు మాత్రం అంబేద్కర్ ఉద్యమం ఒక ఎత్తు. అంబేద్కర్ సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, ఆర్థికవిప్లవం దళిత ప్రజల్లో ఎనలేని ఆత్మస్థైర్యాన్ని, ఆత్మగౌరవాన్ని నింపింది. అంబేద్కర్ సిద్ధాంత మార్గంలోనే దళిత సాహిత్యం పురుడుపోసుకొని పరిపూర్ణ దశకు చేరుకోగలిగింది. అంబేద్కర్ సిద్ధాంతాలను, ఆయన ప్రసంగాలను, ఆయన మార్గాలను తూచ తప్పకుండా దళిత రచయితలు సామాజిక చైతన్యంతో రచనలు చేశారు. ఇలా వచ్చిన రచనల సంఖ్య వేలల్లో ఉంటాయి. 1960 మహారాష్ట్ర దళితఫాంథర్స్ మొదలు ఆంధ్రప్రదేశ్ లో చిక్కనవుతున్న పాట(1990) మొదలు కవిత్వం, కథ, నాటకం, నవల, ధీర్ఘకావ్యం, గేయం ఇలా అన్ని ప్రక్రియల్లో అంబేద్కర్ ధోరణిలో దళితసాహిత్యం విరాజిల్లింది. అంబేద్కర్ దృక్పథంతో వెలువడిన రచనల్లో మరలా దళిత, దళితేతర రచయితలు సమీక్షలు, విమర్శనావ్యాసాలు, పరిశోధనలు ఇలా చెప్పుకుంటూ పోతే పలు విధాల సాహిత్య సృజన, అనుసృజన విరివిగా కొనసాగింది. ఈ విధంగా వచ్చిన సాహిత్యవిమర్శ గ్రంథాలే దళితవాద వివాదాలు, దళితసాహిత్యం ,దళిత ఉద్యమం, జాషువా సాహిత్యం దళిత దృక్పథం, సామాజిక విప్లవకారుడు అంబేద్కర్ మొదలైనవి.

### 2.13.4. దళిత సాహిత్యం - స్త్రీవాద ధోరణి :

దళిత సాహిత్యం ఆరంభమైన మొదట్లో కేవలం ఉమ్మడిగా అస్తిత్వాన్ని కాపాడుకునే దిశగా రచనలు వెలువడ్డాయి. దళిత సాహిత్యం కొంత పరిణితి

చెందిన తర్వాత దళిత స్త్రీలు ప్రశ్నించడం మొదలుపెట్టాఆరు. అంతకు ముందున్న స్త్రీవాద సాహిత్యంలో కూడా దళిత స్త్రీల వేదనలు వేరు , అగ్రవర్ణ స్త్రీల వేరు అనీ, వీరిద్దరికి ఏకకాలంలో ఎదురయ్యే సమస్యలు కొన్ని ఎక్కువ శాతం దళిత, దళితేతర స్త్రీలు సమస్యలు పూర్తి భిన్నంగా ఉంటాయని స్త్రీవాద, దళితవాద సాహిత్యంలో మాకంటు ప్రత్యేక స్థానం కావాలనీ దళిత స్త్రీ రచయతలు, కళాకారులు బయలుదేరారు. దళిత సాహిత్యంలో ఉమ్మడిగా రచనలు, విమర్శవ్యాసాలు రాస్తూనే, సందర్భానుసారంగా దళిత స్త్రీవాదాన్ని బలంగా వినిపిస్తున్నారు. వారిలో ప్రధానంగా చెప్పుకోదగినవారు చల్లపల్లి స్వరూపరాణి, వినోదిని, గోగుశ్యామల, జూపాక సుభద్ర మొదలైనవారు. వీరు చేపట్టిన సాహిత్యం నల్లపొద్దు, స్త్రీవాద దృక్పథం........ మొదలైనవి.

### 2.13.5. దళిత సాహిత్యం - వర్గీకరణ దృక్పథం :

ఆధునిక సాహిత్యంలో దళిత సాహిత్యం ఒక పాయగా ఏర్పాటు అయినా కాలానుక్రమంలో దళితసాహిత్యమే కొన్ని వాదాలకు కేంద్రబిందువుగా మారింది. అంబేద్కర్ ప్రసాదించిన రిజర్వేషన్లు దళిత ఉపకులాల మధ్య సమానంగా పంపిణీ జరగడం లేదని, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు వర్గీకరణ జరగాలణీ దళిత ఉపకులాల్లో ఒక కులమైన మాదిగలు, వాటి ఉపకులాలు మాదిగరిజర్వేషన్ పోరాట సమితిని స్థాపించి ఆదిశగా ఉద్యమం చేపట్టారు. ఎప్పుడైతే దండోరాఉద్యమం ఉధృతం అయ్యిందో మాదిగల్లో చదువుకున్న మేధావులు, కవులు ఆ వైపు రచనలు చేయటం మొదలుపెట్టారు. ఇది కాల పరిణామ క్రమంలో మాదిగసాహిత్యవేదికలకు, మాదిగ కవులకు ఒక రూపాన్ని ఇచ్చింది. మాదిగ సాహిత్యాన్ని దళిత సాహిత్యంలో అంతర్భాగంగా చూస్తూనే ఎన్నో రచనలు విమర్శన వ్యాసాలు వెలువడ్డాయి. దళిత సాహిత్యంలో ఒక పాయగా చీలిన మాదిగసాహిత్యంలో వచ్చినంత సాహిత్యంలో దళిత సాహిత్య పరిధిని ప్రశ్నించే విధంగా ఉందంటే అతిశయోక్తి కాదేమో! దళిత సాహిత్యం వర్గీకరణ

వాదం దృష్ట్యా వెలువడిన సాహిత్యం, సాహిత్య విమర్శలో ప్రధానంగా చెప్పుకోదగినవి, మాదిగోడు. మల్లెమొగ్గల గొడుగు, మాదిగ చైతన్యవేదిక, కొత్త గబ్బిలం, దళిత సాహిత్యం–మాదిగ దృక్పథం, ఎస్సీల్లో వర్గీకరణ ఎందుకు? బ్రాహ్మణత్వ?మాలత్వమా............ ఇలా ఎన్నో రచనలు వెలువడ్డాయి

## 2.13.6. దళిత సాహిత్యం - ఏకీకరణ దృక్పథం :

ఎప్పుడైతే దళిత ఉపకులాల మధ్య చిచ్చు మొదలైందో ఆయా దళిత కులాల్లో ఉన్న మరో కులం అయిన మాలలు దళిత రిజర్వేషన్లు వర్గీకరించడానికి వీలు లేదు రిజర్వేషన్ల వర్గీకరణ అనేది పాలక వర్గాల కుట్ర అనీ, విభజించు పాలించు సూత్రానికి మరో రూపం అని వ్యాఖ్యానిస్తూ మాదిగరిజర్వేషన్ పోరాట సమితికి వ్యతిరేకంగా మాలల్లో కొంత మేధావులు మాలమహానాడు ఉద్యమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. మాలలు  దిశగా ఉద్యమాన్ని కొనసాగించారు. ఎప్పుడైతే మాలలు సొంత కుంపటి పెట్టుకున్నారో అప్పుడే మాలల్లో కొంత మంది రచయితలు ఏకీకరణ దిశగా రచనలు చేయడం మొదలు పెట్టారు. ఏకీకరణ సాహిత్యం వర్గీకరణ సాహిత్యంతో పోల్చుకుంటేతక్కువగానే వస్తుందని చెప్పాలి. ఏకీకరణ సాహిత్యంలో చెప్పుకోదగ్గ రచనలు వెలువడలేదు కానీ చాలా మాల రచయితల్లో మాత్రం ఈ భావాలు ఎక్కువగా కన్పిస్తాయి. ఏకీకరణ సాహిత్యంలో చెప్పుకోదగ్గ గ్రంథం ఏకీకరణీయం. అయితే తుల్లిమల్లి విల్సన్ సుధాకర్,  పైడి తెరేష్ బాబు, గూటం స్వామి  వంటి రచయితలు ఆయా రచనల్లో ఆయా భావాలను వ్యక్తపరచడం మనం గమనించవచ్చు.

## 2.13.7. దళిత సాహిత్యం – ప్రాంతీయవాదం :

దళిత సాహిత్యంలో స్త్రీలు, మాదిగలు ఏవిధంగా తమ అస్తిత్వాన్ని గురించి ఆరా తీసారో అదే విధంగా తెలంగాణా, ఉత్తరాంధ్ర, సమైక్యాంధ్ర ఉద్యమాల ప్రభావం వలన ప్రాంతాల వారీగా దళిత సమస్యలు భిన్నంగా ఉన్నాయి. దళిత సమస్యలు అన్నీ ఒకటే అయిన కొన్ని పరిమితుల దృష్ట్యా ఏప్రాంతం సమస్యలు

ఆ ప్రాంతానికి ఉన్నాయనీ దళిత సాహిత్యంలో ప్రాంతీయవాద దృష్టితో రచనలు వెలువడుతున్నాయి.

### 2.13.8. దళిత సాహిత్యం - బహుజనవాదం /సమన్వయ వాదం:

దళిత సాహిత్యం విరివిగా వెలువడి రేపే మాపో రాజ్యాధికారం రాబోతుందన్న తరుణంలో దళిత ప్రజల్లో ఉపకులాలపోరు మొదలైంది. ఈ ఉపకులాల పోరు వలన దళిత ప్రజల్లో ఐక్యత మాట ఏమో కానీ అనైక్యత మాత్రం ఎక్కువగా చోటుచేసుకుంది. ఇది దృష్టిలో ఉంచుకుని కొంత మంది వీరి ఇద్దరి మధ్య సమన్వయం కోసం రిజర్వేషన్ల సమస్య పరిష్కారం కోసం ఒక వాదాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీనినే మనం సమన్వయవాదంగా చెప్పుకోవచ్చు. దీనిలో ఏక్కువమంది మాల, మాదిగ , బి.సి కులాల రచయితలు ఉన్నారు. విచిత్రం ఏమిటంటే ఈ కులాల వారే ఆ కులాల సాహిత్యాన్ని వాద ప్రతివాదాలతో రాస్తూ ఉంటారు. మరలా వీళ్ళే బహుజనవాదం లేదా సమన్వయవాదానికి ద్వారాలు తెరవాలనీ సమాజాన్ని, సాహిత్యాన్ని ప్రేరేపిస్తుంటారు. సమన్వయవాదం దృష్ట్యా ప్రత్యేకమైన రచనలు రాకపోయినా మాల, మాదిగ రచయితలు వారి వాదాలను వినిపిస్తూనే రచన చివర్లో అంతా కలిసిపోదామనే ఆశాభావాన్ని వ్యక్తపరుస్తారు. దీనిన్ని మనం సమన్వయవాదంగా స్వీకరించవచ్చు.

దళిత సాహిత్య విమర్శ తన స్వభావ రీత్యానే దళిత విమర్శ కూడా. ఇలా ఏక కాలంలో రెండు కర్తవ్యాలను నిర్వర్తిస్తూ వస్తున్నది. రాజకీయాల్లో బి.ఆర్. అంబేద్కర్ , జగజ్జీవన్ రాం, భాగ్యరెడ్డివర్మ, దామోదరం సంజీవయ్య తమ కులాల తాలూకు ప్రాతినిధ్యం, ఆత్మగౌరవం, స్థానం, ఆత్మస్థైర్యం విషయాల్లో పూలే, అంబేద్కర్, కొమరమ్ భీం, నారాయణ గురు, సాహూమహారాజు, పెరియార్ ప్రాతినిధ్యం తీసుకున్న దళిత ఉద్యమం, దళిత సాహిత్యం కాలానుగమనంలో రెండు శాఖలుగా విడిపోయింది. దళిత సాహిత్యం ఏర్పాటు అయిన తర్వాత పైన చెప్పిన కవితా ధోరణులు ఆయా కాలానుగుణంగా దళిత సాహిత్యాన్ని

ప్రస్తావించిన, ప్రత్యేకంగా దళిత సాహిత్యం స్వతంత్ర ఉద్యమ సాహిత్యంగా ఏర్పాటు అయిన తర్వాత దళిత సాహిత్యంలో సమకాలీన కాలంలో వెలువడిన, వెలువడుతున్న విమర్శ విధానం వర్గీకరణ, ఏకీకరణ, బహుజన లేదా సమన్వయ వాదాలు కాబట్టి వాటి గురించి పరిశోధనా దృష్ట్యా చర్చిద్దాం. దళిత ఉద్యమంలో, దళిత సాహిత్యంలో రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమాన్ని మొదలు పెట్టింది మాదిగరిజర్వేషన్ పోరాట సమితి కనుక, మాదిగరిజర్వేషన్ పోరాట సమితి నిర్మాణాన్ని, వాటి లక్ష్యాలను, ఉద్యమ ఆసరగా వచ్చిన సాహిత్యాన్ని, సాహిత్యవిమర్శని క్షుణ్ణంగా తర్వాతి అధ్యాయంలో పరిశీలిద్దాం.



# మూడవ అధ్యాయం

## వర్గీకరణవాదం - విమర్శనాత్మక అధ్యయనం

# మూడవ అధ్యాయం

# వర్గీకరణ సాహిత్యం - విమర్శనాత్మక పరిశీలన

**3.0. ఉపోద్ఘాతం :**

తెలుగులో వచ్చిన సామాజిక ఉద్యమాలు వాటి ఆధారంగా వెలువడిన సాహిత్యం అంతా ఒక ఎత్తు అయితే, ఆ తర్వాత ఆధునిక కాలంలో వచ్చిన అస్తిత్వ ఉద్యమాల్లో దళిత ఉద్యమం, దళిత సాహిత్యం ఒక ఎత్తు. దళిత ఉద్యమం ప్రారంభమైన మొదట్లో దీని వేడి, వాడి చూసి కొన్ని యుగాల తెలుగు సాహిత్యానికే ప్రశ్నార్థకంగా మారి, ప్రత్యామ్నాయ సాహిత్యంగా వెలువడుతుందని సాహిత్య విమర్శకులు భావించారు. దీనితో పాటు తెలుగు సాహిత్య లక్ష్య, లక్షణాలను ప్రశ్నించి దాని ఉనికిని స్తంభింప చేస్తుందని, సమాజంలో ప్రతి మానవుడు తనకు తానుగా స్వతంత్రంగా బ్రతకగలిగే స్థాయిని, సామర్థ్యాన్ని, శక్తియుక్తులను దళిత సాహిత్యం ఇటు ఉద్యమ రూపంలోనూ, అటు సాహిత్య రూపంలోనూ ఇస్తూనే సమాజాన్ని సామాజిక స్పృహతో చైతన్య పరుస్తుందనే ఆశాభావం అందరికి కలిగింది. అయితే ఈ లక్ష్యాన్ని కొంత వరకు కంచికచర్ల, కారంచేడు, చుండూరు, వేంపెంట తదితర సంఘటనల ద్వారా దళిత ప్రజలపై జరిగిన అన్యాయాలను వ్యతిరేకిస్తూ దళి.త ఐక్యతను దళిత ప్రజలు, కవులు, కళాకారులు, దళిత మేధావులు నిరూపించారు. ఈ ఐక్యతాభావం అనతి కాలంలో అనైక్యతాభావానికి నాంది పలికింది. దీనికి కారణాలు అనేకం ఉన్న ముఖ్యంగా దళిత ఉపకులాల మధ్య రిజర్వేషన్ పంపిణి సరిగా జరగటం లేదనీ, దళిత బహుజనపిత డా.బి.ఆర్.అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ కొన్ని వర్గాల వారే అనుభవిస్తున్నారని, అవి అందరికి అందుబాటులోకి రావాలంటే ఉపకులాల మధ్య పంపిణి జరగాలనీ షెడ్యూల్డ్ కులాల్లో ఒక ఉపకులమైన మాదిగ దాని అనుబంధ ఉపకులాల మేధావులు ***"సమాన పంపిణీయే సామాజిక న్యాయం'*** అనే

ఏకసూత్ర సిద్ధాంతంతో కనకారావు మాదిగ ఆధ్వర్యంలో 1994 *జూలై 7 ప్రకాశం జిల్లా ఈదురుమూడి గ్రామంలో 'మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(MRPS)'* ఊపిరి పోసుకుంది. అక్కడ సమావేశమైన మాదిగ యువకులు మంద కృష్ణను,కృపాకర్ మాదిగలను నాయకులుగా ఎంచుకొన్నారు. ఈ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, పోరాట సమితి నాయకులు మాదిగ హక్కుల కోసం మరియు మాదిగ ఉపకులాల హక్కుల కోసం, వారి జీవన అభివృద్ధి విధానాల కోసం పోరాడుతున్నారు. ఎస్సీలలో మాదిగలకు సామాజిక న్యాయం అనే నినాదంతో ఎస్సీలను బీసీల మాదిరిగానే 4 భాగాలుగా ఎ,బి,సి,డి గ్రూపులుగా విభజిస్తూ 1997 జూన్‌లో ప్రభుత్వ ఉత్తర్వులు నెం.68, 69లను విడుదలయ్యాయి. తర్వాత1999 జూన్‌లో రాష్ట్రపతి అనుమతితో వర్గీకరణకు తాత్కాలిక చట్టబద్ధత కల్పిస్తూ ఆర్డినెన్సు జారీ చేయించారు.

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితికి వ్యతిరేకంగా రిజర్వేషన్ విధానాలను యథావిధిగా కొనసాగించాలని *"రిజర్వేషన్ల వర్గీకరణ అంటే దళితులను విడగొట్టడమే"* అని షెడ్యూల్డ్ కులాల్లో ఒక ఉపకులమైన మాల, దాని అనుబంధ ఉపకులాల ప్రజలు, మేధావులు ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ 1994 సంవత్సరం ***'మాలమహానాడు'*** అనే పేరుతో ఒక శిబిరం పి.వి.రావు అధ్యక్షతన ఏర్పాటు చేసుకున్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి మాదిగ, రెల్లి తదితర ఉపకులాలకు ప్రాతినిధ్యం వహిస్తే, మాలమహానాడు మాల,ఆదిఆంధ్ర తదితర ఉపకులాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది.ఈ విధంగా సమాన హక్కుల పేరుతో ఒకరు,ఐక్యత పేరుతో మరొకరు దళితఐక్యతా శిబిరాన్ని రెండు భిన్న శిబిరాలుగా ఏర్పాటు చేశారు. దళిత బహుజనపిత డా.బి.ఆర్.అంబేద్కర్ చెప్పినట్లు " *రెండు వర్గాల మధ్య విభేధాలొస్తే ఏదో ఒక వర్గం మిగిలి, మరో వర్గం నాశనం అవుతుంది.అదే ఒకే వర్గంలో రెండు శిబిరాలు ఏర్పడితే చివరకు అది వర్గ నాశనానికే దారితీస్తుంది*'. సహజంగా ఒకే సిద్ధాంతం, ఒకే సూత్రం, ఒకే

సమాజం కోసం పని చేసే వ్యక్తుల మధ్య, సంస్థల మధ్య ఉండాల్సింది మిత్ర వైరుధ్యం తప్ప శత్రువైరుధ్యం కాదు, దీనితో పాటుగా భావవైరుధ్యమే కానీ భౌతికమైన వైరుధ్యం ఉండకూడదు. ఇలా ఉండటం వల్ల ఏ లక్ష్యసాధన కోసం రెండు వర్గాలు పనిచేస్తున్నాయో ఆ లక్ష్యం నెరవేరకపోగా వర్గనాశనానికి దారితీస్తుంది. ఇలాంటి వర్గ, కుల నాశనమే ఈ రోజు దళిత ఉద్యమంలో, దళిత సాహిత్యంలో జరిగింది, జరుగుతుంది కూడాను.

మాన్యశ్రీ కాన్షీరాం చెప్పినట్లు ముందు నీ కులాన్ని ప్రేమించు,నీ కులాన్ని నిర్మించు తర్వాత ద్వేషించి కులాన్ని నిర్మూలించాలి. సాధారణంగా ఎవరి కులం పట్ల చైతన్యం ఉండటం మంచి పరిణామమే కానీ అది శృతి మించి సోదర కులాల మీద దాడి చేయటం, పరస్పరం ఒకరిని ఒకరు దూషించుకోవటం అనేది కులచైతన్యం అనే కంటే అగ్రకుల నిర్మాణం లేదా అల్పకులాల విచ్ఛిన్నంగా పేర్కొనవచ్చు.

భారత రాజ్యాంగంలో షెడ్యూల్డ్ క్యాస్ట్ అనే విభాగంలో మొత్తం మొదట 59 కులాలను చేర్చడం జరిగింది.ఆ తర్వాత మరో రెండు కులాలను అదనంగా చేర్చి ఎస్సీ ఉపకులాలు మొత్తం 61గా భారత రాజ్యాంగం గుర్తించింది. భారత రాజ్యాంగంలో పొందుపర్చబడిన షెడ్యూల్డ్ కులాలను ఈ కింది విధంగా పేర్కొన్నారు. (**http://socialjustice.nic.in/writereaddata/UploadFile/Scan-0001.jpg**)

**3.1. భారత రాజ్యాంగం - షెడ్యూల్డ్ ఉపకులాలు :**

1. ఆది యాంధ్ర
2. ఆది ద్రవిడ
3. అనాముక్
4. అరయ్ మాల
5. అరుంధతీయ

6. అర్వమాల
7. బరికి
8. బౌరి
9. బేడజంగమ్/బుడగజంగం
10. బిండ్ల
11. బ్యాగర
12. చాచటి
12. చలవది
13. చమర్ /మోచి/ ముచ్చి
14. చంబర్
15. చందల
16. డక్కల
17. డక్కలవర
18. దందాసి
19. ధోర్
20. డోమ్/డొంబర/ పైడి/పనో
21. ఘాసి/ హడ్డి/ రెల్లి/ చచండి
22. వల్లమవ్వార్/ఎల్లమ్మవాండ్లు
23. గొడవలి
24. గోడరి
25. గోసంగి
26. హోలెయో
27. హోలెయోదాసరి
28. జగ్గలి

29. జాంబవులు
30. కొలుపులవాండ్లు
31. మాదాసికురు/మాదరికురువ
32. మాదిగ
33. మాదిగదాసు/మాస్టీన్
34. మహర్
35. మాల
36. మాలదాసరి
37. మాలదాసు
38. మాలహన్నయ్
39. మాలజంగమ్
40. మాలమాస్టి
41. మాలసాలెనేతకాని
42. మాలసన్యాసి
43. మంగ్
44. మంగ్ గరోడి
45. మన్నె
46. మస్థి
47. మాతంగి
48. మహ్ తర్
49. మిథాయ్యల్వార్
50. ముండాల
51. పాకి/మోటి/థోటి
52. పంబడ/పంబన్డ

53. పామిడి

54. పంచమ/పర్య

55. రెల్లి

56. సంబన్

57. సమగర

58. సప్రు

59. సిందో

ల్లు/చిందోల్లు

60. యాతాట

61. వల్లువన్

పైన చెప్పిన ఎస్సీ కులాలకు వారు అన్ని రంగాల్లో వెనుకబడిన కారణంగా వారి జీవనాభివృద్ధికి భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ కృషి వల్ల 15 శాతం రిజర్వేషన్ కల్పించబడింది.

ఈ రిజర్వేషన్ ఫలాలన్ని పూర్తి స్థాయిలో భర్తీ కావడం లేదని దళితులు అంతా సంఘటితంగా పోరాడుతున్నారు. ఈ క్రమంలో రిజర్వేషన్ ద్వారా పొందే ఫలితాలు దళితుల్లోనే కొన్ని కులాలు అనుభవిస్తున్నారనీ, కావున రిజర్వేషన్ వర్గీకరణ చేసి అన్ని కులాలకు సమానంగా పంపిణీ చేయాలని దళిత పోరాటాల సంఘర్షణలు మొదలైనాయి. ఈ సంఘర్షణలు కేవలం మేధావులల్లో మాత్రమే కాకుండా రచయితలు, కళాకారులు, సామాన్య ప్రజల్లోకి వెళ్ళింది. చివరకు ఈ చైతన్యం అంతిమ శత్రువును విస్మరించి వీరిలో ఒకరికొరు దాడులు చేసుకోవడం మొదలుపెట్టారు. ఫలితంగా మాదిగ సాహిత్యం లేదా ఏకీకరణ సాహిత్యం లేదా దండోరా సాహిత్యం అనే పేర్లతో మాదిగలు ఒక శిబిరాన్ని ఏర్పాటు చేసుకుంటే, మాలమహానాడు లేదా ఏకీకరణ సాహిత్యం లేదా ఏకీకరణ ఉద్యమం అని మాలలు మరో శిబిరాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

ఈ విషయాలను ఎద్దేవా చేస్తూ అటు దండోరా ఉద్యమాన్ని, ఇటు మాల మహానాడు ఉద్యమాన్ని తప్పు పడుతూ మనలో మనం విమర్శించుకోవటం సరైన మార్గం కాదని చెబుతూ, రెండు వర్గాలతో పాటు, వెనుకబడిన వర్గాల వారిని విమర్శిస్తూ,

*"అడుక్కోవటమే పరమావధిగా మాదిగ దండోరా అవతారమెత్తితే, మేము మాత్రమే అడుక్కోవటానికి అర్హులు అంటూ మాలమహానాడు స్పందించింది. అడుక్కోవాలో, పోరాడాలో తెలియక ఢిల్లీ నుంచి గల్లీ దాకా ఎదురైన వారందరిని లీడ్ చేయమని దేబిరించే స్థితిలో వెనుకబడిన తరగతులు ఉన్నాయి "* ***(మాన్యశ్రీ కాన్షీరాం. చెంచాయుగం;Vii.)***

ఈ సమస్యకు పరిష్కార మార్గాలను చెప్పకుండా, ఇలా విమర్శించడం, బహుజన వాదం బలోపేతం కావాలనడం ఆచరణలో సాధ్యం కాదు.

**3.2.షెడ్యూల్డ్ కులాలు - ఉప వర్గీకరణ :**

ఎస్సీల్లో ఉన్న దళిత ఉపకులాలన్నింటిని ప్రధానంగా నాలుగు గ్రూపులుగా విభజించి వారి జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ ఫలాలు అందజేయాలని కొన్ని ఉపకులాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే ప్రధానంగా ఇక్కడ భౌగోళిక, సామాజిక పరిస్థితులను బట్టి ఇక్కడ ఉన్న కులాలను ఈ కింది విధంగా విభజన చేశారు.

**3.2.1. ఎ గ్రూపు - పూటకు భోజనం, నీడలేని నిరుపేద కులాలు:**

1. బావురి
2. చ్చచటి
3. చండాల
4. దండాసి
5. దమ్, దంబర, పైడి, పనో
6. గాసి, హద్ది, రేల్లి చాచండి

7. గొడగలి
8. మెహతర్
9. పాకి, మోతి, తోటి
10. పామిడి
11. రెల్లి
12. సంప్రు

**3.2.2. బి గ్రూపు - ఒక్క పూటకు భోజనం ఉన్నవారు:**

1. అరుంధతీయ
2. బెదజంగమ్, బుడగజంగం
3. బైండ్ల
4. చమర్, మోచి, మూచ్చి
5. చంబార్
6. డక్కలి, డక్కలివారు
7. ధోర్
8. గోడారి
9. జగ్గలి
10. జాంబవులు
11. కొలుకులవాండ్లు
12. మాదిగ
13. మాదిగదాసు, మాస్టీన్
14. మాంగ్
15. మాంగ్ గరోడి
16. మాంతంగి
17. సమగార

18. చిందోళ్ళు, చిందులోళ్ళు

**3.2.3.సి గ్రూపు - రెండు పూటలకు భోజనం ఉన్నవారు:**

1. ఆది ద్రావిడ
2. అనాముఖ్
3. ఆర్య మాల
4. అరవమాల
5. బరికి
6. బ్యాగర
7. చలవాడి
8. ఎల్లమ్మలవారు, ఎల్లమ్మలవాండ్లు
9. గోసంగి
10. హోలియ
11. హోలియ దాసరి
12. మడాసికురువ, మడారికురువ
13. మహర్
14. మాల
15. మాలదాసరి
16. మాలదాసు
17. మాలహన్నాయ్
18. మాలజంగం
19. మాలమస్థి
20. మాలసాలె, నెట్ కాని
21. మాలసన్యాసి
22. మన్నె

23. ముండల

24. పంబాడ, పంబండ

25. సాంపన్

**3.2.4.డి గ్రూపు - మూడు పూటలు ఉన్నవారు:**

1. ఆది ఆంధ్ర
2. మస్తి
3. మిత అయ్యలవారు
4. పంచమ, పరియ

అయితే ఈ షెడ్యూల్డ్ కులాలను ఆయా రాష్ట్రాలలో వివిధ పేర్లతో పిలుస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లో వర్గీకరణ విభజన జరిగిన తర్వాత ప్రధానంగా ఎ గ్రూపు కింద రెల్లి కులం, బి గ్రూపు కింద మాదిగ కులం, సి గ్రూపు కింద మాల కులం, డి గ్రూపు కింద ఆది ఆంధ్ర కులాలు ఉన్నాయి. ఎ మరియు బి గ్రూపు కులాలన్నీ ఎస్సీ కులాల్లో కొంత వెనుకబాటుకు గురికాగ, సి మరియు డి కులాలు మిగతా కులాలకంటే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన మాట వాస్తవమే. డి కులమైన ఆదిఆంధ్ర క్రైస్తవ మిషనరీల కాలంలో వారు గౌరవం కోసం ఆ పేరు పెట్టుకున్న తర్వాత వారంతా అటు మాల కులంలోనూ, ఇటు మాదిగ కులంలోనూ ఆయా ప్రాంతాల్లో స్థిరపడినవారే. ఈ క్రమంలో మాదిగ, దాని ఉపకులాలైన రెల్లి తదితర కులాల అభివృద్ధి దృష్ట్యా ***'మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి'*** ఏర్పడింది. ఇదే ధోరణిలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితికి ప్రతికూలంగా మాల,ఆది ఆంధ్ర తదితర కులాల వారు రిజర్వేషన్ విభజించడం వల్ల దళితుల ఐక్యతకు నష్టం వాటిల్లుతుందని ***'మాలమహానాడు(1994)'*** ఏర్పాటు కావడం జరిగింది. ఈ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాలమహానాడు మొదట ఉద్యమ రూపంలో మొదలై, తదనంతర కాలంలో సాహిత్యంలో ప్రవేశించి అంతవరకు దళిత రచయితలుగా, దళిత వేదికలుగా, దళిత

కళాకారులుగా, దళిత మేధావులుగా చెలామణి అయిన వారంతా కాలక్రమంలో కొన్ని చోట్ల ప్రత్యక్షంగా వ్యక్తపరచలేకపోయినా వారి ఆలోచనల్లో, వారి ఆశయాలలో మాదిగ, మాల ముద్రలు వేసుకుని సాహిత్యంలో కూడా వారి అస్తిత్వాన్ని నిలదొక్కుకున్నారు. అంతేకాకుండా సామాజిక, సాంస్కృతిక విషయాలను వ్యక్తపరుస్తూ సాహిత్యం, ఉద్యమం, విమర్శ గ్రంథాలు వెలువడ్డాయి. ఇదే ధోరణిలో దళితుల అంతా ఏకంగా ఉండాలి దానికి ఏకీకరణే సాధనం అని మాలల సామాజిక,సాంస్కృతిక అంశాల పట్ల దళితుల మధ్య ఐక్యత కోల్పోతుందని కొంతమంది రచయితలు కొన్ని పుస్తకాలు, మరికొన్ని విమర్శగ్రంథాలు కూడా రచించారు.

మొదటగా సామాజిక న్యాయం కోసం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పాటు చేసుకుని, దళిత ఉపకులాల చైతన్యం పేరుతో రిజర్వేషన్ సమానంగా పంపిణీ చేయాలని సమాన పంపిణీయే సామాజిక న్యాయం అనే ఏకసూత్రంతో వచ్చిన దండోరా ఉద్యమాన్ని లేదా వర్గీకరణ ఉద్యమాన్ని గురించి, ఈ ఉద్యమం ఆసరాగా వచ్చిన మాదిగల చారిత్రక విషయాలను, వర్గీకరణ ఉద్యమ నేపథ్యాన్ని, ప్రారంభ పరిణామాలను, సాహిత్య చర్చనీయాంశాలను పరిశీలిద్దాం.

### 3.3.మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి – నేపథ్యం:

#### 3.3.1.మాదిగ పదం - అర్ధ వివరణ:

'*మాదిగ*' అనే పదాన్ని షెడ్యూల్డ్ క్యాస్ట్ కులాల్లో ఒక ఉప కులంగా భారతరాజ్యాంగం పేర్కొనింది. మాదిగ అనే పదానికి వివిధ ప్రాంతాల్లో వివిధ రకాలుగా వారి జీవనవిధానాన్ని బట్టి సంబోధించటం జరుగుతుంది. సంబోధన ఏదైనా సారాంశం మాత్రం అంటరానివాడు, వెలివేయబడ్డవాడు, చర్మకారుడు అనే అర్థాలు కన్పిస్తున్నాయి. మాదిగ శబ్దానికి తెలుగు నిఘంటుకర్తలు జాతి పరమైన అర్థాన్ని ఇచ్చారు. జాంబవులు, అరుంధతీయులు, మాతంగులు, గోసంగులు, చండాలురు, బైండ్లవారు, కొమ్ముల వాళ్ళు, పంబలవాళ్ళు మొదలైన

అర్థాలు ఉన్నాయి. శాస్త్రీయబద్ధంగా మాదిగ అనే పదానికి వివిధ నైఘంటిక అర్థాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

ఇన్నాళ్ళు దళిత సాహిత్యంలో దళిత అనే పదానికి మాల, మాదిగలు, అంటరానివాళ్ళు అనే అర్థాలను స్థూలంగా ఇచ్చారు. కానీ ఆ అర్థాలన్ని మాదిగలకు సంబంధించినవిగా ఆచార్య దార్ల వెంకటేశ్వరావు గారు తెలియజేశారు.

దళిత ఉద్యమం సమైక్యత పేరుతో దళితులలోని ఇంకా స్పష్టంగా చెప్పాలంటే మాల మాదిగలలో మాలల నాయకత్వంలో జరిగిన ఉద్యమం మాలల అభివృద్ధి కోసమే జరిగే ఉద్యమంగా దళిత ఉద్యమాన్ని చాలా మంది మాదిగలు గుర్తిస్తున్నారు. అప్పటి సాహితీవేత్తలకు వీరి పట్ల సరైన అవగాహన లేకపోవటం వల్ల మాల మాదిగల మధ్య బేధాన్ని పెద్దగా పాటించలేదు. పరిశోధన దృష్టితో చూస్తే అప్పుడు మాల మాదిగ శబ్దాలు ప్రధానంగా మాదిగలను సూచించేవని స్పష్టమవుతుంది. (**వెంకటేశ్వరావు**, **దార్ల**. **దళిత సాహిత్యం- మాదిగ దృక్పథం; పుట :43**, **సొసైటీ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు**. **హైదరాబాదు**, **2008**).

**మాదిగ:**

*షెడ్యూల్డ్ కులాల్లో ఒకటి : షెడ్యూల్డ్ కులాలలో ఒక కులానికి చెందినవాడు: అంత్యజుడు, చండాలుడు* (**తెలుగు-తెలుగు నిఘంటువు**, **తెలుగు అకాడమీ ప్రచురణ** , **హైదరాబాదు 2006**. **పుట :829**).

**మాదిగ :**

*The caste of Cobblers: A Cobbler: A chuckley: A Shoe: maker* (**శంకరనారాయణ**. **తెలుగు-ఇంగ్లీషు నిఘంటువు: విక్టరీ పబ్లికేషర్స్ విజయవాడ నవంబరు 2006**, **పుట : 449**)

**మాదిగ :**

*చండాలుడు,చండాలి*(**శ్రీసూర్యరాయాంధ్రనిఘంటువు,ఆరవసంపుటం,(మ-లౌ) ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ , కళాభవన్ , హైదరాబాదు, పుట : 200**)

**మాదిగ:**

*చెప్పులుకుట్టువాడు,మాదిగవాడు*(**శ్రీశబ్దరత్నాకరము,సీతారామాచార్యులు, బహుజనపల్లి. 1982, పుట: 857**)

**3.3.2. మాదిగలు నిర్వచనం:**

పై నిఘంటు అర్థాలను పరిశీలిస్తే మాదిగలు ఎవరు అని ప్రశ్నించుకుంటే *"ఎన్నో తరాల నుండి సమాజానికి, ప్రధాన జీవనస్రవంతికి దూరంగా బ్రతుకుతూ కేవలం కొన్ని పనులను మాత్రమే చేస్తూ బ్రతుకు పోరాటం చేస్తున్న వాళ్ళను మాదిగలు"* చెప్పుకోవచ్చు.

**3.3.3. మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి ఆవిర్భావ వికాసం:**

ఎస్సీల్లో ఉన్న 61 కులాలకు చెందిన రిజర్వేషన్లు మాలలు అధికంగా ఉపయోగించుకుంటున్నందున మిగతా ఎస్.సి కులాలకు రిజర్వేషన్లలలో తమ వాటా దక్కడం లేదు కాబట్టి ఎస్. సి రిజర్వేషన్లను ఎ,బి,సి,డి లుగా విభజించాలని డిమాండ్ చేస్తూ *1994 జూలై 7 ప్రకాశం జిల్లా ఈదురుమూడి గ్రామంలో* మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భవించింది. వర్గీకరణ ఉద్యమకారుల శ్లోకాన్ని ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు ఈ విధంగా తెలియజేశారు. *"రక్తాన్నైనా చిందిస్తాం ABCD లు సాధిస్తాం. మా తలలు తెగపడ్డ చోట మేము మొలకెత్తుతాం, అస్తవ్యస్తంగా లోపభూయిష్టమైన ఈ వ్యవస్థనే నూతన సమత సమాజాన్ని స్థాపిస్తాం. ఇది మాదిగ నినాదం"****(వెంకటేశ్వరరావు, దార్ల. ఒక మాదిగ స్మృతి(నాగప్పగారి సుందర్రాజు పరిచయం),పుట:42,తెలుగు సాహిత్య వేదిక;2007)***. ఈ ఉద్యమానికి అన్ని ప్రజాస్వామిక, విప్లవ, కమ్యునిస్టు పార్టీలు, సంఘాలు, మేధావుల మద్దతు పలికి ఆహ్వానించారు. ఈ ఉద్యమం కేవలం రిజర్వేషన్ వివాదం కారణంగా పుట్టుకొచ్చినప్పటికీ మాదిగలలో

ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంచింది. లక్షలాది మాదిగలు ఈ ఉద్యమంలో స్వతంత్రంగా, స్వఛ్ఛందంగా పాల్గొన్నారు. అనేక ప్రజాస్వామిక సంఘాల శక్తుల వలన అప్పుడు ఆంధ్రప్రదేశ్ లో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ అధినేత శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు ఎస్.సి రిజర్వేషన్ " ఎ,బి,సి,డి వర్గీకరణ 20/2000 చట్టం చేశారు. అయితే ఈ వర్గీకరణ ఉద్యమం1994లో మొదలై 1999లో తెలుగుదేశం ప్రభుత్వం మాదిగల ఒత్తిడి మేరకు ఎస్సీ రిజర్వేషన్లను జనభా నిష్పత్తి ప్రాతిపదికన నాలుగు భాగాలుగా అంటే ఎ,బి,సి,డి లుగా వర్గీకరించింది. ఈ విధంగా రాష్ట్రాలలో ఎస్సీ కులాలను నాలుగు గ్రూపులుగా వర్గీకరించి 2004 వరకు అమలు చేసింది. తర్వాత వర్గీకరణ చట్టం తప్పుడు పద్ధతిలో జరిగిందని మాలలు వేసిన పిటషన్ ను సుప్రీంకోర్టు స్వీకరించి వర్గీకరణ చట్టాన్ని సవరించాలని జీవోను కొట్టి వేసింది. రద్దయిన వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టాలని మాదిగలు అప్పటి నుండి ఇప్పటి వరకు ఉద్యమాన్ని చేస్తూనే ఉన్నారు.

ఎప్పుడైతే వర్గీకరణ బిల్లు కొట్టి వేయబడిందో అప్పటి నుండి మాల, మాదిగల మధ్య అంతర్యుద్ధం జరుగుతూనే ఉంది. చారిత్రక ఆధారాల ప్రకారం భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సుమారు 65 సంవత్సరాల నుండి షెడ్యూల్డ్ ఉపకులాల్లో కొన్ని కులాలు మాత్రమే ప్రధాన జీవన స్రవంతిలో బ్రతుకుతూ, మనుషులుగా గుర్తింపబడి, అన్ని రంగాల్లో సమాన అవకాశాలు పొందుతున్నారు. ఆంధ్రప్రదేశ్ లో అయితే మాలలు అత్యధిక శాతం అన్ని రంగాల్లో మిగతా ఉపకులాల కంటే ముందున్న మాట చారిత్రక సత్యం. దీనికి కారణాలు అనేకం. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి యొక్క లక్ష్యాలను ఈ కిందివిధముగా వివరించవచ్చు.

**3.3.4.మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ప్రధాన లక్ష్యాలు:**

1. దళిత ఉపకులాలన్నింటికి అన్ని రంగాల్లో సమాన హోదా కల్పించాలి.

2. దళిత ఉపకులాల్లో ఉన్న వెనుకబడిన కులాల అభివృద్ధికి ప్రత్యేక రాయితీలు కల్పించాలి.
3. రిజర్వేషన్ విధానం, అది అమలవుతున్న తీరులో ఉన్న లోపాలను గుర్తించి తగిన పరిష్కార మార్గాలు తీసుకోవాలి.
4. ప్రాంతాల వారీగా ఉన్న వైవిధ్యాన్ని జనాభా ప్రాతిపదికన గుర్తించి, దానికి అనుగుణంగా రిజర్వేషన్ విధానాన్ని అమలుపరచాలి.
5. దళితుల్లో రిజర్వేషన్ విధానం పట్ల క్రిమిలేయర్ విధానాన్ని ప్రవేశపెట్టాలి.
6. దళిత కులవృత్తులకు సామాజిక హోదా కల్పించాలి.
7. మాదిగ తదితర ఉపకులాలను ప్రధాన జీవన స్రవంతిలోకి తీసుకురావాలి మొదలైనవి దండోరా ఉద్యమం యొక్క లక్షణాలు.

ఈ ఉద్యమం ప్రధాన ఉద్దేశ్యం రిజర్వేషన్లు సమానంగా పంపిణీ జరగటం లేదు తద్వారా దళితుల మధ్య అనైక్యత ఏర్పడుతుంది. కనుక రిజర్వేషన్ పంపిణీలో గల లోపాలను చర్చించే ముందు భారత రాజ్యాంగంలో దళితులకు గల రిజర్వేషన్ ఫలాల గురించి డా.బి.అర్.అంబేద్కర్ వైఖరిని ఈ కింది విధంగా చెప్పుకోవచ్చు.

**3.4.రిజర్వేషన్లు - అంబేద్కర్ దృక్పథం:**

సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అన్ని రంగాల్లో వివక్షతకు గురవుతున్న కులాలను గుర్తించి వారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో రిజర్వేషన్లు డా.బి.అర్.అంబేద్కర్ కల్పించడం జరిగింది. ఉమ్మడిగా అంటరానితనాన్ని మోస్తున్న దళిత జాతికి రిజర్వేషన్ అందివ్వడం ద్వారా వారి సాంస్కృతిక వికాసం తద్వారా రాజ్యాధికారం దిశగా వారు పయనిస్తారని డా. బాబాసాహెబ్ అంబేద్కర్ కలలు కన్నాడు. ఆ కలలను నిజం చేసే దిశగా కాన్షీరాం పయనించాడు.

రిజర్వేషన్లు అన్ని సమస్యలకు పరిష్కారం కావు, కనుక దళితులకు ఈ రిజర్వేషన్లు తప్పనిసరిగా కావాలి. కాకపోతే రిజర్వేషన్లు అమలవుతున్న తీరులో మార్పులు జరగవల్సి ఉంది. ఒకే సామాజిక స్థితిగతులను అనుభవిస్తున్న ఎస్సీ కులాలల్లో 60 సంవత్సరాల రిజర్వేషన్లు అమలవుతున్న తీరులో కొన్ని హెచ్చు తగ్గులు ఏర్పడిన మాట వాస్తవం. ఆంధ్రప్రదేశ్ లో మాదిగల కంటే మాలలు రిజర్వేషన్లు ఎక్కువగా ఉపయోగించుకొన్నారు. దీనికి కారణం కొన్ని కులాల వారికి ఎటువంటి కుల వృత్తి లేకపోవటం, తద్వారా అన్ని వ్యవసాయ కూలీ పనుల్లో వారు నైపుణ్యం సంపాదించటం, దీని ద్వారా ఆర్థికంగా బలపడి వారి ముందు తరాలవారిని విద్యావంతులుగా చేయడం, షెడ్యూల్డ్ కులాల్లో ఎక్కువ శాతం ప్రత్యేకించి కోస్తాంధ్ర ప్రాంతంలో క్రైస్తవ మత ప్రభావం వలన విద్య వైపు మాలలు అధికంగా వెళ్ళటం జరిగింది. ఈ అంశాలన్నింటిని దృష్టిలో పెట్టుకొని మాదిగలు ఎస్సీల్లో వర్గీకరణ జరగాలనే డిమాండును తెరపైకి తీసుకొచ్చారు. అదే ఆసరాగా తీసుకొని అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం వర్గీకరణ చట్టం చేసింది. ఎప్పుడైతే వర్గీకరణ చట్టం ఆంధ్రప్రదేశ్ లో అమలవుతుందో అప్పటి నుండి మాలలు వర్గీకరణ చట్టం కోసం తెలుగుదేశం ప్రభుత్వం నియమించిన రామచంద్ర కమీషన్ నివేదిక సరిగా లేదని అది మాదిగ పక్షపాత ధోరణిలో ఉన్నదని అందులో పేర్కొనబడిన అంశాలు ఒక వర్గం వారికి లాభం చేకూర్చేవిగా ఉండి, దళితుల ఐక్యతను దెబ్బతీసే విధంగా ఉన్నాయని భావించిన మాలమహానాడు నాయకులు ఈ అంశాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేశారు. 2004 లో రిజర్వేషన్ వర్గీకరణను సవాల్ చేస్తూ తెలుగుదేశం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మాలమహానాడు వ్యతిరేకించగా సుప్రీంకోర్టు రిజర్వేషన్ వర్గీకరణను రద్దు చేస్తూ ఒక కమిటి నియమించటం జరిగింది. ఆ రిపోర్టుకు తాలుకూ వివరాలు ఈ కింది విధంగా చెప్పుకోవచ్చు.

**3.5.ఉషామెహ్రాకమీషన్ అభిప్రాయాలు, సూచనలు :**

రాష్ట్రంలో ఎస్సీల వర్గీకరణపై నియమింపబడిన జస్టీస్ ఉషమెహ్రా కమీషన్ తన నివేదికలో మేధావితనాన్ని మరో సారి నిరూపించుకుంది. ఎక్కడా కూడా వర్గీకరణ చేయాలనీ, చేయద్దని సూచించలేదు. కాకపోతే వర్గీకరణ విషయంలో ఆయా రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛ ఉంటుందని, కొత్త క్లాజును చేర్చమని, అన్ని కులాలకు లబ్ధి చేకూరేలా వర్గీకరణ ఉండాలి, ఎస్సీల్లో మాలలు ఎక్కువగా లాభపడుతున్నారు వంటి తదితర విషయాలను వివరిస్తూ 162 పేజీల నివేదికను సమర్పించింది. భారతరాజ్యాంగంలోని ఆర్టికల్ 341ను సవరణ చేయాలనీ, ప్రస్తుతం ఉన్న 341(1)(2) లకు అదనంగా(3) ను చేర్చాలను కమీషన్ సూచింది. దీని ప్రకారం వర్గీకరణ సంబంధించి పార్లమెంటు తనంటతానుగానీ లేదా రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించి పంపితే గానీ చట్టం చేయాల్సి ఉంటుంది. ప్రధానంగా ఉషామెహ్రా కమీషన్ ఈ క్రింది అభిప్రాయాలను సూచింది.

1. ఎస్సీ జాబితాలో రెండు మూడు కులాలు మాత్రమే ఎక్కువ లబ్దిపొందుతున్నాయి. ఇందులో మాల, మాల ఉపకులాలు రిజర్వేషన్ ఫలాలను ఎక్కువగా ఉపయోగించుకున్నాయి.
2. సమాజంలో వెనుకబడిన కులాల అభ్యున్నతి కోసం విద్య, ఉపాధి, ఉపకారవేతనాలు కల్పించే విషయంలో రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛ ఉంది. అన్ని కులాలు, వర్గాలకు లబ్ధి చేకూరే విధంగా ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంది. ఎవరికి ఏ మేరకు రిజర్వేషన్లు కల్పించారో నిర్ణయించే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉంది. అన్ని కులాలు లబ్ది చేకూరే విధంగా ఎస్సీ వర్గీకరణ ఉండాలి.
3. ఆంధ్రప్రదేశ్ లో ఎస్. సి ల సంక్షేమానికి అనేక పథకాలు అమలవుతున్నా చాలా మంది వివక్షతకు గురవుతున్నారు. ఒకట్రెండు కులాల వారు

మాత్రమే రిజర్వేషన్ల లబ్ధిపొందుతున్నారు. ఇది అసమానతలకు దారి తీస్తుంది.

4. ఆంధ్రప్రదేశ్ లో ఎస్సీల్లో 60 కులాలున్నాయి. వీరిలో బిక్షాటన చేస్తూ సంచార జీవితం గడిపేవారు చాలా మంది ఉన్నారు. రెల్లి, మేదర, పాకీ, మోల్, ధోటి ఉపకులాల వారు పాకీ పని చేస్తున్నారు. దుర్భర పేదరికం, నిరక్ష్యరాస్యతలో మగ్గుతున్నారు. ఇవి ఎస్సీల్లో అసమానతలకు దారితీస్తున్నాయి.
5. రాష్ట్రంలో 11 జిల్లాల్లో పర్యటించి ప్రభుత్వ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, ప్రముఖులు, ఎస్సీ సంఘాల నుంచి సమాచారాన్ని సేకరించాం. మాలలు, మరో ఒకట్రెండు వర్గాల నుంచి వర్గీకరణపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.
6. ఎస్సీల ఆర్థిక అభ్యున్నతి కోసం వివిధ పథకాలను రాష్ట్రంలో అమలుచేస్తున్నా చాలా కులాలకు చెందినవారు విద్యాపరంగా ప్రతిభావంతులుగా ఎదగలేదు. అన్ని వర్గాలకు సమానంగా రిజర్వేషన్లు కల్పించాల్సిన భాధ్యత ప్రభుత్వంపై ఉంది.
7. విద్యా, ఉపాధి కోసం ఎస్సీ వర్గీకరణ చేయడం ఆంధ్రప్రదేశ్ కి మాత్రమే పరిమితం. ఇది కేంద్ర ప్రభుత్వ రిజర్వేషన్లపై ప్రభావం చూపకూడదు.
8. రెల్లి, మాదిగలు 50.21 శాతం ఉండగా మాల, మాల ఉపకులాలు 42.78 శాతం ఉన్నారు. కానీ రాష్ట్ర సర్వీసుల్లో క్లాస్ – 1, క్లాస్ – 3 పోస్టులకు 70 శాతం మంది మాల, మాల ఉపకులాల వారు అనుభవిస్తున్నారు.

**ప్రయోజనాల విశ్లేషణ :** రాష్ట్రంలోని ప్రభుత్వ పథకాలు, విద్యా, ఉద్యోగాల్లో ఎస్సీలు పొందుతున్న ప్రయోజనాలను కమీషన్ కింది విధంగా విశ్లేషించింది. ప్రభుత్వం అందించిన సమాచారాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పని చేసింది.

1. మాదిగలు తెలంగాణాలోని అన్ని జిల్లాలు, కోస్తాంధ్ర, రాయలసీమల్లోని ఐదు జిల్లాల్లో ఎక్కువగా ఉన్నారు. కోస్తాంధ్ర, రాయలసీమల్లోని మిగతా 8 జిల్లాల్లో మాలలు ఎక్కువగా ఉన్నారు.
2. ఎస్సీ విద్యార్థులందరికి ఉపకారవేతనాలు అందాలి. కానీ ఇది జరగడం లేదు. ఆరు జిల్లాల్లో 10 కులాల వారే ఉపకారవేతనాలు పొందుతుండగా మిగతా 41 కులాల వారు 2 నుంచి 3 శాతం వాటిని పొందుతున్నారు. కోస్తాంధ్రతో పాటు రాయలసీమ, తెలంగాణాలోని కొన్ని జిల్లాల్లో మాలలు ఎక్కువ మంది ఉపకారవేతనాలు పొందుతుండగా తెలంగాణాతో పాటు రాయలసీమలోని కొన్ని జిల్లాల్లో మాదిగలకు ఎక్కువ ఉపకారవేతనాలు అందుతున్నాయి.
3. మాలలు, మాదిగలు మినహాయిస్తే మిగిలిన కులాలు రెండు నుంచి మూడు జిల్లాల్లోనే ప్రభుత్వ పథకాల వల్ల లబ్ధిపొందాయి.
4. ఎస్సీల్లో మొత్తం 60 కులాలకుగానూ 54 కులాలు ప్రభుత్వ ఉద్యోగాలు పొందాయి. ఇందులో 90 శాతం ఉద్యోగాలు మాల, మాదిగలకే దక్కాయి. వరంగల్, నల్గొండ, మహబూబ్ నగర్, రంగారెడ్డి మినహా ఇతర అన్ని జిల్లాల్లో మాలలు ఎక్కువ పోస్టులు పొందారు. ఇవి వారి జనాభా నిష్పత్తి కంటే ఎక్కువ.

ఈ నాలుగు జిల్లాల్లో మాదిగలకు ఎక్కువ పోస్టులు లభించాయి.

రాష్ట్రంలోని బ్యాంకుల్లో 50 శాతానికి పైగా పోస్టులు మాలలకు దక్కాయి. మాదిగలు 28.4 శాతం పోస్టులు మాదిగలు పొందారు. రాష్ట్రంలోని 23 విశ్వవిద్యాలయాల్లో 50 శాతానికి పైగా పోస్టులు మాలలకే దక్కాయి. ఒక్క ఎన్టీఅర్. విశ్వవిద్యాలయంలోనే 86 శాతం పోస్టులు వారే పొందారు.వివిధ సంస్థలు కమీషన్ కు అందించిన విజ్ఞాపన పత్రాల్లో పేర్కొన్న సమాచారం మేరకు...,

**2001 జనాభా తీరిదీ :**

మాదిగలు : 60.74 లక్షలు, మాలలు 51.39 లక్షలు, రెల్లి 1.21 లక్షలు, ఆది ఆంధ్ర 1.42 లక్షలు

**రాష్ట్రప్రభుత్వ రంగ సంస్థల్లో ఎస్సీల ప్రాతినిధ్యం :**

మాదిగ – 31 శాతం, మాల 61.8 , రెల్లి – 0.25 , ఆదిఆంధ్ర 2.77

**డిప్యూటి కలెక్టర్ స్థాయి ఉద్యోగాల్లో :** మాల 78.13, మాదిగ 21.18,

**మెజిస్ట్రేట్లు :** మాల 86.21, మాదిగ 13.79

**స్థానిక సంస్థల్లో :** మాదిగ 37 , మాల 43.3, రెల్లి 9, ఆదిఆంధ్ర 9.9

**విద్యాసంస్థల్లో :** మాల 59.5, మాదిగ 34.4, ఆది ఆంధ్ర 4, రెల్లి 0.56

**సచివాలయంలో :** మాల 59.5, మాదిగ 34.4, ఆది ఆంధ్ర 4, రెల్లి 1.2

**రాష్ట్రంలో ఐపియస్ అధికారులు :** మాల 76.92, మాదిగ 23

**ఇతర రాష్ట్రాల్లో పని చేస్తున్న ఐపియస్ అధికారులు :** మాల 86.21, మాదిగ 13.79 (**ఉషా కమీషన్ మెహ్రా నివేదిక:www.vrdarla.blogspot.com**)

ఉషామెహ్రా కమీషన్ రిపోర్టు ప్రకారం అన్ని రంగాలలో అటు జనాభా ప్రకారం చూసిన ఇటు విద్య, ఉద్యోగం, ఉపాధి, వైద్య తదితర రంగాలలో మాదిగలను వారి ఉపకులాలను మాల, వారి ఉపకులాలతో పోల్చి చూసినపుడు మాల, వారి ఉపకులాలు అభివృద్ధి చెందాయనీ, మాదిగ, వారి ఉపకులాలు అభివృద్ధి చెందలేదనీ స్పష్టం అవుతుంది. కాకపోతే కొన్ని ప్రాంతాల్లో ఒక విధంగా, కొన్ని మరొక విధంగా అభివృద్ధి, అనాభివృద్దులు జరిగాయనేది స్పష్టమవుతుంది. దీని ప్రకారం రిజర్వేషన్ల వర్గీకరణ ఎలా చేసుకోవాలనేది స్పష్టత లేదు.

### 3.6. వర్గీకరణ వాదం - సామాజిక, రాజకీయ విశ్లేషకుల అభిప్రాయాలు :

ఉషామెహ్రా కమీషన్ నివేదిక వచ్చిన తర్వాత అది రాకముందు మాదిగ మేధావులు, రాజకీయ, సామాజిక విశ్లేషకులు వారి కులానికి జరుగుతున్న

అన్యాయాన్ని అంటగట్టాలని వివిధ పుస్తకాలను తగిన ఆధారాలతో ప్రచురించారు. వాటిని ఆధార సహితంగా పరిశీలిద్దాం.

ఎస్సీలలో వర్గీకరణ ఎందుకు? దళితులంతా ఒకటే కదా, వారి అవమానాలు, ఆకలి భాధలు ఒకటే కదా, దళిత రిజర్వేషన్లు వర్గీకరిస్తే దళిత ఐక్యతకు భంగం కలుగుతుంది అనే వాదనలు వర్గీకరణ డిమాండు వచ్చినప్పటి నుండి మాల, వారి ఉపకులాల కోణం నుండి వస్తున్నాయి. వాటిని మాలమహానాడు లేదా ఏకీకరణ సాహిత్యాన్ని అధ్యయనం చేసేటపుడు పరిశీలిద్దాం. ఇలాంటి వాదనలు వచ్చినప్పుడల్లా మాదిగ దండోరా ఉద్యమం నుండి లేదా వర్గీకరణ సాహిత్యాన్ని నుండి సమాధానంగా రాష్ట్రంలో ఏదో ఒక మూలన ఒక పుస్తకం, ఒక వ్యాసం సమాధానం ఇస్తూనే ఉంది. ఆ కోణం అంటే దండోరా దృక్పథంతో ఆచార్య ముత్తయ్య *'ఎస్సీలలో వర్గీకరణ ఎందుకు?'* అనే పుస్తకంలో వర్గీకరణ ఎందుకో యూనివర్శిటిలలో విద్య, మెడికల్ విద్య, శాస్త్రీయ రంగాలలో ఎవరి వాటా ఎంత ఉందో తెలుపుతూ వర్గీకరణ జరగాలన్న ఆకాంక్షను ఈ కింది విధంగా వ్యక్తపరచాడు.

| **HOWING IN EUALITY WITH AND WITHOUT CLASSIFICATION** | | | | | | |
|---|---|---|---|---|---|---|
| NAME | | **Relli (A)** | **Madiga (B)** | **Mala (C)** | **AdiAndhra (D)** | **Total** |
| Medicine In All Universities | **WITHOUT CLASSIFICATION** | 0 | 82 | 345 | 59 | |
| | **WITH CLASSIFICATION** | 32(6.58 %) | 227(46.70%) (100%) | 195(40.123%) | 32(6.58 %) | 486 |
| Engineering | **WITHOUT CLASSIFICATION** | 0 | 70(28.11%) | 163(65.46%) | 16(6.43 %) | |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| ITwoUniversities | | | | | | |
| | **WITH CLASSIFICATION** | 16(6.43%) | 117(46.98%) (100%) | 100(46.16%) | 16(6.43%) | 249 |
| Msc courese inThree Universities | **WITHOUT CLASSIFICATION** | 0 | 183(36.30%) | 314(62.30%) | 7(1.40%) | |
| | **WITH CLASSIFICATION** | 33(6.54%) | 236(46.82%) (100%) | 202(40.07%) | 33(6.54%) | 504 |

**(ఆచార్య.ముత్తయ్య.ఎస్సీలలో వర్గీకరణ ఎందుకు?, ఆంధ్రప్రదేశ్ మాదిగ మేధవులఫోరం,పుట :16)**

పైన చూపిన టేబుల్ ఆధారంగా చూస్తే అన్ని అవకాశాల్లో వర్గీకరణ సూత్రం ప్రకారం మాలలు దాని ఉపకులం అయిన ఆది ఆంధ్రులు ఎక్కువగా ఉన్నందున వారి లాగే మేము కూడా దళితులుగా ముద్ర వేయబాడ్డం కనుక అన్ని రంగాల్లో సమానంగా ఉండాలి కాబట్టి మాకు రిజర్వేషన్లు వర్గీకరించాలని ఆచార్య.ముత్తయ్య ఈ పుస్తకంలో వ్యక్తపరచాడు.

ఎస్సీ రిజర్వేషన్లు రామచంద్రరాజు కమీషన్ చూపిన విధంగా ఎబిసిడి లుగా విభజించే అధికారం ఆయా రాష్ట్రాలకు లేదు అని అది రాజ్యాంగ విరుద్ధం అని భారత ఉన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. కానీ దీన్ని వ్యతిరేకిస్తూ ఆచార్య ముత్తయ్య దానికి ప్రత్యామ్నాయ మార్గాలను చెబుతూ రాజ్యాంగ నియమనిబంధనలను గురించి, అధికార, అనధికారాల గురించి రాజకీయ విశ్లేషకులు, సామాజిక శాస్త్రవేత్త నిపుణులు ఏమంటున్నారో తెలిపారు.

" *ప్రతి రాష్ట్రానికి ప్రత్యేకంగా షెడ్యూల్డ్ కులాల జాబితా ఉన్నందున రాష్ట్ర స్థాయిలో ఉప వర్గీకరణ సాధ్యమవుతుంది. దీనికి జాతీయ స్థాయి వర్గీకరణ అవసరం లేదు. భారత సర్వోన్నత న్యాయస్థానం వర్గీకరణపై ఇచ్చిన తీర్పును*

*దృష్టిలో ఉంచుకొని సామాజిక శాస్త్రవేత్తలు , న్యాయ నిపుణులు ఇందుకు మూడు ప్రత్యామ్నాయ పద్ధతులను సూచిస్తున్నారు.*

*ఒకటి: రాష్ట్రపతి ప్రకటించిన షెడ్యూల్డ్ కులాల జాబితా నుండి ఉపవర్గీకరణ చేసే అధికారం రాష్ట్రానికి ఇవ్వనైనదనే క్లాజు 3 ని 341 అధికరణకు చేర్చాలి.*

*రెండు : భారత పార్లమెంటులో 1950 షెడ్యూల్డు కులాల ఆర్డినెన్సు సవరించి ప్రస్తుత షెడ్యూల్డ్ కులాల జాబితా ఉన్న పార్టు 1 లో వర్గీకరింపబడిన షెడ్యూల్డ్ కులాల జాబితాని పొందుపర్చాలి.*

*మూడు : మరే ఇతర ఆమోదయోగ్యమైన పద్ధతి ద్వారానైనా వర్గీకరించవచ్చు. సమాఖ్య సిద్ధాంతం దృష్ట్యా మొదటి విధానం అత్యుత్తమైంది. రెండవ పద్ధతి రాష్ట్ర, స్థానిక అవసరాల దృష్ట్యా సులభమైన మంచి పద్ధతి."* **(ఆచార్య.ముత్తయ్య. ఎస్సీలలో వర్గీకరణ ఎందుకు?, ఆంధ్రప్రదేశ్ మాదిగ మేధవులఫోరం,పుట :20)**

వర్గీకరణ అనేది ఆయా రాష్ట్రాలకు సంబంధించిన విషయంగా ముత్తయ్య గారు అభిప్రాయ పడ్డారు. అంతేకాకుండా ఆయన తగిన రాజ్యాంగ సూచనలు కూడా తెలిపారు. ప్రధానంగా వర్గీకరణ చేయాలంటే క్లాజు 3 ని 314 కు మార్చాలని, అది కుదరకపోతే షెడ్యూల్డ్ కులాల ఆర్డర్ ను సవరించాలని తెలిపారు. అంతేగాని వర్గీకరణ విధానం సరైన మార్గం  కాదు దళితులంతా సమైఖ్యంగా ఉండాలన్నది అగ్రవర్ణ భూస్వామ్య భావజాలం మాత్రమే అవుతుంది. ఇది కేవలం దళితుల్లో ఆధిపత్య వర్గంగా ఉన్న మాల రాజకీయ నాయకుల వలన మరియు వారి సహచరుల వలన  వర్గీకరణ ఆగిపోయిందని కనుక వర్గీకరణ తప్పనిసరిగా జరపాలని ముత్తయ్య గారు ఆకాంక్షిస్తున్నారు.

సుప్రీంకోర్టు తన తీర్పులో వర్గీకరణ చట్ట విరుద్ధం అని చెప్పింది. ఆ చట్టాన్నే సవరించి ఆయా రాష్ట్రాల సామాజిక, రాజకీయాంశాల దృష్ట్యా సవరించుకోవచ్చునని వర్గీకరణకు ప్రత్యామ్నాయ పద్ధతులను రచయిత సూచిస్తున్నాడు.

అంతేకాకుండా ఎస్సీలలో వర్గీకరణ ఎందుకు అన్న వాదనకు పైన తెలిపిన అంశాలే కాకుండా ఈ కింది ఆంశాల వలన కూడా ఎస్సీలలో వర్గీకరణ జరగాలి అంటున్నారు ఆచార్య ముత్తయ్య.

1. వర్గీకకరణ ద్వారా భారత రాజ్యాంగ లక్ష్యాలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం సాధించటం.
2. నైష్పత్తిక న్యాయసూత్రం ఆధారంగా అన్ని ఉపకులాల మధ్య రిజర్వేషన్ ఫలితాలను సమానంగా పంచటం.
3. మాదిగ, మాల ఉపకులాల మధ్య సామరస్యాన్ని పెంపొందించటం
4. రిజర్వేషన్ ఫలితాలను పొందుటలో ఉన్న అసమానతలే దళితులను విడదీస్తున్నాయి. కావున రిజర్వేషన్ ఫలితాలను సమానంగా పంచి దళితుల మధ్య ఐక్యతను సాధించటం.
5. సమిష్టి సమస్యలకై పోరాటలకు పునాదులు వేయటం.
6. సమానత్వం ద్వారా సౌభ్రాతృత్వం, ఐక్యత సాధించటం. **(ఆచార్య.ముత్తయ్య.ఎస్సీలలో వర్గీకరణ ఎందుకు?ఆంధ్రప్రదేశ్ మాదిగ మేధవులఫోరం,పుట:24)**

పైన చెప్పినట్లు ఎస్సీలలో వర్గీకరణ జరిగితే భారత రాజ్యాంగ నిర్మాత కోరుకున్న స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంతో పాటు సామాజిక న్యాయం అన్ని ఉపకులాల వారికి జరుగుతుందని తెలియజెప్పాడు. రిజర్వేషన్లను వర్గీకరించటం వల్ల దళితుల మధ్య అనైక్యత భావాలు తొలగిపోయి, చిరకాల శత్రువుల ఆధిపత్యాన్ని నాశనం చేయవచ్చునని తెలియజెప్పాడు.

వర్గీకరణ వలన దళిత సమైక్యత దెబ్బతింటుదంటున్న మాలలకు దళిత సమైక్యత దెబ్బతినేది ఏకీకరణ వలన మాత్రమేనని వర్గీకరణ వలన కాదు అని చెబుతూ, దళిత సమైఖ్యతకు ఈ కింది సూత్రాలను కూడా తెలియజెప్పారు.

1. ప్రత్యేక కుల అస్తిత్వం, ప్రత్యేక సంఘం

2. జనాభా నిష్పత్తిలో పోరాట ఫలితాల పంపిణీ

3. మైనారిటీ కులానికి కనీస న్యాయం (**ఆచార్య.ముత్తయ్య. ఎస్సీలలో వర్గీకరణ ఎందుకు?**, **పుట:31**, **ఆంధ్రప్రదేశ్ మాదిగ మేధవుల ఫోరం**, **ఉస్మానియా యూనివర్శిటీ; హైదరాబాదు.2007.**)

ఈయన చెప్పిన దళిత సమైక్యత సూత్రాలు ఇప్పటికే ఉద్యమ, సాహిత్య రంగాలలో ఏర్పడి సొంత సంస్కృతి, సొంత సంఘాలు, తమ కుల సాహిత్యం ఆయా రచనల్లో, సమవేశాల్లో వ్యక్తపరుస్తున్నారు. కాకపోతే ఈరోజు నేను, నా కులం, నాది అనే భావన కొంతవరకే ఉంటే మంచిది అది మితి మీరి పోయి ఐక్యత సాధించక పోగ అనైక్యతకు దారి తీయకుండా, నాది, నేను అనే భావన పోయి కొంత కాలానికి నాది, నీది కలిసి మనది అనే భావన వస్తే అప్పుడు మనం ఐక్యత సాధించినట్లే.

వర్గీకరణ వలన దళితుల ఐక్యత లోపిస్తుందన్న ఏకీకరణ వాదులు ఆరోపణలను ఖండిస్తూ, ఐక్యత లోపిస్తుందన్న వాదనకి సమాధానంగా మాల, మాదిగల మధ్య ఎప్పుడు ఐక్యత ఉందనీ, అసలు ఐక్యత సాధ్యమా? అనే వాదనతో మాదిగరిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక కార్యదర్శి కృపాకర్ మాదిగ చమర్ డెమోక్రసీ అనే పత్రికలో *'మాల, మాదిగల మధ్య ఐక్యత సాధ్యమా?'* అనే వ్యాసాన్ని రాస్తూ, దిగువ సూచించిన అంశాలలోని వాస్తవాలను, న్యాయబద్ధతను ఆచరణపూర్వకంగా మాల నాయకులు, మాల మేధావులు, మాల పెద్దలు అంగీకరించగలిగితే మాదిగలు, మాలల మధ్య శాశ్వతమైన, సుహృధ్బావమైన ఐక్యత సుసాధ్యమవుతుందని భావిస్తున్నాం, ఆశిస్తున్నాం అని ఆ అంశాలను ఇలా వివరించారు.

" *1. జనాభా నిష్పత్తి ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ సంక్షేమ రంగాల ఎస్సీ రిజర్వేషన్లలో తమ తమ వాటాలు పొందటానికి మాదిగలు, రెల్లీలు, మెహతార్లు మొదలగు 59 షెడ్యూల్డు కులాల వారు చేస్తున్న డిమాండ్లు,*

ఉద్యమాలు న్యాయబద్ధమైనవి మాలలు (మాల నాయకులు, మాల పెద్దలు, మాల అధికారులు, మాల మేధావులు) గుర్తించాలి. గౌరవించాలి. ఈ మేరకు వారంతా ప్రతినిధి బృందంగా తయారై ముఖ్యమంత్రి , ప్రధానమంత్రి, యు.పి.ఏ చైర్ పర్సన్ శ్రీమతి సోనియాగాంధీ, రాష్ట్రపతి ఈ అంశంపై పరిశీలన కోసం కేంద్రప్రభుత్వం నియమించిన జస్టీస్ ఉషా మెహ్రా కమీషన్, జాతీయ ఎస్సీ కమీషన్ చైర్మెన్ లను కలవాలి. తక్షణమే పార్లమెంటులో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం జారీ చేయాలని వారిని కోరాలి.

2. ప్రభుత్వ, ప్రైవేటు విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్ధిక అవకాశాలలో రాష్ట్రంలో 59 ఎస్సీ కులాలలో ప్రతి కులానికి వారి జనాభా నిష్పత్తి ప్రకారం వాటి అవకాశాలు కల్పించే సూక్ష్మస్థాయి పంపిణీ న్యాయసూత్రాలలో మాలలు ఏకీభవించాలి. ఉమ్మడి డిమాండ్ల సాధన కోసం మాదిగలు, మాలలు ఇతర షెడ్యూల్డ్ కులాల మధ్య రిజర్వేషన్ల వర్గీకరణతో ఐక్యతకు పునాది ఏర్పడుతుందని మాలలు అంగీకరించాలి.వర్గీకరణకు చొరవ తీసుకోవాలి.

3. రిజర్వేషన్ల వర్గీకరణ మొదట ప్రాధాన్యం కలిగిన ఉదాత్తమైన ఉమ్మడి లక్ష్యంగా మాలలు గుర్తించగలగాలి.

4. అన్ని స్థాయిల విద్యావకాశాల్లో, ఉద్యోగాల్లో, ఆర్ధిక పథకాల్లో, రాజకీయ పార్టీల నాయకత్వాల్లో,పదవుల ప్రాతినిధ్యంలో తమ జనాభా నిష్పత్తి కంటే అదనపు అవకాశాలు లభ్యమవుతున్నప్పుడు, అటువంటి అదనపు అవకాశాలను మాల కులస్థులు వదులుకోవాలి. అలా ఒదులుకున్న అవకాశాలను సరైన/కనీస ప్రాతినిధ్యం కోల్పోయిన మాదిగ, డక్కలి,చిందు,బైండ్ల,రెల్లి, మెహతార్ మొదలైన మార్జినలైజ్డ్ షెడ్యూల్డు కులాల వారికి చెందేలా మాలలు బాధ్యత తీసుకోవాలి.

5. వర్గీకరణకు న్యాయపరమైన, సాంకేతిక పరమైన అడ్డంకులను మాలలు కల్పించకూడదు. దళిత కులాల ఉమ్మడి సమస్యల పరిష్కారాల ప్రతిపాదనలు, ప్రాతిపదికలను వర్గీకరణకు అడ్డంకులుగా నిలుపరాదు. పంపిణీ న్యాయమే సామాజిక న్యాయమని , ఇందుకు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ల వర్గీకరణే సాధనమని, ఇందుకు తామూ కృషి చేస్తానని మాలలు ప్రకటించాలి.

6. ప్రస్తుతం ఉన్న కొద్దిపాటి ప్రభుత్వ రిజర్వేషన్లను ఏ ఎస్సీ కులానికి చెందాల్సినవి ఆ ఎస్సీ కులానికి చెందకుండా, ఉమ్మడి అవకాశాలను పెంచుకునే, ఉమ్మడి దళిత ఉద్యమాలను శక్తివంతంగా నిర్మించలేమని మాలవారు ఒప్పుకోవాలి.

7. నాడు చుండూరులో బాధితులైన మాలలకు న్యాయం జరగనీయకుండా రెడ్లు 'సర్వజనాభ్యుదయ సమితి' ని స్థాపించారు. దళితులపై దాడులు చేశారు. నిన్న బిసి రిజర్వేషన్ల కల్పనకు వ్యతిరేకంగా అగ్రకులాలవారు 'సిటిజన్ ఫోరం' స్థాపించారు. బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో కేసు వేశారు. ఇదే మాదిరిగా నేడు ఎస్సీలలో అత్యంత అణగారిన, అత్యంత వెనకబడిన మాదిగలు, రెల్లి, అనుబంధ కులాల వారికి రిజర్వేషన్ల వర్గీకరణతో న్యాయం జరగనీయకుండా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల దగ్గర జస్టీస్ ఉషా మెహ్రా కమీషన్, జాతీయ ఎస్సీ కమీషన్ దగ్గర అడ్డుతగులుతున్న మాల నేతలు, మాల మహానాడు నాయకులను అసాంఘీక శక్తులుగా, దళిత వ్యతిరేక శక్తులుగా మాలవారు ప్రకటించాలి. వారి అపరాధాలను, ప్రాబల్యాన్ని మాలలే అంతం చెయ్యాలి.

8. దళితులు ఆదివాసీలు బలహీన వర్గాల సంక్షేమం,సాధికారం, సామాజిక న్యాయ సాధన గురించి వివిధ వేదికలపై గట్టిగా మాట్లాడుతున్న మాల నాయకులు ప్రతి దళిత కులానికి సూక్ష్మస్థాయి పంపిణీ న్యాయం

చేకూర్చగల రిజర్వేషన్ల వర్గీకరణను సమర్ధిస్తూ ఎందుకు మాట్లాడలేకపోతున్నారు ? మాల మేధావులు ఇప్పటికైనా బహిరంగంగా ఎస్సీల వర్గీకరణను సమర్ధిస్తూ తమ ప్రజాస్వామిక విలువలు చాటుకోవాలి.

9. ఎస్సీల సంక్షేమం కోసం అన్ని ప్రభుత్వ శాఖల్లో లైసన్ ఆఫీసర్లు ఉన్న మాదిరిగానే, ప్రతి దళిత కులానికి రిజర్వేషన్లలో పంపిణీ ప్రాతినిధ్యం కల్పించటం కోసం వర్గీకరణ సూత్రం అమలుకోసం ప్రతి ప్రభుత్వ శాఖలో ప్రత్యేక అధికారులను నియమించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మాలవారు విజ్ఞప్తి చెయ్యాలి.

10. చివరగా మాదిగలు, మాలల మధ్య సాంఘీక ఐక్యత లేకుండా రాజకీయ ఐక్యత సాధ్యం కాదని మాలవారు గుర్తించాలి. మాదిగలతో కులాంతర వివాహాలు చేసుకోవటానికి, మాదిగలతో కలిసి పండుగలు, వేడుకలు జరుపుకోవటానికి మాదిగలతో అన్ని రకాల మానవీయ, భౌతిక సదుపాయాలు సంతోషాలు పంచుకోవటానికి మాదిగల కంటే తాము అధికులంకామని నిరూపించుకోవటానికి మాల నాయకులు, మాల మేధావులు ఆచరణాత్మకమైన సంసిద్ధతతో ముందుకు రావాలి. అప్పుడే మాదిగలు, మాలలు మధ్య నెలకొన్న అపోహలు, అనుమానాలు, ఈర్ష్యలు, స్పర్ధలు తొలగిపోతాయి. నిజమైన సహోదరత్వం, సమానత్వం, సమైక్యత, సహజీవనాలు మాదిగలు , మాలలు మధ్య నెలకొంటాయి. లేకుంటే అగ్రకుల పాలకులకు వినోదాన్ని మిగిల్చే బానిస శిబిరాలు(గ్లాడియేటర్స్)గా మాదిగలు, మాలల జీవితం నడుస్తుంది! మాదిగల, మాల ఐక్యత విషాదాంత నాటకంగా మారే ప్రమాదముంది.''(**కృపాకర్ మాదిగ.చమర్ డెమోక్రసీ**, **పుట:3**, **సంపుటి:7**, **నవంబర్**, **2012**).

కృపాకర్ మాదిగ పైన వ్యక్తపరచిన అభిప్రాయాలు ఆచరణలో కష్టమేనని అర్థమవుతుంది. ఎందుకంటే దండోరా ఉద్యమం యొక్క అంతిమ లక్ష్యం వర్గీకరణ అయితే మాలమహానాడు యొక్క అంతిమ లక్ష్యం ఏకీకరణ. కనుక కృపాకర్ మాదిగ వ్యక్తపరచిన అభిప్రాయాలు చూస్తే ప్రధానంగా మాలలే స్వయంగా వర్గీకరణ జరపాలనేది, మాల మహానాడు నాయకులను అసాంఘీక శక్తులుగా, దళిత వ్యతిరేక శక్తులుగా మాలవారు ప్రకటించాలి. వారి అపరాధాలను, ప్రాబల్యాన్ని మాలలే అంతం చెయ్యాలి అనే తదితర అంశాలను పరిశీలిస్తే దళిత వ్యతిరేక శక్తులుగా మాదిగలు మాలలను అంటే, మాలలు మాదిగలను దళిత అనైక్యదారులుగా ప్రచారం చేసుకుంటున్నారు. ఇకపోతే దండోరా ఉద్యమం ప్రారంభం తర్వాత మాల రచయితలు ఎవరికి సానుభూతి పలకాలో తెలియని స్థితిలో ఉన్నారు. అలాంటప్పుడు వారే స్వయంగా ఎలా వర్గీకరణ జరపాలని జాతీయ ఎస్సీ కమీషన్ లేఖ రాయటం అనేది భ్రమ కనుక మాల, మాదిగల మధ్య ఐక్యత సాధ్యమవటం కృపాకర్ మాదిగ అన్నట్లు విషాదాంతంగానే ఉంటుంది.

*"ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం జరుగుతున్న పోరాటం, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకై జరుగుతున్న ఉద్యమం – ఈ రెండు కూడా ప్రజల ఆకాంక్షలను సాధించే ప్రజాస్వామిక ఉద్యమాలే. ఎస్సీ సామాజిక వర్గాల్లోని అంతరాలను తొలగించడానికి రిజర్వేషన్ల ఫలాలు ఎస్సీల్లోని ప్రతి సామాజిక వర్గానికి జనాభా దామాషా ప్రకారమే వర్గీకరించాలనేది అంబేద్కర్ స్ఫూర్తికి అనుగుణమైనది. ఎస్సీల్లోని ఏ కులమైనా రిజర్వేషన్ల అవకాశాలను తమ జనాభా దామాషా నిష్పత్తి కంటే అదనంగా పొందడానికి అంగీకరించకూడదని, విద్య, సామాజిక, ఆర్థిక స్థితిగతులకు అనుగుణంగా రిజర్వేషన్లను పంచాలని అంబేద్కర్*

*నిర్మొహమాటంగా చెప్పారు"* **(వర్గీకరణ తరువాతే తెలంగాణ - మందకృష్ణ మాదిగ ఆంధ్రజ్యోతి దినపత్రిక, 19-7-2011)**

సాధారణంగా ప్రజాస్వామిక దేశాలలో ఒక ఉద్యమం ఆవిర్భవించిందంటే అది తప్పని సరిగా ప్రజల ఆకాంక్షను తెలియజేసే ఉద్యమమే అని చెప్పుకోవాలి. ఈ కోవలోనే దాదాపు గత 20 సంవత్సరాలుగా మాదిగ హక్కుల కోసం జరుగుతున్న వర్గీకరణ డిమాండు, దాదాపు గత 60 సంవత్సరాలుగా వస్తున్న ప్రత్యేక తెలంగాణ ఉద్యమం రెండూ కూడా ప్రజల ఆకాంక్షను తెలియజేసే ఉద్యమాలే అని మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణ మాదిగ అభిప్రాయపడ్డారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లలో ఏ కులాలైన తమ జనాభా నిష్పత్తి కంటే ఎక్కువ ఫలాలు పొందకూడదని, ఒక వేళ పొందుతుంటే రిజర్వేషన్లు ప్రారంభమైన తొలినాళ్ళలో వారి జనాభా తక్కువగా ఉండచ్చు. కానీ కాలపరిమాణంలో ఆయా కులాల జనాభా పెరిగే పరిణామాన్ని బట్టి రిజర్వేషన్లు వర్గీకరించటం అనేది అనివార్యం అని కృష్ణమాదిగ అభిప్రాయపడ్డారు.

*"ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ డిమాండ్ న్యాయమైన డిమాండు. రిజర్వేషన్లను జనాభా నిష్పత్తి ప్రకారం ఎబిసిడి లుగా వర్గీకరణ పంచటమే ప్రభుత్వాలకు అదనంగా పైసా ఖర్చు లేని సమస్య. ఆంధ్ర రాష్ట్రంలో 80 లక్షల మంది మాదిగలు రెండు దశాబ్దాల కాలంగా రిజర్వేషన్ల వర్గీకరణ చేయాలని తీవ్రమైన ఉద్యమం నిర్వహిస్తున్నారు. వర్గీకరణ చేయాల్సింది ప్రభుత్వం. ఆలస్యం చేస్తుంది. చేయాలని తెలిసినా, వర్గీకరణ తన బాధ్యతే అయినా దొంగ నిద్రను పాటిస్తుంది."* **(చిలుమూరి శ్రీనివాసరావు. వర్గీకరణకు జాప్యమేల? సూర్య దిన పత్రిక; 9.12.2010)**

వర్గీకరణ డిమాండ్ న్యాయమైనది,ప్రజాస్వామ్యబద్ధమైనది. వర్గీకరణ చేయటానికి ప్రభుత్వానికి ఆర్థికంగా ఎలాంటి నష్టం లేదు కేవలం వారి రాజకీయ భవిష్యత్తుకు నష్టం తప్ప. వర్గీకరణ చేయాల్సింది రాష్ట్ర ప్రభుత్వస్తుమే కనుక దొంగ

నిద్రను పాటించకుండా తక్షణమే వర్గీకరణ చేయాలని చిలుమూరి శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు.

" *అగ్రకులస్తులు తమ పేరుకు సగర్వంగా రెడ్డి, నాయుడు, రావు మొదలైన కుల నామాలను కూడా కలుపుకున్నట్టుగానే మాదిగలు కూడా తమ పేరులో మాదిగను అంతర్భాగం చేసుకొని ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకున్నారు. మాదిగల్లో ఈ ఆత్మనిర్భరత అగ్ర కులస్తులను కలవర పరుస్తున్నది.*

*ఎస్‌సి రిజర్వేషన్లలో తమ న్యాయమైన వాటా కోసం వాటిని ఎబిసి డిలుగా వర్గీకరించి అమలు పరచాలని మాదిగలు చేస్తోన్న డిమాండ్‌ను సాటి దళితులైన మాలలు తీవ్రంగా వ్యతిరేకించడం ఎంతైనా శోచనీయం. విప్లవ కమ్యూనిస్టు పార్టీలతో సహా అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, చివరకు పేద మాలలు, నిష్పాక్షిక మాల మేధావులు కూడా ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణకు మద్దతునిస్తున్నారు. ఉద్యమిస్తున్న మాదిగలపై మాల నాయకులు చేస్తున్న విమర్శలు మొత్తం దళిత కులాల ఆత్మగౌరవాన్నే కించపరు స్తున్నాయని చెప్పక తప్పదు. మన రాష్ట్రంలో ఎస్‌సిల వర్గీకరణ 1990ల తుదినాళ్ళలో అమలయింది. 2004లో సర్వోన్నత న్యాయస్థానం ఈ వర్గీకరణను కొట్టివేసింది. రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంటు ఆమోదం పొంది వర్గీకరణను అమలుపరచవచ్చని సుప్రీంకోర్టు సూచించింది. ఈ సూచన స్ఫూర్తితోనే ఎస్‌సిల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మాదిగలు డిమాండ్ చేస్తున్నారు. వెనుకబడిన దళిత కులాలను అభివృద్ధిచెందిన దళిత కులాలు విమర్శించడం తగదు. వృద్ధి చెందిన కులాలకు, వృద్ధి చెందని కులాలకు ఆయా ప్రాంతాలలో నిరక్షరాస్యతే ప్రధాన కారణం."* (**కె.యస్. బాబు మాదిగ. మాదిగలకు న్యాయం జరిగేనా? (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి' రాష్ట్ర అధ్యక్షులు) ఆంధ్ర జ్యోతి 7-12-2008**).

ఇన్నాళ్ళు పేరు చివరన రెడ్డి, కాపు, చౌదరి, శాస్త్రి అని సగర్వంగా పెట్టుకొని ఆ పేరు చివరన ఉన్నదే వారి అధికారానికి, ప్రతిభకి తార్కాణంగా ప్రదర్శించిన

అగ్రవర్ణాలు అదే పేరు చివర మాదిగ అని మేం పెట్టుకోవడంతో అగ్రవర్ణాల వారు కలవరపడుతున్నారు. ఇది ప్రజాస్వామ్య గమనంలో ఓ గొప్ప సాంస్కృతిక విప్లవంగా చెప్పవచ్చు. వర్గీకరణను అన్ని ప్రజాస్వామ్య సంఘాలు సమర్ధిస్తున్నారు కానీ మాలో ఒకరిగా ఉండి ఇన్నాళ్ళు ఆధిపత్యం మీద యుద్ధం చేసిన మాలలు ఈ మీ ఆధిపత్యం మాకు వద్దు మాది మాకు కావాలి రిజర్వేషన్లు వర్గీకరించుకుందాం అంటే కాదు కలిసుందాం అనటం కొన్ని సంవత్సరాల దళిత ఉద్యమాన్నే కించేపరిచే విధంగా ఉందంటూ దళితుల్లో అభివృద్ధి చెందిన కులాలు అభివృద్ధి చెందని కులాలను అవమానించడం మన ఆత్మగౌరవాన్ని మనమే ప్రశ్నించుకున్నట్లు అవుతుందని కె.యస్. బాబు మాదిగ అభిప్రాయపడ్డారు.

*"దీర్ఘ కాలంగా అసమానతలకు గురవుతున్న మాదిగలకు, వారి ఉపకులాల వారికి ఉపయుక్తంగా ఉండే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ వల్ల మాల కులస్తులకు జరిగే నష్టమేమిటి? వీరు వర్గీకరణను ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? వర్గీకరణ వల్ల దళితుల్లో ఐక్యత ఏ విధంగా దెబ్బ తింటుంది? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నవి. వర్గీకరణ వల్ల ఎడబాటుకు గురైన మాలలు, మాదిగలు ఈ సమస్య పరిష్కారం అయితే ఐక్యంగా ఉండే అవకాశం ఉంది. అంతే తప్ప సమస్య పరిష్కారం అయితే ఐక్యత ఏ విధంగా దెబ్బ తింటుంది. దీనిని బట్టి మాలలు చేస్తున్న వాదనలో వాస్తవం లేదని తెలుస్తున్నది. మాలలు , మాదిగల కన్న కొన్ని దశాబ్దాలు ముందే అభివృద్ధి చెందారు. మాలలకు రిజర్వేషన్లు అవసరం లేదని 1964లో కేంద్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ లోకూర్ కమిషన్ స్పష్టం చేసింది. ఆ నివేదిక ప్రస్తుతం కేంద్రం వద్ద ఉంది. మాల, మాదిగల సామాజిక జీవన విధానాలలో వ్యత్యాసాలు ఉన్నాయి. మాలలు చేనేత కార్మికులుగా, వ్యవసాయ కూలీలుగా, గ్రామ నౌకర్లుగా గౌరవనీయ వృత్తులలో కొనసాగుతున్నారు. మాదిగలు ఇప్పటికీ పశువధ ,చెప్పులు కుట్టడం, డప్పులు కొట్టడం, మృత దేహాలు తగుల పెట్టడం వంటి వృత్తులలో ఉన్నారు. మాలల్లో అక్షరాస్యులు 95 శాతం. మాదిగలలో*

*అక్షరాస్యులు 25 శాతం. రాజకీయ, ఉద్యోగ, విద్యా రంగాల్లో మాలలే ముందంజలో ఉన్నారు. 'ప్రభూ తనకున్నది కొంచెమైనా నలుగురితో పంచుకు తినాలి. రుచిగల పదార్థాలను ఒక్కడే కూర్చుని తినకూడదు. పేదరికంలో ఉన్నప్పుడు కూడా అడుక్కునే వానికి ప్రేమతో ఇచ్చేవాడే పుణ్యాత్ముడు' అని కురు పాండవ యుద్ధం సందర్భంగా ధృతరాష్ట్రునితో విదురుడు అంటాడు. ఈ హితోపదేశాన్ని మాలలు అర్థం చేసుకుని రిజర్వేషన్ల పంపిణీలో మాదిగలకు సహకరించాలి. సమానత్వం లేని సోదరత్వం ఎందుకు అని అంబేడ్కర్ అన్నారు. ఉమ్మడి రిజర్వేషన్లను సమానంగా పంచుకునేందుకు అంగీకరించని మాలలు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం, రాజ్యాధికారం కోసం పోరాడాలని చెప్పడం ఆశ్చర్యకరంగా ఉంది ".* **(కోటేశ్వరరావు,పోలె. మాలలకు వర్గీకరణ వల్ల నష్టమేమిటి?-వ్యాసకర్త రాష్ట్ర మాదిగ మేధావుల ఫోరం ప్రధానకార్యదర్శి) ఆంధ్రజ్యోతి దినపత్రిక 28-6-2009).**

సామాజిక, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం ప్రకారం రిజర్వేషన్ వలన మాలలకు నష్టం ఏమిటి అనే సూటి ప్రశ్న అందరికి వస్తుంది. దీనికి సమాధానంగా అన్ని విషయాలలో మాలలు మాదిగల కంటే అభివృద్ధి చెందారు. దీనికి సంబంధించి 1964 లో లోకూర్ కమీషన్ మాలలకు రిజర్వేషన్ అవసరం లేదు అని చెప్పింది. ఈ కమీషను ప్రకారం రిజర్వేషన్లు అమలైనప్పటి నుండి రిజర్వేషన్లు ఎక్కువ శాతం మాలలే అనుభవించారు. తద్వారా వారు మాదిగల కంటే ఎక్కువగా అభివృద్ధి చెంది ఉన్నారు,ఇప్పుడు కేవలం రిజర్వేషన్లు అనుభవించటానికే సమైక్యం ఉండాలంటున్నారు కానీ మాదిగలపైన మాలలకు ఎప్పుడూ చిన్నచూపే. జీవన విధానంలో మాలలకు,మాదిగలకు ఎంతో వైవిధ్యం ఉంది. ఇంత తీవ్రంగా ఉద్యమిస్తున్న మాదిగలను ఇప్పుడు కూడా మోసం చేయాలనే సంకల్పంతో మాలలు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల కోసం పోరాడమంటున్నారు. ఉమ్మడి రిజర్వేషన్లలో సమాన వాటా ఇవ్వని మాలలు

ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల కోసం పోరాడమనటం వినటానికే విడ్డూరంగా ఉంది అని పోలె కోటేశ్వరరావు అభిప్రాయపడ్డారు.

*"సామాజిక న్యాయంతోనే రాజకీయ, ఆర్థికన్యాయం, రాజ్యాంగ ఏర్పాట్లు ఉన్న అందని న్యాయం మాల- మాదిగల మధ్య అసమానతలు అనుబంధ కులాలపై ఆధిపత్యం తెలంగాణలో మాదిగ వర్గం అధికం ఆంధ్రలో మాల వర్గం మెజారిటీ జనాభా ప్రాతిపదికనే పంపకాలు సామాజికన్యాయం జరగనంతవరకు ఈదేశంలో రాజకీయ, ఆర్థిక న్యాయం జరిగే అవకాశంలేదని భారత రాజ్యాంగ నిర్మాత డా బి.ఆర్. అంబేద్కర్ స్పష్టం చేశాడు*

*సామాజికన్యాయం కోణంలో స్వల్ప మెజారిటీతో ఉన్న మాదిగలు రాష్ట్రం యూనిట్‌గా వర్గీకరణ జరగాలని కోరడం ఎంతన్యాయమో- ఆంధ్రాలో అత్యధిక మెజారిటీతో ఉన్న మాల వర్గం వ్యతిరేకించడం కూడా అంతే న్యాయం! వర్గీకరణ జరిగితే తెలంగాణలో మాల వర్గం నష్టపోయేదేమీ లేదు. కానీ ఆంధ్రలో ఉన్న మాలలు తీవ్రంగా నష్టపోతారు. తెలంగాణలో మాదిగ వర్గం ప్రజలు అధికంగా ఉన్నారు. తెలంగాణలో ఆ ప్రజలు అధికంగా ఉండగా ఆ జనాభాకంటే తక్కువ శాతం రిజర్వేషన్‌కోరడంలో ఆంతర్యమేమిటో మాదిగ నాయకత్వంతో పాటు ప్రభుత్వాలు ఆలోచించాలి. తెలంగాణలో వర్గీకరణ జరిగితే వారికి 7 శాతం అమలవు తుంది. తెలంగాణలో వారు మొత్తం 15 శాతంలో 7 శాతమే ఉన్నారనేది అంగీకరిస్తారా? మాల వర్గం జనాభాకు తెలంగాణలో వర్గీకరణ జరిగితే నష్టంలేదు, లాభంలేదు. వారు ఎంత జనాభా ఉన్నారో అంత రిజర్వేషన్‌వర్గీకరణ జరిగినా జరగకపోయినా వారి జనాభాకు అనుగుణంగానే విద్య, ఉద్యోగ అవకాశాలు న్నాయి.ఏ విధంగా చూసినా 'జనాభా ఎంతనో రిజర్వేషన్ అంత' అనే కోణం లో చూసినప్పుడు ఆంధ్రాలో ఉన్న మాల వర్గం ప్రజలు వర్గీకరణను వ్యతిరేకించడంలో తప్పులేదు. అక్కడ ఆదిఆంధ్ర, రెల్లి గ్రూపులు ఉన్నాయి. వాటి రెండు శాతం రిజర్వేషన్‌పోగా మిగిలిన 6 శాతం*

*రిజర్వేషన్‌తో మాలవర్గం తీవ్రంగా నష్టపోతుంది.వర్గీకరణ సమస్యకు పరిష్కారం లభించాలంటే ఈవిషయాలన్నింటినీ పరిశీలించాలి.* (**భద్రయ్య, దొంత. ప్రాంతాలవారీ వర్గీకరణే పరిష్కారం! సూర్య దిన పత్రిక జనవరి,16, 2013**).

అంబేద్కర్ కోణం నుండి ఆలోచించినప్పుడు ఆయా ప్రాంతాలలో దళిత అభివృద్ధికి రిజర్వేషన్లు అనేవి చాలా అవసరం. ఇరు ప్రాంతాల్లో దళితులు ఉన్న వారిని ఆయా ఉపకులాల ఆధారంగా విభజించి చూసినప్పుడు రిజర్వేషన్లు ఉపయోగించుకోవటంలో కొంత అన్యాయం జరిగిందనే చెప్పాలి. తెలంగాణాలో *స్వల్ప మెజారిటీతో ఉన్న మాదిగలు రాష్ట్రం యూనిట్‌గా వర్గీకరణ జరగాలని కోరడం ఎంత న్యాయమో– ఆంధ్రాలో అత్యధిక మెజారిటీతో ఉన్న మాల వర్గం వ్యతిరేకించడం కూడా అంతే న్యాయం.* అంటే రిజర్వేషన్ల వర్గీకరణ జరగాల్సి వస్తే అది ఆయా ఉప కులాల జనాభా ప్రాతిపదికన మరియు ప్రాంతాల వారీగా వర్గీకరిస్తే రిజర్వేషన్ల యొక్క అంతిమ లక్ష్యం నెరవేరే అవకాశం ఉంది. ఆ దిశగా రాజ్యం ఆలోచించి దళితుల అభ్యున్నతికి పాటుపడాలి అంతేకానీ దళితులను విభజించు పాలించు సూత్రంతో విడగొడితే అది ఏదో ఒక రోజు వాళ్లకు వాళ్ళే చైతన్యం అయ్యే అవకాశం లేకపోలేదు.

*"దళితుల్లో మాలలకే ప్రభుత్వ అవకాశాలన్ని అందుతున్నాయని ఈ విషయంలో మాదిగ, రెల్లి లాంటి ఇతర కులాలు ప్రభుత్వ ఫలాలను అందుకోవటంలో చాలా వెనుకబడి వున్నారని మొత్తం దళిత వర్గం ప్రాతిపదికన కాకుండా, కుల ప్రాతిపదికన దళితులకున్న 15 శాతం రిజర్వేషన్లను ఎబిసిడి ల కింద కులాలను వర్గీకరించి, రిజర్వేషన్ శాతాన్ని కులాల దామాషి ప్రకారం కేటాయించాలని అప్పుడే దళితుల్లో మాలల్లాగా ఇతర కులాలు కూడా చైతన్యవంతమవుతారనేది దండోరా వాదన " అని కృష్ణ మాదిగ చెప్పినట్లు డా.కె.లక్ష్మీనారాయణ తెలిపారు.(* ***లక్ష్మీనారాయణ,కె. ఆదిభారతీయుల***

***చరిత్ర(క్రీ.పూ.2500-క్రీ.శ.2005)*: పుట:221,222 *కర్నూలు డయాసిస్ సోషల్ సర్వీసు సొసైటీ, జనవరి* ;2006).**

"2001 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ జనాభా పార్లమెంటులో ఒకటవ జోన్ లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాల్లో ఎ గ్రూపుగా విభజన చెందిన రెల్లి మరో 12 ఉపకులాలు జనాభా 1,27,943. వీరికి వర్గీకరణలో 1 శాతం అందింది. నిజానికి వీరికి న్యాయంగా నాలుగు శాతం రిజర్వేషన్ వాటా దక్కాలి. కానీ రాష్ట్రాన్ని యూనిట్ లుగా చేయడం వల్ల వీరు నష్టపోయారు.2001 జనాభా లెక్కలు ఆధారంగా వర్గీకరణ చేయడం వల్ల నాలుగు గ్రూపులు కొంత నష్టాన్ని, కొంత లాభాన్ని చేకూర్చుకున్నాయి. కానీ రిజర్వేషన్ల యొక్క ప్రధాన లక్ష్యం ఈ ఫలాలు అందరికి అందుబాటులోకి రావడం కాబట్టి వర్గీకరణ చేసిన విధానం సరిగా లేదంటూ జోన్ల వారీగా ఏయే కులాలు ఎంత నష్టపోయారో, ఎంత లాభపడ్డారో తెలియజేస్తూ వర్గీకరణ అనేది ఉమ్మడిగా కాకుండా జోన్ల వారీగా చేస్తే అందరికి అందవల్సిన స్థాయిలో రిజర్వేషన్ ఫలాలు అందుతాయి దేవనీ సతిష్ మాదిగ, తెలంగాణ మాదిగ దండోరా రాష్ట్ర అధ్యక్షులు ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈ విధంగా తెలియ జెప్పారు.

"2001 రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ జనాభా లెక్కల ప్రకారం ఒకటవ జోన్ లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాల్లో ఎ గ్రూపుగా విభజన చెందిన రెల్లి మరో 12 కులాల జనాభా1,27,943. వీరికి వర్గీకరణలో 1శాతం అందింది. నిజానికి వీరికి న్యాయంగా  నాలుగు శాతం రిజర్వేషన్ వాటా దక్కాలి. కానీ రాష్ట్రాన్ని యూనిట్ గా వేయడం వల్ల వీరు నష్టపోయారు. ఇదే జోన్ లో మాదిగ, మరో 18 కులాలకు 7శాతం కేటాయింపులు జరగడం వల్ల ఇక్కడ 11,59,035 జనాభా ఉన్న మాదిగలకు తమ జనాభాకు మించి వాటా పొందారు. నిజానికి ఈ జోన్ లో వీరికి 4 శాతం రావాలి కానీ మూడు శాతం ఎక్కువ పొందారు. ఇదే జోన్ లో మాల, మరో 25 కులాల జనాభా 5,35,060. వీరికి 16శాతం

రిజర్వేషన్ కేటాయించారు. ఈ జోన్ లో మాదిగలు జనాభాకు మించి నాలుగురెట్లు ఉన్న సి గ్రూపు మాలలకు 6శాతం రావడంతో అన్యాయానికి గురయ్యారు. నిజానికి వీరికి జనాభా ప్రకారం 7 శాతం వాటా రావాలి. ఇదే జోన్ లో ఆదిఆంధ్ర, మరో 4 కులాల జనాభా 21,725. వీరికి రిజర్వేషన్ వాటాలో 11శాతం కేటాయించారు. వీరంతా మాల(ఆది ఆంధ్రమాల)కులస్థులే.

రెండవ జోన్ లో తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా, కృష్ణా జిల్లాలు. ఈ జోన్ లో ఎ గ్రూపు రెల్లి 12 కులాలకు 1 శాతం కేటాయించారు. బి గ్రూపు మాదిగ మరో 18 కులాలకు 7శాతం అమలైంది. ఇక్కడ వీరి జనాభా 7,12,439. ఇదే జోన్ లో సి గ్రూపు మాలలకు 6శాతం వాటా లభించింది. వీరి జనాభా 10,63,776. ఈ జోన్ లోని మాదిగల జనాభాకు మించి మూడు లక్షలు ఎక్కువగా ఉన్నారు. మాలలకు అన్యాయం జరిగింది. ఇదే జోన్ లోని ఆదిఆంధ్ర మాల , మాదిగలకు 1 శాతం వాటా వచ్చింది. వీరి జనాభా 6,43,990 డి గ్రూపులోని ఆదిఆంధ్రమాల వారికి 1 శాతం వాటా రావడం ఈ జోన్ లో చాలా అన్యాయం జరిగింది. న్యాయంగా వీరికి 5 శాతం వాటా రావాలి. రాష్ట్రంలో ఐఏఎస్, ఐపిఎస్, సుప్రీంకోర్టు, హైకోర్టు గల్లి నుంచి ఢిల్లీ దాకా పదవులు పొందిన వారు వీరే '

మూడవ జోన్ లో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలున్నాయి. ఈ జోన్ ఎ గ్రూపు రెల్లి 12 కులాల జనాభా 5,787. వీరికి వర్గీకరణలో 1 శాతం వాటా వచ్చింది. బి గ్రూపులోని మాదిగ మరో 18 కులాలు. ఈ జోన్ లో 7,53,353. వీరికి కామన్ గా 7 శాతం వచ్చింది. ఇదే జోన్ లో సి గ్రూపు కేటగిరిలో ఉన్న మాల, 25 కులాల జనాభా 9,03,205. వీరికి కామన్ వర్గీకరణలో వాటా 6 శాతం వచ్చింది. వీరిక్కడ మాదిగల జనాభాకు మించి లక్షన్నర ఎక్కువగా ఉన్నారు. నిజానికి వీరి 8 శాతం ఉండాలి. ఉమ్మడిగా జరిగిన కామన్ వర్గీకరణలో

ఈ జోన్ లోని మాలలకు అన్యాయం జరిగింది. ఇదే జోన్ లోని డి గ్రూపు జనాభా 43,830. వీరికి 1 శాతం వచ్చింది ' .

' నాల్గవ జోన్ రాయలసీమలో నాలుగు జిల్లాలు. ఈ జోన్ లో రెల్లి 12 కులాల జనాభా 3,404, వీరికి కామన్ వర్గీకరణ వాటాలో 1 శాతం వచ్చింది. ఇదే జోన్ లో మాదిగ మరో 18 కులాల జనాభా 9,88,458. వీరికి న్యాయంగా 7 శాతం వాటా అందింది. అలాగే మాల 25 కులాల జనాభా 9,76,823. వీరికి కామన్ వర్గీకరణలో 6 శాతం న్యాయంగా అందింది. ఉమ్మడి వర్గీకరణ విధానంలోజరిగిన వర్గీకరణ ఫలాలు 4వ జోన్ లో సక్రమంగా అందాయి. ఆదిఆంధ్ర, ఆది ద్రావిడ జనాభా 1,05,328 వీరికి 1 శాతం కేటాయించారు' .

ఐదవ జోన్ లో అదిలాబాద్ , ఖమ్మం, కరీంనగర్, వరంగల్ జిల్లాలున్నాయి. మేతర(పాకీ), 12 కులాల జనాభా 12,530, వీరికి కామన్ వర్గీకరణ వాటాలో ఎ గ్రూపుగా 1 శాతం వాటా ఇచ్చారు. ఇదే జోన్ లోని మాదిగ 18 కులాల జనాభా 15,88,737. వీరికి బి ఉమ్మడి వాటాలో 7శాతం కామన్ గా వచ్చింది. ఈ జోన్ లోనే మాదిగల జనాభా నిష్పత్తి ప్రకారం 11 శాతం రావాలి. కానీ ఉమ్మడి వర్గీకరణలో అన్యాయం జరిగింది. మాలల జనాభా 7,14,874 వీరికి కామన్ వర్గీకరణలో వాటాలో వీరి జనాభాకు మించి 6 శాతం అందింది. నిజానికి ఈ జోన్ లో మాలలకు 3 శాతం రావాలి. ఈ జోన్ లో ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఆదిఆంధ్రవారు, మితుల్ అమ్ముల్ వారు వచ్చి స్థిరపడ్డారు. వీరి జనాభా 5,900. వీరికి 1 శాతం కామన్ అందింది.

ఆరవజోన్ లో హైదరాబాదు, నిజామాబాద్, మెదక్, నల్లగొండ,రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాలు. ఈ జోన్ లో మేతర వారి జనాభా 8,178. వీరికి కామన్ గా 1 శాతం అందింది. ఈ జోన్ లోని మాదిగ 18 కులాల జనాభా 25,56,716. వీరికి కామన్ వర్గీకరణలో 7 శాతం వచ్చింది. నిజానికి వీరికి ఈ జోన్ లో 13 శాతం రావాలి. ఇ జోన్ లో మాదిగలకు తీరని అన్యాయం జరిగింది.

ఇదే జోన్ లో మాలల జనాభా 8,04,598. వీరికి కామన్ వర్గీకరణలో 6శాతం వచ్చింది. ఆదిఆంధ్ర(వలస) ఇక్కడ స్థిరపడ్డ వారి జనాభా14,925.వీరికి 1శాతం అందింది.

| Zone ANDHRA (13) Districts | (A) Relli (12 Castes) | (B) Madiga (18 Castes) | (C) Mala (25 Castes) | (D) Adi (4 castes) |
|---|---|---|---|---|
| 1St Srikakulam | 37,660 | 3,531 | 1,51,919 | 9,698 |
| Vijayanagar | 50,169 | 58,188 | 1,26,144 | 5,075 |
| Vishakapatnam | 40,114 | 35,529 | 1,56,997 | 6,592 |
| **Total** | **1,27,943** | **97,248** | **4,35,060** | **21,365** |
| 2nd West Godavari | 14,114 | 1,76,610 | 3,26,743 | 4,43,653 |
| East Godavari | 7,440 | 2,06,452 | 3,50,747 | 1,93,705 |
| Krishna | 7,786 | 3,29,377 | 3,86,285 | 6,632 |
| **Total** | **29,340** | **7,12,430** | **10,63,775** | **6,43,990** |
| 3rd Guntur | 4,840 | 2,92,108 | 3,96,142 | 526 |
| Prakasham | 252 | 2,70,438 | 2,77,039 | 20,356 |
| Nellore | 695 | 1,90,814 | 3,30,024 | 22,848 |
| **Total** | **5,787** | **753,360** | **10,03,205** | **43,730** |

| | | | | |
|---|---|---|---|---|
| 4th Chittur | 884 | 1,19,828, | 3,53,878 | 66,437 |
| Kadapa | 772 | 1,59,019 | 2,21,455 | 16,356 |
| Ananthapur | 919 | 3,73,558 | 1,64,454 | 20,245 |
| Kurnool | 829 | 3,35,053 | 2,37,096 | 2,155 |
| **Total** | **3,404** | **9,87,458** | **9,76,883** | **1,05,328** |
| | | | | |
| **Zone TELENGANA (13) Districts** | **(A) Relli (12 Castes)** | **(B) Madiga (18 Castes)** | **(C) Mala (25 Castes)** | **(D) Adi (4 castes)** |
| 5th Adilabad | 1,570 | 3,63,533 | 2,37,331 | 730 |
| Nizamabad | 939 | 2,26,079 | 1,49,865 | 373 |
| Krimnagar | 2,418 | 5,02,165 | 2,13,485 | 1,419 |
| Warangal | 891 | 4,98,693 | 1,11,739 | 2,760 |
| Kammam | 1,651 | 3,24,346 | 1,52,319 | 991 |
| **Total** | **7,469** | **19,14,816** | **8,64,739** | **6,273** |
| 6th Nalgonda | 982 | 4,92,894 | 1,24,079 | 430 |
| Hyderabad | 4,510 | 2,58,724 | 1,26,541 | 1,637 |
| Medak | 348 | 3,43,846 | 1,58,258 | 878 |
| Ranga Reddy | 650 | 4,32,920 | 1,39,003 | 1,304 |
| Mahaboobnagar | 749 | 6,02,275 | 1,06,852 | 305 |

| | | | | |
|---|---|---|---|---|
| **Total** | **7,239** | **21,30,659** | **6,54,733** | **4,554** |

**(2001 జనాభా లెక్కల ప్రకారం ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలలోని జోనల్ వారిగా ఎస్సీ జనాభా వివరాలు)**

గత ప్రభుత్వాలు ఎస్సీ రిజర్వేషన్లు జోన్ల వారీగా వర్గీకరణ జరపకుండా ఉమ్మడి పద్ధతిలో వర్గీకరణ చేశాయి. దీని వల్ల తెలంగాణలోని 5,6 జోన్లలో మాదిగలకు అన్యాయం జరిగింది. అదే విధంగా 1,2,3 జోన్లలో మాలలకు అన్యాయం జరిగింది. కనుక ఈ తప్పుడు పద్దతిలో వర్గీకరణ జరగడం వల్ల అటు మాలలకు , మాదిగలకు మొత్తం మీద దళితులకు అన్యాయం జరిగింది. కనుక జోన్లవారీగా ఎస్సీ వర్గీకరణ జరగాలనీ ఒక వాదన వచ్చింది ''(**సతీష్ మాదిగ దేవని**, **తెలంగాణ మాదిగ దండోరా రాష్ట్ర అధ్యక్షులు**, **ఆంధ్రజ్యోతి దినపత్రిక**, **14-12-2010**).

ఈయన అభిప్రాయం ప్రకారం జనభా దామాషి ప్రకారం మాత్రమే కాకుండా ప్రాంతాల వారీగా రిజర్వేషన్లు వర్గీకరిస్తే దళిత ఉపకులాకన్నింటికి మేలు చేకూరుతుందని తెలిపారు. అందుకు తగిన జనాభా ఏయే ప్రాంతాల్లో ఏయే ఉపకులాల వారు ఎంత మంది ఉన్నారో వారిని విభజించి జిల్లాల వారీగా, ప్రాంతాల వారీగా సూచించటం జరిగింది. ఇంతవరకు వచ్చిన ఎన్నో వర్గీకరణ పరిష్కారాల కంటే ఇది ఉత్తమైనదిగా చెప్పుకోవచ్చు.

అయితే వర్గీకరణ ప్రకారం ఎబిసిడి లు అని నాలుగు గ్రూపులు కాకుండా డి గ్రూపు లేకుండా ఎబిసి గ్రూపులు ఆధారంగా ఈ ప్రాంతాల వారి వర్గీకరణకు మాల మేధావులు సమ్మతంగా ఉన్నారు. అయితే దీనికి మాదిగ మేధావులు అంగీకరించటం లేదు. కనుక ప్రాంతాల వారీగా వర్గీకరన విభజించిన తర్వాత గ్రూపులు ఆధారంగా అంటే అయే గ్రూపుల్లో ఎవరి జనాభా శాతం ఎంత ఉందో ఏయే గ్రూపులు ఉండాలో అనే విషయం పట్ల మాల, మాదిగ మేధావులకు స్పష్టమైన నిర్ణయం వస్తే ఈ వర్గీకరణ సమస్య పరిష్కారం అయినట్లే.

**3.7.దళిత సాహిత్యం - వర్గీకరణ దృక్పథం :**

సాంఘీక జీవనంలో ప్రజలు హక్కుల కోసం, సమాన వాటాల కోసం ఉద్యమిస్తారో అదే ఉద్యమ స్ఫూర్తి సాహిత్యంలోనూ చోటు చేసుకుంటుంది. అందులో భాగంగానే ఎస్సీల రిజర్వేషన్లు వర్గీకరించాలని డిమాండు తెరపైకి వచ్చిందో అనాటి నుండే దళిత సాహిత్యం రెండు భాగాలు విడిపోయి, రెండు విధాలుగా వచ్చింది. ఈ దళిత ఉద్యమంలో ఏర్పడిన అంతర్యుద్ధాల పరిణామమే ఈ వర్గీకరణ, ఏకీకరణ ఉద్యమాలు. వర్గీకరణ మాదిగలకు ప్రాతినిధ్యం వహిస్తే, ఏకీకరణ మాలలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ ఉద్యమం రావటానికి, వచ్చి ఇన్ని పరిణామాలకు దారితీయటానికి కారణం అగ్రవర్ణాల విభజించు పాలించు సూత్రమే అని చెప్పాలి. డా.బి.ఆర్.అంబేద్కర్ ఆశయ సాధనలో ఏర్పడిన దళిత ఉద్యమం ఏర్పడిన అనతి కాలంలోనే విభజనకు గురైంది., గురైంది అనే కంటే గురిచేసారు అంటే సమంజసంగా ఉంటుంది. ఎందుకంటే వీళ్ళ విభజనకు కూడా అగ్రవర్ణాల పాలక కుట్రే అని చెప్పుకోవాలి.

పైన చూపిన రాజకీయ, సామాజిక విశ్లేషణ ఆధారంగా చూస్తే ఆంధ్రప్రదేశ్ లో దళిత ఉపకులాల్లో మిగతావి అరకొర ఉన్న మాల, మాదిగ కులాలే అధిక శాతం ఉన్నాయనటంలో ఎలాంటి అభ్యంతరం లేదు. ఈ దళిత ఉపకులాల్లోనే రిజర్వేషన్ల పంపిణి గురించి మాలలు రిజర్వేషన్ విధానాన్ని సమైక్యంగా ఉంచాలని, మాదిగలు రిజర్వేషన్లు విభజిస్తే అంబేద్కర్ ఆలోచనా విధానాలు సజావుగా సాగుతాయి వీరి వాదన. ఈ అంశాల గురించి మొదలైన చర్చోపచర్చలు మొదట రాజకీయంగా మొదలై తర్వాత అన్ని రంగాల్లో వీటి చర్చ కొనసాగింది. ఇది అంతవరకే పరిమితం కాకుండా సాహిత్యంలో కూడా ఇది అనివార్యమైంది. ఎందుకంటే సామాజికాంశాల ప్రతిబింబమే సాహిత్యం కనుక. ఇన్నాళ్ళు దళతులుగా, దళిత రచయితలుగా చెలామణి అయిన రచయితలు కుల అస్తిత్వ ఆరాధన ప్రారంభించారు. ఎవరి వాటా గురించి వారు రాసుకోవటం,

ఎవరి ఉపకులాన్ని వారు చైతన్యపరిచే దిశగా సాహిత్యం నూతన పథంలో నడవటం మొదలు పెట్టింది.

సాధారణంగా ఒకరి అస్తిత్వం నిలబడాలంటే ఎవరైతే తమ అస్తిత్వాన్ని దోపిడి చేసి వారి అస్తిత్వాన్ని వీరి అస్తిత్వంగా చరిత్రలో అబద్దపు అక్షరాలతో ముద్రించుకుంటారో ఆ చరిత్ర, సంస్కృతుల మీద దాడి చేసి నిజమైన మూలాలను వెలికి తీసి వారి చరిత్రను పునర్మూల్యాంకనం చేయగలిగి  ఆయా అంశాల గురించి శాస్త్రీయబద్ధంగా చర్చించినప్పుడే అది సార్ధకతను పొందుతుంది. అస్తిత్వం నిలబడకపోయిన కనీసం నశించిపోకుండా కాపాడుకున్న వాళ్ళు అవుతారు. ఈ కర్తవ్యాన్ని నెరవేర్చాల్సిన భాధ్యత సమాజంలో రచయితలకు మాత్రమే ఉంది.

వర్గీకరణ ఉద్యమం, సాహిత్యం ఏర్పడిన తర్వాత అది ప్రారంభమైన తీరు, అది ఏర్పడిన లక్ష్యం చాలా వరకు ఒక విడత వెలువడిన తర్వాత వర్గీకరణ ఉద్యమంలో ఉన్న లోటుపాటులను సాహిత్యం ద్వారా వెలిబుచ్చారు. ఇందులో కొంతమంది వర్గీకరణ ఉద్యమాన్ని సమర్ధిస్తే, మరికొందరు వర్గీకరణ ఉద్యమాన్ని వ్యతిరేకించారు. ఇంకొందరైతే వర్గీకరణ ఉద్యమం నడిచే తీరు, నడిపించే నాయకత్వం పట్ల అభ్యంతరాలను వ్యక్తపరచారు. తద్వారా వారిలో ఉండే అభిప్రాయాలను సాహిత్య రచనల ద్వారా ప్రత్యేక అస్తిత్వాల ప్రాధాన్యాన్నితెలియజేసారు.

సాధారణంగా ఏ ఉద్యమానికైనా సాహిత్య ప్రోత్సాహంలేనిదే అది పరిపక్వత చెందదు. తెలుగులో ఉద్యమ సాహిత్యం చూసినట్లయితే అది ప్రారంభమైనది మొదలు జాతీయ, భావ, అభ్యుదయ, దిగంబర, విప్లవ, దళిత, స్త్రీ, మైనార్టీ, ప్రాంతీయ ఉద్యమాలలో సాహిత్యమే ప్రధాన పాత్ర పోషించిందని చెప్పవచ్చు. ఇక అస్తిత్వ ఉద్యమాల్లో అయితే సాహిత్య రచనల్లో కీలకాంశాలే ఉద్యమ ఎజెండాగా మారిపోయాయి అంటే అతిశయోక్తి కాదేమో! ఈ కోణం

నుండే దళిత సాహిత్యంలో అంతర్భాగంగా మొదలైన దండోరా సాహిత్యం/మాదిగ సాహిత్యం/వర్గీకరణ సాహిత్యం మాదిగ రిజర్వేషన్ పోరాటసమితికి అండగా నిలిచింది. అంతేకాకుండా నిన్నటి వరకు దళితులుగా పిలవబడిన మాదిగలంతా ఇప్పుడు వారి శోకాన్ని శ్లోకంగా మార్చుకొని దళితులుగా సమాజంలో మాకు స్థానం కల్పించిన మేం మాత్రం మాదిగలుగా మా అస్తిత్వం మాకు కావాలి, మా ఉనికి, మా ఆకలి వేరు అని సగర్వంగా ప్రకటించుకొని మాదిగ జీవితాలను, జీవన విధానాలను సాహిత్యంలో ప్రతిబింబింప చేసే ప్రయత్నాలు చేసారు. ఇలా చేసిన ప్రయత్నంలో మొదటగా కవిత్వం, తర్వాత కథలు, నవలలు అంటూ దాదాపు అన్ని ప్రక్రియల ద్వారా తమ ఆత్మగౌరవ స్థానాన్ని చాటి ఈ రోజు *దళితసాహిత్యంలో అంతర్భాగం మాదిగ సాహిత్యం కాదు మాదిగసాహిత్యంలో అంతర్భాగమే దళితసాహిత్యం* అనే భావనను సాహిత్య రచనల ద్వారా బలంగా వినిపిస్తున్నారు. ఆ వాదాన్ని బలపరిచేందుకు సాహిత్య రచనల, విమర్శ గ్రంథాల, పుస్తక సమీక్షల, సమావేశాల ద్వారా రోజు ఒక కొత్త చర్చను లేపుతూ ప్రజల్లో నూతన ఉత్తేజాన్ని నింపుతున్నారు.

సాహిత్యంలో ఒక రచన వచ్చినప్పుడు దాన్ని మంచి చెడ్డలు విచారించటం అనవాయితీ. సాహిత్యంలో వస్తువును ఆశ్రయించి, లేదా అయా కాలాన్ని ఆశ్రయించి విమర్శ జరగవచ్చు. ఇలా విమర్శ జరిగితే దాన్ని సద్విమర్శ అంటారు. అలా కాకుండా వ్యక్తిని, వ్యక్తి ప్రావిణ్యాన్ని కించపరిచేలా జరిగితే అది దుర్విమర్శ అవుతుంది. ఇలాంటి సద్విమర్శ, దుర్విమర్శ దళిత సాహిత్యంలోనూ జరిగింది. అది ఏకీకరణ కావాలని కొందరు, వర్గీకకరణ కావాలని ఒక వర్గం వారు సాహిత్యంలో వస్తున్న రచనలను ప్రక్రియల అనుగుణంగా విమర్శనాత్మకంగా విశ్లేషించటం జరిగింది. ముందుగా వర్గీకరణ ఉద్యమ సాహిత్య విమర్శను పరిశీలిద్దాం.

సమాన పంపిణియే సామాజిక న్యాయం అనే సిద్ధాంతంతో ఏర్పాటు అయిన మాదిగ రిజర్వేషన్ ఉద్యమం మొదట ఉద్యమానికే పరిమితమైన కాలక్రమంలో సాహిత్యంలోనూ తన ఉనికి చాటుకోగలిగింది. మొదట కవిత్వ రూపంలో వచ్చిన కాలక్రమంలో సాహిత్య ప్రక్రియలన్నింటిలో వస్తూ దళిత సాహిత్యానికే సవాలుగా మారిపోయింది. మిగతా ఏకీకరణ వర్గీయులు అరా కొరా సాహిత్య రచన చేస్తున్న అది మునుపటంతా ఉధృతాన్ని ఉద్యమించలేకపోయింది. వర్గీకరణ వర్గీయులు మాత్రం చాలా స్పష్టంగా గీత గీసుకొని మాదిగల చారిత్రక నేపథ్యాన్ని, మాదిగల అస్తిత్వాన్ని సాహిత్యంలో చాటుకొంటున్నారు.

ఇది ఇలా ఉంటే అటు ఏకీకరణ వైపు కాకుండా, ఇటు వర్గీకరణ వైపు కాకుండా ఉన్న దళిత రచయిత, మేధావులు మాత్రం బహుజన ముసుగులో కాలం వెల్లబుచ్చుతున్నారు. కొద్దో గొప్పో చైతన్యం ఉన్న దళిత కులాలు రెండు శిబిరాలుగా విడిపోయి నువ్వా, నేనా అన్నట్లు అవి పోటీ పడుతుంటే, ఇప్పుడిప్పుడే చైతన్యపడుతున్న కులాలైన బిసిలు, ఇంకా ప్రధాన జీవన స్రవంతిలోకి రాని గిరిజన కులాలను కలిపి బహుజన వాదంగా బలపర్చాలనడం మంచిదే కానీ, అంతకంటే ముందు ఇంటి సమస్యను పరిష్కరించే క్రమంలో మేధావులు, రచయితలు మాట మెదపకుండా బహుజన సూత్రాన్ని జపించడం కొంత ఆలోచించదగ్గ విషయమే. అంతేగాకుండా దండోరా ఉద్యమ పుణ్యమా అని అన్ని వెనుకబడిన కులాల్లో ఉపకులాల పోరు జరుగుతుంటే వీరందరిని ఏకతాటి పైకి తెస్తే బహుజన వాదం బలపడుతుందను కోవటం , రేపో మాపో రాజ్యాధికారం వస్తుందని కలలు కనడం ఎంత వరకు సబబో మేధావులు ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలి. నిజం మాట్లాడుకుంటే వీరు ఏ వాదాన్ని బలపరిస్తే ఏ వాదం వారు దూరమవుతారో అనే అయోమయస్థితిలో ఉంటూ వెనుకటి సాహిత్యాన్ని నెమరువేస్తూ సమావేశాలు, సదస్సులు జరుపుకుంటూ కాలాయాపన చేస్తున్నారు.

ఇదే విషయాన్ని తెలియజేస్తూ దళిత సాహిత్య ఆరంభ స్థితిని, వర్గీకరణ ఉద్యమం ముందు, వర్గీకరణ ఉద్యమం తర్వాత మాల, మాదిగ రచయితల సాహిత్య స్థితిని డా.కేశవ్ కుమార్ దళిత ఉద్యమం వెలుగు నీడలు పుస్తకంలో ఇలా తెలియజేశాడు. *"తెలుగు సాహిత్యాన్ని సంక్షోభంలో పడేసిన దళితసాహిత్యం తనే సంక్షోభంలో కూరుకుపోయింది. దళిత కవులకి మాలకవులని, మాదిగకవులని కొత్త లేబుల్స్ వచ్చినవి. మాల కులానికి చెందిన దళిత కవులు ఒక సామూహిక స్వప్నం ఎజెండా తొలగిపోయాక ఒక అక్షరం కూడా రాయలేక పోయారు. మాదిగ కులానికి చెందిన దళిత కవులు మాదిగ కవులుగా కాస్తంత గౌరవం తెచ్చుకున్న ఒక అడుగు కవిత్వంలో ముందేసినా ఆ తర్వాత ఆగిపోవాల్సి వచ్చింది"* **(డా.పి.కేశవ కుమార్.దళిత ఉద్యమం వెలుగు నీడలు పుట:48,సంపాదకుడు:జూలూరు గౌరీశంకర్),2009;స్పృహ సాహితీ సంస్థ, హైదరాబాదు).**

కేశవ్ కుమార్ అన్నట్లు అస్తిత్వాన్ని అందించిన అస్తిత్వ ఉద్యమం అస్తిత్వాన్ని వెతుక్కునే స్థాయికి వెళ్ళిందంటే దానికి కారణం రిజర్వేషన్ల వినియోగంలోఉన్న వ్యత్యాసమే. వర్గీకరణ ఉద్యమం మొదలైన నాటి నుండి దళిత సాహిత్యం కొంత వెనుకబడిందనే చెప్పుకోవాలి. వర్గీకరణ ఉద్యమం నేపథ్యంలో కొంత దండోరా సాహిత్యం వచ్చిన ఆ తర్వాత ఒక స్తబ్దతకు వెళ్ళింది. దీనికి కారణం ఎలాగైతే మాల, మాదిగల మధ్య విభాధాలొచ్చాయో అదే మాదిగల మధ్య ప్రాంతాల వారి వైషమ్యాలు వచ్చాయి. మాలల్లో విభేధాలు వచ్చినా, మాదిగల్లో విభేధాలు వచ్చిన ఇవన్నీ కూడా అగ్రవర్ణాల వారికి ఆసరగా మారి వారి రాజకీయ చదరంగానికి దళితులను ఉపయోగింవుకోవటాని తప్ప ఎలాంటి దళిత అభివృద్ధి ఉండదు. దళిత ఉద్యమం ప్రారంభమైన తొలి, మలి నాళ్ళలో వచ్చిన చైతన్యం, సాహిత్యం, దళిత ప్రజల అభివృద్ధి ఈ రోజు లేదు కారణం దళితుల మధ్య విభేధాలు మాత్రమే అని చెప్పుకోవచ్చు.

మనం ముందే చెప్పుకున్నట్లు వర్గీకరణ ఉద్యమం మొదలైన ప్రారంభంలో కొంత చైతన్యంతో దండోరా సాహిత్యం వచ్చిన కాలక్రమంలో అంత వాడి, వేడిని చూపలేకపోయింది. కాని మాదిగలు మాత్రం చాలా స్పష్టంగా గీత గీసుకొని అప్పటి నుండి ఈనాటి వరకు సాహిత్య రచన చేస్తున్నారు. దండోరా ఉద్యమం మొదలైనప్పటి నుండి వచ్చిన సాహిత్యాన్ని పరిచయం చేస్తూ, సాహిత్య విమర్శను, ప్రముఖుల అభిప్రాయాలను విమర్శనాత్మకంగా పరిశీలిద్దాం.

**3.8. తెలుగు సాహిత్యం మాదిగల ప్రస్తావన :**

తెలుగు సాహిత్య అధ్యయనానికి దాదాపు పదిహేను వందల సంవత్సరాల చరిత్ర ఉంది. సాహిత్యం ప్రారంభమైన దశలో హితం ముసుగులో హైందవ సంస్కృతిని, వర్ణాశ్రమ ధర్మాలను,అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని కాపాడే దిశగా ప్రాచీన సాహిత్యం వచ్చింది. రామాయణం, మహాభారతం, భాగవతం, మనుధర్మం తదితర గ్రంథాలను ఇప్పటి తెలుగువారి సంప్రదాయ సంపదగా భావిస్తూ,వాటిలో పేర్కొనబడిన అంశాలు పరమ పవిత్రంగా భావిస్తూ, అందులో తెలుపబడిన వర్ణ ధర్మాలను ఈనాటికి కూడా తూచా తప్పకుండా పాటిస్తున్నారు. ఇలా ఆయా గ్రంథాల్లో తెలుపబడిన ధర్మాలలో వర్ణధర్మం ఒకటి. వారిలో అందరి కంటే కిందివర్గం శూద్రులు. వారిలో ప్రధానంగా షెడ్యూల్డ్ కులాలు ఉన్నాయి. ఈ షెడ్యూల్డ్ కులాల్లో ఉన్న 61 కులాల్లో ఒకానొక ఉపకులం మాదిగ కులం. వీరిని హిందూ సమాజంలో ఉమ్మడి పేరుతో అధికారికంగా అస్పృశ్యులు, చండాలురు, పంచములు, హరిజనులు, దళితులు మొదలైన పేర్లతో పిలుస్తున్నారు. కానీ సమాజంలో ఉన్న దళిత కులాల్లో ఒక్కో కులాన్ని వింగడించి పరిశీలిస్తే ప్రతి కులానికి కొన్ని మౌలికమైన లక్షణాలు ఉంటాయి. అలాగే  మాదిగలకు కూడా కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి.

**3.8.1. మాదిగలు ప్రధాన లక్షణాలు :**

దళిత కులాల్లో ఉమ్మడిగా అన్ని కులాల వారికి కొన్ని ఉమ్మడి లక్షణాలను మనుధర్మశాస్త్రము ఆపాదించింది. కానీ సూక్ష్మంగా పరిశీలిస్తే వారి పూర్వీకుల నుండి వృత్తుల ఆధారంగా, వారి ఆహారపు అలవాట్ల ఆధారంగా, వారి జీవన విధానం ఆధారంగా కొన్ని మౌలికమైన లక్షణాలు వారసత్వంగా ప్రతి ఉపకులానికి వచ్చే ఉంటాయి. వాటినే కొంత మంది ఇప్పటికి కులవృత్తులుగా భావిస్తున్నారు. కాకపోతే ఇక్కడ అధ్యయన సౌలభ్యం కోసం ఆ కుల లక్షణాలుగా చెప్పుకుంటున్నాం. అలాగే దళిత కులాల్లో ఒక ఉప కులమైన మాదిగ కులానికి కొన్ని లక్షణాలు ఉన్నాయి...అవి,

1. పశువులను కోయటం
2. పశువుల మాంసం తినటం
3. చర్మవృత్తులు చేయటం
4. డప్పులు తయారుచేయటం
5. చెప్పులు కుట్టుట

కాకపోతే పైన చెప్పిన లక్షణాలన్నీ ఈనాటి మాదిగలో చాలా వరకు కనిపించుట లేదు. ఎందుకంటే ప్రపంచీకరణ ప్రభావం విద్య,ఉద్యోగ,ఉపాధి అవకాశాలు అందరితో పాటు మాదిగలకు అందటం తద్వారా వారి ప్రధాన జీవన స్రవంతిలోకి రావటం మొదలైన అంశాలు ఒక ఎత్తు అయితే, పెద్ద పెద్ద కంపెనీలు చెప్పులు యంత్రాల ద్వారా తయారు చేయటం, గొడ్డుమాంసం మార్కెట్లో దొరకటం మొదలైన అంశాల ఆధారంగా మాదిగలు పట్టణాల వైపు మొగ్గు చూపి కూలీ, నాలీ చేసుకొని బ్రతుకుతున్నారు. ఎక్కడో మారు మూల గ్రామాల్లో తప్ప కొద్దో గొప్పో పట్టణాల్లో, ప్రధాన నగరాల్లో ఈ పరిస్థితి లేదు. ఈ పరిస్థితి లేకపోయిన మాదిగలు మాత్రం ఆ మూలాలు మరచిపోకుండా ఆ కులవృత్తుల ఆయుధాలే కవితా వస్తువులుగా, ఆదే సంస్కృతిని కథా వస్తువులుగా స్వీకరిస్తూ,

సాహిత్యంలో ప్రత్యామ్నాయ నడవడికను రచయితలకు చూపిన ఘనత మాదిగ రచయితలకే చెందుతుంది. ఇది ఇంతటితో ఆగి పోకుండా మిగతా ఉపకులాలకు కూడా ప్రేరణగా నిలిచిందనటంలో సందేహం లేదు.

ప్రాచీన సాహిత్యంలో శివకవుల్లో పాల్కురికి సోమనాథుడు మాదిగ భక్తుడు బోగయ్య గారి కథను రాశారు. మంగిపూడి వేంకట శర్మ నిరుద్ధ భారతం పద్యకావ్యంలో మాతంగ వంశం వాళ్ళే మాదిగలని చెప్పారు.

1931 లో సాగర సంగం, ఇలాంటి తవ్వాయి వస్తే (1934) వంటి కథలల్లో దళితుల అనైక్యతనూ, దళితుల మతాంతీకరణ గురించి ప్రస్తావించారు. చలం రాసిన మాదిగ అమ్మాయి, హరిజన సమస్య మొదలైనవి.

మాదిగల మూలాలను పరిశీలిస్తూ బోయి భీమన్న గారి రాగ వాశిష్ఠం (1959) తొలి తెలుగు పౌరాణిక నాటకంగా చెప్పవచ్చు. మాదిగల ఆడపడుచు అరుంధతీదేవి ఇతివృత్తాన్ని ఆధారం చేసుకొని అరుంధతీదేవి, వశిష్టుల ప్రేమ కథ ఇతివృత్తంగా నములకంటి జగన్నాథం అరుంధతీదేవీ చరిత్రము(1968) పేరుతో రాశారు.

1969 నుండి 1980 మధ్యలో మాల మాదిగ మధ్య సమిష్టి పోరాట స్థాయి లేదు. ఆ పోరాటాలు ముందుగా దళితుల్లో ఏర్పడాలని ఉద్బోధిస్తూ కథలు రాశారు. అప్పటికే నక్సల్బరీ – శ్రీకాకుళ పోరాటాలు వచ్చిన రచయితలు వాటిని పట్టించుకోలేదు అని కూడా నిఖిలేశ్వర్ వ్యాఖ్యానించారు.

మాదిగలకు జరుగుతున్న వివక్షను ప్రశ్నిస్తూ మొట్ట మొదటిసారిగా ఎండ్లూరి సుధాకర్ దండోరా అనే కవితను రాశారు. ఆ తర్వాత 1996 లో నాగప్పగారి సుందర్రాజు చండాల చాటింపు కవితా సంపుటిని ప్రచురించారు. 1997 పేరుతో మాదిగ చైతన్యం పేరుతో మాదిగలే సాహిత్యాన్నిసృష్టించుకొని మాదిగసాహిత్య వేదిక ఏర్పాటు చేసుకున్నారు.

ఎండ్లూరి సుధాకర్ మల్లె మొగ్గల గొడుగు మాదిగ కథలు (1997) లో

నాగప్పగారి సుందర్రాజు(1968-2000) మాదిగోడు కథల (1997)లో మాదిగ జీవితాల్లోని అనేక కోణాలు వర్ణితమయ్యాయి. "మేమిట్లుండం" కథలు సంపుటిలో గుండెడప్పు కనకయ్య, కొలకలూరి ఇనాక్ "పొట్ట పేగులిబ్బందిగోడు" కథలో మాదిగ సంస్కృతిని కళ్ళకు కట్టినట్లు వర్ణించారు. "గొడ్ల దొంగ" కథలో మాదిగల పై జరిపిన అగ్రవర్ణ భూస్వాముల దురాగతాలను వర్ణించారు.

డా.బి.వి.ఎస్.మూర్తి గారు "దళిత కథామంజరి(1992)" పేరుతో రాశారు. దీనిలో అరుంధతీదేవీ చరిత్రతో పాటు మాతంగి కులానికి చెందిన శ్రీ లక్ష్మమ్మ అనే భక్తురాలి కథ కూడా ఉంది.(1992:111:118) బొనిగల రామారావు గారు మాల మాదిగల ప్రాచీన చరిత్ర(1997)లో రాశారు. డా.యస్.టి.జ్ఞానానందకవి షెడ్యూల్డ్ కులాలు అంటరానివా(1997)లో రాశారు. అరుంధతీయుల చరిత్ర(1998) పేరుతో అల్వాల మల్లేష్ ఒక పుస్తకాన్ని రాశారు. దీనిలో అంతకు ముందు వచ్చిన పుస్తకాలలో ఉన్నవిషయాలను సమీక్షిస్తూ వివరించారు. తాళ్ళూరి లాబన్ బాబు మాదిగవారి చరిత్ర(2001)ను కొత్త కోణంలో రాశారు. మాదిగలే జాంబవులు, వారు పూర్వం భారతదేశాన్ని పరిపాలించిన క్షత్రియ వంశస్థులు, మాదిగల దేశమే జంబూద్వీపం అని అన్నారు. జాంబవంతుడు అనేది వ్యక్తి నామం కాదనీ, అది మాదిగ జాతి నిరూపించటానికి పురాణాలను ఆధారాలుగా చూపారు. కంచె ఐలయ్యగారు ఏకలవ్య మాసపత్రికలో అర్ధిక కోణంతో మాదిగ పురాణ అంశాలను వివరించారు. వాటిని తర్వాత 1996 లో మాదిగ ఆర్థిక సాంఘీకతత్వం అనే పేరుతో చిన్న పుస్తకంగా ప్రచురించారు. తాళ్ళూరి లాబన్ బాబు గారు మాదిగచరిత్రను అత్యధిక శాతం చరిత్ర, పురాణాలు, ఆంత్రోపాలజీ లను ఆధారం చేసుకొని రాశారు. బొనిగల రామారావు ఆది గురువు ఆచార్య చండాల(2005) పేరుతో చండాలునితో ఆది శంకరాచార్యులను పోల్చారు. డా.ఎండ్లూరి సుధాకర్ మల్లెమొగ్గల గొడుగు మాదిగ కథలు (1999) లో పురాణాల్లో మాదిగ

జీవితాలకు సంబంధించిన రెండు కథలు ఉన్నాయి.ఆధునిక సాహిత్యంలో డా.ఎండ్లూరి సుధాకర్ గారి వర్గీకరణీయం(2003), కొత్తగబ్బిలం(1998), నల్లద్రాక్షపందిరి(2002), మాదిగసాహిత్య వేదిక ప్రచురించిన మాదిగ చైతన్యం(1997),*దార్ల వెంకటేశ్వరరావు. ఒక మాదిగ స్మృతి(నాగప్పగారి సుందర్రాజుపరిచయం)2007,* దళితసాహిత్యం మాదిగ దృక్పథం(2008), ఆచార్య.ముత్తయ్య. *ఎస్సీలలో వర్గీకరణ ఎందుకు?*, డా.పి.కేశవ కుమార్ *దళిత ఉద్యమం వెలుగు నీడలు*(2009), గుండెడప్పు కనకయ్య *దండోరా దరువు* (2005),రావినూతలప్రేమకిషోర్ *గుండెదరువు* (2005), డా.కె.లక్ష్మీనారాయణ అస్పృశ్య కథలు(1999) ఇలా ఎంతో మంది రచయితలు మాదిగ జీవన విధానం గురించి ఆయా సాహిత్య గ్రంథాలలో తెలియజెప్పే ప్రయత్నం చేశారు.

పైన చూపిన సాహిత్య రచనల ఆధారంగా ప్రత్యేకించి ప్రాచీన సాహిత్యంలో సందర్భాను సారంగా కొన్ని పాత్రలు రచన సార్ధకత కోసం పెట్టారని స్పష్టమవుతుంది. అయితే 1980 తర్వాత ఆధునిక సాహిత్యం మొదలైన తర్వాత కొంత స్పష్టమైన ఛాయలు మాదిగ సాహిత్యానికి ఏర్పడ్డాయి. దీనికి కారణం అప్పుడే గ్రామాల్లో వీధి బడుల నుండి, మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుండి, జిల్లాలోని డిగ్రీకాలేజీల నుండి మాదిగ విద్యార్థులు ఉన్నత విద్యలకై నగరాల్లో విశ్వవిద్యాలయాల్లోకి ప్రవేశించి తమ చరిత్రను తవ్వటం మొదలు పెట్టారు. ఇదే సమయంలో వర్గీకరణ ఉద్యమం మొదలై విద్యావంతులకు మరింత పరిశోధన అవకాశం కల్పించింది. అప్పట్లో మొదలైన సాహిత్య శోధన ఇప్పటికీ జరుగుతూనే ఉంది. అప్పుడప్పుడే సాహిత్యంలో డప్పులు శబ్దం శ్రావ్యంగా మోగుతూ ఉంది. ఈ నేపథ్యంలో ఎంతో మంది యువకులు రచయితలుగా ఎదిగారు.

ఈ క్రమంలోనే వర్గీకరణ ముందు తర్వాత ఉన్న మేధావులు తమ జాతి మూలాల గురించి వివిధ పుస్తకాల్లో వారి అభిప్రాయాలను తెలియజెప్పారు.

ఇలాంటి అభిప్రాయాలను కూడా సాహిత్య విమర్శగా తీసుకోవాలి. ఎందుకంటే ఒక ఉద్యమం లేదా సాహిత్యం క్షుణ్ణంగా అధ్యయనం చేశాక ఎవరైనా తమ అభిప్రాయం చెబుతారు. అది మంచి కావచ్చు లేదా చెడు కావచ్చు. ఇలా సాహిత్యంలో మంచి చెడ్డలను విచారించటం విమర్శగా భావించాలి.

**3.9.దండోరా ఉద్యమ, సాహిత్యం - ప్రముఖుల అభిప్రాయాలు :**

*"మాదిగలు ఈ దేశ సంస్కృతిని వెలిగించిన జ్యోతులు, వెలుగిచ్చిన జ్యోతులకు ఏమీ మిగలలేదు. కరిగిపోవటం, తరిగిపోవటం, కాలిపోవటం, అంతరించటం, అదృశ్యమవటం. అవతారం చాలించటం తప్ప వర్గీకరణ చట్టబద్ధం చేయటం, సుప్రీంకోర్టుల్ని శాసించండి. ఈ వెలుగుల ప్రస్థానంలో జీవితాలు చదువుకోండి"* అని ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు అభిప్రాయపడ్డారు. **(కనకయ్య, గుండెడప్పు.దండోరా దరువు;2005, పుట :1)**

"సమాజం నుండి విడిగా సాహిత్యాన్ని చూడలేకపోయినా, సమాజంలో అన్ని సమస్యలను కొన్ని సందర్భాలలో సాహిత్యం పట్టించుకోవచ్చు. అలా విస్మరణకు గురైన వారి నుండి కూడా సాహిత్యం వస్తుంది. ఆ సాహిత్యం అస్తిత్వ ఉద్యమాల్లో భాగమైంది. ఆత్మగౌరవ ప్రతిఫలనమైంది. అది అంతటితో ఆగకుండా ఒక ప్రత్యేక ధోరణిగా, వాదంగా, ఉద్యమంగా నిలదొక్కుకొని స్వీయ అస్తిత్వంతో ముందుకు వెళుతుంది. అలా ముందుకు వెళ్తున్న సమాకాలీన సాహిత్యంలో ఒక ప్రధాన ఉద్యమం మాదిగ సాహిత్యం ఉద్యమం. **(వెంకటేశ్వరావు, దార్ల. దళిత సాహిత్యం మాదిగ దృక్పథం- పుట:7; సొసైటీ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు. హైదరాబాదు,2008)**

*"మా కవిత్వం వింటే మీ తత్వం దిమ్మ దిరుగుతుంది. మా కవిత్వం ప్రాణం పాటలో ఉంది, పల్లెలో ఉంది. పల్లె జనపదంలో ఉంది. జానపద సాహిత్యంలో ఉంది. కృతక సాహిత్యం మా సాహిత్యం ముందు కుళ్ళి కంపు కొడుతుంది. చిన్నయసూరి వ్యాకరణం మా భాష దగ్గర సిగ్గుతో తలెత్తుకోలేక పోతుంది.*

*అలంకారశాస్త్రం మా నాయకుల్ని నాయికల్ని చూచి బిత్తర పోతుంది. ఈ సాహిత్యం చూచి సౌందర్య శాస్త్రం కొత్త సూత్రాలు వ్రాసుకొంటుంది. సామాన్యులకు తెలియని అద్భుత జీవిత సాహిత్యాన్ని మాదిగలు రుచి చూపిస్తున్నారు"* అని డా.దార్ల వెంకటేశ్వరరావు గారు అభిప్రాయపడ్డారు. **(డా.దార్ల వెంకటేశ్వరరావు, ఒక మాదిగ స్మృతి(నాగప్పగారి సుందర్రాజు పరిచయం), పుట : 15, 16, తెలుగు సాహిత్య వేదిక; 2007).**

*"1. ఎస్సీల ఉమ్మడి రిజర్వేషన్లలో మాదిగలకు అన్యాయం*

*2. ఎబిసిడి లు అమలు రద్దు*

*3. సమైక్యత పేరుతో మాదిగల అణచివేత జరిగిందంటూ కోటి గొంతులు తమ గడ్డమీద ఎప్పుడూ మూగపోవుకదా! అన్యాయం జరుగుతున్నప్పుడు, ఆహుతవుతున్నప్పుడు ఒకే గొంతు వినబడదనేది పచ్చి నిజం కదా"* అని ఆచార్య ననుమాస్వామి అభిప్రాయ పడ్డారు. **(కనకయ్య,గుండెడప్పు.దండోరా దరువు;2005, పుట :v,vi,vii,ix)**

*"ఎబిసిడి లు విభజిస్తే జాతి ముక్క చెక్కలవుతుందంటున్నారు కొందరు మాలలు. అది శుద్ధ మోసపూరిత నినాదం. ఇప్పుడు 59 ముక్కలున్నప్పుడు లేనిది ఎబిసిడిలుగా 4 ముక్కలైతే నష్టమేమిటో ? ఎబిసిడిలుగా కాదు ఎటుజడ్ గా విడగొట్టినా నూటికి 99 మందికి ఎలాంటి ప్రమాదం ఉండదు. వారిపై ఎలాంటి ప్రభావం ప్రసరించదు".* అని జాంబవశాస్త్రి అభిప్రాయపడ్డారు.**(కనకయ్య, గుండెడప్పు.దండోరా దరువు;2005, పుట : xiii)**

*"నాలుగు మెతుకుల్ని సమానంగా పంచడానికి వ్యతిరేకించేవాళ్ళు దళితులు కారు. సాటి దళితుల్ని వాళ్ళ సమస్యల్ని, సంఘర్షణల్ని మనుషులుగా గుర్తించని వాళ్ళు మనువాదులే అవుతారు కానీ మానవతావాదులు కారు, మానవత్వం దళిత ప్రతిరూపం"* అని ఆచార్య.ఎండ్లూరి సుధాకర్ గారి అభిప్రాయం.**(కనకయ్య, గుండెడప్పు. దండోరా దరువు;2005, పుట: xiv)**

*"సమైక్యత గురించి మాట్లాడుకొనేటప్పుడు భిన్న జాతుల వస్తు ప్రదర్శనశాలగా పిలవబడుతున్న భారతదేశంలో కులాలు, మతాలు, ప్రాంతాలు, భిన్న సంస్కృతులు ఉన్న అవసరమైనప్పుడు సమైక్యంగానే భారతీయులు సమాధానం చెప్తున్నారు. అలాగే బిసి లు వెనుకబడిన తరగతులు వివిధ గ్రూపులుగా విభజన జరిగి తమకు రావాల్సిన రాయితీలను పొందుతున్నారు. వీరిలో సమైక్యతకు నష్టం వాటిల్లిందా ? అలాగే ఎస్సీ లు కూడా ! విభజన జరిగినంత మాత్రాన సమైక్యతకు నష్టం జరగదు. వర్గీకరణ కోసం ఉద్యమాలు జరిగినా, అవి సాధించుకున్న తర్వాత, సామాజిక ఉద్యమాలు కలిసే చేయాలనేది ఆ ఉద్యమనేతనే కార్యరూపం కూడా సూచించారు. ఉత్తర భారతదేశంలో కూడా ఎస్సీలో ఒక వర్గమే అన్నింటిని అనుభవిస్తుందని, అలాగే దక్షణ భారతదేశంలో కూడా ఒక వర్గమే ప్రధానంగా హక్కుల్ని పొందుతున్నాయనే వాదనలు ఉన్నాయి. అసలు రిజర్వేషన్లు అనేవి దీర్ఘకాలికంగా కాకుండా కొన్ని సామాజిక అసమానతలను తొలగిపోయేందుకు మాత్రమే పాటించవలసిన అవసరం ఉంది. ఎస్సీలలోనూ క్రిమిలేయర్ పెట్టాలి'*అని డా.దార్ల వెంకటేశ్వరరావు గారు అభిప్రాయపడ్డారు.(**వెంకటేశ్వరరావు, దార్ల. దళిత ఉద్యమానికి చైతన్య దీపిక,28-1 2005.http;//thats telugu.com**).

*"సమానత్వం లేనిదే సౌభ్రాతృత్వం లేదు, సౌభ్రాతృత్వం లేనిదే ఐక్యత లేదని బాబాసాహెబ్ చాటింపు చేశాడు. ఐక్యతకు పునాది వేసే వర్గీకరణ వ్యతిరేకించడమంటే అంబేద్కర్ ను వ్యతిరేకించడమే"* అని ఆచార్య.పి.ముత్తయ్య అభిప్రాయ పడ్డారు.(**కనకయ్య, గుండెడప్పు.దండోరా దరువు;2005, పుట సంఖ్య : xv**)

"రిజర్వేషన్ల కుండ : ఎబిసిడి కంచాలు అని మేమంటే కుండ మైనస్ కంచాలు, మొత్తం మాది అంటారు. దళిత సమైక్యత, సమగ్రతలను విచ్ఛిన్నం చేస్తున్న సంఘద్రోహులే మాదిగలని పిచ్చెత్తినట్లు అరుస్తారు" అని మాదిగ

రిజర్వేషన్ పోరాటసమితి వ్యవస్థాపక కార్యదర్శి కృపాకర్ మాదిగ అభిప్రాయపడ్డారు.(**ప్రేమకిషోర్ రావినూతల.గుండెదరువు,2005,పుట :x**)

*"ఐక్యతంటే పదిమంది సొమ్మును ఒక్కరే కబళించటం కాదు, దొరికింది తలాయింత సమంగా పంచుకు తినడమే ఐక్యత"* అని జూపాక సుభద్ర అభిప్రాయ పడ్డారు. (**ప్రేమ కిషోర్ రావినూతల.గుండెదరువు,2005,పుట :xii**)

*"మాదిగ దండోరా నేపథ్యంలో వచ్చిన మాదిగ సాహిత్యం దళిత సాహిత్యంలో నిర్దిష్టతను తీసుకొచ్చిందనడంలో సందేహం లేదు. ఇప్పుడీ వర్గీకరణ రద్దు క్రమంలో మాదిగకవులు తమ భావాలను మరింత స్పష్టంగా ప్రకటిస్తున్నారు. సామాజిక సమానత్వం పునాదిగా దళిత కవులు సాహిత్యాన్ని సృష్టిస్తే దళితుల్లోని అసమానత్వాన్ని మాదిగకవులు ప్రశ్నిస్తున్నారు"* అని మల్లవరపు ప్రభాకరరావు అభిప్రాయపడ్డారు. (**బహుజన కెరటాలు, జూన్ 2007,పుట:35**)

*"వర్గీకరణ ఒక చారిత్రక అవసరం. దాన్ని కాదనడంలో ఒక బలమైన కుట్ర. ఒక బూర్జువా మంత్రం."* అని పి.రామారావు అభిప్రాయపడ్డారు. (**ఆంధ్రప్రభ, అక్టోబర్ 22,2006**)

*దళిత కవిత్వంలో మాదిగల ప్రత్యేక కవిత్వం రావడానికి ఒక ప్రధానమైన సాంఘిక కారణం ఉంది. ఇది మాదిగలు తమ అస్తిత్వం కోసం చేసిన బ్రతుకు పోరాటం. అదే మాదిగ రిజర్వేషన్ పోరాటం."*అని ఆచార్య పులికొండ సుబ్బాచారిగారు అభిప్రాయపడ్డారు. (**మార్గం వేసుకున్న మాదిగకవిత్వం, ఆంధ్రభూమి, జూలై, 9, 2012**)

*"sc ఉమ్మడి రిజర్వేషన్ విధానాన్ని ఒకే కులం అధికంగా ఉపయోగించుకున్నది అన్నది చారిత్రక సత్యం. అంటరాని కులాలతో అభివృద్ధి చెందిన కులం కింద కులాల మనుషులను , మనిషిని మనిషిగా కాక అంటరానోళ్ళలో అంటరానోళ్ళను సృష్టించి" మేము దళిత నాయకులం, మేము*

*ఎస్సీ ప్రతినిధులం ... అంటే ఎలా ? "ఇంకానా "బెల్లం నాగన్న సుద్దులు "ఇకపై చెల్లవు అంటూ దగా పడిన కులాలు దండు కట్టి దండోరా వేస్తున్నాయి. చట్టబద్ధమైన హక్కుల కోసం స్వాతంత్ర్య భారతదేశంలో పోరాటం చేయవల్సిన అవసరం రావటం నిజంగా సిగ్గుచేటు"* అని డా. దార్ల వెంకటేశ్వరరావు అభిప్రాయపడ్డారు.(**దార్ల వెంకటేశ్వరరావు**, **ఒక మాదిగ స్మృతి(నాగప్పగారి సుందర్రాజు పరిచయం)**, **పుట:40**, **తెలుగు సాహిత్య వేదిక; 2007**).

"కలిసి పంచుకోవటం అంబేద్కర్ ఆలోచనా విధానం ఒక్కరో ఇద్దరో తినడం మనువాదం"అని ఆచార్య పి.ముత్తయ్య గారి అభిప్రాయం. (**ఆంధ్రప్రదేశ్ మాదిగ మేధావుల ఫోరం,ఉస్మానియా యూనివర్శిటీ**, **హైదరాబాదు**).

*"వర్గీకరణే ఏకీకరణకు ఏకైక సాధనం"* అని కదిరె కృష్ణగారి అభిప్రాయం.(**ఆంధ్రప్రదేశ్ మాదిగ మేధావుల ఫోరం,ఉస్మానియా యూనివర్శిటీ**, **హైదరాబాదు**).

*"మాదిగ వాదనలో మానవత్వం ఉంది, మాలలు తీరులోనే మార్పు రావాల్సి ఉంది"* అని చిలుక భాస్కర్ గారి అభిప్రాయం. (**ఆంధ్రప్రదేశ్ మాదిగ మేధావుల ఫోరం,ఉస్మానియా యూనివర్శిటీ**, **హైదరాబాదు**).

*"నైష్పత్తిక న్యాయమే బహుజన న్యాయం"* డా. గుండెడప్పు కనకయ్య గారి అభిప్రాయం.(**ఆంధ్రప్రదేశ్ మాదిగ మేధావుల ఫోరం,ఉస్మానియా యూనివర్శిటీ**, **హైదరాబాదు**).

*"రాష్ట్రంలో జరిగిన దండోరా ఉద్యమం అసాధారణమైంది. తాత్విక, సాంస్కృతిక రంగాల్లో వెనుకబడిన మాదిగలకు గొప్ప మానసిక ధైర్యాన్ని, స్ఫూర్తిని, ప్రేరణనూ ఇచ్చింది. అనంతరం పలు సామాజిక ఉద్యమాలకు ప్రేరణగా నిలిచింది. మాదిగల ఆత్మగౌరవ పోరాట చరిత్రగా, దేశంలోనే దళితుల సమస్య కోసం దళితులు సాగించిన మొదటి పోరాటంగా చరిత్రలో నిలిచిపోయింది'*అని డా.లక్ష్మీనారాయణ గారు అభిప్రాయపడ్డారు. (**లక్ష్మీనారాయణ,కె. ఆదిభారతీయుల**

**చరిత్ర(క్రీ.పూ.2500-క్రీ.శ.2005): పుట: 223, కర్నూలు డయాసిస్ సోషల్ సర్వీసు సొసైటీ, జనవరి ;2006)**

*"రిజర్వేషన్లు ఆయా కులాల మనుగడకు సంబంధించిన విషయమయింది. సామాజిక న్యాయాన్ని క్రిందిస్థాయి దాకా తీసుకెళ్ళే క్రమంలో జనాభా ప్రాతిపదికగా రిజర్వేషన్లు పంచుకోవాలని అనుకోవడంలో దళిత ఉపకులాలైన మాల, మాదిగల మధ్య సంఘర్షణా పూరిత వాతవరణం ఉంది. అగ్రకులాన్ని ఏ సామాజిక న్యాయం కోసమైతే ప్రశ్నించామో దళితుల్లో అంతర్గతంగా అదే విలువ గురించి తర్కించుకోవాల్సి వచ్చింది"* అని డా. కేశవ్ కుమార్ అభిప్రాయపడ్డారు. **(డా.పి.కేశవ కుమార్.దళిత ఉద్యమం,పుట:45(సంపాదకుడు: జూలూరు గౌరీశంకర్),2009; స్పృహ సాహితీ సంస్థ, హైదరాబాదు).**

పైన తెలిపిన రచయితల అభిప్రాయం ప్రకారం చూసినట్లయితే దాదాపు అందరి అభిప్రాయాల్లో వర్గీకరణ డిమాండు జరగాలన్న సంకల్పం కనిపిస్తుంది. అయితే అది సాహిత్యంలో కూడా విభజనకు గురి కావడం అనివార్యం అని వారు అభిప్రాయ పడ్డారు.

**3.10.దండోరా సాహిత్యం - ప్రసిద్ధ రచనలు :**

1.సుధాకర్ ఎండ్లూరి – వర్గీకరణీయం, కొత్త గబ్బిలం, మల్లె మొగ్గల గొడుగు కథలు, నల్ల ద్రాక్ష పందిరి

2. సుందర్రాజు నాగప్పగారి – మాదిగ చైతన్యం, మాదిగోడు కథలు

3. గ్యార యాదయ్య – గూటం దెబ్బ

4. ప్రేమ కిషోర్ రావినూతల – గుండెదరువు

5. సుదయ్య–మా కొద్దీ మాలదొరతనమూ

6. దార్ల వెంకటేశ్వరరావు –దళితసాహిత్యం మాదిగ దృక్పథం

7. కైతునకల దండెం – సంపాదకులు : కృపాకర్ మాదిగ, జూపాక సుభద్ర

13. మాదిగ పొద్దు (సురేందర్ మాదిగ్ స్మృతి)

14. డా. గుండెడప్పు కనకయ్య, దండోరా దరువు

15.కందిలి మాదిగ మహాజనకవిత్వం. మాదిగ మహాజన ప్రచురణలు, హైదరాబాదు , సెప్టెంబరు,2007.

**3.11.దండోరా సాహిత్యం-విమర్శనాత్మక అధ్యయనం :**

దండోరా సాహిత్యానికి దాదాపు రెండన్నర దశాబ్దాల చరిత్ర ఉంది. ఈ ఉద్యమం ప్రారంభం అయిన నాటి నేటి వరకు ఎంతో మంది కవులు ఉద్యమానికి అండగా నిలబడి సాహిత్య సృజన చేస్తున్నారు. దళిత ఉద్యమ సాహిత్యం హిందూ మనువాద భావజాలానికి వ్యతిరేకంగా అసమానతలను, అస్పృశ్యతలను ధిక్కరిస్తూ ప్రారంభం అయితే, దండోరావాద సాహిత్యం మాత్రం దళితుల్లో జరుగుతున్న అంతర్గత అవాంతరాలను, రిజర్వేషన్ల పంపిణీ విధానాన్ని వ్యతిరేకిస్తూ ప్రారంభం అయింది. ఈ నేపథ్యంతోనే రచయితలు సాహిత్య సృష్టి చేస్తున్నారు.

తెలుగుసాహిత్యంలో దళితజీవితం, సంస్కృతీ, సంప్రదాయాలు, దళితత్త్వం, దళితచైతన్యం మొదలైన అంశాలు సాహిత్యం ప్రారంభం అయిన నాటి నుండి సందర్భానుసారంగా ఉన్నట్లు సాహిత్య చరిత్ర ఆధారంగా చెప్పుకోవచ్చు. కాకపొతే అప్పటి కాలానుగుణంగా మాల, మాదిగ అనే బేధం లేదు కాబట్టి ఉమ్మడి దళితులు అనే అర్థంలో సందర్భానుసారంగా మాల,మాదిగ మరియు ఇతర అస్పృశ్యుల కులాలను వివిద సందర్భాలలో వాడినట్లు తెలుస్తుంది.ఆధునిక కాలం ప్రారంభం అయిన తర్వాత కులచైతన్యం, అస్తిత్వ పోరాటాలు, ఉప కులాల పోరు జరుగుతున్న నేపథ్యంలో మాదిగ సాహిత్య వేత్తలు దండోరా ఉద్యమాన్ని, సాహిత్యాన్ని ఒక కవితా వాదంగా ఏర్పాటు చేసుకొని ఆ దిశలో సాహిత్య సృజన చేస్తున్నారు.

" *ఛీ తెలంగాణ అణచివేయబడిన గొంతుల సాహిత్య సంఘం మాది ' అని చెప్పుకుంటున్న తెలంగాణ రచయితల సంఘం కూడా తెలంగాణ మాదిగ*

*సాహిత్యాన్ని గుర్తించక నిరాకరిస్తోంది. స్క్రిప్టులేని లంబాడా, కోయ సాహిత్యాల గురించి సదస్సులు పెట్టి చర్చిస్తారు కానీ మాదిగ సాహిత్య అస్తిత్వాలంటేనే దుఃఖం. మాదిగ రచనలు సాహిత్యానికి పనికిరావా? ఎలాంటి ఉద్యమాల్లేకుండా వస్తున్న సాహిత్యాలకు పీటలు వేస్తున్నప్పుడు నిర్దిష్టమైన సామాజిక న్యాయపంపిణీకోసం ఉద్యమిస్తున్న మాదిగ అస్తిత్వసాహిత్యాన్ని గుర్తించకపోవడం ఆధిపత్యకులాల సాహిత్య కుట్రే. మైనారిటీ సాహిత్యంలో ముస్లిం సాహిత్యాన్ని ముస్లిం అస్తిత్వంతో నిర్దిష్టంగా గుర్తించడం జరుగుతుంది. ఇది స్వాగతించదగినది. అదే విధంగా మాదిగ సాహిత్యాన్ని నిర్దిష్ట మాదిగ అస్తిత్వంతోనే గుర్తించాల్సి ఉంది. ఇలా గుర్తించకపోవడం దురదృష్టకరం. అస్తిత్వ సాహిత్య రాజకీయాలు చేసే వాళ్ళు కూడా తృణీకరించడం నిరసించదగినదే కదా!* " **(సుభద్ర,జూపాక. మాదిగ అస్తిత్వాన్ని గుర్తించని సాహిత్య రాజకీయాలు; సూర్య దిన పత్రిక:12-12-2008**).

ఈమె ప్రకారం తెలంగాణ ఉద్యమం ఆత్మగౌరవ ఉద్యమం అని చెప్పుకుంటున్న తెలంగాణా వాదులు కూడా మాదిగలను అణచివేస్తున్నారనీ, కనీసం ఎటువంటి గుర్తింపు లేని జాతుల గురించి సదస్సులు నిర్వహిస్తూ కనీసం ఇంతటి మాదిగ సాహిత్యాన్ని, వర్గీకరణ ఉద్యమాన్ని గుర్తించకపోవటం వెనుక ఎంతటి వివక్షత ఉందో తెలుసుకోవాలని ఆవేదన వ్యక్తం చేసారు. దీని ప్రకారం ముందు చెప్పుకున్నట్లు తెలంగాణ ప్రాంతంలో మాదిగ జనాభా శాతం ఎక్కువగా ఉన్న వారికి సరైన గుర్తింపు ఇవ్వడం లేదు అని మనకు అర్థమవుతుంది.

*"మళ్ళీ మాదిగల్ని సాహిత్యంలోనూ మోసం చేయవద్దు. ఇప్పటికే తెలుగు సాహిత్యంలో మాదిగల గురించి దళితేతరులు తెలిసో తెలియక రాసినా, దాన్ని చాలా మంది విమర్శకులు మాలల జీవితంగా వ్యాఖ్యానిస్తున్నారు"*

*"అసలు అంటరానితనానికి ప్రాతిపదికమేటి? అది మాలల్లో ఉందా?మాదిగల్లో ఉందా? వీరందరికంటే మరింత దిగువనున్న పాకీ వాళ్ళలో*

*ఉందా? ఈ విషయాలేమైనా ఈ నవల్లో నిజంగానే రికార్డు అయ్యాయా? ఇలాంటివన్నీ విశ్లేషించుకోకుండా దీన్నే యావత్తు అంటరానివాళ్ళ తరతరాల జీవితాల్ని సాహితీకరించిన నవలగా కీర్తిస్తే, నిజమైన అంటరానివాళ్ళకు అన్యాయం చేసినట్లు కాదా ? దానితో పాటు అంటరానితనానికి ఉన్న, గురవుతున్న అనేక కోణాలను తెలుసుకోకుండా ముందే అడ్డుకున్నట్లవ్వదా ? అది అంటరాని అని ఒక కుల తెగనే అన్ని అంటరాని కులాలకు అంటగట్టడం వల్ల జరిగే హాని కాదా ? ఈ నవలని అంటరాని వాళ్ళ అందరి జీవితాలకు ప్రాతినిధ్యం వహించే నవలగా సాధారణీకరించే లేదా సిద్ధాంతీకరించే వాళ్ళు ఆలోచించ వలసిన ముఖ్యమైన అంశమిది"*

*" మాలవసంతం అంటరానివసంతంగా ప్రచురించుకున్నా, భవిష్యత్తులో స్పష్టంగా మాదిగ వసంతం రాయాలనుకునే వాళ్ళ ద్వారాల్ని ముందుగానే మూసేయెద్దు".* **(వెంకటేశ్వరరావు,దార్ల.సాహిత్యంలోను మాదిగలకు దగా మాలల అంటరాని వసంతం : సూర్య దిన పత్రిక : 1-3-2010)**

రచయిత అభిప్రాయం ప్రకారం ఇన్నాళ్ళు రాసిందంతా మాదిగ సాహిత్యమే, కాకపోతే అది దళిత సాహిత్యంగా చెలామణి అయింది, కనీసం ఇప్పుడైన మాదిగ సాహిత్యాన్ని మాదిగ సాహిత్యం లాగే కొనసాగనివ్వండి, ఎలాగు సామాజిక, ఆర్ధిక, రాజకీయ రంగాల్లో మాదిగలను మాలలు మోసం చేసారు, కనీసం సాహిత్యంలోనైనా ఎవరిది వారు రాసుకోవటానికి అవకాశం కల్పించాలని విమర్శకుడు మాల రచయితలను హెచ్చరిస్తున్నారు.

*"తెలుగు కవిత్వం కవిత్వ అధ్యయనం అంటే విమర్శలలో కూడా ఈ తీరు కనిపిస్తూ ఉంది. కవిత అంటే ఒకప్పుడు కవితే. కాని నేడు అలా కాదు. తెలుగు కవిత్వం చాలా వర్గాలుగా విడిపోయింది. స్త్రీ వాద కవిత, దళిత కవిత, బి.సి వాద కవిత, మైనారిటీ కవిత, డయస్పోరా కవిత, బ్లాగు కవిత, అంతర్జాల కవిత. ఇన్ని రకాలుగా వచ్చాయి. ఇందులో దళిత కవిత్వం తిరిగి విడిపోయింది. మాదిగ*

*కవిత్వం, మాల కవిత్వం, దళిత స్త్రీవాద కవిత్వం అనేవి ప్రస్తుతానికి స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయితే దళిత స్త్రీ వాద కవిత్వంలో కూడా మాల, మాదిగ వైరుధ్యం వస్తుందేమో చూడాలి. ఇది ఇప్పటికైతే స్ఫుటంగా కనిపించడం లేదు. మొత్తం మీద దళిత కవిత్వంలో మాదిగ కవిత్వం అనేది ప్రత్యేకంగా రూపుదిద్దుకొంది.*

*" ప్రభుత్వం జాషువా పేరుమీద ఒక సాహిత్య పీఠాన్ని పెట్టగానే మాల వర్గంనుండి మరొక డిమాండ్ వచ్చింది. జాషువా అంత స్థాయి మహాకవి ఉండగా దళితులందరికీ అతను ప్రాతినిధ్యం వహిస్తాడనే దృక్పథం మాల వర్గం అటుంచింది వారి వర్గం నుండి కూడా ఒక కవి పేరుతో పీఠం ఏర్పాటు కావాలనే కోరిక బలంగా వినిపించిన కారణంగా ప్రభుత్వం బోయి భీమన్న పేరుతో మరొక పీఠాన్ని ఏర్పాటు చేసింది. ఈ విధంగా కనిపించే సామాజిక వైరుద్ధ్యాలు దళిత సాహిత్యంలో తిరిగి మాల మాదిగ కవిత్వం అనే వింగడింపులకు కారణం అయింది.*

*మాదిగ కవులు చాలా కాలం నుండే కవిత్వం రాస్తున్నారు. జాషువా మాదిగ వర్గంలో శిఖర ప్రాయమైనకవి. ఈయన 1919 ప్రాంతం నుండే కవిత్వాన్ని వెలయించడం ప్రారంభించాడు. కాని 1893 లో ఆంధ్రక్రైస్తవ గీతాలు అనే పుస్తకం వెలువడింది. దీనిలో కొందరు మాదిగ కవులు పాటలు రాసారు. ఆధునిక కాలంలో ఇదే తొలి మాదిగ కవిత్వంగా భావించాలి ".*

**(*సుబ్బాచారి,పులికొండ.* మార్గం వేసుకున్న మాదిగకవిత్వం *ఆంధ్రభూమి జూలై*, 9, 2012).**

మాదిగ కవిత్వం ఇవాళ నిన్న మొన్న వచ్చింది కాదు దీనికి చాలా సంవత్సరాల చరిత్ర ఉంది. జాషువాను మనం మాదిగ కవిగానే స్వీకరించాలి. 18వ దశకంలో కొంతమంది క్రైస్తవులు పాటలు రచించారు. వాటిలో మాదిగ జీవనానికి చెందినవి చాలా ఉన్నాయి. కాబట్టి అదే మొట్టమొదటి మాదిగ

కవిత్వం చెప్పుకోవచ్చు. అప్పుడే మాదిగ కవిత్వం మార్గం వేసుకొందని, అంతేకాక జాషువా మీద ఒక పీఠం ఏర్పాటు చేస్తే మాల రచయితలు భోయి భీమన్న మరో పీఠాన్ని ఏర్పాటు చేయటం వీరిద్దరి మధ్య సాహిత్య వైరానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఎన్ని అడ్డంకులు ఉన్న మాదిగ కవిత్వానికి మార్గం పడటం ఖాయం అయింది ఇది ఆగదు అని సుబ్బాచారిగారు తెలియజెప్పారు.

*" సమాజంలోని అణగారిన వర్గకుల ప్రజలందరినీ సంఘటితం చేసి ఒక మానవీయమైన విశాలమైన, అత్యంత ప్రజాస్వామికమైన మాదిగ మహాజన రాజ్యాన్ని నిర్మించేందుకు అనేక వేల సంవత్సరాలుగా శాస్త్రీయ దృక్పథంతో అభివృద్ధి చెందిన మాదిగ తత్వాన్ని ఆయుధంగా చేసుకొని ఉద్యమాలను నిర్మించవల్సిన అవసరం ఉన్నది.*

*మాదిగ, మాల, బిసి, ఎస్సీ, ఎస్టీ , మైనార్టీ తదితర అణగారిన కులాల మధ్య ఐక్యతను పెంపొందించి ఒక మహోన్నతమైన ప్రజాస్వామ్య మాదిగ మహాజన రాజ్యస్థాపన ఒక్కటే మార్గం.ఆ దిశగా మాదిగీకరణ ప్రక్రియను పూర్తిచేసినప్పుడే ఒక సమసమరాజ్యం సాకారమవుతుంది".* **(కందిలి మాదిగ మహాజనకవిత్వం; పుట:14, మాదిగ మహాజన ప్రచురణలు, హైదరాబాదు , సెప్టెంబరు,2007)**

" 1. వర్గీకరణతో దళిత సమస్యలన్నీ పరిష్కారమైపోతాయనే దానితో గ్రంథకర్త కూడా విభేధిస్తున్నాడు. కానీ దళిత సమస్య పరిష్కారంలో మొదటి మెట్టుగా, లేదా ఒక్కో మెట్టుగా సమస్య పరిష్కారమనేది సాధించటంలో వర్గీకరణ ఒకటిగా గుర్తించమంటున్నాడు. దీనికి అవసరమైతే క్రిమిలేయర్ విధానాన్ని కూడా పాటించటం వల్ల నిజమైన దళితులకే అవకాశాలు అందుబాటులోకి రాగలగి,రిజర్వేషన్ల లక్ష్యం నెరవేరుతుందంటున్నాడు.

2. వర్గీకరణ వాదానికి బ్రాహ్మణత్వ భూమికను రచయిత అంగీకరించటం లేదు. బ్రాహ్మణత్వ/హిందుత్వ భావాలతో వర్గీకరణను సమర్థించే

పార్టీలు ఉన్నా, అదే ప్రభావం పూర్తిగా వర్గీకరణ సమర్ధనకు ఉందనడం సమంజసం కాదంటున్నాడు. దాన్ని సోపపత్తికంగా నిరూపించాడు.

3. పేర్ల వెనుక ఉండే కుల సూచికల పట్ల కూడా రచయిత దృష్టి కేంద్రీకరించటం కనిపిస్తుంది. కుల అస్తిత్వం సమాజంలో వ్యక్తి అస్తిత్వాన్ని నిర్ణయించింది. అస్పృశ్యులుగా ఉన్న వాళ్ళే అంతర విభజనకు గురై వారి కుల సూచికలకు గౌరవ ప్రదంగా భావించుకోవటం వల్లనే గౌరవాన్ని పొందగలిగారు. కానీ మాల–మాదిగలకులసూచికలు బలవంతపు ఆరోపిత కుల సూచికలు, నిందార్ధంలో,నీచార్ధంలో అంగీకరింపజేసినవి. అయినా వాటితోనే తిరుగుబాటుతత్వంతోగౌరవప్రదంగా మార్చుకోగలగాలంటున్నాడు గ్రంథకర్త. ఈ విషయంలో అంబేద్కరిజమ్ కొంత లోతుగా ఆలోచించవలసిన అవసరం ఉంది, కానీ ప్రత్యామ్నాయాన్ని ఆలోచించి అది అందరికీ ప్రసరింపజేయటం కంటే ఉన్న దానిలోని ఔనత్యాన్ని సాధించుకోవటం అనే పద్ధతి ఉంది. ఆ పద్ధతిలోనే ఆపాదిత గౌరవం కులసూచికలకు ఏర్పడుతుంది. దీన్నింకా లోతుగా చర్చించవలసిన అవసరం ఉంది. ఈ విషయంలో మాదిగ దండోరా సాధించిన సాంస్కృతిక ఔనత్యాన్ని సిద్ధాంతీకరించే ప్రయత్నం కనిపిస్తుంది.

4. ప్రభుత్వ రంగంలో ఉపాధి అవకాశాలు కోల్పోయిన తర్వాత ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల కోసం దళితులు ఉమ్మడిగా పోరాడవలసిన తరుణంలో, వర్గీకరణ చేటు తెస్తుందనే దాన్ని సునిశితంగానే పరిశీలించగలిగాడు. ప్రభుత్వ ఉపాధి అవకాశాల్లో ఉన్న కొద్దిపాటి అవకాశాలనే మాదిగ, తదితర ఉపకులాల వారికి లభించదన్నవాళ్ళు, రేపు ఉమ్మడిగా ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు సాధిస్తే

అప్పుడు ఆ అవకాశాల్ని పొందనిస్తారని ఎలా నమ్మగలమని సహేతుకంగానే ప్రశ్నిస్తున్నాడు. రెండో కోణంలో ప్రభుత్వ ఉపాధి అవకాశాలు ఇప్పటికే కోల్పోయినా, ఇకపై రాబోయే ప్రైవేటురంగంలో రిజర్వేషన్లయినా కాపాడుకోవాలంటే వర్గీకరణ ఉండవల్సిందే అనేది మరో వాదనగా ముందుకి తీసుకొస్తున్నాడు.

5. రాజ్యాధికార భావన గురించి ఆచరణాత్మక సిద్ధాంతాన్ని ఈ గ్రంథంలో ప్రతిపాదించి దళిత రాజ్యాధికారం అనే దానికి కొత్త నిర్వచనాన్నివ్వగలుగుతున్నాడు రచయిత. అంబేద్కరిజం పునాదిగానే దీన్ని విస్తృతపరిచే ప్రయత్నం చేశాడు. రాజ్యాధికారం రావడానికి ముందుగా వర్గీకరణ వాదాన్ని అంగీకరించవల్సి ఉంటుందంటున్నాడు. అలా కానంత వరకు దళితుల పేరుతో మాలలు మాత్రమే రిజర్వేషన్ అవకాశాలు అనుభవిస్తున్నారనేది దళిత సమైక్యత పేరుతో జరిగే కౌటిల్యాన్ని మాదిగలు గుర్తించగలిగారనేది గ్రంథకర్త విశ్లేషణ. దీనితోపాటు ప్రభుత్వ విద్యలో సంస్కరణలు రావాలనేది కూడా రచయిత ఆకాంక్షగా కనిపిస్తుంది. అలా కాకపోతే రిజర్వేషన్ల లక్ష్యం దెబ్బతినే ప్రమాదం ఉందంటున్నాడు. ఇది కేవలం దళితుల్లోని ఒక వర్గ ప్రయోజనాన్ని మాత్రమే ఆకాంక్షించేది కాదు. వర్గీకరణానంతరం దళితుల శాశ్వతాభివృద్ధి సంబంధించిన తాత్త్విక ఆలోచన. ఈగ్రంథంలో దళితుల్లో ఒక వర్గాన్ని గుడ్డిగా సమర్థిస్తున్నాడనుకోవడానికి వీలులేదు. (**సాంబయ్య, గుండిమెడ. బ్రాహ్మణత్వ మాలత్వమా...?మానవత్వ అంబేద్కరత్వమా...?(వర్గీకరణ పై చర్చ)** (**వెంకటేశ్వరరావు, దార్ల; వర్గీకరణకు శాస్త్రీయ దృక్పథం, XV**).

డా. ఎండ్లూరి సుధాకర్ గారు రచించిన వర్గీకరణీయం దీర్ఘకావ్యంపై పలువురు సాహిత్య మేధావులు అంగీకరణీయం పేరుతో వారి అభిప్రాయాలను

వెలిబుచ్చారు.అ ఆభిప్రాయాలను ఆ పుస్తకంపై వచ్చిన విమర్శగానే స్వీకరించాలి.
" *నీ ఆవేదనను ఏ మాత్రం అవగతం చేసుకున్నా ఈ సమస్యను మెలికలు తిప్పే వాళ్లలో కాస్త పరివర్తనం కలగొచ్చని అనుకుంటున్నాను*" **(డా.సి.నా.రె)**

"*వర్గీకరణ వ్యాకరణంలో*
*కొత్త సంధి కుదరాలి*
*వైరి సమాసం లేని*
*ఏకవాక్యం రాయాలి* **(ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం)**

" *మీరు ప్రస్తావించిన కవులు ఈ విషయంలో నోరు మెదుపుతారని నాకు అనిపించటం లేదు*"**(కడియాల రామమోహనరాయ్)**

" *ఈ కావ్యం మాత్రం మాదిగల వేదనతో పాటు మాలలపై విమర్శతోనే గాక ఒక సంధి ప్రయత్నాన్ని కూడా ఆంకాక్షిస్తున్నది* "**( కె. నవీన్)**

"*ముట్టరాని మాదిగలే*
*అంటరాని మంటలైరి*
*చేయి చేయి కలపాలి*
*చరిత తిరగరాయాలి* "
*సామ్యవాద మహాభారతం లాగ ఇది మాదిగ మహాభారతం. అది శ్రీశ్రీ, ఇది సుధాకర్ రాశాడు* "**(చలసాని ప్రసాద్)**

"*ఎస్సీలలోనూ క్రిమిలేయర్ పెట్టాలి, అగ్ర వర్ణాలని పిలవబడుతున్నవారిలోనూ ఆర్ధికంగా అణచివేయబడిన వారికి కొంతశాతం రిజర్వేషన్లు కొంతకాలం కల్పించాలి. హక్కుల్ని పొందటంలో అందరూ సమానులే అనేది నినదించాలి* "**( డా. దార్ల *వెంకటేశ్వరరావు* )**

" *మాదిగల ఆత్మగౌరవ నినాదం తెలుగు కవితావరణంలో అడుగుపెట్టింది. మాల సోదరులను సామరస్యంగా అడుగుతూ, రొట్టె కోసం సాగించే ఈ మా మా మాహాభారత యుద్ధం విపరిణామాలని వివరిస్తూ వికర్ణుల*

*తోడ్పాటును అర్థిస్తూ సాగిపోయిన ఆర్తగీతం ... ఈ వర్గీకరణీయం "* **( డా, జె.చెన్నయ్య)**

*" వర్గీకరణ వ్యాకరణంలో అందమైన సంధి కుదరాలని ఆశిస్తున్నా కోరుతున్నా "* **( మొహమ్మద్ ఖాదర్ ఖాన్)**

*" దళిత ధీర్ఘ కావ్యాలలో విశిష్టమైనది, విలక్షణమైనది ఈ వర్గీకరణీయము "* **(డా.ద్వా.నా. శాస్త్రి)**

*" ఎప్పుడైన సమేకత రావాలంటే సమైకత తప్పనిసరి "* **(ఆచార్య బేతవోలు రామబ్రహ్మం)**

*" ఎప్పుడో ఒకప్పుడు ఇది తప్ప (ని) దే ... ( చందన్న)*

**(సుధాకర్, ఎండ్లూరి. వర్గీకరణీయం (దళితధీర్ఘ కావ్యం), మానస, మనోజ్ఞ ప్రచురణలు, రాజమండ్రి,2005).**

మాదిగ దండోరా ఉద్యమాన్ని పరిమిత అర్థం నుండి విస్తృత అర్థంలోకి తెచ్చే క్రమంలో దాని స్వరూప స్వభావాన్ని మార్చే ప్రక్రియ ఎంతైనా అవసరమనే భావన చాలా మందికి ఉంది. రిజర్వేషన్ వర్గీకరణ నేపథ్యంగానే ఈ ఉద్యమం పుట్టిందనే అపవాదు నిజానికి వర్గీకరణ సమస్య దళిత సమస్యలో ప్రధానాంశమే. దళితుల ప్రధానాంశమే. దళితుల సమస్య పరిష్కారానికి, సమైక్యతకు దోహదపడే విధంగా వర్గీకరణ సమస్యను పరిష్కరించాలి. అంతర్గత సమస్యలను పరిష్కరించుకోకుండా దళిత సమైక్యతను కోరటం గురవింద చందమే అవుతుంది. దళితుల్లో 62 ఉపకులాలు ఉన్నాయన్న నిజం దండోరా ఉద్యమం మూలంగానే బైటకు వచ్చింది. ఇన్ని ఉపకులాలు ఉన్నాయన్న నిజం దండోరా ఉద్యమం మూలంగానే బైటకు వచ్చింది. ఇన్ని ఉపకులాలు అట్టడగున పడి ఉన్నాయి కాబట్టి, ఇది మాల, మాదిగల సమస్యగానే ఉపరితలంపై కనిపిస్తున్నది. మాదిగ చైతన్యాన్ని మాదిగ ఉపకులాల ప్రాతినిధ్య చైతన్యంగానే అర్థం చేసుకోవాలి. **(వెంకటేశ్వరావు, దార్ల .దళితసాహిత్యం మాదిగదృక్పథం - పుట:9,10,**

**సొసైటీ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు. హైదరాబాదు,2008)**

నాటి నుండి నేటి వరకు హీనంగానే చూడబడుతున్న దళితులకు రిజర్వేషన్ అనే రాజ్యాంగ ఉపశమనం అంబేద్కర్ సాధించి పెట్టక పోయినట్లయితే అంబేద్కర్ ను శత్రువుగా పరిగణించే అగ్ర వర్ణాల ఇల్లల్లో, పొలాల్లో దళితులు ముఖ్యంగా మాదిగలు పని మనుషులుగా, పాలేర్లుగా ఉండేవారు అంటే అందరికి ఈ రిజర్వేషన్ వల్ల విముక్తి లభించిందని కాదు. పని మనుషులుగా, పాలేరులుగా ఉండటం లేదని కాదు, కొందమంది దళితులైనా పైకొచ్చారనే వాస్తవాన్ని కాదనలేం, కానీ అధిక సంఖ్యాకులైన దళిత పేదలకు రిజర్వేషన్ ప్రయోజనాలు చేరటం లేదనేదే బాధ. ఇలాంటి పరిస్థితుల్లో రిజర్వేషన్ ఫలాలను ప్రజాస్వామ్యబద్ధంగా అనుభవించాలనే డిమాండు సరియైనదే. **(వెంకటేశ్వరావు),దార్ల.దళితసాహిత్యం మాదిగదృక్పథం - పుట:10, సొసైటీ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు. హైదరాబాదు,2008)**

అన్ని రకాల అవకాశాలను వినియోగించుకుంటూ ఉంటూ, అగ్ర వర్ణ భూస్వాముల ఇళ్ళల్లో పెంచుతున్న కుక్కలను తమ ఇళ్లల్లో పెంచే సంస్కృతిని కల్గి ఉంటూనే, దళితులం కాబట్టి వివక్షకు గురవుతున్నాం, అన్యాయం జరిగిందని గగ్గోలు పెట్టి దళిత బ్రాహ్మణులు ఉన్నారంటే ఆశ్చర్యం కలగక మానదు. వీరికే దళిత సమైఖ్య వాదమనే పాట అవసరం. **(వెంకటేశ్వరావు), దార్ల. దళితసాహిత్యం మాదిగదృక్పథం - పుట:11, సొసైటీ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు. హైదరాబాదు,2008)**

దళితులు కూడా మాల మాదిగ మధ్య ఉండే సమస్యలకు అగ్రవర్ణాల వారే కారణమని అనడంలో కొంత వాస్తవం ఉన్నా, అదే పరిపూర్ణ సత్యం అనుకోవడానికి వీల్లేదు. ప్రతి దళిత సమస్యకూ అగ్రవర్ణాల వారే కారణమనడం , అదీ ఎస్సీ వర్గీకరణ సమస్యకు ముడిపెట్టడం సమంజం కాదు. **(డా.వెంకటేశ్వరావు),దార్ల.దళితసాహిత్యం మాదిగదృక్పథం - పుట:31, సొసైటీ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు. హైదరాబాదు,2008)**

" జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్లలో వర్గీకరణ జరగాలన్న మాదిగల డిమాండు న్యాయసమ్మతమైంది. అందుకు అందరు దళిత మేధావుల నుండి ప్రజాస్వామిక ఉద్యమాల నుండి , అన్ని రాజకీయ పార్టీల నుండి ఆమోద ముద్ర లభించింది కూడా. వర్గీకరణ డిమాండ్ని మాలమహానాడుకి, మాల కులానికి చెందిన దళిత మేధావుల మద్ధతు లేదు. రిజర్వేషన్ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధత చేసినపుడు మెజార్టీ మాలల్లో పెద్ద వ్యతిరేకత కూడా లేదు. సుప్రీంకోర్టు తీర్పు మాలమహానాడుకి కొంత జీవం పోసింది. మిమ్మల్ని ఎవరు చదువుకోవద్దన్నారు, చేతయితే పోటీపడి సాధించుకోండనే ప్రతిభ పాఠవాలు అసంబద్ధమైనవి. మరి కొందరు మాలలు చేస్తున్న ప్రతిభావాదం ఎంత దుర్మార్గమైనదో, మాలలను బ్రాహ్మణులతో పోల్చటం, మాలత్వ అనే భావనను సృష్టించి బ్రాహ్మణవాదంగా చెప్పటం కూడా సరైనది కాదు. ఆ పదాల్ని అంత తేలిగ్గా వాడటం వల్ల చివరికి శత్రువు ఎవరో తెలియని పరిస్థితి "( **డా.పి.కేశవ కుమార్ .దళిత ఉద్యమం వెలుగు నీడలు , పుట:47,48,సంపాదకుడు : జూలూరు గౌరీశంకర్ ), 2009; స్పృహ సాహితీ సంస్థ, హైదరాబాదు**).

కేశవ కుమార్ అభిప్రాయం ప్రకారం ఇన్నాళ్ళు దళితులంతా ఒకటి, దళితుల ఐక్యత వర్ధిల్లాలి అని నినాదాలు పలికిన దళితులు ఇప్పుడు వారిలో వారు అంతర్యుద్ధాలు చేసుకోవటం వలన చివరికి శత్రువు ఎవరో తెలియని పరిస్థితి. కాబట్టి దళిత మేధావులు ఇప్పటికైనా వర్గీకరణ విషయంలో స్పష్టతకు రావాల్సి ఉంది.

మాలత్వం అనేది ఒక ఆలోచన విధానం మాత్రమే కాదు. అది ఒక జీవన విధానం కూడా. అంటే పాతరాజకీయ పలుకుబడిలో చెప్పుకోవాలంటే పునాదికి ఉపరి నిర్మాణానాకి రెండింటికి చెందే ఒక వాస్తవికత. హిందుత్వ అంటే హిందుమతం (ఈ రెండో దాన్ని కల్పిత అస్తిత్వ వివాదం కాసేపు ప్రక్కన పెడితే) కానట్టుగానే మాలలందరికీ మానవత్వ లక్షణాలుంటాయని గానీ, దానికి

ఆమోదిస్తారని గానీ అనుకోవటం లేదు .... ప్రమాదంలో పడ్డ ఆస్తిని రక్షించుకునే వర్గాలకి ఉండే సమరశీలత ఈ కింది శ్రేణికి ఉండదు. శ్రమ దోపిడీకి గురయ్యే వర్గాల వలె వీరిలో విప్లవానికి ముడిసరుకు దొరకదు. శ్రమ దక్కని ఈ దౌర్భాగ్య సమూహానికి ఆందోళనేగానీ ఆగ్రహం కలగదు. ఉత్పత్తిలో భాగం కోల్పోయిన వీరికి ఉత్పత్తి సృజన మాత్రమే సాధ్యం. పరాన్నభుక్కు వర్గాలకి ఉండే లౌక్యం. చాకచక్యం, ముఠాతత్వం కూడా వీరికి ఉండవు. ఈ శ్రేణి దోపిడి చేయదు. కనీసం దోపిడికి గురయ్యే భాగ్యానికైనా నోచుకోదు. ప్రభుత్వం దగ్గర దేబరించటం తమలోని బలహీనులకి పంచి పెట్టకుండా దాచుకుందామనుకోవటం వీరి లక్షణాలు. వీరిది హక్కులని అడుక్కునే తలకిందుల చైతన్యం. వీరిని ఇంకా కొంతైనా ప్రగతిశీల భావజాల పరిధిలో ఉంచుతున్నది అలవాటు మాత్రమే. దానికి భౌతిక పునాది లేదు. కనీసం వీరు ఇప్పటికైనా తగినంత సాంస్కృతిక పెట్టుబడిని కూడబెట్టుకొని ఉంటే తమ అస్తిత్వ సంక్షోభాన్ని విశ్వజనీన భాషలో సార్వత్రిక లక్ష్యాలతో వ్యక్తీకరించుకోగలిగే కౌశలమూ విశాలత్వమూ వీరికి అబ్బి ఉండేది. ఇది లుంపెన్ మధ్యతరగతి, కొట్లాడగలదు గానీ పోరాడలేదు. బుకాయింపులే గానీ వాదించటం చేతగాదు. వీరి సంక్షోభం ఒక వైఫల్యమే గానీ విప్లవానికి ప్రవేశిక కాదు. ఈ సమూహపు ఆలోచనా విధానాన్ని జీవన విధానాన్ని మాలత్వం అందాం'' **(శ్రీనివాస్, జిలుకర. చిట్టిబాబు(2005) దళిత సాహిత్యం చేసిన విషప్రయోగం. ఆంధ్రజ్యోతి,18 జూలై)**

1. మాదిగలకున్న కులవృత్తి – మాలలకులేని కులవృత్తి
2. దళిత రిజర్వేషన్లలో మాలలు 64 శాతం వినియోగించుకోవడానికి కారణం మాలలకు గల ఆత్మగౌరవ, సామాజిక స్పృహలు – అవి కొరవడిన మాదిగలు
3. విద్య, ఉద్యోగాలలో మాలల 28 పాళ్ల ఆధిపత్యం అతి స్వల్ప విషయం
4. వర్గీకరణ సూత్రం సమస్యకు పరిష్కరించక పోగా మరింత జటిలం చేస్తుంది.
5. వర్గీకరణ మొత్తం మాదిగలకు ప్రయోజనం చేకూర్చదు

6. పేరు ప్రక్క మాదిగను తగిలించుకొని ఆత్మగౌరవాన్ని కోల్పోయిన మాదిగలు
7. వర్గీకరణ వాదాన్ని సమర్ధించి విజ్ఞత, విషయ పరిజ్ఞానం లోపించిన ప్రగతిశీల కమ్యునిస్టు, బిసి మేధావులు
8. సమైక్యత భావన ప్రమాదకరమైనదా ? దళిత శక్తిని అంతమొందించి రాజకీయ కుట్రే వర్గీకరణ
9.దళితుల లక్ష్యం రిజర్వేషన్లు కారాదు-రాజ్యాధికారం కావాలి **(సాంబయ్య, గుండిమెడ. బ్రాహ్మణత్వ మాలత్వమా...?మానవత్వ అంబేద్కరత్వమా...?(వర్గీకరణపై చర్చ) పుట సంఖ్య: 5)**

ఇదే విషయాన్ని డా.దార్ల వెంకటేశ్వర రావు ఈ విధంగా తెలిపారు.

వర్గీకరణను వ్యతిరేకించేది దళితుల్లోని ఒక వర్గం వారే వాళ్ళలో మాలలే ప్రధానంగా కనిపిస్తున్నారు. అసమానతను పోగొట్టుకొనే దిశలో అవకాశాల అందుబాటుని సాధించుకోవాలనేది అంబేద్కరిజంలో ఒక ప్రధాన ఆశయం. ఆ ఆశయానికి క్రియారూపమే రిజర్వేషన్లకు పొడగింపు కూడా. అంటే సామాజిక వాస్తవికత నుండి రిజర్వేషన్ల పొడగింపు కొనసాగుతుంది. దీన్ని వ్యతిరేకించని దళితుల్లోని ఒక ప్రధాన వర్గం. సామాజిక వాస్తవికతలో స్పష్టంగా గణాంక వివరాలతో సహా కనిపిస్తున్న లోపాల్ని పూరించే దిశగా ఎస్సీ వర్గీకరణ జరగాలనడాన్ని ఆ వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఇలా అంబేద్కరిజానికి వ్యతిరేకంగా, బ్రాహ్మణత్వ భావజాలంతో వర్గీకరణను వ్యతిరేకించే ఆలోచనను మాలత్వగా వ్యాసకర్త ప్రయోగిస్తున్నాడు. **(వెంకటేశ్వరావు,దార్ల.దళితసాహిత్యం మాదిగదృక్పథం-పుట:33, సొసైటీ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు. హైదరాబాదు,2008)**

ఇక్కడ మాలత్వం అనేది ఒక కులానికి సూచిక కాదు అది కేవల ఒక జీవన విధానంగా అర్థం చేసుకోవాలి. ఎలాగైతే ఆధిపత్య భావజాలం, భూస్వామ్య భావజాలం అంటున్నామో మాలత్వం కూడా అలాంటిదే.

దళితులను విభజించాలని ఎదురు చూసి హిందుత్వ బ్రాహ్మణత్వ

భావజాలం కొంత పనిచేసే నేటి వర్గీకరణ వాదానికి పూర్తి మద్దతు కొనసాగుతుందనడంలో కొంత చారిత్రక సత్యం ఉంది,కానీ అదే పూర్తి సత్యం కాదు.( **డా.వెంకటేశ్వరావు, దార్ల.దళిత సాహిత్యం మాదిగ దృక్పథం-పుట: 35, సొసైటీ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు. హైదరాబాదు,2008**).

ఏనాటికైనా దళితులంతా ఒకటే అనే ఆశాభావం కనిపిస్తుంది. వర్గీకరణ, ఏకీకరణ పేరుతో మాలో మేం ఉద్యమాలు చేసుకున్న మా అంతిమ శత్రువులు ఆధిపత్య కులాలే అనే విషయం చెప్పకనే చెప్పారు.

దళిత ఉద్యమానికి ఉన్నట్లే మాదిగ సాహిత్యానికి కొన్ని స్పష్టమైన లక్ష్యాలు కనిపిస్తున్నాయి.

1. అన్ని కులాల వారిని గౌరవించినట్లయితే మాదిగలనూ, వారి వృత్తిని గౌరవించాలని కోరుకోవటం. మాదిగల సంస్కృతిని కించపరచకుండా. మాదిగల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని భావించటం.
2. ప్రతి కులానికి జాతికి ప్రత్యేక అస్తిత్వం, సంస్కృతి ఉంటాయని ప్రభోధిస్తూనే షెడ్యూల్డు కులాలు, తెగల్లోని అన్ని ఉపకులాలను చైతన్యపరచటం.
3. ఒక కులం లేదా జాతి పేరుతో ఆధిపత్యాన్ని చెలాయించే సంస్కృతికి చరమగీతం పాడి, అందరికి ఆత్మగౌరవాన్ని

కలిగించాలనుకోవటం.(**డా.వెంకటేశ్వరావు,దార్ల. దళితసాహిత్యం మాదిగదృక్పథం – పుట సంఖ్య:43, సొసైటీ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు. హైదరాబాదు,2008**)

కొన్ని సార్లు మాదిగేతరులు మాదిగవృత్తిని చేసినా, మాదిగ సంస్కృతిని పాటించినా వాటిని మాదిగ కులంలో అంతర్భాగంగా తీసుకోవడం సమంజసం. **(వెంకటేశ్వరావు, దార్ల. దళిత సాహిత్యం మాదిగ దృక్పథం-పుట:61,సొసైటీ అండ్**

**ఎడ్యుకేషన్ ట్రస్టు. హైదరాబాదు,2008)**

దళిత సాహిత్యంలో అంతర్భాగంగా మాదిగ సాహిత్యాన్ని చూడటం సరైన ధోరణి కాదు, కనుక మాదిగ సాహిత్యంలో అంతర్భాగంగా దళిత సాహిత్యాన్ని పరిగణించటం సమంజసం.(**వెంకటేశ్వరావు, దార్ల. దళితసాహిత్యం మాదిగదృక్పథం - పుట:62, సొసైటీ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు. హైదరాబాదు,2008**).

ఇంతవరకు తెలుగుసాహిత్యంలో దళిత సాహిత్యమంటే ఏమిటి? దళితులంటే ఎవరు ? అనే ఆసక్తికర చర్చలు సాగాయి. కానీ మాదిగ సాహిత్యం ఆవిర్భవించిన తర్వాత దళిత సాహిత్యముందా ? మాదిగ సాహిత్య ఆంశాలు ముందే సాహిత్య తెర పైకి వచ్చాయి. దళితులంటే కేవలం మాదిగలని కాబట్టి దళిత సాహిత్యానికి మాదిగల జీవనవిధానమే ప్రధానం కాబట్టి మాదిగసాహిత్యంలో అంతర్భాగమే దళిత సాహిత్యంగా విమర్శకుడు శాస్త్రీయబద్ధమైన చర్చకు తెరలేపారు.

తెలుగుసాహిత్యం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటి వరకు ఎన్నో ఒడిదుడుకులను ఎన్నో ఆటుపోటులను ప్రత్యక్ష్యంగా, పరోక్షంగా విమర్శలను ఎదుర్కొన్న దండోరా సాహిత్య ప్రస్థానాన్ని ప్రధానంగా ఐదు దశలుగా చెప్పుకోవచ్చు.

**3.12.దండోరా సాహిత్యం - దశలు :**

దండోరా సాహిత్యం మొదట ఎండ్లూరి సుధాకర్ గారితో మొదలై నేటి ఎంతో మంది యువ రచయితలను అందించిదనడంలో ఎలాంటి సందేహం లేదు. ఏదైనా సాహిత్య ప్రక్రియ ప్రారంభమైన తర్వాత దాని ఉనికి ఆ ఒక ప్రక్రియకే పరిమితం అయిపోతే ఆ సాహిత్యానికి ఎదుగుదల లేదనే చెప్పాలి. ఎందుకంటే సాహిత్య సృజన జరిగే కొద్ది సాహిత్యం తన పరిధి పెంచుకోవాలి. ఇలా సాహిత్య పరిధి పెరగగలిగినప్పుడే ఆ సాహిత్యానికి విమర్శకుల దృష్టిలో గౌరవం ఉంటుంది. ఈ దృక్పథంతో దండోరా సాహిత్యాన్ని అధ్యయనం

చేసినప్పుడు దండోరా సాహిత్యం మొదట చర్చలు, , కరపత్రాలు, వాల్ పోస్టర్లు, సమావేశాలతో ప్రారంభమై తర్వాత కవిత, కథ, నవల, నాటిక, ధీర్ఘ, స్వీయ, జీవిత,వ్యాస,స్మృతి, విమర్శ ప్రక్రియలతో నేడు నిత్యనూతనంగా విరాజిల్లుతుంది. దండోరా సాహిత్య పరిణామ క్రమాన్ని ప్రధానంగా ఐదు దశలుగా చెప్పుకోవచ్చు.

**3.12.1. దండోరా సాహిత్యం - మొదటి దశ :**

ఈ దశలో దండోరా ఉద్యమం, ఉద్యమ నాయకత్వం, ఉద్యమ నిర్మాణం, ఉద్యమ కార్యాచరణ, ఉద్యమ ప్రణాళిక మొదలైన అంశాలు చోటుచేసుకున్నాయి. ఈ దశలో కృష్ణమాదిగ, కృపాకర్ మాదిగ తదితరుల ఆలోచనలతో ఉద్యమానికి సిద్ధాంత నిర్మాణం జరిగింది.

దండోరా ఉద్యమం ఉద్భవించటానికి ముందు డా.ఎండ్లూరి సుధాకర్ మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని నిలదీస్తూ 1993 లో నీలికవిత రాసినారు.ఈ కవిత ఇండియా టుడే వార్షిక సాహిత్య సంచికలో ప్రచిరితమయ్యింది. మాదిగల ప్రత్యేక ఉద్యమ ఆవశ్యకతను చాటి చెబుతుంది ఈ కవిత.

*" కవిత్వం నా కులవృత్తిలోని*
*చర్మతత్త్వ రహస్యం*
*గబ్బిలమా*
*నీ పాదాలకు*
*నా కవిత్వ కొత్త జోళ్ళు తొడుగుతున్నాను"* అంటూ మాదిగ

కవిత్వ చరిత్రకు అంకురార్పణ చేసాడు. నిజానికి 1995 లో దండోరా పేరుతో ఇదే కవిత రాసిన కవితతో దండోరా కవిత్వం ప్రారంభం అయిందనే చెప్పాలి.తర్వాత కాలంలో మాదిగా కతలు, కొత్త గబ్బిలం వంటి కవితా సంకలనాలతో దండోరా వాదాన్ని మరింత బలపరచారు.

**3.12.2.దండోరా సాహిత్యం - రెండవ దశ :**

ఈ దశలో ఉద్యమంలో ప్రజలను చైతన్యపరచి రిజర్వేషన్లు అందరూ

సమానంగా పొందాలనే లక్ష్యాన్ని ప్రజల్లోకి తీసుకుపోవటం. దీనికోసం వివిధ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సంఘాలు ఏర్పాటు, గ్రామాల్లో మాదిగ యువజన సంఘాల ఏర్పాటు, సమావేశాలు, కరపత్రాలు, గోడపత్రాలు, పాటలు మొదలైనవి ఈ దశలో దండోరా సాహిత్యం సృష్టించుకుంది.

తర్వాతి కాలంలో డా.నాగప్పగారి సుందర్రాజు చండాల చాటింపు(1996) ప్రచురించారు.ఇందులో కావ్య నిబంధనల కోసం, కావ్య ప్రయోజనాల కోసం రచయిత పాకులాడకుండా కేవల మాదిగ కులంలో ఉండే తత్వాన్ని కవిత్వంగా చిత్రించాడు.ఇందులో మొత్తం ముప్పై కవితలు ఉన్నాయి. 'మాదిగ కూత' అనే కవితలో మాదిగా తత్వాన్ని రచయిత సృజనీకరించిన తీరు మాదిగ సాహిత్యానికే గొప్ప ఆభరణం లాంటిది.

*" ఉమ్మడి పోరులో*
*కష్ట పడింది ఎవరు ?*
*నష్టపోయింది ఎవరు?*
*లబ్ధి పొందింది ఎవరు ?*
*జరిగిందేదో జరిగిపోయిందనుకుంటే*
*నేను ఒప్పుకోను*
*కాళ్ళమీద పడినా సరే*
*కడుపుచించుకోక తప్పదు*
*కట్టుబానిసలా వెట్టి చాకిరి చేసి*
*నిన్ను అవతలి గట్టుకు చేర్చింది*
*నిజాయితీకి నిలువెత్తు రూపం*
*నా మాదిగ తత్వమే !"* (**చండాల చాటింపు : పుట సంఖ్య :59**)

ఈ కవితలో ఉమ్మడి దళిత ఉద్యమంలో మాదిగలు ఎక్కువగా కష్టపడితే ఫలాలు మాలలు అనుభవించారని పరోక్షంగా రచయిత తెలియజెప్తూనే ఇప్పటికైనా జరిగిందే జరిగి పోయింది ఇకనైనా మేలుకోండి అంటు మాదిగ జాతిని చైతన్య పరచాడు.

**3.12.3.దండోరా సాహిత్యం - మూడవ దశ :**

ఈ దశలో ఇన్నాళ్ళు దళిత సాహిత్యం అనే భావనతో కొనసాగిన మాదిగలు ఈ దశలో మాదిగ సాహిత్యం, మాదిగ రచనలు చేయటం ప్రారంభించారు. ఈ దశలో దళిత సాహిత్యం నూతన అధ్యయనానికి తెరలేపింది. ఈ దశలో ఎంతో మంది మాదిగ రచయితలు ఆవిర్భవించారు. ఇంతవరకు దళిత సాహిత్య రచానా వస్తువులుగా చెలామణి అయిన డప్పు, చెప్పు, ఆరె, గొడ్డుమాంసం మొదలైన అంశాలను మాదిగ రచయితలు దళితులందరివి కావు మావి అనే భావనను తీసుకొచ్చారు.

ఈ దశలోనే సోదర కులాలు అయిన మాల, ఆది ఆంధ్ర కులాల మేధావులు దండోరా సాహిత్యాన్ని ప్రశ్నించటం మొదలు పెట్టారు. తెలుగుసాహిత్యంలో దిగంబర కవిత్వానికి, దళిత సాహిత్యానికి, స్త్రీవాద సాహిత్యానికి ఎలాంటి ప్రశ్నలు మొదలైనవో అవే ప్రశ్నలు మాదిగలపై మాలలు సంధించారు. చిత్రమేమిటంటే ఇన్నాళ్ళు దళిత సాహిత్యాన్ని సాహిత్యంగా నిలబెట్టడానికి పోరాడిన మేధావులు మాదిగ సాహిత్యాన్ని ఇది సాహిత్యమా? దళిత సాహిత్యంలో మాదిగ సాహిత్యం ఎందుకు ? ఏదైనా ఒకటే కదా అనే భూస్వామ్య పదాలతో మాదిగ సాహిత్యాన్ని ప్రశ్నించటం మొదలు పెట్టారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ డా.దార్ల వెంకటేశ్వరరావు గారు "*దళిత సాహిత్యం మాదిగ దృక్పథం* " అనే పుస్తకంలో "మాదిగ సాహిత్యాన్ని సూర్య కిరణాలను చేవలేని మూడు వాదాలనే చేతులతో అడ్డుకోవాలని ప్రయత్నించారు. వాటిని ఇలా విభజించి చూపవచ్చు.

1. సాహిత్యం పేర మాదిగలు రాస్తున్న రాతలు సాహిత్యమే కాదు. వారి కవిత్వం శిల్ప పరంగా లోపభూయిష్టంగా ఉంది.
2. దళిత రిజర్వేషన్ల వర్గీకరణ డిమాండు ప్రచారం చేయడానికి మాదిగ సాహిత్యం పుట్టుకొచ్చింది.
3. మాదిగ సాహిత్యం పేరుతో ప్రత్యేక సాహిత్యం కానీ, ప్రత్యేకవాదం కానీ రావలసిన అవసరం లేదు. ఆ సాహిత్యం, ఆ వాదం దళిత సాహిత్యంలో దళిత వాదంలో అంతర్భాగమే అని వాదించే ప్రయత్నం కనిపిస్తుంది" అని తెలియ జెప్పారు. **(వెంకటేశ్వరావు,దార్ల.దళితసాహిత్యం మాదిగదృక్పథం - పుట:73, సొసైటీ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు. హైదరాబాదు,2008)** ఇలాంటి ప్రశ్నలకు సాహిత్యదాడులకు సమాధానం చెప్పుకోవటం, నూతన సాహిత్యాన్ని సృష్టించుకోవటం ఈ దశలో జరిగింది. ఈ దశ మాదిగ సాహిత్యంలో చెప్పుకోదగినది.

### 3.12.4.దండోరా సాహిత్యం-నాల్గవ దశ :

ఈ దశలో సాహిత్యంలో నిలదొక్కుకున్న తర్వాత కవిత్వం నుండి కథలు, నవలలు, ధీర్ఘకావ్యాలు ఇలా ఎన్నో రచనలు చేశారు. ఈ దశలోనే కొన్ని మాదిగ పత్రికలు(మాదిగ, చమర్ డెమోక్రసీ, జంబూద్వీపం), రావటం జరిగింది. ఈ దశలోనే మాదిగ నాయకత్వంలోను కొంత విభేధాలు ఏర్పడ్డాయి.

### 3.12.5.దండోరా సాహిత్యం - ఐదవ దశ :

ప్రస్తుతం దండోరా సాహిత్యంలో జరుగుతున్న దశ ఐదో దశగా చెప్పుకోవచ్చు. ఈ దశలో ముందు దళిత సాహిత్యమా? లేక మాదిగ సాహిత్యమా అనే శాస్త్రీయబద్ధమైన చర్చ కొనసాగుతుంది. ఆ కోణం నుండే దళిత సాహిత్యాన్ని పునర్మూల్యాకనం చేయటం ప్రారంభించారు. ఈ దశలో దళితులు వేరు మాదిగలు వేరు, మాదిగలకు కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయని తెలియజెప్పటం, ఇప్పటి వరకు వచ్చిన దళితసాహిత్యం అంతా మాదిగ

సాహిత్యం అనే నూతన వాదాన్ని బలపర్చటం, దళిత సాహిత్యంలో అంతర్భాగం మాదిగ సాహిత్యం కాదు, మాదిగసాహిత్యంలో అంతర్భాగమే దళిత సాహిత్యం అనే భావాన్ని బలపర్చటం, అంతేకాకుండా సాహిత్య, సామాజిక శాస్త్రాల సమన్వయంతో మాదిగల సంస్కృతీ, సంప్రదాయాలను శాస్త్రీయబద్ధంగా అధ్యయనం చేయటం జరుగుతుంది.

మార్క్సిస్టు, సంప్రదాయ సాహితీ కారుల స్థానాలలో దళిత సాహితీకారులుగా చెలామణి అవుతున్న మాలసాహితీ కారులు నిలబడితే, అప్పటి దళిత సాహితీకారుల స్థానాలలో మాదిగసాహితీ కారులు నిలబడటం జరిగింది.(**వెంకటేశ్వరావు,దార్ల. దళితసాహిత్యం-మాదిగదృక్పథం-పుట:73,సొసైటీ అండ్ ఎద్యుకేషన్ ట్రస్టు. హైదరాబాదు, 2008**).

**దళిత సాహిత్యంలో అంతర్భాగంగా వచ్చిన మాదిగ సాహిత్యం ఇప్పుడు మాదిగా సాహిత్యాన్ని ప్రశ్నించే స్థాయికి ఈ దశలో చేరుకుంది.దీనికి ఉదాహరణే ఈ కింది కవితలు.**

"కావడి కుండల్లా కలిసుందాం
అన్నదమ్ముల్లా విడిపోదాం
అన్నవాళ్ళవే
ఇంగితజ్ఞానం
ఇంగ్లీషు జ్ఞానం ఉన్న వాళ్ళవే
బుద్ధి స్టులు పచ్చి టెర్రరిస్టుల్లా మాట్లాడుతున్నారు

(**సుధాకర్ ఎండ్లూరి.కువ్వ ; దప్పోళ్ళ, రమేష్. పుట : 49**)

మన కాలపు అతి పెద్ద అస్తిత్వ ఉద్యమం అయిన తెలంగాణ ఉద్యమాన్ని సమర్ధిస్తూ ఎవరి ఉనికి వాళ్ళు కాపాడుకోవాలనే విషయాన్ని సమర్థిస్తూ " కావడి కుండల్లా విడిపోదాం– కావడి బద్ధలాగా కలిసి ఉందాము" అని సమర్ధించిన

దళిత బహుజన మేదావులు అదే కావడి కుండల సిద్ధాంతాన్ని ఇక్కడ ఎందుకు ఆచరించలేదు అని కవి అభిప్రాయం.

“ అణచి పెడుతున్న పాదాలకు
చెబితేనే కదా
పోగొట్టుకున్న దాన్ని దక్కించుకునేది
ఉద్యోగాలన్నీ వాడివి
ఊడిగమంతామనది
ఇంగ్లీషు వాడిలా
లవంగాల దొంగ కాదు మనవాడు
నోటికాడి ఎంగిలి గిన్నె లాక్కొనే ఎంగిలి దొంగ ...

**(దగ్గుపల్లి ఎజ్రాశాస్త్రి: పుట సంఖ్య : 99)**

“ ఎవరూ ఎద్దేవా చెయ్యనక్కర్లేదు
మాదిగ సంస్కృతీ అంటూ
భావజాలం మీద బ్రతికే
దిక్కుమాలిన పరాన్నభుక్కును కాదు

**(కువ్వ : కొండెపోగు బి. డేవిడ్)**

“కాళ్ళు చేతులు నరకబడిన
కారంచేడువు నువ్వైతే
గుండె పగిలిన చుండూరుని నేను
జూలై పదిహేడో ... . ఆగస్టు ఆరో

ఎప్పుడైతేనేమి ,_ _ _ వంతులవారీగా

బకాసురుల ఆకలికి

బలవుతూనే ఉన్నాం_ _ _

మన మధ్య మిగిలింది

పంచుకోవాల్సిన వాటాలే కాదు

ఇద్దరం కల్సి పూడ్చుకోవాల్సిన

గాయాల లోయలున్నాయి

ఏ విశేషణములేని పల్లె చూపులతో

చెరిపివేయాల్సిన ఎల్లలున్నాయ్

పదా _ _ _ ఆ వగలమారి గద్దముక్కు పిండి

కోటి ముక్కలైనా సరే రొట్టెముక్కను

లెక్క ప్రకారం పంచుకుందాం

దళితమాత కనుబొమ్మల్ని

విడదీసే కుంకుమ చెట్టుని

కూకటి వేళ్ళతో పెకలిద్దాం"

**(కోయి,కోటేశ్వరరావు. పుట సంఖ్య: 67)**

"వెలి కొలనులో వికసించిన

పంక నిర్మగ్న నల్ల కలువల్లారా

మనకు పోరాటాలు కొత్త కాదు

అంటరాని తనపు గాయాలు

బాధామయ తీపి సలపరాలు కొత్తకాదు

- - - - - - - - - - - - - - - - -.

- - - - - - - - - - - - -..

పోయిన హక్కుని పొందేందుకు
ప్రాణాల్ని సైతం సమిధలుగా సమర్పించుకుందాం
ఎలాగైనా చేసి ఎ, బి, సి, డి లు సాధించుకుందాం

---------------.

చెప్పులు కుట్టిన చేతులే
చరిత్రను తిరగరాయగలవనే నినాదాన్ని
నయవంచకులకు నిరూద్దాం !

**(గరికపాటి మణీందర్, పుట సంఖ్య : 70)**

"రిజర్వేషన్ల అన్నం గిన్నెలో

అగ్నిపర్వతం బద్దలవ్వాలి
59 ముక్కలను సప్పలను
సమానంగా ఏరుకొని తినాలి **(గుడిపల్లి,నిరంజన్. పుట సంఖ్య : 73)**
"అమ్మో
ఈ చప్పుడు మునుపటిలా లేదు
నిశ్శబ్ధం పగుళ్ళలచ్ నులివెచ్చటిశ్వాసలు
కొమరయ్య కొమరవెల్లి మల్లన్నలా వున్నాడు
ఇకముందు కొమరయ్య డప్పు
బుల్లి కొమరయ్య భవిత్యాన్ని పాడుతుంది కాబోలు"
**(యన్. గోపి, పుట సంఖ్య : 103)**

"పొగచూరిన బతుకుల్లో ఎడతెగని తండ్లాట
ఎంతకూ తెల్లరదేందని
దండెం మీది రామసిలుకలు అడుగతయి

పొట్టకొట్టినడే
కలిసుందామని
నాలుగుబాటల కాడ వగలపడుతుంటడు
పగిలిన డప్పు మాత్రం
వశంకాని దు:ఖాన్ని
రింగ్ టోన్ గా పలికిస్తది ( **రవీందర్, పసునూరి: పుట సంఖ్య: 105**)

"మను వాదులెవ్వరో
మన వాదులెవ్వరో
ఈదుముడి ఉద్యమం
దశాబ్ధాలుగా కోడైకూస్తుంది
వినబడలేదా డప్పుల చప్పుళ్ళు
కనబడలేదా ఆత్మాహుతుల అనవాళ్ళు
అంబేద్కరిస్టులారా !
మాలో భలిస్టులారా !
నిత్య కవితా గోష్ఠులారా !
రిజర్వేషన్ పూదోటలో
విరగబూసిన విద్యాసంపన్నులారా
న్యాయం పలుకలేని నాలుకలకు
అక్షరాలు ఆవిష్కరించే హక్కు లేదు
ఆలోచించండి! (**బద్దిపూడి జయరావు ;పుట సంఖ్య : 114**)

"పోగొట్టుకున్నదేదో తెల్సాక
పోరాటం అవుదామా ---?

రావల్సిదంతా
అణపైసల్తో లెక్కకట్టాం
సంపాదించుకున్నదంతా
కువ్వకువ్వలుగా
పోగులేసుకొని
పంచుకున్న సంస్కృతికదా మనదీ
కలిసి కష్టాల్ని పంచుకోవడమే
నిజమైన ఐక్యతుంటె ఒప్పుకోవెందుకో...
సోదరా **( సైదులు ఐనాల పుట సంఖ్య : 139)**

"మావాళ్ళే
మాలో వాళ్లేనని నమ్మాం
అంబేద్కర్ బొమ్మ పెట్టుకున్నారు కదా
దోపిడి చెయ్యర్లే అనుకున్నాం
కలిసి పోరాడదాము అన్నప్పుడల్లా
కలిసి పంచుకుందాం అంటున్నారని బెమపడ్డాం "

**(కృపాకర్ మాదిగ, పుట సంఖ్య:152)**

" మీలాగే మేము
మాకు రావాల్సినయన్నీ మాకియ్యమని
మా సోదరుల్తో పోరాడుతున్నళ్ళమేనండి
ఏదో బతుకుతెరువెతుక్కొంటూ
- - - - - - - - - - - - - - - - - - - - - - - - - - - - - -
- - - - - - - - - - - - - - - - - - - -
- - - - - - - - - - - - - - - - - - - -

మీకు మాకు సేలా యుసయాల్లో పోలికలున్నాయండీ
నిజ్జానికి మనిద్దరిదీ
ఉమ్మడి తెచ్చిన తంటాలేనండి
మనమిద్దరమిప్పుడు **(వెంకటేశ్వరరావు, దార్ల, పుట సంఖ్య: 96)**

పై కవితలన్నింటి సారాంశము మొత్తం కుడా మేము మా వాటా మాకు కావాలి,మాబ్రతుకు మేం బ్రతుకుతాం, మా జీవితాలపై మీ పెత్తనం ఏమిటి అన్న ధోరణిలోనే సాహిత్య రచన కొనసాగింది.

**మాదిగ కవిత్వంలో కనిపించే ధోరణులను కింది విధంగా విశ్లేషించవచ్చు:**

1. కులాన్ని ఆధారంగా చేసుకొని చూపే వివక్షను స్పష్టంగా ఖండిస్తూ మాదిగకవిత్వం వస్తుంది.
2. దళితులలో సమైక్యత పేరుతో జరుగుతున్న మోసాన్ని బయట పెట్టే ప్రయత్నం చేస్తుంది మాదిగ కవిత్వం
3. తమకు రావాల్సిన హక్కులను హరించి వేస్తున్న వారిని నిరసిస్తూనే తమ హక్కులను కాపాడుకోవాలనే స్వరం మాదిగ కవిత్వంలో ప్రధానంగా కనిపిస్తుంది.
4. తమ చరిత్ర సంస్కృతులలో గల ప్రత్యేకతను మాదిగ కవిత్వం వర్ణించగలుగుతుంది.
5. నిజమైన అంబేద్కరిజాన్ని మాదిగ కవిత్వం వివరించగలుగుతుంది.
6. దళితులందరికి (అన్ని ఉపకులాల) సమాన హక్కులు లభించాలనేది మాదిగ కవిత్వం ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది.
7. దళితులను విభజించడానికి లేదా చీలిపోవడానికి వారిలో శత్రువైరుధ్యాన్ని పెంచడానికి కాకుండా చారిత్రక వాస్తవాన్ని వివరిస్తూ ఈ దళితులలోని అన్ని ఉపకులాలకు ఉండే ఆస్పృశ్యత లేదా అంటరానితనం అనే వివక్ష అందరికీ ఉందని అయినా ఆ వివక్ష దళితుల్లోని కొన్ని ఉపకులాల వారు

మరింతగా అనుభవిస్తున్నారని మాదిగ కవిత్వం స్పష్టం చేసింది.

8. మాదిగ కవిత్వం వచ్చిన తర్వాత వివిధ అణగారిన కులాల వారు కూడా తమ ప్రత్యేక సమస్యలను వర్ణిస్తూ కవిత్వం రాశారు. గిరిజనులు,బి.సి లు మాదిగ కవిత్వ ప్రేరణతో తమ ప్రత్యేక సమస్యలను వర్ణించటం జరుగుతుంది. ఆ విధంగా అణచివేతకు గురికాబడుతున్న అన్ని కులాల వారిని చైతన్యం చేయడంలో మాదిగ కవిత్వం చెప్పుకోదగిన పాత్ర వహిస్తుంది.

9. మాదిగ కవిత్వంలో వృత్తి పట్ల గౌరవం పెంచుతూ తమ సాంస్కృతిక ఔన్నత్యాన్ని కాపాడుకుంటూ ఆ పారిభాషిక పదాలను సాహిత్యానికి పరిచయం చేసింది. ఆవిధంగా తెలుగుభాషకు కొత్త పదాలను పరిచయం చేసినట్లయింది.

ఇంతటి విశిష్టతను కలిగిన దండోరా సాహిత్యం కేవలం మాదిగలకు మాత్రమే చైతన్యాన్ని కలిగించకుండా, బిసి ఉపకులాలకు, గిరిజన ఉపకులాలకు అస్తిత్వ ఉద్యమ తీరును నేర్పించి అస్తిత్వ సాహిత్యాలకు ఉండవల్సిన కొన్ని ప్రతిపాదనలను చేసింది. ఈ ప్రతిపాదనలన్నీఆయా కులాల ఆధారంగా, వారి జీవన విధానాల ఆధారంగా ఆపాదించుకునే అవకాశం ఉంది.

**3.13.దండోరా సాహిత్యం ప్రతిపాదనలు :**

1. దండోరా ఉద్యమ స్ఫూర్తితో మాదిగలు తమ పేర్ల చివర పై నాలుగు వర్ణాల మాదిరే తమ కులం పేరు పెట్టుకొనడాన్ని హిందూత్వం అని తమపై రుద్దిన మాదిగ కులాన్ని అంగీకరించడమని, అది కులనిర్మూలనకు ఆమరణాంతరం పోరాటం చేసిన అంబేద్కర్ ను అవమానించడమేనని మాలమహానాడు వారు ఆక్షేపిస్తారు. వర్గీకరణ వ్యతిరేకోద్యమానికి మాలమహానాడు అని తమ పేరు స్వయంగా వారే పెట్టుకుని మాదిగలు అంబేద్కర్ ని అవమానిస్తారు అని మాలలు అనడం వెగటు కలిగించే

ఆక్షేపణ. సరే, వీరి ఆక్షేపణ ఎలా ఉన్నా, కుల నిర్మూలన జరగాలంటే ముందు కుల బాధితులు కులం నుండి బయట పడాలి. అలా, బయటపడాలంటే ముందే కూరుకు పోయిన కుల ఊబి అనే సమస్యలో నుండి బయటపడడం జరగాలి. పేరు చివరన మాదిగను చేర్చుకోవడం అనేది కులతత్వంపై తిరుగుబాటుకు సూచన. కుల ఊబి నుండి బయట పడేందుకు వేసిన తొలి అడుగు.

2. వర్గీకరణతో దళితుల సమస్యలన్నీ తీరిపోవు. అయితే వారి సమస్యల పరిష్కారంలో అది మొదటి మెట్టు. రాజ్యాంగం దళితులకు కల్పించిన అవకాశాలను దళితులలోని దళితులు అందుకోవాలంటే అవసరమైతే క్రిమిలేయర్ విధానాన్ని కూడా పాటించాలి.

3. విద్యా రంగంలో సంస్కరణలు తెచ్చి ఆధునిక ఉమ్మడి విద్యను అందరికి అందించాలి. అది జరగనంతవరకు అగ్రకులాల మధ్య, అణచివేతకు గురికాబడిన కులాల మధ్య ప్రతిభాపాటవాల అంతరాలదొంతరలు కొనసాగుతూనే ఉంటాయి గానీ వాటికి అంతం ఉండదు. పైగా దళితులు సామాజికంగా వెనుకబడిన, ఇతర వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ల రూపంలో ఎన్ని రాయితీలు కల్పించినా వాని లక్ష్యం నెరవేరదు.

4. ప్రభుత్వరంగంలో ఉపాధి అవకాశాలు అడుగంటి కేవలం ప్రైవేటు రంగంలోనే ఆ అవకాశాలు ఉన్న దరిమిలా ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల డిమాండు సాధనకై దళితులంతా ఉమ్మడి పోరాటం చేపట్టాలంటే వర్గీకరణ సమస్యను పరిష్కరించుకున్నప్పుడే అది సాధ్యమవుతుంది. ఒకవేళ వర్గీకరణ సమస్య పరిష్కారం జరగకుండానే దళితులకు ప్రైవేటురంగంలో రిజర్వేషన్లు కల్పించబడితే అది మాదిగ ఇత్యాది దళితులలోని ఉపకులాలకు సామాజిక అన్యాయ కొనసాగింపే అవుతుంది.

5. రాజ్యాధికారంలో జనాభా నిష్పత్తి ప్రకారం ప్రతి కులానికి భాగస్వామ్యం కల్పించినప్పుడే ఇప్పుడున్న కులరాజ్యం స్థానంలో ప్రజారాజ్యం అవతరిస్తుంది. (**వెంకటేశ్వరావు, దార్ల.దళిత సాహిత్యం మాదిగ దృక్పథం - పుట:78,సొసైటీ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు. హైదరాబాదు,2008**).

తెలుగు సాహిత్య అస్తిత్వాన్నే ప్రశ్నించిన దళిత ఉద్యమం, దళిత సాహిత్యం వచ్చి దాదాపుగా 30 సంవత్సరాలు అవుతుంది. ఇన్నేళ్ళ దళిత ఉద్యమ, సాహిత్య ప్రస్థానంలో ఎన్నో మలుపులు, గెలుపులు, శత్రువైరుధ్యాలు, మిత్ర వైరుధ్యాలు దళితుల మధ్య ఏకీకరణ, వర్గీకరణ ఉద్యమాల ప్రభావంతో వారిలో నెలకొన్న అనైక్యత, దళిత రచయితల్లో వచ్చిన స్తబ్దత ఇలాంటి అంశాలు దృష్టిలో పెట్టుకొని మునుపటి వర్గీకరణ కంటే కొంత ముందుచూపుతో నూతనవర్గీకరణకు కొంత మేధావులు మార్గాన్ని చూపారు, వారు చూపిన వాటిలో ప్రధానమైనవి,

వర్గీకరణ అంశంపై దాదాపుగా 20 సంవత్సరాలుగా వర్గీకరణ కోసం పోరాడుతున్న మాదిగల ఆత్మగౌరవ నినాదం ఎంతో మంది బలహీన వర్గాల్లో చైతన్యాన్ని నింపిందనటంలో ఎటువంటి సందేహం లేదు. పైన తెలిపిన వర్గీకరణ పరిష్కార మార్గాలలో ఎన్నో ఉత్తమమైన మేధావుల సలహాలు ఉన్నాయి. వాటిలో ప్రధానంగా జోన్ల ఆధారంగా, ప్రాంతాల ఆధారంగా, జనాభా ప్రాతిపదికన వర్గీకరణ జరగటం వలన అటు మాలలకు, ఇటు మాదిగలకు ఎటువంటి నష్టం ఉండదు. కాకపోతే వర్గీకరణ అన్నది ఆయా రాష్ట్రాల అభీష్టం మేరకు ఉంటుంది కనుక ఇంతకు ముందు తెలిపినట్లు ఇరు వర్గాల మేధావులు సమన్వయ కమిటీల ద్వారా సమస్యను పరిష్కరించుకుంటే అటు మాదిగలకు, మాలలకు ఇద్దరికి రాజ్యాధికార దిశగా పయనించే అవకాశం ఉంటుంది. లేకపోతే ఈ ఇరు వర్గాల ఆధిపత్య పోరులో నష్టపోయి, అంతమొందేది ఇప్పటికి ప్రధాన జీవన స్రవంతికి దూరంగా ఉన్న దళిత ప్రజలు మరియు పూలే, అంబేద్కర్ ఆలోచన విధానాలు మాత్రమే.



# నాల్గవ అధ్యాయం

# ఏకీకరణీయ సాహిత్యం - విమర్శనాత్మక పరిశీలన

# నాల్గవ అధ్యాయం

# ఏకీకరణ సాహిత్యం - విమర్శనాత్మక పరిశీలన

**4.1.పరిచయం:**

భారత రాజ్యాంగం గుర్తించిన ప్రస్తుత షెడ్యూల్డ్ కులాల సంఖ్య 61. ఆంధ్రప్రదేశ్ లో మాల దాని అనుబంధ కులాలు, మాదిగ దాని అనుబంధ కులాలు ప్రధానంగా ఉన్నాయి. భారత రాజ్యాంగ నిపుణులు షెడ్యూల్డ్ కులాల జీవన విధానంలో గల అంతర్యాలను దృష్టిలో ఉంచుకొని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి, షెడ్యూల్డ్ కులాల వారిని ప్రజాస్వామ్యంలో భాగస్వాములను చేయటం కోసం, వారి పట్ల ఇతర కులాల వారు చూపే వ్యతిరేకతను పోగొట్టి భారతీయులంతా సమానులే అనే భావనను కల్పించటానికి వీరికి విద్య, వైద్య, ఉపాధి రంగాలలో 15శాతం రిజర్వేషను భారత ప్రభుత్వం కల్పించింది. ఈ రిజర్వేషను ఫలాల వల్ల చాలా వరకు షెడ్యూల్డ్ కులాల ప్రజల జీవన విధానం మెరుగుపడినా, ఇంకా ఎంతో మంది అణచివేతకు, అవమానాలకు బలవుతూనే ఉన్నారు. భారతరాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు ఇంతవరకు ఉమ్మడిగా అనుభవించిన దళితుల్లో ఒక వర్గం రిజర్వేషన్ల ఫలాలు ఎస్సీలలో ఒక కులం వారే అనుభవిస్తున్నారని తద్వారా రిజర్వేషన్ల అంతిమ లక్ష్యం నేరవేరటం లేదని కనుక రిజర్వేషన్లు వర్గీకరించాలని నూతన వాదం బయలుదేరింది. దీనినే మనం వర్గీకరణ ఉద్యమంగా, దాని ఆధారంగా వచ్చిన సాహిత్యాన్ని వర్గీకరణ సాహిత్యంగా చెప్పుకున్నాం. ఈ వర్గీకరణ వాదం 1994 లో ప్రారంభమైంది.

దళితులుగా ఉమ్మడి ఉద్యమాలు రిజర్వేషన్ల ఫలాలను సంపూర్ణ స్థాయిలో సాధించుకోగలిగామంటే అది ఎస్సీలంతా కలిసి ఉంటేనే సాధ్యం అని, రిజర్వేషన్లు వర్గీకరించటం అంటే దళితులను విడగొట్టడమే అని, ఇది అగ్రవర్ణాల విభజించు పాలించు సూత్రమే కనుక రిజర్వేషన్లు వర్గీకరించద్దు ఉమ్మడిగా ఇప్పటి

ప్రపంచీకరణ ముసుగులో దళితులు భవిష్యత్ ఏమిటి ? అని ఆలోచించుకొని ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్ల కోసం ఉమ్మడిగా పోరాటం చేయాలని అందుకు దళితులంతా కలిసే ఉండాలి అని విడిపోతే ఓడిపోతాం, ఐక్యంగా ఉంటే అలుపెరగని పోరాటాలు చేసి విజయం సాధించవచ్చు అని షెడ్యూల్డ్ కులాల్లో మరో ప్రధాన వర్గం అయిన మాలలు, దాని ఉపకులాల వారు  బయలుదేరారు. వీరి ఉద్యమాన్ని ఏకీకరణ ఉద్యమంగా వీరి సాహిత్యాన్ని ఏకీకరణ సాహిత్యంగా చెప్పుకోవచ్చు. మనం ముందు చెప్పుకున్నట్లు వర్గీకరణ ఉద్యమ సాహిత్యానికి మాదిగ దాని అనుబంధ కులాలు ప్రాతినిధ్యం వహిస్తే, ఏకీకరణ ఉద్యమం, సాహిత్యాలకు మాలలు దాని అనుబంధకులాల వారు ప్రాతినిధ్యం వహించారు. వర్గీకరణ ఉద్యమాన్ని వాడుక భాషలో మాదిరిజర్వేషన్ పోరాట సమితిగా లేదా దండోరా ఉద్యమంగానూ, ఏకీకరణ ఉద్యమ సాహిత్యాన్ని వాడుక భాషలో మాలమహానాడుగా చెప్పుకోవచ్చు.

సమాజంలో ఏదైనా ఒక వాదం గానీ, ఉద్యమం గానీ వచ్చినప్పుడు ఆ ఉద్యమాన్ని, వాదాన్ని సమర్థించేవారు దానికి అనుకూలంగా సిద్ధాంతాలను, వ్యతిరేకించేవారు ప్రతికూల వాదాలను, సిద్ధాంతాలను,చారిత్రక నేపథ్యాలను వెలికితీసేవారు ఉంటారు. అదే సాహిత్యంలో అయితే సమాజంలో వచ్చే నూతన మార్పులకు అనుగుణంగా రచన ప్రక్రియను స్థాపించటమో లేక ఇంతకు ముందే ఉన్న ప్రక్రియలను ఈ ఉద్యమ వాదాలకు అనువర్తించటమో జరుగుతుంది. ఇలా వచ్చే సాహిత్య పరిణామాన్ని వివిధ చర్చలు ద్వారా వివిధ ప్రసంగాల ద్వారా రచయితలు వ్యక్తపరచటం జరుగుతుంది. దీనినే సాహిత్య పరిభాషలో వాద, ప్రతి వాదాలుగా చెప్పవచ్చు. ఇక్కడ ముందు చెప్పుకున్న వర్గీకరణ ఉద్యమం వాదం అయితే ఏకీకరణ ఉద్యమం ప్రతివాదంగా అభివర్ణించుకోవచ్చు.

వర్గీకరణ వాదానికి బాధ్యత వహిస్తున్న మాదిగ, మాదిగ ఉపకులాలు అలాగే ఏకీకరణ వాదానికి బాధ్యత వహిస్తున్న  మాల, మాల ఉపకులాలు రెండు

దళిత సాహిత్యంలో అంతర్భాగమే ఇవి రెండు ఉమ్మడిగానే గతంలో ఎన్నో సామాజిక ఉద్యమాలకు ప్రాతినిధ్యం వహించిన చరిత్ర లేకపోలేదు. కాకపోతే ఈ మధ్య కాలంలో రిజర్వేషన్ల పంపిణీ విషయమై కొంత బేధాభిప్రాయాలు వచ్చాయి తప్ప ఇవి ఎప్పటికీ ఒకటే అన్న సత్యాన్ని మనం ఇక్కడ గుర్తించాలి. అయితే ఈ వర్గీకకరణ, ఏకీకరణ ఉద్యమ సాహిత్యాలు ఎందుకు వచ్చాయో తెలుసుకునే క్రమంలో మొదటగా ఆవిర్భవించిన ఏకీకరణ సాహిత్యం అంటే మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి గురించి అంటే మాదిగల చారిత్రక నేపథ్యం గురించి ఈ ఉద్యమం రావటానికి ప్రధాన కారణాలను, వారి డిమాండుల గురించి ముందుగా అధ్యయనం చేశాం. ఇప్పుడూ ఏకీకరణ సాహిత్యం అనగా మాలమహానాడు ఉద్యమం గురించి,అంటే మాలల చారిత్రక నేపథ్యం గురించి అది వచ్చిన తీరుని వర్గీకకరణ విధానాలను ఎందుకు మాలమహానాడు ఏయే కారణాల వలన వ్యతిరేకిస్తున్నారో అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే ఒక వాదాన్ని అధ్యయనం చేయించి ఉద్యమ స్థితిగతులను నిర్ణయించటం సబబు కాదు. కనుక ఎదైనా ఒక శిబిరంలో సమస్య వచ్చినప్పుడు దానికి సంబంధించిన వాదాలను అధ్యయనం చేయటం సామాజిక బాధ్యత కల్గిన వారు చేసే పని కాబట్టి ఆందులో భాగంగా ఏకీకరణ ఉద్యమాన్ని అధ్యయనం చేద్దాం.

### 4.2. మాల శబ్ధం నిఘంటువు అర్థాలు :

'దళిత' అనే పదానికి ఏయే అర్థాలు నైఘంటిక అర్థాలు చెప్పారో ఇంచుమించు అవే అర్థాలు మాల కులానికి కుడా అవే అర్థాలు ఆపాదించారు. మాల అంటే అంటరానివాడు, చండాలుడు, అంతవాసి, అంత్యజాతివాడు, అంత్యజుడు, కడవాడు, కడజాతి, పంచముడు, ఐదవజాతివాడు, అంత్యయోని, మాల, మాలడు, మాలవాడు, వెలివాడవాడు, వెలివాడు, చండాల జాతి విశేషము, అంత్యవసాయి,అంత్యుడు, అవాచ్యుడు, అస్పృశ్యుడు, కటోలుడు, కడవాడు,

కీకశుడు, జనంగముడు, తోచ, తోటి, దివాకీర్తి, దివాచరుడు, దోహరి, నిషాదుడు, పంచముడు, పుల్కసుడు, ప్లవకుడు, ప్లవుడు, బుక్కసుడు, శ్వపచుడు, శ్వపాకుడు, సురియాళు, సురియాళువు, హరిజనుడు ... మొదలైన అర్థాలను జి.యన్.రెడ్డి తెలుగు పర్యాయపద నిఘంటువులో చెప్పటం జరిగింది.

**4.3. మాలలు నిర్వచనాలు :**

ఈ భారతీయ సమాజంలో ప్రతి కులానికి, ప్రతి మతానికి, ప్రతి ప్రాంతానికి వాటి భౌగోళిక నిర్మాణాని బట్టి కొన్ని లక్ష్య, లక్షణాలను ఆయా కుల,మత,ప్రాంత మేధావులు నిర్ణయించటం జరిగింది. ఆ నేపథ్యంలో మాలలను నిర్వచించుకుంటే,

"భారతీయ సాంఘిక వ్యవస్థలో *ఎటువంటి కులవృత్తికి నోచుకోలేక కేవలం వ్యవసాయ, ఉపాధి కూలీలుగా జీవనం సాగిస్తూ, ప్రధాన జీవన స్రవంతిలో అంటరానితనం ఆపాదించబడి, దళిత జీవన ప్రత్యామ్నాయ సంస్కృతీ ప్రదాతలుగా బతుకు సాగిస్తున్నవారు మాలలు"* గా చెప్పుకోవచ్చు.

**5.4. మాల- అనుబంధకులాల జాబితా:**

భారతరాజ్యాంగం ప్రకారం షెడ్యూల్డ్ కులాలు ఇంతకు ముందు 59 ప్రస్తుతం 61 గా ఉన్నాయి. పత్యేకించి ఆంధ్రప్రదేశ్ లో మాల, మాదిగ,రెల్లి, ఆది ఆంధ్ర కులాలే ప్రధానంగా ఉన్నాయి. వీటితో పాటుగా మాదిగ అనుబంధ కులాలు అయిన గోసంగి, చిందు, డక్కలి, బండ తదితర కులాలు ఉన్నాయి.అదేవిధంగా మాలఅనుబంధకులాలు కొన్ని ఉన్నాయి.

అవి బారికి, బేగరి, మాలదాసు, మాలమాష్టీ, మొహర్త్,తలారి,మాల జంగం మొదలైనవి. కులాలు వేరైనా వీటి సంస్కృతీ సంప్రదాయాల్లో పెద్దగా తేడా ఏమీ ఉండదు, కాకపోతే నిశిత దృష్టితో పరిశీలించినప్పుడు కొద్దిపాటి బేధం మనం గమనించవచ్చు.

❖ ఆది ఆంధ్ర

- ఆది ద్రావిడ
- అనాముక్
- ఆర్య మాల
- అరవ మాల
- బారికి
- శ్యాగర
- చలవాది
- ఎల్లమ్మ వండ్లు
- గోసంగి
- హోలియా
- హోలియా దాసరి
- మాదసి/మాదరి మురువ
- మహర్
- మాల
- మాలదాసరి
- మాలదాసు
- మాల హాన్నయ్
- మాల జంగం
- మాల మాష్టి
- మాల సాలె/నేతకాని
- మాల సన్యాసి
- మన్నె
- మష్టి
- మిత – అయ్యల్ వార్

- ❖ ముండాల
- ❖ పంబాల
- ❖ పంచమ / పేరయ్య
- ❖ సంబ (**మల్లెమాల మాసపత్రిక: పుట సంఖ్య: 56** )

**4.5.మాల మహానాడు పోరాటం – ప్రారంభపరిణామాలు :**

ఎస్సీల్లో ఉన్న 61 కులాలకు చెందిన రిజర్వేషన్లు మాలలు అధికంగా ఉపయోగించుకుంటున్నందున మిగతా ఎస్.సి కులాలకు రిజర్వేషన్లలలో తమ వాటా దక్కడం లేదు కాబట్టి ఎస్. సి రిజర్వేషన్లను ఎ,బి,సి,డి లుగా విభజించాలని డిమాండ్ చేస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి ఆవిర్భవించిందన్న విషయం మనం ముందు అధ్యాయంలో చెప్పుకున్నాం. ఈ ఉద్యమం కేవలం రిజర్వేషన్ వివాదం కారణంగా పుట్టుకొచ్చినప్పటికీ మాదిగలలో ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంచింది. మాదిగల ఉద్యమాన్ని,విస్తృతిని గమనించిన అప్పటి ప్రభుత్వం ఎస్సీల వర్గీకరణ చేసింది. ఈ వర్గీకరణ విధానం సరిగా లేదని, ఈ విధానం వలన షెడ్యుల్డ్ కులాల్లో ఒక్క కులానికి లాభం చేకూరుతుందని మాలలు రిజర్వేషన్ వర్గీకరణ విదానాన్ని వ్యతిరేకిస్తూ మాల మహానాడు పేరుతో పి.వి.రావు అధ్యక్షతన మరో సంఘం ఏర్పాటు చేసారు. దీనికి అనుబంధంగా గ్రామాల్లో అంబేద్కర్ యువజన సంఘాలు, మాల యూత్ అసోసియేషన్స్ ఏర్పాటు చేసుకొని మాలమాహానాడు పేరుతో ఐక్యతా ఉద్యమాలు చేస్తున్నారు. దీనినే సాహిత్య సౌలభ్యం కోసం మాదిగల ఉద్యమాన్ని వర్గీకరణ వాదంగా చెప్పుకున్నట్లే మాలల వాదాన్ని ఏకీకరణ వాదంగా ఈ పరిశోధనలో చెప్పటం జరిగింది.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సుమారు 65 సంవత్సరాల నుండి షెడ్యూల్డ్ ఉపకులాల్లో కొన్ని కులాలు మాత్రమే ప్రధాన జీవన స్రవంతిలో బ్రతుకుతూ, మనుషులుగా గుర్తింపబడి, అన్ని రంగాల్లో సమాన అవకాశాలు పొందుతున్నారు. ఆంధ్రప్రదేశ్ లో అయితే మాలలు అత్యధిక శాతం అన్ని

రంగాల్లో మిగతా ఉపకులాల కంటే ముందున్న మాట చారిత్రక సత్యం. దీనికి కారణాలు అనేకం వాటిని అనేక విధాలుగా వర్గీకరించి వివరించవచ్చు.అవి,

**4.5.1.చారిత్రక కారణాలు:**

చారిత్రకంగా చూసినట్లైతే చరిత్రలో రాజవంశీయుల దగ్గర మాలలు సైన్యాధికారులుగా పని చేయటం, మాలలు కొంత ముందు చూపుతో స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యానంతరం ఎక్కడ అయితే అవకాశాలు దొరుకుతున్నాయో అక్కడ స్థిరపడటం మొదలు పెట్టారు. ప్రధానంగా కోస్తాంధ్ర ప్రాంతాలలో బ్రిటీష్ పరిపాలనలో ఆంగ్లవిద్యను అభ్యసించటం, ఉపాధి కోసం అన్ని పనుల్లో మమేకం అవటం మొదలైనవి. అందువల్ల చరిత్రల్లో రాజుల దగ్గర, సంస్థానాల్లో, సైనికాధికారులుగా మాలలు కీలక పాత్ర పోషించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నట్లు తెలుస్తుంది. ఎప్పుడైతే ప్రధాన జీవన స్రవంతిలోకి ప్రజలు లీనవుతారో వారి జీవన విధానం కూడా అదే విధంగా ఉంటుంది.

**4.5.2.భౌగోళిక వైవిధ్యం:**

వ్యవసాయపరంగా, విద్యాపరంగా, రాజకీయ పరంగా కోస్తాంధ్ర ప్రాంతం అభివృద్ధి చెందింది. ఏదైనా ఒక ప్రాంతం అభివృద్ధి చెందుతుందో అదే విధంగా ఆ ప్రాంత ప్రజల జీవనవిధానం కూడా అభివృద్ధి చెందుతుంది దీనికి కారణం ఆయా ప్రజలకు అన్ని రంగాల్లో అవకాశాలు ఉంటాయి కనుక. అందువలన కోస్తాంధ్ర ప్రాంతంలో మాలలు అధికశాతం ఉండటం వలన మాలలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారు.

ఇక రాయలసీమ ప్రాంతంలో ఒకప్పుడు ఎంతో తేజోవంతంగా ప్రజలు బ్రతికిన ఇప్పుడు ఆ పరిస్థితి లేదు, కారణం ఆ ప్రాంతానికి నీటి సౌకర్యం లేక కరువు కాటకాలతో విలవిలలాడుతుంది. ఇక్కడ దళిత ప్రజలలో ఎలాంటి అభివృద్ధి లేదు.

ఇకపోతే తెలంగాణ ప్రాంతం తీసుకుంటే మిగతా రెండు ప్రాంతాల రాజ వంశస్తుల, బ్రిటీషు పరిపాలనలో ఎక్కువ శాతం పాలించబడితే తెలంగాణా ప్రాంతంలో నవాబుల పరిపాలనలోనూ, దొరల పాలనలో ప్రజల జీవనం సాగింది.

### 4.5.3.సాంస్కృతిక కారణాలు :

సమాజంలో ప్రతి కులానికి, ప్రతి మతానికి ఏదో కొంత సంస్కృతీ, సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు ఉంటాయి. అట్లాగే అన్ని ప్రాంతాల్లోనూ దళితులకు ప్రత్యేక కుల కట్టుబాట్లు, ఆచార సంప్రదాయాలు ఉన్న ప్రత్యేకించి మాల, మాదిగల మధ్య పోల్చి చూచినపుడు కొన్ని వైవిధ్యభరితమైన బేధాలు లేకపోలేదు. వాటిలో ప్రధానంగా చెప్పుకోదగినది గొడ్డుమాంసం తినడం, వాటి చర్మంతో చెప్పులు కుట్టడం, డప్పు వాయించటం తద్వారా అంటరానితనాన్ని మోపి ప్రధాన జీవన స్రవంతిలోకి రానివ్వకపోవటం మొదలైన కారణాలు మాదిగలను అభివృద్ధిలోకి రానివ్వకుండా చేసిన అవరోధాలు. కానీ ఈ రోజు అవే మాదిగ ఉద్యమానికి కాగడాలుగా మారినవి. ఇది మాదిగల సాంస్కృతిక చరిత్రలో గొప్ప మలుపుగా చెప్పవచ్చు.

### 4.5.4.ఆర్థిక కారణాలు:

ఎప్పుడైతే వీరిని సమాజం దూరంగా నెట్టివేయబడిందో మరియు వీరు కేవలం కులవృత్తినే మాత్రమే చేస్తూ జీవనం గడుపుతున్నారో తద్వారా వీరి ఆర్థిక పరిస్థితి కూడా మెరుగుపడలేదు. అందువలన వీరు మిగతా ఉపకులాల కంటే అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని చెప్పవచ్చు.

### 4.5.5.రాజకీయ కారణాలు:

మార్క్స్ అన్నట్లు '*అన్నింటికి ఆర్థిక పరిస్థితులే మూల కారణం*' ఎందుకంటే ఆర్థిక పరిస్థితి బాగా ఉండే వీరు రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించేవారు. ఆర్థికపరిస్థితి బాగా ఉన్నమాదిగల్లో అరాకొర చదువుకున్న మేధావులు కేవలం

వారి స్వార్ధ ప్రయోజనాల కోసం రాజకీయాల్లో వెళ్ళి, మాదిగ అభివృద్ధికి పాటుపడతామని ప్రగల్బాలు పలికి చివరికి వీరి అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నారు.మాల, మాదిగల మధ్య ఎంతో వ్యత్యాసం ఉంది, కాకపోతే అది ప్రాంతాల వారీగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో మాదిగలు ఎక్కువగా ఉంటే, మరికొన్ని ప్రాంతాల్లో మాలలు ఎక్కువగా ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో మాలలు అభివృద్ధి పథంలో ఉంటే, మరికొన్ని ప్రాంతాల్లో మాదిగలు అభివృద్ధి పథంలో ఉన్నారు. అసలు కొన్ని ప్రాంతాల్లో అయితే ఇద్దరు వెనుకబడి ఉన్నారు. ఈ విధంగా దళిత ఉపకులాల్లో కేవలం మాల, మాదిగ అనే కాకుండా మిగతా 59 ఉపకులాల మధ్య కూడా వైవిధ్యం ఉంది. ఈవైవిధ్యాన్ని తొలగించి, అందరికి సమాన న్యాయం జరగాలని, దళితులంతా సామాజిక న్యాయసూత్రానికి కట్టుబడాలని, దళిత సమైక్యత అనేది వర్గీకరణతోనే సాధ్యం అని ప్రభోధిస్తూ ఈ మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి ఏర్పాటు అయింది.

**4.5.6.మాలమహానాడు ప్రధాన లక్ష్యాలు :**

1. దళితకులాలన్నింటికి ప్రభుత్వ రంగాలతో పాటు ప్రైవేటు రంగాల్లో కూడా సమాన హోదా కల్పించడం.
2. దళితకులాల్లో ఉన్న వైవిధ్యాన్ని తొలగించి దళితులంతా ఒక్కటే అని చాటి చెప్పటం.
3. రిజర్వేషన్ విధానం, అది అమలవుతున్న తీరులో ఉన్న లోపాలను గుర్తించి తగిన పరిష్కార మార్గాలు తీసుకోవడం.
4. ప్రాంతాల వారీగా ఉన్న వైవిధ్యాన్ని జనాభా ప్రాతిపదికన గుర్తించి, దానికి అనుగుణంగా రిజర్వేషన్ విధానాన్ని అమలుపరచాలి.
5. దళితుల్లో రిజర్వేషన్ విధానం పట్ల అవగాహన కల్పించటం రిజర్వేషన్లు ఎలా ఉపయోగించాలో గ్రామీణ ప్రాంతాల్లో చైతన్యం తీసుకురావటం
6. దళితకులాలకు సామాజిక హోదాతో పాటు ఆర్ధిక హోదా కల్పించడం.

7. దళిత ఉపకులాలను ప్రధాన జీవన స్రవంతిలోకి తీసుకురావడం మొదలైనవి.

**4.5.7. మాలమాహానాడు వాదనలు:**

1. సమానత్వం అంటే ప్రతి పనిలో సమంగా ఉండటం కాదు, సమాన అవకాశాలుండటమే సమానత్వం
2. రిజర్వేషన్ల వ్యతితిరేకతను, రిజర్వేషన్ల వర్గీకరణను సమంగా చూడటం సబబు కాదు
3. రాష్ట్రాల విభజనను వ్యతిరేకించే వారు రిజర్వేషన్ల వర్గీకరణను ఎలా సమర్ధిస్తారు. అంటే విభజన వల్ల సమాన అవకాశాలు ఉంటాయనేది మీ సిద్ధాంతం అయితే రాష్ట్రాల విభజనను కూడా సమర్ధించాలి కదా ఎందుకు వ్యతిరేకిస్తున్నారు, అంటే మీలో ఏమన్నా స్వలాభాపేక్ష ఉందా ?
4. ఉన్న రిజర్వేషన్లను వర్గీకకరించటం కంటే రిజర్వేషన్ శాతం పెంపునకు ఐక్యంగా పోరాడాలి అంటే ప్రభుత్వ రంగాల్లోనే కాకుండా ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్ అమలకు దళిత కులాలు కలిసి పోరాడాలి.
5. రిజర్వేషన్ల వర్గీకరణ తప్పక జరగవలసి వస్తే ఇప్పుడున్న ఎ బి సి డి గ్రూపులు కాకుండా డి గ్రూపులోని ఆది ఆంధ్రులను సి గ్రూపులోని మాలలతో కలిపి ఎ బి సి గ్రూపులుగా విభజించి అన్ని కులాలకు సమన్యాయం చేయాలి.
6. దళితులకు కుల నిర్మూలన ప్రయోజనకరమా? కుల విభజన ప్రయోజనకరమా ?
7. యస్సీల వర్గీకరణ కుల చైతన్యాన్ని పెంచుతుందా? కుల నిర్మూనలను పెంచుతుందా?
8. వర్గీకరణ వలన మాదిగ కులం, దాని ఉపకులాలకు సమాన అవకాశాలు ఇస్తుందా ?

9. ఐక్యంగా సాధించలేనిది విడిపోయి సాధించేదేముంది?
10. ఉమ్మడి రిజర్వేషన్లే అసమానతలకు ప్రధాన కారణమా లేక అది రిజర్వేషన్లు సరిగా ఉపయోగించుకోకపోవటం దళితుల అసమర్థతగా భావించాలి.......తదితర అంశాలన్నింటికి దండోరా సమాధానం చెప్పాలి.

**4.5.8.మాలలు ప్రధాన లక్షణాలు :**

1. వ్యవసాయ కూలీలుగా ఉండడం
2. దళిత జాతికి ప్రత్యామ్నాయ సమాజాన్ని ఏర్పాటు చేయటం అంటే చేనేత,క్షౌర,రజక వృత్తులు కొనసాగించడం
3. ఎటువంటి కులవృత్తికికి నోచుకోలేక పోవటం
4. పట్టణ ప్రాంతాల్లో వలస కూలీలుగా జీవనాన్ని కొనసాగించటం
5, గ్రామ తలారీలుగా, గ్రామ కాపలాదారులుగా ఉండటం
6. తెలంగాణ ప్రాంతంలో బేగరి (గుంతలు) పనులు చేయటం
7. స్మశాన వాటికలకు దగ్గరగా జీవించడం
8. గ్రామీణ ప్రాంతాల్లో ఎట్టి, దళారీ పనులు చేయటం...... మొదలైనవి.

**4.6. మాలలచరిత్ర – సంస్కృతీ, సంప్రదాయ సాహిత్యాల ప్రస్తావన :**

తెలుగు వారి చరిత్ర గమనిస్తే మాలవారు అత్యంత విద్య సాహసాలు కలవారు అని తెలుస్తుంది. కాకతీయ సామ్రాజ్య చరిత్ర, సాంప్రదాయ, సంస్కృతీల అభివృద్ధికి మాలల సైన్యమెంతో దోహదపడింది. కాకతీయ సామ్రాజ్య విస్తరణకు వీరు అనేక యుద్ధాలు చేసి విజయాన్ని చేకూర్చారు. కాకతీయ సైన్యంలో మాలలను'మొహరి' అని పిలిచేవారు.కాకతీయ రాజైన ప్రతాపరుద్రుని సైన్యాధికారి యుగంధరుడు మాల కులానికి చెందినవాడే.

ఆంత్రోపాలజి ఆధారాల ప్రకారం దక్కన్ పీఠభూమి నుండి మాలలు వలస వచ్చినట్లు తెలుస్తుంది. అంబేద్కర్ లాంటి పరిశోధకుల ప్రకారం మహర్స్ మరియు దాని తత్సంబందిత కులాలైన మాలలు పరాజయం పాలైన

సామ్రాజ్యాలలో యోధులుగా పోరాడి రాజ్యాల నుండి బహిష్కరించబడి అట్టడుగుస్థాయికి నెట్టబడి గ్రామ సేవకులుగా మార్చిన వైనం మనకు కనిపిస్తుంది. పల్నాటి బ్రహ్మనాయుని యుగంలో మాల కులానికి అధిక ప్రాముఖ్యత ఉండేది. చరిత్రలో కమ్మ, రెడ్డి, వెలమలతో పాటు సేనాధిపతిగా చేసిన మొట్టమొదటి మాలయోధుడు కన్నమదాసు. పల్నాటి నుండే మాచర్ల చెన్నకేశవ స్వామి పల్నాడు ప్రాంతంలో కులదైవం అయ్యాడు.

భాతదేశంలో అన్ని కులాలు సాధారణంగా తమకు గౌరవప్రదమైన చరిత్ర ఉందని భావిస్తారు. మాల అనే పదం మైలా(మురికి) అనే పదం నుండి ఉద్భవించింది. దీని అర్థమేనగా పెరియా, విలే, బేస్, చండాలురు మొదలగునవి. మరొక సిద్ధాంతం చారిత్రక ఆధారం ప్రకారం మాల అనే పదం సంస్కృతంలో నుండి మల్లారి అనే పదం నుండి వచ్చినట్లు చెప్పబడింది. మల్ల పదం మల్ల యోధులను లేదా సైనికులుగా సంబోధించేవారు. అయితే పూర్వ కాలంలో ఉత్తర భారత మరియు నేపాల్ రాజవంశాల పరిపాలనలో మల్ల యోధులుగా గుర్తింపు పొందిన వారు ఉండేవారు.ద్రావిడులు కాలంలో మాల అనే పదానికి పర్వతం అని అర్థం ఉంది.

గుఱ్ఱం మల్లయ్య కథ ప్రకారం మాలలు శివుని కుమారుడైన మాల చెన్నప్ప వారసులమని చెప్పబడింది. మాల కులంలో అనేక ఉప కులాలు ఉన్నాయి. అవి బైండ్ల, పంబలా, జంగం, పోతురాజు, మాష్టి, మాలదాసరి/మాలదాసు, మిట్టాలయ్యవారు దండేములు, నేతకాని మాల సాలెలు, మాలజంగం మొదలినవి. తమిళనాడు సాంప్రదాయకారులైన మాలదాసరి/మాలదాసులు తమ సంప్రదాయాలను 9,10శతాబ్దాలలో ఆంధ్రప్రదేశ్ అంతటా విస్తరింపజేశారు. 15 శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయలు వ్రాసిన ఆముక్తమాల్యద లేక విష్ణుచిత్తీయం లో మాలదాసుల కుల వర్ణన కనిపిస్తుంది. శ్రీకృష్ణదేవరాయలు అనంతరం మాలలను బోయ కులంతో కలిపి బందిపోట్లుగా రాశారు. ఆ

కారణంగా ఆ తర్వాతి కాలంలోఆ బందిపోట్లు గ్రామంలోకి చొరబడి దొంగల బెడద నుండి తప్పించుకోవడానికి మాలలను గ్రామకాపరి వారు లేక తలారులుగా నియమించారు. మాలలకు చెందిన బైండ్లు యాజకులుగా పని చేసేవారు. అప్పుడప్పుడు గ్రామాలలో కలరా వంటి మహమ్మారి వ్యాధి వ్యాపించినపుడు గ్రామంలో సేవ చేసేవారు. వారు ఇంద్రజాలం విద్యలో కుడా నిపుణులే. గ్రామాన్ని రక్షించే దేవతకు చిహ్నంగా గ్రామములో ఒక బొద్దురాయిని ఏర్పాటు చేసి గ్రామ దేవతను సంరక్షించే బాధ్యత పంబల పుజారులదే.పంబల నాయకుడు గొర్రెమెడను తన పండ్లతో కొరికి చంపుతాడు. దీనినే “ గొ” పట్టడమ అంటారు. ఆ చనిపోయిన గొర్రె రక్తాన్ని ఒక బెసిన్ లోకి తీసుకొని ఆ రక్తంలో ఎక్కువ మొత్తంలో బియ్యం కలిపి గ్రామ సరిహద్దుల్లో చుట్టు చల్లుతారు. దీన్నే ‘ పొలి చల్లడం’ అంటారు.ఈ పంబల పూజారులే బొద్దురాయిని నిర్మించి పూజచేసి బలులు కుడా అర్పిస్తారు. కొన్ని సంవత్సరాల క్రితం హిందు బ్రాహ్మణ పూజారులు మాలల వివాహాలు, నామకరణం వంటి శుభ కార్యాలకు మాలల ఇండ్లకు రావటానికి సందేహించేవారు. అలాంటి తరుణంలో పూజారులు నిర్వహించవలసిన పనులను పంబలు నిర్వహించారు.పంబలలకు సిద్ధవైద్యం లేక పసరు వైద్యం తెలుసు.జంగాలు సంచారం చేసే పూజారులు. వీరు మాలల దగ్గర నుండి భిక్షమెత్తుకుంటూ రాత్రి సమయాలలో శ్మశాన వద్ద కాపలాగా ఉంటారు. పోతురాజులు అనే మరొక పూజారి వర్గము కలదు. దండేములు అనే మరొక వర్గం జమిందారులకు జీతగాళ్ళుగా ఉండేవారు.

భారత షెడ్యుల్డ్ కులాల్లో 35 వ కులం మాల. అంటరాని జాతులలో ఒక కులమైన మాల వారి ఉనికిని, వారి మూలాల్లోకి వెళ్లి శోధిస్తేగానీ, క్రీ.పూ నుండి మాలల ప్రస్తావన ఉన్నట్టు రూఢి అవుతున్నది. అందుకు రుజువుగా భారతీయ కథాసాహిత్యానికి ఆధారమైన గుణాఢ్యుని బృహత్కథను పరిశీలించినచో ఇందులో *‘మాల కుమారుని కథ’*, *‘మాల కుమారి’* కథలను చదివిన మాలల

తెగువ, వారి శౌర్య పరాక్రమములు, రాజులకు మించిన వీరత్వం బయల్పడిన విధం అబ్బురపరుస్తుంది. గుణాఢ్యుడు ఉదయనుడు అనే రాజు, అతని కుమారుని గాథలను వివరించాడు. బృహత్కథలో, ఆ గాధలను తెలుపుతున్న క్రమంలోనే మాల కుమారుని వృత్తాంతం కథగా చెబుతాడు గుణాఢ్యుడు. చరిత్రలో షోడజ మహజనపదములు కలవు.అందు వత్సరాజ్యము కలదు. వత్సరాజు ఉదయనుడు, మగధను పాలించిన అజాతశత్రువు నలుగురు కుమారులలో ఒక కుమారుడు. వీరి కాలము క్రీ.పూ 493-462. ఆజాతశత్రువు మామా ప్రసేనజిత్తుడు. ఇక గుణాఢ్యుడు శాతవాహన కాలంలో ఒక శాతవాహన రాజుకు మంత్రిగా ఉన్నాడు. అతను రాసిన కావ్యం లక్ష శ్లోకాల బృహత్కథలో ప్రసేనజిత్తుని కూతురును మాల కుమారుడు వివాహమాడినట్లు చారిత్రకాధారములు ఉన్నట్లు భూతం ముత్యాలు మాలవారి చరిత్రలో తెలియజేశాడు. మాల కులం త్యాగపూరితమైన కులం మహర్లు పరయల కంటె జనాభా ఎక్కువ ఉన్నకులం. దక్షణ భారతంలో మాల అనుబంధ కులాలది ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ లో నేడు అతిపెద్ద కులం మాలలే. నాడు అగ్గిపెట్టెలో 6 గజాల చీరని మడిచి మోటుపల్లి రేవు గుండా రోమ్ నగరానికి పంపింది పలనాటి మాలలే. కన్నమదాసు కత్తికి అంబేద్కర్ కలం కి వారసులు మాలలే. కళింగయుద్ధ యోధులు మాల మాస్టీనులే బౌద్ధంలోకి మధ్య ఆసియా ఇండియా నుండి బౌద్ధమత ప్రచారకులుగా కమ్మలు(ఉత్తరాలు)మోసింది, వజ్రయాన బౌద్ధ బిక్షువులైన మాలలవే. బౌద్ధరాజులు మాలలే. బుద్దుడి రథసారధి చెన్నుడు మాలే. చెన్న పట్టణం(చెన్నై) కి పునాది రాయి కట్టిన తాపిమేస్త్రీ చెన్నుడు మాలే. చరిత్రలో చార్వాకులు జాబాలి మాలలే మొదటగా సమాజంలో స్వేఛ్ఛ కోరిన ఏకైక జాతి మాలలే. వీరశైవులుగా స్మశానంలో ఉంటూ కులనిర్మూలన ఉద్యమ రథసారథులుగా నిలిచింది మాలలే. తిరుమల పెద్దమాల వెంకటేసుడు, దేవరగట్టు మాల మల్లేశుడు, శ్రీశైల మల్లేశుడు, మాచెర్ల చెన్నకేశవుడు,

జాంబపురాణపు చెన్నుడు, మాల కులదైవం వీరభద్రుడు.కాలభైరవుడు, పోతురాజులు మాలలే.

పురాణాలలో సత్యహరిశ్చంద్రుని గాధ అందరికి తెలిసిందే. సత్య హరిశ్చంద్రునికి విశ్వామిత్రుని వలన ఆపద సంభవించినప్పుడు అతన్ని ఆదుకున్నది వీరబాహుడు. ఇతను మాల కాటికాపరి.ఒక కాటికాపరి రాజును ఆదుకోవడం అంటే మామూలు విషయం కాదు. అలా ఆదుకునే దయాగుణం అంటరాని జాతులకే దక్కుతుంది. కుట్రలు, కుతంత్రాలు, మోసాలు ఎరుగని జాతి,కనుకనే మధ్య యుగాల్లో జరిగిన పలనాటి వీరచరిత్రలో మాలకన్నమనీడు సైతం చరిత్ర ప్రసిద్ధికెక్కాడు..... ఇలా చెప్పుకుంటూ పోతే మాలల చరిత్ర అద్వితీయమైనది, అనిర్వచనమైనది.

కేవలం చరిత్రలోనే కాకుండా ఆధునిక కాలంలో అస్పృశ్యత నివారణ ఉద్యమం జరుగుతున్న సమయంలో కుడా దళితులు అంటే మాలలు అనే భావనతో సాహిత్యం వచ్చింది. గురజాడ అప్పారావు 1910 సంవత్సరంలో 'లవణరాజుల కల' గేయంలో మాలల ప్రస్తావన చెప్పాడు.

*"మలిన వృత్తులు మాలవారని*
*కులము వేర్చిన బలియు రొక దే*
*శమున కొందరు వెలికి దోసిరి మలినమే, మాల*
*కులము లేదట వొక్క వేటున*
*పసరముల హింసించు వారికి*
*కులము కలదట నరుల వ్రేచెడి క్రూర కర్ములకున్*
*మలిన దేహుల మాల లనుచును*
*మలిన చిత్తుల కథిక కులముల*
*నెల వొసంగిన వర్ణ ధర్మ మ ధర్మ ధర్మంబే"* అని ప్రశ్నించాడు. అంటే బలము కలిగినవాళ్ళు మలినవృత్తులని మాలలను విడగొట్టారని మలినత్వమే

మాలకాని మనుష్యులు కాదని తెలియజేశాడు. జాతి ధర్మంగా పశువులు నరికిన వారికి కులము లేకుండుట, క్రౌర్యముతో మానవుల హింసించేవారికి కులము కలుగుట అన్యాయమని దేహ మలినం కలిగినవాళ్ళను మాలలని, మలిన హృదయులను అధిక కులముల వారు అనటం అన్యాయమని చక్కగా చెప్పారు.

తెలుగులో సంప్రదాయ సాహిత్యం రాజ్యమేలుతున్న సమయంలో భాష,భావం ఒక వర్గ సంపదగా చెలామణి అవుతున్న తరుణంలో మాలల విషయాన్ని ప్రస్తావిస్తూ ప్రతి వాడు మాల మాల అని పదే పదే దూషిస్తారు ఎందుకు మాల మీ హారమే కదా మాన్యులారా అంటు ఎంతో చమత్కారంగా తెలియజెప్పాడు.

*"మాల యనుటలో నీచార్థమేల మీకు ?*
*మలయనినంత మీకేల భయము కల్గు ?*
*మాల మీ హారమే కదా ? మాన్యులారా ?*
*అట్టి మాల తిరస్కారమాదరింప?"*

**(కర్ణ వీర నాగేశ్వరరావు:అస్పృశ్యుల విజ్ఞప్తి: 1936)**.

ఇదే విధంగా ప్రముఖ సంప్రదాయ దళిత కవి మాలల ప్రస్తావాన్ని ఈ విధంగా తెలియజెప్పాడు.

*" మాలమాలని చాలా తూలనాడి మమ్ము*
*అంటరాదని గెంటుతారు*
*ఆసుపత్రి మందులడుగుతారు*
*మాల మందులు చాలా తాగేరు*
*మాల చనుబాలు మందుకదిగేరు*
*మాల పొత్తులేక ముసలలేరు*
*మామేలు మొప్పుపొంది మేకై తిరుగుతారు"*

**(ధర్మన్న,కుసుమ.మల్లెమాల : పుట : 22 )**

అదేవిధముగా క్రీ.శ.16 శతాబ్దానికి చెందిన సామాజిక కవి వేమన ఆనాటి సాంఘిక అసమానతల్ని ప్రశ్నిస్తూ మాలలను అస్పృశ్యత పేరుతొ ఏవిధంగా ఈ సమాజం అణగదొక్కబడిందో తెలియజేశాడు.

"మాల వాని నేల మరి మరి నిందింప
నొడల రక్తమాంసమెకటి గాదె
వానిలోన మెలగు వాని కులంబేది
విశ్వదాభిరామ వినురవేమ''

ఈ సమాజంలో చాతుర్వర్ణ వ్యవస్థ మాలలను అస్పృశ్యులుగా చేసిందని మానవుల రక్తమాంసాలు ఒకటేనని,కాని సవర్ణుల ప్రవర్తన వల్ల మనుషులు మాలవాల్లయ్యరని వానిలోని కులం కన్నా గుణం గుర్తించాలి అంటాడు కవి.

"మాల మాలగాడు మహమీదనే ప్రొద్దు
మాట తిరుగువాడు మాలగాక
వానిమలయన్న వాడెపోపెనుమాల
విశ్వదాభిరామ వినురవేమ''.

కులం కారణంగా మాలలు అస్పృశ్యులు కాదని ఆ మాలలను మాల అన్నవాడు , ఆడిన తప్పువాడు ఖచ్చితమైన మాల వాడంటాడు కవి.

తుమ్మలసీతామూర్తి చౌదరి గారు "అస్పృశ్యతా నిర్మూలనము'' అనే దీర్ఘ పద్యంలో మాలల ప్రస్తావించినట్లు దళిత కవిత్వం – పరామర్శ గ్రంథంలో డా.కె.లక్ష్మీనారాయణ తెలిపారు.

*" మాలలనంటారాదుకనుమాలపు జాతి యటంచు వారినీ*
*లీల బహిష్కరించి మతిలేక దురాత్ములు దక్షిణాఫ్రికా''*

**(దళిత కవిత్వం- పరామర్శ;పుట సంఖ్య : 22)**

భారతదేశంలో వేల సంవత్సరాలుగా అస్పృశ్యతకు గురవుతున్న దళితుల గురించి మాట్లాడకుండా దక్షిణాఫ్రికాలో నల్లజాతీయులను గురించి

విచారించటం హాస్యాస్పదంగా ఉందని రచయిత ఎద్దేవా చేసారు. ఇదే గ్రంథంలో కె.లక్ష్మినారాయణ గారు పురిపండా అప్పలస్వామి రాసిన మరో కవితను ప్రస్తావించారు.ఇది జూన్ మాసంలో 1933 ఆంధ్రభూమి పత్రికలో ప్రచరితం అయినట్లు తెలియజెప్పారు.

"మాల పెట్టిన నేల మాలపెట్టిన నీరు
మాల పాడిన పాట మాలలాడిన మాట
మైల వడెనంటారు పనికిరాదంటాడు"

**(దళిత కవిత్వ పరామర్శ:పుట సంఖ్య:26)**

ఈ కవితలో దేవుని స్తుతిస్తూ నా పాద పూజకు తెచ్చిన పూలు,నీళ్ళు,పనికిరావంటాడు.మాలవాడు నీరు, నెల పాడిన పాట,మాట్లాడిన మాట మైల పడిందంటారు.

గరిమెళ్ళ సత్యనారాయణ 'జ్ఞానోదయం' అనే గేయంలో

*" ఇన్నాళ్ళు మాల్లోల్లమంటూ మీది మీది కెగిరి పడకుండయ్య మీరు*
*కన్నతండ్రి గాంధీ కళ్ళు విప్పేశాడు కనుక్కోండి మీరు మేమొకటే"* **(దళిత కవిత్వ పరామర్శ; పుట సంఖ్య:26)** అని ప్రస్తావిస్తూ కె.లక్ష్మీనారాయణ గారు గరిమెళ్ళ సత్యనారాయణ *'ఎటువంటి మాలలు'* లాంటి కవితా ఖండికలు రాసినట్లు తన దళిత కవిత్వం పరామర్శ అనే గ్రంధములో తెలియజెప్పారు. అంటే గాంధీజి దళిత ఉద్యమం మొదలైంది దళితులూ సవర్ణులతో సమానం అని కెబుతూ గాంధీజి ప్రారంభించిన దళిత ఉద్యమాన్ని తెలియజెప్పాడు.

అదేవిధంగా నెల్లూరు వెంకటరామానాయుడు రాసిన ' హరిజనులు' అనే కవిత్వంలో మాల, మాదిగల ప్రస్తావన ఉంది.

*'మాల మాదిగల వారమండిమమ్ము*
*చాలగ ప్రేమించి పాలింపరండి*
*కూలిజేసెడి వారమండి ఎండ*

*గాలి వానలనకమే ప్రొద్దునుండి'* **(దళిత కవిత్వం పరామర్శ; పుటసంఖ్య:27)**

అదేవిధంగా బసవరాజు అప్పారావు రాసిన ' మాల మాదిగల యొర' అనే కవితలో కుడా మాలమాదిగల ప్రస్తావన ఉన్నట్లు లక్ష్మినారాయణ తెలియజెప్పారు.

*"మాలమాదిగలం మనుషులంగామా*
*కుక్కలకన్నా తక్కువయ్యామా*
*మామోరాలించ – సామీకెదిక్కు"* **(దళిత కవిత్వం పరామర్శ;పుటసంఖ్య:27)**

ఈ కోవలోనే జాలా రంగస్వామి గాంధేయ దృక్పథంతో 1930 లో 'మాలశుద్ధి' అనే దీర్ఘకావ్యాన్ని రచించాడు. అలాగే వెంకట పార్వతీశ కవులు తన కావ్యకుసుమావళి ప్రథమ భాగం ద్వితీయశ్వాసం సంపుటిలో మాలల ప్రస్తావన తెలిపినట్లు డా.కల్లూరి ఆనందరావు తెలియజేశాడు.

*"మమత దప్పినయతడు మాలగాక*
*మాటదప్పిన యతడు మాలగాక*
*అన్నెమును బున్నెమెరుగని యట్టిమాల*
*మాలయే!దేవుయెడబూలమాలగాక"*

**(హరిజనాభ్యుదయం ఆదునికాంధ్ర కవిత్వం; పుట: 3)**

అదేవిధంగా మరో కవయిత్రి తెరేసాదేవదానం. ఈమె 'అంటరానితనం' అనే ఖండ కావ్యంలో మాలల ప్రస్తావన తెలియజేసినట్లు దళిత కవిత్వం పరామర్శ గ్రంథంలో పేర్కొన్నారు.

"ఈ మాలలకేంలేదురా అంటురా
మాల పేరు వలన మనిషేమో అంటురా
చోద్యంబు కాదురా శోధించి చూడరా

స్వార్థమేనంటిరా సాగదింకంటిరా'' ( **దళిత కవిత్వ పరామర్శ: పుట సంఖ్య:129**)

అదేవిధంగా ప్రముఖ సంఘసంస్కర్త, స్వాతంత్ర్యయోధుడు, తెలుగు నవల సాహిత్య వైతాళికుడు అయిన శ్రీ ఉన్నవ లక్ష్మినారాయణచే 1922 లో తెలుగులో రచించబడిన *'మాలపల్లి' (The Village of Untouchable)* నవల ఆంధ్రప్రదేశ్ లో కులవర్గ దృక్పథంతో వెలువడిన తొలి అభ్యుదయ కావ్యం. అంతేగాకుండా మాలపిల్ల అనే పేరుతో గూడవల్లి రామబ్రహ్మం దర్శకత్వంలో సారధి ఫిలిమ్స్ నిర్మాణంలో గోవిందరాజులు సుబ్బారావు, కాంచనమాల, గాలి వెంకటేశ్వరరావు ప్రధానపాత్రల్లో నటించిన 1938 నాటి తెలుగు సాంఘికచలనచిత్రం నిర్మించడం జరిగింది. అంటరానితనంనిర్మూలన, హరిజనుల దేవాలయ ప్రవేశం, కులాంతర వివాహం, సంస్కరణోద్యమం వంటి సాంఘిక అంశాలను ప్రధానంగా స్వీకరించి సినిమా తీశారు. కేవలం ఇవి మాత్రమే కాకుండా తెలుగు ప్రాచీన, ఆధునిక సాహిత్యాలలో దళిత జీవితాన్ని చిత్రించాలి అన్న, ఆయా కావాల్లో దళిత ప్రస్తావన ఉండాలన్న మాల అనే పదాన్ని ఎక్కువగా వాడినట్లు తెలుస్తుంది. ఉదాహరణకు శ్రీకృష్ణదేవరాయల ఆముక్తమాల్యదలో మాలదాసరి కథ ఇలాంటివి.

ఇక ఆధునికకాలంలో ఉమ్మడి దళితఉద్యమం,సాహిత్యంలో మొట్టమొదట అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ ప్రతిఘటనా సాహిత్యాన్ని ఎక్కువ మోతాదులో రచించింది మాలలే అని చెప్పుకోవాలి. కారంచేడు, చుండూరు సంఘటనలు జరిగినప్పుడు దళిత పులులమ్మ పాడిన గద్దర్, ఒగ్గు కథ రాసిన కలేకూరి, దళిత ఉద్యమానికి దశదిశా నిర్దేశం చేసిన కత్తి పద్మారావు, బొజ్జా తారకం ఇలా ఎంతో మంది మాల కులానికి చెందిన సాహిత్యకారులు, మేదావులు దళితఉద్యమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకు వెళ్ళారు. అయితే దళిత ఉద్యమానికి, సాహిత్యానికి నేపథ్యాలు, ఇతివృత్తాలు, కవితా వస్తువులు అన్ని ఉమ్మడి భాధలు,

ఉమ్మడి అంటరానితనమే కేంద్రంగా రావటం జరిగింది. కాకపోతే 1990 తదనంతరం ఉద్యమంలో విభేదాలు, వాటాల పంపిణి మొదలైన అంశాల ఆధారంగా అప్పటి వరకు ఉమ్మడి నేపథ్యాలు, వస్తువులన్ని మాదిగ కవులు తమ అస్తిత్వ గానంగా మార్చుకున్నారు. తద్వారా మాల కులంలోని సాహిత్యకారులకి సాహిత్య సృజన చేయకపోవటానికి అవకాశం లేదు. అయినప్పటికీ మాలల చరిత్ర, సాహిత్యం ఆధారంగా కొన్ని రచనలు వచ్చాయి. అవి ప్రధానంగా గూటం స్వామి ఏకీకరణీయం(2005), నేలపూరి రత్నాజి ఒకే గొంతుక(2005), తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ దళిత వ్యాకరణం(2007), భూతం ముత్యాలు రచించిన మాలలచరిత్ర(2017) ఇలా కొన్ని రచనలు వచ్చాయి. వీటితో పాటుగా మాలల సంస్కృతి,సాహిత్య మాసపత్రిక మల్లెమాల(2012), వివిధ దినపత్రికల్లో కొన్ని వ్యాసాలు వచ్చాయి.

**4.7.రిజర్వేషన్లు మాలల ధృక్పథం :**

ఆదిమకాలం నుండి నేటి వరకు దళితుల కోసం దళిత సమాజ హక్కుల కోసం ఎక్కువ శాతం పోరాడింది మాలలే. రాజ్యంగబద్ధమైన ఉద్యమాల పట్ల మాలలు సానుకూల వైఖరినే అవలంభిస్తారు. రాజ్యంగం ఇచ్చిన హక్కులు ప్రతి ఒక్కరికి చెందాలని మాలలు ఆశిస్తారు. నిజానికి దళితులు నాలుగు గ్రూపులు గల నాలుగు కులాలు కాదు. ఇప్పుడు 61 కులాల సామూహిక అస్తిత్వం. ఈ అస్తిత్వాన్ని బద్దలు కొట్టడమే వర్గీకరణ వాదులు వారికి మద్దతు ఇస్తున్న అగ్రవర్ణ మనువాదుల లక్ష్యం అన్న వాదనలు మాలమహానాడు వినిపిస్తున్నవి. ఈ కోణంలో రిజర్వేషన్లు ఏర్పాటు చేసిన విధానాన్ని, వాటి లక్ష్యాన్ని ఏకీకరణ దృష్ట్యా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది.

అగ్రవర్ణాల కనుసన్నల్లో మొదలిన వర్గీకరణ ఉద్యమాన్ని ప్రారంభించిన నాటి నుండి వర్గీకరణవాదులు కుట్రపురితంగానే వ్యవహరించారు. వేల సంవత్సరాలుగా కల్సి బతికినా మాలలతో ఎ మాత్రం సంప్రదించకుండా " మీరు

మాకు రావాల్సిన హక్కులను దోచుకున్నారు. మా అవకాశాలను లాగేసుకున్నారు''అంటూ వర్గీకరణవాదులు తోటి సోదర కులాన్ని విమర్శించటం ఎంతవరకు సబబు కాదు.


*"రిజర్వేషన్ల అసలు లక్ష్యం సామాజిక వెనుకబాటును నిర్మూలించి దేశంలోని ప్రజలందరూ సమానంగా అభివృద్ధి చెందేలా చూడటం. తరతాలుగా బ్రాహ్మణీయ మనువాద శక్తులు అడ్డుకోవటం వలన విద్య, ఉపాధి రంగాలకు దూరంగా నెట్టబడి అట్టడుగు వర్గాలకు కొన్ని రాయితీలను కల్పించి వారిని మిగతా వర్గాల స్థాయికి తీసుకు రావలన్నది రిజర్వేషన్ల ముఖ్య ఉద్దేశ్యం. ఆంధ్రప్రదేశ్ లో ఉన్న షెడ్యుల్డ్ కులాల అందరు సమానంగా రిజర్వేషన్లు అనుభవించే అవకాశం,హక్కు ఉంది. కానీ రిజర్వేషన్లు మాలలు ఎక్కువగా అనుభవించారని, మిగిలిన వారికి రావాల్సిన హక్కులను వారు దోచుకున్నారని దండోరా ఉద్యమం పేరుతో మాదిగలు విషప్రచారం చేసారు. గత ఇరవై సంవత్సరాలుగా ఆంధ్రరాష్ట్రంలో ఈ ప్రచారం యధేచ్ఛగా కొనసాగుతూనే ఉంది''*.**(మనువాదానికి మరో రూపం వర్గీకరణ: పుట సంఖ్య :68)**

ఒకే రకమైన సామాజిక నేపథ్యం నుండి వచ్చిన మాల,మాదిగలు,ఇతర ఉప కులాలకు ఒకే సమయంలో విద్య ఉపాధి అవకాశాలు కల్పించటం జరిగింది.కానీ మాదిగలు ఈ రంగంలో ప్రవేశించటానికి చాలా కాలం పట్టింది. దీనికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి.తరరాలుగా వారికి సంక్రమిస్తున్న వృత్తి ఒక కారణం అయితే ఆర్థికంగా సంతుష్టులుగా ఉండటం మరో కారణం. మాలలకు ఇతమిద్దంగా ఒక ప్రత్యేకమైన వృత్తి లేకపోవటం, అంబేద్కర్ ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగటం వలన మాలలు మాదిగల కన్న కొంచెం ముందే విద్యారంగంలో ప్రవేశించారు. స్వతహాగా తెలివి తేటలు ఉన్న మాలలు విద్యారంగంలో వేగంగా అభివృద్ధి చెందటంతో పాటు, తమకు రావాల్సిన విద్యా ఉపాధి హక్కులను సాధించుకున్నారు. దీనిలో మాలలు చేసిన నేరమేమిటో

వర్గీకరణ మనువాదులు చేప్పేతీరాలి. వృత్తి ద్వారా సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందటం వాళ్ళ మాదిగలు విద్యపై అంతగా ఆసక్తి చూపలేదన్నది వాస్తవం.విద్యలేకుండా భారతదేశంలో ఉద్యోగవకాశాలు పొందటం సాధ్యం కాదు.మరి చదువుకొని మాదిగలకు ఉద్యోగ అవకాశాలు ఎలా వస్తాయో కుడా వారే చెప్పాలి.

ఇదే అంశాన్ని సుప్రీం కోర్టు న్యాయస్థానం షెడ్యుల్డ్ కులాల్లో చాలా కులాలు విద్యకు దూరంగా ఉండటం వాళ్ళ తమకు రావాల్సిన హక్కులను పొందలేక పోయాయని స్పష్టం చేసింది. ఎస్సీ జాబితాలో కొన్ని కులాల వెనుకుబాటుకు మిగిలిన కులాలు కారణం కాదని,వారి సాంఘీక నేపథ్యం కారణమని స్పష్టంగా గుర్తించింది.వెనుకబడిన కులాల అభివృద్ధి చెందటానికి ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించటం ద్వారా ఆయా వర్గాలను మిగిలిన కులాల స్థాయికి తీసుకు వెళ్ళాలి. తప్ప మిగిలిన వారి అవకాశాలను లాగేసి వెనుకబడ్డారన్న మిషతో వారికి అందించటం న్యాయవిరుద్దమని సుప్రీంకోర్టు తన తీర్పులో చెప్పింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ఎ,బి,సి,డి వర్గీకరణలో కౌటిల్యుడికి కుడా అర్థం కాని ఒక గొప్ప కపటత్వం దాగి ఉంది. రాష్ట్రంలో ఎస్సీలకు అందాల్సిన పదిహేను శాతం ఉమ్మడి రిజర్వేషన్లను వర్గీకరించి వాటిని ఎబిసిడి లుగా విభజించిన కులాలకు పప్పు బెల్లాలుగా పంచిపెట్టింది. దీని ప్రకారం ఎస్సీ కులాలను ఎ(రెల్లి), బి(మాదిగ), సి(మాల), డి(ఆదియాంధ్ర) గ్రూపులుగా వర్గీకరించి ఎ గ్రూపుకు 1 శాతం, బి గ్రూపుకు 7 శాతం,సి గ్రూపుకు 6 శాతం, డి గ్రూపుకు 1 శాతం రి జర్వేషన్లు పంచిపెట్టారు.




ఈ పంపకంలోనే అప్పటి ముఖ్యమంత్రి చంద్రాబు నాయుడు తన చాణక్యాన్ని ప్రదర్శించాడు. రాష్ట్రపతి ప్రకటన ద్వారా దేశంలోని అమలవుతున్న షెడ్యుల్డ్ కులాల జాబితాల్లో 60 కులాలను నాలుగు గ్రూపులుగా విభజించి జనాభా దామాషా ప్రకారం వారికి రిజర్వేషన్లు పంచిపెట్టామని ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించింది. అయితే రిజర్వేషన్లు అమలులోకి వచ్చిన నాటి నుండి షెడ్యుల్డ్ కులాల్లోకి అనేక ఉప కులాలు నేటికి తమకు చెందాల్సిన రిజర్వేషన్ ఫలాలను అందుకోలేక పోయాయి. ఇదే అంశాన్ని భారత్ అత్యుతున్న న్యాయస్థానం తన సంచలనాత్మక తీర్పులో ప్రత్యేకంగా ప్రస్తావించింది.

*“రిజర్వేషన్లు అమలవుతున్న నాటి నుండి ఇప్పటి వరకు ఆంధ్రదేశంలో రెల్లి వంటి సామాజిక వర్గానికి చెందిన ప్రజలు రిజర్వేషన్ ఫలాలు అమ్దుకోవతంలో వెనుకబడ్డారన్నది వాస్తవం. ఒకే తరగతికి చెందిన విభిన్న సముహాలలో రిజర్వేషన్లు అందుకునే స్థాయికి అభివృద్ధి చెందలేకపోవటానికి గల కారణాలు అధ్యయనం చేయాల్సిన అవసరం భాధ్యత ప్రభుత్వాలపై ఉంది.వారి అభివృద్ధికి ఆటంకం పరుస్తున్న అంశాలను పరిశీలించి, వారిని తిరిగి మిగిలిన వారితో*

*సమానంగా రిజర్వేషన్ ఫలాలను అనుభవించే స్థాయికి తీసుకురావటానికి ప్రభుత్వం ప్రత్యేకమైన శ్రద్ధను తీసుకోవాలి''* అని సుప్రీంకోర్టు స్పష్టంగా ప్రకటించింది.

ఎ,బి,సి,డి వర్గీకరణ చేసిన సందర్భంలో అన్ని కులాలకు రిజర్వేషన్లు సమానంగా పంపిణి చేస్తామన్న ప్రభుత్వం చాలా మోసపూరితంగా వ్యవహరించింది.ఎ గ్రూపుకు ఒక్క శాతం రిజర్వేషన్ కేటాయిస్తూ ఆ వర్గంలో ఎవరు లేకపోతే ఆ రిజర్వేషన్ ఫలాలను ఆ తరవాతి గ్రూపు అయిన బి కి చెందుతాయి. అలాగే డి లో ఎవరు లేకపోతే తిరిగి ఆ రిజర్వేషన్ ఫలాలు 'ఎ' కి, 'ఎ' లో ఎవరు లేకపోతే 'బి' కి చేరతాయి. ఇదే వర్గీకరణ వాదులతో కలిసి అప్పటి ఉమ్మడి ప్రభుత్వం చేసిన సామాజిక న్యాయం. తమకు అనాదిగా కొమ్ము కాస్తున్న మాదిగా జాతికి రిజర్వేషన్లు అప్పనంగా కట్టబెట్టాలన్నది ప్రభుత్వ ధ్యేయం. ఇలా కాకుండా డి గ్రూపు అయిన ఆదియాంధ్రులు ఇంచుమించు మాలకులంలో భాగంగా ఉన్నారు కాబట్టి వీరిని ప్రత్యేక గ్రూపు కాకుండా సి గ్రూపులో కలిపి వారి రిజర్వేషన్ శాతాన్ని సి కలిపితే వర్గీకరణ విధానం సరిగా ఉంటుందనేది మాలల వాదన.

పై అంశాలన్నింటిని పరిశీలించిన తర్వాత వర్గీకరణ విధానాన్ని మాలలు ఎందుకు వ్యతిరేకించారో, రిజర్వేషన్ పట్ల వాబు వెల్లబుచ్చిన అభిప్రాయాలను ఈ కింది విధంగా తెలపవచ్చు.

- కులవృత్తి ఉండటం వలన విద్యా వైపు మాదిగలు మగ్గుచూపలేకపోయారు. తద్వారా ఉద్యోగ అవకాశాలు పొందలేకపోయారు.
- ఉమ్మడి రిజర్వేషన్లు విడదీయటం కంటే ఉన్న వాటిని కాపాడుకుంటూ ఉపకులాల వెనుకబాటు తనానికి ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించే దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవటం

- జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ జరగలేదు.
- నాలుగు గ్రూపులకు బదులు మూడు గ్రూపులుగా చేసి ఉంటే సమన్యాయం జరిగి ఉండచ్చు.
- అవకాశాలు వినియోగించు కోవటంలో మాదిగలు వెనుకబడ్డారు తప్ప రిజర్వేషన్ ఫలాలు పొందటంలో కాదు.

**4.8.ఏకీకరణవాదం – విమర్శనాత్మక అధ్యయనం:**

వర్గీకరణ వాదం ఎప్పుడైతే మొదలైందో దానికి అనుబంధం సాహిత్యం విమర్శ, రాజకీయ,సామాజిక విమర్శ కుడా వచ్చినట్లు మనం ముందు అధ్యాయంలో చెప్పుకున్నం. అదే ధోరణిలోనే ఏకీకరణ వాదానికి కుడా సాహిత్య విమర్శ,రాజకీయ,సామాజిక,ఆర్థిక కోణంలో ప్రముఖులు వారి అభిప్ర్యాలను చెప్పారు.కాకపోతే వర్గీకరణ వచ్చిన ఉధృతంగా ఏకీకరణ రాలేదనే చెప్పాలి. ఏకీకరణ వాదం గురించి వచ్చిన ఏకైక గ్రంథం మను వాదానికి మరో రూపం వర్గీకరనణ.అందులో ఎందుకు మాలలు వర్గీకరణను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో వారి వారి అభిప్రాయాలను తెలియజేశారు.అవి,

"మనువాదానికి మరోరూపం వర్గీకరణ" **:-**

**డాక్టర్.శశిధర్, డా.గౌరీశ్వర రావు(పరిశోధకులు)**

*"ఆంధ్రప్రదేశ్ లో దళితుల ఉమ్మడి అస్తిత్వాన్ని బద్దలు కొడుతూ ముందుకొచ్చిన దండోరా ఉద్యమానికి సమస్త పీడిత సమూహాల విముక్తికి ఉద్యమించాలన్న లక్ష్యం,లక్షణం గానీ లేవు"*

**:- మాలల ఇంటలెక్చువల్ ఫోరం ,ఆంధ్రప్రదేశ్.**

*"వర్గీకరణ పేరుతో మాలలపై విద్వేషాలను కుమ్మరించటానికి మాలల్లో ఉదారవాదులు కుడా కొంత కారణం.మేం కంయునిష్టులం,మేం మార్క్సిస్టులం, మేం మావోయిస్తులం,మేం బహుజనవాదులం,మాకు కులం లేదు అని చెప్పుకునే మాల కులద్రోహుల వల్ల మాలల చరిత్ర ,అభివృద్ధి మరింత వెనక్కి నెట్ట బడింది"*

**:- డా.జి.వి.రత్నాకర్**

*“ ఉత్పత్తి రహిత కులాలకు ఈ దేశంలో ఉత్పత్తులను అనుభవించే హక్కు ఎలా లేదో, అలాగే శతాబ్దాలుగా విద్యకు దూరంగా ఉన్న వర్గీకరణ వాదులకు రిజర్వేషన్లను వర్గీకరించమని అడిగే హక్కు అంతకన్నా లేదు”*.: **- కారెం చిట్టి బాబు**

*“దండోరా ఉద్యమం పూర్తిగా రాజ్యంగ వ్యతిరేక ఉద్యమం. అందరికి దకాల్సిన హక్కులను స్వార్ధంతో ఒకే వర్గానికి కట్టబెట్టాలన్న అగ్రవర్ణాల కుట్రే దండోరా ఉద్యమం”*

**:- రేపు రాజేశ్వరీ(జాతీయ అధ్యక్షురాలు, మాల సంఘాల ఐక్యవేదిక).**

*“వర్తమానంలో మనువు వర్గీకరణవాది అవతారమెత్తాడు.మానవ సమాజాన్ని ముక్కలు చేస్తూ ఒక అసమాన సమాజాన్ని కాక్షించేది మనువాదమైతే,దళిత సమాజాన్ని ముక్కలు చేయటానికి కంకణం కట్టుకున్నది వర్గీకరణ వాదం”* **:-కంకణాల సుబ్బారావు**

పై అభిప్రాయాలను పరిశీలించినప్పుడు వర్గీకరణ వాదంలో ఉన్నది స్వార్ధం అని అందులో ఎక్కడ సమన్యాయం లేదని, అది కేవలం మాదిగ కుల లబ్దికోసమే ఆవిర్భవించిందని తెలియజెప్పారు.

ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ వర్గీకరణలో ఉన్నది సామాజిక న్యాయమా ? లేక విభజించి పాలించే వంచనా శిల్పమా ? అంటూ సి.ఆర్.శేఖర్ తన అభిప్రాయాలను సవివరంగా తెలియజెప్పాడు .దాని యధావిదిగ్గా ఇక్కడ పొందుపరచటం జరిగింది. **(సి.ఆర్.శేఖర్,అంబేద్కర్ మిషన్ ఏప్రిల్ 2005, బులెటిన్:5)**

ఉమ్మడి రిజర్వేషన్ల వల్ల మాదిగలకు నష్టం జరుగుతున్నది.మాదిగలకు మాలల వల్ల అన్యాయం జరుగుచున్నది. యస్సీ రిజర్వేషన్లలో సింహభాగాన్ని మాలలే కొట్టేస్తున్నారు. మాదిగల నోళ్ళు కొట్టి మాలలు మెక్కుతున్నారు. మాదిగలకు న్యాయం జరగాలంటే యస్సీ రిజర్వేషన్లు వర్గీకరించాలి 1994 లో బియస్పీ రాజకీయ పార్టీ ఆంధ్రప్రదేశ్ లో సంచలనం సృష్టించే రీతిలో బహిరంగ

సభ నిర్వహించిన తర్వాత హఠాత్తుగా మాదిగల్లో పుట్టుకొచ్చిన డిమాండ్లు ఇవి. పుట్టు కొచ్చిన డిమాండు అనటం కంటే పుట్టించిన డిమాండ్లు అనటం సమంజసంగా ఉంటుంది.

**4.8.1.ఏకీకరణ వాదం వివిధ రాజకీయ పార్టీల వ్యతిరేక భావనలు :**

అవును ఉమ్మడి రిజర్వేషన్ల వల్ల మాదిగలకు ఎక్కడా జరగనట్టి అన్యాయం జరుగుచున్నది అంటూ ఏకీకరణవాదాన్ని వ్యతిరేకించి వర్గీకరణను సమర్ధించారు.

" *ఇంకెందుకు ఆలస్యం యస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాల్సిందే* '

**:-బిజెపి**

"*యస్సీలను వర్గీకరించటమే గతితార్కిక చారిత్ర భౌతికవాదం* '

**-: సిపియం పార్టీ**

'*దోపిడిని అరికట్టాలంటే యస్సీలను వర్గీకరించాల్సిందే* ' **:– సిపిఐ పార్టీ**

'*ఎవరి వాటా వారికి దక్కాల్సిందే అందుకు ఏకైక మార్గం వర్గీకరణ*'

**-:కులనిర్మూలన పోరాట సమితి**.

రాష్ట్రచరిత్రలో ఇదొక అపూర్వ అద్భుత సంఘటన. విభన్న పార్టీలన్నీ ఏకాభిప్రాయాన్ని వ్యక్తపరచిన ఏకైక సందర్భం.

**4.8.2.రిజర్వేషన్లు - ప్రముఖుల అభిప్రాయాలు :**

"రిజర్వేషన్ల డిమాండు చేసే మనస్తత్వం నిర్మాణత్మకమైన వైఖరిని కాక పరాన్న భుక్కు తత్త్వాన్నే సూచిస్తుంది. సంపదను ఏవరైనా సృష్టించనివ్వండి, ఆ సంపదలో మాకు వాటా కావాలి సుమా అన్నదే ఈ తత్త్వం. అర్హత, సామర్ధ్యత రీత్యా రిజర్వేషన్ల విధానాన్నే సాయుధ బలగాల నియామాకాల విషయంలో అనుసరించకుండా ఉండవలసిన అవసరం ఏంతైనా ఉంది''

**:–బల్బీర్ కె,పుంజ్ ,బిజెపి మేధావుల విభాగం కన్వీనర్ , రాజ్యసభ సభ్యుడు**

"రిజర్వేషన్ల మూలంగా సామర్ధ్యం దెబ్బతినే అవకాశముంది. రిజర్వేషన్ల మూలంగా సామాజిక అభ్యున్నతి జరగకపోగా అన్ని రంగాలలోనూ వెనుకబడి పోయే ప్రమాదం ఉంది. ఇతర దేశాలతో పోటీపడే సామర్ధ్యాన్ని కోల్పోతుంది"

**:-డా.పి.సి.రావు కేంద్ర ప్రభుత్వ న్యాయశాఖ మాజీ కార్యదర్శి**

ప్రవేటు రంగంలో రిజర్వేషన్ల వల్ల నాణ్యత, పోటీతత్వం బలహీనపడి ప్రవేటు రంగం పతనం అవుతుంది. :–**ప్యాప్సీ అధ్యక్షుడు ఒపి గోయాంకా**

"ప్రవేటు రంగంలో రిజర్వేషన్లు ప్రతిభను దెబ్బతీస్తాయి"

:–**యం.గోపాల క్రిష్ణ,ఇండియన్ ఇనిస్టూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్**

ఇలాంటి వ్యాఖ్యలు రిజర్వేషన్ల గురించి చర్చ వచ్చినప్పుడల్లా మెంట్,ప్రతిభ,సామర్ధ్యం నే సన్నాయి రాగాల్ని ఆలపించడం హిందూ అనుత్పాదక కులాలకు ఆనవాయితీగా మారిపోయింది.

యస్సీలను అధములుగా, హీనులుగా, అస్పృశ్యులూగా చూడబడిన మనుధర్మ పాలకులు వర్గీకరణను సమర్ధిస్తున్నాయి. యస్సీలకు అండగా నిలిచి, అంబేద్కర్ ఆలోచనా విధానాలను అమలుపరుస్తున్న బియస్పీ మాత్రం వర్గీకరణను వ్యతిరేకిస్తున్నాయి.

**4.8.3.రిజర్వేషన్ల వర్గీకరణ విధానం - ఏకీకరణ వాదులు లేవనెత్తిన అంశాలు :**

**1. యస్సీలకు సామాజిక న్యాయం కలిగించాలనే సదుద్దుశ్యం రాజకీయ పార్టీలకు నిజంగా ఉన్నదా? :**

యస్సీలకు సామాజిక న్యాయం కలిగించాలనే ఉద్దేశం నిజంగా రాజకీయ పార్టీలకు ఉన్నట్లయితే దేశపాలన చేపట్టి సుమారు 60 సంవత్సరాలు అవుతున్న కులవ్యవస్థ ఎందుకు నిర్మూలన కాలేదు. సాగుభూమిలో యస్సీలకు వాటా ఎందుకు ఇవ్వలేదు.మాలలకు, మాదిగలకు అన్యాయం జరుగుతుందని భావించే ఈ రాజకీయ పార్టీలకు బ్రాహ్మణ, వైశ్య, కమ్మ,రెడ్డి, వెలమ లాంటి కులాల వల్ల మాల, మాదిగలకు జరుగుచున్న అన్యాయం కనిపించటం లేదా.........

దీన్ని బట్టి చూసినట్లయితే రిజర్వేషన్లను వర్గీకరించాలని రాజకీయ పార్టీలు పట్టుబడటంతో యస్సీలు సంఘటితంగా ఉండకూడదనే దురుద్దేశ్యం తప్ప సామాజిక న్యాయం కల్పించాలనే సదుద్దేశ్యం లేదని స్పష్టంగా నిరూపితమవుతున్నది.విడగొట్టాలనే ఉబలాటం తప్ప ఉద్ధరించాలనే ఉబలాటం లేదని రుజువగుచున్నది.

**2. వర్గీకరణ పరిష్కారంతో అన్యాయం తప్ప న్యాయం లేదు :**

నేరస్తుడే న్యాయ నిర్ణేత అయితే తీర్పు ఎలా ఉంటుందో ఉమ్మడి రిజర్వేషన్ల వర్గీకరణలో ప్రతిఫలించింది. రిజర్వేషన్ల వర్గీకరణ సమస్య పుట్టుకొచ్చింది కాదు పుట్టింపబడింది.పాలక కులాలచే పుట్టించింది, కానట్టయితే సమస్యకు పరిష్కారం సామరస్యంగా సాధించవచ్చు. అందుకు అనేక మార్గాలు ఉన్నాయి. సంప్రదింపుల ద్వారా పరిష్కరించవచ్చు, క్రిమిలేయర్ విధానం ద్వారా పరిష్కరించవచ్చు.లబ్దిదారుల వేతనాలలో నిర్ణీత శాతం వేతనాన్ని సమాజ సంక్షేమ నిధి విధానం ద్వారా పరిష్కరించవచ్చు.

వర్గీకరణ విషయానికి సంబంధించి ఎటువంటి పత్యామ్నాయ మార్గాలు ఆలోచించకుండా, దళిత సమాజ అభివృద్ధికి ప్రత్యామ్నాయ ఆలోచనలను తెలియజెప్పలేదు. సుప్రింకోర్టు తప్పుపట్టి కేసు కొట్టేసినప్పటికీ మళ్ళీ అదే నిర్ణయాన్ని శాసనసభ అంగీకరించటాన్ని బట్టి రాజకీయ పార్టీల ఉద్దేశ్యం యస్సీల మధ్య ద్వేషాన్ని కల్పించి వారి ఐక్యతను దెబ్బతీయటమేనని స్పష్టంగా రుజువు అవుతున్నది.

**3. వర్గీకరణ సూత్రం యస్సీ సమాజానికేనా:**

యస్సీల మధ్య తలెత్తినట్టి వివాద సమస్యలు దేశంలో అనేకం ఉన్నాయి. వాటి పరిష్కారానికి యస్సీల సమస్య పరిష్కారానికి సూచించిన వర్గీకరణ పరిష్కార సూత్రాన్ని ఎందుకు అనువర్తించటం లేదు. దేశంలో ఎన్నో సమస్యలు ఉదాహరణకు ప్రత్యేక తెలంగాణ, ఉత్తారాంధ్ర హక్కులు, ప్రత్యేక రాయలసీమ,

కాశ్మీర్ సమస్య ఇలా ఎన్నో సమస్యలు ఉంటే వాటికి వర్గీకరణ సూత్రాన్ని ఎందుకు వర్తింపచేయలేదు కారణం దీనివలన సమాజానికి నష్టం అని కదా అలాంటప్పుడు ఈ సూత్రాన్ని యస్సీ సమాజానికే ఎందుకు వర్తింపచేస్తున్నారు అంటే యస్సీలు ఉమ్మడిగా కలిసి ఉండకూడదనే సంకుచిత ఆలోచన తప్ప మరే ఉద్దేశ్యం లేదు. ఇది వర్గీకరణ వాదులు గమనించాలి.

**4. కమ్యునిస్టులు ప్రవర్తన మరీ దారుణం :**

తెలుగుదేశం, బిజెపి, కాంగ్రెస్ లాంటి రాజకీయపార్టీలు హిందు భావజాలానికి పునాదిగా నిర్మితయ్యాయి కాబట్టి ఇవి యస్సీలకు అన్యాయం చేయటంలో, అణచివేత చేయటంలో ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. అయితే మార్క్స సిద్ధాంతాల ఆధారంగా ఏర్పడి, పీడిత ప్రజల కొరకు పాటుబడే పార్టీలుగా చెప్పబడే కమ్యునిస్టు పార్టీలు కూడా వర్గీకరణను సమర్ధించటం ఆశ్చర్యాన్ని కలిగించక మానదు. రాష్ట్ర వర్గీకరణను వ్యతిరేకించే కమ్యునిస్టులు యస్సీ వర్గీకరణకు మద్దతు పలకడం ఇందుకు నిదర్శనం. విశాలాంధ్రప్రదశ్ ను కోరే కమ్యునిస్టులు ఉమ్మడి రిజర్వేషన్లను వ్యతిరేకించడం వారి ద్వంద వైఖరికి నిదర్శనం.యస్సీలను వర్గీకరించాలనే వాదన కొరకు వక్రీకరణలతో బాటు మిస్ కోటింగ్, రాంగ్ ఇంటర్ప్రిటేషనస్ లాంటి వక్ర పద్ధలకు పాల్పడటానికి కూడా వీరు వెనుకాడలేదు. ఉదాహరణకు,

రిజర్వేషన్లను వ్యతిరేకించడానికి గతంలో అగ్రకులాల విద్యావంతులు చేసిన వాదనలనే నేడు వర్గీకరణను వ్యతిరేకించేందుకు మాల నాయకులు మరింత తెలివిగా చేస్తున్నారు అంటూ ఒక అభియోగాన్ని మోపారు.ఇక్కడ వక్రీకరణ ఏమిటంటే రిజర్వేషన్లను వ్యతిరేకించే అగ్రకుల విద్యావంతులను, వర్గీకరణను వ్యతిరేకించే మాలలను ఒకే గాటికి కట్టడం. రిజర్వేషన్లను వ్యతిరేకించడం వర్గీకరణను వ్యతిరేకించడాన్ని ఒకే విధమైనట్టివిగా పరిగణించడం మరో వక్రీకరణ. రిజర్వేషన్లు వ్యతిరేకించడంలో బాధితులు

బాధితులుగా ఉండాలనే దుర్నీతి ఉన్నది. అణగద్రొక్కబడిన వారు అభివృద్ధి చెందకూడదనే దుర్మార్గం ఉన్నది. అన్యాయానికి గురి అయిన వారికి న్యాయం దక్కకూడదనే కపటత్వం ఉన్నది. అధమస్థాయికి నెట్టబడిన వారు పైకి రాకూడదనే అసూయ ఉన్నది.

వర్గీకరణను వ్యతిరేకించడంలో కోల్పోయిన హక్కులను పొందాలనే తపన ఉన్నది. విడిపోతే పడిపోతామనే జాగృత ఉన్నది. సహోదరుల వలే సమైక్యంగా ఉండాలనే సదుద్దేశ్యం ఉన్నది. ఆరోగ్యకరమైన పోటీతో ప్రతిభ వెలికి తీయాలనే ప్రతిభాశీలత ఉన్నది. వర్గీకరణ వ్యతిరేకతలో కులతత్త్వాన్ని కుల చైతంతాన్ని వ్యతిరేకించే తత్వం ఉన్నది. సమాజంగా మెలగాలనే సామాజిక భాధ్యత ఉన్నది.

అంటే రిజర్వేషన్ల వ్యతిరేకత అణచివేత వైఖరి కాగ వర్గీకరణ వ్యతిరేకతలో కలుపుకుపోయే తత్వం కలిగి ఉన్నది. అది సంకుచితత్వం. ఇది విశాల దృక్పథం. అది సంఘ వ్యతిరేక తత్వం. ఇది సంఘ సంఘటిత తత్వం.అది భాధ్యతా రహిత స్వార్ధపరత్వం. ఇది భాధ్యతాయుత సమతావాదం.

**5. వర్గీకరణ మనస్తత్వం ప్రమాదకరమైనది :**

ఉమ్మడి తత్వానికి, శాంతియుత సంఘజీవనానికి, ప్రగతి శీలతకు, ప్రతిభా పాటవాల పురోగతికి వర్గీకరణ తత్వం ప్రతిబంధకమే కాదు ప్రమాదకరం. వర్గీకరణ మనస్తత్వం సంకుచిత్వానికి, స్వార్ధపరత్వానికి. భాధ్యాతారాహిత్యానికి, సోమరితత్వానికి, పోటీపడలేని పిరికితనానికి దర్పణం, వర్గీకరణ మనస్తత్వం అసూయను, ద్వేషాన్ని కపటాన్ని రెచ్చగొడుతుంది.భారతీయ సమాజంలో యస్సీ సమాజం ఏకాకి లాంటిది, ఏ ఒక్క కులం యస్సీ సమాజానికి అండగా నిలబడదు, ఏ రాజకీయ పార్టీ అండగా రాదు.హిందూ సమాజానికి యస్సీ సమాజం బానిసగా బ్రతుకున్నది. ఈ బానిసత్వాన్ని వదిలించుకోవటానికి ఒక్క బుద్ధి బలం, సంఖ్యా బలం తప్ప మరే అవకాశాలు లేవు, సంఘటిత శక్తి ద్వారా యస్సీలు బానిసత్వాన్ని వదిలించుకోవలసి ఉన్నది. ఇలాంటి కీలక దశలో

వర్గీకరణ మనస్తత్వంతో చీలిపోయి విడిపోతే ఏఏ యస్సీల భవిష్యత్తు ఎలా ఉంటుందో ఓ మారు ఆలోచించుకోండి. మాల మాదిగలు కలిసి ఉన్నప్పుడే అంబేద్కర్ సాధించిన ప్రయోజనాలకు అదనంగా ఒక్క ప్రయోజనాన్ని కూడా సాధించుకోలేదు. ఇక విడిపోయి వీరు ఏమైనా సాధించుకోగలరా? ఏమీ సాధించుకోలేరు. అందుకే అంబేద్కరిస్టులు వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారు. వర్గీకరణ అన్నది పాలక కులాలు+ కల్పించిన ఉచ్చు. ఉచ్చులో కనిపించే ఎరకూ ఆశపడితే ప్రాణాలు కోల్పోయే ప్రమాదముంటుందనే వాస్తవాన్ని అంబేద్కరిస్టులు గుర్తించారు కాబట్టే వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారు. ఒక చిన్నశాతం ప్రయోజనానికై 95 శాతం ప్రయోజనాలను వదులుకోవటం క్షమించరాని తప్పిందం అవుతుందని గుర్తించిన అంబేద్కరిస్టులు వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారు.

అంతేగాకుండా వర్గీకరణ విషయంలో అన్ని రాజకీయ పార్టీల, కులసంఘాల ఎత్తు ఒకటైతే కులనిర్మూలన పోరాటసమితి మాత్రం ప్రత్యేకమైన చొరవతో ముందుకు వచ్చింది. అది ఎందుకు వచ్చిందో, దాని వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో ఇన్నాళ్ల స్వతంత్ర్య భారతంలో కుల ఛాయలు ఎలా ఉన్నాయో మొదలైఅ విషయాలు చెప్పకుండా దళితులు ఐక్యంగా అగ్రకులాలపై పోరాడాలన్నది పాత సందేశం... దళితులకు ఎవరి వాటా వారు పంచుకుని, అగ్రకులాలపై ఐక్యంగా పోరాడాలి అన్నది.

1. ఉమ్మడి రిజర్వేషన్ల అసమానతలు సృష్టించాయి అని వాదిస్తున్నారు. అంటే అసమానతలు సృష్టించే లక్షణం ఉమ్మడి రిజర్వేషన్లలో ఉన్నదనా? లేక ఎవరైనా సృష్టిస్తున్నారా? ఏవరైనా సృష్టిస్తున్నట్లయితే వారు ఎవరు? ఏ విధంగా అసమానతలు సృష్టిస్తున్నారు? ఆ అసమానతలు ఏమిటి?
2. మాల,మాదిగలు స్థూలంగా 64:36 నిష్పత్తిలో రిజర్వేషన్లను వినియోగించుకుంటున్నారని నిర్ధారించారు కదా, ఈ తేడా

పరగణించదగిన తేడాయేనా ? చిన్న చిన్న తేడాలుండటం సహజం కాదా? నిరపేక్ష సమానత్వం అన్నది ఎక్కడైనా ఉంటుందా? ఉన్నట్లయితే వివరించాలి.

3. సమానత్వం అంటే ఏమిటి ? ప్రతి విషయంలో ప్రతి ఒక్కరూ సమానంగా ఉండటమా ? లేక సమాన అవకాశాలు కలిగి ఉండటమా ?

4. రిజర్వేషన్లు వినియోగించుకునేందుకు మాలలతో బాటు మాదిగలకు సమాన అవకాశాలు ఉన్నాయా లేదా ? లేనట్లయితే అవి ఏమిటి ?

5. మాదిగల కంటే మాలలు 28 శాతం రిజర్వేషన్లు వినియోగించుకుంటున్నారని వాదిస్తున్నారు కదా మాలలే ఎలా వినియోగించుకుంటున్నారు ? మాదిగలు ఎందుకు వినియోగించుకోలేక పోతున్నారు.మాదిగలకు లేని ప్రత్యేక అవకాశాలు, విశేషాధికారాలు మాలలకు ఏమైనా ఉన్నాయా? మాదిగలు రిజర్వేషన్లు వినియోగించుకోకుండా మాలలు అడ్డుకుంటున్నారా ? అడ్డుకున్నట్లయితే ఏ విధంగా అడ్డుకుంటున్నారు ?

6. మాలలతో సమంగానూ ఉత్సాహం ఉంటే అధిగమించేందుకు కూడా అవకాశం ఉన్నప్పటికీ 28 పాళ్ళు రిజర్వేషన్లు అదనంగా అనుభవిస్తున్నారంటూ మాలలపై ద్వేషపూరిత శత్రుత్వాన్ని పెంచుకొని 12 సంవత్సరాలుగా మొండి జగడం చేస్తున్న మాదిగలు, సమాన అవకాశాలు ఇవ్వకుండా, అన్యాయ పద్ధతిలో దేశ సంపదకు కొన్ని వేల రెట్లు అదనంగా అనుభవిస్తున్న పాలక కులాల పట్ల వీసమంత వ్యతిరేకత కనబరచలేని మాదిగల బాధ్యతారహిత ప్రవర్తన సమర్ధనీయమైనదేనా ? వారి ఆలోచన విధానం న్యాయమైనదేనా ?

7. రిజర్వేషన్లను వినియోగించుకునేందుకు సమాన అవకాశాలు ఉన్నప్పటికీ, దాన్ని విసర్జించి వర్గీకరణను కోరే మాదిగలకు మద్దతు పలకడం న్యాయమైన నిర్ణయమేనా?
8. మాల మాదిగల మధ్య చూపెడుతున్న అసమానతలు మాదిగ కులాల మధ్య లేదా? వాటి పరిష్కారం ఏమిటి ? వర్గీకరణలే పరిష్కారమా? ఇలా వర్గీకరించుకుంటు పోతే వానికి అంతు అంటూ ఉంటుందా ?
9. ఉమ్మడి రిజర్వేషన్ల విధానం మాల,మాదిగల మధ్య అసమానతలు సృష్టించబడినప్పుడు 59 కులాలకు గాను ఇప్పుడు 61 నాలుగు భాగాల ఉమ్మడి రిజర్వేషన్లు అసమానతలు సృష్టించవా? అప్పుడు 59 విభాగాలుగా వర్గీకరిస్తారా ? ఇప్పుడు కూడా ఏ ఏకులానికి ఆ కులంతో అసమానతలు ఏర్పడవా ? అసమానతలు సృష్టించబడదని గ్యారెంటి ఇవ్వగలరా ?
10. వర్గీకరణసిద్ధాంతము అసమానతలను ఏ విధంగా నిర్మూలించగలదో వివరించగలరా ?
11. మాల,మాదిగల మధ్య అసమానతలకు మాలలను భాధ్యులుగా చూపుతున్నారు.మాదిగల మధ్య కూడా అసమానతలు ఉన్నాయి. అందుకు భాధ్యులు ఎవరు? ఏకులానికి ఆ కులంలో కూడా అసమానతలు ఉన్నాయి అందుకు భాధ్యులు ఎవరు?
12. మాదిగలకు అధిక నష్టం ఉమ్మడి రిజర్వేషన్ల వల్ల జరుగుచున్నదా లేక పాలక వర్గాల వలన జరుగుచున్నదా?
13. మాదిగలు తమ ప్రధాన శత్రువులుగా మాలలను పరిగణిస్తున్నారా లేక పాలకవర్గాలను పరిగణిస్తున్నారా ?
14. మాదిగలు మాలలపై జరుపుతున్నట్టి దాడిని పాలక కులాలపై ఎప్పుడైనా చేశారా ?

15. మాలమాదిగలు ఐక్యంగా సంఘటితంగా ఉద్యమించవలసిన చారిత్రక అవసరం ఉన్నదా లేదా ? వర్గీకరణ ఆ అవసరాన్ని ఎలా తీరుస్తుంది ?
16. వర్గీకరణ మనుషులను కలుపుతుందా ? లేక విడదీస్తుందా ?
17. వర్గీకరణ మనుషుల మధ్య సహకార భావాన్ని పెంచుతుందా ? లేక తిరస్కార భావాన్ని పెంచుకుందా ?
18. వర్గీకరణ మనుషుల మధ్య ద్వేషాన్ని రేకిత్తిందా ? లేక ప్రేమను పెంపొందిస్తుందా ?
19. వర్గీకరణ అవిశ్వాసం కారణంగా వస్తుందా ? లేక విశ్వాసం మూలంగా వస్తుందా ?
20. వర్గీకరణ మనుషుల మధ్య 'నా' భావం కలిగిస్తుందా ? లేక 'మా' భావాన్ని కలిగిస్తుందా ?
21. యస్సీ సమాజం సాధించుకున్న ప్రయోజనాలు అధికంగా ఉన్నాయా ? లేక సాధించుకోవాల్సిన ప్రయోజనాలు అధికంగా ఉన్నాయా ? సాధించుకోవలసినవి అధికంగా ఉన్నట్లయితే వర్గీకరణ విధానం వాటిని ఏ విధంగా సాధిస్తుంది.
22. వర్గీకరణ తత్వం ఆదర్శనీయమా లేక ఆక్షేపనీయమా?
23. ఐకతత్వం అభిలశనీయమా లేక ఆక్షేపనీయమా?
24. మాల మాదిగలు విడిపోవడం మాలమాదిగలకు లాభమా లేక నష్టమా?
25. మాదిగ దండోరా వాదనకు కులనిర్మూలన పోరాట సమితి న్యాయమైన వాదనగా ఏ అధారాలతో అంగీకరిస్తున్నదో వివరించగలరా?
26. యస్సీలను వర్గీకరించాలని పట్టుపట్టే కులనిర్మూలన పోరాట సమితి యస్సీలకు వర్గీకరించటం ద్వారా కులనిర్మూలన ఏ విధంగా జరుగుతుందో వివరించగలదా?

27. యస్సీల వర్గీకరణ కులచైతన్యాన్ని, కులతత్వాన్ని పెంచుతుందా లేక క్రుంచుతుందా?

28. మాదిగదండోరా వారు వారి పేరు చివర కులనామాన్ని పెట్టుకోడానికి ఉత్సాహం చూపుతున్నారు. గర్వించదగ్గ విషయంగా ప్రకటించుకుంటున్నారు. ఇది కులచైతన్యాన్ని, కులతత్వాన్ని ప్రోత్సహించే వైఖరి కాదా? వైఖరి సమర్ధనీయమా లేక ఆక్షేపనీయమా ?

29. కులతత్వాన్ని, కుల చైతన్యాన్ని ప్రోత్సహించే మాదిగ దండోరా చేతులు కలిపిన కులనిర్మూలనా పోరాటసమితి, కులనిర్మూలనను ఎలా సాధిస్తుందో వివరించాలి?

30. కుల నిర్మూలనను ఏ సిద్ధాంత ప్రాతిపదికన సాధిస్తారో, సాధించే విధానం ఏమిటో కుల నిర్మూలనా పోరాట సమితి వివరించాలి?

31. కుల వ్యవస్థను కొన సాగించటం యస్సీలకు ప్రయోజనకరమా? లేక ప్రమాదకరమా? కుల నామాలు యస్సీలకు గౌరవాన్ని కలిగిస్తాయా లేక అవమానాన్ని సూచిస్తాయా? వర్గీకరణ కులాలను ధృఢపరుస్తుందా లేక కూల్చివేస్తుందా ?

32. మొదట విడిపోవాలి, ఆ తర్వాత ఐక్యంగా ఉద్యమించాలి అనే సూత్రంలో నిజాయితీ ఉన్నదా? ఇది సత్ఫలితాలను సాధించే ఆచరణాత్మక సూత్రమేనా?ఇది ఆచరణాత్మకమైనట్టిదనటానికి ఉదాహరణలు ఉన్నాయా ?

33. విడిపోయిన భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు స్నేహపూరితంగా ఉన్నాయా? వీటిని శత్రు దేశాలుగా పరగణిస్తున్నారా లేక మిత్రదేశాలుగా పరగణిస్తున్నారా? మద్రాసు ప్రసిడెనిసి నుండి విడిపోయిన కేరళ, కర్ణాటక, మద్రాసులు, మద్రాసు నుండి మళ్ళీ విడిపోయి ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య సంబంధాల సహకార పూరితంగా ఉంటున్నాయా? లేక ఘర్షణ పూరితంగా ఉంటున్నాయా ?

34. వేల కులాలుగా వర్గీకరింపబడి వున్న శూద్ర(బిసి) కులాల మధ్య సంబంధాలు సహోదర సంబంధాలుగా ఉన్నాయా లేక ప్రత్యర్థుల సంబంధాలుగా ఉన్నాయా? శూద్రులు, బానిసలు, హీనజాతులు అని నిర్దేశించిన బ్రాహ్మణ సాహింత్యంపై గానీ, పాలక కులాలపై గానీ పోరాటానికి సంఘటితంగా ముందుకు వస్తున్నారా ?

35. యస్సీలుగా బీసిలుగా వర్గీకరింపబడిన వారు తమకు హీనత్వాన్ని ఆపాదించిన ద్విజకులాలకు వ్యతిరేకంగా ఉద్యమించడానికి సంఘటిత తత్వాన్ని కలిగి ఉన్నారా? పరస్పర సానుభూతిగా వ్యవహరిస్తున్నారా? శత్రుపూరితంగా వ్యవహరించడం లేదా ?

యస్సీల మధ్య స్పర్ధలు సృష్టించడం, విద్వేషం రగిలించడం, విరోదాన్ని కలిగించడం, అనైక్యతకు గురిచేయటం, సంఘటితత్వాన్ని విచ్ఛిన్నం చేయటం, విభజంకు గురిచేయటం, స్వశక్తిపై ఆధారపడకుండా చేయటం, కులహైన్యత నుండి బయట పడకుండా చేయటం, సంకుచితులుగా మార్చడం, మాల మాదిగలుగా శాశ్వితంగా స్థిరపడేట్లు చేయటం, రాజ్యాధికార దిశగా పయనించకుండా చేయటం, రాజకీయ నిర్ణాయక శక్తిగా మారకుండా చేయటం అనే దురుద్దేశం కులనిర్మూలనా పోరాట సమితికి లేదని నిరూపించదలచుకుంటే పై ప్రశ్నలకు వారు సమాధానమివ్వాలి. వర్గీకరణను సమర్థించే వారందరూ ఈ ప్రశ్నలకు విధిగా సమాధానాలు చెప్పాలి. అప్పుడే వారి వాదనకు విలువ ఉంటుంది. వీటికి సమాధానాలు చెప్పలేని పక్షంలో స్వార్ధ ప్రయోజనాల కొరకు సమాజాన్ని వంచించడానికి పూనుకున్న స్వార్థపరులుగా గుర్తించవలసి ఉంటుంది.

మాలలు వర్గీకరణను వ్యతిరేకించటానికి నాలుగు ప్రధాన కారణాలు ఉన్నాయని తెలియజెప్పారు.

1. వర్గీకరణ అనేది మాల కులంలోని అన్ని అంటే ధనిక,బీద,సంపన్న,పేద

వారికి ఆపాదించటం వలన

2. ఎస్సీలను వర్గీకరించటం అంటే అంబేద్కర్ ఆలోచనలను అగౌవరపర్చటం
3. అభివృద్ధి అనేది మాల,మాదిగల కులాల్లో ఉన్నారు తద్వారా రెండు కులల ప్రజలు నష్టపోతారు.
4. ఎస్సీలను వర్గీకరణ వైపు మరల్చి రాజకీయ ఎదుగుదలను అడ్డుకుంటున్న కుట్రను గ్రహించటం.(**రాంప్రసాదు, బత్తుల. మల్లెమాల మాసపత్రిక: పుట: నెంబరు: 16**)

ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ సాహిత్యంలో వస్తున్న సందిగ్దతను తెలియజెప్తూ వర్గీకరణ,ఏకీకరణ వాదాన్ని స్వాగతిస్తూనే వీటి మధ్యగల అంతర్యాని వీలైనంత త్వరగా వీడి దళిత సమైక్యతకు యావత్తు దళిత లోకం పాటుపాడాలని సిద్దార్థ మద్దిరాల తెలియజేశాడు.

*“ ఉపకులాల విభజన న్యాయమైన కోరికే దానిని మేము సమర్దిస్తున్నాము. అయితే దాని నియామకం ఎలా అనేది మన ముందు ఉన్న ప్రధాన సమస్య. ప్రాంతాల వారిగా ఇద్దామనుకుంటే ఒక ప్రాంతంలో మాదిగలు ఎక్కువ. మరో ప్రాంతంలో మాలలు ఎక్కువ. ఇదే జనాభా ప్రాతిపదికన ఇస్తామనుకుంటే మరో సమస్యఏ జోన్ల వారిగా ఇద్దాం అనుకుంటే మరి కొన్ని సమస్యలు ఇలా ఆలోచించకుండా నిర్ణయాలు తీసుకుంటే నష్టపోయేది దళిత జాతి ప్రజల ఆకాంక్షలు తప్ప ఏమి ఉండవు.కనుక సోదరులు ఇరువర్గాల ప్రయోజనాలతో పాటు మొత్తం ఉపకులాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వర్గీకరణ వదానాలు వినిపిస్తే మొత్తం దళిత జాతికి అంతిమ ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది ”*(**సిద్దార్థ మద్దిరాల.మల్లెమాల:పుట సంఖ్య: 35** )

*“ మాదిగలు నిజంగా వెనుకబడి ఉంటే వర్గీకరణ ఒక్కటే మార్గమా ? వర్గీకరణ ఒక్కటే మార్గం అయితే ఇటువంటి ఉద్యమాలు మిగతా రాష్ట్రాలలో ఎందుకు రావటం లేదు ? ఈ ప్రశ్నలకు సమాధానాలు నిజమైన సామాజిక, ఆర్థిక*

*సర్వే జరిపించి వాస్తవాలకు పెద్ద పీఠ వేసి రాజ్యాంగ పరమైన తీర్పు చెప్పవలసిన భాధ్యత ప్రభుత్వానికి ఉంది.అయితే ఈ దిశగా ప్రయత్నాలు జరగలేదా జరిగాయి? ఈ వర్గీకరణ సమస్య హైకోర్టు,సుప్రీంకోర్టుల వరకు వెళ్ళింది.అక్కడ తిరస్కరించబడి ప్రతికూలమైన తీర్పు వచ్చింది.అంటే మాదిగల డిమాండ్ న్యాయబద్ధమైనది.హేతుబద్ధమైనది,చట్టబద్ధమైనది లేదు అని కొన్ని కమిటీల నివేదికల ఆధారంగా తీర్పు చెప్పింది. ఇప్పటికయినా దండోరా నాయకులు న్యాయవ్యవస్థను గౌరవవించి ఒక్క మాదిగ కులానికి కాకుండా ఒక్క మాల కులానీ గురించి కాకుండా మొత్తం 61 కులాల వారి అభివృద్ధి దృష్టిలో పెట్టుకుని వారి ఉద్యమాలు దళిత ప్రయోజనాలను ఆశ్రయించే విధముగా ఉండేట్లు ఉద్యమ కల్పన చేయాల్సి ఉంది''.*( **శ్రీదేవి,కాకి.మల్లెమాల మాస పత్రిక : పుట : నెంబరు: 40**)

**4.9.ఏకీకరణ సాహిత్యం - విమర్శనాత్మక అధ్యయనం:**

రిజర్వేషన్ ఫలలాను దళితులలో ఒక వర్గమే అనుభవిస్తుందని మాదిగలు లేవదీసిన వర్గీకరణ వాదానికి వ్యతిరేకంగా మాలల్లో కొంత మంది రచనలు.వ్యాసాలు,కవిత్వం రచించటం జరిగింది.వాటిలో ప్రధానంగా సి.ఆర్.శేఖర్, జి.సుబ్బారావు, గూటం స్వామి మొదలైన వారు ముఖ్యులు. అయితే ఈ వాదాన్ని దళిత సమైక్యత పేరుతో రచనలు చేయటం జరిగింది. ఆయా రచనల్లో వెలిబుచ్చిన అభిప్రాయాలను ఈ కింది విధంగా చెప్పవచ్చు.

*" వర్గీకరణ విషయాన్ని కొందరు స్వార్ధపరులైన మాదిగా సోదరులు మసిపూసి మారేడు కాయ చేస్తున్నారు. సమాజంలో ఎక్కడా మాల,మాదిగల మధ్య ఏ ఐక్యత లేకుండానే చుండూరు,కారంచేడు సంఘటనలలో మాదిగల గాయాలను మాలలు పంచుకున్నారా ? అయినా మోసం చేయటం, మసిపూసి మారేడు కాయ చేయటం వంటి గారడి విద్యలు మాలలకు తెలియవు.పచ్చ కామెర్ల వాడికి లోకం అంతా పచ్చగా కనిపించటంలో వింత లేదు''* :– **పి.నాగ సత్యనారాయణ(నవంబర్ 27,2006)**.

"ఓట్ల కోడి పిల్లల కోసం
విజన్ 420 బొల్లి గద్దగాడు
పన్నిన పన్నాగంలో
వర్గీకరణ ఎర
ఒక భాగం కాదంటారా ?'' ( **ఏకీకరణీయం:పుట**''**ii**)

" నీలి పాపడు ఉద్యమానికి నారి సారించక ముందే దళిత విల్లు నిలువునా చీలిపోయింది. అందుకే ఏకీకరణపు వ్యధ ఎబిసిడి ఎంగిలిమెతుకులు కాదు ఏకంగా రాజ్యాన్నే అధిష్టించాలి'' ( **జి.సుబ్బారావు:అంధ్రప్రభ; అక్టోబర్, 2006**)

"మీరు నిజం చెప్పండి
మీరు దండోరా వాయించినప్పుడల్లా
మూడెంకలోల్లు
మీ జోలికి చేసిన
డబ్బు మాలలకు
లెక్కలు చెప్పగలరా ?" ( **ఏకీకరణీయం:పుట సంఖ్య :9**).

ఈ వాక్యాల్లో దండోరా ఉద్యమం జరుగుతున్న క్రమంలో సోదరులు ఉద్యమ నేపథ్యాన్ని మరచి ఉద్యమాన్ని తాకట్టు వస్తువుగా వాడుకున్నారు అని, ఉద్యమ నేపథ్యంలో వసూలు చేసిన ఆర్థిక లావాదేవీలకు లెక్కలు చెప్పగలరా అంటూ ప్రశ్నించాడు.

*"దళితులంతా*
*దగాపడ్డవారే*
*డప్పు ఒక్కటే*
*చిల్లు పడలేదు*
*మట్టి కూడా దగాపడ్డది*

*వర్గీకరణతో భంగపడ్డది"* **(ఏకీకరణీయం:పుట సంఖ్య :12 )**

భారతదేశంలో ప్రతి దళితుడు దగాపడ్డ వాడే అని,దీనికి ఎవరు మినహాయిపు కాదని కేవలం డప్పుకో, చెప్పుకో చిల్లు పదలేదని, మట్టి, మట్టిని నమ్ముకున్న మాలలు దగా పడ్డారు అని కవి వ్యక్తపరచాడు.

*"రిజర్వేషన్లు*
*అణగారినోడికా*
*అన్ని ఉన్నోదికా చెప్పండి"* **(ఏకీకరణీయం:పుటసంఖ్య:10)**

రిజర్వేషన్లు అందరికి అందుబాటులోకి తేవాలని గొప్ప ఆశయంతో అంబేద్కర్ ప్రారంభిస్తే అవి కొంతమంది అనుభవించాలి అనుకోవటం మనువాద ధోరణి అవుతుందే గాని సమన్యాయ ధోరణి కాదు అని రిజర్వేషన్లు అణగారినోడికి అని అభివృద్ధి చెందినవాడికి కాదని స్పష్టంగా తెలియజెప్పాడు.

ఈ విధంగా చెప్పుకుంటు పోతే ఏకీకరణీయం దీర్ఘ కావ్యంలో కవిత్వం కన్నా ఎక్కువగా వ్యక్తిగత పొగడ్తలు, వ్యక్తిగత దూషణలు ఉన్నట్లు తెలుస్తుంది.ఉదాహరణకు,

*"ఏ దండోరా చెబితే*
*గద్దర్ ఏలరో ఈ మాదిగా బ్రతుకని*

*గుండెదండోరామోగించాడు"* **(ఏకీకరణీయం:పుటసంఖ్య:29)**

*"ఎవరు సిఫార్సు చేస్తే*
*శివమెత్తిన శివ సాగరుడు*
*మందే మాదిగ డప్పులా ఘోషించాడు*
*ఎవరు పురమా ఇస్తే*
*నిత్య సత్యమూర్తి*
*విశ్వకవితా దీప్తి*

*వర్తమాన చరిత్రను*
*పరమ చండాల కవిత్వ చరిత్రగా*
*ప్రకటించాడు ?*
*ఎవరు చెబితే*
*మద్దూరి*
*చర్మకారుని దినచర్యను*
*ఆవిష్కరించాడు ?"* **(ఏకీకరణీయం:పుట సంఖ్య :30)**

*"కేవలం ఎబిసిడి ఆర్ధిక భద్రత*
*దళితుల ఐక్యతకు*
*చిహ్నమంటావా చిన్నన్నా"* **(ఏకీకరణీయం:పుట సంఖ్య 27)**

*"కులాల పలుగును చేతబట్టి*
*సాటి సోదరులపై*
*దాడి చేసినవాడు*
*ఫ్యాక్షనిస్టు అవుతాడు కాని*
*కవి ఎలా అవుతాడు"* **(ఏకీకరణీయం:పుట సంఖ్య :26)**
*"కోడెనాగు కనబడితే*
*దారి చూపమన్నారే*
*మాలవాడు కనబడితే*
*తెగనరకమన్నారే*
*ఇదే నా మీ సమ ధర్మం"* **(ఏకీకరణీయం:పుటసంఖ్య:35)...**

సమత,మమత ధర్మం అంటే కేవలం ఎదుటి వ్యక్తిని ప్రేమించమని కాని

పాముకన్న హీనంగా చూడామణి కాదు రచయిత దండోరా ఉద్యమనాయకులని ఎద్దేవా చేసాడు.

ఏకీకరణ వాదాన్ని బలపరుస్తూ దళితుల సమైక్యతను చాటుతూ 2005 వచ్చిన మరో సమైక్యత దీర్ఘ కావ్యం ఒకే గొంతుక.దిన్ని నేలపూరి రత్నాజీ రచించారు.

" వాగ్యుద్ధాలు చాలించండి
రాగ ద్వేషాలొదిలి దగ్గర జరగండి
ఎదురుచూస్తుంది మనకోసం
దళిత బహుజన రథం
ముందుకు లాగుదాం చేతులు కలపండి
.................................................
...............................................
ఒకే వేదికపై రెండు సభలుగాంచి
చిక్కుడు పాదుల్లా అల్లుకున్న చిక్కటి బంధంతో
ఏకీకరణమవుదాం'' (**ఒకే గొంతుక: పుట సంఖ్య:24**)

దళిత సాహిత్య అంతిమ లక్ష్యమైన రాజ్యాధికారాన్ని కవి ఆశిస్తున్నాడు.సుదీర్ఘ లక్ష్యాల్లో వర్గీకరణ కొట్లాట అనైక్యతకు దారితీస్తుందన్న భయం, ఆందోళనలో అందరం కలుద్దాం, సమైక్యతతో దళిత జాతి అభివృద్ధి సాధిద్దాం.

అదేవిధంగా దళితుల మధ్య పెట్టిన వర్గీకరణ చిచ్చు ముమ్మాటికి అగ్రవర్ణ ప్రభుత్వాల కుట్రే అని దానికి దళితుల మధ్య విద్వేషాలు ఏర్పడ్డాయని అది గ్రహించి దళితులంతా రాజ్యాధికార దిశగా అడుగులు వేయాలని తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ దళితవ్యాకరణం అనే కవితలో ఈ విధముగా తెలియజెప్పాడు.

*" బురదలోంచి పుట్టిన పుష్పాలం మేము*

*ఒకే దుంపనుంచి ఊపిరి పోసుకున్న మాకు*
*ఎబిసిడి పేర్లు పెడుతున్నదెవరు?*
*వేదకాలం నుంచి పేదలకాలని మాది*
*రిజర్వేషన్ బూడిద కుప్ప కోసం రాజకీయ ఫిట్టింగ్ పెట్టెస్తే*
*మనదొడ్లో పూచిన పూలను చూచి*
*అసురపడుతున్నదెవరు ?*
*పొలం గట్టు మీద ఎక్కడో ఒక జొన్న మొక్క*
*నేవళంగా ఎదిగినంత మాత్రాన*
*భూసారమంతా లాగేసుకుందని*
*సిగ్గుమాలిన సిరా చుక్కలు కత్తిదూయటం"*

**(దళిత వ్యాకరణం:2007;పుటసంఖ్య :45,46)**

పైన తెలిపిన విధముగా దళిత సాహిత్యంలో అంతర్భాగంగా వచ్చిన ఏకీకరణ సాహిత్యాన్ని ప్రారంభదశలో కొంత ఉద్వేగానికి లోని రచయితలు సాహిత్య సృష్టి చేసినా కాలనుక్రమంలో ఒక వాదంగా తన స్థానాన్ని నిలబెట్టుకోవటంలో విఫలం అయిందనే చెప్పుకోవాలి.

భారతదేశంలో మొదలైన సామజిక ఉద్యమాల్లో దళిత ఉద్యమానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ లో నిరసన ప్రతిఘటన ఉద్యమాలు 19 వ శతాబ్దం ఉత్తరార్ధం నుండి ఇప్పటి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. వీటిని విజయవంతంగా నిర్వహించి భాధితుల పక్షాన నిలబడి వారికి తగిన న్యాయం చేయటంలో మాలల ధైర్యసాహసాలు, ఉద్యమాలు, సాహిత్యం చెప్పుకోదగినవి.

*" మేము వస్తున్నాం*
*గజిబిజి లేకుండా స్పష్టంగా, సూటిగా వస్తున్నాం*
*నిజాయితిగా, నిటారుగా వస్తున్నాం*

*ఎత్తుపల్లాలను*
*వంకర టింకరలను సరిచేయాడానికి*
*వంగిన వెన్నెముకను నిటారుగా నిలబెట్టడానికి*
*మేమొస్తున్నాం*
*శంభూకుని శిరస్సు వెతికి పట్టుకోవటానికి*
*తెగిపడ్డ బొటనవేలు తిరిగి నిలబెట్టడానికి*
*మేమొస్తున్నాం*
*కుట్రదారులారా ఖబడ్దార్*
*మీ డంకాలను బద్దలు కొట్టడానికి*
*కన్నమనీదు ఖడ్గాలమై వస్తున్నాం"* అని సగర్వంగా వర్తమానానికి సవాల్ చేసిన మాలలు చాలా గొప్ప చరిత్ర,సంస్కృతీ కలవారు.

అంతేగాక ఉమ్మడి దళితఉద్యమంలో కీలకపాత్ర పోషించిన మాలమేధావులు, కవులు, ఉద్యమకారులు వర్గీకరణ ఉద్యమం ప్రారంభం అయిన తర్వాత ఉద్యమ స్తబ్ధతకు, సాహిత్య అస్థిరత్వానికి లోనయ్యారనేది వాస్తవం. దళిత ఉద్యమ క్షేత్రంలో అటు వర్గీకరణ ఉద్యమ డప్పును వాయించలేక ఇటు మాల మహానాడు పేరుతో జరుగుతున్న సమైక్యతారాగాలు ఆలపించలేక మాల, మాదిగ పల్లెలలో రాగాలు వచ్చిన రానట్లు, అన్ని తెలిసిన తెలియనట్లు విగ్రహ ఆవిష్కరణలలో, పుస్తకావిష్కరణలో పాత చరిత్రలే పాడుకుంటూ కాలం గడిపేస్తున్నారు. ఇలా కాలయాపన చేయటం వలన ముందు తరం బాగుపడ్డ నష్టపోయేది వర్తమాన, భవిష్యత్ తరాల దళిత యువత అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. వర్గీకరణ,ఏకీకరణ ఉద్యమ నేపథ్యంలో దళితుల మధ్య ఏర్పడిన అనైక్యతకు చరమ గీతం పాడి దళిత ఉద్యమాన్ని, సాహిత్యాన్ని సమీక్ష చేసుకొని ఉద్యమ వైభవాన్ని పున:నిర్మించుకొని రిజర్వేషన్ ఫలాలు అన్ని రంగాల్లో పూర్తీ స్థాయిల్లో అమలయ్యేలా కృషి చేయాలి. తద్వారానే బాబాసాహెబ్

అంబేద్కర్ ఆలోచనలను అనుసరించిన వాళ్ళం అవుతాం, లేదంటే కొన్ని వందల యేళ్ళు గడిచిన ఊరికి వాడకి మధ్య విభజన రేఖ దళితులలో జీవితాల్లో సజీవంగానే మిగిలిపోతుంది.

# సింహావలోకనం

# సింహావలోకనం

తెలుగు సాహిత్యంలో ఒక వాదంగా వచ్చిన దళిత సాహిత్యం కాలానుక్రమంలో తెలుగు సాహిత్య ఉనికినే ప్రశ్నించే స్థాయికి ఎదిగింది. దళిత సాహిత్యం తెలుగులో దళిత సాహిత్యం ప్రత్యామ్నాయ స్థితిగతులని ఏర్పాటు చేసుకొని సాహిత్య స్వరూప స్వభావాలను మార్చేస్తుంది అనుకున్న తరుణంలో దళిత ఉద్యమంలో, సాహిత్యంలో వచ్చిన అనూహ్య మార్పుల వలన కొంత దళిత సమాజంలో స్తబ్దత ఏర్పడిందన్న మాట వాస్తవం. దీనికి ప్రతిరూపమే లక్ష్మీంపేట ఘటన. కారంచేడు, చుండూరు ఘటనల తర్వాత దళితుల ఐక్యతను చూసి అగ్రవర్ణ సమాజం దళితులపై దాడి చేయాలంటే ఆలోచించేది. అలాంటిది ఎప్పుడైతే రిజర్వేషన్ల వివాదం ఇంటి నుండి రచ్చకెక్కిందో, రోడ్డెక్కి దళితుల ఇంటి విషయాలు ఎవరైతే దళితులపై దాడులు చేసారో వారి చేతిలో పెట్టి వారినే న్యాయం చేయమని ఒక వర్గం పోరాడితే. మరొక వర్గం తమకు న్యాయం చేయమని పోరాటం మొదలు పెట్టారు. తద్వారా దళితుల అనైక్యత అగ్రవర్ణ సమాజానికి ఆసరాగా మారి దాడులు చేయటానికి అవకాశం ఏర్పడింది. దళిత ఉద్యమం ఆసరాగా దళిత సాహిత్యంలో కూడా అనైక్యత చోటుచేసుకుంది. అది ఎంతవరకు వెళ్ళిదంటే ఇన్నాళ్ళు దళితుల గురించి మాట్లాడిన, దళిత సాహిత్యం రాసిన వారిని గుండెలకత్తుకొని గౌరవించారు. అలాంటిది ఇప్పుడు దళితసాహిత్యం రాసిన వ్యక్తి దళితుడా, దళితేతరుడా అనేది పోయి మాదిగ కులస్థుడా, మాల కులస్థుడా రాసింది మాలల గురించా? మాదిగల గురించా అనే నూతన శోధనలు మొదలయ్యాయి. తన కుల సంస్కృతీ, సాహిత్యాల గురించి శోధించటంలో తప్పు లేదు కానీ ఎదుటి కులాల గురించి అసత్య ప్రచారాలు చేయటం ఒక కులానికి ఉన్న అవమానాలు వేరే కులానికి ఉన్న అవమానాలు ఒకటి కాదు అనటం వంటి విషయాలు కొంత దళిత సమాజాన్ని పక్క దోవ పట్టిస్తాయి. దళితులందరికి అవమానాలు ఒకటే; ఆకలి బాధ ఒకటే; కాకపోతే

కొంత మౌలికమైన తేడా మాత్రమే దాన్ని అధిగమించడం పెద్ద సమస్య కాదు. కొన్ని తరాల అవమానాల్ని, అణచివేతల నుండి నిలదొక్కుకుని ఇప్పుడిప్పుడే మనుషులుగా బ్రతుకుతున్న వాళ్ళం ఇంత మౌలికమైన తేడాని చేధించలేమా. వర్గీకరణ జరిగితే ఐక్యత దెబ్బతింటుందని, ఉమ్మడిగానే ఏమైనా సాధించమనే పిడివాదాన్ని ఒక వర్గం వీడి ఎలా వర్గీకరణ జరగాలో ఆలోచిస్తే మంచిదని జరిగిన సంఘటనలను బట్టి అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఇక, దళిత సాహిత్య పరిస్థితి దయనీయంగా ఉంది. ఏకీకరణ సాహిత్యం అని ఒక వర్గం ఏర్పాటు చేస్తే, మరొక వర్గం వర్గీకరణ సాహిత్యం అని మరో శిబిరం ఏర్పాటు చేసారు. దీని వలన దళిత సాహిత్య పరిధి ప్రాధాన్యతలు పెరిగాయి. కానీ పెరుగుతున్న క్రమంలో దళితసాహిత్య లక్ష్యాలు కూడా నీరుగారిపోతున్నాయన్న విషయాన్ని దళిత మేధావులు, రచయితలు గుర్తించాలి, మనం ఏం రాసిన అది దళిత సమాజానికి మేలు చేకూర్చేదిగా ఉండాలే కానీ దళిత సమాజాన్ని విడగొట్టే విధంగా ఉండకూడదు. ఎక్కడైతే సమస్య ఉందో అక్కడ సామాజిక ఉద్యమాలు పుట్టడం సహజం. ఆ ఉద్యమంలో నిజాయితీ ఉంటే ఆ సమస్య నిజమైనదైతే ఆ లక్ష్యం నెరవేరే వరకు ఉద్యమం కొనసాగుతుంది. కానీ ఉద్యమం తాత్కాలికంగా ఏర్పాటు అయి ఎవరో చేస్తున్నారు మనం చేయాలి అన్న ధోరణితో ఉంటే అది ఎక్కువ కాలం నిలబడదు. కనుక దళిత ఉద్యమంలో వచ్చిన అంతర్గత వాదాలకు వీలైనంత త్వరగా స్వస్తి చెప్పి మారుతున్న కాలానికి అనుగుణంగా దళిత ఉద్యమాన్ని, దళిత యువతను ప్రోత్సహించాల్సిన బాధ్యత దళిత మేధావులపైన, దళిత రచయితలపైన ఉంది.

**పరిశోధన ఫలితాంశాలు :**

*“దళితసాహిత్య విమర్శ సమకాలీన ధోరంణుల పరిశీలన”* అనే ఈ నా పరిశోధనలో ప్రధానంగా ఈ క్రింది ఫలితాంశాలు వెలువడ్డాయి,

1. దళితులంటే ఎవరు? దళితులకు దళితేతరులకు గల తేడా ఏమిటి? ఈ

భేధం ఎలా ఈ సమాజంలోకి ప్రవేశించింది. ఈ వివక్షతకు కారకులెవరు? అనే అంశాలను ఆధార సహితంగా ప్రముఖుల అభిప్రాయాలు జోడించి చెప్పటం జరిగింది.

2. షెడ్యూల్డ్ కులాల వారికి దళితులు అనే పదాన్ని ఆపాదించిందెవరు? దళిత అనే పదం ఎలా ఆవిర్భవించింది? దళిత అనే పదానికి ముందు వీరికి ఏయే పేర్లుఉన్నాయి? అస్పృశ్యులు, అంత్యజులు, మ్లేచ్ఛులు, అంటరానివారు, నీచులు, హరిజనులు అనే పేర్లు ఎలా వచ్చాయి.. వీటిని షెడ్యూల్డ్ కులాల వారిపై ప్రయోగించిందెవరు? అనే విషయాలు తెలియజేశాను.

3. తెలుగుసాహిత్య అధ్యయనం ప్రారంభమైన తర్వాత దళిత సాహిత్య రూపురేఖలు ఏమన్నా ఉన్నాయా? ఒకవేళ ఉంటే వీరికి ఎటువంటి స్థానం కల్పించారు.

4. ప్రాచీన తెలుగు సాహిత్యంలో దళితకులాల వారిని ఏయే సందర్భాలలో ఆయా రచయితలు ప్రయోగించారో తెలియజేశాను.

5. దళిత ఉద్యమం ఎప్పుడు ప్రారంభమైంది? దళిత ఉద్యమ నేపథ్యం ఏమిటి? దళిత ఉద్యమంలో పూలే, అంబేద్కర్ వంటి మహనీయుల పాత్ర ఏమిటి ? అనే అంశాలు స్థూలంగా చర్చించాను.

6. ఆధునిక కాలంలో దళిత సాహిత్యం ఎప్పుడు ప్రారంభమైంది? దళిత సాహిత్య ఆవిర్భావానికి గల నేపథ్యం ఏమిటి? సాహిత్యం మొదట ఏ ప్రక్రియలో మొదలైంది, తర్వాత ఎలా పరిణితి చెందింది? సాహిత్యానుక్రమంలో తన అస్తిత్వాన్ని ఎలా కాపాడుకోగలిగింది అనే అంశాలు పరిశీలించటం జరిగింది.

7. తెలుగులో సాహిత్య విమర్శ ఎలా ప్రారంభమైందో, ఎలా వికాసం చెందిందో చెప్పటం జరిగింది. విమర్శ గురించి వివిధ ప్రముఖ

సాహితీవేత్తల అభిప్రాయాలను క్రోడికరించటం జరిగింది.

9. తెలుగు సాహిత్యవిమర్శ ప్రారంభమైన దశలో ఎలా ఉందో, ప్రస్తుతం ఎలా ఉందో చెబుతూనే విమర్శరకాలను స్థూలంగా విశ్లేషించటం జరిగింది.

10. తెలుగు సాహిత్యవిమర్శ ప్రస్తానంలో దళిత సాహిత్య విమర్శ స్థానం ఏమిటో విశ్లేషించటం జరింగింది. అంతేకాకుండా ప్రస్తుతం దళిత సాహిత్య విమర్శ వస్తున్న తీరు అంటే వర్గీకరణ, ఏకీకరణ దృక్పథాన్ని పరిశీలించటం జరిగింది.

11. సమకాలీన కాలంలో వచ్చిన కవితా ధోరణుల ఆధారంగా దళిత సాహిత్యాన్ని, సాహిత్య విమర్శను విశ్లేషించటం జరిగింది.

12. ప్రధానంగా దళిత సాహిత్యం సంప్రదాయ, మార్క్సిస్టు, అంబేద్కర్, స్త్రీవాద, వర్గీకరణ, ఏకీకరణ, బహుజన వాదాలలో ఎలా ఉందో సూచనప్రాయంగా చెప్పటం జరిగింది.

13. పైన తెలిపిన వాదాలన్ని కూడా ఆయా కాలాలకు అనుగుణంగా, ఆయా భావజాలాల దృష్ట్యా వచ్చాయని, దళిత సాహిత్యంలో సమకాలంలో వర్గీకరణ, ఏకీకరణ సాహిత్య విమర్శ వచ్చిందని తెలపటం జరింగింది.

14. ముందుగా భారతరాజ్యాంగం షెడ్యూల్డ్ కులాలను ఏవేవిగా పేర్కొనిందో చెప్పటం జరిగింది.

15. ఆంధ్రప్రదేశ్ లోని మాదిగ దాని అనుబంధ కులాలను వారి గ్రూపులు ఆధారంగా గుర్తించటం జరిగింది.

16. ఇంతకు ముందు రిజర్వేషన్ల పంపిణీ విధానం ఎలా ఉందో చెబుతూనే ప్రస్తుతం వాటిలో గల లోపాలను చెప్పటం జరిగింది.

17. వర్గీకకరణ ఉద్యమం ఎలా ఆవిర్భవించింది? దాని లక్ష్యాలు ఏమిటి ? ఆయా రంగాలలో వారి వాటా ఎంత ? వివిధ కమీషన్లు ఇచ్చిని నివేదిక ఆధారంగా చెప్పటం జరిగింది.

18. వర్గీకరణ ఉద్యమానికి అనుబంధంగా దండోరా సాహిత్యం ఎప్పుడు, ఎలా ఆవిర్భవించింది? అనే విషయాలను చెప్పటం జరిగింది.

19. వర్గీకరణ సాహిత్యంలో ప్రధానంగా ఏయే ప్రక్రియలు వస్తున్నాయి. వర్గీకరణ సాహిత్యానికి ప్రధాన కవితా వస్తువులేవి ? అనే అంశాలు చెప్పటం జరిగింది.

20. వర్గీకరణ ఉద్యమం, సాహిత్యం గురించి వివిధ కవులు, రాజకీయ విశ్లేషకుల అభిప్రాయాలను ఆధార సహితంగా చెప్పటం జరిగింది.

21. వర్గీకరణ ఉద్యమంలో ఆంధ్రప్రదేశ్ లో పాల్గొంటున్న ప్రధాన కులాలేవి? వాటికి(మాదిగ దాని అనుబంధ కులాలకు) సంబంధించి ఆయా రచయితల, ప్రముఖుల అభిప్రాయాలు చెప్పటం జరిగింది.

22. వర్గీకరణ సాహిత్యంలో వచ్చిన ప్రముఖ గ్రంథాలన్నింటిని పేర్కొనటం జరిగింది. ఆయా గ్రంథాల ఆధారంగా వర్గీకరణ సాహిత్య విమర్శ ఎలా వస్తుందో విశ్లేషించటం జరిగింది.

23. వర్గీకరణ విధానానికి సంబంధించి నూతన ప్రతిపాదనలు కూడా ఆయా ప్రముఖుల అభిప్రాయాల ఆధారంగా చెప్పటం జరిగింది.

24. ఏకీకరణ ఉద్యమం ఎప్పుడు, ఎలా ఆవిర్భవించింది? దాని లక్ష్యాలు ఏమిటి ? ఆయా రంగాలలో వారి వాటా ఎంత ? ప్రభుత్వాలు నియమించిన వివిధ కమీషన్లు ఇచ్చిన నివేదికను ఆధార సహితంగా పరిశీలించటం జరిగింది.

25. ఏకీకరణ ఉద్యమానికి అనుబంధంగా ఏకీకరణ సాహిత్యం ఎలా వచ్చింది, అది ఇప్పుడు కొనసాగుతుందా లేక కనుమరుగైందా అనే విషయాలను పరిశీలించటం జరిగింది.

26. ఏకీకరణ సాహిత్యంలో ప్రధానంగా ఏయే ప్రక్రియలు వస్తున్నాయి. ఏకీకరణ సాహిత్యానికి ప్రధాన కవితా వస్తువులేవి అనే అంశాలు ఇంకా పరిశోధనలో నిరూపించటం జరిగింది.

27. ఏకీకరణ ఉద్యమం, సాహిత్యం గురించి వివిధ కవులు, రాజకీయ విశ్లేషకుల అభిప్రాయాలను ఆధార సహితంగా క్రోడికరించాను.
28. ఏకీకరణ ఉద్యమంలో ఆంధ్రప్రదేశ్ లో పాల్గొంటున్న ప్రధాన కులాలేవి? వాటికి(మాల దాని అనుబంధకులాలకు) సంబంధించి ఆయా రచయితల, ప్రముఖుల అభిప్రాయాలను పొందుపరచాను.
29. ఏకీకరణ సాహిత్యంలో వచ్చిన ప్రముఖ గ్రంథాలన్నింటిని సేకరించాలి. ఆయా గ్రంథాల ఆధారంగా ఏకీకరణ సాహిత్య విమర్శ ఎలా వస్తుందో శాస్త్రీయబద్ధంగా విశ్లేషించాను.
30. ఏకీకరణ విధానానికి సంబంధించి నూతన ప్రతిపాదనలను కూడా పొందుపరచాను.
31. చివరగా వర్గీకరణ, ఏకీకరణ వస్తున్న తీరు ఆధారంగా దళిత సాహిత్య వికాసంలో వీటి పాత్ర ఏమిటో తెలియజెప్పి, అంటే ఇలా రెండు ఉద్యమ, సాహిత్య శిబిరాలుగా విడిపోవటం దళిత ఉద్యమానికి, దళిత సాహిత్యానికి ప్రయోజనమా? అప్రయోజనమా? వీటి వలన దళిత సాహిత్య పరిధి పెరుగుతున్నట్లా లేక తరుగుతున్నట్లా అనే అంశాలను సాహిత్య విమర్శకుల రచనల ఆధారంగా పరిశీలించాను.
32. దళిత సాహిత్యం అంతం అయిపోయిందని అది రెండు గ్రూపులుగా విడిపోయిందనే వాదనను ఈ పరిశోధన ఖండిస్తూ దళితల సమస్యలు, అవమానాలు ఉన్నంత కాలం దళితసాహిత్యం సజీవంగానే ఉంటుందని కాకపోతే వివిధ రూపాల్లో వ్యక్తమవుతుందని ఈ పరిశోధన నిరూపించటం జరిగింది.
33. ఏదైనా సాహిత్యం వాదం ఆయా కాలాలకే పరిమితమై తర్వాత కనుమరుగు అయిపోతుందనే భావన దళిత సాహిత్యానికి వర్తించదు. దళితుల సమస్యలు అంతరించి పోవాలంటే భారతదేశంలో కుల

అంతరించిపోవాలంటే హిందూధర్మ శాస్త్ర సూత్రాలను తిరస్కరించాలి ఇది ఈ హిందూ దేశంలో జరిగేది కాదు కాబట్టి దళితుల అవమానాలు, దళితసాహిత్య ప్రస్తానం కొనసాగుతూనే ఉంటుంది. కాబట్టి దళిత సాహిత్యం సజీవంగానే ఉంటుందని ఈ పరిశోధన నిరూపించింది.

34. దళిత ఉద్యమంలో, దళితసాహిత్యంలో విభేధాలు వచ్చిన మాట వాస్తమే కానీ ఇవి శాశ్వతం కాదు తాత్కాలికం మాత్రమే అనే అంశాన్ని ఈ పరిశోధన నిరూపించింది.

35. దళిత ఉపకులాలు గానీ, ఉమ్మడి కులాలు గానీ పోరాడేది దళిత జాతి ప్రయోజనానికే అనే భావనను ఈ పరిశోధనను నిరూపించింది.

తెలుగు సాహిత్య అస్తిత్వాన్నే ప్రశ్నించిన దళిత ఉద్యమం, దళిత సాహిత్యం వచ్చి దాదాపుగా 30 సంవత్సరాలు అవుతుంది. ఇన్నేళ్ళ దళిత ఉద్యమ, సాహిత్య ప్రస్థానంలో ఎన్నో మలుపులు, గెలుపులు, శత్రువైరుధ్యాలు, మిత్ర వైరుధ్యాలు దళితుల మధ్య ఏకీకరణ, వర్గీకరణ ఉద్యమాల ప్రభావంతో వారిలో నెలకొన్న అనైక్యత, దళిత రచయితల్లో వచ్చిన స్తబ్దత ఇలాంటి అంశాలు దృష్టిలో పెట్టుకొని మునుపటి వర్గీకరణ కంటే కొంత ముందుచూపుతో నూతనవర్గీకరణకు కొంత మేధావులు మార్గాన్ని చూపారు, వారు చూపిన వాటిలో ప్రధానమైనవి,

**నూతన వర్గీకరణ - ప్రతిపాదనలు :**

1. 2001 జనాభా లెక్కల ప్రాతిపదికగా తీసుకోవాలి.
2. కులాలవారీ జనాభా ప్రకారం పంపిణీ శాతం నిర్ధారించాలి.
3. రాష్ట్రంలో చారిత్రకంగా ప్రాంతీయ అసమానతలున్న దృష్ట్యా ప్రాంతాల (ఉత్తరాంధ్ర, దక్షిణాంధ్ర,తెలంగాణ, రాయలసీమ) వారీగా శాతాల కేటాయింపులు ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగనియామకాలు ఆరు జోన్లవారీగా ఉన్నందున జోన్ల ప్రాతిపదికయినా మరింత నిర్దిష్టంగా ఉంటుంది.

4. చారిత్రక ఆది ఆంధ్ర ఉద్యమం ఫలితంగా మాల, మాదిగలే (అధిక శాతం మాలలే) ఆదిఆంధ్రులుగా గుర్తింపు కలిగి ఉన్న అంశాన్ని దృష్టిలోకి తీసుకుని నేడు వారు మాల, మాదిగలుగానే ఉనికిలో ఉన్నందున ఆది ఆంధ్ర కేటగిరీ ప్రత్యేకంగా "డి' గ్రూపుగా పెట్టాల్సిన అవసరం లేదు.
5. తక్కువ జనసంఖ్య కలిగి ఏ రంగంలోనూ తగిన ప్రాతినిధ్యం లేని కులాలకు కేటగిరీలో తొలి ప్రాధాన్యం ఇవ్వాలి.
6. పట్టణాలు, గ్రామాల మధ్య పెరిగిన వ్యత్యాసాల దృష్ట్యా ప్రతి కులంలో పేదలకు గ్రామీణులకు రిజర్వేషన్ సదుపాయాలు అందించే విధంగా ప్రాధాన్యతా మార్గదర్శకాలుగా ఉండాలి. అయితే ఇవి రిజర్వేషన్లు పొందేవారిలో ఎదిగినవారిని మినహాయించేవిగా ఉండకూడదు.
7. రూపొందిన కేటగిరీల్లో(రోష్టర్ లో) అర్హత కలిగిన వారు లేకపోయినా కొన్ని మినహాయింపులు పాటించి అవకాశాలు దక్కేలా చూడాలి'(**మాల, మాదిగల ఐక్య సాధనా వేదిక**, **ప్రెస్ క్లబ్**,**6/07/2007**).

ఈ పరిశోధనలో నిరూపించిన అంశాలు, పరిశోధనలో పేర్కొన్న అంశాలు దళిత ఉద్యమానికి ఏ మాత్రం ఉపయోగపడిన, వర్గీకరణ, ఏకీకరణ వివాదానికి ఈ పరిశోధనలో సూచించిన మార్గాలు ఉపయోగపడిన ఈ పరిశోధన సార్ధకమైకమైనట్లే. ఈ పరిశోధనలో తెలిపిన విషయాలు కొన్ని ఆధారగ్రంథాల ద్వారా మరికొన్ని విషయాలు ప్రముఖుల అభిప్రాయాల ఆధారంగా తెలియజెప్పి వాటికి నా అభిప్రాయాలను జోడికరించి ఈ పరిశోధన ఫలితాంశాలుగా నిరూపించటం జరిగింది. ఈ పరిశోధనలో పేర్కొన్న అంశాలు భవిష్యత్ పరిశోధకులకు మార్గదర్శకంగా నిలుస్తుందని భావిస్తూ " **దళిత సాహిత్య విమర్శ – సమకాలీన ధోరుణుల పరిశీలన"** అనే పరిశోధన చేయటం వలన తెలుగు సాహిత్యంలోనూ, దళిత సాహిత్యంలోనూ వచ్చిన పరిణామవికాసాలనూ గుర్తించగలిగానని అనుకుంటున్నాను. ఈ పరిశోధన దళిత సాహిత్యంలో వచ్చిన

అనేక పరిణామాలను సాహిత్య ప్రపంచానికి తెలియజేయడానికి లేదా తెలుసుకోవడానికి ఉపయోగపడుతుందని నమ్ముతున్నాను.

నన్నయ్య నుండి ఆధునిక సాహిత్యంలో నారాయణ రెడ్డి వరకు వచ్చిన సాహిత్యం కొన్ని ప్రభావిత వర్గాల సాహిత్య సృష్టికి కారణం అయింది. ఆ సాహిత్య సృష్టి ఆ సమాజ చైతన్యాన్ని తెలియజేస్తుంది. ప్రాచీన తెలుగు సాహిత్యంలో బ్రాహ్మణ, మరి కొన్ని అగ్ర వర్ణాలు తమకు తెలిసిన జీవితాలను వర్ణిస్తూ తమని ఉన్నతులుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. ఆధునిక సాహిత్యం వచ్చేవరకు మత భావనల నుండి, ఆధిపత్య భావనల నుండి, అగ్రవర్ణ స్వభావం నుండి బయట పడే ప్రయత్నంలో లేదా బయటికి వచ్చే ప్రయత్నంలో మతానికంటే మనిషిని కేంద్రంగా చేసుకున్నారు. ఆ విధంగా సాహిత్యంలో మానవత్వ కోణం కనిపించ సాగింది. అభ్యుదయ, విప్లవ సాహిత్యం వచ్చిన తర్వాత మరలా మానవులలో గల బేధాలకు, ఆధిపత్యాలకు ఆర్థిక కోణాలు ప్రధానం అవుతాయని గుర్తించారు. అయితే ప్రపంచవ్యాప్తంగా వచ్చిన అనేక సామాజిక ఉద్యమాలు కేవలం ఆర్థికాంశాలు అన్నింటిని ప్రభావితం చేస్తాయనేది పరిపూర్ణ సత్యం కాదని నిరూపితం కావటం మొదలైంది. సాంస్కృతిక అంశాలు, ప్రాంతీయ విషయాలు సాహిత్యంలో ప్రధాన వస్తువులయ్యాయి. సమస్య పరిష్కారానికి ఏకకోణం నుండి బహుకోణాల సమన్వయం అవసరమని పోస్ట్ మోడ్రెన్ థీరీస్ (ఆధునికోత్తర సిద్ధాంతాలు) స్పష్టం చేస్తున్నాయి. ప్రతివాళ్ళు తమ తమ అస్తిత్వాన్ని వెతుక్కోవటం, జీవితాన్ని, సాహిత్యాన్ని పునర్నిర్మించుకోవటం ప్రస్ఫుటంగా కనిపించ సాగింది. ఈ విధంగా ప్రపంచ పరిణామాలతో అనుసంధానమైన సాహిత్య అంశాలు దళిత సాహిత్యంలో కనిపించడం తెలుగు సాహిత్యానికి ఒక కొత్త తోడ్పాటు, కొత్త ఆలోచనను కలిగించినట్టు అయింది.

అంతవరకు సాహిత్యం కొన్ని వర్గాలకు, కొన్ని భావాలకు పరిమితమై, కొన్ని అంశాలకు మాత్రమే సార్వజనీనంగా ఉండేది. సుఖదు:ఖాలు, ప్రేమ, ద్వేషం

మొదలైన భావావేశాలను సార్వజనీన అంశాలుగా చెప్పేవారు. కానీ దళితసాహిత్యం ఆ అంశాలతో పాటు వివక్ష కోణాన్ని బహిర్గతం చేసి ప్రపంచ సాహిత్యాలతో అనుసంధానం అయ్యేట్టు చేసింది. కేవలం కొన్ని ఎమోషన్స్ వరకే పరిమితమైన సార్వాజనీకత దళిత సాహిత్యం వలన సమస్యల పరిష్కారాలలోనూ, ఎమోషన్స్ లోనూ తదితర అనేక కోణాలలో నిజమైన సార్వజనీనకతను సాహిత్యానికి అందించింది. అంతేకాకుండా సాహిత్యం దైవతత్వం అని, భాష ఉదాత్తం అని శ్రేష్ట వర్గాలు మాత్రమే సాహిత్యాన్ని ఉత్పత్తి చేస్తాయనే భావాలను దళిత సాహిత్యం తిరస్కరించింది.

జీవితానికి, సాహిత్యానికి, సమాజానికి త్రికోణమితిలో ఒక విడదీయరాని సంబంధాన్ని, వాస్తవికంగా అనుభవపూర్వకంగా, ఆచరణాత్మకంగా ప్రతిఫలింప చేసింది. వస్తువు దాన్ని రాసిన వ్యక్తులు, దాన్ని రాయటానికి ఉపయోగించిన భాష వాస్తవికతను ప్రతిఫలించింది. దళితసాహిత్యం తీసుకువచ్చిన ఈ మౌలికమైన మార్పు అంతకు ముందు కనిపిస్తుందని చెప్పలేము. ఈ దృక్పథంతోనే, ఈ వాస్తవికతతోనే దళితులలోని ఉపకులాల వారందరూ ఆలోచించటం మొదలు పెట్టారు. దళితులలోని ఉపకులాలవారందరూ రాయడం మొదలు పెట్టారు. వివక్షతకు గురికావటానికి స్వపర భేదం అవసరం లేదని నినదించాయి అనేది ఈ పరిశోధనలో తేలిన ప్రాథమిక పరిశోధన అంశం.

యావత్ తెలుగుసాహిత్యాన్ని దాని విలువలని నిర్ణయించేటప్పుడు ప్రమాణాలుగా తీసుకున్న అలంకార శాస్త్రం , విమర్శా సూత్రాలు దళిత సాహిత్యానికి సరిపోవని నూతనసూత్రాలు, నూతన సమన్వయాలు అవసరమని అనుభవపూర్వకంగా తెలిసేలా దళిత సాహిత్యం ఒక నూతన అధ్యాయానికి దారులు వేసింది. ఈ అంశాలన్ని నా పరిశోధనలో చాలావరకు గుర్తించగలిగాను. తెలుగు సాహిత్యంలో ఉన్న ప్రక్రియా వైవిధ్యంతో పాటు దాన్ని కొనసాగిస్తూనే నూతన ప్రక్రియా ఆవిర్భావానికి దళిత సాహిత్యం విస్తృతంగా తోడ్పడింది.

దీర్ఘకావ్యం, క్యాసెట్, మౌకిక సూత్రం, గజల్, పాట ముఖ్యంగా పర్సనల్ నెరేటివ్ రైటింగ్స్ రాయటం దళిత సాహిత్యం వల్లనే సంభవించింది. ఒకవైపు ప్రపంచ సాహిత్య స్థితిగతులను పరిశీలిస్తే ముఖ్యంగా ఆఫ్రికా నీగ్రో సాహిత్యం ప్రపంచ దేశాల్ని కుదిపేసింది. అలాగే భారతదేశంలో దళిత సాహిత్యం తన విశిష్టతను చాటుకుంది. ఈ అంశాలతో పాటు కవిత్వం, దానిలోని అంతర్ విభాగాలైన పద్యం, వచనం, హైకూ, గజల్, గేయం మొదలైన ప్రక్రియలను, వాటితో పాటు కథలు, నవలలు, నాటికలు మొదలైన ప్రక్రియల్లో కూడా పరిశోధన జరగవలసి ఉన్నదని అనిపిస్తుంది. ఆయా రంగంలో కృషి చేసే వారికి అనేక అవకాశాలు ఉన్నాయని కూడా అనిపిస్తుంది. నా పరిశోధన కాలం, పరిశోధన పరిధిని దృష్టిలో ఉంచుకుని అవసరం మేరకే ఈ పరిశోధనలో విశ్లేషించాను. మిగతా వాటిని భావి పరిశోధకులు సునితంగా పరిశోధన చేయగలరని భావిస్తున్నాను.

చివరగా నా పరిశోధన ఫలితాలను ఒక్కమాటలో చెప్పాలంటే దళిత సాహిత్య విమర్శలో పరిశోధన చేసిన తర్వాత అలంకార శాస్త్రాలు, సాహిత్య విమర్శ సూత్రాలు మాత్రమే దళిత సాహిత్యాన్ని విశ్లేషించ లేవని, సామాజిక శాస్త్రాల తోడ్పాటు కూడా అవసరం అని గుర్తించగలిగాను. దళిత సాహిత్యం వచ్చిన తర్వాత తాత్వికత పట్ల, ఆచరణ పట్ల, అనుభవం పట్ల నూతన చర్చ జరిగిందని తెలిసింది. అంబేద్కర్ భావజాలం అనేది ఒక తాత్వికత. బుద్ధుని భావనలు, సాహూ మహారాజ్ ఆలోచనలు, జోతిరావ్ పూలే, పెరియార్ రామసామి నాయకర్, కార్ల్ మార్క్స్ తదితర భావనల నేపధ్యమంతా అంబేద్కర్ ఆలోచనల్లో కనిపిస్తుంది. వీటిలో కేవలం వర్గాన్ని మాత్రమే కాకుండా, కులాన్ని, జాతి వివక్షతలను కూడా పరిగణలోకి తీసుకున్న ఆలోచనల విధానమే అంబేద్కర్ భావజాలం లేదా దళిత తాత్వికత. ఈ ప్రధాన సూత్రాన్ని విస్మరించి చేసే ఏ విశ్లేషణ అయిన దళిత సాహిత్యాన్ని అంచనా వేయటంలో విజయవంతం కాలేదని ఈ పరిశోధన స్పష్టం చేస్తుంది.

# ఉపయుక్త గ్రంథ సూచిక

# ఉపయుక్త గ్రంథసూచి

**గ్రంథాలు :**


1. అచ్యుతశర్మ,సి.ఆర్.***తెలుగులో ప్రతి విమర్శ -పరామర్శ(సిద్ధాంత వ్యాసం)***;
   హైదరాబాదు విశ్వవిద్యాలయం: హైదరాబాద్,1989.
2. ఇనాక్,కొలకలూరి.***ఆధునిక విమర్శా సూత్రం***;
   మారుతి బుక్ హౌస్: గుంటూరు,1996.
3. కృపాచారి,గుజ్జర్లమూడి.***తెలుగుసాహిత్యానికి క్రైస్తవుల సేవ;***
   గుంటూరు, 1988.
4. చంద్రమౌళి,జ్యోతి. ***దళిత కిరణాలు;*** జానపదకళాపీఠం:
   అద్దంకి; ప్రకాశం జిల్లా,2005.
5. చిన్నారావు,యాగాటి.***దళిత ఉద్యమ చరిత్ర;***
   హైదరబాదు బుక్ ట్రుస్ట్,హైదరాబాద్,2007.
6. చెంచయ్య,వి.***సాహిత్యదృక్పథం;***విరసం ప్రచురణలు: నెల్లూరు,1995.
7. జయరాజు,తెన్నేటి.***ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ-పరిశీలన,***
   విశాఖపట్నం, 2006.
8. తెరేష్ బాబు,పైడి.***అల్పపీడనం;***హైదరాబాదు:నవ్యప్రింటర్స్,1996.
9. పద్మారావు,కత్తి.***కులంపునాదులు***;నెల్లూరు:
   నెల్లూరు జిల్లా హేతువాద సంఘ ప్రచురణ,1981.
10. పద్మారావు, కత్తి.***దళిత సాహిత్యవాదం-జాషువా***;
   పొన్నూరు:లోకాయుత ప్రచురణలు,1995.
11. ప్రసాద్, కలేకూరి.***దళిత ఉద్యమం - దళిత సాహిత్యోద్యమం;***
   హైదరాబాదు:1999.
12. ప్రేమ,కిషోర్. రావినూతల. ***గుండెదరువు***;హైదరాబాదు:2005.

13. బాలశ్రీనివాస మూర్తి, గుమ్మన్నగారి. ***సమకాలీన వాదాలు- సాహిత్య విమర్శ;*** సికింద్రాబాదు:జయశ్రీ పబ్లికేషన్, 2002.

14. భీమన్న,బోయి.(అనువాదం).***కులనిర్మూలన;*** హైదరాబాదుబుక్ ట్రస్టు: హైదరాబాదు,1994.

15. మల్లికార్జున,పి.***తెలుగులో దళిత కవిత్వరూపం - వస్తువు;(అముద్రిత సిద్ధాంతవ్యాసం):*** హైదరాబాదు విశ్వవిద్యాలయం,హైదరాబాదు,1997.

16. మస్తాన్ రావు, దేవరపల్లి. ***దళిత శతాబ్దం;*** లోకాయుత ప్రచురణలు: పొన్నూరు, 1997.

17. రవికుమార్,పొనుగోటి.***దళితకవిత్వంలో పురాణ ప్రతీకలు(అముద్రిత సిద్ధాంత వ్యాసం);***హైదరాబాదు విశ్వవిద్యాలయం:హైదరాబాదు,2003.

18. రత్నాజీ, నేలపూరి.***ఒకే గొంతు;***నీమాశ్రీ,సన్నీ& సనత్ ప్రచురణలు: చాగల్లు,2005.

19. రామారావు, ఎస్వీ. ***తెలుగులో సాహిత్య విమర్శ అవతరణ వికాసములు***; పసిడి ప్రచురణలు:1999.

20. రంగనాథాచార్యులు,కె.కె. ***తెలుగు సాహిత్యంలో దళిత చైతన్యం ఆధునిక సాహిత్యం - దళిత స్పృహ***, హైదరాబాదు; యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ:1994.

21. విజయానందరాజు, ఎల్లే. ***తెలుగుసాహిత్యం హరిజనల సేవ(అముద్రిత సిద్ధాంత వ్యాసం);*** హైదరాబాదు విశ్వవిద్యాలయం:హైదరాబాదు,1998.

22. విల్సన్ సుధాకర్, తుల్లిమల్లి.***దళిత వ్యాకరణం;***హైదరాబాదు;2007.

23. వీరభద్రయ్య,ముదిగొండ.***విమర్శమౌలిక లక్షణాలు;*** తెలుగు అకాడమీ:హైదరాబాదు,1990.

24. వెంకటేశ్వరరావు,దార్ల.***వీచిక(సాహిత్య విమర్శ వ్యాసాలు);*** స్వీయ ప్రచురణ: హైదరాబాదు, 2009.

25. శరత్ జ్యోత్స్నారాణి, యస్. ***స్వాతంత్ర్యనంతరం తెలుగు కవిత వస్తువు, రూపం, శిల్పం;***జ్యోత్స్న కళా పీఠ ప్రచురణలు:హైదరాబాదు,2003.

26. శాంసన్,పిల్లి.***దళితసాహిత్య చరిత్ర;*** స్వీయ ప్రచురణ:గుంటూరు,2000.

27. శిఖామణి.***దళిత సాహిత్య తత్వం;*** హైదరాబాదు లిటరరీ సర్కిల్ ప్రచురణ:1998.

28. శివప్రసాద్,ముదిగొండ.***ఉద్యమ దర్శనం;*** రసగంగోత్రి ప్రచురణలు:1990.

29. శ్యామ సుందరరావు, అంబటి. ***దళిత సాహిత్యం - భాషా దృక్పథం(అముద్రిత సిద్ధాంత వ్యాసం);***హైదరాబాదు విశ్వవిద్యాలయం:2000.

30. సత్యనారాయణ,ఎస్వీ.***దళితవాద వివాదాలు (సంపాదకుడు);*** విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్: హైదరాబాదు,2000.

31. సాంబయ్య, గుండెమెడ.***బ్రాహ్మణత్వ మాలత్వమా...? మానవత్వ అంబేద్కరత్వమా..?*** ;రాజ్యం ప్రచురణలు:హైదరాబాదు,2006.

32. సుబ్రహ్మణ్యం,జి.వి.***సాహిత్యంలోచర్చనీయాంశాలు***;తెలుగు అకాడమీ:హైదరాబాదు,2002.

33. స్వామి,గూటం.ఏకీకరణీయం(దళిత ఆర్తి కావ్యం);2005.

34. సుధాకర్,ఎండ్లూరి.***వర్గీకరణీయం(దళిత దీర్ఘ కావ్యం)***;మానస మనోజ్ఞ ప్రచురణలు:రాజమండ్రి,2004.

35. సుధాకర్, ఎండ్లూరి. మంజులత, ఆవులత (సంపాదకులు). ***ఆధునిక సాహిత్యంలోప్రక్రియలు-ధోరణులు,***తెలుగు అకాడమీ:హైదరాబాదు,2005.

36. అంబేద్కర్,బి.ఆర్.***ఆధునిక భారతంలో అంటరానితనం*** *(తెలుగు అనువాదం– కాత్యాయని);*హైదరాబాదు బుక్ ట్రుస్టు,సెంటర్ ఫర్ దళిత స్టడీస్, అక్టోబర్,2006.

37. ఐలయ్య, కంచ. ***ఉత్పత్తి-తెలుగుసాహిత్య వారసత్వం;***
హైదరాబాదు బుక్ ట్రస్టు, డిసెంబరు 2003.

38. ***కందిలి మాదిగ మహాజన కవిత్వం;***
మాదిగ మహాజన ప్రచురణలు, హైదరాబాదు, సెప్టెంబరు, 2007.

39. కుబేర్, యన్, డబ్ల్యు.డా.బి.ఆర్.***అంబేద్కర్ విశ్లేషణాత్మక అధ్యయనం;***
ప్రజాశక్తి బుక్ హౌస్.అక్టోబర్ 2008.

40. కాత్యాయని విద్మహే.***ఆధునిక భారతంలో అంటరానితనం;***
హైదరాబాదు బుక్ ట్రస్టు, 2006

41. కేశవకుమార్,పి. ***దళిత ఉద్యమం వెలుగు నీడలు***; గౌరీ శంకర్, జూలూరు (సంపాదకుడు). స్పృహ సాహితీ సంస్థ, 2009.

42. కేశవకుమార్, సత్యనారాయణ,కె.(సంపాదకులు) ***దళిత మేనిఫేస్టో***; హైదరాబదు సెంట్రల్ యూనివర్సిటి.1995.

45. జగన్నాథం, పేర్వారం.***సమాజం,సాహిత్యం, రాజకీయాలు;***శ్రీ
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,హైదరాబాదు,1997.

46. తారకం, బొజ్జా. ***దళితులు - రాజ్యం;*** హైదరాబాదు బుక్ ట్రస్టు,
జనవరి ,2008.

47. తిరుమలరావు, సర్దేశాయి.***విమర్శ-ప్రతివిమర్శ***; పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.హైదరాబాదు; జనవరి 2002.

48. నారాయణ రెడ్డి, సి, 2001, ***ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయాలు ప్రయోగములు,*** విశ్వంభర, విజన్ పబ్లికేషన్, హైదరాబాదు.

49. పద్మారావు, కత్తి. 2008, ***అంబేద్కర్, మార్క్స్, పూలే సమాలోచన***,
లోకాయత ప్రచురణలు.

50. పద్మారావు, కత్తి. ***దళితుల చరిత్ర***; లోకాయత ప్రచురణలు.
పొన్నూరు. 1994.

51. ముంగేకర్ బాల్ చంద్ర. ***భారతదేశంలో ఆర్థిక సంస్కరణలు - దళితులు ఒక అంబేద్కర్ వాద దృక్పథం***, హైదరాబాదు బుక్ ట్రస్టు.డిసెంబరు, 2004.

52. ముత్తయ్య,పి.***ఎస్సీలలో వర్గీకరణ ఎందుకు?***;ఆంధ్రప్రదేశ్ మాదిగ మేధావుల ఫోరం.ఉస్మానియా విశ్వవిద్యాలయం.హైదరాబాదు,2007.

53. యాదగిరి(సంకలనం) ***రిజర్వేషన్ ఆస్తిని పంచుకుంటే ఐక్యతా ఉండదా? ఒక పరిశీలన***

54. రంగనాథాచార్యులు,కె.కె. ***ఆధుని కతెలుగుసాహిత్యంలో విభిన్న ధోరణులు***, ఆంధ్రసారస్వత పరిషత్తు, హైదరాబాదు, 2005.

55. రాజశేఖర్, వి.టి. ***దళితులు హిందూమతాన్ని ఎందుకు ద్వేషిస్తారు?;*** సమాంతర ప్రచురణలు, హైదరాబాదు.2008.

56. రామకృష్ణ, వకుళాభరణము.***ఆంధ్రదేశంలో సంఘ సంస్కరణ ఉద్యమాలు (1848-1919);*** హైదరాబాదు బుక్ ట్రస్టు, డిశెంబర్, 2003.

57. లక్ష్మినరసయ్య,జి. శ్రీనివాస్, *త్రిపురనేని (సంపాదకులు)* ***చిక్కనవుతున్న పాట, కవిత్వం,*** ప్రచురణలు. విజయవాడ.1995.

58. లక్ష్మీనారాయణ, కె. ***ఆది భారతీయుల చరిత్ర (క్రీ.పూ.2500 - క్రీ.శ.2005)***: కర్నూలు డయాసిస్ సోషల్ సర్వీసు సొసైటీ, జనవరి ;2006.

59. లక్ష్మీకాంతం, పింగళి. 2002. ***సాహిత్య శిల్ప సమీక్ష***, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.

60. విల్సన్ సుధాకర్,తుల్లిమల్లి.***దళితవ్యాకరణం;*** విజయభారతి పబ్లికేషన్. హైదరాబాదు,2007.

61. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి.***విమర్శ శిల్పం***,జూన్ 2002.

62. వెంకటేశ్వరరావు,దార్ల.***దళితసాహిత్యం మాదిగదృక్పథం***; సొసైటి & ఎడ్యుకేషన్ ట్రుస్టు; హైదరాబాదు,2008.

63. వెంకటేశ్వరరావు,దార్ల. ***ఒక మాదిగ స్మృతి (నాగప్ప గారి సుందర్రాజు***

***పరిచయం)***; తెలుగు సాహిత్య వేదిక;2007

64. సంజీవమ్మ,పి,2004,***సాహిత్య విమర్శ వ్యాసాలు***, అభ్యుదయ రచయితల సంఘం, కడప.

65. సాంబయ్య,గుండిమెడ.***బ్రాహ్మణత్వ మాలత్వమా? మాన్వత్వ అంబేద్కరత్వమా? (వర్గీకరణ సమస్యపై చర్చ)***; రాజ్యం ప్రచురణలు,ఏప్రియల్,2006.

66. సంపత్కుమారాచార్య,కోవెల.***ఆధునిక సాహిత్య విమర్శ-సాంప్రదాయరీతి***;వరంగల్ రచయితల ప్రచురణ,1981.

67. మధుజ్యోతి, కొలకలూరి.***ఆధునిక తెలుగు సాహిత్యం దళిత సంస్కృతి***; జ్యోతిగ్రంథమాల, హైదరాబాదు,తిరుపతి:2013.

68. ఇనాక్,కొలకలూరి. ***దండోరా***; జ్యోతిగ్రంథమాల, హైదరాబాదు, తిరుపతి, 2013.

69. లక్ష్మీనారాయణ,కె.***దళిత కవిత్వం - పరామర్శ***;రమాపబ్లికేషన్ ;ఏప్రిల్ 2013.

70. శ్రీనివాసరావు, చిలుమూరి, మధుజ్యోతి, కొలకలూరి(సంపాదకులు). ***దండోరాఉద్యమం అంబేద్కర్ అభీష్టం***; జ్యోతి గ్రంథమాల; తిరుపతి:2013.

**వ్యాసాలు :**

1. ***ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సమస్యపై రాష్ట్ర దళిత రౌండు టేబుల్ సదస్సు***, హైదరాబాదు డిక్లరేషన్: హైదరాబాదు, 6, జూలై 2005.

2. కోటేశ్వరరావు,పాలె.***దండోరాఉద్యమ భవిష్యత్తుఏమిటి?***, ఆంధ్రజ్యోతి,25–5–2009.

3. కోటేశ్వరరావు, పోలె.***మాలలకు వర్గీకరణ వల్ల నష్టమేమిటి?***, ఆంధ్ర జ్యోతి 28–6–2009.

4. కృపాకర్ మాదిగ.***మాల,మాదిగల మధ్య ఐక్యత సాధ్యమా?,*** చమర్ డెమోక్రసీ, పుటసంఖ్య:3,సంపుటి:7,నవంబర్ 2012.
5. కృష్ణ మాదిగ, మంద. ***వర్గీకరణ తరువాతే తెలంగాణ,***ఆంధ్రజ్యోతి దినపత్రిక, 19-7- 2011.
6. బత్తుల కాంతయ్య, దళిత బహుజన సంఘర్షణ సమితి, కె. చంద్రన్న, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, ***ఎస్. సి రిజర్వేషన్ల వివాదం - సమగ్ర పంపిణీయే పరిష్కారం.***
7. ***బహుజన కెరటాలు మాస పత్రిక,***పుట సంఖ్య:35, జూన్ 2007.
8. బాబు మాదిగ, కె.యస్. ***మాదిగలకు న్యాయం జరిగేనా?,*** ఆంధ్ర జ్యోతి 7-12-2008.
9. భద్రయ్య, దొంత. ***ప్రాంతాలవారీ వర్గీకరణే పరిష్కారం!*** సూర్య దిన పత్రిక 16-1- 2013.
10. ***మాల, మాదిగల ఐక్య సాధనా వేదిక,*** ప్రెస్ క్లబ్, 6/07/2007.
11. వెంకటేశ్వరరావు,దార్ల.***దళిత ఉద్యమానికి చైతన్య దీపిక,***28-1-2005.http;//that's telugu.com.
12. వెంకటేశ్వరరావు, దార్ల.***సాహిత్యంలోను మాదిగలకు దగా మాలల అంటరాని వసంతం,*** సూర్య దిన పత్రిక:1-3-2010.
13. వెంకటేశ్వరరావు,దార్ల. ***మాదిగసాహిత్యంలో అంతర్భాగమే దళిత సాహిత్యం.***సూర్య దినపత్రిక16-2-2009.
14. శిఖా ఆకాష్.***అట్టడుగు జీవితాల్ని ఆవిష్కరించిన కథకుడు నాగప్పగారి సుందర్రాజు,*** ప్రజాశక్తి, 23-10-2011
15. శ్రీనివాసరావు, చిలుమూరి. ***వర్గీకరణకు జాప్యమేల?,*** సూర్య దినపత్రిక 9.12.2010.
16. సతీష్ మాదిగ దేవని, ***జోన్ల వారీగా రిజర్వేషన్ల వర్గీకరణ,***తెలంగాణ మాదిగ

దండోరా రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రజ్యోతి దినపత్రిక, 14-12-2010

17. ***సామాజిక న్యాయ, వాస్తవిక దృష్టితో యస్.సి రిజర్వేషన్ల వర్గీకరణ సమస్యను పరిష్కరించుకుని దళితులు పునరైక్యం కావాలి: ఎబిసిడి స్థానంలో ఎబిసి చాలు దళిత ప్రజలకు సిపియుఎస్ ఐ*** (దళిత బహుజన శ్రామిక విముక్తి పిలుపు).
18. సాంబయ్య, గుండిమెడ. ***ప్రత్యేక -సమైక్యతల నడుమ వర్గీకరణ భవితవ్యమేమిటి?*** సూర్య దినపత్రిక, 5-2-2010.
19. సుబ్బాచారి, పులికొండ. **మార్గం వేసుకొన్న మాదిగ కవిత్వం**, ఆంధ్ర భూమి, జులై 9,2012.
20. సుభద్ర, జూపాక. ***మాదిగ అస్తిత్వాన్ని గుర్తించని సాహిత్య రాజకీయాలు,*** సూర్య దిన పత్రిక, 12-12-2008.

**అంతర్జాల ఆకరాలు (webliography):**

1. http://madigakavulu.blogspot.in/
2. www.vrdarla.blogsopt.com
3. www.mallemala.org
4. http://www.malamahanadu.com/
5. http://www.mrps.info/
6. http://en.wikipedia.org/wiki/MRPS
7. http://en.wikipedia.org/wiki/Mala
8. http://mallelamalamahasabha.blogspot.in/
9. http://en.wikipedia.org/wiki/Dalit
10. www.google.com

# అనుబంధం — 1

# పరిశోధన వ్యాసాలు

# మరియు

# జాతీయసదస్సుల సర్టిఫికేట్స్

# అనుబంధం — 1

BHAVAVEENA
Vol. 15, Issue. 10, October - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

## దళిత ఉద్యమ సాహిత్యం - వర్గీకరణ వాదం

- సిద్ధార్థ మద్దిరాల, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

### 1.0. దళిత ఉద్యమ నేపథ్యం - పరిచయం :

ఎక్కడైతే, ఎప్పుడైతే సమాజంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అంతర్యాలు ఉంటాయో ఆ సమాజంలో ఆ నేపథ్యంతో సామాజిక ఉద్యమాలు ఆ అంతర్యాలను నిర్మూలించుటకు ఆవిర్భవించటం సహజం. తెలుగు సమాజం కూడా దీనికి అతీతం కాదు. ఇలా తెలుగు సమాజంలో ఆధునిక కాలంలో ఎన్నో సామాజికఉద్యమాలు సామాజిక న్యాయం కోసం పుట్టుకొచ్చాయనేది చారిత్రక సత్యం. ఇలా సమాజంలో అంతర్యాలను, అవమానాలను, అంటరానితనాన్ని, వర్గ ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ ప్రధాన జీవనస్రవంతిలో మేము భాగస్వాములమనే భావనను యావత్తు ప్రపంచానికి తెలియజెప్తూ 1980 లో వచ్చిన సామాజిక ఉద్యమమే దళిత ఉద్యమం. ఎదైనా ఒక ఉద్యమం బలవంతంగా ప్రజల్లోకి చేరుకోవాలంటే మనకున్న సాధనం సాహిత్యం. సాహిత్యం ద్వారానే ప్రజల సమస్యలు, వేదనలు, బాధలు. గాధలు, చారిత్రక. రాజకీయ, సాంస్క ృతిక, సాంఘిక అంశాలు తెలియజెప్పి గత కాలపు అంశాలను, వర్తమానానికి జోడించి భవిష్యత్ కు బాటలు చూపుతుంది. ఇదే దిశలోనే దళిత ఉద్యమంలో కూడా ధిక్కార స్వరంతో తెలుగునాట సాహిత్యం వచ్చింది. దీనిని మనం దళిత సాహిత్యంగా చెప్పుకుంటున్నాం.

### 1.1. దళితులు -దళిత సాహిత్యం :

సాధారణంగా దళిత ఉద్యమం ప్రారంభమైన మొదట్లో దళితులు అంటే విశాలార్థంలో "యస్సీ, యస్టీ, బిసి, మైనార్టీలంతా దళితులే" అన్న భావన విమర్శకుల్లో ఉండేది. కానీ కుల చైతన్యం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న కాలంలో ఎవరి కులం గురించి, ఎవరి ప్రాంతం గురించి వారే స్వీయ గొంతుకతో మాట్లాడుతున్న ఈ అస్తిత్వ యుగంలో దళితులంటే యస్సీలు అనే అర్థంలో సాహిత్యం వస్తుందనేది నిజం. కనుక ప్రస్తుతం దళితులు అంటే యస్సీలు మాత్రమే. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే తెలుగు సమాజంలో యస్సీలు అంటే మాల, మాదిగలు దాని అనుబంధ కులాలు మాత్రమే.పైన చెప్పిన కులాల అన్నింటిని కలిపి విస్తృతార్థంలో దళిత బహుజనులు అని పిలుస్తున్నారు.

దళిత సాహిత్యం అంటే "పశువుల మూగతనంలోంచి ఊరి బయట మూలుగుల్లోంచి దూడచర్మం, ఎద్దుకొమ్ము సంస్క ృతిలోంచి అక్షరాలు వెచ్చగా బయటకు వస్తూ కేవలం ఆర్థికవాద సంకెళ్ళను చీల్చుకుంటూ దళితుల సొంతనెత్తురు గుండా ఒలుకుతున్న పలుకుల సముదాయమే దళితకవిత్వం" (చిక్కనవుతున్నపాట కవితా సంకలనం: ముందుమాట). అంటే " దళిత జీవితాలను చిత్రించేది దళితుల ఆర్తిని, ఆవేదనను ఆవేశాన్ని, ఆగ్రహాన్ని, ప్రతిఘటనను ప్రతిబింబించేది, దళితులకు మెరుగైన, సుఖమైన, అందరితో సమానమైన జీవిత గమనాన్ని నిర్దేశించేది, దళిత చైతన్యాన్ని వ్యక్తీకరించేది దళిత సాహిత్యం" గా సాహిత్య విమర్శకులు తెలియజెప్పారు.

### 1.2. దళిత ఉద్యమం - వర్గీకరణ వాదం :

దళిత ఉద్యమం, సాహిత్యం ప్రారంభమైన మొదట్లో దీని వేడి,వాడి చూసి కొన్ని యుగాల తెలుగు సాహిత్యానికే ప్రశ్నార్థకంగా మారి, ప్రత్యామ్నాయ సాహిత్యంగా వెలువడుతుందని సాహిత్య విమర్శకులు భావించారు. అయితే ఈ లక్ష్యాన్ని కొంత వరకు కంచికచర్ల, కారంచేడు, చుండూరు, వేంపెంట తదితర సంఘటనల ద్వారా దళిత ప్రజలపై జరిగిన అన్యాయాలను వ్యతిరేకిస్తూ దళిత ఐక్యతను దళిత ప్రజలు, కవులు, కళాకారులు, దళిత మేధావులు నిరూపించారు. ఈ ఐక్యతాభావం అనతికాలంలో అనైక్యతాభావానికి నాంది పలికింది. దీనికి కారణాలు అనేకం ఉన్న ముఖ్యంగా దళిత ఉపకులాల మధ్య రిజర్వేషన్ పంపిణీ సరిగా జరగటం లేదనీ, దళిత బహుజనపిత డా.బి.ఆర్.అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ కొన్ని వర్గాల వారే అనుభవిస్తున్నారని, అవి అందరికి అందుబాటులోకి రావాలంటే ఉపకులాల మధ్య పంపిణీ జరగాలనీ షెడ్యూల్డ్ కులాల్లో ఒక ఉపకులమైన మాదిగ దాని అనుబంధ ఉపకులాల మేధావులు "సమాన పంపిణీయే సామాజిక న్యాయం' అనే ఏకసూత్ర సిద్ధాంతంతో కనకారావు మాదిగ ఆధ్వర్యంలో1994 జూలై 7న ప్రకాశం జిల్లా ఈదురుమూడి గ్రామంలో 'మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(%వీ=ాూ%)' ఊపిరి పోసుకుంది. ఈ మాదిగ దండోరాఉద్యమం ప్రారంభమైన కొత్తల్లో కొంత దళితఐక్యత లోపించిన సందార్భానుసారంగా ఆయా సంఘటనల నేపథ్యంలో మాల,మాదిగలు ఐక్యతా ఉద్యమాలు చెస్తూనే ఉన్నారు. కాని కొద్ది పాటి ఐక్యత ఎన్నాళ్ళో సాగకపోగా శత్రువును విస్మరించి అన్నదమ్ముల్ల ఉండవలసిన వీరే అటు ఉద్యమంలోను, ఇటు సాహిత్యంలోను, సమాజంలోను బద్ధ శత్రువులుగా మారి ఆ వర్గీకరణ ఉద్యమానికి మాదిగమేధావులు, కవులు, కళాకారులు రచనలు చేయటం ప్రారంభించారు. ఆ విధంగా ఆవిర్భవించినదే దండోరా సాహిత్యం లేదా వర్గీకరణ సాహిత్యం. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ డా.పి.కేశవకుమార్" తెలుగు సాహిత్యాన్ని సంక్షోభంలో పడేసిన దళితసాహిత్యం తనే సంక్షోభంలో కూరుకు

పోయింది. దళిత కవులకి మాలకవులని, మాదిగకవులని కొత్త లేబుల్స్ వచ్చినవి. మాల కులానికి చెందిన దళిత కవులు ఒక సామూహిక స్వప్నం ఎజెండా తొలగిపోయాక ఒక అక్షరం కూడా రాయలేక పోయారు. మాదిగ కులానికి చెందిన దళిత కవులు మాదిగ కవులుగా కాస్తంత గౌరవం తెచ్చుకున్న ఒక అడుగు కవిత్వంలో ముందేసినా ఆ తర్వాత ఆగిపోవాల్సి వచ్చింది" (దళిత ఉద్యమం వెలుగు నీడలు: పుట48) అంటూ తన ఆవేదనను వ్యక్తం చేసాడు.దండోరా సాహిత్యం దళిత ఉద్యమాన్ని స్తబ్ధతకు గురి చేసిన మాట వాస్తమే అయినా మరో కోణంలో అధ్యయనం చేస్తే అస్తిత్వ ఉద్యమాలు తమ ఉనికిని కాపాడుకోవటంలో, ఎవరి కులం గురించి వారు రాయటం, మాట్లాడటం వంటి అంశాలు ఎవరో ఇచ్చే బిక్ష కాదు అవి రాజ్యాంగం కల్పించిన హక్కులు అని తెలియజెప్పి అటు సాహిత్యంలో,సమాజంలో నిమ్న వర్గాల చైతన్యానికి మార్గం వేసింది మాదిగ ఉద్యమ సాహిత్యమే అని చెప్పుకోవాలి.

### 1.3. మాదిగ పదం - నిర్వచనం :

భారత రాజ్యాంగం కల్పించిన షెడ్యూల్డ్ కులాల్లో మాదిగ కులం ఒకటి. మాదిగ అనే పదానికి అంత్యజుడు, చండాలుడు, చండాలి, చెప్పులు కుట్టువాడు అనే నైఘంటిక అర్థాలు అనేక నిఘంటువుల్లో తెలియజెప్పడం జరిగింది. ఈ నైఘంటిక అర్థాలను పరిశిలిస్తే మాదిగలు అంటే "ఎన్నో తరాల నుండి సమాజానికి, ప్రధాన జీవన స్రవంతికి దూరంగా బ్రతుకుతూ కేవలం కొన్ని పనులను మాత్రమే చేస్తూ, కులవృత్తిని నమ్ముకుని బ్రతుకు పోరాటం చేస్తున్న వాళ్ళను మాదిగలు" చెప్పుకోవచ్చు.

### 1.4. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ప్రధాన లక్ష్యాలు:

ఒక సామాజిక ఉద్యమం ఏర్పాటు అయిన తర్వాత దానికి కొన్ని నిర్దిష్టమైన లక్ష్యాలు,కొన్ని లక్షణాలు ఉంటాయి. అదేవిధంగా దండోరా ఉద్యామానికి కూడా కొన్ని లక్ష్యాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

1. దళిత ఉపకులాలన్నింటికి అన్ని రంగాల్లో సమాన హెూదా కల్పించాలి.
2. దళిత ఉపకులాల్లో ఉన్న వెనుకబడిన కులాల అభివృద్ధికి ప్రత్యేక రాయితీలు కల్పించాలి.
3. రిజర్వేషన్ విధానం, అది అమలవుతున్న తీరులో ఉన్న లోపాలను గుర్తించి తగిన పరిష్కార మార్గాలు తీసుకోవాలి.
4. ప్రాంతాల వారీగా ఉన్న వైవిధ్యాన్ని జనాభా ప్రాతిపదికన గుర్తించి, దానికి అనుగుణంగా రిజర్వేషన్ విధానాన్ని అమలు పరచాలి.
5. దళితుల్లో రిజర్వేషన్ విధానం పట్ల క్రిమిలేయర్ విధానాన్ని ప్రవేశపెట్టాలి.
6. దళిత కులవృత్తులకు సామాజిక హెూదా కల్పించాలి.
7. మాదిగ తదితర ఉపకులాలను ప్రధాన జీవన స్రవంతిలోకి తీసుకురావాలి మొదలైనవి దండోరా ఉద్యమం యొక్క లక్షణాలు.

### 1.5. వర్గీకరణ సాహిత్యం - విశ్లేషణాత్మక అధ్యయనం:

తెలుగు సాహిత్యం అధ్యయనం ఎప్పటి నుండి ప్రారంభం అయిందో అప్పటి నుండి దళితుఅల ప్రస్తావన వస్తూనే ఉంది. కాకపొతే అది సందర్భానుసారంగా ఆయా పాత్రాలను రచయితలూ సృష్టిస్తూ వచ్చారు.కాకపొతే ఆధునిక కాలంలో 19వ శతాబ్దం ఉత్తరార్థంలో మాత్రమే దళితఉద్యమం వచ్చింది. అప్పుడు మాల,మాదిగ బేధం లేకుండా సాహిత్యం వస్తూ ఉండేది. తర్వాత రిజర్వేషన్ల పంపిణీ ఉద్యమం మొదలైన తర్వాత మాదిగలకు జరుగుతున్న వివక్షను ప్రశ్నిస్తూ మొట్ట మొదటిసారిగా ఎండ్లూరి సుధాకర్ 'దండోరా' అనే కవితను రాశారు. ఆ తర్వాత 1996 లో నాగప్పగారి సుందర్రాజు 'చండాల చాటింపు' కవితా సంపుటిని ప్రచురించారు. 1997 పేరుతో 'మాదిగ చైతన్యం' పేరుతో మాదిగలే సాహిత్యాన్ని సృష్టించుకొని మాదిగసాహిత్య వేదిక ఏర్పాటు చేసుకున్నారు.

ఎండ్లూరి సుధాకర్ 'మల్లె మొగ్గలగొడుగు మాదిగ కథలు' (1997)లో నాగప్పగారి సుందర్రాజు 'మాదిగోడు కథలు' (1997)లో మాదిగ జీవితాల్లోని అనేక కోణాలు వర్ణితమయ్యాయి. "మేమిట్లుండం" కథలు సంపుటిలో గుండెడప్పు కనకయ్య, కొలకలూరి ఇనాక్ "పొట్ట పేగులిబ్బందిగోడు" కథలో మాదిగ సంస్కృతిని కళ్ళకు కట్టినట్లు వర్ణించారు. "గొడ్ల దొంగ" కథలో మాదిగల పై జరిపిన అగ్రవర్ణ భూస్వాముల దురాగతాలను వర్ణించారు.

డా.బి.వి.ఎస్.మూర్తిగారు"దళిత కథామంజరి(1992)" పేరుతో రాశారు. దీనిలో అరుంధతీదేవీ చరిత్రతో పాటు మాతంగి కులానికి చెందిన శ్రీలక్ష్మమ్మ అనే భక్తురాలి కథ కూడా ఉంది.(1992:111:118) బొనిగల రామారావు గారు మాల మాదిగల ప్రాచీన చరిత్ర (1997) లో రాశారు. డా.యస్.టి. జ్ఞానానందకవి షెడ్యూల్డ్ కులాలు అంటరానివా(1997)లో రాశారు. అరుంధతీయుల చరిత్ర(1998) పేరుతో అల్వాల మల్లేష్ ఒక పుస్తకాన్ని రాశారు. దీనిలో అంతకు ముందు వచ్చిన పుస్తకాలలో ఉన్నవిషయాలను సమీక్షిస్తూ వివరించారు. తాళ్ళూరి లాబన్ బాబు మాదిగవారి చరిత్ర(2001)ను కొత్త కోణంలో రాశారు. మాదిగలే జాంబవులు, వారు పూర్వం భారత దేశాన్ని పరిపాలించిన క్షత్రియ వంశస్థులు, మాదిగల దేశమే జంబూద్వీపం అని అన్నారు. జాంబవంతుడు అనేది వ్యక్తి నామం కాదనీ, అది మాదిగ జాతి నిరూపించటానికి పురాణాలను ఆధారాలుగా చూపారు. కంచె ఐలయ్యగారు ఏకలవ్య

మాసపత్రికలో అర్థిక కోణంతో మాదిగ పురాణ అంశాలను వివరించారు. వాటిని తర్వాత 1996 లో మాదిగ ఆర్థిక సాంఘీక తత్వం అనే పేరుతో చిన్న పుస్తకంగా ప్రచురించారు. తాళ్ళూరి లాబన్ బాబు గారు మాదిగచరిత్రను అత్యధిక శాతం చరిత్ర, పురాణాలు, ఆంత్రోపాలజీ లను ఆధారం చేసుకొని రాశారు. బొనిగల రామారావు ఆది గురువు ఆచార్య చండాల(2005) పేరుతో చండాలునితో ఆది శంకరాచార్యులను పోల్చారు. డా.ఎండ్లూరి సుధాకర్ మల్లెమొగ్గల గొడుగు మాదిగ కథలు (1999) లో పురాణాల్లో మాదిగ జీవితాలకు సంబంధించిన రెండు కథలు ఉన్నాయి. ఆధునికసాహిత్యంలో **డా.ఎండ్లూరి సుధాకర్ గారి వర్గీకరణీయం(2003), కొత్తగబ్బిలం(1998), నల్లద్రాక్ష పందిరి(2002), మాదిగసాహిత్య వేదిక ప్రచురించిన మాదిగ చైతన్యం(1997), దార్ల వెంకటేశ్వరరావు. ఒక మాదిగ స్మృతి (నాగప్పగారి సుందర్రాజు పరిచయం) 2007,కందిలి మాదిగ మహాజనకవిత్వం(2007),దళితసాహిత్యం-మాదిగ దృక్పథం(2008), కృపాకర్ మాదిగ,జూపాక సుభద్ర సంపాదకత్వంలో కైతనుకల దండెం(2008) ఆచార్య.ముత్తయ్య. ఎస్సీలలో వర్గీకరణ ఎందుకు?, డా.పి.కేశవ కుమార్ దళిత ఉద్యమం వెలుగునీడలు (2009), గుండెడప్పు కనకయ్య దండోరా దరువు(2005), రావినూతల ప్రేమకిషోర్ గుండెదరువు (2005), ఇనాక్ కొలకలూరి దండోరా(2013),డప్పోళ్ళ రమేష్ వర్గీకరణోద్యమ సంఘీభావ కవిత్వం కువ్వ (2016)** సంపాదకులుగా తీసుకొచ్చారు. వీరితో పాటుగా దిన,మాస పత్రికలు, సాహిత్య పేజీల్లో ఎంతో మంది మాదిగ సాహిత్యం,ఉద్యమం గురించి వ్యాసాలు కుడా రాయటం జరిగింది. అవి ప్రధానంగా కోటేశ్వరరావు, పాలె రాసిన 'దండోరా ఉద్యమ భవిష్యత్తు ఏమిటి?' (ఆంధ్రజ్యోతి-25-5-2009), కృపాకర్ మాదిగ రాసిన ' మాల,మాదిగల మధ్య ఐక్యత సాధ్యమా?' (చమర్ డెమోక్రసీ, నవంబర్ 2012), బాబుమాదిగ.కె.యస్ రాసిన ' మాదిగలకు న్యాయం జరిగేనా? '(ఆంధ్రజ్యోతి-7-12-2008), భద్రయ్య దొంత రాసిన 'ప్రాంతాలవారీ వర్గీకరణే పరిష్కారం' (సూర్య-16-1-2013), వెంకటేశ్వరరావు, దార్ల రాసిన 'సాహిత్యంలోను మాదిగలకు దగా మాలల అంటరాని వసంతం ' (సూర్య దిన పత్రిక:1-3-2010), వెంకటేశ్వరరావు,దార్ల రాసిన ' మాదిగ సాహిత్యంలో అంతర్భాగమే దళిత సాహిత్యం' (సూర్య-16-2-2009), శ్రీనివాసరావు, చిలుమూరి రాసిన ' వర్గీకరణకు జాప్యమేల? '( సూర్య-9.12.2010), సతీష్ మాదిగ దేవని రాసిన 'జోన్ల వారీగా రిజర్వేషన్ల వర్గీకరణ' (ఆంధ్రజ్యోతి-14-12-2010), సాంబయ్య, గుండిమెడ రాసిన 'ప్రత్యేక-సమైక్యతల నడుమ వర్గీకరణభవితవ్యమేమిటి?'(సూర్య-5-2-2010), సుబ్బాచారి, పులికొండ రాసిన 'మార్గంవేసుకున్న మాదిగ కవిత్వం' ( ఆంధ్రభూమి-జూలై,9,2012), సుభద్ర, జూపాక రాసిన 'మాదిగ అస్తిత్వాన్ని గుర్తించని సాహిత్య రాజకీయాలు' (సూర్య-12-12-2008) ఇలా ఎంతో మంది సాహిత్యాన్ని అధ్యయనం చేసి వారి వారి అభిప్రాయాలను వ్యాసాల రూపంలో తెలియజెప్పడం జరిగింద. కేవలం మాదిగ కులానికి చెందిన రచయితలు మాత్రమే కాకుండా మాదిగేతర రచయతలు ఎంతో మంది దండోరా సాహిత్యం గురించి రచనలు చేసారు. వీరిలో ప్రధానంగా సి.నారాయణ రెడ్డి, జి.వి.సుబ్రహ్మణ్యం, బేతవోలు రామబ్రహ్మం,ననుమాస్వామి,కోయి కోటేశ్వరరావు, మద్దూరి నగేష్ బాబు,శివారెడ్డి,ఎన్.గోపి,కంచే ఐలయ్య మొదలైన సామాజిక, రాజకీయ,సాహిత్య ప్రముఖులు మాదిగ జీవన విధానం గురించి ఆయా సాహిత్య గ్రంథాలలో తెలియజెప్పే ప్రయత్నం చేశారు. పై రచనలన, వ్యాసాలను, అభిప్రాయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే దండోరా సాహిత్యంలో ఈ క్రింది అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి.

### 1.6. దండోరా సాహిత్యం -ప్రధానాంశాలు :

1. కులాన్ని ఆధారంగా చేసుకొని చూపే వివక్షను స్పష్టంగా ఖండిస్తూ మాదిగకవిత్వం వస్తుంది.
2. దళితులలో సమైక్యత పేరుతో జరుగుతున్న మోసాన్ని బయట పెట్టే ప్రయత్నం చేస్తుంది మాదిగ కవిత్వం
3. తమకు రావాల్సిన హక్కులను హరించి వేస్తున్న వారిని నిరసిస్తూనే తమ హక్కులను కాపాడుకోవాలనే స్వరం మాదిగ కవిత్వంలో ప్రధానంగా కనిపిస్తుంది.
4. తమ చరిత్ర సంస్కృతులలో గల ప్రత్యేకతను మాదిగ కవిత్వం వర్ణించగలుగుతుంది.
5. నిజమైన అంబేద్కరిజాన్ని మాదిగ కవిత్వం వివరించగలుగుతుంది.
6. దళితులందరికి (అన్ని ఉపకులాల) సమాన హక్కులు లభించాలనేది మాదిగ కవిత్వం ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది.
7. దళితులను విభజించడానికి లేదా చీలిపోవడానికి వారిలో శత్రువైరుధ్యాన్ని పెంచడానికి కాకుండా చారిత్రక వాస్తవాన్ని వివరిస్తూ ఈ దళితులలోని అన్ని ఉపకులాలకు ఉండే అస్పృశ్యత లేదా అంటరానితనం అనే వివక్ష అందరికీ ఉందని అయినా ఆ వివక్ష దళితుల్లోని కొన్ని ఉపకులాల వారు మరింతగా అనుభవిస్తున్నారని మాదిగ కవిత్వం స్పష్టం చేసింది.
8. మాదిగ కవిత్వం వచ్చిన తర్వాత వివిధ అణగారిన కులాల వారు కూడా తమ ప్రత్యేక సమస్యలను వర్ణిస్తూ కవిత్వం రాశారు. గిరిజనులు,బి.సి లు మాదిగ కవిత్వ ప్రేరణతో తమ ప్రత్యేక సమస్యలను వర్ణించటం జరుగుతుంది. ఆ విధంగా అణచివేతకు గురికాబడుతున్న అన్ని కులాల

వారిని చైతన్యం చేయడంలో మాదిగ కవిత్వం చెప్పుకో దగిన పాత్ర వహిస్తుంది.

9. మాదిగ కవిత్వంలో వృత్తి పట్ల గౌరవం పెంచుతూ తమ సాంస్కృతిక ఔన్నత్యాన్ని కాపాడుకుంటూ ఆ పారిభాషిక పదాలను సాహిత్యానికి పరిచయం చేసింది. ఆవిధంగా తెలుగుభాషకు కొత్త పదాలను పరిచయం చేసినట్ల యింది.

### 1.7. ముగింపు :

వర్గీకరణ అంశంపై దాదాపుగా 30 సంవత్సరాలుగా వర్గీకరణ కోసం పోరాడుతున్న మాదిగల ఆత్మగౌరవ నినాదం ఎంతో మంది బలహీన వర్గాల్లో చైతన్యాన్ని నింపిందనటంలో ఎటువంటి సందేహం లేదు. పైన తెలిపిన వర్గీకరణ రచనల్లో, అభిప్రాయాల్లో ఎన్నో పరిష్కార మార్గాలు, ఎన్నో ఉత్తమమైన మేధావుల సలహాలు ఉన్నాయి. వాటిలో ప్రధానంగా జోన్ల ఆధారంగా, ప్రాంతాల ఆధారంగా, జనాభా ప్రాతిపదికన వర్గీ కరణ జరగటం వలన అటు మాలలకు, ఇటు మాదిగలకు ఎటువంటి నష్టం ఉండదు. కాకపోతే వర్గీకరణ అన్నది ఆయా రాష్ట్రాల అభీష్టం మేరకు ఉంటుంది కనుక ఇంతకు ముందు తెలిపినట్లు ఇరు వర్గాల మేధావులు సమన్వయ కమిటీల ద్వారా సమస్యను పరిష్కరించుకుంటే అటు మాదిగలకు, మాలలకు ఇద్దరికి రాజ్యాధికార దిశగా పయనించే అవకాశం ఉంటుంది. లేకపోతే ఈ ఇరు వర్గాల ఆధిపత్య పోరులో నష్టపోయి, అంతమొందేది ఇప్పటికి ప్రధాన జీవన స్రవంతికి దూరంగా ఉన్న దళిత ప్రజలు మరియు పూలే, అంబేద్కర్ ఆలోచన విధానాలు మాత్రమే.

### ఆధార గ్రంథాలు :

1. జగన్నాథం,పేర్వారం.సమాజం, సాహిత్యం, రాజకీయాలుబీ శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1997.
2. మధుజ్యోతి, కొలకలూరి. ఆధునిక తెలుగు సాహిత్యం దళిత సంస్కృతి; జ్యోతి గ్రంథమాల, హైదరాబాదు, తిరుపతి, 2013.
3. ముత్తయ్య,పి.ఎస్సీలలో వర్గీకరణ ఎందుకు?బీ ఆంధ్రప్రదేశ్ మాదిగమేధావుల ఫోరం. ఉస్మానియావిశ్వవిద్యాలయం. హైదరాబాదు, 2007.
4. రంగనాథాచార్యులు, కె.కె. తెలుగు సాహిత్యంలో దళిత చైతన్యం ఆధునిక సాహిత్యం - దళిత స్పృహ, హైదరాబాదుబీ యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ:1994.
5. లక్ష్మీనారాయణ, కె.దళిత కవిత్వం - పరామర్శ; రమా పబ్లికేషన్; ఏప్రిల్ 2013.
6. వెంకటేశ్వరరావు, దార్ల. దళిత సాహిత్యం మాదిగ దృక్పథం; సొసైటి & ఎడ్యుకేషన్ ట్రుస్టు; హైదరాబాదు, 2008.
7. శాంసన్, పిల్లి. దళితసాహిత్య చరిత్రబీస్వీయ ప్రచురణ: గుంటూరు, 2000.
8. శ్రీనివాసరావు,చిలుమూరి,మధుజ్యోతి,కొలకలూరి(సంపాదకులు).దండోరాఉద్యమం అంబేద్కర్ అభీష్టం; జ్యోతి గ్రంథమాల; తిరుపతి:2013.
9. సాంబయ్య,గుండిమెడ. బ్రాహ్మణత్వ మాలత్వమా? మాన్వత్వ అంబేద్కరత్వమా? (వర్గీకరణ సమస్యపై చర్చ)బీ రాజ్యం ప్రచురణలు, ఏప్రియల్, 2006.
10. http://madigakavulu.blogspot.in



**BHAVAVEENA**
**Vol. 15, Issue. 10, October - 2018.**
**ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253**
UGC Approved Journal No. 42500

BHAVAVEENA
Vol. 15, Issue. 11, November - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# దళితఉద్యమ సాహిత్యం - ఏకీకరణవాదం

- సిద్దార్థ మద్దిరాల, రీసెర్చ్ స్కాలర్, తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

భారత రాజ్యాంగం గుర్తించిన ప్రస్తుత షెడ్యూల్డ్ కులాల సంఖ్య 61. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ లో మాల దాని అనుబంధ కులాలు, మాదిగ దాని అనుబంధ కులాలు ప్రధానంగా ఉన్నాయి. భారత రాజ్యాంగ నిపుణులు షెడ్యూల్డ్ కులాల జీవనవిధానంలో గల ఆంతర్యాలను ద్ృష్టిలో ఉంచుకొని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి, షెడ్యూల్డ్ కులాల వారిని ప్రజాస్వామ్యంలో భాగస్వాములను చేయటం కోసం, వారి పట్ల ఇతర కులాల వారు చూపే వ్యతిరేకతను పోగొట్టి భారతీయులంతా సమానులే అనే భావనను కల్పించటానికి వీరికి విద్య, వైద్య, ఉపాధి రంగాలలో 15 శాతం రిజర్వేషను భారత ప్రభుత్వం కల్పించింది. ఈ రిజర్వేషను ఫలాల వల్ల చాలా వరకు షెడ్యూల్డ్ కులాల ప్రజల జీవనవిధానం మెరుగుపడినా, ఇంకా ఎంతో మంది అణచివేతకు, అవమానాలకు నిరంతరం బలవుతూనే ఉన్నారు. భారతరాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు ఇంతవరకు ఉమ్మడిగా అనుభవించిన దళితుల్లో ఒక వర్గం (మాదిగ దాని అనుబంధ కులాలు) రిజర్వేషన్ల ఫలాలు ఎస్సీలలో ఒక కులం వారే అనుభవిస్తున్నారని తద్వారా రిజర్వేషన్ల అంతిమలక్ష్యం నేరవేరటం లేదని కనుక రిజర్వేషన్లు వర్గీకరించాలని నూతనవాదం బయలుదేరింది. దీనినే వర్గీకరణ ఉద్యమం (1994) లేదా దండోరా ఉద్యమంగానూ, దాని ఆధారంగా వచ్చిన సాహిత్యాన్ని వర్గీకరణ సాహిత్యంగా చెప్పుకున్నాం.

అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ల ఫలాలను సంపూర్ణ స్థాయిలో సాధించుకోగలిగామంటే ఎస్సీలంతా కలిసి ఉంటేనే సాధ్యం. రిజర్వేషన్లు వర్గీకరించటం అంటే దళితులను విడగొట్టడమే. ఇది అగ్రవర్ణాల విభజించు పాలించు సూత్రమే. కనుక రిజర్వేషన్లు వర్గీకరించద్దు ఉమ్మడిగా ఉండి ఇప్పటికే ప్రపంచీకరణ ముసుగులో దళితులు భవిష్యత్ ఏమిటి ? అని ఆలోచించుకొని ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్ల కోసం ఉమ్మడిగా పోరాటం చేయాలని అందుకు దళితులంతా కలిసే ఉండాలి అని విడిపోతే ఓడిపోతాం, ఐక్యంగా ఉంటే అలుపెరగని పోరాటాలు చేసి విజయం సాధించవచ్చు అని షెడ్యూల్డ్ కులాల్లో మరో ప్రధాన వర్గం అయిన మాలలు, దాని ఉపకులాల వారు బయలుదేరారు. వీరి ఉద్యమాన్ని ఏకీకరణ ఉద్యమం(1994) లేదా మాలమహానాడుగాను వీరి సాహిత్యాన్ని ఏకీకరణ సాహిత్యంగా చెప్పుకోవచ్చు.

**మాల - శబ్దం, నిర్వచనం- ఉద్యమం :**

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితికి వ్యతిరేకంగా రిజర్వేషన్ విధానాలను యథావిధిగా కొనసాగించాలని "మనువాదానికి మరో రూపమే వర్గీకరణ అని, రిజర్వేషన్లు విభజించటం అంటే దళితులను విడగొట్టడమే" అని షెడ్యూల్డ్ కులాల్లో ఒక ఉపకులమైన మాల, దాని అనుబంధ ఉపకులాల ప్రజలు, మేధావులు ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ 1994 సంవత్సరం 'మాల మహానాడు' పేరుతో ఒక శిబిరం పి.వి.రావు అధ్యక్షతన ఏర్పాటు చేసుకున్నారు. కాకపోతే సమైక్యత అని చెప్పి ఒక కులానికి ప్రాతినిధ్యం వహించటం ఏమిటి అనే విమర్శ ఇప్పటికి ఉంది. బహుశా అందుకేనేమో దండోరా ఉద్యమం అంతా ప్రాచుర్యం, ఉద్యమ ప్రభావం, సాహిత్యం మాలమహానాడుకి లేదు. మాలమహానాడు ఏర్పాటు అయిన తర్వాత కొంత సాహిత్యాన్ని, ఉద్యమ నేపథ్యాన్ని ఇది సంతరించుకుందన్న మాట వాస్తమే దానిని పరిశీలిద్దాం.

దళిత అనే పదానికి ఏయే అర్థాలు నైఘంటిక అర్థాలు చెప్పారో ఇంచుమించు అవే అర్థాలు మాల కులానికి కుడా అవే అర్థాలు ఆపాదించారు. మాల అంటే అంటరానివాడు, చండాలుడు, అంతవాసి, అంత్యజాతివాడు, అంత్యజుడు, కడవాడు, కడజాతి, పంచముడు, ఐదవజాతివాడు, అంత్యయోని, మాల, మాలడు, మాలవాడు, వెలివాడవాడు, వెలివాడు, చండాల జాతి విశేషము, అంత్యవసాయి,అంత్యుడు, అవాచ్యుడు, అస్పృశ్యుడు, కటోలుడు, కడవాడు, కీకశుడు, జనంగముడు, తోచ, తోటి, దివాకీర్తి, దివాచరుడు, దోహరి, నిషాదుడు, పంచముడు, పుల్కసుడు, ప్లవకుడు, ప్లవుడు, బుక్కసుడు, శ్వపచుడు, శ్వపాకుడు, సురియాళు, సురియాళువు, హరిజనుడు ... మొదలైన అర్థాలను జి.యన్.రెడ్డి తెలుగు పర్యాయపద నిఘంటువులో చెప్పటం జరిగింది.

పై అర్థాలను పరిశీలించి చూస్తే మాలలు అనగా "ఎటువంటి కులవృత్తికి నోచుకోలేక కేవలం వ్యవసాయ, ఉపాధి కూలీలుగా జీవనం సాగిస్తూ, ప్రధాన జీవన స్రవంతిలో అంటరానితనం ఆపాదించబడి, దళిత జీవన ప్రత్యామ్నాయ సంస్కృతీ ప్రదాతలుగా బతుకు సాగిస్తున్నవారు" మాలలుగా చెప్పుకోవచ్చు.

భారతరాజ్యాంగం షెడ్యుల్డ్ కులాలని రిజర్వేషన్ల విభజన ప్రక్రియ జరిగినప్పుడు ప్రధానంగా నాలుగు భాగాలుగా విభజించింది. అవి ఎ, బి, సి,డి గ్రూపులు. వీటిలో మాదిగ, దాని అనుబంధ కులాలకు ఎ, బి గ్రూపులలో చేరిస్తే,

మాల, దాని అనుబంధ కులాలను సి,డి గ్రూపులో చేర్చారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే రెల్లి కులాన్ని ఎ గ్రూపులోను, మాదిగలను బి గ్రూపులోను, మాలలను సి గ్రూపులోను, అది ఆంధ్రులను డి గ్రూపులోను చేర్చటం జరిగింది.

## మాలలు ప్రధాన లక్షణాలు :

భారతీయ సమాజంలో ప్రతి కులానికి, మతానికి, ప్రాంతానికి వాటి భౌగోళిక స్వరూప, స్వభావ నిర్దిష్టతను బట్టి కొన్ని లక్షణాలు ఉన్నట్లుగానే దళిత సమాజానికి అందులోను అతిపెద్ద కులం అయిన మాల కులానికి వారి నిర్వహించే పనులను బట్టి, వారి జీవన విధానాలను బట్టి కొన్ని ప్రత్యకమైన లక్షణాలను గుర్తించవచ్చు.

1. వ్యవసాయ కూలీలుగా ఉండడం.
2. దళితజాతికి ప్రత్యామ్నాయ సమాజాన్ని ఏర్పాటు చేయటం అంటే చేనేత, క్షౌర, రజక వ ృత్తులు కొన సాగించడం.
3. ఎటువంటి కులవ ృత్తికికి నోచుకోక రోజు వారి కూలీలుగా జీవనం సాగించటం.
4. పట్టణ ప్రాంతాల్లో భవన నిర్మాణ కూలీలుగా(బేలుదారీ), ఆయా కంపెనీల్లో వలస కూలీలుగా జీవనాన్ని కొన సాగించటం.
5. గ్రామ తలారీలుగా, గ్రామ కాపలాదారులుగా ఉండటం.
6. తెలంగాణ ప్రాంతంలో బేగరి (గుంతలు) పనులు చేయటం.
7. స్మశాన వాటికలకు దగ్గరగా జీవించడం.
8. గ్రామీణ ప్రాంతాల్లో వెట్టి, దళారీ పనులు చేయటం.
9. వివిధ వ్యాపారాల్లో మధ్యవర్తులుగా బ్రతుకు సాగించడం.
10. ఉపాధి కోసం సమీప గ్రామాల్లో వివిధ కళల ప్రదర్శన (బుర్రకథ, హరికథ, సన్నాయి, డోలు, పద్య నాటకాలు)మొదలైనవి.

## మాలమహానాడు ప్రధాన లక్ష్యాలు:

రిజర్వేషన్ల పరిరక్షణకై ఏర్పాటు అయిన మాల మహానాడు కొన్ని లక్ష్యాలను ఉద్యమ నేపథ్యంగా నిర్మించుకుంది.

1. దళితకులాలన్నింటికి ప్రభుత్వరంగాలతో పాటు, ప్రైవేటు రంగాల్లో కూడా సమాన హెూదా కల్పించడం.
2. దళితకులాల్లో ఉన్న వైవిధ్యాన్ని తొలగించి దళితులంతా ఒక్కటే అని చాటి చెప్పటం.
3. రిజర్వేషన్ విధానం, అది అమలవుతున్న తీరులో ఉన్న లోపాలను గుర్తించి తగిన పరిష్కార మార్గాలు తీసుకోవడం.
4. ప్రాంతాల వారీగా ఉన్న వైవిధ్యాన్ని జనాభా ప్రాతిపదికన గుర్తించి, దానికి అనుగుణంగా రిజర్వేషన్ విధానాన్ని అమలుపరచాలి.
5. దళితుల్లో రిజర్వేషన్ విధానం పట్ల అవగాహన కల్పించటం రిజర్వేషన్లు ఎలా ఉపయోగించాలో గ్రామీణ ప్రాంతాల్లో చైతన్యం తీసుకురావటం.
6. దళిత కులాలకు సామాజిక హెూదాతో పాటు ఆర్థిక హెూదా కల్పించడం.
7. దళిత ఉపకులాలను ప్రధాన జీవన స్రవంతిలోకి తీసుకురావడం మొదలైనవి.

## మాలమహానాడు వాదనలు :

దళితుల్లో వర్గం అయిన మాదిగలు చేపట్టిన దండోరా ఉద్యమాన్ని సవాళ్లు చేస్తూ మాలలు మాలమహానాడు పేరుతో ఉద్యమాన్ని చేపట్టారనేది వాస్తవం. వారి వాదనలు ప్రధానంగా ...,

1. సమానత్వం అంటే ప్రతి పనిలో సమంగా ఉండటం కాదు, సమాన అవకాశాలుండటమే సమానత్వం.
2. రిజర్వేషన్ల వ్యతితిరేకతను, రిజర్వేషన్ల వర్గీకరణను సమంగా చూడటం సబబు కాదు.
3. రాష్ట్రాలవిభజనను వ్యతిరేకించే వారు రిజర్వేషన్ల వర్గీకరణను ఎలా సమర్థిస్తారు. అంటే విభజన వల్ల సమాన అవకాశాలు ఉంటాయనేది మీ సిద్ధాంతం అయితే రాష్ట్రాలవిభజనను కూడా సమర్థించాలి కదా ఎందుకు వ్యతిరేకిస్తున్నారు, అంటే మీలో ఏమన్నా స్వలాభాపేక్ష ఉందా ?.
4. ఉన్న రిజర్వేషన్లను వర్గీకకరించటం కంటే రిజర్వేషన్ శాతం పెంపునకు ఐక్యంగా పోరాడాలి అంటే ప్రభుత్వ రంగాల్లోనే కాకుండా ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్ అమలకు దళిత కులాలు కలిసి పోరాడాలి.
5. రిజర్వేషన్ల వర్గీకరణ తప్పక జరగవలసి వస్తే ఇప్పుడున్న ఎ, బి, సి, డి గ్రూపులు కాకుండా డి గ్రూపులోని ఆది ఆంధ్రులను సి గ్రూపులోని మాలలతో కలిపి ఎ,బి,సి గ్రూపులుగా విభజించి అన్ని కులాలకు సమన్యాయం చేయాలి.
6. దళితులకు కుల నిర్మూలన ప్రయోజనకరమా? కుల విభజన ప్రయోజనకరమా?.
7. యస్సీల వర్గీకరణ కులచైతన్యాన్ని పెంచుతుందా? కులనిర్మూనలను పెంచుతుందా?.
8. వర్గీకరణ వలన మాదిగకులం, దాని ఉపకులాలకు సమాన అవకాశాలు ఇస్తుందా?.
9. ఐక్యంగా సాధించలేనిది విడిపోయి సాధించేదేముంది?.

10. ఉమ్మడి రిజర్వేషన్లే అసమానతలకు ప్రధానకారణమా లేక రిజర్వేషన్లు సరిగాఉపయోగించుకోకపోవటం ఉపయోగించుకోకపోవటం దళితుల అసమర్ధతగా భావించాలి.......తదితర అంశాలన్నింటికి దండోరా సమాధానం చెప్పాలి.

## మాలల చరిత్ర - సాహిత్యం :

భారత షెడ్యుల్డ్ కులాల్లో 35 వ కులం మాల. అంటరాని జాతులలో ఒక కులమైన మాల వారి ఉనికిని, వారి మూలాల్లోకి వెళ్లి శోధిస్తేగానీ, క్రీ.పూ నుండి మాలల ప్రస్తావన ఉన్నట్టు రూఢి అవుతున్నది. అందుకు రుజువుగా భారతీయ కథాసాహిత్యానికి ఆధారమైన గుణాఢ్యుని బృహత్కథను పరిశీలించినచో ఇందులో'మాల కుమారుని కథ','మాల కుమారి' కథలను చదివిన మాలల తెగువ, వారి శౌర్య పరాక్రమములు, రాజులకు మించిన వీరత్వం బయల్పడిన విధం అబ్బురపరుస్తుంది. గుణాఢ్యుడు ఉదయనుడు అనే రాజు, అతని కుమారుని గాథలను వివరించాడు. బృహత్కథలో, ఆ గాధలను తెలుపుతున్న క్రమంలోనే మాల కుమారుని వృత్తాంతం కథగా చెబుతాడు గుణాఢ్యుడు. చరిత్రలో షోడజ మహజనపదములు కలవు.అందు వత్సరాజ్యము కలదు. వత్సరాజు ఉదయనుడు, మగధను పాలించిన అజాతశత్రువు నలుగురు కుమారులలో ఒక కుమారుడు. వీరి కాలము క్రీ.పూ 493-462. ఆజాతశత్రువు మామా ప్రసేనజిత్తుడు. ఇక గుణాఢ్యుడు శాతవాహన కాలంలో ఒక శాతవాహన రాజుకు మంత్రిగా ఉన్నాడు. అతను రాసిన కావ్యం లక్ష శ్లోకాల బృహత్కథలో ప్రసేనజిత్తుని కూతురును మాల కుమారుడు వివాహమాడినట్లు చారిత్రకాధారములు ఉన్నట్లు భూతం ముత్యాలు మాలవారి చరిత్రలో తెలియజేశాడు. మాల కులం త్యాగపూరితమైన కులం మహర్లు పరయల కంటె జనాభా ఎక్కువ ఉన్నకులం. దక్షణ భారతంలో మాల అనుబంధ కులాలది ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ లో నేడు అతిపెద్ద కులం మాలలే. నాడు అగ్గిపెట్టెలో 6 గజాల చీరని మడిచి మోటుపల్లి రేవు గుండా రోమ్ నగరానికి పంపింది పలనాటి మాలలే. కన్నమదాసు కత్తికి అంబేడ్కర్ కలం కి వారసులు మాలలే. కళింగయుద్ధ యోధులు మాల మాన్టీనులే బౌద్ధంలోకి మధ్య ఆసియా ఇండియా నుండి బౌద్ధమత ప్రచారకులుగా కమ్మలు(ఉత్తరాలు)మోసింది, వజ్రయాన బౌద్ధ బిక్షువులైన మాలలవే. బౌద్ధరాజులు మాలలే. బుద్ధుడి రథసారథి చెన్నుడు మాలే. చెన్న పట్టణం(చెన్నై) కి పునాది రాయి కట్టిన తాపిమేస్త్రీ చెన్నుడు మాలే. చరిత్రలో చార్వాకులు జాబాలి మాలలే మొదటగా సమాజంలో స్వేచ్ఛ కోరిన ఏకైక జాతి మాలలే. వీరశైవులుగా స్మశానంలో ఉంటూ కుల నిర్మూలన ఉద్యమ రథసారథులుగా నిలిచింది మాలలే. తిరుమల పెద్దమాల వెంకటేసుడు, దేవరగట్టు మాల మల్లేసుడు, శ్రీశైల మల్లెసుడు, మాచెర్ల చెన్నకేశవుడు, జాంబపురాణపు చెన్నుడు, మాల కులదైవం వీరభద్రుడు.కాలభైరవుడు, పోతురాజులు మాలలే.

పురాణాలలో సత్యహరిశ్చంద్రునిగాధ అందరికి తెలిసిందే. సత్యహరిశ్చంద్రునికి విశ్వామిత్రుని వలన ఆపద సంబవించినప్పుడు అతన్ని ఆదుకున్నది వీరబాహుడు. ఇతను మాల కాటికాపరి.ఒక కాటికాపరి రాజును ఆదుకోవడం అంటే మామూలు విషయం కాదు. అలా ఆదుకునే దయాగుణం అంటరాని జాతులకే దక్కుతుంది. కుట్రలు, కుతంత్రాలు, మోసాలు ఎరుగని జాతి, కనుకనే మధ్య యుగాల్లో జరిగిన పలనాటి వీరచరిత్రలో మాలకన్నమనీడు సైతం చరిత్ర ప్రసిద్ధికెక్కాడు..... ఇలా చెప్పుకుంటూ పోతే మాలల చరిత్ర అద్వితీయమైనది, అనిర్వచనమైనది.

కేవలం చరిత్రలోనే కాకుండా ఆధునిక కాలంలో అస్పృశ్యత నివారణ ఉద్యమం జరుగుతున్న సమయంలో కుడా దళితులు అంటే మాలలు అనే భావనతో సాహిత్యం వచ్చింది. గురజాడ అప్పారావు 1910 సంవత్సరంలో 'లవణరాజుల కల' గేయంలో మాలల ప్రస్తావన చెప్పాడు.

"మలిన వృత్తులు మాలవారని/ కులము వేర్చిన బలియు రొక దే/ శమున కొందరు వెలికి దోసిరి మలినమే, మాల/ కులము లేదట వొక్క వేటున/ పసరముల హింసించు వారికి/ కులము కలదట నరుల వ్రేచెడి క్రూర కర్ములకున్ / మలిన దేహుల మాల లనుచును/మలిన చిత్తుల కథిక కులముల/ నెల వొసంగిన వర్ణ ధర్మ మ ధర్మ ధర్మంబే" అని ప్రశ్నించాడు. అంటే బలము కలిగినవాళ్ళు మలినవృత్తులని మాలలను విడగొట్టారని మలినత్వమే మాలకాని మనుష్యులు కాదని తెలియజేశాడు. జాతి ధర్మంగా పశువులు నరికిన వారికి కులము లేకుండుట, క్రౌర్యముతో మానవుల హింసించేవారికి కులము కలుగుట అన్యాయమని దేహమలినం కలిగినవాళ్ళను మాలలని, మలినహృదయులను అధిక కులముల వారు అనటం అన్యాయమని చక్కగా చెప్పారు

అదేవిధంగా ప్రముఖ సంఘసంస్కర్త, స్వాతంత్ర్య యోధుడు, తెలుగు నవల సాహిత్య వైతాళికుడు అయిన శ్రీ ఉన్నవ లక్ష్మినారాయణచే 1922 లో తెలుగులో రచించబడిన 'మాలపల్లి' (The Village of Untouchable) నవల ఆంధ్రప్రదేశ్ లో కులవర్గ దృక్పధంతో వెలువడిన తొలి అభ్యుదయ కావ్యం. అంతేగాకుండా మాలపిల్ల అనే పేరుతో గూడవల్లి రామబ్రహ్మం దర్శకత్వంలో సారధి ఫిలిమ్స్ నిర్మాణంలో గోవిందరాజులు సుబ్బారావు, కాంచనమాల, గాలి వెంకటేశ్వర రావు ప్రధానపాత్రల్లో నటించిన 1938 నాటి తెలుగు సాంఘిక చలనచిత్రం నిర్మించడం జరిగింది. అంటరానితనం నిర్మూ

లన, హరిజనుల దేవాలయ ప్రవేశం, కులాంతర వివాహం, సంస్కరణోద్యమం వంటి సాంఘిక అంశాలను ప్రధానంగా స్వీకరించి సినిమా తీశారు. కేవలం ఇవి మాత్రమే కాకుండా తెలుగు ప్రాచీన, ఆధునిక సాహిత్యాలలో దళిత జీవితాన్ని చిత్రించాలి అన్న, ఆయా కావాల్లో దళిత ప్రస్తావన ఉండాలన్న మాల అనే పదాన్ని ఎక్కువగా వాడినట్లు తెలుస్తుంది.ఉదాహరణకు శ్రీకృష్ణదేవరాయల ఆముక్త మాల్యదలో మాల దాసరి కథ ఇలాంటివి.

ఇక ఆధునిక కాలంలో ఉమ్మడి దళిత ఉద్యమం, సాహిత్యంలో మొట్టమొదట అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ ప్రతిఘటనా సాహిత్యాన్ని ఎక్కువ మోతాదులో రచించింది మాలలే అని చెప్పుకోవాలి. కారంచేడు, చుండూరు సంఘటనలు జరిగినప్పుడు దళిత పులులమ్మ పాడిన గద్దర్, ఒగ్గు కథ రాసిన కలేకూరి, దళిత ఉద్యమానికి దశదిశా నిర్దేశం చేసిన కత్తి పద్మారావు, బొజ్జా తారకం ఇలా ఎంతో మంది మాల కులానికి చెందిన సాహిత్యకారులు, మేదావులు దళితఉద్యమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకు వెళ్ళారు. అయితే దళిత ఉద్యమానికి, సాహిత్యానికి నేపథ్యాలు, ఇతివృత్తాలు, కవితా వస్తువులు అన్ని ఉమ్మడి భాధలు, ఉమ్మడి అంటరానితనమే కేంద్రంగా రావటం జరిగింది. కాకపోతే 1990 తదనంతరం ఉద్యమంలో విభేదాలు, వాటాల పంపిణి మొదలైన అంశాల ఆధారంగా అప్పటి వరకు ఉమ్మడి నేపథ్యాలు, వస్తువులన్ని మాదిగ కవులు తమ అస్తిత్వ గానంగా మార్చుకున్నారు. తద్వారా మాల కులంలోని సాహిత్యకారులకి సాహిత్య సృజన చేయకపోవటానికి అవకాశం లేదు. అయినప్పటికీ మాలల చరిత్ర, సాహిత్యం ఆధారంగా కొన్ని రచనలు వచ్చాయి. అవి ప్రధానంగా గూటం స్వామి ఏకీకరణీయం(2005), నేలపూరి రత్నాజి ఒకే గొంతుక(2005), తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ దళిత వ్యాకరణం(2007), భూతం ముత్యాలు రచించిన మాలల చరిత్ర(2017)ఇలా కొన్ని రచనలు వచ్చాయి. వీటితో పాటుగా మాలల సంస్కృతి, సాహిత్య మాసపత్రిక మల్లెమాల(2012), వివిధ దినపత్రికల్లో కొన్ని వ్యాసాలు వచ్చాయి.

**ముగింపు :**

భారతదేశంలో మొదలైన సామజిక ఉద్యమాల్లో దళిత ఉద్యమానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. ప్రత్యేకించి ఆంధ్ర ప్రదేశ్ లో నిరసన ప్రతిఘటన ఉద్యమాలు 19 వ శతాబ్దం ఉత్తరార్థం నుండి ఇప్పటి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. వీటిని విజయవంతంగా నిర్వహించి భాధితుల పక్షాన నిలబడి వారికి తగిన న్యాయం చేయటంలో మాలల ధైర్యసాహసాలు, ఉద్యమాలు, సాహిత్యం చెప్పుకోదగినవి. ఉమ్మడి దళిత ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన మాలమేధావులు, కవులు, ఉద్యమకారులు వర్గీకరణ ఉద్యమం ప్రారంభం అయిన తర్వాత ఉద్యమ స్తబ్ధతకు, సాహిత్య అస్థిరత్వానికి లోనయ్యారనేది వాస్తవం. దళిత ఉద్యమ క్షేత్రంలో అటు వర్గీకరణ ఉద్యమ డప్పును వాయించలేక ఇటు మాల మహానాడు పేరుతో జరుగుతున్న సమైక్యతారాగాలు ఆలపించలేక మాల, మాదిగ పల్లెలలో రాగాలు వచ్చిన రానట్లు, అన్ని తెలిసిన తెలియనట్లు విగ్రహ ఆవిష్కరణలలో, పుస్తకావిష్కరణలో పాత చరిత్రలే పాడుకుంటూ కాలం గడిపేస్తున్నారు. ఇలా కాలయాపన చేయటం వలన ముందు తరం బాగుపడ్డ నష్టపోయేది వర్త మాన, భవిష్యత్ తరాల దళిత యువత అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. వర్గీకరణ,ఏకీకరణ ఉద్యమ నేపథ్యంలో దళితుల మధ్య ఏర్పడిన అనైక్యతకు చరమ గీతం పాడి దళిత ఉద్యమాన్ని, సాహిత్యాన్ని సమీక్ష చేసుకొని ఉద్యమ వైభవాన్ని పున:నిర్మించుకొని రిజర్వేషన్ ఫలాలు అన్ని రంగాల్లో పూర్తి స్థాయిల్లో అమలయ్యేలా కృషి చేయాలి. తద్వారానే బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలను అనుసరించిన వాళ్ళం అవుతాం, లేదంటే కొన్ని వందల యేళ్ళ గడిచిన ఊరికి వాడకి మధ్య విభజన రేఖ దళితులలో జీవితాల్లో సజీవంగానే మిగిలిపోతుంది.

**ఆధార గ్రందాలు :**

1. మధుజ్యోతి,కొలకలూరి.ఆధునిక తెలుగు సాహిత్యం %--% దళిత సంస్కృతి: 2013.
2. మనువాదానికి మరో రూపం వర్గీకరణ: 2017
3. స్వామి, గూటం. ఏకీకరణీయం:2005.
4. రత్నాజీ, నేలపూరి. ఒకే గొంతుక : 2005బీ
5. భూతం, ముత్యాలు.మాలల వారి చరిత్ర :2017.
6. వర్గీకరణలో ఉన్నది సామాజిక న్యాయమా ? లేక విభజించి పాలించే వంచనా శిల్పమా? (సి.ఆర్.శేఖర్, అంబేద్కర్ మిషన్ ఏప్రిల్ 2005,బులెటిన్ 5)



BHAVAVEENA
Vol. 15, Issue. 11, November - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC Approved Journal No. 42500

యస్.సి., యస్.టి. సెల్

# పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం


పబ్లిక్ గార్డెన్స్, నాంపల్లి, హైదరాబాద్

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం యస్.సి., యస్.టి సెల్, రజతోత్సవసందర్భంగా నిర్వహించిన "దళిత, ఆదివాసీల చైతన్యం" అనే అంశంపై తేది: 22-11-2010 జరిగిన సదస్సులో

ఆచార్య/డా/శ్రీ/శ్రీమతి......మద్దిరాల సిద్ధార్థ...... పాల్గొని ......దళితసాహిత్య విమర్శ సమకాలీనత...... అనే అంశంపై పత్ర సమర్పణ చేశారు.

ఆచార్య కె. ఆనందన్

సదస్సు సంచాలకులు



Department of Telugu

**University of Hyderabad**

Hyderabad – 500 046

National Seminar on

**"TELUGU LITERARY CRITICISM: LATEST TRENDS"**

17-18th September, 2009.

## CERTIFICATE


This is to certify that ~~Prof. /Dr. /Mrs.~~ / Ms M. Siddhartha ........................ Attended the National Seminar on *"TELUGU LITERARY CRITICISM: LATEST TRENDS"* organized by the Department of Telugu, UNIVERSITY OF HYDERABAD during 17-18 September, 2009. He / She Presented a Paper on Dalita Padya Kavitvam ........................

Co ordinator

**Dr. Darla Venkateswara Rao**
Lecturer, Dept. of Telugu
**University of Hyderabad**
Gachibowli, Hyderabad -500 046

Head

HEAD
Department of Telugu
University of Hyderabad
Hyderabad-500 046 (A.P.)



# మల్లవరపు జాన్ మధుర సాహిత్య భారతి

చీమకుర్తి

## ప్రతిభా పురస్కార పత్రం

శ్రీ/శ్రీమతి/చిరంజీవి .................................................... గారు

**'మధుర సాహిత్య భారతి'** నిర్వహించిన పద్య / గేయ/ ధారణ / కవిత పోటీలలో ప్రథమ/ద్వితీయ/తృతీయ/కన్సొలేషన్ బహుమతిని సాధించినందుకు అభినందనలతో ప్రతిభా పురస్కారము సమర్పించడమైనది.

గౌరవాధ్యక్షులు

డాక్టర్ బి.జవహర్

అధ్యక్షులు

23-1-20[illegible]

శ్రీ మల్లవరపు రాజేశ్వరరావు

నిఘంటు నిర్మాణశాఖ

భాషాభివృద్ధిపీఠం

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

హైదరాబాదు

"తెలుగులో సామాజికశాస్త్రాలు : సాంకేతిక పదజాల సేకరణ - మెళకువలు"

జాతీయ సదస్సు మరియు శిక్షణ శిబిరం 23-26 మార్చి, 2009

డా/శ్రీ/శ్రీమతి ఎమ్. సిద్దార్థ వారు మార్చి 23-26, 2009 తేదీలలో జరిగిన ఈ జాతీయ సదస్సు మరియు శిక్షణ శిబిరంలో పాల్గొన్నారని ధ్రువీకరించడమైనది.

హైదరాబాదు

26-3-2009

సదస్సు నిర్వాహకులు

Co-ordinator
DRS-I PROJECT (SAP-UGC)
Dept. of Lexicography,
P.S. Telugu University
HYDERABAD-500004

# అనుబంధం — ౨

# వర్గీకరణ సాహిత్యం — పుస్తకాల పట్టిక

# అనుబంధం — ౨

## వర్గీకరణ సాహిత్యం — పుస్తకాల పట్టిక

| క్ర.సం | రచయిత పేరు | పుస్తకం పేరు | సంవత్సరం |
|---|---|---|---|
| 1 | డా.సుధాకర్ ఎండ్లూరి | వర్తమానం | 1992 |
| 2 | డా.సుందర్రాజు నాగాప్పగారి | చండాల చాటింపు | 1996 |
| 3 | డా.సుందర్రాజు నాగాప్పగారి | మాదిగ చైతన్యం | 1997 |
| 4 | గ్యార యాదయ్య | గూటం దెబ్బ,ఎర్కోషి | 2001 |
| 5 | డా.సుధాకర్ ఎండ్లూరి | కొత్త గబ్బిలం | 1998 |
| 6 | డా.కనకయ్య గుండెడప్పు | కడుపుమీద కొట్టగండ్రి | 1994 |
| 7 | లాబాన్ బాబు తాల్లురి | అంబేద్కర్రథ చక్రాలు | 2002 |
| 8 | డా,జిలుకర శ్రీనివాస్ | కలల గొలుసు | 2003 |
| 9 | డా.సుధాకర్ ఎండ్లూరి | వర్గీకరణీయం | 2005 |
| 10 | ప్రేమ కిషోర్ రావి నూతల | గుండె దరువు | 2005 |
| 11 | ఓబులేసు.పి | నల్లగుండె | 2005 |
| 12 | కనకయ్య గుండెడప్పు | దండోరా దరువు(సంపా) | 2005 |
| 13 | సంపతి సోమయ్య | ఏశకాంత | 2006 |
| 14 | కదిరె క్రిష్ణ | బలగం | 2007 |
| 15 | డా.వెంకటేశ్వరరావు దార్ల | ఒక మాదిగ స్మృతి | 2007 |
| 16 | రమణ తరిగొండ | కందిలి(సంపాదకత్వం) | 2007 |
| 17 | లాబాన్ బాబు | మేకులు కొట్టిన గోడ | 2007 |
| 18 | యాదగిరి సిద్దంకి | మా తొవ్వ | 2008 |
| 19 | బాలయ్య పొన్నాల | ఎగిలివారంగ | 2008 |

| | | | |
|---|---|---|---|
| 20 | బాలయ్య పొన్నాల | పాండురంగ ప్రజాసింగం కడ | 2008 |
| 21 | డా.వెంకటేశ్వరరావు దార్ల | దళిత సాహిత్యం మాదిగ దృక్పథం | 2008 |
| 22 | ఇనాక్ కొలకలూరి | ఆది ఆంధ్రుడు | 2008 |
| 23 | జూపాక సుభద్ర,కృపాకర్ మాదిగ | కైతునకల దండెం (సంపా) | 2008 |
| 24 | జూపాక | అయ్యయ్యో దమ్మక్క | 2008 |
| 25 | ఎల్లయ్య వేముల | ముల్కి | 2011 |
| 26 | డా.సుధాకర్ ఎండ్లూరి | గోసంగి | 2011 |
| 27 | వెంకటేష్ గాదె | పొలి | 2012 |
| 28 | రమేష్ దపోల్ల | వలపోత | 2013 |
| 29 | రమేష్ దపోల్ల | కువ్వ | 2016 |
| 30 | ఇనాక్ కొలకలూరి | దండోరా | 2017 |
| 31 | కంచె ఐలయ్య | మాదిగల తత్వం | 2016 |
| 32 | డా.వెంకటేశ్వరరావు దార్ల | నెమలి కన్నులు | 2016 |

# అనుబంధం — 3

## ఏకీకరణ సాహిత్యం — పుస్తకాల పట్టిక

# అనుబంధం — 3

## ఏకీకరణ సాహిత్యం — పుస్తకాల పట్టిక

| క్ర.సం | రచయిత పేరు | పుస్తకం పేరు | సంవత్సరం |
|---|---|---|---|
| 1 | గూటం స్వామి | ఏకీకరణీయం | 2005 |
| 2 | నేలపూరి రత్నాజీ | ఒకే గొంతు | 2005 |
| 3 | విల్సన్ సుధాకర్ తుల్లిమిల్లి | దళిత వ్యాకరణం | 2007 |
| 4 | భూతం ముత్యాలు | మాలల చరిత్ర | 2007 |
| 5 | డా.గౌరీశ్వర రావు,కె.శశిధర్ | మనువాదానికి మరో రూపం వర్గీకరణ | 2017 |
| 6 | ప్రొ.కంచె ఐలయ్య | మాలల తత్త్వం | 2017 |

# అనుబంధం — 4

## దళిత సాహిత్యవిమర్శ — పరిశోధన వ్యాసాలు

# అనుబంధం — 4

# దళిత సాహిత్యవిమర్శ — పరిశోధన వ్యాసాలు



మద్దిరాల సిద్ధార్థ

## చరిత్ర పుటల్లో చేరని దళిత పద్య కవులు

ప్రసిద్ధ పద్య ప్రక్రియను, దాని రూపురేఖలను గ్రహించి పద్యం అంటే కేవలం ఒక వర్గపు సంపద కాదు, అందులో సాహిత్యం కూడా ఏదో పూర్వజన్మసుకృతం వలనో, దైవ అనుగ్రహం వలనో వచ్చేది కాదు, ఎవరిలో ప్రతిభ సామర్థ్యాలుంటాయో వారు అంతా పద్యరచన చేయవచ్చు అని నిరూపించిన దళిత పద్యకవులు సాహిత్యంలో చాలా మంది ఉన్నారు. ఇలాంటి కవులకు- అణగారిన కులాల ముద్రవల్ల సమాజంలో ఏవిధంగా సముచిత స్థానం ఇవ్వలేదో, అదే విధంగా సాహిత్య చరిత్ర పుటల్లో వారి దాఖలాలు కూడా లేవు.

ఈ వ్యాసం సూర్య దినపత్రిక అక్షరం పేజిలో సోమవారం

3/12/2012 తేదీన ప్రచురితమైంది.

# అస్తిత్వ ఉద్యమ సాహిత్యానికి

# అస్తిత్వమేది?



మద్దిరాల సిద్దార్థ

> వాస్తవానికి రిజర్వేషన్ల వర్గీకరణ డిమాండ్ న్యాయబద్ధమైనదే కానీ ఏ విధంగా పంచుకోవాలి అనేది ఇప్పుడున్న ప్రధాన సమస్య. సాహిత్యం విషయానికి వస్తే నిన్న మొన్న దాకా దళితులపై వివక్షకు ఏదో రూపంలో నిరసన తెలియజేయడం దళిత రచయితల దినచర్యగా ఉండేది. కానీ ఈ రోజు ఆ పరిస్థితి లేదు. వివక్షకు గురైన వ్యక్తి మాల్తో, మాదిగో చూసి అప్పుడు తమ దృక్పథాన్ని రచయితలు వ్యక్తపరుస్తున్నారు. కొద్దిమంది రచయితలు స్పందించడం మానేశారు. ఇందుకు కారణం- ఏం రాస్తే ఆ కవిని ఏ కవిగా (మాల, మాదిగ) ముద్ర వేస్తారో అన్న అభద్రతా భావం వారిలో ఏర్పడింది.

తెలుగు సాహిత్య అధ్యయనం ప్రారంభమై దాదాపు కొన్ని వందల సంవత్సరాలు అవుతోంది. లభిస్తున్న ఆధారాల ప్రకారం, సాహిత్య చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం నన్నయ యుగంతో లిఖిత సాహిత్యం ఆరంభమయింది అనుకుంటే, ఆనాటి నుండి ఈనాటి వరకు ఎన్నో యుగాలుగా, ఎన్నో ప్రక్రియలుగా, ఎన్నోవాదాలుగా పరిణామం చెందుతూనే ఉంది. ఈ క్రమంలో భాగంగా ఆధునిక సాహిత్యం అవతరించింది. ఆధునిక సాహిత్యంలో అంతర్భాగంగా వచ్చిన అస్తిత్వ సాహిత్య ఉద్యమాల్లో ప్రముఖమైనది 'దళిత సాహిత్యం'. ఇది 1980ల్లో ప్రారంభమైంది. దళిత సాహిత్యం ఆరంభమైన మొదట్లో దాని వాడి, వేడి చూసి, అది తెచ్చిన భావ, భాష, వస్తు, శిల్ప, రూప వైవిధ్యాన్ని చూసి కొన్ని వందల సంవత్సరాల తెలుగు సాహిత్యానికి సవాలుగా మారుతుందని చాలామంది సాహితీ విమర్శకులు భావించారు. దీంతో పాటు కొన్ని యుగాలుగా కొనసాగుతూ వస్తున్న తెలుగు సాహిత్య నియమ నిబంధనలను ఖండిస్తూ సాహిత్య అంతిమ ప్రయోజనం సమాజశ్రేయస్సు అని, తద్వారా సాహిత్య అంతిమ లక్ష్యం నెరవేరుతుందనీ తెలియజెప్పే దిశగా దళిత సాహిత్యం బయలుదేరింది. దళిత సాహిత్య లక్ష్య, లక్షణాలను పరిశీలించిన సాహిత్య, సామాజిక మేధావిలోకం, సాహిత్య విమర్శకులు భవిష్యత్తులో ప్రతి అస్తిత్వ, ప్రాంతీయ సాహిత్యాలకు దళిత సాహిత్యం మార్గదర్శకంగా మారే అవకాశం ఉందని భావించారు. సాహిత్య విమర్శకుల, రాజకీయ విశ్లేషకుల అంచనాలకు ఏమాత్రం తీసిపోని విధంగా దళిత సాహిత్యం తన ఆశయాన్ని అన్ని విధాలా నెరవేర్చింది.

దళిత సాహిత్యం ప్రారంభమైన మొదట్లో తాను ఎంచుకున్న లక్ష్యానికి, విధానానికి సర్వత్రా కృషి చేసింది. సాహిత్య యుగ ప్రస్థానంలో 19వ శతాబ్దం నుండి సాహిత్యం అంటే అస్తిత్వ సాహిత్యమనే ఆశాభావాన్ని సాహితీ విమర్శకులకు కలిగింపచేసింది. రానున్న సాహిత్య యుగమంతా అస్తిత్వ కవితా యుగం అని ముద్ర వేసుకొంది. దళిత సాహిత్యం ఏర్పాటు అయి ఈ లక్ష్యం సంపూర్ణంగా నెరవేరుతున్న రోజుల్లో, రేపో మాపో రాజ్యాధికారం సాధిస్తామన్న ఆశాభావంతో దళితులు తమ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోతున్న తరుణంలో, తరతరాలుగా దారిద్ర్య రేఖకు దిగువన బతికిన దళిత ప్రజలు, అంటరానితనాన్ని ఇన్నాళ్ళు అనుభవించిన దళిత ప్రజలు బానిస సంకెళ్ళన్నంటిని తెంచుకుని ప్రధాన జీవన స్రవంతిలోకి వస్తున్న సమయంలో, మాల, మాదిగ అంతర్గత యుద్ధాలు మొదలయ్యాయి. ఈ యుద్ధాలే మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాల మహానాడు! మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సామాజిక న్యాయం వైపు కొనసాగినా, అది తెచ్చిన డిమాండ్ న్యాయబద్ధమైన మాట వాస్తవమే అయినా, ఈ ఉపకులాల అంతర్గత పోరు దళిత అనైక్యతకు, దళిత సాహిత్య స్తబ్దతకు, దళిత ఉద్యమ వైఫల్యానికి దారి తీసిందనడంలో ఎటువంటి సందేహం లేదు.

రిజర్వేషన్ పంపిణీ వివాదాలవల్ల దళిత ఉప కులాల మధ్య అనైక్యత మాత్రమే కాకుండా, ఒకరిపై ఒకరు వివిధ రూపాల్లో దాడులకు దిగడం వరకు పరిణతి చెందింది. క్రమంగా ఇది సాహిత్య రంగంలో కూడా చోటుచేసుకుంది. కంచికచర్ల, కారంచేడు, చుండూరు, వేంపెంట, నీరుకొండ వరకు దళిత ఉద్యమకారులుగా, దళిత మేధావులుగా అగ్రకుల సమాజంలో ఖ్యాతి గాంచినా, పొట్టిలంక, లక్ష్మింపేట సంఘటనల సమయానికి దళిత ఉద్యమకారుల గళం, దళిత కవుల కలం చీలిపోయాయి. మాల, మాదిగ మేధావులుగా- మాల, మాదిగ కవులుగా సమాజంలో కొత్తరూపాన్ని తమకు తామే ఆవిష్కరించుకున్నారు. ఇది ఒక విధంగా ఆహ్వానించదగిన శుభపరిణామమే. అస్తిత్వ ఉద్యమాల్లో ఎవరి అస్తిత్వం గురించి వారు మాట్లాడడం, రాయడం మంచిదే కానీ, అది శృతి మించి సోదర కులాలన్నీ ఒకదానిపై ఒకటి దాడికి దిగడం వలన లాభం కంటే ఎక్కువ నష్టం వచ్చే ప్రమాదం ఉంది. ఇటువంటి ప్రమాదమే దళిత ఉద్యమంలో, దళిత సాహిత్యంలో చోటుచేసుకుంది. ఇన్నాళ్ళు దళిత పేరుతో చెలామణి అయిన మేధావులు, కవులు ఇప్పుడు తమ లక్ష్యాన్ని మరచి వారికి వారే పోటీ పెంచుకుంటున్నారు. ఉపకులాల మధ్యా పోటీని పెంచుకోవడం వల్ల దళిత ఉద్యమం ఎటు పయనిస్తోందో ఒకసారి మేధావి లోకం అవలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఉద్యమంలో, సాహిత్యంలో కుల చైతన్యం రావడం, ఆ దిశగా సాహిత్య రచన చేయడం ఎవరి జీవనవిధానాలను వారు సాహిత్యంలో వస్తువులుగా సృజనీకరించడం ఆహ్వానించదగ్గ విషయమే. కానీ అది స్థాయిని మించి సోదరకులాల మీద దాడికి దిగడం, ఉద్యమం, సాహిత్యం అంతా తమదే అని ఒకరికి ఒకరు వాద, ప్రతి వాదాలు విసురుకోవడం, తమ కులమే గొప్ప అని తమకు తామే సర్టిఫికేట్లు ఇచ్చుకోవడం- ఈ వాదాన్ని వ్యతిరేకిస్తూ మరో కులం కూడా అంతా తామే అంటూ సర్టిఫికెట్లు ఇచ్చుకోవడం ఈ రోజు అటు ఉద్యమంలో, ఇటు సాహిత్యంలో జరుగుతోంది. వాస్తవానికి దళితఉద్యమ, సాహిత్య నిర్మాణంలో అన్నికులాల వారి సమ ప్రాధాన్యత ఉన్నదన్న విషయాన్ని దళిత మేధావిలోకం, దళిత సాహితీలోకం విస్మరించకూ డదు.



రిజర్వేషన్ల సమాన పంపిణీయే సామాజిక న్యాయం అనే నినాదంతో దళిత రిజర్వేషన్లలో వర్గీకరణ జరగాలని కొందరు, రిజర్వేషన్లను వర్గీకరించడం అంటే దళితులను విభజించి పాలించడమేనని, కనుక ఏకీకరణ కావాలని కొందరు చేపట్టే ఉద్యమంలో జాతి ప్రయోజనాలు ఏమో కానీ సొంత ప్రయోజనాలు ఎక్కువగా ఉన్నట్లు- వర్గీకరణ, ఏకీకరణ ఉద్యమ ప్రస్థానంలో స్పష్టమవుతుంది. వర్గీకరణ కావాలని మాదిగలు- వారి ఉపకులాలు తెలుగుదేశం పార్టీని ఆశ్రయిస్తే, ఏకీకరణ కావాలని మాలలు, వారి ఉపకులాలు కాంగ్రెస్‌ను ఆశ్రయించారు. ఇది ఆసరాగా తీసుకొని ఆ రెండు రాజకీయ పార్టీలు తమ తమ స్వలాభాల కోసం ఆయా కాలానుగుణంగా దళితులపై విభజించు పాలించు సూత్రాన్ని ప్రయోగిస్తున్నాయి.

వాస్తవానికి రిజర్వేషన్ల వర్గీకరణ డిమాండ్ న్యాయబద్ధమైనదే కానీ ఏ విధంగా పంచుకోవాలి అనేది ఇప్పుడున్న ప్రధాన సమస్య. సాహిత్యం విషయానికి వస్తే నిన్న మొన్న దాకా దళితులపై వివక్షకు ఏదో రూపంలో నిరసన తెలియజేయడం దళిత రచయితల దినచర్యగా ఉండేది. కానీ ఈ రోజు ఆ పరిస్థితి లేదు. వివక్షకు గురైన వ్యక్తి మాల, మాదిగో చూసి అప్పుడు తమ దృక్పథాన్ని రచయితలు వ్యక్తపరుస్తున్నారు. కొద్దిమంది రచయితలు స్పందించడం మానేశారు. ఇందుకు కారణం- ఏం రాస్తే ఆ కవిని ఏ కవిగా (మాలో, మాదిగ) ముద్ర వేస్తారో అన్న అభద్రతా భావం వారిలో ఏర్పడింది. కొంతమంది రచయితలు బహుజన వాదాన్ని బలోపేతంచేసే పనిలో బిజీగా ఉన్నారు. దళితుల మధ్య ఐక్యత లేనప్పుడు బహుజంవాదం ఎలా బలపడుతుంది అనేది ప్రశ్న!

చాలా మంది మాదిగ మేధావులు, రచయితలు చాలా స్పష్టంగా తాము పలానా అని ముద్ర వేసుకొని సాహిత్యంలో తమ స్థానాన్ని సుస్థిరపరచుకున్నారు. మాలలు ఏ వాదాన్ని బలపరచాలో తెలియక తమ కలాలను నిద్రపుచ్చుతున్నారు. ఇది ఇలాఉంటే, విశ్వవిద్యాలయాలు అధ్యయన కేంద్రాలుగా ఉంటూనే తమ కులప్రభావాన్ని చాటుకుంటున్నాయి. భావి దళితజాతి నిర్మాణానికి పూనుకోవాల్సినవారే దళిత అనైక్యతకు ఆజ్యం పోస్తున్నారు. ఇవన్నీ తెలియని గ్రామీణ దళితప్రజానీకం అటు మాదిగల మీటింగులకు, ఇటు మాలల మీటింగులకు పోతున్నారు. ఎందుకు పోతున్నారో వారికి ఇప్పటికీ తెలియదు. ఏదో బాబాసాహెబ్ అంబేడ్కర్ ప్రసాదించిన రిజర్వేషన్ల ద్వారా కొద్దో గొప్పో దళిత యువత విద్యారంగంలోకి, రాజకీయ రంగంలోకి ఇప్పుడిప్పుడే వస్తున్నది. అలాంటి వారికి చేదోడు వాదోడుగా దళిత మేధావిలోకం ఉండాలి. కనుక ఇప్పుడైనా ఇది గమనించి మాల, మాదిగ మేధావులు, రచయితలు, కవులు, కళాకారులు దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రిజర్వేషన్లు పంచుకోవాలా వద్దా, పంచుకుంటే ఏవిధంగా పంచుకోవాలి, జోన్లవారీగానా, లేక ప్రాంతాల వారీగానా, లేక జనాభా ప్రాతిపదికనా, లేక క్రీమిలేయర్ విధానం ద్వారానా- అనేది ఏదో ఒకటి ఇరువర్గాల ప్రజలకు సమ్మతంగా ఉండేలా నిర్ణయించుకుంటే మంచిది. లేకపోతే ఎన్ని దండోరా ఉద్యమాలు చేసినా, ఎన్ని మాల మహానాడు ఉద్యమాలు చేసినా అవి కేవలం అగ్రకుల రాజకీయ పార్టీల ప్రాభవానికి బాసటగా నిలుస్తాయే తప్ప, దళిత ప్రజలకు ఒరిగేది ఏదీ లేదు.

ఎప్పుడైతే ఈ ఉద్యమం ఒక శాశ్వత పరిష్కారానికి వస్తుందో, అప్పుడు ఉద్యమానికి సాధనంగా సాహిత్యంకూడా తన ధోరణి మార్చుకుని, మాల, మాదిగ కవులుగా చెలామణి అవుతున్న రచయితలంతా అంతర్గతంగా తమ తమ కుల ప్రస్థానాన్ని, తమ సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకుంటూనే 'మేం దళిత కవులం' అని గర్వంగా చెప్పుకుని, దళిత సాహిత్య చరిత్ర పునర్నిర్మాణానికి మార్గదర్శకులవుతారు. కుల అస్తిత్వాల గురించి సాహిత్యంలో చర్చించడం మంచిదే కానీ దళిత కులాల అన్నింటి సంస్కృతీ ఇంచుమించు ఒకే విధంగా ఉంటుంది. కనుక ఆ దిశగా రచనలు చేస్తే దళిత ఉద్యమం, దళిత సాహిత్యం బలపడే అవకాశం ఉంటుంది. అప్పుడే అది దళిత ఉద్యమ, సాహిత్యాలను భుజాన వేసుకుని మోయబోతున్న యువతకు ఆదర్శప్రాయంగా ఉంటుంది. ఇది జరగకపోతే భవిష్యత్తులో దళిత సాహిత్యానికి, దళిత ఉద్యమాల అస్తిత్వానికి- అస్తిత్వమే కరవవుతుంది. బాబా సాహెబ్ అంబేడ్కర్ చెప్పినట్లు రెండు వర్గాల మధ్య విభేదాలొస్తే ఏదో ఒక వర్గం మిగిలి, మరో వర్గం నాశనం అవుతుంది. అదే ఒక వర్గంలో రెండు శిబిరాల మధ్య విభేదాలొస్తే చివరకు వర్గం నాశనం అవుతుంది. ఒకే సిద్ధాంతం, ఒకే సమాజం, ఒకే పోరాటం చేసే వ్యక్తుల మధ్య, సంస్థల మధ్య మిత్ర వైరుధ్యం ఉండాలి కానీ శత్రువైరుధ్యం ఉండకూడదు. ఏ అగ్రకులాల చేతిలో దళితులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారో అదే అగ్రకులాన్ని ఆశ్రయించి తమకు న్యాయం కావాలనడంలో- తాము ఉదయం లేచినప్పటినుండి జపించే ఆత్మగౌరవం ఏమవుతుందో దళిత ప్రజానీకం ఒకసారి ఆలోచించుకుంటే మంచిది.

బహుజన రాజ్యం రావాలని చాలా మంది ప్రసంగాలు, పుస్తకాలు రాస్తున్నారు. ఇంట గెలిచి రచ్చ గెలువు అన్న తీరున ఇంట్లో సమస్యను పరిష్కరించకుండా బయట బహుజనులకు ఏం బోధిస్తాం? కొద్దో గొప్పో చైతన్యం ఉన్న దళిత కులాలు విడిపోయి ఒంటరిగా బతుకుతుంటే ముందు అది పరిష్కరించకుండా బహుజన రాజ్యం ఏవిధంగా బలోపేతం అవుతుంది అనేది ప్రశ్న. దళిత ఉపకులాల మధ్య పోరును పరిష్కరించకుండా బహుజనరాజ్యం బలోపేతం కావడం, దళితులకు రాజ్యాధికారం రావడం మరికొన్ని ఏళ్ళపాటు అది కేవలం నినాదాలకు, సమావేశాలకు, మీడియాలో ప్రకటనలకు పరిమితం అవుతాయి తప్ప, ఎప్పటికి ఆచరణలో సాధ్యం కాదు. ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు, రానున్న ఎన్నికల సమయానికి ఈ వర్గీకరణ, ఏకీకరణ ఉద్యమాల తీరు తెన్నుల్ని క్షుణ్ణంగా సమీక్షించి, వాటి పరిష్కారానికి సరైన మార్గాన్ని ఎంచుకుని రాజ్యాధికార సాధన దిశగా దళిత బహుజన మేధావులు, కవులు, కళాకారులు, పరిశోధకులు పయనించాలి.

**ఈ వ్యాసం సూర్య దినపత్రిక అక్షరం పేజి సోమవారం**

**11- 19- 2012 ప్రచురితమైనది.**

# దళిత పద్య సాహిత్యం... అంబేద్కర్ ఔన్నత్యం

**సిద్ధార్థ మద్దిరాల,**
**హైదరాబాదు విశ్వవిద్యాలయం,**

ఏ కాలంలో అయిన సమాజ స్థితిగతులను, కాల గుణగణాలను బట్టి,కవులు చెప్పే విషయాలను బట్టి, వాటి సామాజిక నేపథ్యాన్ని బట్టి, ప్రజల అవసరాలు దృష్టిలో ఉంచుకుని అప్పటికి అవసరం అయిన సాహిత్య ప్రక్రియలు పుట్టుకొని వస్తాయి. అలా వచ్చినవే ఈ ప్రాచీన, ఆధునిక సాహిత్య ప్రక్రియలు. ప్రాచీన సాహిత్యంతా రాజరికపు వ్యవస్థలో భాగంగా ఛందోబద్ధంగా వస్తే, ఆధునిక సాహిత్యం మాత్రం సమాజ కేంద్రంగా కొనసాగింది. ప్రాచిన సాహిత్యానికి పద్యం ప్రధానవాహికగా ఉంటే , ఆధునిక సాహిత్యానికి వచనం ప్రధాన వాహికగా ఉంది. కాలానుగుణంగా ఎన్ని కొత్తప్రక్రియలు వచ్చినా తెలుగు వారి సంప్రదాయ సంపదగా పద్యం ఆధునికసాహిత్యంలోనూ కొనసాగుతోంది. నేటికి కొంతమంది ఖండకావ్యాలు, లఘుకావ్యాలునే ఆధునిక పద్యకావ్యాల రూపంలో పద్యరచన చేస్తున్నారు. కాకపోతే పండితులకు మాత్రమే అర్థమయ్యే చందోబద్ధముగా కాకుండా సరళమైన భాషలో అందరికి అర్థమయ్యే రీతిలో ఆధునిక పద్యం వచ్చింది నేటికి వస్తుంది దీనికి దళితకవులు అతీతం కాదు. జాతీయోద్యమ కాలంలో అస్పృశ్యత నివారణ ఉద్యమం పేరుతొ ఎంతో మంది దళిత రచయితలు పద్యసాహిత్యాన్ని సృష్టించారు. వీరు అప్పటి ఆచరణలో ఉన్న సాహిత్య ప్రక్రియల అన్నింటిలోను రచనలు కొనసాగించారు. వీరి రచనా మార్గం స్వరూప రీత్యా సంప్రదాయం అయిన స్వభావం మాత్రం ఆధునికం.

సాధారాణంగా ప్రాచిన కాలం నుండి ఆధునిక కాలం వరకు సాహిత్య రచన చేయాలంటే ప్రతీకలుగా రామునినో, కృష్ణునినో, విష్ణువునో ప్రతీకగా తీసుకుని వారి జీవితాలను ఆధారంగా కొన్ని ప్రతీకలు ద్వారా సాహిత్య రచన సాగింది. కానీ దళిత పద్యకవులు మాత్రం ఇలాంటి ప్రతీకాత్మక వస్తువులనే సాహిత్య రచనకు తీసుకోకుండా కొంత వైవిధ్యాన్ని చూపుతూ కొన్ని వందల ఏళ్ళుగా అంటరానితనంలో మగ్గిపోతున్న దళితజీవితాలను ప్రధాన



జీవనస్రవంతిలోకి తీసుకురావడానికి కృషి చేసి తన జీవితాన్ని ఫణంగా పెట్టి పోరాడిన దళిత బహుజన పితామహుడు అంబేద్కర్ జీవితం, ఆయన పోరాటాలు, ఆయన జీవన స్థితిగతులను వస్తువుగా స్వీకరించిన కావ్యాలు ఎన్నో వచ్చాయి.

మొదటగా దళితరాజ్యాధికార రాజకీయ భావనను ఆరేడు దశాబ్దాల క్రితమే జాషువ వ్యక్తపరిచారు. అంబేద్కర్ రాజ్యాధికారానికి రాని జాతి నశించిపోతుందని స్వాతంత్ర్యానికి పూర్వమే చెబితే జాషువ పంచమ రాజ్యాధికార భావనను తన గబ్బిలం కావ్యం ద్వారా అప్పుడే స్పష్టంగా చెప్పారు. అంబేద్కర్‌పై అపారమైన గౌరవాన్ని వ్యక్తీకరిస్తూ అంబేద్కర్‌ను సహోదరుడుగా భావించి జాషువాకు అంబేద్కర్ పట్ల ఉన్న గౌరవాన్ని 'కలడంబేద్కరు నా సహోదరుడు మాకై ..... అంటూ తన గబ్బిలం కావ్యములో తెలియజెప్పాడు.

ఆ తర్వాతి కాలంలో తెలుగు పద్యసాహిత్యం, అందులోనూ జాషువా పద్య సాహిత్యం పట్ల ఆకర్షితులైన ఎంతో మంది దళిత పద్య సాహిత్యాన్ని అప్పటి కాలునుగుణంగా సంప్రదాయ మార్గంలోనే అంబేద్కర్ ఔన్నత్యాన్ని చెప్పటం జరిగింది.

**అంబేద్కరు ప్రశంస(1975):**

కళావీర, సరసకవి చక్రవర్తిగా పేరు పొందిన బొడ్డు ప్రకాశం ఈ పద్య కావ్యాన్ని రాశారు. ఈ కావ్యం 1975 ఏప్రిల్‌లో మొదటి ముద్రణ, 1977లో ద్వితీయ ముద్రణ పొందింది. ఇందులో మొత్తం 100 పద్యాలు కలవు. ఈ కావ్యంలో కేవలం ఛందస్సును మాత్రమే పరిమితి కాకుండా ఆయా సందర్భాను సారంగా కందపద్యాలు, ఆటవెలదులు, సీసపద్యాలు, శార్దూలాలు వాడారు. ప్రాచీన సంప్రదాయం ప్రకారం కావ్య గౌరవ మర్యాదలను పాటిస్తూ మొదటి పద్యాన్నే మంగళ ప్రదంగా 'శ్రీ'తో మొదలు పెట్టాడు. ఈ కావ్యంలో ప్రధానంగా అంబేద్కరు బాల్యం, ఉద్యోగ ప్రా రంభము, న్యాయవాదిగా, స్వజాతి సేవకుడిగానూ, సాంఘీక సేవకుడిగానూ ఆయన హాజరైనటువంటి రౌండు టేబులు సమావేశం గురించి పూనాఒడంబడికను గురించి ఆనాటి మతసమస్య గురించి, చెప్పడం ఇందలి ప్రధాన ఇతివృత్తం. రచయిత ఈ కావ్యాన్ని బ్రూన్ వెంతురిన్‌కి అంకితం ఇచ్చారు. ఈ కృతి భర్తది ఇటలీ దేశము అని రచయిత ముందుమాటలో చెప్పారు. అంబేద్కరు చదువు గురించి కవి సంబోధిస్తూ,

**" భరత ప్రాచీన చరితంబు పరనఉజేసి**
**వన్నెకెక్కిన ఘనులు! విద్వద్విభుండ**
**అపర మనువర్య, కీర్తిక న్యావరుండ**
**పేరువడిసన తేడ అంబేద్కరుండ!"**

అదేవిధంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో దళితజాతి అభివృద్ధి చెందాలంటే వారికి రిజర్వేషన్లు కావాలంటూ అంబేద్కర్ చేసిన కృషిని, అంబేద్కర్ హాజరు అయిన రౌండు టేబులు సమావేశం గురించి పద్య రూపంలో తెలియజెప్పాడు.

**"అక్షర గుచ్ఛము :**

సురగాలి తిమోతి జ్ఞానానంద కవిచే రచింపబడిన పద్యకావ్యం ఈ అక్షర గుచ్ఛం. ఇది మొదటగా అక్టోబరు 1975 ముద్రణ పొందింది. ఇందులో మొత్తం 26 శీర్షికలు ఉన్నాయి. ఈ కావ్యానికి తూమాటి దోణప్ప, విశ్వనాథ సత్యనారాయణ వంటి పండితులు ముందు మాట రాయటం వలన ఈ కావ్య ప్రశస్తి తెలుస్తుంది. అక్షర గుచ్ఛము అంటే 'అక్షరాల గుత్తి' అని కవి ముందు మాటలో చెప్పుకున్నాడు. ఇందులో తెలుగు దేశంలో జరుగుతున్న, జరిగిన అనేక విషయాలను, అయా కాలపు విశేషమైన కవుల గురించి చెబుతూ వారి జీవితాలను కావ్య వస్తువులుగా కవి స్వీకరించాడు. ఈ కావ్యాన్ని దేవులపల్లి రామానుజరావుకు అంకితం ఇచ్చారు. ఇందులో 6-12-1971లో 'అంబేద్కరు' అనే శీర్షికతో ఒక పద్య కవిత్వం రాస్తూ, అంటరాని తనంలో ఉక్కిరి బిక్కిరి అయిపోతున్న దీన జాతికి ఆయన చేసిన మేలును కీర్తించటం ఇందలి వస్తువు.

**'అంటరాని తనంపు టడుసులో బొరలాడు**
**దీనజాతికి దొడ్డ తెరువుసూపి**
**బలిసి నిక్కచు విశృంఖల విహారము నిల్పు**
**కుల మహాద్వీపిందెంప్షలనణంచి**
**నగయొక్క పొగరెక్కి నాట్యమాడిన మత**
**భుజగకన్యక శిరమ్మును విదల్చి ......,**
**నడచి దీక్షగొన్న నవబుద్ధ నిరతమ్ము**
**నీదుపేరు జగతి నిలుచుగాక "**

**అంబేద్కర్ సుప్రభాతం :**

ఈ కావ్యాన్ని బోయి భీమన్న 1984 సంవత్సరంలో స్తోత్ర కావ్యంగా రచించాడు.నమస్సుల్ అంబేద్కరా అన్న మకుటంతో వెలువడిన ఈ కావ్యంలో అంబేద్కర్ ని ఉత్తమ పురుషుడిగా భావించి "నిజాయితితో,ఆత్మశుద్ధితో,క్రియాశీలతతో మాత్రమే అంబేద్కరుని స్మరించటం ప్రశంసించడం పరమార్థంగా రచించిన పద్య కృతి ఇది. ఈ కావ్యంలో నా సుప్రభాత కావ్యకమాలనికి అంబేద్కర్ నవ సూర్యుడైనాడు అని ప్రశంసిస్తూ అంబేద్కర్‌ను ఉత్తమ జాతీయ నాయకుడిగా కీర్తిసాడు.

**"నేరమునకు శిక్ష విధించు తీరు విడిచి**
**వర్ణమును బట్టి దండన నిర్ణయించు**
**ధర్మరహిత 'మనుస్మృతి' దగుల బెట్టి**
**గుండె మంటను చల్లార్చుకొంటివయ్య "**

**అంబేద్కరో! సమరసింహం :** ఈ కావ్యాన్ని రావూరి ఏకాంబరం రచించాడు. అంబేద్కర్ సిద్ధాంతాల పునశ్చరణం, ఆయనను ఆయన సిద్ధాంతాలను కొనియాడటం వస్తువుగా "అంబేద్కరో సమరసింహం" అనే కావ్యాన్ని రచించాడు. భారత భూమి లోని కులతత్వం, సతీ సహగమనం, అత్యాచారాల ప్రస్తావన, అస్పృశ్యత, కర్మ, పునర్జన్మ సిద్ధాంతాలపై విమర్శ మొదల్కెనవి ఇందులో ప్రధాన వస్తువులుగా ఉన్నాయి.

**జీవనది :** ఈ కావ్యాన్ని ప్రముఖ పద్యకవి మల్లవరపు రాజేశ్వరరావు గారు నవంబరు 2009 లో రచించారు.ఇది పద్య రూపంలో ఉన్న ఖండ కావ్యం.ఇందులో మొత్తం 42 శీర్షికలతో సమకాలీన కాలంలో జరుగుతున్న సమస్యల మీద రచయిత స్పందిస్తూ పద్య రచన చేయటం జరిగింది. ఇందులో దళిత దేవుడు అనే శీర్షికతో అంబేద్కర్‌ని కీర్తించటం జరిగింది. ఇందులో దళిత ఆత్మగౌరవ నినాదం ఇమిడి ఉంది. కులవ్యవస్థలో బిగుసు పోయిన బానిస సంకెళ్ళను తెంచి జాతి విముక్తికి అంబేద్కర్ అహర్నిశలు ఎలా కష్టపడ్డాడో ఈ శీర్షిక తెలియజేస్తుంది.

**దళిత పద్యం ప్రధానాంశాలు :**

1. స్వరూప రీత్యా పద్యరచనలన్ని సంప్రదాయంగా కొన సాగిన వాటి స్వభావాన్ని బట్టి వాటిలో భావాన్ని బట్టి ఇవి ఆధు నిక భావాలకు చెందినవే అని చెప్పవచ్చు.
2. ఛందస్సు రీత్యా ఇతర కవులకు ఎక్కడ తీసిపోని విధముగా సాహిత్య రచన చేసి ప్రజ్ఞ పూర్వజన్మ సుకృతం కాదు అని నిరూపిం చారు.
3. ఆ రోజుల్లో సాహిత్య రచనలకి, సాహిత్య సంపదకి ఎనలేని గౌరవం ఉన్నప్పటికీ దళిత జాతికి తన జీవితాన్ని త్యాగం చేసిన అంబేద్కర్ ను స్మరించటం వలన తాము పుట్టిన జాతిపై ఉన్న గౌరవాన్ని పద్యరచనలో తెలియజెప్పారు.
4. కృతికర్తలు కృతిభర్తల (అంబేద్కర్‌కు, దళిత జాతికి) అంకితం విషయంలో కుడా జాతి పట్ల ఎనలేని గౌరవాన్ని ప్రదర్శించటం విశేషం.
5. కులవ్యవస్థ విస్తృతంగా ప్రబలుతున్న రోజుల్లో దాన్ని వ్యతిరేకించిన అంబేద్కర్ జీవితాన్ని సంప్రదాయ సాహిత్యంలో స్మరించుకోవటం సాహిత్య తిరుగుబాటు గానే భావించాలి.
6. పద్య రచనలను ఒక ప్రక్రియకు మాత్రమే పరిమితం చేయకుండా వివిధ ప్రక్రియల్లో రచించి ప్రక్రియా వైవిధ్యాన్ని చాటారు.
7. వ్యక్తిగత విషయాల కంటే వ్యవస్థాగత విషయాలను పద్యాల్లో ఎక్కువగా చెప్పటం నూతన ఒరవడి గానే భావించాలి.
8. అంబేద్కర్ ఆశించిన దళిత బహుజన భావజాలాన్ని పద్యాల్లో ప్రచారం చేయటం దళిత పద్య కవుల ముందు చూపుకు నిదర్శనం.
9. పద్యం పాతదైన వీరు చెప్పిన విధానం నిత్య నూతనం
10. భాష, భావం విషయంలో, ఇటు వ్యాకరణ వాదులకి అటు ప్రగతీశీల ప్రజాస్వామ్య వాదులకు ఇద్దరిని సమన్వయ పరుస్తూ సాహిత్యరచన చేయటం దళిత పద్యకవుల కీర్తిపతాకలకు నిదర్శనం.



రాయలసీమ జాగృతి మాస పత్రిక,

డిసెంబరు సంచిక,పుట సంఖ్య: 14 &15

ISSN :2581-3153

***

# Ph.D Synopsis

# daḷita sāhitya vimarśa samakālīna dhōraṇula pariśīlana

(A Thesis submitted to the University of Hyderabad in Partial Fulfillment of the requirement for the award of)

Doctor of Philosophy
In
Telugu

Researcher
**SIDDARDHA MADDIRALA**
(Reg No: 09HTPH05)

Department of Telugu,
School of Humanities,
University of Hyderabad,
Gachibowli,Hyderabad- 500046

December – 2018

# దళిత సాహిత్య విమర్శ - సమకాలీన ధోరణుల పరిశీలన

(పిహెచ్.డి పట్టా కొరకు హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం)


**పరిశోధన**

**సిద్దార్థ మద్దిరాల**

**09HTPH05**

**పర్యవేక్షణ**

**ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు**

**తెలుగు శాఖ, మానవీయశాస్త్రాల విభాగం**

**హైదరాబాద్ విశ్వవిద్యాలయం,**

**హైదరాబాద్-500046**


**డిసెంబర్ – 2018**

# విషయ సూచిక (Index)


1. పరిశోధన శీర్షిక (**Research Tittel**)
2. పరిచయం (**Introduction**)
3. పరిశోధన పరిధి (**Scope of the Research**)
4. పరిశోధన విధానం/పద్ధతి ( **Research Methodology**)
5. పూర్వపరిశోధనల పరామర్శ (**Review of literature**)
6. పరిశోధన ప్రణాళిక (**Research Design**)
7. ముక్తాయింపు (**Conclusion**)
8. పరిశోధన ఫలితాంశాలు (**Research Results**)
9. ఉపయుక్త గ్రంథసూచి (**Bibilography**)
10. అనుబంధాలు(**Annexures**)

**1.పరిశోధన శీర్షిక :** దళిత సాహిత్య విమర్శ – సమకాలీన ధోరణుల పరిశీలన

**2.పరిచయం (Introduction) :**

సమాజ శ్రేయస్సుని ఆకాంక్షించే ప్రతి అక్షరం సాహిత్యమే. ఈ సాహిత్యాన్ని కాలానుక్రమంలో దాని స్వరూప, స్వభావాన్ని బట్టి ప్రాచీన, ఆధునిక సాహిత్యాలుగా సాహిత్య విమర్శకులు విభజించారు. ఆధునిక కాలంలో వచ్చిన సాహిత్య ఉద్యమాల్లో దళిత్య సాహిత్య ఉద్యమం ఒకటి. దళిత సాహిత్యం ప్రారంభమైన మొదట్లో షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల, వెనుకబడిన తరగతులకు మరియు మైనారిటీ వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చింది. తెలుగులో అస్తిత్వ సాహిత్య ఉద్యమాలు వచ్చిన తర్వాత ఎవరిగొంతు వారే వినిపించటం, ఎవరి జీవితాలను వారే సాహిత్యంగా చిత్రికరించటం ప్రారంభమైంది.ఈ నేపథ్యంలో దళిత సాహిత్యం షెడ్యూల్డ్ కులాలకు పరిమితమైంది. ఈ షెడ్యూల్డ్ కులాల్లో ప్రధానంగా మాల, దాని అనుబంధ కులాల రచయితలు, మాదిగ, మాదిగ అనుబంధ కులాలు రచయితలు దళిత సాహిత్యాన్ని పరిపూర్ణ స్థాయిలో రచించడంలో సఫలీకృతులయ్యారు. దళిత ఉద్యమం, దళిత సాహిత్యం ఉధృతంగా వస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో సైతం చైతన్యం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న రోజుల్లో రేపే మాపో రాజ్యాధికారం సాధించబోతున్నామన్న ఆశాభావం యావత్తు దళిత ప్రజానీకానికి కలిగింది. ఈ తరుణంలో అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్లు దళితుల్లో ఒక వర్గం అయిన మాలలే అనుభవిస్తున్నారని మరో వర్గం మాదిగలు ఆరోపిస్తూ దండోరా ఉద్యమం పేరుతో ఒక శిబిరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ దండోరా ఉద్యమానికి ఆసరాగా రచయితలు కూడా సాహిత్యాన్ని దండోరా సాహిత్యాన్ని రాయటం మొదలు పెట్టారు. ఈ దండోరా ఉద్యమానికి,సాహిత్యానికి వ్యతిరేకంగా మాలలు మాలమహానాడు పేరుతో మరో శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఇలా వచ్చిన ఈ ఉద్యమాలు కాలక్రమేణా వాటి పరిధి ప్రాధాన్యతలను పెంచుకుంటూ ఒక వాదంగా స్థిరత్వాన్ని ఏర్పాటు చేసుకోగలిగాయి. ఇలా ఏకకాలంలో వచ్చిన సాహిత్య వాదాలను పరిశీలించే దిశగా ***"దళిత సాహిత్య విమర్శ-సమకాలీన ధోరణుల పరిశీలన"*** అనే అంశాన్ని నా పరిశోధన శీర్షికగా నిర్ణయించుకోవటం జరిగింది.

**2.పరిశోధన పరిధి (Scope of the Research) :**

దళిత సాహిత్యం తెలుగు సాహిత్యం ప్రారంభం నుండే ప్రారంభమైందని చెప్పుకోవచ్చు. కాకపోతే స్పష్టమైన లక్ష్యంతో అది వెలువడలేదు. కేవలం నీచపాత్రలను

రచనా ప్రస్థానంలో చర్చించ వలసినప్పుడే మాత్రమే దళిత సాహిత్య ఛాయలు తెలుగు సాహిత్యంలో కనిపిస్తున్నాయి. ఆధునికకాలంలో 19వ శతాబ్దం ఉత్తరార్ధంలో సాహిత్యంలో అస్తిత్వ ఉద్యమయుగం మొదలైంది. ఈ అస్తిత్వఉద్యమాలకు దళిత ఉద్యమ, సాహిత్యాలు బీజం వేశాయనే చెప్పాలి. దళిత సాహిత్యం ప్రారంభం అయిన కొన్ని సంవత్సరాల తర్వాత దళితుల మధ్య రిజర్వేషన్ల పంపిణీపై అంతర్యుద్ధాలు మొదలైనాయి. ఈ క్రమంలోనే దళితసాహిత్యం వర్గీకరణ సాహిత్యంగా, ఏకీకరణ సాహిత్యంగా విడిపోయి అటు మేధావులు, కవులు, కళాకారులు దాదాపు దళిత సమాజం అంతా బహిర్గతంగా సభల్లో, సమావేశాల్లో దళితులంతా ఒక్కటే అని ప్రసంగాలు ఇచ్చుకున్న, అంతర్గతంగా మాత్రం వీరి మధ్య సామాజిక, ఆర్థిక, ఉపాధి హోదా కోసం, సాహిత్య స్థానాల కోసం యుద్ధం జరుగుతూనే ఉంది. ఆధునిక సాహిత్యం మొదలైన తర్వాత వచ్చిన జాతీయ, సంస్కరణ, భావ, అభ్యుదయ, విప్లవసాహిత్యాలలో దళితుల గురించి చర్చ జరుగుతూనే ఉంది. కాకపోతే ఇది దళితులకు ప్రత్యేక హోదా ఇవ్వకుండా ఆయా పరిస్థితులకనుగుణంగా దళితుల గురించి సాహిత్య రచనలు వారి వారి భావజాల దృష్ట్యా చేయడం జరిగింది. సాహిత్య నియమాలను, నిబంధనలను ధిక్కరిస్తూ సాహిత్య సృజనలో దళితుల స్థానాన్ని ప్రశ్నిస్తూ దళిత సాహిత్యం ఎలా వచ్చిందో చెబుతూనే, దాని పరిణామ క్రమాన్ని పరిచయం చేస్తూ, తెలుగు సాహిత్య విమర్శలో దళిత సాహిత్య విమర్శ స్థానాన్ని ప్రస్తావిస్తూ, దళిత సాహిత్యంలో విభేధాలు ఎలా జరిగాయో చెబుతూ, దాని నేపథ్యంగా దళిత సాహిత్య విమర్శలో సమకాలంలో వచ్చిన వర్గీకకరణ, ఏకీకరణ ఉద్యమ సాహిత్యాన్ని, సాహిత్య విమర్శని పరిశీలించటం ఈ పరిశోధన పరిధి.

**3.పరిశోధన విధానం/పద్ధతి ( Research Methodology) :**

***" దళిత సాహిత్య విమర్శ సమాకాలీన ధోరణుల పరిశీలన"*** అనే ఈ పరిశోధనలో విషయ సేకరణ ప్రధానంగా రెండు రకాలుగా చేయటం జరిగింది. మొదటిది వివిధ గ్రంథాలయాల్లో ఈ అంశానికి సంబంధించిన పుస్తకాలను సేకరించి ఆయా పుస్తకాల్లో ఉన్న సాహిత్య విమర్శాంశాలను సమీక్షించటం, ఆ విమర్శలు ఆయా రచయితలు ఏ కోణం నుండి విమర్శించారో పరిశీలించటం జరిగింది. రెండవది దళిత సాహిత్యానికి ప్రధాన భూమిక దళిత ఉద్యమమే. కనుక ఆయా ఉద్యమకారులను, కొన్ని ఉద్యమ పత్రికలను, సభలు, సమావేశాల్లో కవులు, కళాకారులు, మేధావులు తీర్మానించిన అంశాలను, సాహిత్య

పత్రికలలో వెలువడే ఆయా విమర్శ వ్యాసాలను సేకరించటం. వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధన గ్రంథాల సహకారంతోనూ, ఈ వర్గీకకరణ, ఏకీకరణ గురించి దళితులు (మాలలు, మాదిగలు), దళితేతరుల అభిప్రాయాలు ఎలా ఉన్నాయో ఆయా సాహిత్య గ్రంథాల ముందుమాటల ఆధారంగా సేకరించటం జరిగింది. ఇవే కాకుండా అంతర్జాలంలో కనిపించే బ్లాగులు, మాలమహానాడు, మాదిగరిజర్వేషన్ పోరాట సమితి వెబ్ సైట్ల ఆధారంగా కూడా కొంత సమాచారం సేకరించటం జరిగింది. వీటితో పాటు అదనపు సమాచారం అంటే కవుల, కళాకారుల అభిప్రాయాల వంటి ఆకరాలు, సాహిత్యసాధనాలు ఉపయోగించుకుని ఈ పరిశోధన పూర్తి చేయటం జరిగింది. ఈ పరిశోధన ప్రధానంగా విశ్లేషణాత్మక/వివరాణాత్మకపద్ధతిలోనూ, వాఙ్మయ సేకరణ, విశ్లేషణ పద్ధతిలోనూ కొనసాగించటం జరిగింది.

**4.పూర్వపరిశోధనల పరామర్శ (Review of literature) :**

తెలుగు సాహిత్యం ప్రారంభమైనప్పటి నుండి ఆధునిక సాహిత్యం అందులో దళిత సాహిత్యంపై ఎన్నో పరిశోధనలు విరివిగా వచ్చాయి. కాకపోతే అవి దళిత ఉద్యమం గురించి, దళిత సాహిత్య చరిత్ర గురించి, దళిత సాహిత్య వస్తువు, రూపం, శిల్పం గురించి వచ్చాయి. అంతేగాకుండా దళిత సాహిత్య రచయితల గురించి, వారి రచనలపై ప్రత్యేక అధ్యయనాలు జరిగాయి. కానీ దళిత సాహిత్య విమర్శ దళిత కవిత్వం ఎదిగినంతగా ఎదగలేదనే చెప్పాలి. దళిత సాహిత్య విమర్శ ప్రారంభమైనప్పటి నుండి నేటి వరకు పరిశోధనలు పరిమితంగానే జరిగాయనే చెప్పాలి. అందులోనూ దళిత సాహిత్యంలో సమకాలంలో అంటే వర్గీకరణ, ఏకీకరణ అంశాలపై పెద్దగా పరిశోధన జరగలేదని నా అభిప్రాయం. తెలుగు సాహిత్యంలో దళిత సాహిత్యం పై జరిగిన పరిశోధనలు కొన్ని ఈ కింద పేర్కొంటున్నాను.

1. ఆనందరావు,కొల్లూరి.**హరిజనాభ్యుదయం ఆధునికాంధ్రకవిత్వం:** 1994; విశాఖ జిల్లా, చైతన్య సాహితీ స్రవంతి.
2. మల్లికార్జున,పి.***తెలుగులో దళిత కవిత్వరూపం - వస్తువు;(అముద్రిత సిద్ధాంతవ్యాసం):*** హైదరాబాదు విశ్వవిద్యాలయం,హైదరాబాదు,1997.
3. విజయానందరాజు,వై.**తెలుగు సాహిత్యం హరిజనుల సేవ:** హైదరాబాదు విశ్వవిద్యాలయం;1998.
4. సుధాకర్,కాకాని.**దండోరాచైతన్యం**:హైదరాబాదువిశ్వవిద్యాలయం;1998.

5. శ్యామసుందరరావు,అంబటి.***దళిత సాహిత్యం భాషా దృక్పథం(అముద్రిత సిద్ధాంత వ్యాసం);*** హైదరాబాదు విశ్వవిద్యాలయం:2000.

6. రవికుమార్,పొనుగోటి.***దళిత కవిత్వంలో పురాణ ప్రతీకలు (అముద్రిత సిద్ధాంత వ్యాసం);***హైదరాబాదు విశ్వవిద్యాలయం:హైదరాబాదు,2003.

7. గౌరీశ్వరరావు,కొంకే.**దళితపత్రికలు** హైదరాబాదు విశ్వవిద్యాలయం,2007.

8. మాధవరావు,గుర్రం.**దళిత సాహిత్యవిమర్శ వాదోపవాదాలు:** హైదరాబాదు విశ్వవిద్యాలయం; జూన్ 2010.

9. సిద్దార్ధ,మద్దిరాల.**దళిత పద్యకవులు వస్తు వైవిధ్యం**: హైదరాబాదు విశ్వవిద్యాలయం; జూన్. 2009.

10. అంజలిదేవి,సింధే.**రాయలసీమ దళితకథలు భాషావిశ్లేషణ:** పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం; హైదరాబాదు, 2010.

**5.పరిశోధన లక్ష్యం (Objectives of the Study) :**

మనిషిని మనిషిగా చూడలేని ఈ అమానవీయ హిందూ సమాజంలో తమ కంటూ సొంత జీవన విధానం, సొంత గొంతుక అవసరమని భావించిన దళితులు పూలే, అంబేద్కర్ ఆలోచన విధానాలతో ప్రేరేపితులై దళితులపై జరుగుతున్న వివక్షతను, దాడులను వ్యతిరేకిస్తూ దళిత ఉద్యమాన్ని ఆరంభించారు. దళిత ఉద్యమానికి ఆధారభూతంగా ఏర్పాటు అయిందే దళిత సాహిత్యం. దళిత సాహిత్యంలో దళితుల సంస్కృతీ, సంప్రదాయాలు, దళితులపై జరిగిన వివక్షతలే వీరి కవితా వస్తువులు. మొదటగా తెలుగు సాహిత్యంలో అస్పృశ్య నివారణోద్యమంలో భాగంగా ప్రారంభమై, అభ్యుదయ, విప్లవ సాహిత్యాలలో కొంత అనుభవాన్ని గడించి 1980 తర్వాత నిర్ధిష్టమైన లక్ష్యంతో దళిత సాహిత్యం ఏర్పాటు అయింది. దళితసాహిత్యం ఏర్పాటు అయిన దశాబ్ధ కాలంలో తెలుగు సాహిత్యానికే ధీటుగా మారింది. దాదాపు అన్ని ప్రక్రియల్లో దళిత సాహిత్య ఛాయలు కనిపించాయి. 1990 తర్వాత దళిత ఉద్యమ, సాహిత్య పరిస్థితి ఊహించని మలుపు తిరిగింది. భారత రాజ్యాంగంలో దళితులకు కల్పించిన రిజర్వేషన్ల పంపిణీలో మాల దాని అనుబంధకులాలకు, మాదిగ దాని అనుబంధ కులాల వారికి అంతర్యుద్ధం మొదలైంది. అంతవరకు దళితుల ఐక్యత వర్ధిల్లాలి అనే నినాదం మాదిగల ఐక్యత వర్ధిల్లాలి, మాలల ఐక్యత వర్ధిల్లాలి అనే స్థాయికి చేరుకొని వేర్వేరు శిబిరాలు ఏర్పాటు చేసుకున్నారు. ఫలితంగా సాహిత్యంలో కూడా ఇదే ధోరణి

వెలువడింది. ఫలితం మాలలపై మాదిగలు, మాదిగలపై మాలలు విమర్శించుకోవటం ప్రారంభమైంది. ఫలితం దళిత ఉద్యమం, సాహిత్యం యొక్క అంతిమ లక్ష్యానికి కుంటుపడింది. ఇలా ఎందుకు జరిగిందో చెబుతూ ఆయా కాలాల్లో వచ్చిన సామాజిక, రాజకీయ విశ్లేషణను, సాహిత్య విమర్శను పరిశీలించటం, ఏకీకరణ, వర్గీకరణ సాహిత్య వాదాలు దళిత సాహిత్యంలో ఆవిర్భవించటం దళిత సాహిత్య వికాసమా? వినాశనమా? నిజంగా రిజర్వేషన్ల పంపిణిలో ఏమైనా లోటుపాట్లు ఉన్నాయా? వాటిని ఎలా అధిగమించాలి, వీటికి సంబంధించి వివిధ ప్రముఖుల సూచనలు ఏవిధంగా ఉన్నాయో, వీటి ఆధారంగా వచ్చన సాహిత్య సృజన ఎలా జరిగింది? సాహిత్య విమర్శ ఎలా జరిగింది? సాహిత్య విమర్శలో దళిత సాహిత్య స్థానం ఎంత? దళిత సాహిత్యంలో ఏకీకరణ, వర్గీకరణ ప్రభావం ఎలా ఉంది?...తదితర అంశాలన్నింటిని శాస్త్రీయంగా పరిశీలించటమే ప్రధాన లక్ష్యంగా ఈ పరిశోధన కొనసాగింది.

**6.పరిశోధన ప్రణాళిక(Research Design) :**

"**దళిత సాహిత్య విమర్శ సమకాలీన ధోరణుల పరిశీలన**" పరిశోధనాంశాన్ని అధ్యయన సౌలభ్యం కొరకు మొత్తం నాలుగు అధ్యాయాలుగా విభజించుకోవటం జరిగింది.

మొదటి అధ్యాయం : **దళిత సాహిత్యం చారిత్రక నేపథ్యం**

రెండవ అధ్యాయం : **తెలుగు సాహిత్య విమర్శ – దళిత సాహిత్య ప్రస్థానం**

మూడవ అధ్యాయం : **వర్గీకరణ సాహిత్యం- విమర్శనాత్మక పరిశీలన**

నాల్గవ అధ్యాయం : **ఏకీకరణ సాహిత్యం-విమర్శనాత్మక పరిశీలన**

**సింహావలోకనం**

❖ మొదటి అధ్యాయం " **దళిత సాహిత్యం - చారిత్రక నేపథ్యం"** లో దళితులంటే ఎవరు? దళిత అనే పదానికి నైఘంటిక అర్థాలు, నిర్వచనాలను మరియు ప్రముఖ సాహిత్య, సామాజిక విశ్లేషకుల అభిప్రాయాలను తెలియజెప్పే ప్రయత్నం చేశాను. దళితసాహిత్య ప్రస్థానంలో దళిత ఉద్యమం ఏవిధమైన పాత్ర పోషించిందో రేఖామాత్రంగా పరిచయం చేస్తూ, దళితసాహిత్య ప్రారంభపరిణామాలను విశదీకరించే ప్రయత్నం చేసాను. దళిత సాహిత్యాన్ని ప్రాచీన సాహిత్యం నుండి ఆధునిక వరకు దళిత, దళితేతర రచయితలు ఎలా చిత్రికరించారో ఆయా గ్రంథాల ఆధారంగా వివరించాను. ఆధునిక సాహిత్యంలో దళిత సాహిత్యం ఒక వాదంగా బలపడిన తర్వాత దళిత సాహిత్యం రచయితలను,సామాన్య ప్రజానీకాన్ని ఎలా

ప్రభావితం చేసిందో తెలియజెప్తూనే, దళిత సాహిత్యంలో వచ్చిన ప్రక్రియా వైవిధ్యాన్ని, వస్తువైవిధ్యాన్ని విమర్శనాత్మకంగా తెలియజెప్పే ప్రయత్నం చేసాను.చివరగా దళిత ఉద్యమం, సాహిత్య అభివృద్ధికి వివిధ ప్రభావం, వివిధ ఎన్.జి.వోలు,వివిధ సంఘాలు తమ వంతు పాత్రను ఏ విధముగా పోషించాయో విశదీకరించే ప్రయత్నం చేసాను.

- ❖ రెండవ అధ్యాయం"**తెలుగుసాహిత్యవిమర్శ- దళిత సాహిత్య ప్రస్థానం"లో** దళిత సాహిత్యవిమర్శను అధ్యయనం చేయాలంటే తెలుగు సాహిత్య విమర్శ తీరుతెన్నులను రేఖామాత్రంగా అధ్యయనం చేసి తెలుగుసాహిత్య విమర్శలో దళిత సాహిత్య విమర్శ స్థానం ఏమిటో నిరూపించే దిశగా ఈ అధ్యాయం కొనసాగింది. ఈ అధ్యాయంలో ప్రధానంగా విమర్శ అంటే ఏమిటి? విమర్శ నిర్వచనాలు? ప్రముఖుల అభిప్రాలు తెలుగుసాహిత్య విమర్శలో దళితసాహిత్య విమర్శ స్థానాన్ని పరిశీలించిన తర్వాత దళిత సాహిత్య విమర్శ వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు ఏయే వాదాలకు, ఏయే కాలాల్లో వచ్చిందో తెలియజెప్పే ప్రయత్నం చేసాను. ఈ పరిశీలనలో భాగంగా దళిత సాహిత్యం ఆయా ఉద్యమాలకు అనుగుణంగా ఆయా కాలాల్లో వచ్చిన సమకాలంలో వచ్చిన వాదాలు ప్రధానంగా వర్గీకరణవాదసాహిత్యం(మాదిగరిజర్వేషన్ పోరాటసమితి), ఏకీకరణవాదసాహిత్యం(మాలమహానాడు) గా ఈ అధ్యాయంలో గుర్తించాను.
- ❖ మూడవ అధ్యాయం" **వర్గీకరణ సాహిత్యం – విమర్శనాత్మక పరిశీలన"** లో భారత రాజ్యాంగంలో అంబేద్కర్ కల్పించిన హక్కులను దళితులంతా సమానంగా అనుభవించటం లేదని, ఇప్పుడు అమలవతున్న రిజర్వేషన్ల పంపిణీలో కొంత అవకతవకలు ఉన్నాయనీ, రిజర్వేషన్ల పంపిణీ సరిగా జరగలేదని ఒక వర్గం(మాలలు)వారే మొత్తం రిజర్వేషన్లు అనుభవిస్తున్నారని కాబట్టి అంబేద్కర్ అంతిమ లక్ష్యం నెరవేరాలంటే రిజర్వేషన్ల వర్గీకరణ జరగాలని ఒక వర్గం అనగా మాదిగ, దాని అనుబంధ కులాలు 1994 నుండి ఒక ప్రత్యేక వాదం పురుడుపోసుకుంది.ఈవాదాన్ని,దండోరాఉద్యమాన్ని, దండోరాసాహిత్యాన్ని మాదిగ మేధావులు, రచయితలు తమ రచనల ద్వారా ఏ విధంగా ముందుకు నడిపించారో, వారి ఆలోచన విధివిధానాలు, లక్ష్య, లక్షణాలు, ఉద్యమాన్ని, సాహిత్యాన్ని సమన్వయం చేస్తూ, తెలుగుసాహిత్యలో మాదిగ సాహిత్యానికి గల స్థానాన్ని

తెలియజెప్తూనే శాస్త్ర, సామాజిక, రాజకీయ, ఆర్థిక నిపుణుల అభిప్రాయాలను ఆధార సహితంగా క్రోడికరించి వర్గీకరణ సాహిత్య ప్రస్థానాన్ని విమర్శానాత్మకంగా విశ్లేషించే ప్రయత్నం చేసాను.

- నాల్గవ అధ్యాయం "**ఏకీకరణ సాహిత్యం-విమర్శనాత్మక పరిశీలన**" లో ఈ వర్గీకరణ వాదానికి ప్రతికూలంగా మాలలు, దాని అనుబంధ కులాలు దళిత రిజర్వేషన్లు విభజించడం అంటే దళితులను విభజించడమే అని, ఉమ్మడిగా ఉంటేనే ఏదైనా సాధించగలమని కాబట్టి రిజర్వేషన్లు వర్గీకరించకూడదని మాల దాని అనుబంధ కులాలు చేపట్టిన మాలమహానాడు లేదా ఏకీకరణ ఉద్యమంగా ఉద్యమాన్ని, ఉద్యమ లక్ష్య, లక్షణాలను తెలియజెప్పాను.ఈ ఏకీకరణ ఉద్యమానికి అనుబంధముగా వచ్చిన రాజకీయ, సామాజిక, ఆర్థిక విశ్లేషణలను మరియు సాహిత్యాన్ని, సాహిత్య విమర్శని విశ్లేషణాత్మకంగా వివరించాను.
- "**సింహావలోకనం**" లో ఈ వర్గీకరణ, ఏకీకరణ ఉద్యమాల సారాంశాన్ని, వారు ప్రతిపాదించిన సిద్ధాంతాలను, అందులో భాగంగా వచ్చిన సాహిత్య గ్రంథాలను, గ్రంథ విమర్శలను  పరిశీలించి, అవి వచ్చిన తీరుని, వాటి అవసరాన్ని, ఈ పరిశోధనా ఫలితాలను తెలియజెప్పి, వీటి వాదోపవాదాలకు, సాహిత్యాంశాలకు సంబంధించిన ఆధారగ్రంథాలను, మరియు మరికొన్ని ప్రామాణిక సాహిత్య గ్రంథాలను ఆకారాది క్రమంలో పొందుపరచి ఈ పరిశోధనను ముగించడం జరిగింది.

**7.ముక్తాయింపు (Conclusion) :**

దళిత సాహిత్యం రానంత వరకు సాహిత్యం కొన్ని వర్గాలకు, కొన్ని భావాలకు పరిమితమై, కొన్ని అంశాలకు మాత్రమే సార్వజనీనంగా ఉండేది. సుఖదు:ఖాలు, ప్రేమ, ద్వేషం మొదలైన భావావేశాలను సార్వజనీన అంశాలుగా చెప్పేవారు. కానీ దళితసాహిత్యం ఆ అంశాలతో పాటు వివక్ష కోణాన్ని బహిర్గతం చేసి ప్రపంచ సాహిత్యాలతో అనుసంధానం అయ్యేట్టు చేసింది. కేవలం కొన్ని ఎమోషన్స్ వరకే పరిమితమైన సార్వాజనీకత దళిత సాహిత్యం వలన సమస్యల పరిష్కారాలలోనూ, ఎమోషన్స్ లోనూ తదితర అనేక కోణాలలో నిజమైన సార్వజనీనకతను సాహిత్యానికి అందించింది. అంతేకాకుండా సాహిత్యం

దైవతత్వం అని, భాష ఉదాత్తం అని శ్రేష్ఠ వర్గాలు మాత్రమే సాహిత్యాన్ని ఉత్పత్తి చేస్తాయనే భావాలను దళిత సాహిత్యం తిరస్కరించింది.

జీవితానికి, సాహిత్యానికి, సమాజానికి త్రికోణమితిలో ఒక విడదీయరాని సంబంధాన్ని, వాస్తవికంగా అనుభవపూర్వకంగా, ఆచరణాత్మకంగా ప్రతిఫలింప చేసింది. వస్తువు దాన్ని రాసిన వ్యక్తులు, దాన్ని రాయటానికి ఉపయోగించిన భాష వాస్తవికతను ప్రతిఫలించింది. దళితసాహిత్యం తీసుకువచ్చిన ఈ మౌలికమైన మార్పు అంతకు ముందు కనిపిస్తుందని చెప్పలేము. ఈ దృక్పథంతోనే, ఈ వాస్తవికతతోనే దళితులలోని ఉపకులాల వారందరూ ఆలోచించటం మొదలు పెట్టారు. దళితులలోని ఉపకులాలవారందరూ రాయడం మొదలు పెట్టారు. వివక్షతకు గురికావటానికి స్వపర భేదం అవసరం లేదని నినదించాయి అనేది ఈ పరిశోధనలో తేలిన ప్రాథమిక పరిశోధన అంశం.

యావత్ తెలుగుసాహిత్యాన్ని దాని విలువలని నిర్ణయించేటప్పుడు ప్రమాణాలుగా తీసుకున్న అలంకార శాస్త్రం, విమర్శా సూత్రాలు దళిత సాహిత్యానికి సరిపోవని నూతనసూత్రాలు, నూతన సమన్వయాలు అవసరమని అనుభవపూర్వకంగా తెలిసేలా దళిత సాహిత్యం ఒక నూతన అధ్యాయానికి దారులు వేసింది. ఈ అంశాలన్ని నా పరిశోధనలో చాలావరకు గుర్తించగలిగాను. తెలుగు సాహిత్యంలో ఉన్న ప్రక్రియా వైవిధ్యంతో పాటు దాన్ని కొనసాగిస్తూనే నూతన ప్రక్రియా ఆవిర్భావానికి దళిత సాహిత్యం విస్తృతంగా తోడ్పడింది. దీర్ఘకావ్యం, క్యాసెట్, మౌకిక సూత్రం, గజల్, పాట ముఖ్యంగా పర్సనల్ నెరేటివ్ రైటింగ్స్ రాయటం దళిత సాహిత్యం వల్లనే సంభవించింది. ఒకవైపు ప్రపంచ సాహిత్య స్థితిగతులను పరిశీలిస్తే ముఖ్యంగా ఆఫ్రికా నీగ్రో సాహిత్యం ప్రపంచ దేశాల్ని కుదిపేసింది. అలాగే భారతదేశంలో దళిత సాహిత్యం తన విశిష్టతను చాటుకుంది. ఈ అంశాలతో పాటు కవిత్వం, దానిలోని అంతర్ విభాగాలైన పద్యం, వచనం, హైకూ, గజల్, గేయం మొదలైన ప్రక్రియలను, వాటితో పాటు కథలు, నవలలు, నాటికలు మొదలైన ప్రక్రియల్లో కూడా పరిశోధన జరగవలసి ఉన్నదని అనిపిస్తుంది. ఆయా రంగంలో కృషి చేసే వారికి అనేక అవకాశాలు ఉన్నాయని కూడా అనిపిస్తుంది. నా పరిశోధన కాలం, పరిశోధన పరిధిని దృష్టిలో ఉంచుకుని అవసరం మేరకే ఈ పరిశోధనలో విశ్లేషించాను. మిగతా వాటిని భావి పరిశోధకులు సునితంగా పరిశోధన చేయగలరని భావిస్తున్నాను.

చివరగా నా పరిశోధన ఫలితాలను ఒక్కమాటలో చెప్పాలంటే దళిత సాహిత్య విమర్శలో పరిశోధన చేసిన తర్వాత అలంకార శాస్త్రాలు, సాహిత్య విమర్శ సూత్రాలు మాత్రమే దళిత సాహిత్యాన్ని విశ్లేషించ లేవని, సామాజిక శాస్త్రాల తోడ్పాటు కూడా అవసరం అని గుర్తించగలిగాను. దళిత సాహిత్యం వచ్చిన తర్వాత తాత్వికత పట్ల, ఆచరణ పట్ల, అనుభవం పట్ల నూతన చర్చ జరిగిందని తెలిసింది. అంబేద్కర్ భావజాలం అనేది ఒక తాత్వికత. బుద్ధుని భావనలు, సాహూ మహారాజ్ ఆలోచనలు, జోతిరావ్ పూలే, పెరియార్ రామసామి నాయకర్, కార్ల్ మార్క్స్ తదితర భావనల నేపధ్యమంతా అంబేద్కర్ ఆలోచనల్లో కనిపిస్తుంది. వీటిలో కేవలం వర్గాన్ని మాత్రమే కాకుండా, కులాన్ని, జాతి వివక్షతలను కూడా పరిగణలోకి తీసుకున్న ఆలోచనల విధానమే అంబేద్కర్ భావజాలం లేదా దళిత తాత్వికత. ఈ ప్రధాన సూత్రాన్ని విస్మరించి చేసే ఏ విశ్లేషణ అయిన దళిత సాహిత్యాన్ని అంచనా వేయటంలో విజయవంతం కాలేదని ఈ పరిశోధన స్పష్టం చేస్తుంది.

**8.పరిశోధన ఫలితాంశాలు(Research Results) :**

*"దళితసాహిత్య విమర్శ సమకాలీన ధోరంణుల పరిశీలన"* అనే ఈ నా పరిశోధనలో ప్రధానంగా ఈ క్రింది ఫలితాంశాలు వెలువడ్డాయి,

1. దళితులంటే ఎవరు? దళితులకు దళితేతరులకు గల తేడా ఏమిటి? ఈ భేధం ఎలా ఈ సమాజంలోకి ప్రవేశించింది. ఈ వివక్షతకు కారకులెవరు? అనే అంశాలను ఆధార సహితంగా ప్రముఖుల అభిప్రాయాలు జోడించి చెప్పటం జరిగింది.
2. షెడ్యూల్డ్ కులాల వారికి దళితులు అనే పదాన్ని ఆపాదించిందెవరు? దళిత అనే పదం ఎలా ఆవిర్భవించింది? దళిత అనే పదానికి ముందు వీరికి ఏయే పేర్లుఉన్నాయి? అస్పృశ్యులు, అంత్యజులు, మ్లేచ్చులు, అంటరానివారు, నీచులు, హరిజనులు అనే పేర్లు ఎలా వచ్చాయి.. వీటిని షెడ్యూల్డ్ కులాల వారిపై ప్రయోగించిందెవరు? అనే విషయాలు తెలియజేశాను.
3. తెలుగుసాహిత్య అధ్యయనం ప్రారంభమైన తర్వాత దళిత సాహిత్య రూపురేఖలు ఏమన్నా ఉన్నాయా? ఒకవేళ ఉంటే వీరికి ఎటువంటి స్థానం కల్పించారు.
4. ప్రాచీన తెలుగు సాహిత్యంలో దళితకులాల వారిని ఏయే సందర్భాలలో ఆయా రచయితలు ప్రయోగించారో తెలియజేశాను.
5. దళిత ఉద్యమం ఎప్పుడు ప్రారంభమైంది? దళిత ఉద్యమ నేపథ్యం ఏమిటి? దళిత

ఉద్యమంలో పూలే, అంబేద్కర్ వంటి మహనీయుల పాత్ర ఏమిటి ? అనే అంశాలు స్థూలంగా చర్చించాను.

6. ఆధునిక కాలంలో దళిత సాహిత్యం ఎప్పుడు ప్రారంభమైంది? దళిత సాహిత్య ఆవిర్భావానికి గల నేపథ్యం ఏమిటి? సాహిత్యం మొదట ఏ ప్రక్రియలో మొదలైంది, తర్వాత ఎలా పరిణితి చెందింది? సాహిత్యానుక్రమంలో తన అస్తిత్వాన్ని ఎలా కాపాడుకోగలింగింది అనే అంశాలు పరిశీలించటం జరిగింది.
7. తెలుగులో సాహిత్య విమర్శ ఎలా ప్రారంభమైందో, ఎలా వికాసం చెందిందో చెప్పటం జరిగింది. విమర్శ గురించి వివిధ ప్రముఖ సాహితీవేత్తల అభిప్రాయాలను క్రోడికరించటం జరిగింది.
9. తెలుగు సాహిత్యవిమర్శ ప్రారంభమైన దశలో ఎలా ఉందో, ప్రస్తుతం ఎలా ఉందో చెబుతూనే విమర్శరకాలను స్థూలంగా విశ్లేషించటం జరిగింది.
10. తెలుగు సాహిత్యవిమర్శ ప్రస్తానంలో దళిత సాహిత్య విమర్శ స్థానం ఏమిటో విశ్లేషించటం జరింగింది. అంతేకాకుండా ప్రస్తుతం దళిత సాహిత్య విమర్శ వస్తున్న తీరు అంటే వర్గీకరణ, ఏకీకరణ దృక్పథాన్ని పరిశీలించటం జరిగింది.
11. సమకాలీన కాలంలో వచ్చిన కవితా ధోరణుల ఆధారంగా దళిత సాహిత్యాన్ని, సాహిత్య విమర్శను విశ్లేషించటం జరిగింది.
12. ప్రధానంగా దళిత సాహిత్యం సంప్రదాయ, మార్క్సిస్టు, అంబేద్కర్, స్త్రీవాద, వర్గీకరణ, ఏకీకరణ, బహుజన వాదాలలో ఎలా ఉందో సూచనప్రాయంగా చెప్పటం జరిగింది.
13. పైన తెలిపిన వాదాలన్ని కూడా ఆయా కాలాలకు అనుగుణంగా, ఆయా భావజాలాల దృష్ట్యా వచ్చాయని, దళిత సాహిత్యంలో సమకాలంలో వర్గీకరణ, ఏకీకరణ సాహిత్య విమర్శ వచ్చిందని తెలపటం జరింగింది.
14. ముందుగా భారతరాజ్యాంగం షెడ్యూల్డ్ కులాలను ఏవేవిగా పేర్కొనిందో చెప్పటం జరిగింది.
15. ఆంధ్రప్రదేశ్ లోని మాదిగ దాని అనుబంధ కులాలను వారి గ్రూపులు ఆధారంగా గుర్తించటం జరిగింది.
16. ఇంతకు ముందు రిజర్వేషన్ల పంపిణీ విధానం ఎలా ఉందో చెబుతూనే ప్రస్తుతం వాటిలో గల లోపాలను చెప్పటం జరిగింది.

17. వర్గీకకరణ ఉద్యమం ఎలా ఆవిర్భవించింది? దాని లక్ష్యాలు ఏమిటి ? ఆయా రంగాలలో వారి వాటా ఎంత ? వివిధ కమీషన్లు ఇచ్చిని నివేదిక ఆధారంగా చెప్పటం జరిగింది.
18. వర్గీకరణ ఉద్యమానికి అనుబంధంగా దండోరా సాహిత్యం ఎప్పుడు, ఎలా ఆవిర్భవించింది? అనే విషయాలను చెప్పటం జరిగింది.
19. వర్గీకరణ సాహిత్యంలో ప్రధానంగా ఏయే ప్రక్రియలు వస్తున్నాయి. వర్గీకరణ సాహిత్యానికి ప్రధాన కవితా వస్తువులేవి ? అనే అంశాలు చెప్పటం జరిగింది.
20. వర్గీకరణ ఉద్యమం, సాహిత్యం గురించి వివిధ కవులు, రాజకీయ విశ్లేషకుల అభిప్రాయాలను ఆధార సహితంగా చెప్పటం జరిగింది.
21. వర్గీకరణ ఉద్యమంలో ఆంధ్రప్రదేశ్ లో పాల్గొంటున్న ప్రధాన కులాలేవి? వాటికి(మాదిగ దాని అనుబంధ కులాలకు) సంబంధించి ఆయా రచయితల, ప్రముఖుల అభిప్రాయాలు చెప్పటం జరిగింది.
22. వర్గీకరణ సాహిత్యంలో వచ్చిన ప్రముఖ గ్రంథాలన్నింటిని పేర్కొనటం జరిగింది. ఆయా గ్రంథాల ఆధారంగా వర్గీకరణ సాహిత్య విమర్శ ఎలా వస్తుందో విశ్లేషించటం జరిగింది.
23. వర్గీకరణ విధానానికి సంబంధించి నూతన ప్రతిపాదనలు కూడా ఆయా ప్రముఖుల అభిప్రాయాల ఆధారంగా చెప్పటం జరిగింది.
24. ఏకీకరణ ఉద్యమం ఎప్పుడు, ఎలా ఆవిర్భవించింది? దాని లక్ష్యాలు ఏమిటి ? ఆయా రంగాలలో వారి వాటా ఎంత ? ప్రభుత్వాలు నియమించిన వివిధ కమీషన్లు ఇచ్చిన నివేదికను ఆధార సహితంగా పరిశీలించటం జరిగింది.
25. ఏకీకరణ ఉద్యమానికి అనుబంధంగా ఏకీకరణ సాహిత్యం ఎలా వచ్చింది, అది ఇప్పుడు కొనసాగుతుందా లేక కనుమరుగైందా అనే విషయాలను పరిశీలించటం జరిగింది.
26. ఏకీకరణ సాహిత్యంలో ప్రధానంగా ఏయే ప్రక్రియలు వస్తున్నాయి. ఏకీకరణ సాహిత్యానికి ప్రధాన కవితా వస్తువులేవి అనే అంశాలు ఇంకా పరిశోధనలో నిరూపించటం జరిగింది.
27. ఏకీకరణ ఉద్యమం, సాహిత్యం గురించి వివిధ కవులు, రాజకీయ విశ్లేషకుల

అభిప్రాయాలను ఆధార సహితంగా క్రోడికరించాను.

28. ఏకీకరణ ఉద్యమంలో ఆంధ్రప్రదేశ్ లో పాల్గొంటున్న ప్రధాన కులాలేవి?వాటికి(మాల దాని అనుబంధకులాలకు) సంబంధించి ఆయా రచయితల, ప్రముఖుల అభిప్రాయాలను పొందుపరచాను.

29. ఏకీకరణ సాహిత్యంలో వచ్చిన ప్రముఖ గ్రంథాలన్నింటిని సేకరించాలి. ఆయా గ్రంథాల ఆధారంగా ఏకీకరణ సాహిత్య విమర్శ ఎలా వస్తుందో శాస్త్రీయబద్ధంగా విశ్లేషించాను.

30. ఏకీకరణ విధానానికి సంబంధించి నూతన ప్రతిపాదనలను కూడా పొందుపరచాను.

31. చివరగా వర్గీకరణ, ఏకీకరణ వస్తున్న తీరు ఆధారంగా దళిత సాహిత్య వికాసంలో వీటి పాత్ర ఏమిటో తెలియజెప్పి, అంటే ఇలా రెండు ఉద్యమ, సాహిత్య శిబిరాలుగా విడిపోవటం దళిత ఉద్యమానికి, దళిత సాహిత్యానికి ప్రయోజనమా? అప్రయోజనమా? వీటి వలన దళిత సాహిత్య పరిధి పెరుగుతున్నట్లా లేక తరుగుతున్నట్లా అనే అంశాలను సాహిత్య విమర్శకుల రచనల ఆధారంగా పరిశీలించాను.

32. దళిత సాహిత్యం అంతం అయిపోయిందని అది రెండు గ్రూపులుగా విడిపోయిందనే వాదనను ఈ పరిశోధన ఖండిస్తూ దళితల సమస్యలు, అవమానాలు ఉన్నంత కాలం దళితసాహిత్యం సజీవంగానే ఉంటుందని కాకపోతే వివిధ రూపాల్లో వ్యక్తమవుతుందని ఈ పరిశోధన నిరూపించటం జరిగింది.

33. ఏదైనా సాహిత్యం వాదం ఆయా కాలాలకే పరిమితమై తర్వాత కనుమరుగు అయిపోతుందనే భావన దళిత సాహిత్యానికి వర్తించదు. దళితుల సమస్యలు అంతరించి పోవాలంటే భారతదేశంలో కుల అంతరించిపోవాలంటే హిందూధర్మ శాస్త్ర సూత్రాలను తిరస్కరించాలి ఇది ఈ హిందూ దేశంలో జరిగేది కాదు కాబట్టి దళితుల అవమానాలు, దళితసాహిత్య ప్రస్తానం కొనసాగుతూనే ఉంటుంది. కాబట్టి దళిత సాహిత్యం సజీవంగానే ఉంటుందని ఈ పరిశోధన నిరూపించింది.

34. దళిత ఉద్యమంలో, దళితసాహిత్యంలో విభేధాలు వచ్చిన మాట వాస్తమే కానీ ఇవి శాశ్వతం కాదు తాత్కాలికం మాత్రమే అనే అంశాన్ని ఈ పరిశోధన నిరూపించింది.

35. దళిత ఉపకులాలు గానీ, ఉమ్మడి కులాలు గానీ పోరాడేది దళిత జాతి ప్రయోజనానికే అనే భావనను ఈ పరిశోధనను నిరూపించింది.

**9.ఉపయుక్త గ్రంథసూచి(Bibilography) :**

ఈ పరిశోధన పూర్తి చేయడానికి వివిధ గ్రంథాలయాల, వివిధ పత్రికల, రచనల సహకారం మరియు వివిధ వ్యక్తుల వద్ద వ్యాసాల రూపంలో సమాచార సేకరణ జరిగినప్పటికీ ఇక్కడ కొన్ని ప్రామాణిక గ్రంథాలను మాత్రమే ఇక్కడ తెలియజేయడం జరిగింది. పూర్తి ఉపయుక్తగ్రంథ సూచి సమాచారం సిద్ధాంత గ్రంథంలో చూడవచ్చు.


1. ఇనాక్,కొలకలూరి.***ఆధునిక విమర్శాసూత్రం***;మారుతి బుక్ హౌస్: గుంటూరు,1996.
2. చిన్నారావు,యాగాటి.***దళితఉద్యమ చరిత్ర;***హైదరబాదుబుక్ ట్రస్ట్,హైదరాబాద్,2007.
3. జయరాజు,తెన్నేటి.***ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ-పరిశీలన,***విశాఖపట్నం, 2006.
4. పద్మారావు,కత్తి.***దళితసాహిత్యవాదం-జాషువా***;పొన్నూరు:లోకాయుత ప్రచురణలు,1995.
5. ప్రసాద్,కలేకూరి.***దళితఉద్యమం- దళిత సాహిత్యోద్యమం;***హైదరాబాదు:1999.
6. రత్నాజీ, నేలపూరి.***ఒకే గొంతు;***నీమాశ్రీ,సన్నీ& సనత్ ప్రచురణలు: చాగల్లు,2005.
7. రామారావు,ఎస్వీ.***తెలుగులోసాహిత్యవిమర్శఅవతరణవికాసములు***;పసిడిప్రచురణలు:199.
8. రంగనాథాచార్యులు,కె.కె. ***తెలుగు సాహిత్యంలో దళిత చైతన్యం ఆధునిక సాహిత్యం – దళిత స్పృహ***, హైదరాబాదు; యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ:1994.
9. వీరభద్రయ్య,ముదిగొండ.***విమర్శమౌలికలక్షణాలు,***తెలుగుఅకాడమీ:హైదరాబాదు,1990.
10. వెంకటేశ్వరరావు,దార్ల.***వీచిక(సాహిత్య విమర్శ వ్యాసాలు);*** స్వీయ ప్రచురణ:2009.
11. శాంసన్,పిల్లి.***దళితసాహిత్య చరిత్ర***,స్వీయ ప్రచురణ:గుంటూరు,2000.
12. సత్యనారాయణ,ఎస్వీ.***దళితవాద వివాదాలు (సంపాదకుడు);*** విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్: హైదరాబాదు,2000.
13. సాంబయ్య, గుండెమెడ.***బ్రాహ్మణత్వ మాలత్వమా...? మానవత్వ అంబేద్కరత్వమా..?*** ;రాజ్యం ప్రచురణలు:హైదరాబాదు,2006.
14. స్వామి,గూటం.ఏకీకరణీయం(దళిత ఆర్తి కావ్యం);2005.
15. సుధాకర్,ఎండ్లూరి.***వర్గీకరణీయం(దళితదీర్ఘకావ్యం)***;మానసమనోజ్ఞ&ప్రచురణలు:,2004.
16. ***కందిలి మాదిగ మహాజన కవిత్వం,***మాదిగ మహాజన ప్రచురణలు, హైదరాబాదు,2007.
17. కేశవకుమార్,పి. ***దళిత ఉద్యమం వెలుగు నీడలు***; గౌరీ శంకర్, జూలూరు (సంపాదకుడు). స్పృహ సాహితీ సంస్థ, 2009.
18. ముత్తయ్య,పి.***ఎస్సీలలోవర్గీకరణ ఎందుకు?***;ఆంధ్రప్రదేశ్మాదిగమేధావుల ఫోరం,2007.

19. యాదగిరి(సంకలనం)***రిజర్వేషన్ఆస్తిని పంచుకుంటే ఐక్యతా ఉండదా?ఒక పరిశీలన***,2007.

20. విల్సన్,సుధాకర్,తుల్లిమల్లి.***దళితవ్యాకరణం***,విజయభారతి పబ్లికేషన్. హైదరాబాదు,2007.

21. వెంకటేశ్వరరావు,దార్ల.***దళితసాహిత్యం మాదిగదృక్పథం***;సొసైటి & ఎడ్యుకేషన్ ట్రస్టు; హైదరాబాదు,2008.

22. వెంకటేశ్వరరావు,దార్ల. ***ఒక మాదిగ స్మృతి (నాగప్ప గారి సుందర్రాజు పరిచయం)***; తెలుగు సాహిత్య వేదిక;2007

23. మధుజ్యోతి,కొలకలూరి.***ఆధునికతెలుగుసాహిత్యం-దళితసంస్కృతి***;జ్యోతిగ్రంథమాల, హైదరాబాదు, తిరుపతి:2013.

24. ఇనాక్,కొలకలూరి.***దండోరా***;జ్యోతిగ్రంథమాల,హైదరాబాదు, తిరుపతి, 2013.

25. లక్ష్మీనారాయణ,కె.***దళిత కవిత్వం - పరామర్శ***;రమాపబ్లికేషన్ ;ఏప్రిల్ 2013.

**10.అనుబంధాలు (Annexures) :**

- ఈ పరిశోధనకు సంబంధించిన నాలుగు అనుబంధాలను చివర్లో జతపర్చటం జరిగింది. మొదటి అనుబంధంలో పరిశోధన జరుగుతున్న తరుణంలో భావవీణ UGC Approved Journal ISSN No:2456-4702 నెంబరుతో ప్రచురితమైన నా పరిశోధన వ్యాసాలను, వాటి జిరాక్స్ లను మరియు జాతీయ సదస్సులవివరాలు, వాటి పత్రాలను చేర్చటం జరిగింది.
- రెండవ అనుబంధంలో ఈ పరిశోధనలో ప్రధాన అధ్యాయం అయిన వర్గీకరణ సాహిత్యం –విమర్శానాత్మక అధ్యయనం అనే అంశానికి సంబంధిచిన సాహిత్య గ్రంథాలను, రచయిత పేర్లను, కాలనుక్రమంగా ఒక పట్టిక రూపంలో చేకూర్చటం జరిగింది.
- మూడవ అనుబంధంలో ఈ పరిశోధనలో మరో ప్రధాన అధ్యాయం అయిన ఏకీకరణ సాహిత్యం–విమర్శానాత్మక అధ్యయనం అనే అంశానికి సంబంధిచిన సాహిత్య గ్రంథాలను, రచయిత పేర్లను, కాలనుక్రమంగా ఒక పట్టిక రూపంలో చేకూర్చటం జరిగింది.
- నాల్గవ అనుబంధంలో ఈ పరిశోధన కాలంలో వివిధ దిన, మాస పత్రికల్లో ప్రచురితమైన నా పరిశోధన వ్యాసాలను ఆధార సహితంగా జతపరచి ఈ పరిశోధన ముగించటం జరిగింది.

***